# అవతారతత్త్వ వివేచన

కొత్తపల్లి వీరభద్రరావు

AVATAARA TATVA VIVECHANA

By Prof. Kothapalli Veerabhadra Rao, M.A., Ph.D.

---

Copies : 1000

First Edition 1998

© Author

This book is published with the Financial Assistance of
TIRUMALA TIRUPATI DEVASTHANAMS
Under their Scheme "Aid to publish religious books."

Price : Rs. 200/-

Copies can be had from :

Smt. K. Lalitha, M. A.
114, West Marredpally,
Road No 5, Secunderabad-5000 26.
Phone No. 7800670.

*Printed at* :
Shivaji Press. Guni Bazar. Secunderabad-3.

# విషయసూచిక


| | |
|---|---|
| వినయాంజలి | |
| అవతార తత్త్వ వివేచన | 1-53 |
| భక్తి ప్రపత్తులు : శరణాగతి | 54-100 |
| రామాయణాదులలో శరణాగతి | 101-206 |
| భాగవత వైష్ణవ సంప్రదాయాలు | 207-424 |
| శ్రీరామానుజ శ్రీసంప్రదాయం | 218-356 |
| 'రామావత్' సంప్రదాయం | 357-368 |
| శ్రీమధ్వ (బ్రహ్మ) సంప్రదాయం | 369-373 |
| శ్రీచైతన్య (గౌడీయ వైష్ణవ) సంప్రదాయం | 374-389 |
| శ్రీ వల్లభ (రుద్ర) సంప్రదాయం | 390-396 |
| శ్రీ నింబార్క (సనకాది) సంప్రదాయం | 397-405 |
| శ్రీరాధావల్లభీయ సంప్రదాయం | 406-416 |
| మహాపురుషీయ, మహానుభావ, వారకరీ, రామదాసీ ప్రభృతి సంప్రదాయాలు | 417-424 |


## అనుబంధాలు


| | |
|---|---|
| శ్రీ మద్భాగవత పురాణం : అవతారాలు, వివిధ సంప్రదాయాలు అనుబంధం 1 | 1-54 |
| శ్రీ మద్భాగవతాంతర్గత 'రాసపంచాధ్యాయి' వైశిష్ట్యం అనుబంధం 2 | 55-72 |

"విష్ణోఃపదేపరమ" ఇత్యుదితప్రశంసౌ
యౌ "మధ్వఉత్స" ఇతిభోగ్యతయాఽప్యుపాత్తౌ
భూయ స్తథేతి తవపాణి తలప్రదిష్టౌ
శ్రీ వేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే"

# వినయాంజలి

యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్॥

అని శ్రీకృష్ణభగవానుడు భగవద్గీతలో భారతునకు-నరునకు ప్రవచించాడు. మానవాళికి దారిచూపించడానికి-అవసరం వచ్చినప్పుడల్లా, తానేదిగివస్తాను అని చెప్పడం-ఆవిధంగా దిగిరావడం-తన సృష్టిమీద ఆ భగవానునకున్న ప్రేమకు అత్యుత్తమ నిదర్శనం. మానవ ప్రవృత్తినిబట్టి ఈ అవసరం చాలాసార్లు వస్తుందని తెలుసును గనుకనే-ఆత్రికాలవేది-అలాచెప్పారు. చిన్నప్పటినుండి నన్నీ తాత్త్విక విషయం చాలా ఆకర్షించింది. భాగవత కృష్ణునిగా, భారత కృష్ణునిగా, భగవద్గీత కృష్ణునిగా ఆ "స్వయంభగవానుడు" ప్రదర్శించిన ఈ వ్యక్తిత్వరీతులు-మూడు-నాటికీ, నేటికీ, ఏనాటికీ నాకు ఆకర్ష ణాలే అంటాను.

మా అమ్మగారు నా బాల్యంలో శ్రీకృష్ణుని కథలు చెప్పుతూ "గుమ్మడేడే గోపిదేవి! గుమ్మడేడే కన్నతల్లి! అమ్మా, గుమ్మడేడమ్మా!" అనీ; సంస్కృత భాగవతంలోని "తవకథామృతం తప్త జీవనం, కవి భిరీడితం కల్మషాపహమ్ । శ్రవణ మంగళం శ్రీమదాతతం, భువి గృణంతి యే భూరిదాజనాః" అనీ పాడి విని పిస్తూ ఉంటే నాకు అలౌకిక లోకాలలో విహరిస్తూ ఉన్నట్లు ఉండేది! ఆమెకు సంస్కృతం బాగా వచ్చును. నాకు నోటికివచ్చిన సంస్కృత స్తోత్రాలన్నీ నేను మొట్టమొదట ఆమె నోటవిన్నవే!

మా మాతామహులు శ్రీ వేదమూర్తులైన బ్రహ్మశ్రీ విష్ణువఝల రామకృష్ణ శాస్త్రిగారు(1840–1922)వేద వేదాంగ పారీణులేగాక, గొప్ప పౌరాణికులుకూడా. ఆయనకు వ్యాస భాగవతం అంతా వాచోవిధేయంట! ఆయన వాడిన-19వ శతాబ్దిలో అచ్చయిన సంస్కృత భాగవతం గుజిలీ ప్రతి ఇంకా నాదగ్గిర ఉంది! ఆయన శ్రీమద్భాగవతాన్ని అధ్యయనం చెయ్యటం విషయమై ఒక కథ నేను విన్నది ఉంది. వేద శాస్త్రాలు అభ్యసించి వాటిలో నిష్ణాతులైన తరువాత ఆయన మనస్సు శ్రీమద్భాగవతంమీదికి పోయింది. విష్ణువఝలవారుగదా! మరి. ఆరోజులలో అన్ని

నేర్చుకోవడం గురుముఖాధ్యయన పద్ధతిలోనేగదా! గోదావరిజిల్లాలో ముగ్గుళ్ల అనే గ్రామంలో శ్రీమద్భాగవతం విషయంలో మహావిద్వాంసులైన ఒక శ్రీవైష్ణవస్వాములున్నారని విని ఆయన దర్శనానికి ఈయన వెళ్లారుట! విభూతి పెండికట్లతో శిష్యులు! ద్వాదశోర్ధ్వ పుండ్రాలతో గురుస్వాములు! ఆ స్వాములు వీరి అభ్యర్థనను విని, "నాయనా! నాకు శ్రీ వైష్ణవులకేగాని ఇతరులకు శ్రీమద్భాగవతం ఉపదేశించ కూడదనే నియమంఉంది, మరి!" అన్నారుట! వెంటనే శిష్యులు, "స్వామీ, మీరు నియమోల్లంఘనం చేయవద్దు. ఆ "తిరుమణి తిరుచూర్ణండబ్బా" ఇలా ఇప్పించండి" అన్నారుట! అప్పుడు స్వాములు నవ్వుతూ, "నాయనా, వద్దు. నీ శ్రద్ధ పరీక్షించడానికి అలా అన్నాను, అంతే! అనూచానంగావస్తూఉన్న మన సంప్రదాయాల్ని తొందరపడి మార్చుకోవడం ఎందుకు? వేద విద్వాంసుడవైననువ్వు శ్రీమద్భాగవతం కూడా అధ్యయనంచేస్తే, సువర్ణానికి సుగంధం అబ్బినట్లు ఉంటుంది!"అన్నారుట. ఆకాలంనాటి గురుశిష్యుల సంబంధాన్ని, ఉదారతను తెలియజేయడానికి-ఇది జరిగింది-నేను విన్నది వ్రాశాను. మా మాతామహులది చాలా శ్రావ్యమైన కంఠం అని మా అమ్మ చెప్పుతూఉండేది. ఆమెదీ శ్రావ్యమైనకంఠమే. ఆయన, ఆనాటి పిఠాపురం మహారాజులైన శ్రీ రావు వేంకటమహీపతి గంగాధర రామారావుగారి ఆస్థానంలో సంవత్సరానికి ఒక పక్షం రోజులు పురాణం చెప్పేవారనీ, వార్షికం ఉండేదని విన్నాను. నా పుట్టుకలకు వారున్నారుగాని, నాకు ప్రాజ్ఞత రాకపూర్వమే వారు దివంగతులయ్యారు. పిఠాపురంలో ఆయన రాత్రి పురాణం ప్రారంభించి శ్రావ్యంగా శ్లోకాలు చదువుతూ పురాణం చెప్పుతూఉంటే, శ్రోతలకు కోళ్లకూసేదాకా తెల్లవారిందని తెలిసేదికాదుట! ఆయన, ఆ సంస్థానానికేచెందిన దేవులపల్లి సోదర కవులకు సమకాలికులు.

నాకు చిన్నప్పటినుండీ శ్రీ మద్భాగవతం విషయంలో, అవతారాల విషయంలో విశేషానురక్తి ఉండేదని చెప్పడానికి నేనవశ్యం వివరించాను. నేను విజయనగరంలో ఉద్యోగిస్తూ ఉన్న కాలంలో (1942-1959) అక్కడ ఉన్న మహావిద్వాంసుల దగ్గిర సంస్కృత శాస్త్ర గ్రంథాలు చదవడంతోపాటు; అక్కడి శ్రీవైష్ణవస్వాములవల్ల పాంచరాత్రాగమ విశేషాలు, వైఖానసాగమ విశేషాలు తెలుసుకొంటూ వచ్చాను వైఖానస సంప్రదాయం ప్రకారం అర్చనాదికం జరిగే దేవాలయాలు అక్కడ ఉన్నాయి. శ్రీమధ్వ (బ్రహ్మ) సంప్రదాయం తెలిసిన పెద్దలవల్ల పూర్ణ ప్రజ్ఞదర్శన విశేషాలు తెలుసుకొంటూ ఉండేవాడిని. ఆనాడు విజయ

నగరంలో ఏ శాస్త్రంలో సంశయం వచ్చినా తీర్చగలిగినవారు, ఏ సంప్రదాయంలోని ఏ విశేషంకావలసి వచ్చినా వివరించగలిగినవారు ఉండేవారు !

తరువాత నేను ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఉన్న పుష్కరకాలం. అక్కడి హిందీ సంస్కృత విభాగాలలో, ఆధునిక భారతీయ భాషా విభాగంలో నా సహోద్యోగులైన వారిలో చైతన్య, వల్లభ, నింబార్క, రాధావల్లభ, మహాపురుషీయ సంప్రదాయాలను వంశ పారంపర్యంగా అనుష్ఠిస్తూ ఉన్నవారినుండి ఆయా సంప్రదాయ విశేషాలు గ్రహించాను. ఇంగ్లీషు, హిందీ, వంగభాషలలో ఉన్న గ్రంథాలు చదివాను. సహజంగా శ్రీమద్భాగవతం మీద ఉన్న భక్తిశ్రద్ధలు ఈ పండిత సాంగత్యంవల్ల ఇనుమడించాయి. హైదరాబాదు వచ్చిన తరువాత శ్రీ దత్తాత్రేయ సంప్రదాయ విశేషాలను గ్రహిస్తూవచ్చాను.

ఈ విధంగా, పరమేశ్వరానుగ్రహంవల్ల భాగవత సంబంధమైన నేపథ్యం ఏర్పడి ఉండగా- 1984లో శ్రీనాగార్జున విశ్వవిద్యాలయంవారు "కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ ధర్మనిధి" ఉపన్యాసాలు ఇయ్యవలసినదని ఆహ్వానించారు. నేను "అవతార తత్త్వ వివేచన" విషయంగా గ్రహించి ఉపన్యసించాను. నాటినుండి ఆ గంటన్నర ఉపన్యాసాన్ని పెంచిపెంచి ఈనాటికి 500 పేజీల గ్రంథంగా అచ్చువేశాను. సామగ్రి సంపాదనలో దశాబ్దులు గడిచాయి. ఎన్నో విషయాలు ఎందరినుండో, ఎన్నో గ్రంథాలనుండో గ్రహించాను. కాని, ఒక్క విషయం మనవి చేయవలసి ఉంది. మనదేశంలో వివిధ ప్రాంతాలలో, వివిధ భాషలలో మూల గ్రంథాలున్న ఇన్ని సంప్రదాయాలను గురించి సాధికారంగా వ్రాసే శక్తి నాకు లేదని తెలుసును. ఆయా సంప్రదాయ ప్రవర్తకుల, ఆయా ఆచార్యుల, ఆయా భాగవతోత్తములమీద భక్తిశ్రద్ధలతో మాత్రం వ్యవహరించానని మనవి చేస్తూ ఉన్న లోపాలను–మన్నించవలసినదిగా ప్రార్థిస్తున్నాను. ఆ లోపాలు అజ్ఞతవల్ల వచ్చినవేగాని, అహంకారంవల్ల వచ్చినవికావని తిరిగి మనవిచేస్తున్నాను.

ధనాభావం వల్ల ముద్రణ కార్యక్రమం ప్రారంభించలేకపోగా, ధార్మిక గ్రంథాల ముద్రణకు ధర్మకంకణం కట్టుకొన్న తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్థిక సాహాయ్యం చేసి ముద్రణ ప్రారంభింపజేశారు. కవిపండిత పక్షపాతులు, సహృదయులు దేవస్థానాల కార్యనిర్వహణాధికారులు అయిన శ్రీ ఎం. కె. ఆర్. వినాయక్, ఐ.ఏ.ఎస్; గారికి ముందుగా నా కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు.

వామనావతారం అనుకొన్న పుస్తకం త్రివిక్రమావతారం ఎత్తడంతో వచ్చినచిక్కులను, విద్వత్కవులు, ఆప్తులు అయిన శ్రీ రాయసం వెంకట్రామయ్య గారు తొలగించారు. వీరికి నా కృతజ్ఞతా పూర్వక వందనాలు.

శివాజీ ప్రెస్ ప్రొప్రైటరులు, నా చిరకాలమిత్రులు, నా అభిమానులు అయిన శ్రీ బి. నాగేందర్‌గారికి, వారి సిబ్బందికి నా కృతజ్ఞతా పూర్వక నమస్కారాలు.

"విబుధజనులవలన విన్నంత కన్నంత
తెలియవచ్చినంత" తెలిపినాడ!

బహుధాన్య చైత్రశుద్ధ
పాడ్యమి, శనివారం
28.3.1998

కొత్తపల్లి వీరభద్రరావు

# అవతారతత్త్వ వివేచన

"పరాకృత నమద్బంధం పరం బ్రహ్మనరాకృతి।
సౌందర్యసారసర్వస్వం వందే నందాత్మజం మహః॥"

- శ్రీ మధుసూదన సరస్వతి

అవతారావశ్యకాన్ని ప్రయోజనాన్ని గురించి నరాకృతిలో అవతరించిన స్వయం భగవానుడు శ్రీ కృష్ణుడు భగవద్గీతలో నిష్కర్షగా వివరించాడు. ఆత్మ సంశయ గ్రస్తమైతే నశిస్తుందిగనుక ("అజ్ఞశ్చాశ్రద్దధానశ్చ సంశయాత్మా వినశ్యతి। నాయంలోకోఽస్తి న పరో న సుఖం సంశయాత్మనః"॥). సంశయం తొలగించి రక్షించడమే స్వధర్మంగా పాలించే ఆ పరమ పురుషుడు అవతారావశ్యకాన్ని భగవద్గీతలో ఈ విధంగా స్పష్టం చేశాడు:

"యదా యదాహి ధర్మస్యగ్లానిర్భవతి భారత।
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్॥" IV - 7

కలియుగానికి సన్నిహిత పూర్వయుగం శ్రీ కృష్ణుడవతరించిన ద్వాపర యుగం. ఆనాటి పరిస్థితుల్ని మనం గ్రహిస్తే ఈ అవతారావశ్యకం స్వయం వ్యక్తమవుతుంది. శ్రీ కృష్ణుడవతరించేనాటికి ఆర్యావర్తం మధ్యభాగంలోని మధుర ప్రాంతానికి ప్రభువు కంసుడు. పూర్వ జన్మలో ఇతడు కాలనేమి అనేరాక్షసుడు. ఆ జన్మలో విష్ణువు చేతుల్లో చచ్చిపోయాడు. ఈ జన్మలోకూడా ఆవైరం అంతర్గతంగా ఉండనే ఉంది రాజ్యకాంక్షతో తండ్రిని కారాగారంలో పెట్టిన దుర్మార్గుడు. నవవధువైన తనసోదరి దేవకికి జన్మించే అష్టమ సంతానం తన పాలిటి మృత్యువనివిని, ఆమెను ఆమె భర్తను అప్పటి కప్పుడే చంపయత్నించాడు. నలుగురి ఎదుట చంపి చెడ్డపేరు తెచ్చుకోవడంకంటె, ఆమె శిశువుల్ని రహస్యంగా చంపడం తనకు మంచిదని భావించి ఆ దంపతుల్ని చెరలో పెట్టించాడు. ఆదంపతుల ప్రార్థనల్ని మన్నించినట్లుగా కూడా లోకులను భావింపజేశాడు! పుట్టిన పసిపాపల్ని నిర్దయతో పాపభీతి లేకుండా చంపుతూవచ్చాడు. ప్రజల్ని

రక్షించవలసిన రాజు ఇలాంటి భక్షకుడు. సాధుజన భయంకరుడు. అధర్మ ప్రవర్తకుడు.

ప్రజారక్షకుడు కావలసిన రాజు ప్రజా భక్షకుడయ్యాడు. కంసుని సేవకులు, మిత్రులు, మంత్రులు, సన్నిహితులు ఇందుకు తగిన వాళ్లే దొరికారు :

"రాజా రాక్షస రూపేణ, వ్యాఘ్ర రూపేణ మంత్రిణః ।
సేవకాశ్శ్వాన రూపేణ, యథారాజా తథా ప్రజా ॥"

ఇలాంటి రాజ్యంలో సాధుజనుల బాధలు అనంతం గదా ! కంసుని మామ జరాసంధుడు. మగధరాజు. పరమ దుర్మార్గుడు. బలవంతుడు. అశస్త్రవధ్యుడు. వివిధ దేశాల రాజుల్ని యుద్ధాల్లో ఓడించి తెచ్చి వాళ్ళను బలి ఇచ్చేవాడు. నరబలిని అభిమానించిన నరరూప రాక్షసుడు. అయా రాజుల రాజ్యాల్లో అరాజకం, అల్లకల్లోల పరిస్థితులు చెలరేగి ప్రజలు కష్టనష్టాలకు గురి అయ్యేవాళ్ళు.

ఆనాటి ఇంకో బలవంతుడు నరకుడు. ప్రాగ్జ్యోతిషాధిపతి (ఈనాటి అస్సాం). పదహారువేల మంది కన్యకలను చెరపట్టి తెచ్చిన కామాతురుడు, క్రూరుడు. అదితి చెవుల కమ్మల్ని తెంచితెచ్చిన నీచుడు. ఇంక, హస్తినాపురంలో ధృతరాష్ట్రుని రాజ్యం. జనుషాంధుడైన ఈ రాజు ధర్మం విషయంలోను అంధుడే. లోభ దూషితుడు. మోహ పరవశుడు. ధర్మాన్ని ఎరిగి ఉన్నా దానియందు ప్రవృత్తి లేనివాడు. అధర్మం విషయంలో నివృత్తి లేనివాడు. సరే ! ఇంక ఇతని కొడుకు దుర్యోధనుడు కలిపురుషుని అవతారం. ఈ కొడుకూ ఇతని మిత్రులూ - అందరూ - అధర్మపరులు. అహంకార దూషితులు. దుర్జనులు, పట్టుదల తప్ప యుక్తా యుక్త వివేకం లేనివాళ్ళు. పాండవ పత్నికి, రాజమహిషికి, యాజ్ఞసేనికి ద్రౌపదికి జరిగిన పరాభవం ఆనాటి నైతిక పతనానికి ప్రతీక. ఆమె ఆనాటి నారీ లోకానికి ప్రతినిధి. స్త్రీలకు గౌరవ మర్యాదలు, రక్షణ తగ్గుతూ వచ్చిన రోజులవి. విరాట సభలో కూడా ద్రౌపదికి జరిగిన పరాభవం ఆనాటి సమాజంలో స్త్రీల స్థానం అంత ఉన్నతంగా లేదని చెప్పకనే చెప్పుతోంది. సైంధవుని వంటి వాడు కూడా ద్రౌపదిని పరాభవించాడంటే, ఇంక చెప్పవలసింది ఏముంది ! ద్వాపరమంటే సందేహం. ధర్మా ధర్మ విషయంలో ఈ సందేహం ఆనాడందరినీ బాధించినట్లుంది !

ఇంకో దుర్మార్గుడు శిశుపాలుడు. అధర్మం, అన్యాయం, అసహనం మూర్తీభవించిన వ్యక్తి. సాధుసజ్జన ద్వేషి, స్త్రీలోలుడు. కౌరవులకు, జరాసంధునకు మిత్రుడు, భగవద్ద్వేషి. వైకుంఠంలోని జయ విజయులు సనక సనందనాదుల శాపం వల్ల, ద్వాపరంలో శిశుపాల దంతవక్త్రులుగా జన్మించి అధర్మాన్ని పెంచుతూ ఉన్న కాలం అది. వీళ్లే అంతకుపూర్వం - హిరణ్యాక్ష హిరణ్యకశిపులుగా, రావణ కుంభకర్ణులుగా పుట్టి తమ కాలాల్లో అధర్మాన్ని పెంచుతూవచ్చి హరిచేతుల్లో చచ్చి పోయారు. శిశుపాల దంతవక్త్రులు కూడా అవతారమూర్తి చేతుల్లో గాని చావరు.

ఈ విధంగా పరోక్షరాక్షసులైన వీళ్ళు, నరమాంస భక్షకులైన ప్రత్యక్ష రాక్షసులు ప్రబలిన అకాలంలో, "రావే ఈశ్వర ! కావవే వరద ! సంరక్షించు భద్రాత్మకా !" అని అందరూ హాహాకారాలు చేస్తూ ఉంటే పరాత్పరుడు భూభారాన్ని తగ్గించడానికి అవతరించవలసిన అవశ్యకం కలిగింది. కాలం కూడా ఆసన్నమయింది. భగవంతుని పుత్రునిగాకోరి తపస్సుచేసి, వరాన్ని పొందిన దేవకీ వసుదేవులు కారాగారంలో కృశిస్తూ ఉన్నారు. ఇంకా ఎందరో ధర్మాత్ములు నలిగిపోతూ ఉన్న కాలం అది. ధర్మం రెండు పాదాలమీద ఎలాగో నడుస్తూ ఉన్న దుష్కాలం. ఇంతకంటె అవతారావతరణకు మంచికాలం ఎక్కడ ఉంటుంది? హరి శ్రీ కృష్ణునిగా అవతరించాడు. తనకంటె ముందే పుట్టి అధర్మాన్ని పెంచుతూ ఉన్నవాళ్ళు, తనతో బాటు సమకాలికంగా జన్మించి హింసాచరణలో అగ్రగాములైన వాళ్లూ, తానవతరించిన తరవాత బయలు దేరిన దుర్మార్గులు - ఎందరో అందరూ - నశించవలసి ఉంది. కొందరు ఆయన చేతుల్లో చచ్చిపోతే, ఇంకొందరు ఇతరవీరుల చేతుల్లో చచ్చిపోయారు. ఈ పనులు జరగడానికి అవతారావశ్యకం ఎంతైనా ఉంది. అరాజక పరిస్థితుల్నీ, అధర్మ విజృంభణాన్నీ, అన్యాయాన్ని ఎంతకాలమని సహించి ఉండగలరు. భగవంతుని అస్తిత్వంమీద కూడా అవిశ్వాసం కలిగి, "కలఁడు కలండనెడు వాఁడు కలఁడో లేఁడో" అనే సంశయం వరకు వచ్చారు సాధుజనులు ఆ ద్వాపర యుగంలో.

ఇంక ప్రయోజనం ! శ్రీ కృష్ణుడే అవతార ప్రయోజనాన్ని భగవద్గీతలో ఇలా ప్రవచించాడు :

> "పరిత్రాణాయ సాధూనాం, వినాశాయచ దుష్కృతామ్ ।
> ధర్మసంస్థాపనార్థాయ, సంభవామి యుగే యుగే ॥" IV - 8

ఈ వచనాన్ని బట్టి, అవతార ప్రయోజనాలు - సాధు పరిత్రాణం, దుష్కృత వినాశం, ధర్మ సంస్థాపన అని సిద్ధిస్తున్నాయి. ఈ మూడు ప్రయోజనాలు రామాద్యవతారాల్లో కూడా సిద్ధించినా, కృష్ణావతారంలో అవి పూర్ణంగా సఫలం కావడమే కాకుండా, వాటి విషయం వాచ్యంగా భగవానుడే చెప్పడం జరిగింది. ఇదీ ఈ అవతార విశేషం !

సాదు పరిత్రాణం కోసం తానవతరిస్తానని భగవానుడే చెప్పాడే ! ఎవరీ సాధువులు ? నాలుగు విధాలకు చెందిన సుకృతులు తన్ను భజిస్తారని శ్రీ కృష్ణుడే భగవద్గీతలో వచించాడు. ఆ పుణ్యాత్ములే ఈ సాధుజనులు :

"చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోఽర్జున ।
ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥ VII - 16

వీరిని ఉద్ధరించడానికే అవతారాల అవతరణ. ఈ సుకృతుల్లో - ద్రౌపదీ గజేంద్రాదులు ఆర్తభక్తులు. ఉద్ధవాదులు జిజ్ఞాసువులు. ధ్రువాదులు అర్థకాములు. ప్రహ్లాదాదులు తత్త్వజ్ఞానులు, వీరందరూ ఉదారులే ("ఉదారాః సర్వ ఏవైతే)". అందరూ భగవత్ప్రీతిపాత్రులే. అయితే, సమయాన్నిబట్టి సన్నివేశాన్ని బట్టి ఒక్కొక్కరు విశేష ప్రీతిపాత్రులు అని భగవానుడు భగవద్గీతలో ప్రవచించడం ఉంది:

"తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే ।
ప్రియోహి జ్ఞాని నోఽత్యర్థమహం సచమమప్రియః" ॥VII - 17

ఇక్కడ జ్ఞాని శ్రేష్ఠుడని చెప్పడం జరిగింది. ఏకాంత భక్తి, నిత్యయుక్తత్వాలు సిద్ధిస్తాయి గనక జ్ఞాని విశిష్టుడు. అయినా "నా కందరూ సములే సర్వభూతాలయందు నాది సమదృష్టి. నాకు ద్వేషత్వ మిత్రత్వాలు లేవు" అని కూడా అంటాడు భగవానుడు. కాని, భక్తిపూర్వకంగా భజించేవారు ఆయనయందు, ఆయన వారియందు ఉంటారు : (భగవద్గీత : ix - 29)

"సమోఽహం సర్వభూతేషు, నమేద్వేష్యోఽస్తి నప్రియః ।
యేభజంతి తు మాం భక్త్యా మయితే తేషు చాప్యహమ్ ॥"

ఈ భావాన్నే ఇంకోవిధంగా భగవద్గీతలోనే వివరణ పూర్వకంగా భగవానుడు ఇలా ప్రవచించారు: (xviii - 65)

"మన్మనాభవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।
మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే" ॥

సత్య ప్రతిజ్ఞా పూర్వకంగా భగవంతుడు ఇలా వాగ్దానం కంఠోక్తిగా చేశాడు: "నువ్వు మనస్సు నాయందు నిల్పు. నా భక్తుడవై నన్ను పూజించు. నాకు నమస్కరించు. నువ్వు నాకు అత్యంత ప్రియుడవు. కనక, నేను సత్య ప్రతిజ్ఞా పూర్వకంగా చెప్తున్నాను. ఈ విధంగా నువ్వు నన్ను పొందగలవు".

ఇలా భగవద్భక్తి ఉన్న వారికి భగవంతుడే లభిస్తూ ఉంటే మిగిలిన ఐహిక విషయాల సంగతి చెప్పేదేముంది! భగవంతుని నిత్యం మనస్సులో ఉంచుకొంటే విధి నిషేధాలన్నీ కింకర సదృశాలంటోంది "భక్తిరసామృత సింధువు":

"స్మర్తవ్యః సతతం విష్ణు ర్విస్మర్తవ్యో నజాతు చిత్ ।
సర్వేవిధినిషేధాః స్యురేతయోరేవ కింకరాః "॥

భగవద్భక్తివల్ల వచ్చేఫలం ఏమిటి? ఆముష్మిక విషయాల సంగతి సరే! ఐహికాదుల మాటేమిటి? అనే అర్థార్థులుంటారు. వారితో "ప్రపన్నగీత" అంటోంది :

"నిత్యోత్సవో భవేత్తేషాం నిత్య శ్రీర్నిత్య మంగళమ్ ।
యేషాం హృదిస్థో భగవాన్ మంగళాయతనమ్ హరిః ॥"

వివిధ ఫలాల్ని ఇచ్చే దేవతలనేకులున్నారు గదా! కృష్ణావతారమెత్తిన నారాయణునే ఎందుకు పూజించాలి అనే ప్రశ్నకు "ప్రపన్నగీత" ఇలా సమాధాన మిస్తోంది:

"ఆలోడ్య సర్వశాస్త్రాణి విచార్య చ పునః పునః ।
ఇదమేవ సునిష్పన్నం, ధ్యేయో నారాయణః సదా" ॥

శ్రీ కృష్ణుని పూజించి నమస్కరించటంవల్ల దశాశ్వమేధాలు చేసి అవ

భృతస్నానం చేసిన ఫలం లభిస్తుంది. ఇంతేనా ? కాదు. దశాశ్వమేధాలు చేసినా పునర్జన్మ ఉంటుంది. శ్రీ కృష్ణ ప్రణామికి పునర్జన్మలేదు అని కంఠోక్తిగా చెప్పుతోంది "ప్రపన్న గీత":

"ఏకోఽపి కృష్ణస్య కృతః ప్రణామో, దశాశ్వ మేధావభృతేనతుల్యః।
దశాశ్వమేధీ పునరేతి జన్మ, కృష్ణప్రణామీ నపునర్భవాయ"॥

అవతార పురుషుని అవతరణ ప్రయోజనం సాధు పరిత్రాణంతోపాటు సాధు జనులకు సర్వోత్తమ మార్గం చూపించడం కూడా అనే విషయాన్ని విస్మరించరాదు. సుకృతులకు ఉపాసనాదికం అవతారమూర్తివల్ల సుగమం అవుతుంది. భక్తి కుదరడానికి ఒక ఆధారం అవుతుంది. నిజానికి, ఉపాసన, భజన సేవా పర్యాయాలే. నిఘంటుకారులు - "సేవా భక్తిః ఉపాస్తిః" - సమానార్థకాలన్నారు. విధి కూడా "ఉపాస్వ", "భజస్వ" అంటోంది. లైంగ, మార్కండేయ పురాణాల్లో - "భజ అనే ధాతువు సేవార్థకం కాబట్టి బుధులు సేవను భక్తి శబ్దంతో అనేక స్థలాల్లో వ్యవహరించారు" అని ఉంది:

"భజ ఇత్యేష ధాతుర్వై సేవాయాం పరికీర్తితః ।
తస్మాత్సేవా బుధైః ప్రోక్తా భక్తి శబ్దేన భూయసీ" ॥

"జ్ఞాన వాసనతో చేసిన సేవకే భక్తి అని పేరు. ఇది గనుక కలిగితే స్నేహ భావం స్వయంగా వస్తుంది" అని 'విష్ణుతత్త్వం' ఘోషిస్తోంది:

"సేవా భక్తి స్సమాఖ్యాతా జ్ఞానవాసనయా కృతా ।
ఉత్పన్నాయాం తత స్తస్యామ్ స్నేహభావః స్వయం భవేత్" ॥

ఈ విధంగా భగవత్సేవలో మగ్నులై ఉన్న భక్తుల విషయమే, "యోగక్షేమం వహామ్యహమ్" అని భగవంతుడు వచించింది. "నమే భక్తః ప్రణశ్యతి" అనీ "నవాసుదేవం ప్రణిపత్యసీదతి" అనీ "జనార్దనం ప్రణి పతితో న సీదతి" అనీ"యంప్రణమ్య న సీదతి" అనీ "నభే యాంతి పరాభవమ్" అనీ ఎన్నో విధాలుగా భగవానుడు సాధు పరిత్రాణ విషయమైన ప్రతిజ్ఞలు చేశాడు. భక్తుడు సాధువైతే చాలు. నామకీర్తన విషయంలో అశుద్ధిలేదనీ భగవానుడైన హరి స్వత శ్శుద్ధుడు గదా అనీ "నా శౌచం కీర్తనే తస్య, పవిత్రం భగవాన్ హరిః" అనే

విష్ణు ధర్మోత్తర వచనం కంఠోక్తిగా చెప్తోంది. ఆయన, "పవిత్రాణాం పవిత్రం, మంగళానాంచ మంగళమ్" గదా!

"సంభవామి, యుగే యుగే" అని ప్రతిజ్ఞా పూర్వకంగా పలికిన భగవంతుడు శ్రీ కృష్ణావతార కాలంలో చేసిందంతా ఆర్తరక్షణే! దేవకీ వసుదేవుల్ని చెర విడిపించాడు. పూర్వజన్మలో తనసేవను భక్తిని కోరిన యశోదానందుల్ని అనుగ్రహించాడు. అర్థార్థులైన కుచేలాదుల్ని సంభావించాడు. జిజ్ఞాసువులైన ఉద్ధవాక్రూరాదులకు జ్ఞానభిక్ష ప్రసాదించాడు. స్త్రీల మానధనాన్ని రక్షించి వారికి దారి చూపించాడు. ద్రౌపది మొదలైన వారెందరో పరాత్పరుని అనుగ్రహానికి పాత్రులైన వారే! నలకూబర మణిగ్రీవాదులు శాప విమోచనాన్ని ఆయన చేతుల్లో పొందారు. ఈ విధంగా అవతారమూర్తి అయిన భగవంతుడు శ్రీకృష్ణ రూపంలో సాధు పరిత్రాణం చేశాడు.

ఈ అవతార కాలంలో ఆయనచేసిన దుష్కృత వినాశాన్ని లెక్క పెట్టలేము. పూతన మొదలుకొని ప్రలంబాసురుని వరకు ఎందరిని నాశనం చేశాడో! దుష్టులైన చాణూరాది మల్లుల్ని, కంసాది దుర్మార్గుల్ని, శిశుపాల దంతవక్త్రాదులైన నృశంసుల్ని నాశనం చేశాడు. జరాసంధాదుల్ని తన అండనిచ్చి ఇతరుల చేత చంపించాడు. వీళ్ళల్లో - ఒక హిడింబ కీచకాదులెందరో ఉన్నారు. మహాభారత ఘోర రణంలో గతాయువులైన వారెందరో అవతార పురుషుని దుష్కృత వినాశ కార్యక్రమం క్రింద వచ్చేవాళ్ళే! ప్రకృతి సిద్ధంగా క్రూరులైన వాళ్ళు పాండవ పక్షపాతులైనా శ్రీ కృష్ణుడు వాళ్ళని నాశనం చేశాడు; చేయించాడు. ఘటోత్కచాదులు ఇలాంటి వాళ్ళే. మదించిన యాదవుల నాశం కూడా ఇలాంటి కార్యమే. రజోగుణాధిక్యం చూపించిన బ్రహ్మ గర్వాన్ని కూడా ఆయన వమ్ము చేశాడు! అరిషడ్వర్గాలు అప్పట్లో హద్దుమీరినా వాళ్ళని తీర్చిదిద్దాడు. దుష్కృత వినాశం అంటే అన్నివేళలా, అన్నిచోట్లా, అందరినీ చంపడమనేకాదు అర్థం. ఎవళ్ళకు తగిన శిక్ష వాళ్ళకు ఇయ్యడమన్నమాట! హిరణ్యకశపుని శిక్షవేరు. బలి కిచ్చిన శిక్షవేరు. కాళీయునకిచ్చిన శిక్షవేరు. తన్ను స్మరించి శరణాగతులైన వాళ్ళు దుర్మార్గులైనా దుష్ట కుటుంబాలకు చెందినా, వాళ్ళకు శరణమియ్యడమే తన వ్రతమని శ్రీ రామావతారంలో భగవానుడు చెప్పలేదా?

"సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే।
అభయం సర్వభూతేభ్యో దదామ్యే తద్వ్రతం మమ॥"

ఇందువల్ల దుష్కృత వినాశంలో శరణాగత త్రాణం కూడా కలిసి ఉందనే సంగతి మరిచిపోకూడదు. భూత భవ్య భవన్నాథుడైన కేశవుడు "సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" అన్నప్పుడు ఆయన చేసిన ప్రతిజ్ఞ, వాగ్దానం సర్వులకు ఉపయోగించేవే. కేవలం అర్జునుని ఉద్దేశించి అన్న మాటలు కావు. సర్వనరులకు పనికివచ్చేవే. ఈ అవతారమూర్తి సర్వేశ్వరుడు గనకనే "అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి, మాశుచః" అని ప్రవచించ గలిగాడు. ఈ కేశవుడు కేవలం "కేశి" అనే రాక్షసుని చంపినవాడు కాదు. పరాత్పరుడు. త్రిమూర్తులకు ఈశుడు. "కేశవః" అనే నామానికి వ్యాఖ్యగా, శంకరుల శ్రీ విష్ణు సహస్రనామ భాష్యంలో ఇలా ఉంది. "కశ్చ అశ్చ ఈశశ్చ త్రిమూర్తయః కేశాః తే యద్వశేవర్తంతే సకేశవః". కేశులు - బ్రహ్మ విష్ణు రుద్రులు. వారిని తన వశంలో పెట్టుకొన్నవాడు హరివంశంలో - రుద్రుడనైననేను, బ్రహ్మ, నీ దేహం నుండి సంభవించిన వారము గనక నీకు "కేశవ" అనే నామం కలిగింది అని ఈశుడు చెప్పినట్లున్నది:

"క ఇతి బ్రహ్మణో నామ, ఈశోఽహం సర్వదేహినామ్ ।
ఆవాం తవాంగే సంభూతౌ తస్మాత్ కేశవ నామవాన్ ॥"

అవతారమూర్తిగా శ్రీకృష్ణుడు చేసిన ప్రతిజ్ఞలకు, వాగ్దానాలకు వెనుక ఆయన పరాత్పరత్వం తొంగి చూస్తూనే ఉంటుంది !

ఇంక, యుగయుగాలలో "సంభవించే" అవతార మూర్తి ధర్మ సంస్థాపనాన్ని కొంత పరిశీలిద్దాం. ధర్మం అనేది భగవత్ప్రాప్తికి సాధకమైన కర్మ, దీనికి విరుద్ధమైనది అధర్మం. భగవదర్పిత బుద్ధితో చేసే పురుషార్థసాధన మోక్ష పర్యవసిత మవుతుంది. భగవంతుడు గీతలో చెప్పిన

"కర్మణ్యే వాధికారస్తే మాఫలేషు కదాచన ।
మాకర్మ ఫలహేతుర్భూర్మాతే సంగోఽస్త్వకర్మణి ॥" II - 47

అనే సందేశ సారాంశం ఇదే ! కర్మచేయకుండా మనుగడే లేదు. కర్మచేయకుండ ఎవ్వరూ ఎన్నడూ క్షణమైనా ఉండలేరు. "నహి కశ్చిత్క్షణ మపి జాతు తిష్ఠత్యకర్మకృత్" అని గీతావాక్యం. మానవుడు కర్మహీనుడైతే దైనందిన జీవితం కూడా గడవదు. "శరీర యాత్రాపి చ తే న ప్రసిద్ధ్యేదకర్మణః".

ఈశ్వర ప్రీత్యర్థం చేసినకర్మలు లోకాన్ని బంధించవు. ఇతర కర్మలు బంధిస్తాయి. "కనుక, నువ్వు భగవంతుని ఉద్దేశించి అనాసక్తుడవై కర్మలు చేయవలసింది" అని శ్రీకృష్ణ భగవానుడు అర్జునునితో అంటాడు:

"యజ్ఞార్థాత్కర్మణోఽన్యత్ర లోకోఽయం కర్మబంధనః ।
తదర్థం కర్మ కౌంతేయ ! ముక్తసంగః సమాచర" ॥ III - 9

ఇక్కడ, 'యజ్ఞం' అంటే విష్ణువని (ఈశ్వరుడు) తైత్తిరీయ బ్రాహ్మణం "యజ్ఞోవై విష్ణుః" అనేదాన్ని బట్టి గ్రహించవచ్చు.

ఈ విధంగా భగవానుడు ఉచితానుచితాల్ని భక్తులకు బోధించి వారి నందరినీ సన్మార్గగాముల్ని చేశాడు. కర్తవ్యతా విమూఢుడై మోహంలో మునిగిపోయిన అర్జునునకు - హృదయ దౌర్బల్యం క్షుద్రమని, దాన్ని త్యజించవలసిందని బోధించి, అతన్ని కర్తవ్యోన్ముఖుని చేశాడు. ఆ సందర్భంలో చేసిన ఉపదేశమే, ఇచ్చిన సందేశమే - నాటి నుండి నేటి వరకు - భగవద్గీతగా, సంసార సర్పదష్టమై సమ్మోహితమైన జగత్తునకు, జ్ఞానభిక్ష పెట్టింది. ఇంతకు మించిన ధర్మ సంస్థాపన ఎక్కడ ఉంటుంది ? ఒక్క 'నరు' నుద్దేశించి చేసిన ఉపదేశం 'నరుల' కందరికి ఉపాదేయం అయింది.

మానవుల చిత్త సంస్కారాన్ని బట్టి, దేశకాల పరిస్థితుల్ని బట్టి - ఒక అవతారం ప్రభావం ప్రకాశిస్తుంది. ఈ వైవిధ్యాన్ని పురస్కరించుకొనే, అవతారం చేసే కార్యకలాపం, సందేశోపదేశాలు భిన్న భిన్నంగా ఉంటాయి. కాని, ఈ భిన్నత్వం వెనుక ఏకత్వం నేపథ్యంగా ఉండనే ఉంటుంది. లేదా, పూసల్లో దారంలా ఉంటుంది. స్థూల దృష్టికి-అభిరుచి ననుసరించి అవతారం-అనిపిస్తుంది. భగవంతుని అవతారాలు అనంతం అన్నారు. కాని వాటిలో ముఖ్యమైనవి - 'పది' అవి జగత్ప్రసిద్ధంగా, 'దశావతార' శబ్దం ప్రచలితంగా ఉంది. పన్నెండో శతాబ్దికి చెందిన శ్రీజయదేవుని "గీత గోవిందం"లో "వేదానుద్ధరతే" అనే దశావతార స్తోత్రంలో 'దశాకృతి కృతే కృష్ణాయ తుభ్యం నమః" అని పరాత్పరుడైన శ్రీకృష్ణుడే అవతారాలెత్తినట్లు వర్ణితమైంది. మిగిలిన వైష్ణవ సంప్రదాయాల్లో కొన్నింటిలో శ్రీమన్నారాయణుని అవతారాల్లో కృష్ణావతార మొకటిగా చెప్పినట్లు కనబడుతుంది. "కృష్ణస్తు భగవాన్ స్వయం" అని నమ్మే సంప్రదాయాలదృష్టిలో గోలోకవాసి శ్రీకృష్ణుడే పరబ్రహ్మ. నారాయణాది రూపాలన్నీ ఆయనవే.

ఈ విధంగా శాస్త్రీయ సిద్ధాంతాల్లోను, అవతార సంఖ్యలోను అభిప్రాయ భేదాలు చాలా ఉన్నాయి. అవతార పురుషునిగా శ్రీకృష్ణ పరమాత్మ తన అవతార కాలంలో నిర్వహించిన పనుల్ని పరిశీలించిచూస్తే - గోపీజన వల్లభుడైన భాగవత కృష్ణుడు, పాండవ పక్షపాతి అయిన భారత కృష్ణుడు, జగద్గురు రూపుడైన భగవద్గీత కృష్ణుడు - సామాన్యులకందరికి వారి వారి భావానుసారం దర్శనమిస్తాడు. మొదటి రూపానికి మధుర - బృందావనాలు; రెండోదానికి హస్తినాపుర - ఇంద్రప్రస్థాలు; మూడో దానికి కురుక్షేత్రం కార్యరంగాలు. ద్వారక శ్రీకృష్ణుని ఐశ్వర్యానికి ప్రతీక. భాగవత సంప్రదాయానికి పరమ పవిత్రమైన శ్రీమద్భాగవతానుసారం అవతారాలు. 1) చతుస్సన ('సన' అని పేరున్న సనక, సనందన, సనాతన, సనత్కుమార అనువారు. నాలుగు రూపాలున్నా అందరూ ఒక్కరే) 2) వరాహ 3) నారద 4) నర, నారాయణ 5) కపిల 6) దత్తాత్రేయ 7) యజ్ఞ 8) ఋషభ 9) పృథు 10) మత్స్య 11) కూర్మ 12) ధన్వంతరి 13) మోహిని 14) నృసింహ 15) వామన 16) పరశురామ 17) వ్యాస 18) రామ (19, 20 బలరామ, కృష్ణ 21) బుద్ధ 22) కల్కి - అనేవి. వీటి నన్నింటిని పేర్కొన్న తరువాత, అవతారాలు మహాసరస్సులో అలల్లాగ అసంఖ్యాకాలంటుంది శ్రీమద్భాగవతం:

"అవతారా హ్యసంఖ్యేయాహరేః సత్త్వనిధేర్ద్విజాః ।
యథాఽవిదాసినః కుల్యాః సరసః స్యుః సహస్రశః" ॥

ఈ అవతారాలన్నింటిలో కృష్ణావతారమే (కృష్ణ-బలరామ) పూర్ణావతారమనీ మిగిలినవన్నీ అంశావతారాలని కళావతారాలని చెప్పడం జరిగింది. ఈ అవతారాలన్నీ పరమపురుషుని నుండి ఆవిర్భవించినవే ! భాగవతంలో :

"ఏతే చాంశకలాః పుంసః కృష్ణస్తు భగవాన్ స్వయమ్ ।
ఇంద్రారి వ్యాకులంలోకం మృడయంతి యుగేయుగే" ॥

అని ఉంది. నింబార్క, వల్లభ, చైతన్యాది సంప్రదాయాల వారికి ఈ శ్లోకం ప్రాణం. వారి వారి ధార్మిక గ్రంథాల్లో శ్రీకృష్ణుడే పరబ్రహ్మమని చెప్పడానికి దీన్ని ఉపయోగించు కొన్నారు. బ్రహ్మసూత్రాలకు శ్రీమద్భాగవతమే భాష్యమని వీరి పూర్ణ విశ్వాసం. ఈ సంప్రదాయాలకు సూత్ర భాష్యాలు చాలా కాలం

వరకు రాకపోవడానికి ఇదే ముఖ్యకారణం. కృష్ణావతారం యొక్క వైశిష్ట్యం విషయంలో అభిప్రాయభేదాలు లేని శ్రీ సంప్రదాయాది సంప్రదాయాలకు చెందిన వారు, పాంచ రాత్రాది ఆగమాల్ని అనుసరించే వారు కూడా అవతార తత్త్వం విషయంలో పూర్తిగా పై సంప్రదాయ వాదులతో ఏకీభవించలేక పోతున్నారు. సమస్త కల్యాణగుణ మహోదధి అయిన శ్రీమన్నారాయణుని లీలావిలాసమే అవతార కార్య కలాపాలకు మూలమని వీరి అభిప్రాయం.

వీరి సిద్ధాంతానుసారం - పరాత్పరుడైన శ్రీమన్నారాయణుడు సృష్టి స్థితి లయ కార్యాల్ని కరుణామయుడై చేస్తారు. ఇందుకోసం, పరమేశ్వరుడు-పరత్వ, వ్యూహ, విభవ, అంతర్యామిత్వ, అర్చావతార భేదాలతో పంచ ప్రకార స్వరూపాలు ధరిస్తాడు. బృహద్బ్రహ్మ సంహితలో ఈ రూపాల స్వరూప స్వభావాదులు పూర్ణంగా వివరించడం జరిగింది.

పరావతారంలో పరమేశ్వరుడు షడ్గుణైశ్వర్య సంపన్నుడై

"ఐశ్వర్యస్య సమగ్రస్య వీర్యస్యయశసః, శ్రియః
జ్ఞాన వైరాగ్యయోశ్చైవ షణ్ణాం భగఇతీరణా ॥

భగవానుడై పరవాసుదేవుడై ఉంటాడు. ఈయన కార్య సౌకర్యార్థం - సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ - మూర్తుల్ని ధరిస్తాడు. వీటికే వ్యూహమని పేరు. "పర స్థితిలో ఆయన కార్యంగాక కారణ మాత్రమే అయి, మహార్ణవంలాగ అనంతం నిత్యం అయిన భోగవిభూతిని ఏకచ్ఛత్రంగా ఏలుతూ ముక్తులచేత సేవింప బడుతూ నిరుపాధిక స్థితిలో ఉంటాడు.

సంకర్షణుడు జీవతత్త్వాన్ని అధిష్ఠించి ఉంటాడు. "జ్ఞాన, బలాలు" ఈయన ముఖ్య గుణాలు. శాస్త్ర ప్రవర్తనం, దేహి సంహారం ఈయన కార్యాలు. సంకర్షణుడే రుద్రునియందను ప్రవేశించి జగత్సంహారాన్ని చేస్తాడు. శ్రీవిష్ణు సహస్ర నామానికి శ్రీపరాశర భట్టరు వ్రాసిన 'భగవద్గుణ దర్పణం' అనే వ్యాఖ్యలో, "మహాతపాః" అనే నామానికి "మహత్ పూజ్యమ్ తపః జ్ఞానం యస్యసః మహా తపాః" అని వ్రాసి ఇది సంకర్షణ మూర్తికి అని వివరించారు. "యస్య జ్ఞాన మయం తపః" అని విశదీకరించి, ఇచ్చట తపశ్శబ్దానికి జ్ఞానమని వ్రాశారు. దీని తరవాత "సర్వగః" అనే నామానికి "సర్వాన్ గచ్ఛతీతి సర్వగః" అని వ్యాఖ్యా

నితలి, దరించు సామర్థ్యమనే బలంతో అక్కవరి ధరిస్తూ సంహరించే వారి నన్నింటిలో ప్రవేశించేవాడు అని విపులీకరించారు. "సంకర్షణః" అనే నామానికి "సంకృషతీతి సంకర్షణః" అని వ్రాసి, చేతనాచేతనజగత్తును తనయందు ఒకటిగా చేరునట్లు ఆకర్షించువాడు అని వివరించారు. ఈ విధంగా జ్ఞాన బలాలు రెండూ సంకర్షణమూర్తి ముఖ్యగుణాలుగా వ్యూహ పరిశీలనలో కనబడుతున్నాయి.

ఇంక ప్రద్యుమ్నుడు మనస్తత్త్వాన్ని అధిష్ఠించి ఉంటాడని పెద్దల వల్ల తెలుస్తోంది. "ఐశ్వర్య, వీర్యాలు" ఈయన ముఖ్యగుణాలు, ధర్మోపదేశం, మను చతుష్టయం మొదలైన శుద్ధ వర్గ సృష్టి ఈయన కార్యాలు. శ్రీవిష్ణు సహస్ర నామంలో "సర్వవిత్", "భానుః" అనే రెండు నామాలు ఈయనకు సంబంధించి నవి. సంహారం తరువాత సృష్టి కార్యం ఈయనది. "భగవద్గుణ దర్పణం"లో "సర్వం విన్దతీతి సర్వవిత్" అని, జగత్సృష్టి కార్యరూపమైన ఐశ్వర్యం ఈనామం ద్వారా వ్యక్తమయిందని శ్రీభట్టరు వివరించారు. తరువాతి నామానికి, "భాతీతి భానుః" అని విశదీకరించి, సమస్తాన్నీ నిర్మించినా తాను కొంచెమైనా వికారం పొందకుండా ఉండే వాడే ప్రద్యుమ్నుడనీ అవికారమనే వీర్యం కలవాడనీ వ్యాఖ్యా నించారు. (ప్రకృష్టం ద్యుమ్నంయస్యసః, ప్రద్యుమ్నః)

వ్యూహాలలో ఇంక అనిరుద్ధుడున్నాడు. (ననిరుద్ధః అనిరుద్ధః) ఈయనముఖ్య గుణాలు "శక్తి, తేజస్సులు." జగద్రక్షణం, తత్త్వ జ్ఞాన ప్రదానం, కాలసృష్టి,మిశ్ర సృష్టి ఈయన కార్యాలు. నానా విధాలైన అవతారాలకు ఈయనయే బీజ భూతుడని పెద్దలచే చెప్పబడింది. శ్రీవిష్ణు సహస్రనామంలో "విష్వక్సేనః", "జనార్దనః" అనే రెండు నామాలు ఈవ్యూహాన్ని వివరించేవని శ్రీభట్టరు వ్రాశారు.

"ఇనేన స్వామినా ఈశ్వరేణ సహవర్తతే ఇతి సేనా ।
విషూచీ సేనాయస్య సః విష్వక్సేనః"

అని ఈ నామం వ్యాఖ్యాతమయింది. ఇనుడంటే స్వామి. ఆయనతో కూడినది "సేన" (స + ఇన), ఈశ్వరునితో కూడి ఉండేది. దీని ద్వారా రక్షకునకున్న రక్ష్యవర్గం చెప్పబడింది. ఈ రక్ష్యవర్గం ("విష్వక్") నాలుగు దిక్కులందు ఉన్నవాడు విష్వక్సేనుడు. ఈ నామం ద్వారా సామర్థ్య రూపమైన "శక్తి" చెప్ప బడింది. "జనాన్ అర్దయతీతి జనార్దనః" అంటే, భక్త విరోధుల్ని నిరసేతుడై

నిరసించేవాడని అర్థం "దస్యుత్రాణాజ్జనార్దనః (అనగా దొంగలనుండి కాపాడే వాడు) అనికూడా ఉంది గనక ఈ నామంద్వారా నిరపేక్షంగా చేయదమనే "తేజస్సు" చెప్పబడిందని శ్రీభట్టరు తమ వ్యాఖ్యానమైన "భగవద్గుణ దర్పణం" లో వ్రాశారు.

భగవంతుడు, సకల కల్యాణ గుణ సమృద్ధుడైనా ఈ వ్యూహాల్లో చెప్ప బడిన గుణ వ్యవస్థ, ఆయా వ్యూహాల్లో వాటి ప్రాధాన్యం తెలియజేయడంకోసం జరిగింది. "జనార్దనః" నామం తరవాత "వేదః", "వేదవిత్", "అవ్యంగః", "వేదాంగః" అనే నామాలు సంకర్షణుని శాస్త్రప్రవదాతృత్వాన్ని తెలియజేస్తాయి అని "భగవద్గుణ దర్పణం'లో ఉంది. సంకర్షణపరంగా వాఖ్యానించినప్పుడు "వేదవిత్" అంటే "వేదం వేదార్థం వేత్తీతి వేదవిత్" అనిచెప్పి, ఇచ్చట వేద శబ్దానికి వేదార్థం అని అర్థమని శ్రీభట్టరు వ్రాశారు.

"వేదాంగః" నామం తరవాత మళ్ళీ "వేదవిత్" అనే నామం వస్తుంది. ఇప్పుడు "వేదం విందతి అనుష్ఠానేన లభతే ఇతివేదవిత్" అని విగ్రహం చెప్పి, వేదార్థాన్ని అనుష్ఠింపజేసి పొందువాడు ప్రద్యుమ్నుడు అని "భగవద్గుణ దర్పణం" లో వ్రాయడం జరిగింది. సంకర్షునకు - ఉపాయం, ఆగమం, మార్గం, నేత, బ్రాహ్మణుడు, ఆచార్యుడు అని అర్థం చెప్పినట్లే ప్రద్యుమ్ననకు - ధర్మమని ప్రకాశింపజేయువాడనీ, ప్రవర్తింపజేయువాడనీ అర్థం చెప్పుతారు.

ఈ "వేదవిత్" తరవాత "కవిః" అనే నామం వస్తుంది. "కాలిపశ్యతీతి కవిః" అంటే మధుర విషయాల్ని చూచేవాడని వ్యాఖ్యానించడం జరిగింది. ఈనామం తరవాత - "లోకాధ్యక్షః, సురాధ్యక్షః. ధర్మాధ్యక్షః" - అనే నామాలు "సహస్రనామం"లో వస్తాయి. ఈ మూటికి సమష్టిగా స్వామి; "అదృష్ట" స్థానం నుండి ఫలం ఇచ్చే "అనిరుద్ధుడు" అని పెద్దలు నిర్ణయించారు. ఈ "అదృష్టం" మీమాంసకుల "అదృష్టం". మనం ఈ లోకంలో ఆయా కాలాల్లో చేసే యాగాది కార్యాలు తత్క్షణంనశిస్తాయి. వీటి ఫలాలు కాలాంతరంలో కలుగుతాయి. కనుక, చేసిన ధర్మాలు నశించకుండా చేయని ధర్మాలు ప్రవేశించకుండా రక్షించేది ఒకటి ఉంటుంది. దాన్ని మీమాంసకులు "అపూర్వం", "అదృష్టం" అంటారు. ఈ స్థానమందుండి ఫలం ఇచ్చేవాడు "అనిరుద్ధుడు" అంటుంది 'భగవద్గుణదర్పణం". ఈ నామాల తరువాత వచ్చేనామం "కృతాకృతః. ఇది కూడా "అనిరుద్ధ"ని

గూర్చి చెప్పేనామమే. "కృతశ్చాసౌ అకృతశ్చ కృతాకృతః". ప్రవృత్తిని వృత్తి ధర్మాల రెండు రూపాలుగా "అనిరుద్ధుడు" ఉంటాడని వ్యాఖ్య. సంసారంలో ప్రవర్తింపజేసే అనిత్యఫలాల్ని ఇయ్యగం ప్రవృత్తి ధర్మం, ఇదే కృతం. సంసారం నుండి నివర్తింపజేసే నిత్యఫలం ఇయ్యడం నివృత్తి ధర్మం. ఇదే అకృతం. ఇందువల్ల అనిరుద్ధుడు "కృతాకృతః" నామవాచ్యుడు.

కొందరి మతాన్ని అనుసరించి, వాసుదేవునితో కలిపి వ్యూహావతారాలు నాలుగు. "కృతా కృతః" తరువాతి నామం 'చతురాత్మా". దీనికి విగ్రహవాక్యం, "చత్వారః ఆత్మానః యస్యసః చతురాత్మా". వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ రూపాలు కలవాడు. దీని తరువాతి నామం "చతుర్వ్యూహః" అనేది. "చతురాత్మా" నామానికి వ్యాఖ్యా రూపం ఇది. "చత్వారః వ్యూహాః యస్య సః చతుర్వ్యూహః". వివిధ ప్రయోజనాలకోసం, ధ్యానించదగిన రూపం ఇదని తెలియ జేయడానికి, ఆరు కల్యాణ గుణాల్ని మొత్తంగాను, విభజించియు అంగీకరించి, ఆయా కల్యాణగుణ ప్రకాశకంగా - అవయవ, వర్ణ, ఆయుధ, వాహన, ధ్వజ భేదాలతో జాగ్రదాది నాలుగవస్థలతో కూడి నాలుగు వ్యూహాలనే నాలుగు విధా లుగా పరాత్పరుడు వెలుగొందుతాడు. "వాసుదేవ" శబ్దానికి వసుదేవుని కొడుకు గనుక వాసుదేవుడని (వసుదేవస్య అపత్యం పుమాన్ వాసుదేవః), సూర్యుడు తన కిరణాలతో ఆవరించినట్లు ప్రపంచంలో వ్యాపించి తనలో ఆ ప్రపంచాన్ని వసింప జేసి, తా నా ప్రపంచంలో వసించడాన్ని బట్టి వాసుదేవుడని (వాసుశ్చాసౌ దేవశ్చ వాసుదేవః) వ్యాఖ్యాతలు వ్రాశారు. శ్రీశంకరుల భాష్యంలో-సర్వత్రవసించడం, సర్వాన్ని ఆచ్ఛాదించడం కారణాలుగా 'వాసుః' అనీ 'దివ్' ధాత్వర్థాలయిన - క్రీడా, విజిగీషా, వ్యవహార, ద్యుతి, స్తుతి, గతి అనే అర్థాల్ని బట్టి "దేవః "అని ఇందువల్లనే "వాసుదేవః" అని ఉంది. (వసతి వాసయతి ఆచ్ఛాదయతి సర్వమితి వా వాసుః । దీవ్యతి క్రీడతే విజిగీషతే వ్యవహరతి ద్యోతతేస్తూయతే గచ్ఛతీతి వా దేవః వాసుశ్చా సౌదేవశ్చేతి వాసుదేవః ॥). ఈ సందర్భంలో తమ వ్యాఖ్యా నానికి ఆధారభూతంగా, మహాభారతం నుండి విష్ణుపురాణం నుండి శ్రీశంకరులు ఇచ్చినశ్లోకాలే శ్రీభట్టరు వ్యాఖ్యానంలోను ఉన్నాయి. భారతంలో (మోక్షధర్మం):

"ఛాదయామి జగత్సర్వం భూత్వా సూర్యఇవాంశుభిః ।
సర్వభూతాధి వాసశ్చ వాసుదేవస్తతః స్మృతః" ॥

అని ఉంది. "సూర్యుడు తన కిరణాలతో సర్వజగత్తును కప్పివేసేటట్లు నేను ప్రపంచమంతా ఆవరించి ఉన్నాను. సర్వభూతాలకు ఉనికి పట్టును నేను. కనుక నన్ను వాసుదేవుడంటారు." విష్ణుపురాణంలో, "పరమాత్మలో సర్వభూతాలు, ఆ పరమాత్మ సర్వభూతాల్లో ఉండడంవల్ల వాసుదేవుడంటారు" అని ఉంది.

"సర్వత్రాసౌ సమస్తం చ వసత్యత్రేతివై యతః ।
తతస్సవాసుదేవేతి విద్వద్భిః పరిపఠ్యతే"॥

ఈ విధంగా పరాత్పరుని వ్యూహాలు అనేక గ్రంథాల్లో వర్ణితాలయ్యాయి. సృష్టి స్థితి లయాలకోసం, సంసారి రక్షణార్థం, ఉపాసకుల్ని అనుగ్రహించే తలంపుతో పరాత్పరుడు నిలిచే ఉనికి వ్యూహం.

ఈ నలుగురిలో ఒక్కొక్కరు మూడేసి రూపాలతో, పేర్లతో దేహిని రక్షించడంకోసం దేహాన్ని ఆవేశించి ఉంటారు. వాసుదేవుని నుండి-కేశవ, నారాయణ, మాధవులు; సంకర్షణునినుండి-గోవింద, విష్ణు, మధుసూదనులు; ప్రద్యుమ్నుని నుండి - త్రివిక్రమ, వామన, శ్రీధరులు; అనిరుద్ధుని నుండి - హృషీకేశ, పద్మనాభ, దామోదరులు కలిగారు. సంధ్యావందన సమయంలో ఈ పేర్లతో దేహంలోని ఆయాభాగాలు స్పృశించి వాటికి పవిత్రత సంపాదించడం అనూచానంగా వస్తూఉన్న ఆచారమే! ఈ వివిధ రూపావిర్భావ విషయం బృహద్బ్రహ్మ సంహితలో ఇలా వివరించబడింది:

"వాసుదేవాదాదిదేవా త్ప్రథమాత్కేశవ స్తథా ।
నారాయణో మాధవశ్చత్రయస్త్వేతే బభూవిరే ॥

సంకర్షణాచ్చ గోవిందో విష్ణుశ్చ మధుసూదనః ।
త్రివిక్రమో వామనశ్చ ప్రద్యుమ్నాచ్ఛ్రీ ధర స్తథా ॥

అనిరుద్ధాధ్దృషీకేశః పద్మనాభశ్చ సువ్రతః ।
దామోదరశ్చ తైరిత్థం ద్వాదశాం శాః ప్రజజ్ఞిరే ॥"

ఈ విధంగానే "దీపాద్దీపాంతరం యథా" మిగిలిన మూర్తులన్నీ ప్రభవించాయి. "సర్వేచతుర్భుజాః" రుద్రాది దేవతలకుకూడా ఉత్పత్తి స్థానమని చెప్పబడింది. చతుర్వింశతి మూర్తుల్ని కీర్తిస్తే పాపనాశనమని కూడా అందే చెప్ప

బడింది (చతుర్వింశతి మూర్తీనాం కీర్తనం పాపనాశనమ్) ఈ నామాలు ఇరవై నాలుగు, గాయత్రీమంత్ర వర్ణ సూచకాలని సంప్రదాయవిదుల భావం. స్వాహాకార యుక్తాలైన మొదటి మూడు నామాలు - ఆధ్యాత్మిక, అధిదైవిక, అధిభౌతిక బాధానివృత్తి సూచకాలనీ మిగిలినవి అంతఃకరణ శుద్ధి సాధకాలనీ వేత్తల అభిప్రాయం.

బృహద్బ్రహ్మ సంహితయే మీనాద్యవతారాలు కూడా పై వాటి వలెనే వ్యూహజన్యాలని వివరించింది.

"మీనాద్యా జజ్ఞిరే విప్ర, చతుర్వ్యూహాద్యథాక్రమాత్
మత్స్యకూర్మౌవరాహశ్చ, వాసుదేవా దజాయత
నృసింహో వామనోరామో, జామదగ్న్యోప్యజాయత
సంకర్షణాత్తథా జజ్ఞే, ప్రద్యుమ్నాద్రాఘవో; బలీ
అనిరుద్ధాదభూత్కృష్ణః, కల్కీతి దశమూర్తయః ॥"

నిర్గుణ బ్రహ్మవాదులైన శ్రీశంకరులు, శ్రీవిష్ణు సహస్ర నామస్తోత్రానికి వరికల్పించిన భాష్యం; విశిష్టాద్వైత మతానుయాయులైన శ్రీపరాశర భట్టరు "సాయించిన" భాష్యంతో అనేక స్థలాల్లో భిన్నించడం ఆశ్చర్యం కాదు. ఇరువురూ వేద ప్రామాణ్యాన్ని అంగీకరించేవారే గనుక, పోలికలూ చాలా ఉన్నాయి. పాంచరాత్ర సిద్ధాంతంలో కొన్ని అంశాలు వేదవిరుద్ధమనే భావం శ్రీశంకరుల కున్నట్లు ఆయన సూత్ర భాష్యంవల్ల తెలుస్తోంది. ఈ సిద్ధాంత మందున్న వేదానుకూల విషయాలన్నీ ఉపాదేయాలే అని కూడా ఆయన భావం. ఆయన కున్న ప్రాతికూల్యం కొంత వ్యూహాలకు సంబంధించింది; జీవోత్పత్తి వాద విషయకమైనది. శ్రీఅప్పయ్య దీక్షితులు మొదలైన మహావిద్వాంసులు కూడా "వైఖానస" సిద్ధాంతాల కున్నంత వేదానుకూల్యం పాంచరాత్ర సిద్ధాంతాల కన్నింటికీ లేదనే భావం కలవారే. ఈ రెండింటిలో వైఖానసం ప్రాచీనమని అందరూ అంగీకరించారు. కాని, శ్రీరామానుజులవారు మొదలుకొని వైష్ణవాచార్యులందరూ పాంచరాత్రం సంపూర్ణంగా వేదసమ్మతమని నమ్మి దాన్ని స్థాపించడానికి రచనలు చేశారు. శ్రీరామానుజులు బ్రహ్మసూత్రాల్లోని "ఉత్పత్త్య సంభవాధికరణం", పాంచరాత్ర సిద్ధాంతానికి మండనమే గాని ఖండన కాదని విశ్వసించి వ్రాశారు. శ్రీరామానుజుల పరమ గురువులైన శ్రీయామునాచార్యులు "ఆగమ ప్రామాణ్యం"లో పాంచరాత్ర

తంత్రం యొక్క వైదికత, ప్రామాణిక ప్రమాణయుక్తంగా స్థాపించారు. శ్రీ వేదాంత దేశికులు కూడా "పాంచరాత్రరక్ష" అనే గ్రంథంలో ఈ సిద్ధాంతం వేదసమ్మతమే అని స్థాపించారు.

వైష్ణవాచార్యుల దృష్టి ననుసరించి, పాంచరాత్రం వేదం యొక్క "ఏకాయన" శాఖకు సంబంధించింది. "ఈశ్వరసంహిత" లో "ఏష ఏకాయనో వేదః ప్రఖ్యాతః సర్వతోభువి" అని ఉంది. "శ్రీప్రశ్నసంహిత" లో "వేదమేకాయనం నామ వేదానాం శిరసిస్థితమ్। తదర్థకం పాంచరాత్రం మోక్షదం తత్క్రియావతామ్"॥ అని ఉంది. వైష్ణవ తంత్ర గ్రంథాల్లో అన్యతమమైన "పాద్మతంత్రం" లో "సాత్త్వత", "ఏకాంతిక", "పాంచరాత్ర" శబ్దాలన్నీ "భాగవత" ధర్మాన్నే వ్యపదేశిస్తాయి అని ఉంది.

"సూరిః సుహృద్ భాగవతః సాత్త్వతః పంచకాలవిత్ ।
ఏకాంతికస్తన్మయశ్చ పంచరాత్రిక ఇత్యపి ॥"

మహాభారతం శాంతిపర్వంలో వచ్చే "నారాయణీయోపాఖ్యానమ్" లో పాంచరాత్ర సంప్రదాయవర్ణన విపులంగా విస్తరించి ఉంది. నారద మహర్షి ఉత్తరంగా వెళ్ళి శ్వేత ద్వీపంలో ఉన్న నారాయణ మహర్షి దగ్గర "పాంచరాత్ర" సిద్ధాంతాన్ని గ్రహించి భారతదేశానికి తెచ్చినట్లుంది. పాంచరాత్ర గ్రంథాలన్నీ-ఈ సిద్ధాంతం భాగవత ధర్మంగా ప్రచారమై, వేదసమ్మతమై ప్రబలిందని వ్రాస్తున్నాయి. అంతేకాదు. ఛాందోగ్యోపనిషత్తులో "ఏకాయన" శబ్ద ప్రయోగం కనబడుతోంది. "ఋగ్వేదం భగవో ఽధ్యేమి యజుర్వేదం......వాకో వాక్యమేకాయనమ్" అని అక్కడ ఉంది. ఈ "ఏకాయనవిద్య అంటే ఏమిటో, అది ఏ సంప్రదాయానికి చెందిందో, ఏ అర్థంలో ఈ శబ్దాన్ని ఈ ఉపనిషత్తు గ్రహించిందో చెప్పడం కష్టం. అయితే, ఉపనిషత్తులో కూడా ఈ విద్యకు పరమభాగవతుడైన నారదునకు సంబంధం ఉంది. ఇదే విధంగా మహాభారత శాంతి పర్వంలోని "నారాయణీయోపాఖ్యానం"లో కూడా, పాంచరాత్ర సిద్ధాంతాల గ్రహణ ప్రచారాలకు నారదునకు సంబంధం చెప్పబడింది.

వివిధ గ్రంథాల్లో వివిధ విధాలుగా "పాంచరాత్ర" శబ్దానికి వ్యాఖ్యలు కనబడుతున్నాయి. మహాభారతంలోని శాంతి పర్వంలో ఇది మహోపనిషత్తని

శ్రీమన్నారాయణుడే స్వయంగా గానం చేశాడనీ నాలుగు వేదాలూ సాంఖ్య యోగం ఇందులో సమావేశం కావటం వల్ల ఇది "పంచరాత్ర" శబ్దం ద్వారా ప్రచలితమైందనీ–వివరించబడింది:

"ఇదంమహోపనిషదం చతుర్వేద సమన్వితమ్ ।"
"సాంఖ్యయోగకృతంతేన పంచరాత్రానుశబ్దితమ్ ।
నారాయణముఖోద్గీతం నారదోఽశ్రావయత్ పునః" ॥

"నారద పాంచరాత్రం" ప్రకారం, ఇందులో వివేద్యాలైన విషయాల సంఖ్యను బట్టి ఈ పేరు వచ్చిందని. ఇక్కడ "రాత్ర" శబ్దానికి జ్ఞానం అని అర్థం. "రాత్రంచ జ్ఞానవచనం జ్ఞానం పంచవిధం స్మృతమ్". పరమతత్త్వం, ముక్తి, భుక్తి, యోగం, విషయం (సంసారం)-అనే అయిదు విషయాల నిరూపణ జరుగుతుంది గనక ఇది "పాంచరాత్రం" అయింది. "అహిర్బుధ్న్య సంహిత"లో నారదపాంచరాత్రమే అంగీకృతమైంది.

ఈ శబ్దం జన్మించిన విషయమై "ఈశ్వరసంహిత" ఒక ఉపాఖ్యానాన్నే చెప్తోంది. జగత్పతి వాసుదేవుడు "ఏకాయనవేద" రహస్యాన్ని మొట్ట మొదట బోధించిన విధానాన్ని అనుసరించి ఈ కథ ఉద్భవించింది. దాన్ని బట్టి ఈ పేరు వచ్చింది. భగవానుని పంచాయుధాల అంశరూపులైన ఋషులు-శాండిల్య, ఔపగాయన, మౌంజాయన, కౌశిక, భారద్వాజ అనువారు-కలిసి శేషాద్రి చేరి దాని మీద తపస్సు చేశారు. వీరి తపస్సుకు మెచ్చి భగవానుడు వాసుదేవుడు వీరికి "ఏకాయన వేద" రహస్యాన్ని ఉపదేశించాడు. ఋషుల సంఖ్యను బట్టి ఈ ఉపదేశం పంచరాత్రుల్లో జరిగి, ఈ తంత్రానికి "పాంచరాత్రం" అనే పేరు సార్థకం అయింది:

"పంచాయుధాంశాస్తేపంచ శాండిల్య శ్చౌపగాయనః ।
మౌంజ్యాయనః కౌశికశ్చభారద్వాజశ్చయోగినః ॥
పంచాపిపృథగేకైక దివారాత్రం జగత్ప్రభుః ।
అధ్యాపయామాస యత స్తదేతన్ముని పుంగవాః ॥
శాస్త్రం సర్వజనై ర్లోకే పంచరాత్రమితీర్యతే ।

"పాద్మ"తంత్రానుసారం "పాంచరాత్ర" శబ్దం ఈ ఆగమవైశిష్ట్యాన్ని తెలిపేదని. ఈ ఆగమశాస్త్రం ఎదుట మిగిలిన పంచశాస్త్రాలు, రాత్రిలాగమలినమై పోతాయి గనుక "పాంచరాత్ర" శబ్దం దీనికి తగి ఉంది:

"పంచేతరాణి శాస్త్రాణి రాత్రీయంతే మహాన్త్యపి।
తత్సన్నిధౌ సమాఖ్యాఽసౌ తేన లోకే ప్రవర్తతే"॥

"విష్ణుసంహిత" ప్రకారం, పంచ భూతాలకు లేదా శబ్దాది పంచ విషయాలకు "పంచరాత్ర" శబ్దం ప్రయోగించబడిందని. పరమ తేజస్సు సోకడంవల్ల ఈ "పంచరాత్ర" నామకమైన "అజ్ఞానం" తొలగిపోతుంది. ఈ అజ్ఞానాన్ని తొలగించే శాస్త్రానికి "పాంచరాత్రం" అనే పేరు ఉచితంగానే ఉంది:

"రాత్రయోగోచరాః పంచ శబ్దాది విషయాత్మికాః।
మహాభూతాత్మకావాఽత్ర పంచరాత్ర మిదం తతః॥
అవాప్యతుపరం తేజో యత్రైతాః పంచ రాత్రయః।
నశ్యంతి పంచరాత్రం తత్ సర్వాజ్ఞాన వినాశనమ్"॥

"పరమ సంహిత" ప్రకారం-పంచభూతాలు, తన్మాత్రలు, అహంకారం, బుద్ధి, అవ్యక్తం (ప్రకృతి)అనే పంచవిషయాలు ఇక్కడ పురుషుని"రాత్రములు". "రాత్ర" శబ్దానికి "దానా"ర్థం కూడా ఉంది. వీటి సంయోగ వియోగాలు వర్ణిత మైన శాస్త్రం "పాంచరాత్రం". వీటి వర్ణన సాంఖ్యశాస్త్రంలో ఉన్నా, ఈ వైష్ణవ తంత్రంలో వీటి ప్రతిపాదన కొంత విలక్షణంగా చేయబడింది:

"మహాభూతగుణాః పంచ రాత్రయోదేహినః స్మృతాః।
తద్యోగా ద్వినివృత్తేర్వా పంచరాత్రమితి స్మృతమ్॥
భూతమాత్రాణిగర్వశ్చ బుద్ధి రవ్యక్తమేవచ।
రాత్రయః పురుషస్యోక్తాః పంచరాత్రం తతః స్మృతమ్"॥

ఈ అనుశీలనంవల్ల పాంచరాత్ర సంప్రదాయం ప్రాచీనమైనదని మధ్య కాలం నుంచి అన్ని వైష్ణవ సంప్రదాయాల మీద దీని ప్రభావం బాగా కనబడు తోందనీ తెలుస్తోంది. దీన్ని పూర్ణంగా అంగీకరించని ఆచార్యులు కూడా దీని

ప్రశస్తికెక్కుండా ఉండడానికి వీల్లేకపోయింది; దీని ప్రభావం అంత విస్తృతమూ, గభీరమూ, దీని ప్రభావం వల్ల-ముఖ్యంగా శ్రీవైష్ణవాచార్యుల కృషివల్ల-దీని కంటే ప్రాచీనమని చెప్పదగిన వైఖానస సంప్రదాయం వెనుకబడింది.

కాని, ఇప్పటికీ అనేకాలైన ప్రసిద్ధ విష్ణ్వాలయాలలో వైఖానసులే అర్చకులుగా ఉండి వైఖానసాగమం ప్రకారం అర్చనాదికాన్ని జరుపుతున్నారు. ఇది వైదికులైన అర్చకుల (వైఖానసులు మేము వైదికులమని చెప్పుకొంటారు). ప్రాధాన్యాన్ని తెలుపుతోంది. సుప్రసిద్ధమైన తిరుమల (తిరువెంగడం) శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో అనాదిగా వైఖానసులే అర్చకులుగా ఉన్నారు. ఆళ్వార్లు కీర్తించిన పెక్కు ఆలయాలలో-తిరుక్కడల్‌మల్లై లేదా మామల్లై (మహాబలిపురం), తంజై, తిరుక్కురుంగుడి, తిరుక్కడిగై (చోళసింహపురం), తిరువాలి తిరునగరి, తిరుప్పుళ్ళాని (దర్భశయనం) శ్రీ విల్లిపుత్తూరు, శిరివరమంగై (వానమామలై) మొదలైనచోట్ల నేటికి-పాంచరాత్ర వైష్ణవం విజృంభించిన తరువాత కూడా-అర్చకులు వైఖానసులే, వైఖానసులది కేవలం అర్చక సమాజం (వైఖానసాగమము, తిరుమల-తిరుపతి దేవస్థాన ప్రచురణ-1998; పుట XVI). ఆంధ్రప్రదేశ్‌లో కూడా (తిరుమల సరేసరి). శ్రీకాకుళం (ఆంధ్ర విష్ణువు), అమరావతి, వేదాద్రి, ధర్మవరం, విజయనగరం, పిఠాపురం, కాకినాడ, వినుకొండ, నెల్లూరు, వేంకటగిరి, కార్వేటినగరం మొదలైన చోట్ల ప్రసిద్ధంగా ఉన్న ప్రాచీన విష్ణ్వాలయాలలో వైఖానసాగమం ప్రకారం పూజలు జరుగుతూ ఉండటం గమనించవలసిన విషయం. (వైఖాన సాగమము, తిరుమల-తిరుపతి దేవస్థాన ప్రచురణ-1998; పుట-2).

సంఖ్యాబలం దృష్ట్యా ప్రకారం కొంత తగ్గిఉన్నా, ప్రాభవానికి లోటులేని వైఖానస సంప్రదాయాన్ని గురించి కొంత తెలుసుకోవలసి ఉంది. వైఖానసులకు నేడు వైష్ణవులలో ఒకశాఖగా గుర్తింపు ఉన్నా, భగవద్రామానుజుల వారిద్వారా విశేష ప్రచారాన్ని పొందిన శ్రీ వైష్ణవుల కన్న వీరు భిన్నులనే విషయం చాలా మందికిఅంత బాగా తెలియదు. వీరిది ఒకే అర్చక సమాజం. తమ్ముగూర్చి తాము వైదికులమని చెప్పుకొంటారు అని తెలుసుకొన్నాము. వీరు కృష్ణయజుర్వేదంలోని తైత్తిరీయ శాఖకు చెందిన బ్రాహ్మణులు. అర్చకులుగా వీరు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులలో వ్యాపించి ఉన్నారు. కర్ణాటకలోని నమ్మతీర

ప్రాంతంలో, కేరళలో వైఖానసులు కనబడరు. మతపరమైన అనుష్ఠానాలుండు వేద విహిత పద్ధతిలో కొనసాగించే విష్ణుపూజకులు వీరు. వీరు తమపరంపరలో ప్రాచీన ఆళ్వారులను గాని, భగవద్రామానుజులవారిని గాని గురువులుగా గ్రహించరు. తమిళ ప్రబంధాన్ని తాము నిర్వహించే పూజాదికంలో గానంచెయ్యరు. ఆళ్వారుల, ఆచార్యుల విగ్రహాలను తమ దేవాలయాలలో పూజించరు. కాలప్రవాహాన్ని బట్టి, శ్రీ వైష్ణవ ప్రాబల్యాన్ని బట్టి వీరి విగ్రహాలు వైఖానసులు అర్చకత్వం నెరపుతూ ఉన్న కొన్ని కొన్ని దేవాలయాలలో కనబడినా అవి, గర్భ గుడికి బైట పాంచ రాత్ర ఆగమాన్ని అనుసరించే శ్రీవైష్ణవుల పూజాదికంలో ఉంటాయి. పాంచరాత్రాగమానుయాయులకు వలె వీరికి తప్త ముద్రాంకనం లేదు. దీనికి కారణం వీరు గర్భస్థ వైష్ణవులు కావడం. గర్భవతికి 8వ నెలలో చేసే "విష్ణుబలి" లేదా "గర్భ చక్రసంస్కారం" వల్ల (చక్రం చేత పవిత్రీకరించ బడిన పాయసభక్షణంచేత) వీరు గర్భస్థ వైష్ణవులు. వేరే దీక్ష వీరికి అనావశ్యకం. అందువల్ల ఈసమాజంలో "వైష్ణవం తీసుకొని" ఇతరులు చేరే అవకాశం లేదవాలి !

ఇంక, అవతారాది విషయ వివరణకు ప్రాణప్రదమైన పాంచరాత్ర తంత్ర సిద్ధాంతాల్ని కొన్నింటిని పరిశీలిద్దాము. భక్తికి సర్వ ప్రథమ స్థానమున్న ఈ తంత్రంలో, సాధకుడు భగవంతుని ప్రసన్నునిగా చేసుకోవడం కోసం పంచ వ్యాపారాల్లో నిమగ్నుడై ఉంటాడు. అవి (1) అభిగమనం; త్రికరణశుద్ధితో దేవాలయ గమనాది కార్యకలాపాల్లో పాల్గొనడం (౨) ఉపాదానం: పూజా ద్రవ్య సముపార్జనం (౩) ఇజ్యా: భగవత్పూజ (4) స్వాధ్యాయం: అష్టాక్షరి మొదలైన మంత్ర జపం, ఆధ్యాత్మిక గ్రంథావలోకనం (౫) యోగం: ధ్యానాదులు. ఈ పంచవ్యాపారాలు ఈశ్వరారాధనలో అంతర్గతాలు. ఈశ్వర ప్రణిధానం శ్రుతి స్మృతుల సమ్మతమే. అద్వైతాచార్యులు శ్రీ శంకరులూ సమ్మతించిందే.

అయితే, పాంచరాత్రం ప్రకారం వాసుదేవుని నుండి సంకర్షణుడు ఉత్పన్నుడవుతున్నాడు. వాసుదేవుడు పరమాత్మకు, సంకర్షణుడు జీవాత్మకు నామాంతరాలు. సంకర్షణుని నుండి ప్రద్యుమ్నుడు (అనగా మనస్సు), ప్రద్యుమ్నుని నుండి అనిరుద్ధుడు (అనగా అహంకారం) ఉత్పన్నమవుతున్నట్లు చెప్పబడింది. ఈ ఉత్పత్తి వాదంలో "పస లేదని శ్రీ శంకరుల అభిప్రాయం. వాసుదేవుడు

పరమాత్మ అవతంలో శ్రీశంకరులకు అభ్యంతరంలేదు. ఆయన అనేకరూపాల్లో కన బడటానడంలోను అభ్యంతరంలేదు. కాని, పరమాత్మ అయిన వాసుదేవుని నుంచి జీవాత్మ అయిన సంకర్షణుడు ఉద్భవిస్తాడంటే వీలులేదని శ్రీ శంకరుల భావం. ఇది అంగీకరిస్తే-అంటే ఉత్పత్తి వాదాన్ని-జీవాత్మకు శాశ్వతత్వం ఉండదు. మోక్షంలేదు. భారతంలో ఉన్న ఈ భాగం పాంచరాత్రానికి సంబంధించిందని శ్రీ శంకరులూ అంగీకరించారు. బ్రహ్మసూత్ర భాష్యంలో శ్రీ శంకరులు "ఉత్పత్తి అసంభవాత్" ( II.2. 42) అనే సూత్రం మొదలు "విప్రతిషేధాచ్చ" సూత్రం (II, 2. 45) వరకు ఉన్న సూత్రాల వ్యాఖ్యలో ఈ వ్యూహ సిద్ధాంతాన్ని ఖండించారు. పరాత్పరుడైన వాసుదేవుని అభివ్యక్త మూర్తులు ఈ నాలుగే అవడం ఎందుకు? ఈ జగత్తులో ఉన్నదంతా పరాత్పరుని అభివ్యక్త రూపాలే అన్నారు. శ్రీ శంకరులు, "బ్రహ్మాది స్తంబ పర్యంతస్య సమస్తస్యైవజగతో భగవద్వ్యూహత్వావగమాత్" అని వ్రాశారు. భాగవత సిద్ధాంతాన్ని శ్రీ శంకరులు ఖండించగా; ఈ సిద్ధాంతం సూత్రకారుని అభిప్రాయానుసారం ఉందనీ, శ్రుతి సమ్మతమని శ్రీ రామానుజులు వ్రాశారు. భాగవత సంప్రదాయం భక్తికి విశేష ప్రాముఖ్యం ఇచ్చి భగవద్గుణకీర్తనం శ్రేయస్కరమంటుంది. శ్రీ శంకరులు వారి విష్ణుసహస్రనామ భాష్యంలో- "కోధర్మః సర్వధర్మాణాం భవతః పరమోమతః" అనే యుధిష్ఠిరుని ప్రశ్నకు భీష్ముడిచ్చిన

"ఏషమే సర్వ ధర్మాణాం ధర్మోఽధికతమో మతః।
యద్భక్త్యా పుండరీకాక్షం స్తవైరర్చేన్నరస్సదా" ॥

అనే సమాధానానికి వ్యాఖ్య ఇలా వ్రాశారు:

"సర్వేషాంచోదనాలక్షణానాం ధర్మాణాం ఏషః వక్ష్యమాణోధర్మః అధికతమః ఇతిమే మమ మతః అభిప్రేతః। యద్భక్త్యా తాత్పర్యేణ పుండరీకాక్షం హృదయ పుండరీకే ప్రకాశమానం వాసుదేవం స్తవైః గుణసంకీర్తన లక్షణైః స్తుతిభిః సదా అర్చేత్ సత్కార పూర్వకమర్చనం కరోతి నరః మనుష్యః ఇతి యత్ ఏషధర్మ ఇతి సంబంధః॥" (చోదనాలక్షణం ఉన్న సర్వధర్మాల్లో చెప్ప బోయే ధర్మం అధికతమమని నా అభిప్రాయం. మనుష్యుడు భక్తి తత్పరత్వంతో హృదయాంతర్వర్తి అయిన వాసుదేవుని గుణ సంకీర్తన రూపాలైన స్తుతులతో ఆదరపూర్వకంగా అర్చించడం అనేది ఉత్తమ ధర్మం.)

ఈ అర్చనా రూప ధర్మం ఎందుచేత సర్వోత్తమం ? కారణం ఇది. దీనిలో హింసలేదు. పురుషాంతరాపేక్షలేదు. ద్రవ్యాంతరాపేక్షలేదు. దేశకాల నియమాపేక్ష లేదు. ("అస్యస్తుతి లక్షణస్యార్చనస్య అధికత్వే కింకారణమ్ ? ఉచ్యతే- హింసాది పురుషాంతర ద్రవ్యాంతరదేశకాలాది నియమానపేక్షత్వం అధికత్వే కారణం"॥) ఈసందర్భంలో శ్రీ శంకరులు-విష్ణుపురాణవచనాన్ని ("కలౌ సంకీర్త్య కేశవమ్"), మహాభారతవచనాన్ని ("అవస్తు సర్వధర్మేభ్యః పర మోధర్మ ఉచ్యతే।"), భగవద్గీతావచ నాన్ని ("యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి") ఉదాహరించారు. వాసుదేవుని భక్తివిషయంలో వారి అభిప్రాయం దీనివల్ల సువ్యక్తమైంది గదా !

శ్రీ శంకరులు సూత్రభాష్యంలో వ్యూహాల విషయంలో అంతనిష్కర్షగా ఉన్నప్పటికీ విష్ణు సహస్రనామ భాష్యంలో "చతుర్వ్యూహః" అనే నామానికి వ్యాఖ్య వ్రాస్తూ-వ్యాస వచనానుసారం-భగవానుడు వాసుదేవాది మూర్తులతో నాలుగు విధాలైన వ్యూహాల్ని పొంది సృష్ట్యాది కార్యాలు నిర్వహిస్తాడు-అన్నారు. ("ఇతి వ్యాసవచనాత్ చతుర్వ్యూహః").

"వ్యూహ్యాఽఽత్మానం చతుర్థావై వాసుదేవాది మూర్తిభిః।
సృష్ట్యాదీన్ ప్రకరోత్యేషవిశ్రుతాత్మా జనార్దనః" ॥

అని వ్యాసశ్లోకాన్ని ఉదాహరించారు. ఈ విధంగా భక్తికి సముచితస్థానాన్ని శ్రీ శంకరు లివ్వారనడంలో విప్రతి పత్తి లేదు. సిద్ధాంత గ్రంథంలో ఉన్న నిష్కర్ష-సూత్ర భాష్యంలో ఉన్నట్లన్నమాట-స్తోత్ర గ్రంథమైన విష్ణుసహస్ర నామానికి వ్రాసిన వ్యాఖ్యలో ఉండకపోవడం సహజమే గదా !

"చతురాత్మా"అనే నామానికి శ్రీపరాశరభట్టరు(చత్వారః ఆత్మానః యస్యసః చతురాత్మా). వాసుదేవాది నాలుగు రూపాలుకలవాడని వ్యాఖ్యానించగా, శ్రీ శంకరులు "సర్గాదిషు పృథగ్విభూతయః చతస్రః ఆత్మనః మూర్తయోయస్య సః చతురాత్మా" అని వ్యాఖ్యానించి విష్ణుపురాణంలో ఉన్న క్రింది శ్లోకాల్ని ఉదాహరించారు:

"బ్రహ్మాదక్షాదయః కాలస్తథైవాఖిలజన్తవః।
విభూతయోహరేరేతా జగతస్సృష్టి హేతవః ॥

విష్ణుర్మన్వాదయః కాలస్సర్వ భూతాని చ ద్విజ ।
స్థితేర్నిమిత్తభూతస్య విష్ణోరేతా విభూతయః ॥
రుద్రః కాలోఽన్తకాద్యాశ్చ సమస్తాశ్చైవ జన్తవః ।
చతుర్ధా ప్రలయాయైతా జనార్దన విభూతయః"॥

భగవానుడు-సర్గ, స్థితి, లయాల్లో విభూతులైన నాలుగు మూర్తులున్నవాడు బ్రహ్మ, దక్షాది ప్రజాపతులు, కాలం, సకల జీవులు-ఈ నాలుగు సృష్టి హేతువులైన విభూతులు, విష్ణువు, మన్వాదులు, కాలం, సర్వభూతాలు అనే నాలుగు స్థితి హేతువులైన విభూతులు. రుద్రుడు, కాలం, అంతకాదులు, సమస్త జంతువులు- ఈ నాలుగు ప్రలయనిమిత్తాలైన విభూతులు, ఇవే-విభూతి చతుష్టయం.

ఈ "చతురాత్మా" అనే నామం మళ్ళీ వస్తుంది. ఇక్కడ శ్రీ శంకరులు "రాగద్వేషాది రహితత్వాత్ చతురః ఆత్మా మనోఽస్యేతి । మనో బుద్ధ్యహంకార చిత్తాఖ్యాన్తః కరణ చతుష్టయాత్మకత్వాద్వా చతురాత్మా"॥ అని వివరించారు. భగవానుడు రాగద్వేషాది రహితుడు కావడంచేత చతురమైన మనస్సు కలవాడు. లేదా మనస్సు, బుద్ధి, అహంకారం, చిత్తం అనే అంతఃకరణ చతుష్టయాత్మకుడు కూడా కావడంచేత భక్తులచేత పరమేశ్వరుడు "చతురాత్మా" అని సమర్చితుడవుతున్నాడు.

ఇదేవిధంగా ''చతుర్వ్యూహః'' అనే నామం కూడా పునరుక్తమవుతుంది. ఇక్కడ శ్రీ శంకరులు "బహ్వృచో పనిషత్తు" నుండి విషయాన్ని గ్రహించి ఇలా వ్రాశారు: "ఇతి బహ్వృచో పనిషదుక్తాశ్చత్వారః పురుషావ్యూహా అస్యేతి చతుర్వ్యూహః । శరీరపురుషశ్ఛన్దః పురుషః వేదపురుషో మహాపురుషః॥ బహ్వృచో పనిషత్తులో వివరించ బడిన విధంగా పరమాత్మ-శరీరపురుష ఛందఃపురుష, వేద పురుష, మహాపురుష భేదాలతో నలుగురు పురుషులు వ్యూహాలుగా కలవాడు. ఇందువల్ల భక్తులు "చతుర్వ్యూహః" నామంతో ఈయననుస్తుతిస్తున్నారు.

ఎన్ని విధాలుగా స్తుతించినా. స్త్రీలింగాంతాలైన నామాలతో, పుంలింగాంతాలైన నామాలతో, నపుంసక లింగాంతాలైన నామాలతో, పునరుక్తిలా కనిపించే నామాలతో, ఒకే అర్థాన్ని తెలిపే వివిధ నామాలతో, భిన్న దేవతా మూర్తుల

నామాలలో-అన్నీ స్తుతులూ కూడా ఆ పరాత్పరుడికేగదా! అంటారు శ్రీ శంకరభగవత్పాదులు:

"అత్ర నామ సహస్రే ఆదిత్యాది శబ్దానాం అర్థాంతరే ప్రసిద్ధానాం ఆదిత్యా ద్యర్థానాం తద్వి భూతిత్వేన తదభేదాత్ తస్యైవస్తుతి రితి ప్రసిద్ధార్థ గ్రహణేఽపి తత్ స్తుతిత్వమ్॥"
"విష్ణ్వాదిశబ్దానాం పునరుక్తానామపి వృత్తి భేదేనార్థ భేదాన్న పౌనరుక్త్యమ్॥
"శ్రీపతిః మాధవః ఇత్యాదీనాం వృత్త్యేకత్వేఽపిశబ్ద భేదాన్న పౌనరుక్త్యమ్। అర్థైకత్వేఽపిన పౌనరుక్తం దోషాయ, 'నామ్నాం సహస్రస్య కిమేకం దైవతమ్' ఇతి పృష్టేః ఏకదైవత విషయత్వాత్॥"
"యత్ర పులింగశబ్ద ప్రయోగ స్తత్ర విష్ణుర్వి శేష్యః। యత్రస్త్రీ లింగశబ్దస్తత్ర దేవతా విశేష్యతే। యత్ర నపుంసకలింగ శబ్దస్తత్ర బ్రహ్మేతి విశేష్యతే॥"
"యతస్సర్వాణి భూతాని" ఇత్యారభ్య జగదుత్పత్తి, స్థితి, లయకారణస్య బ్రహ్మణ ఏక దైవతత్వేనాఽభిహిత త్వాత్॥"

ఈ సహస్ర నామాల్లో - జగదుత్పత్తి, స్థితి, లయకారణమైన "బ్రహ్మ" ఏక దైవత మని చెప్పబడడం చేత, నామద్వైవిధ్యమున్నా "ఏకమే వాద్వితీయమ్ బ్రహ్మ", అని గ్రహించాలి అని శ్రీ శంకరుల భావం.

ఈ విషయాన్నే భగవద్గీత 'విభూతి యోగం'లో భగవానుడు తన విభూతుల్నివర్ణించి ("అహమాత్మాగుడాకేశ" మొదలుకొని "జ్ఞానంజ్ఞానవతామహమ్" వరకు చెప్పబడిన విభూతుల సంఖ్య–71.) విరమించి, అధ్యాయం చివరి నాలుగు శ్లోకాల్లో తన అనంతత్వాన్ని వివరించాడు:

"యచ్చాపి సర్వభూతానాం బీజం తదహమర్జున।
నతదస్తి వినాయత్స్యాన్మయా భూతం చరాచరమ్॥(౧౦.౩౯)

(అర్జునా ! సర్వభూతాలకు మూలకారణం ఏదో అది నేనే. స్థావర జంగ మాత్మకమైన వస్తువుల్లో ఏ ఒకటీ నాశక్తిలేకుండా నిలబడగలిగిందిలేదు. అన్నీ మదాత్మకాలే.)

"నాంతోఽ స్తి మమదివ్యానాం విభూతీనాం పరంతప ।
ఏషతూద్దేశతః ప్రోక్తో విభూతేర్విస్తరోమయా"॥ (X-40)

(పరంతపా ! దివ్యాలైన నా విభూతులకు పరిమితిలేదు. అయినా, సంక్షేపంగా ఈ విభూతుల వర్ణన చేశాను.)

అర్జునుడు తనంతతాను భగవద్విభూతి గ్రహించడానికి వీలుగా శ్రీకృష్ణుడు ఒక్క శ్లోకంలో ఇలాచెప్పాడు:

"యద్యద్విభూతి మత్సత్త్వం శ్రీమదూర్జితమేవవా ।
తత్తదేవావగచ్ఛత్వం మమతేజోంఽశ సంభవమ్"॥ (X-41)

(ఐశ్వర్య యుక్తమై, శ్రీమంతమై, సర్వశ్రేష్ఠమై ఉన్న ఏవస్తువైనా కానీ, అది నాశక్తి అంశనుండి కలిగింది అని నువ్వు గ్రహించు )

ఇదంతా చెప్పిన తరవాత, "నా విభూతుల్ని ఇంత ఎక్కువగా తెలుసుకొంటే నీకు లాభం ఏమిటి ? నా ఒక్క అంశతోనే సమస్త విశ్వాన్ని వ్యాపించి ధరించి ఉన్నానని తెలుసుకో" అన్నారు భగవానుడైన శ్రీకృష్ణుడు ఈ శ్లోకంలో:

"అథవాబహునైతేన కిం జ్ఞాతేన తవార్జున ।
విష్టభ్యాహ మిదం కృత్స్న మేకాంశేన స్థితో జగత్॥"(X-42)

ఈ వాక్యం "పాదోఽస్య విశ్వాభూతాని" అనే వేద వాక్యంతో సమనిస్తోంది గదా !

విష్ణుసహస్ర నామంలోని "చతుర్మూర్తిః" అనే నామానికి వ్యాఖ్య వ్రాస్తూ శ్రీ పరాశరభట్టరు "చత్రసః మూర్తయః యస్యసః చతుర్మూర్తిః" అని విగ్రహ వాక్యం వ్రాసి బలభద్ర, వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధులు అనే నాలుగు మూర్తులతో యదువంశంలో అవతరించిన వాడని వివరించారు. దీనికి శ్రీ శంకరులు వ్యాఖ్య వ్రాస్తూ విరాట్, సూత్ర, అవ్యాకృత, తురీయాత్మ అనే నాలుగు రూపాలు

కలవాడని, తెలుపు, ఎరుపు, పసుపు, నలుపు అనే రంగులున్న నాలుగు మూర్తులు కలవాడని వ్రాశారు. ("చత్వారో మూర్తయో విరాట్-సూత్ర-అవ్యాకృత-తురీయాత్మానోఽస్యేతి చతుర్మూర్తిః। సితా-రక్తా-పీతా-కృష్ణాచేతి చత్వారో మూర్తయోఽస్యేతి వా"।) ఈ విధంగా అభిప్రాయ భేదాలు కనబడుతూఉన్నా, వాసుదేవ శబ్ద ప్రయోగం విషయంలో గాని, ఆయన పరాప్రకృతి, పరమాత్మ, అవ్యక్తం కంటె పరుడు, సర్వాత్మ, అనేక రూపాల్లో దర్శన మిస్తాడు అనే విషయాల్లో గాని శ్రీ శంకరులు పూర్తిగా భాగవత ధర్మ, పాంచరాత్ర సిద్ధాంత వ్యతిరేకులుగా కనబడరనిపిస్తుంది. ఉత్పత్తివాదాన్ని మాత్రం ఆయన ఆక్షేపిస్తారు. కాని శ్రీ రామానుజులు-"ఉత్పత్త్యసంభవాత్," "నచకర్తుఃకరణమ్" అను రెండు సూత్రములు పూర్వపక్షవాదాన్ని ప్రతిపాదిస్తున్నాయి అని చెప్పి "విజ్ఞానాది భావే వా తద ప్రతిషేధః" అనే సూత్రంలోని "వా" మొదటి రెండు సూత్రాల్లో ప్రతిపాదించబడిన పూర్వపక్షాభిప్రాయాల్ని నిరసిస్తోందని, "అప్రతిషేధః" అనే శబ్దం భాగవత సిద్ధాంతానికి విరోధంకాదని వ్రాశారు. భాగవతమత ప్రామాణ్యం నిషిద్ధం కాదనే అర్థంలో గ్రహించబడింది. అనుపపన్నమైన జీవోత్పత్తిని ఈ సిద్ధాంతం ఉపదేశించడంలేదు. వాసుదేవనామక పరబ్రహ్మం తన భక్తులమీది వాత్సల్యంతో వారు సులభంగా తన్నాశ్రయించడానికి వీలుగా నాలుగు విధాలైన అభివ్యక్తిని భాగవత మతం ఉపదేశిస్తోందని శ్రీరామానుజులు వ్రాశారు:

"వాసుదేవాఖ్యంపరం బ్రహ్మైవాశ్రితవత్సలం స్వాశ్రితసమాశ్రయణీయత్వాయ స్వేచ్ఛయా చతుర్ధాఽవతిష్ఠత ఇతి హి తత్ప్రక్రియా" సంకర్షణ ప్రద్యుమ్నాదులు పరబ్రహ్మ కేవలం స్వేచ్ఛగా ధరించే శరీరాలే! "అజాయమానో బహుధా విజాయతే" (తైత్తిరీయారణ్యకం) అంటే "జన్మించకపోయినా ఆయన అనేక విధాల జన్మిస్తున్నాడు" అని శ్రుతి తెలుపుతుంది గదా! "ఆశ్రిత వాత్సల్యంచేత ఆ భక్త పరాధీనుడు స్వేచ్ఛగా వివిధ శరీరాల్ని ధరించడమనే పుట్టుకను భాగవతం వివరిస్తోంది" అంటారు శ్రీ రామానుజులు. భగవానుడు సర్వస్వతంత్రుడు గదా!

"విప్రతిషేధాచ్చ" అనే సూత్రాన్ని వ్యాఖ్యానిస్తూ-భాగవత మతంలో పరస్పర విరుద్ధ విషయాలు చాలా ఉన్నాయి అని, "గుణి" "గుణ" భేదాన్ని సరిగా గుర్తించలేదని, (వ్యూహాలు ఒకప్పుడు గుణులుగా, ఇంకొక్కప్పుడు

గుణాలుగా చెప్పడం), వేదనింద ఉంది అని ("చతుర్షు వేదేషు ఏవం శ్రేయోఽ లబ్ధ్వాశాండిల్య ఇదం శాస్త్రమధీతవాన్") శ్రీ శంకరులు వ్రాశారు. శాండిల్యుని వేద విమర్శ, భాగవతమతాన్ని స్తుతించడం కోసం మాత్రమే అని శ్రీ రామానుజులు వ్రాసి, 'మంత్ర విదేవాస్మి నాఽత్మవిత్" అని ఛాందోగ్యంలో సనత్కుమారునితో నారదుడు విన్నవించడం ఆత్మజ్ఞాన వైశిష్ట్యాన్ని, అధిక్యాన్ని చెప్పడమే గాని వేదమంత్ర దూషణ కానట్లు శాండిల్యుని, మాటలును అని వివరించారు. "నారద" శబ్దవ్యుత్పత్తి నిగ్రహిస్తే -పరమాత్మ విషయకమైన జ్ఞానం ఇచ్చేవాడు- పై వాక్యం ఎంత సత్యమో తెలుస్తుంది. "శబ్ద కల్ప ద్రుమం"-నారమ్ దదాతి ఇతి నారదః; నారమ్ పరమాత్మ విషయక జ్ఞానమ్-అని నిర్వచించింది. భగవంతుడైన హరి, భక్త వాత్సల్యంతో సర్వవేదాంత గ్రంథాల సారాన్ని క్రోడీకరించి ఈ సంప్రదాయం ద్వారా ఇవ్వడం జరిగిందని శ్రీ రామానుజులు క్రింది శ్లోకాన్ని ఉదాహరించారు:

"వేదాంతేషు యథాసారం సంగృహ్య భగవాన్ హరిః ।
భక్తాను కంపయా విద్వాన్ సంచిక్షేప యథా సుఖమ్" ॥

ఇందువల్ల భాగవత సంప్రదాయం వేదసమ్మతమని శ్రీ రామానుజుల వాదం.

మహాభారతంలో చాలాచోట్ల "పాంచరాత్ర" సిద్ధాంతాల వివరణ, వ్యూహాల ప్రస్తావన కనబడుతుంది. ముఖ్యంగా ఈ భాగాలు శాంతి పర్వంలోని "నారాయణీయ" అధ్యాయాల్లో ఉన్నాయి వైష్ణవాచార్యులు-వీరిలో శ్రీవైష్ణవ సంప్రదాయానికి చెందినవారు అధికంగా ఉన్నారు-తమ సిద్ధాంతాలు ప్రాచీనాలనీ వేద సమ్మితాలనీ సోపపత్తికంగా స్థాపించుకోవడానికి ఈ భాగాలు బాగా తోడ్పడ్డాయి. మహాభారతంలో శాంతిపర్వంలోని ఈ అధ్యాయాల్లోనే కాకుండా మిగిలిన చోట్ల కూడా "పాంచరాత్ర" ప్రస్తావన, భగవానుని "చతుర్మూర్తుల" వివరణ కనబడుతున్నాయి. అశ్వమేధ పర్వంలో యుధిష్ఠిరుడు శ్రీకృష్ణుని ఇలా ప్రశ్నిస్తాడు:

"కథం త్వమర్చనీయోఽసి మూర్తయః కీదృశాశ్చతే ।
వైఖానసాః కథం బ్రూయుః కథం వా పాంచరాత్రికాః" ॥

శ్రీకృష్ణుని ప్రత్యుత్తరంలో అన్ని విషయాలు, వ్యూహపురుషుల పేర్లతో పాటు ప్రస్తావితాలయ్యాయి:

"విష్ణుం చ పురుషం సత్యమచ్యుతంచ యుధిష్ఠిర।
అనిరుద్ధం చ మాం ప్రాహుః వైఖానసవిదోజనాః"॥
అన్యేత్వేవం విజానంతి మాం రాజన్! పాంచరాత్రికాః।
వాసుదేవంచ రాజేంద్ర! సంకర్షణ మథాపివా॥
ప్రద్యుమ్నం చానిరుద్ధం చ చతుర్మూర్తిం ప్రచక్షతే॥

అయితే, ఈ మహాభారతంలోనే జ్ఞాన ప్రకారాన్ని చెప్పే చోట, సాంఖ్య యోగ పాంచరాత్రాలతో పాటు వేదం కూడా జ్ఞాన ప్రకారంగా చెప్పబడింది:

"సాంఖ్యం యోగః పాంచరాత్రం వేదాః పాశుపతం తథా।
జ్ఞానా న్యేతాని రాజర్షే! విద్ధినానామతానివై"॥

వీటి నన్నింటిని బట్టి చూస్తే ప్రాచీనకాలంలోనే ఉన్న అభిప్రాయ భేదాల్ని బట్టి జ్ఞానవిభజన జరుగుతూ ఉండేదని; వేదంలో వివిధ శాఖలుండడంవల్ల కొన్ని శాఖలకు పాంచరాత్రాదులతో సన్నిహిత సంబంధం ఉండడం, కొన్నింటితో లేకపోవడం సహజమని భావించడం ఉండేదని ఊహించవచ్చు. పై శ్లోకంలో పేర్కొ-బడిన "పాశుపతం" విషయం చూస్తే, ఆ మతంలో వేదసమ్మతాలైన అంశాలతో పాటు వేదవిరుద్ధాంశాలు కూడా-ముఖ్యంగా నిమిత్తోపాదాన కారణాలకు భేదం అంగీకరించడం వంటివి-కనబడుతున్నాయి. ఇది పరాఽపరతత్త్వాల్ని గురించి విపర్యయజ్ఞానాన్ని కలిగిస్తోంది. అయినా, వేదాంత సూత్రాలు-సాంఖ్య, యోగ, పాంచరాత్ర, పాశుపత సంప్రదాయాల్లోని సిద్ధాంతాలనన్నింటినీ, నిరాకరించడంలేదనీ వాటిలోని దుర్బలాంశాల్నే నిరాకరించడం జరిగిందనీ శ్రీ రామానుజులు వాదిస్తారు జైన బౌద్ధసిద్ధాంతాలు మాత్రం పూర్ణంగా నిరాకృతాలు. శ్రీ రామానుజుల దృష్టిలో భాగవత (పాంచరాత్ర) సంప్రదాయం వేదసమ్మతం. వేదాంత సూత్ర పరిగృహీతం. శ్రీరామానుజుల మీద విశేష ప్రభావాన్ని నెరపిన శ్రీ యామునాచార్యులు పాంచరాత్ర సంప్రదాయాన్ని పూర్ణంగా అంగీకరించిన వారే.

ఈ సంప్రదాయాలన్నింటిలోను భక్తికి విశేష ప్రాముఖ్యం ఉంది. భక్తి

ద్వారా మోక్షం లభిస్తుందని పూర్ణ విశ్వాసం. శ్రీ రామానుజులు భక్తిని "జ్ఞాన విశేషం" అంటారు. భక్తికి ప్రాముఖ్యమున్నచోట సగుణ స్వరూపం-భక్తునికోరిక ననుసరించి-ధరించి భగవంతుడు సాక్షాత్కరిస్తాడు. వెను వెంటనే అవతార ప్రసక్తి, దాని వెంట భక్తుల అభీష్టాల్ని తీర్చడం కోసం అనేక (అనంత) అవతారాలెత్తిన విష్ణువు (సంప్రదాయాల్ని అనుసరించి-నారాయణ-వాసుదేవ-కృష్ణుల్లో ఒకరు మూలం కావచ్చు). రావడం జరుగుతుంది. శైవంలోను శాక్తంలోను సగుణో పాసన వచ్చినప్పుడు అవతార ప్రసక్తిలేదని కాదు.

శైవపురాణాల్లో, దేవీభాగవతాదుల్లో ఈ ప్రస్తావన విస్తృతంగా ఉంది. దుర్గా సప్తశతిలో దేవి స్వయంగా

ఇత్థం యదాయదా బాధాధాన వోత్థాభవిష్యతి ।
తదాతదావ తీర్యాహం కరిష్యామ్యరి సంశయమ్॥ (XI అధ్యా)

అని ప్రవచించింది. ఇది భగవద్గీతలోని "యదాయదాహి ధర్మస్య" "పరిత్రాణాయ సాధునాం" వంటి భగవద్వచనాలను జ్ఞప్తికి తెస్తుంది.

కాని, వైష్ణవ సంప్రదాయాల్లో ఆయా అవతారాలకున్న విశిష్టస్థానం, ప్రాచుర్యం ఇతర సంప్రదాయాల్లో కనబడదంటే సత్యదూరంకాదు. ఇంతగా అవతార ప్రసక్తి లేదంటేనూ ,అతిశయోక్తికాదు. సామాన్య దృష్టితో చూచినా సృష్టి స్థితి లయాల్లో-సృష్టిలయాల్ని పరిపాలించే "మూర్తులు" కాక- "స్థితి"ని పరిరక్షించే మూర్తి-సాధు పరిత్రాణం కోసం, దుష్కృత నాశం కోసం, ధర్మసంస్థాపనార్థం-అవతారాలెత్తడం సమజంగా కనబడుతుందిగదా! లౌకిక జగత్తులోకూడా "ఉదర నిమిత్తం బహుకృత వేషమ్" సాధారణంగా అందరికీ అనుభవంలోకి వస్తూ ఉన్న విషయమేగదా! ఈ కుక్షింభరులకోసం ఆ విశ్వంభరుడు అవతారాలెత్తడానికి ఆయన వాత్సల్యమే కారణం!

శ్రీమన్నారాయణుడు మత్స్యాది అవతారాలు ఎత్తడానికి కారణంగా,శ్రీదత్తాత్రేయ సంప్రదాయానికి వేదతుల్యమైన గంగాధర సరస్వతి మరాఠీ భాషలో వ్రాసిన "గురుచరిత్ర"లో ఒకకథ ఉంది. సిద్ధనామధారక సంవాద రూపంగా ఉన్నదీనిలో, "త్రిమూర్తి స్వరూపుడైన శ్రీ గురుడు నరునిగా జన్మించడానికి కారణం ఏమిటి "అని నామ ధారకుడు ప్రశ్నిస్తాడు. కలియుంలో శ్రీ

దత్తాత్రేయావతారాలుగా ప్రసిద్ధి పొందినవారు. గురు చరిత్ర కథకు నాయకులు అయిన శ్రీపాద శ్రీ వల్లభ, శ్రీ నృసింహ సరస్వతులలో రెండో వారయిన శ్రీ సరస్వతుల శిష్యులలో సిద్ధుడు ఒకరు. "నాయనా, మంచిప్రశ్న వేశావు" అని సిద్ధుడు సంతోషించి, "గురుడు నిర్గుణుడైనా లీలా విహారార్థం సగుణ నరరూపం ధరిస్తాడు. భక్తులనుద్ధరించడం ఆయన ముఖ్యాభీష్టం" అంటాడు. త్రిమూర్తి రూపమైన సాక్షాత్ పరబ్రహ్మతత్త్వం, భూభారాన్ని తగ్గించడానికి, భక్తులను తరింపజేయడానికి అవతారరూపంలో భూమికి దిగివస్తాడు. త్రిమూర్తులన్నా ఆదివస్తువైన పరతత్త్వం ఒకటే. ప్రపంచ ప్రవృత్తికి ఏర్పడిన ఆయన మూర్తులు మూడు ఈ మూర్తులలో బ్రహ్మది రజోగుణం; విష్ణుమూర్తిది సత్త్వగుణం; రుద్రునిది తమోగుణం. ఇంత మాత్రం చేత వీరు భిన్నులుకారు. ఈ విషయాన్ని నిష్కర్షగా నిశితంగా, మరాఠీ గురుచరిత్రను "గురు సంహితా" (సమశ్లోకీ గురు చరిత్ర-1905) అని సంస్కృతీకరించిన ప॥పూ॥ వాసుదేవానంద సరస్వతీ స్వామి (1854-1914) సూటిగా ఇలా వివరించారు:

"భూమేర్భారావతారాయ భక్తోద్ధారాయ మారిష ।
ఏషవేష ధరోభూత్వాకురుతే ధర్మపాలనమ్ ॥

ఇతిసిద్ధవచః శ్రుత్వానత్వా తం నామధారకః
ప్రపచ్ఛేశావతారాణాం నిదానం కిం మహామతే॥

స్వామిన్మయి కృపాం కృత్వా విస్తరేణైవతద్వద ।
ఉవాచ సిద్ధః శృణు భో నిర్గుణం బ్రహ్మవస్తుయత్ ॥

జగదాది స్వతోఽనాది యదేకం చాద్వితీయకమ్ ।
తత్స్వ శక్తి సమావేశాత్త్రిగుణం విశ్వకారణం ॥

యత్స్వ తంత్రం దేవాసీద్ బ్రహ్మవిష్ణ్వీశరూపధృక్ ।
సృష్టిస్థితి ప్రలయ కృద్రజః సత్త్వతమోగుణైః ।

కః స్రష్టా రజ ఉద్రేకే సత్త్వోద్రేకేఽస్య కేశవః ।
పోష్టాఽన్తే తమ ఉద్రేకే హర్తా రుద్రః స్వయం ప్రభుః ॥
(గురు సంహితా-జ్ఞానకాండే-అధ్యా-IIIశ్లో - 48, 49, 50, 51, 52, ౫౩)

సంస్కృత గురుసంహితకుమూలమైన గంగాధర సరస్వతి మరాఠీ గురు చరిత్రలో, సంహితలో లాగ జ్ఞాన, కర్మ, భక్తి కాండలుగా విషయ విభాగం కన బడదు. శ్రీ వాసుదేవానంద సరస్వతులు ఈ విధంగా విభజించి వ్రాసినా ఆయా భాగాలలో ఆవిషయాలు మాత్రమే ఉన్నాయి అనుకోవడానికి వీలులేదు. అయితే, అయావిషయాలు ఆయాకాండలలో ప్రాధాన్యం వహించాయి అని చెప్పవచ్చును.

స్వతంత్రం,మూలకారణం అయిన ఆబ్రహ్మవస్తువు లీలావిలాసమే త్రిమూర్తుల ఆవిర్భావకారణం. వీరిలో స్థితి కారకుడు సత్వ గుణ ప్రధానుడు అయిన విష్ణువు దశావతారాలు ఎత్తడానికి కారణంగా సూర్యవంశ క్షత్రియుడైన అంబరీషుడు నారాయణైక సేవాపరాయణత్వంతో నియమం తప్పకుండా నిర్వహిస్తూ వచ్చిన ఏకాదశీ వ్రతకథ చెప్పబడింది ఈ కథ మనలో చాలామందికి తెలిసినదే. ద్వాదశి గడియ దాటి పోకుండ పారణ చేయవలసి ఉన్నది. సూర్యోదయానంతరం తిథి ఒక గడియ మాత్రమే ఉండగా దుర్వాసుడు అతిథిగా వచ్చాడు. అతిథిపూజ అవశ్యకర్తవ్యం గనుక "తమరు తమ అనుష్ఠానాన్ని తొందరగా ముగించుకొని దయచేయవలసినది" అని అంబరీషుడు దుర్వాసో ఋషికి మనవి చేసుకొన్నాడు. ఆ ఋషి నదికి పోయి ఆలస్యం చేశాడు. ఇంతలో సాధన ద్వాదశీ సంబంధి అయిన గడియ ముగియ వచ్చింది. అప్పుడు వ్రత భంగం కాకుండా ఉండడం కోసం అంబరీషుడు జలమాత్రంతో ద్వాదశీ పారణచేసి, అతిథి కోసం నిరీక్షిస్తూ ఉన్నాడు. ("వ్రత భంగాతిథి త్యాగదోష భీత్యా సశంకితః । విచార్య స్వగతం రాజా జలపానేన మేభవేత్ । అదునోభయ సంసిద్ధిరితి మత్వా పపౌ జలమ్ ॥)

అప్పుడు వచ్చిన దుర్వాసోమహర్షి "అతిథిని విడిని ఎందుకు ద్వాదశి పారణ చేశావు ? నిన్ను శపిస్తాను" అన్నాడు. అప్పుడు రాజు, భక్తవత్సలుడైన శార్ఙ్గధరుడైన విష్ణువును స్మరించగా ఆయన భక్తరక్షణార్థం తన దూడ కోసం పరుగున వచ్చిన ఆవు లాగ ("దేనుర్వత్సమివ") వచ్చి వారి మధ్య నిలిచి ఉన్నాడు. అప్పటికి, "నువ్వునానాయోనులలో జన్మించుము" అని ఋషి రాజును శపించనే శపించాడు. ("రాజన్నానాయోని భాక్ త్వం భవేతి సశశాపతమ్। యావత్తావద్ ధృషీకేశ స్తయోర్మధ్యే సమాగతః ॥) తన్ను శరణు పొందిన భక్తుని రక్షించడం కోసం, మహావిష్ణువు అమోఘమైన ఋషిశాపం తన్ను చెందవలెనని ఋషిని కోరాడు ("మునే రక్షామ్యముం భక్తం శాపం దేహి తమేవమే")దుర్వాసుడు కూడా సామాన్యుడు కాడు. జ్ఞాని అయిన ఋషీశ్వరుడు

ఈ సందర్భంలో దుర్వాసుణ్ణి గురించి కొంత తెలుసుకోవడం అప్రస్తుతం కాదు. త్రిమూర్తులు, అనసూయాసతికి అత్రిమహామునికి పుత్రులుగా ఉదయించి నప్పుడు బ్రహ్మాంశ సంభవుడైన బాలుడు చంద్రునిగా, విష్ణ్వంశ సంభూతుడైన బాలుడు దత్తునిగా, ఈశ్వరాంశ సంజాతుడైన బాలుడు దుర్వాసునిగా వెలిశారు. అనసూయాసతి ఆ శిశువులను తన స్తన్యంతో పోషించింది.

"తాన్పుపోషాన సూయాఽపి బ్రహ్మవిష్ణు మహేశ్వరాన్ ।
శ్రీదత్త చంద్ర దుర్వాసః సంజ్ఞితాన్లోక పూజితాన్ ॥"

తరువాత, చంద్రుడు విహాయసానికి, దుర్వాసుడు తపస్సుకు తీర్థయాత్రలకు వెళ్ళిపోయారు. "సర్వం విష్ణుమయం జగత్" కనుక, విష్ణ్వంశ సంభూతుడైన దత్తుడే త్రిమూర్త్యాత్మకునిగా, సర్వజగద్రూపునిగా, సర్వజన చేతన చరాచర జగదంతర్యామిగా విశ్వగురునిగా నిలిచిపోయాడు.

దుర్వాసుడు దేవీభక్తునిగా సుప్రసిద్ధుడు. ఈయన ప్రవృత్తినిబట్టి క్రోధ భట్టారకునిగా బిరుదు వహించారు ఈయన రచనలుగా 1. శ్రీపరశంభుమహిమ్నః స్తుతి (13 ప్రకరణాలతో, 141 శ్లోకాలతో ఇది ఉంది. కాశ్మీరశైవ సంప్రదాయానికి ఇది మూలగ్రంథమని సంప్రదాయ సిద్ధాంతవిదులు అంటారు) 2. శ్రీదేవీ (శక్తి) మహిమ్నః స్తోత్రమ్ (56 శ్లోకాలు) 3. శ్రీలలితాస్తవ రత్నమ్ లేదా ఆర్యా ద్విశతి (216 శ్లోకాలు) ప్రసిద్ధాలు. ఇవిగాక శ్రీవిద్యా సంప్రదాయానికి చెందిన కొన్ని గ్రంథాలుకూడా ఈయన రచనలుగా ప్రచారాన్ని పొందాయి. ఈయన రుద్రాంశతో అనసూయాసతికి, అత్రిమహామునికి ఇంచుమించుగా సృష్ట్యాది కాలంలో అవతరించిన కథ మనకు తెలుసును.

"సకలాగమాచార్య చక్రవర్తీ సాక్షాచ్ఛివ ఏవానసూయాగర్భ
సంభూతః క్రోధభట్టారకాఖ్య దుర్వాసా మహామునిః"
(నిత్యానందనాథుడు–శ్రీదేవీ మహిమ్నః స్తోత్ర వ్యాఖ్యాత)

కలియుగంలో ఎప్పుడు ఎక్కడ ఏరూపంలో ఈ రచనలు చేశారో చెప్పడం కష్టం. కాని, తమిళనాడులో దుర్వాసుని గుహలు, ఆశ్రమాలు కనబడుతున్నాయి. తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణమార్గంలో దూర్వాసాశ్రమం ఒకటి ఉన్నట్లు తెలుస్తోంది కనుక, ఈయనకూడా శ్రీదత్తాత్రేయునిలాగే కలియుగంలో అవతరించి

ఈ మూడు రచనలుచేసి ఉండవచ్చును పురాణాలలోనికథలు. ఉదాహరణకు అంబరీషునికథ. ఆయనకున్న క్రోధభట్టారకుడు అనే బిరుదాన్ని సమర్థించేలాగే ఉన్నాయి. కాని, శ్రీదేవీ మహిమ్నః స్తోత్రమ్‌లో గ్రంథోప సంహారంలోని క్రింది రెండు శ్లోకాలు ఆయన వైశిష్ట్యాన్ని తెలుపుతాయి.

"దుర్వాససా విదిత తత్త్వ మునీశ్వరేణ ।
విద్యాకలాయువతి మన్మథమూర్తి నైతత్ ।
స్తోత్రం వ్యధాయి రుచిరం త్రిపురాఽమ్బికాయాః ।
వేదాగమోక్త పటలై ర్విదితై క మూర్తేః ॥" (శ్లో–55)

"సదసదనుగ్రహ నిగ్రహ
గృహీత ముని విగ్రహో భగవాన్ ।
సర్వాసాముపనిషదాం
దుర్వాసా జయతిదేశిక ప్రథమః ॥" (శ్లో–56)

ఈ దుర్వాసోముని సామాన్యుడుకాడు. వేదాదివిద్యలు, సంగీతాదికళలు అనే యువతులను ఆకర్షించుకొనే విషయంలో మన్మథమూర్తి. సమస్త తత్త్వాలను తెలుసుకొన్నవాడు. వేదాల, ఆగమాలచేత చెప్పబడిన పటలాలనే తత్త్వనిరూపక గ్రంథాలద్వారా మాత్రమే గ్రహించగలిగిన స్వరూపమున్న త్రిపురాంబికా స్తోత్రం రచించినవాడు. సజ్జనులను అనుగ్రహించడం, దుర్జనులను నిగ్రహించడం అనే ప్రవృత్తులచేతనే తెలుసుకోదగిన మునిరూపుడు; సర్వోపనిషత్తులను ప్రవచించే ప్రథమదేశికుడు; భగవానుడు. భగవానుడైన శ్రీదత్తాత్రేయులవారి తోడబుట్టిన వాడు భగవానుడు కాక ఇంకెవ్వరు కాగలరు ?

దుర్వాస శబ్దానికి పెద్దలు అర్థ వివరణచేశారు. దుర్వాసాః- దుష్టం- దుఃఖదం- వాసః- యస్య. దుష్టము దుఃఖప్రదము అయిన వస్త్రం కలవాడు. ("శణ సూత్ర నిర్మిత వల్కల వ్యాఘ్ర చర్మ గైరికరంజిత వస్త్రాదికం"- నిత్యానందనాథుని వ్యాఖ్య) ఈ వస్త్రధారణ- దూర్వాసుని తపోనిష్ఠను, లౌకిక సుఖ నిరసనను తెలియజేస్తుంది.

ఈశ్వరావతార రూపుడైన దూర్వాసుడు తాను అంబరీషు నుద్దేశించి ఇచ్చిన శాపం భక్తపరాధీనుడైన శ్రీమహావిష్ణువు స్వీకరించడంచేత భవిష్యంలో శ్రీమహా

విష్ణువు అవతరించి భూభారాన్ని తొలగించడానికి హేతువౌతుందని తనలో తాననుకొన్నాడు.

భూలోకంలో మానవులు యుగయుగాలుగా తపస్సుచేసినా వారికి శ్రీహరి చరణ దర్శనభాగ్యం లభించడంలేదు. కాని, ఈ శాపసంబంధంవల్ల శ్రీమహావిష్ణువు శ్రీమహాలక్ష్మితో కలిసి భూలోకంలో అవతరించి భూభారాన్ని తగ్గించవలసి ఉన్నది. భక్తులకు దర్శనభాగ్యం లభించగలదు. అనుకొనగా ఆ శాపం శ్రీమహావిష్ణువును చెందింది. అది పరోపకారార్థం అయింది :

"ఈశ్వరాంశోఽపి దుర్వాసా విచార్య స్వగతం జగౌ ।
అవతీర్త్యేష శాపేన భువోభారం హరిష్యతి ॥
సుచిరేణాపి తపసా భగవాన్భువి దుర్లభః ।
అంబరీష ప్రభావేన శాప సంబంధ కారణాత్ ॥
భవిష్యత్యత్ర సులభః శ్రీపతిః సహితః శ్రియా ।
అవతీర్య స్వభక్తా నా ముద్ధర్తా భవితాఽభవః ॥
అస్మై పరోపకారార్థ శాపో దేయో దయావతే ।
కిమంబరీష జనుషా భూభారోఽయంహరిష్యతి ॥
ఇత్థం విచార్య దుర్వాసావాసార్థ మపనోహరేః ।
శాపం తమేవ హరయే ప్రదాస్యన్నిదమబ్రవీత్ ॥
స్థూలసూక్ష్మ నివాసోఽపి విశ్వాత్మాఽపిక్షితావజ ।
దశవారం చ మత్స్యాది రూపైరవతరిష్యసి ॥
ఇతి దుష్టాంతకః శిష్టరక్షకో మునినాఽర్పితమ్ ।
శాపం ప్రీత్యాస్వీ చకార కారణాత్మా దయాఘనః ॥
నారాయణోఽనంత రూపో భగవాన్భక్తవత్సలః ।
అస్యావతారామత్స్యాద్యా ఉక్తా భాగవతాదిషు ॥"
(గురుసంహితా- జ్ఞానకాండే- అధ్యా-III-శ్లో-70, 71, 72, 73, 74, 75, 76, 77)

గురు చరిత్రలో ఈ కథను సిద్ధుడు నామధారకునకు చెప్తాడు. ఈ కథే కాదు, గురుచరిత్ర అంతా సిద్ధనామ ధారక సంవాదరూపమే. మహాకార్య నిర్వహ

తానికి హేతుభూతాలుగా ఈ అవతారాలు వస్తూఉంటాయి. ఒక్కొక్కప్పుడు ఒక్కొక్కచోట ఇవి ప్రకటంగాను, ఇంకొక్కచోట గుప్తంగాను ఇవి ఉంటాయి. వీటిని బ్రహ్మజ్ఞానులు ఎరుగుదురు. మూఢులు తెలుసుకొనలేరు.

"క్వచిత్ప్రష్టాన్క్వచిద్గుప్తాంస్తా న్విదుర్బ్రహ్మ వాదినః।
కుతో విమూఢా జానంతి యత్ర వేదోఽపి శంకితః" ॥

నిర్గుణ బ్రహ్మవాదులైన శ్రీ శంకరులుకూడా భక్తికి సముచిత స్థానం ఇచ్చినవారే ! వారు వ్రాసిన స్తోత్రాలన్నీ జగత్ప్రసిద్ధాలుగదా ! జీవాత్మకు పరమాత్మకు పరమార్థంలో భేదం లేదనే శ్రీశంకరులు ఎంతో వినయంతో- "ప్రభూ! జీవాత్మకు పరమాత్మకు భేదంలేదని తెలిసినా, నేను నీవాణ్ణిగాని నువ్వు నావాడివి కావు. తరంగం సముద్రానికి చెందిందిగాని, సముద్రం తరంగానిది కాదుగదా !" అని వినయంతో అతి మనోహరంగా వ్రాశారు :

సత్యపి భేదాపగమే నాథ తవాహం న మామకీనస్త్వమ్।
సాముద్రోహి తరంగః క్వచన సముద్రో న తారంగః" ॥

ఈ "షట్పదీస్తోత్రం"లో భగవత్పాదులు "విష్ణువు"ను స్తోత్రం చేశారు గనుక అవతార ప్రసక్తిని తెస్తూ ఇలాఅన్నారు :

"మత్స్యాది భిరవతారై రవతారవతాఽవితాసదావసుధా ।
పరమేశ్వర పరిపాల్యో భవతా భవతాపభీతోఽహమ్" ॥

ఇదేవినయంతో కాశీపురాధీశ్వరుడైన విశ్వనాథునిగూర్చి వ్రాస్తూ శ్రీ శంకరులు ఇలా అన్నారు: "శంభూ ! నా మూడు తప్పుల్ని క్షమించు. నువ్వు సర్వగతుడవని తెలిసికూడా యాత్రార్థం కాశీ వచ్చాను. నిన్ను ధ్యానిస్తూ నువ్వు భావాతీతుడవని మరచిపోయాను. నిన్ను స్తుతిస్తూ నువ్వు వాగతీతుడవని విస్మరించాను".

"యాత్రామయా సర్వగతాహతాతే, ధ్యానేన చేతః పరతాహతాతే।
స్తుత్యానయా వాక్పరతాహతాతే, క్షంతవ్యమేతత్త్రియమేవశంభో"

నిర్గుణ బ్రహ్మవాదులు సగుణోపాసనా మార్గంలో రచనలు చేసేటప్పుడు అన్నిమూర్తులు వారికొకటే ! దేశకాల పాత్రానుసారం రచనలు సాగిస్తారు. తుంగ

భద్రాతీరస్థ అయిన శారదాంబను స్తుతించి, హరిహరదేవ మూర్తుల విషయంలో వారికున్న సమానభక్తిని ప్రకటించారు :

"కటాక్షే దయార్ద్రాం కరేజ్ఞా... ద్రామ్
కలాభిర్వినిద్రాం కలాపైః సుభద్రామ్ ।
పురస్త్రీం వినిద్రాం పురస్తుంగభద్రామ్
భజే శారదాంబాం అజస్రం మదంబామ్ ॥

అద్వైతులకు పరమాత్మను ఏ పేరుతో పిలుస్తే ఏమిటి? అందుకే అర్వాచీన కాలంలోని శ్రీ అప్పయ్య దీక్షితులు శివభక్తులైనా వరదరాజస్వామిని స్తుతించారు. శ్రీ వేదాంత దేశికుల 'యాదవాభ్యుదయ' కావ్యానికి వ్యాఖ్యవ్రాశారు. శ్రీ దీక్షితులునకు 'మా' రమణులైనా, 'ఉమా' రమణులైనా ఒక్కడే. అయినా సగుణోపాసన వచ్చినప్పుడు వ్యక్తిగతమైన ఇష్టముంటుంది. మిగిలిన దైవమూర్తులమీద ద్వేషం ఉండకూడదు. కాని, ఇతరులలో ఆ ద్వేషం కనబడినప్పుడు, దాని అసామంజస్యాన్ని వివరించి చెప్పడం జరుగుతుంది. ఈ పనినే శ్రీ అప్పయ్య దీక్షితులు చేస్తున్నప్పుడు చెప్పిన శ్లోకం ఇది :

"విష్ణుర్వా శంకరోవా శ్రుతిశిఖర విరామస్తు తాత్పర్యభూమిః
నాస్మాకం తత్రవాదః ప్రసరతి కిమపి స్పష్ట మద్వైతభాజామ్ ।
కింత్వీశ ద్వేషగాఢానల కలితహృదాం దుర్మతీనాం దురుక్తీః
భంక్తుం యత్నో మమాయం నహి భవతు తతోవిష్ణు
విద్వేషశంకా" ॥

శ్రీశంకరులనేక దేవతామూర్తులమీద స్తోత్రాలు వ్రాసినా ఆయనకు కృష్ణుడు ఇష్టదైవమని పెద్దలంటారు.

'సిద్ధాంత బిందు', 'అద్వైతసిద్ధి' మొదలైన ఉద్గ్రంథాలు వ్రాసిన నిర్గుణ బ్రహ్మవాదులైన శ్రీ మధుసూదన సరస్వతులు "కృష్ణాత్పరం కిమపితత్త్వమహం న జానే" అంటూ అతిసుందరంగా సౌందర్య సారసర్వస్వమైన శ్రీకృష్ణుని ఇలా వర్ణించారు :

"వంశీ విభూషిత కరాన్నవనీరదాభాత్
పీతాంబరాదరుణ బింబఫలాధరోష్ఠాత్ ।
పూర్ణేందు సుందర ముఖాదరవింద నేత్రాత్
కృష్ణాత్పరం కిమపి తత్త్వమహం నజానే" ॥

దీనినిబట్టి, నిర్గుణ బ్రహ్మవాదులకుకూడా రూపకల్పన ప్రసక్తి వచ్చేటప్పటికి ఇష్టానిష్ట విచికిత్స వస్తుందని తెలుస్తోంది.

మహేశ్వరునకు, జనార్దనునకు వస్తుభేదం లేదని తెలిసినా, నా భక్తి మహేశ్వరునియందే అంటూ" నవస్తు భేద ప్రతిపత్తి రస్తిమే, తథాపి భక్తిస్తరుణేందు శేఖరే" అన్నారొకరు !

శైవ సంప్రదాయంలోపుట్టి పెరిగినా "చేతో మదీయమత సీకుసుమావభాసం స్మేరాననం స్మరతి గోపవధూ కిశోరం" అంటూ తన కథనిలా వివరించారు శ్రీలీలాశుకులు (ఈయన దాక్షిణాత్యులని అందరూ అంగీకరించారు; ఆంధ్రులు కూడా కావచ్చును) తమ 'కృష్ణ కర్ణామృతం'లో :

"శైవావయం నఖలు తత్ర విచారణీయం
పంచాక్షరీ జపపరా నితరాం తథాపి ।
చేతో మదీయ మతసీ కుసుమావభాసం
స్మేరాననం స్మరతి గోపవధూ కిశోరమ్" ॥

"కర్ణామృతం" అనే పేరుమీదుగా గౌడీయ వైష్ణవులలో పవిత్రాతి పవిత్రమైన స్తోత్ర గ్రంథంగా గౌరవించబడే "కృష్ణ కర్ణామృతం", శ్రీచైతన్య మహాప్రభువులు తమ దక్షిణదేశయాత్రలో "బ్రహ్మసంహిత"తో బాటు సంపాదించి వంగదేశానికి తెచ్చారు. ఈ రెండింటిని శిరోధార్యాలుగా భావించి "తలనిడుకొని" ఆయన లేవడమేకాకుండా నాటినిగురించి ఇలా అన్నట్లుగా శ్రీకృష్ణదాస కవిరాజు తమ "చైతన్య చరితామృతం" (వంగభాష) గ్రంథంలో (మధ్యలీలా) ఇలావ్రాశారు-

"తీర్థయాత్రా కథా ప్రభు సకల కహిలా ।
కర్ణామృత బ్రహ్మసంహితా దుఇ పుంథి దిలా ॥"

"ప్రభు కహే తుమి జే ప్రేమ సిద్ధాంత కహిలే।
ఏఇ దుఇ పుస్తకే నేఇ సబ సాక్షి దిలే॥"

ప్రత్యేకంగా 'కర్ణామృతం' గురించి "కర్ణామృత సమ వస్తు నాహి త్రిభువనే" అన్నారు.

ఇలాంటి కర్ణామృతం వ్రాసిన పరమ భాగవతోత్తములైన శ్రీ లీలాశుకులు తమకు 'పరబ్రహ్మ' శ్రీరాముని రూపంలో దర్శనమిస్తే "సీతాపతీ! నీ కోదండ శరాలను దూరంగాపెట్టి, మణిచారువేణువును చేతులతో పట్టుకొని, తలమీద నెమలి పింఛంతో కనబడు; అప్పుడు నీకు నమస్కరిస్తాను" అంటారు :

"విహాయ కోదండ శరౌ ముహూర్తం
గృహాణ పాణౌ మణిచారు వేణుమ్।
మాయూర బర్హంచ నిజోత్తమాంగే
సీతాపతే త్వాం ప్రణమామి పశ్చాత్॥"

శ్రీలీలాశుకులకు కావలసినది కోదండరామ దర్శనంకాదు, ఆయన ఇష్టదైవమైన వేణుగోపాల దర్శనం।

ఈ విధంగా సగుణ బ్రహ్మవాదులైనా తమ వంశాచారానికి విరుద్ధంగా ఉన్నా భగవద్రూపకల్పన వచ్చేటప్పటికి ఇష్టా నిష్ట ప్రసక్తితెస్తారు.

"బ్రహ్మసత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నా పరః" అనే సిద్ధాంతాన్ని విశ్వసించేవారికి అవతార విషయంలో, భగవద్రూపకల్పన విషయంలో అంత గాఢాభినివేశం ఉండకపోవచ్చును గాని, వారికీ వ్యావహారిక జగత్తులో పరబ్రహ్మ రూపకల్పన చేసి చెప్పవలసి వస్తే ఆ రూపం విషయంలో ఇష్టానిష్టాలు ఉంటాయి అని చెప్పడానికి శ్రీ మధుసూదన సరస్వతుల వంటి వారు వ్రాసిన ఇష్టదేవతా స్తుతులు చాలా కనబడతాయి. లోగడ, "కృష్ణాత్పరం కిమపితత్త్వమహంనజానే" అన్న వారి శ్లోకాన్ని గ్రహించాము. నరరూపంలో అవతరించిన ఆనారాయణుడు ఆయనకు సౌందర్య సారసర్వస్వమైన నందాత్మజునిగా గోచరించాడు :

"పరాకృత నమద్బృందం, పరం బ్రహ్మనరాకృతి।
సౌందర్య సారసర్వస్వం, వందే నందాత్మజం మహః॥

"ఏకం సత్ విప్రా బహుధావదంతి", "సర్వదేవ నమస్కారః కేశవమ్ ప్రతిగచ్ఛతి" మొదలైన వాటి పరమార్థం ఒంటబట్టిన భారతీయులకు ఇలాంటి భావనలో అసామంజస్యం ఏమీ దృగ్గోచరంకాదు. ఇది ప్రసిద్ధికెక్కిన తత్త్వ వేత్తల విషయంలోనే గాక, మహాకవుల విషయంలోను కనబడుతుంది.

శ్రీ మద్భాగవతాన్ని తెలుగు చేసిన భక్తకవి పోతన, తన జీవితంలోనే దీన్ని ఉదాహరణ ప్రాయంగా చూపించాడు. పోతన "శైవశాస్త్రమహిమ" గనిన కేసనపుత్రుడు గనుక శైవ సంప్రదాయానికి చెందినవాడు; తాను రచించదలచినది "నారాయణ కథా ప్రవచనము." చేస్తున్నది "మహేశ్వర ధ్యానము", ప్రత్యక్షమై అంకితం కోరినవాడు శ్రీరామచంద్రుడు; గ్రంథాది పద్యంలోను షష్ఠ్యంతాలలోను నిర్దేశించ బడిన దైవం శ్రీ కృష్ణుడు. తనకు మహత్త్వ, కవిత్వ. పటుత్వ, సంపదలు-ఇయ్యవలసినదని "మాయమ్మ' అని పిలిచి కోరినది "ముగురమ్మల మూలపుటమ్మ" అయిన "చాల పెద్దమ్మ" దుర్గమ్మను. ఆకోరికను వ్యక్తంచేసిన శబ్దాలలోనే-విశ్వబీజమైన 'ఓం' (మహత్త్వ)ను, వాగ్భవ బీజమైన 'ఐం' (కవిత్వ)ను, మాయా భువనేశ్వరీ కాళీ బీజమైన 'హ్రీం' (పటుత్వ)ను, లక్ష్మీ బీజమైన 'శ్రీం' (సంపద)ను సంప్రదాయ సిద్ధమైన పద్ధతిలో(బీజాక్షరాలను వాచ్యం చేయకుండా) పొదిగినాడు. అంతశ్చైతన్యమైన పరతత్త్వం ఒక్కటే అనే ప్రగాఢ విశ్వాసం దీనికి పునాది.

బౌద్ధాది అవైదికమతాలలో కూడా వేదపురాణాదుల ప్రభావంవల్లగాని లేదా ఆ మతాలకు కూడా సాంస్కృతిక ఆధార భూమి ఒకటే కావడం వల్ల గాని అవతారాదులను పోలిన భావకల్పనతో కూడిన కథలు కనబడతాయి. బుద్ధుని జాతక కథల విషయం అందరికీ తెలిసినదేగదా! మహాయాన బౌద్ధం నాటికి బుద్ధుడు పురాణ హిందూ మతంలోని అవతారాలలో చేరి పోయాడు. జైనంలో కూడా తీర్థంకరుల విషయంలో జనబాహుళ్యంలో జ్ఞానావబోధ కోసం వివిధ నామరూప ధారణల వర్ణన కనబడుతుంది.

వాసుదేవునకు వామ దేవునకు "సు, మ," భేదం తప్ప "ఫల" భేదంలేదని జనానీకం విశ్వసించడమే భారతీయ సంప్రదాయంలోని విశిష్టత, ఈ సమన్వయ దృష్టి ఇంతటితో ఆగక ఇంకా ముందుకు సాగిపోయి అవైదిక మతాలను కూడా

కలుపుకొన్నది. అనడానికి విశేష ప్రచారంలో ఉన్న ఈ శ్లోకం సురుచిరోదాహరణం:

యం శైవాస్సముపాసతే శివ ఇతి బ్రహ్మేతి వేదాంతినో
బౌద్ధాబుద్ధ ఇతి ప్రమాణ పటవః కర్తేతి నైయాయికాః ।
అర్హన్నిత్యథ జైనశాసనరతాః కర్మేతి మీమాంసకాః
సోయంవో విదధాతు వాంఛిత ఫలంత్రైలోక్య నాథోహరిః ॥

ఈ సమన్వయ దృష్టి భారతీయులకు సహజమైనది. ఈ శ్లోక రచయితకు-క్రైస్తవ, ఇస్లాం మతాల విషయం కూడా తెలిసిఉంటే, వాటినీ ఏదో విధంగా దీనిలో చేర్చేవాడేమో అనిపిస్తుంది:

"యేయథామాంప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహమ్ ।
మమవర్త్మాను వర్తంతే మనుష్యాః పార్థ సర్వశః ॥" (IV-II)

అనే "గీతా" సందేశ సంప్రదాయం వాడుగదా భారతీయుడు!

శ్రీ శంకరులు బుద్ధుని మీద క్రింది శ్లోకాన్ని స్తోత్ర వరంగా రచించినట్లు చెప్పడం ఉంది:

"ధరా బద్ధ పద్మాసన స్థాంఘ్రి యష్టిః
నియమ్యా నిలం న్యస్తనాసాగ్ర దృష్టిః ।
య ఆస్తే కలే యోగినాం చక్రవర్తీ
స బుద్ధః ప్రబుద్ధోఽస్తు మచ్చిత్త వర్తీ ॥"

వాచామ గోచరుడైన పర బ్రహ్మను భక్తులు తమ కందుబాటులోనికి తెచ్చు కోవడానికి చేసే ప్రయత్నమే భగవద్రూపకల్పన

శ్రీ శంకరులు ఈ సగుణ భావాల విషయంలో చాలా ఉదారంగా విశాల సహన భావాన్ని ప్రదర్శించారు ఇందువల్ల ఈయన నిర్గుణబ్రహ్మ వాదాన్ని ఖండించిన వారందరూ ఎటూ పాలుపోక ఈయనకు బౌద్ధ దృక్పథం అంట గట్టారు. శ్రీ భాస్కరులు (9వ శతాబ్దివాడు కావచ్చును) తమ బ్రహ్మ సూత్ర భాష్యంలో ఇలా వ్రాశారు:

"విగీతం విచ్ఛిన్న మూలం మహాయానిక బౌద్ధగాథితం।
మాయా వాదం వ్యావర్ణయంతో లోకాన్ వ్యామోహయంతి" ॥

భేదమసత్యమనీ,అభేదమే సత్యమనీ వాదించు శ్రీ శంకరుల వాద మీయనకు నచ్చదు. భేదా భేదాలు రెండూ సత్యాలే అని శ్రీ భాస్కరుల వాదం. శ్రీ శంక

రులకంటె పూర్వమే భేదాభేద వాదం ప్రచారంలో ఉంది. బ్రహ్మ సూత్రాల్లోనే భేదాభేద వాదానికి నిర్దేశాలు ("ప్రతిజ్ఞాసిద్ధేర్లింగమాశ్మరథ్యః", "ఉత్క్రమిష్యత ఏవం భావాదిత్యౌడులోమిః") కనబడుతున్నాయి. శ్రీ భాస్కరుల దృష్టిలో విశ్వానికి ఉపాదాన నిమిత్త కారణాలు బ్రహ్మమే. వాసుదేవుడే ప్రపంచానికి ఉపాదాన నిమిత్త కారణాలనే పాంచరాత్రుల సిద్ధాంతంతో దీనికి ఏకీభావం ఉంది. శ్రీ భాస్కరులు ఈ సిద్ధాంతాన్ని ఖండించక దీనికి శ్రుతి ప్రసిద్ధత ఉందని వ్రాశారు. ("వాసుదేవ ఏకోపాదాన కారణం జగతో నిమిత్త కారణం చేతి మన్యంతే........ తదేతత్సర్వం శ్రుతి ప్రసిద్ధ మేవతస్మాన్నాత్ర నిరాకరణీయం పశ్యామః" ॥). విశిష్టాద్వైత వాదులయిన శ్రీ రామానుజులు పాంచ రాత్రాగమాల నుండి విశేషంగా గ్రహించకపోయినా బ్రహ్మ సూత్ర కర్త బాదరాయణుడు వాటినిఖండించలేదని నొక్కి చెప్పుతారు. శ్రీ రామానుజుల పరమగురువులైన శ్రీ యామునాచార్యులు వాటిని బహుమానించడమే కాకుండా, వాటి ప్రామాణ్యాన్ని స్థాపించే దృష్టితో ఆగమ "ప్రామాణ్య" మనే గ్రంథాన్ని వ్రాశారు, భగవంతుని కరుణ సామాన్యంగా భక్తుని పుణ్య కర్మల మీద ఆధారపడి ఉన్నా, నిర్హేతుకంగా కూడా అది ప్రసరించ వచ్చును. ఆళ్వార్లలో చాలా మంది అభిప్రాయమిదే! భగవద్రామానుజులు కూడా తమ "అష్టాదశభేద నిర్ణయం"లో-కృపా స్వరూపతో నిర్హేతుకః. రక్షణ సమయే చేతన కృత సుకృతేన సహేతుకా భూత్వా రక్షతి" అని వ్రాశారు. నిర్హేతుకంగా కూడా భగవత్కృప లభిస్తుంది. అంటే, అవతారాదులయందు భక్తిని పెంచుకొంటే హేతు వేర్పడి పరాత్పరుని కృపతత్త్వం గదా! అని భక్తుల భావన.

భారతీయ తత్త్వ విచారంలో భగవ ద్విషయకమైన నిర్గుణ సగుణ సంప్రదాయాలకు శంకర భగవత్పాదులు, భగవద్రామానుజులు ప్రముఖ ప్రతినిధులు. ఈ సంప్రదాయాలు పరస్పర విరుద్ధాలు కావనీ పరస్పర పూరకాలనీ పోషకాలనీ ఈనాటి మేధావుల దృష్టి. ఆధునిక మహాపురుషులు కూడా దీన్ని బలపర్చారనాలి. శుద్ధభక్తి, శుద్ధ జ్ఞానం ఒకటే అని శ్రీ రామకృష్ణ పరమహంస పరశ్శతంగా చెప్పేవారని తెలుస్తోంది. ఏదో ఒక సిద్ధాంతానికి ముందే కట్టుబడి చూడకుండా ఉంటే-అభేద దృష్టిని భేద దృష్టిని ద్వైత దృష్టిని వ్యక్తం చేసే శ్లోకాలు మనకు భగవద్గీతలో కనబడతాయి. వాటిని తమ సిద్ధాంత మార్గానికి మలుచుకొని అర్థం చెప్పుకోకుండా, ఈ వైవిధ్యాన్ని అంగీకరిస్తే నష్టమేమిటి? అని ఆలోచించే ఆధునిక వేత్తలు చాలామంది ఉన్నారు. భగవద్గీతలో-అభేద దృష్టి (ఏకత్వేన),

భేదదృష్టి (ద్వైతక్షేత్రేన), ద్వైత దృష్టి (అహంగా) అను త్రివిధోపాసనలు ప్రస్తుతించ బడ్డాయి అని ఈ విజ్ఞుల అభిప్రాయం. ఆయా వ్యక్తుల సంస్కార విశేషాల్ని బట్టి ఈ మూడు దృష్టులు భిన్న వ్యక్తులలో ఉండవచ్చును. ఒకే వ్యక్తిలో ఆయా సమయాలలో ఈ మూడు విధాలైన అనుభూతులు కలుగవచ్చును. శ్రీరామకృష్ణ పరమహంస ఆయా అనుభూతులను పొందినప్పుడు ఆయా వివరణ లిచ్చినట్లు ఆయన జీవిత చరిత్రవల్ల తెలుస్తోంది.

సాధారణంగా అవతార విషయంలోను, భగవంతుని విషయంలోను మనకు కలిగే సంశయాలకన్నింటికి తగిన సమాధానాలు భగవద్గీతలోని "రాజవిద్యా రాజగుహ్యయోగం" (9వ అధ్యాయం) అనే అధ్యాయంలో స్పష్టంగా నిర్ద్వంద్వంగా భగవానుడు శ్రీకృష్ణుడు ఇచ్చాడు. ఇక్కడ బ్రహ్మ విద్య శ్రేష్ఠమనే భావంతో "రాజవిద్య" అనీ అతి గుహ్యమూ అనధికారికి అగమ్యమూ అనే దృష్టితో "రాజగుహ్య" మనీ జగద్గురువైన శ్రీకృష్ణుడు ఉపదేశించాడు. అసూయారహితుడైన ("అనసూయవే") అర్జునుడు దీనికి అర్హుడని నిశ్చయించుకొని పరమేశ్వరుడు గుహ్యతమమైన విద్యను అతనికి ప్రవచించాడు. అంచింత్యమైన పరాత్పరుని ఐశ్వర్యము, అసాధారణమైన భక్తి ప్రభావం ఇందులో వర్ణితాలు. తాను భక్తానుగ్రహార్థం శుద్ధ సత్త్వమయమైన దేహాన్ని ధరిస్తున్నాననీ తమ పరమ స్వరూపాన్ని తెలుసుకొనలేని మూఢులు తన విషయంలో అవజ్ఞచూపిస్తున్నారనీ శ్రీ కృష్ణుడు అంటాడు:

"అవజానంతి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్ ।
పరం భావ మాజానంతో మమ భూత మహేశ్వరమ్॥"(IX-11)

ఆయన-నిత్య శుద్ధ బుద్ధ ముక్త స్వభావుడు; సర్వాత్మ స్వరూపుడు; సర్వేశ్వరుడు. ఆయన అధిష్ఠాత; నిమిత్త భూతుడు. అసంగుడు, నిర్వికారుడు. అధిష్ఠాతృత్వం సాన్నిధ్య మాత్రం చేత; కర్తృత్వం ఉదాసీనత్వం పరస్పర విరుద్ధాలుకావు. ఇది పరమేశ్వరునకు మాత్రమే సాధ్యం. అ ప్తకాముడైన ఆయనకు కర్మలయందు ఆసక్తిలేదు. తటస్థునిలాగ ఉన్న ఆయన్ని అవి బంధించలేవు. ఇలా ఉన్న ఆయన మానవులకు ఆశాహేతువుగా-"ఇలాగ నాలాగే ఇతరులు కూడా కర్తృత్వాభిమాన, ఫలాసక్తి శూన్యులైతే కర్మలు వారిని బంధించవు" అన్నాడు. ఇది ఆయన సందేశం.

ఆయన కలరూపు తెలిసిన మహాత్ములు ఆయనను భజిస్తున్నారు. వారు దైవీ స్వభావాన్ని ఆశ్రయించిన మహాత్ములు. అనన్య మనస్కులై ఆయన జగత్కారణుడని, నిత్యుడని తెలుసుకొన్నవారు:

"మహాత్మానస్తు మాం పార్థ దైవీ ప్రకృతిమాశ్రితాః ।
భజంత్యనన్యమనసోజ్ఞాత్వా భూతాదిమవ్యయమ్ ॥" (IX-13)

కొందరు సతతమూ ఆయాన్ని కీర్తిస్తున్నారు. దృఢ వ్రతులై ప్రయత్న శీలురై అనన్య భక్తితో నమస్కరిస్తున్నారు. సమాహిత చిత్తులై ఆ పరమేశ్వరుణ్ణి ఉపాసిస్తున్నారు:

"సతతం కీర్తయంతో మాం య తంతశ్చ దృఢవ్రతాః ।
నమస్యం తశ్చమాం భక్త్యానిత్యయుక్తా ఉపాసతే ॥" (IX-14)

మరికొందరు వాసుదేవుడే సర్వమూ అనే సర్వాత్మ దర్శన రూపమైన జ్ఞాన యజ్ఞం ద్వారా ఆయన్ని ఉపాసిస్తున్నారు. ఇంక, ఏకత్వ భావంతో-అభేద బుద్ధితో-(సోఽహమ్ భావంతో)కొందరు; పృథక్త్వభావంతో (దాసోఽహమ్ అనే భావంతో) కొందరు; విశ్వరూపుడైన ఆయనను బహుధా (బ్రహ్మరుద్రాది వివిధ రూపాలతో) మరికొందరు ఉపాసిస్తున్నారు:

"జ్ఞానయజ్ఞేన చాప్యన్యేయజంతో మాముపాసతే ।
ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతో ముఖమ్ ॥" (IX-15)

ఇన్ని విధాలుగా పరమేశ్వరుణ్ణి ధ్యానంచేస్తున్న వారున్నారే, చేయనివారున్నారే-మరి ఫలితాలు ఇయ్యడంలో ఆయనకు రాగద్వేషాలు ఉన్నాయా ? అని ప్రశ్న వస్తుంది. దానికి సమాధానంగా ఆయనే ఇలా అంటాడు :

"సమోఽహం సర్వభూతేషు, నమే ద్వేష్యోఽస్తిన ప్రియః ।
యే భజంతి తు మాం భక్త్యా మయితేషు చాప్యహమ్॥"(IX-29)

తన కందరూ సములే; అప్రియుడు ప్రియుడులేరు. కాని, నన్ను భక్తితో భజించేవారు నాలోను, నేను వారిలోను ఉంటాను అంటాడు కృష్ణపరమాత్మ. ఈ సందర్భంలో శ్రీధర స్వామి భగవంతునకు వైషమ్యం లేదంటూ చక్కని ఉదా

హరణ ఇచ్చాడు, అగ్నిని ఉపయోగించుకొనే వారికి తమశ్శీతాది జనితమైన దుఃఖం తొలగిపోతుంది. దాన్ని ఉపయోగించు కొననివారికి అదిపోదు. అదేవిధంగా, భగవంతుని సేవించేవారు తరిస్తారు. లేనివారులేదు. అగ్నికి వైషమ్యం లేనట్లే భగవంతునకు లేదు. ఇందువల్లనే ఎవరి యోగ్యతను బట్టి వారు వ్యవహరిస్తారని తెలిసిన సర్వాంతర్యామి-కర్మలయందాసక్తి కలవారికి కర్మయోగం, అంతగా అసక్తిగాని వైరాగ్యంగాని లేనివారికి భక్తియోగం, వైరాగ్య యుక్తులకు జ్ఞాన యోగం ఉపదేశించాడు. శ్రీకృష్ణపరమాత్మ శ్రీమద్భగవద్గీతలో అర్జునునకు పై యోగాలను గురించి వివరించి కర్తవ్యాన్ని బోధించినట్లే, శ్రీమద్భాగవతంలో ఏకాదశ స్కంధంలో నందనందనుడు ఉద్ధవునకు జ్ఞాన గురువై వివిధ యోగాలను గూర్చి చెప్పి సర్వ త్యాగోపదేశం చేశాడు. శ్రీమద్భాగవత శ్లోకాలను పరిశీలిస్తే వాటి ఉపదేశానికి; భగవద్గీతోపదేశానికి ఉన్న పోలికలు, సన్నిహితత్వం తెలుస్తాయి. ఉద్ధవునితో శ్రీకృష్ణుడు ఇలా అంటాడు :

"యోగాస్త్రయోమయాప్రోక్తా నృణాంశ్రేయోవిధిత్సయా ।
జ్ఞానం కర్మచ భక్తిశ్చ నోపాయోఽన్యోఽస్తికుత్రచిత్ ॥

నిర్విణ్ణానాం జ్ఞానయోగో న్యాసినామిహకర్మసు ।
తేష్వ నిర్విణ్ణ చిత్తానాం కర్మయోగస్తు కామినామ్ ॥

యదృచ్ఛయా మత్కథాదౌ జాతశ్రద్ధస్తుయః పుమాన్ ।
ననిర్విణ్ణో నాతిసక్తో భక్తి యోగోఽస్యసిద్ధిదః ॥"

(శ్రీమద్భాగవతమ్; XI స్కంధం; అధ్యా20; శ్లో-6,7,8)

ఈ త్రివిధోపాసనలకు గమ్యం ఒకటే! జీవాత్మ-దృశ్యమాన జగత్తునకు, పరమాత్మకు తనకు గల సంబంధాన్ని తెలుసుకోవడం. మహానుభావులైన త్రిమతాచార్యులు (ద్వైతా ద్వైత విశిష్టా ద్వైతా చార్యులు) వారు దర్శించిన సత్యాలను సోపపత్తికంగా వివరించారు. ఆధునికులైన శ్రీరామకృష్ణ పరమ హంస తమ సాధనానుభవం ద్వారా త్రిమతాచార్యుల నిర్ణయాలను ఉపాసనా ప్రకారాలుగా గ్రహించారు గాని, తార్కిక వాదవిషయాలుగా పరిగ్రహించలేదు. ఆయన దృష్టిలో-ఇవి పరస్పర విసంవాదాలుకాక ప్రత్యుత పరస్పర సహకారులే అవుతున్నాయి. అవతారాల విషయంలో-నిర్గుణ బ్రహ్మవాదులు కూడా-వాటి

వ్యావహారిక సత్యాన్ని అంగీకరించిన వారే. సగుణ బ్రహ్మవాదులు ఎలాగా అంగీకరిస్తారు. త్రైకాలిక అస్తిత్వమున్నది బ్రహ్మమొక్కటే అనేది అద్వైత దృష్టి.

ఇవన్నీ తెలిసినవారు పరమ సహన బుద్ధి కలవారు గనుక శ్రీశంకరులు; బ్రహ్మసూత్రాల్లోని "ఉత్తరాచ్చే దావిర్భూత స్వరూపస్తు" అనే సూత్రానికి భాష్యం వ్రాస్తూ పరబ్రహ్మతో ఏకత్వమున తప్ప జీవునకెట్టి సత్యత్వం లేదని తమ అభిప్రాయం వెలిబుచ్చారు. ఈ సందర్భంలోనే "ఇతరవాదాల వారున్నారు, వారిలో మా వారు కొందరు జీవుని స్వరూపం పారమార్థికంగా సత్యమని తలుస్తున్నారు" అని వ్రాశారు. ఇంత అత్యంత ముఖ్యమైన విషయంలో ఇతరుల అభిప్రాయాన్ని చెప్పి, వారు మా వేదాంతులే అనడంలో ఆయన ఉదారత చూడండి! ("అపరేతు వాదినః పారమార్థిక మేవ జైవం స్వరూ పమితి మన్యంతే అస్మదీయాశ్చ కే చిత్ ।")

శ్రీశంకరుల ననుసరించి, బ్రహ్మమును పరమార్థ సత్యంగా తెలుసుకోవడం మోక్షం. బ్రహ్మం స్వయం ప్రభ; స్వ ప్రకాశం, అది ఏ ఇతర చైతన్యానికి విషయంకాదు. బ్రహ్మం సకల విషయాల్ని తెలుసు కొంటున్న ద్రష్ట, శుద్ధ సంవిత్తు ఇతర పదార్థాలన్నీ దృశ్యాలు. చైతన్యానికి విషయాలు. "బ్రహ్మ భిన్నం సర్వం మిథ్యా । బ్రహ్మ భిన్నత్వాత్, శుక్తి రజతవత్।" అనాత్మ జగత్తు; అనాత్మ వస్తువు. ఆత్మ వల్లనే అర్థవంతమై, ఆత్మకు విషయ భూతం అవుతోంది. ఆత్మ లేదా చైతన్యానికి వేరుగా విషయ ప్రపంచం అసత్తు, ఆత్మ తనకోసం తానుంది(స్వార్థం),విషయ ప్రపంచం ఇంకొకరి కోసం ఉంది (పరార్థం). జగత్తు స్వయం సత్తావంతంకాదు. బ్రహ్మంనుండి జనించి బ్రహ్మంపైన ఆధారపడి ఉంది. ఆత్మ శుద్ధ చైతన్యం. అమూర్తం. నిరుపాధికం అనంతం. చైతన్య జ్యోతియే పారమార్థిక సత్యం. అది స్వయం ప్రభ. దానికి ఉదయాస్తమయాలులేవు. ("నోదేతి నాస్తమేత్యేకా సంవిదేషా స్వయం ప్రభా"-పంచదశి) జగత్తు అవిద్యవల్ల కలిగిన దృశ్యం. ఇంద్ర జాలికుడు ఇతరుల కోసం కల్పించిన మాయ వంటిది. ఇది ఇంద్ర జాలికుని బాధించనట్లే ఈ జగద్దృశ్యం బ్రహ్మాన్ని బాధించదనిశ్రీశంకరుల సూచన. బ్రహ్మాన్ని పరమార్థ సత్యంగా తెలుసుకోవడమే మోక్షం. ధ్యాన పూజా కర్మ కలాపాలు మందాధికారులకు ఉద్దేశించ బడ్డాయి. జ్ఞానం. ఇహాముత్ర ఫల భోగ విరాగులగు ఉత్తమాధికారులనుసరించుమార్గం. వేదాంత మార్గమందు నడువ

నెంచే వారికి అర్హతలు : (1) నిత్యా నిత్యవస్తు వివేకం (2) ఇహాముత్ర ఫలభోగ విరాగం (3) శమాది సాధన సంపత్తి (4) ముముక్షుత్వం. శరీరం అన్న పానాల్ని అపేక్షించినట్లు. జీవుడు ఈశ్వరుని సత్యం తెలుసుకొని అసత్యం నుండి విముక్తి పొందడానికి సహజంగానే కాంక్షిస్తాడు. ఇదే మోక్షేచ్ఛ. ఈ సాధన సంపత్తితో ఉపనిషత్తుల్ని తెలుసుకొన్నవాడు జీవాత్మ పరమాత్మల ఐక్యభావం గ్రహించి ముక్తుడవుతాడు. మాంద్యం వల్ల కలిగే సంతృప్తిని విసర్జించి నైతిక పాతిత్యాన్ని ఎదుర్కోవాలి అని శ్రీ శంకరులు మనల్ని కోరుతారు :

"యతో వినష్టి ర్మహతీ ధర్మ స్యాత్ర ప్రజాయతే।
మాంద్యం సంత్య జ్యైవాత్ర దాక్ష్య మేవ సమాశ్రయేత్॥"

కర్మ జ్ఞానాలు వేరు వేరు సాధకులకుద్దేశించ బడ్డాయి అని శ్రీ శంకరుల అభిప్రాయం. ఈ రెండింటిని కలిపి అనుష్ఠించడంలేదు:"జ్ఞానకర్మ సముచ్చయాఽభావః". ధర్మప్రోక్తమైన కర్మకలాపాల అనుష్ఠానం జన్మలకు కారణమవుతుంది. మతపరకమైన విధుల నిర్వహణ అభ్యుదయానికి దారితీస్తుంది. బ్రహ్మజ్ఞానసముపార్జనం వల్ల మోక్షం లభిస్తుంది. ("అభ్యుదయ ఫలం ధర్మజ్ఞానం తదానుష్ఠానాపేక్షం, నిశ్శ్రేయస ఫలంతు బ్రహ్మజ్ఞానం, నదానుష్ఠానాంతరాపేక్షం"॥) బ్రహ్మజ్ఞానం ఇతరమైన అనుష్ఠానాన్ని అపేక్షించదు. ముక్తి-సద్యోముక్తి, క్రమముక్తి అని రెండు విధాలు. జ్ఞానం వల్ల మొదటిది, పూజోపాసనలవల్ల రెండవది లభిస్తాయి. తాత్త్వికసిద్ధాంతం దృష్ట్యా శ్రీ శంకరులు అద్వైతులైనా; ఆయనకు భక్తియందు, ఇష్టదైవారాధనయందు విశేషంగా శ్రద్ధ ఉంది. అవతారమూర్తుల మీద ఆయన వ్రాసిన స్తోత్రాలెన్నో ఉన్నాయి. ఇవిగాక, విష్ణు సహస్ర నామ వ్యాఖ్య వ్రాసి విష్ణువును, శివానందలహరి వ్రాసి శివుని, సౌందర్యలహరి వ్రాసి జగన్మాతను సమానంగా ఆదరించి స్తుతించారు. నిర్వాణషట్కం, దశశ్లోకీ మొదలైన వేదాంతపరక (అద్వైత బోధక) స్తోత్రాలెన్నో వారివి ఉన్నాయిగదా! అవైదికమతాలైన జైన బౌద్ధాలు, నిరీశ్వర సంప్రదాయాలు ప్రచారంలో ఉన్న కాలంలో,వైదిక ధర్మోద్ధరణకోసం అవతరించిన శ్రీశంకరులు తాత్త్వికంగా నిర్గుణ బ్రహ్మవాదులైనా, సగుణోపాసనకున్న ప్రాముఖ్యాన్ని జన బాహుళ్యానికి తెలియజేయడానికి స్తోత్రరచనలు అనేకం చేశారు. వారి హృదయాన్ని తమ రచనల ద్వారా చెప్పకయే చెప్పారు. దీనికి చక్కని ఉదాహరణ, "గోవిందాష్టకం"లోని ఈ శ్లోకం.

"సత్యం జ్ఞాన మనంతం నిత్యమనాకాశం పరమాకాశం
గోష్ఠప్రాంగణ రింగణలోల మనాయాసం పరమాయాసమ్ ।

మాయాకల్పిత నానాకార మనాకారం భువనాకారం
క్ష్మానాథ మనాథం ప్రణమత గోవిందం పరమానందమ్॥

చెప్పకయే చెప్పడమంటే ఇదే ! ఈయన సంభావనలో శ్రీకృష్ణరూపంలో ఆ గోపాలుని వస్త్రాలంకారాలకు గాని,మురళికిగాని ఇక్కడ ప్రాముఖ్యం కనబడదు. శ్రీకృష్ణపరమాత్మ యథార్థరూపమైన సత్యజ్ఞానానంతా కృతికి ప్రాధాన్యం. ఇందు వల్ల లౌకికరూపానికి ప్రాముఖ్యమిస్తూ వ్రాసిన స్తోత్రాలు ఆయనవి లేవని కాదు.

అవతారాదుల యందువారికున్న శ్రద్ధా భక్తులు వీటివల్ల మనకు తెలుస్తాయి. నిర్గుణ బ్రహ్మవాదులకు కూడా అవతారాల యందున్న దృష్టిని ప్రకాశపరచడం కోసం కొంత దీర్ఘచర్చ చేయవలసి వచ్చింది. వివిధ తాత్త్వికుల మధ్య అల్పాం శాల విషయంలో అభిప్రాయ భేదాలున్నా వైదిక మతావలంబులందరూ అవతా రాల నంగీకరించిన వారే ! అందరూ ఆరాధనా స్వాతంత్ర్యాన్ని అవలంబించిన వారే ! బహుశ ప్రచారంలో ఉన్న క్రింది శ్లోకాన్ని ఈ సందర్భంలో స్మరించాలి.

"విష్ణుర్వా, త్రిపురాంతకో భవతువా, బ్రహ్మాసురేంద్రోఽ థవా
భానుర్వా, శశలక్షణోఽథ, భగవాన్ బుద్ధోఽథ, సిద్ధోఽథవా ।

రాగద్వేష విషార్తి మోహరహితః సత్త్వాను కంపోద్యతో
యస్సర్వై సహ సంస్కృతో గుణగణై స్తస్మై నమస్సర్వదా ॥

భారతదేశంలో - ముఖ్యంగా దక్షిణ భారతంలో భక్తి సంప్రదాయానికి తాత్త్విక బలాన్ని సమకూర్చిన ప్రముఖుల్లో అగ్రగణ్యులైన భగవద్రామానుజుల సిద్ధాంతాల్ని కొంతవరకు ఈ సందర్భంలో ప్రపంచించవలసిఉంది. భగవ ద్రామానుజుల బ్రహ్మసూత్రభాష్యం (శ్రీభాష్యం)ఆళ్వార్ల భక్తిమార్గంవల్ల భాగవత సిద్ధాంతాలవల్ల ప్రభావితమైంది. వేదసమ్మతమైంది. ఉపనిషత్తులలో సగుణో పాసనను ప్రత్యక్షంగా ప్రవచించినవి వీరి ముఖ్యాధారాలు. వీటిలోని సగుణతత్త్వ ప్రవంతి వీరిని విశేషంగా ఆకర్షించింది. భగవద్రామానుజులనాటికే సగుణోపాసన సుప్రతిష్ఠితమైనదనడంలో విప్రతిపత్తి ఏమీలేదు. శివశక్తిపారమ్యాన్ని ప్రబోధించే

రచనలు ఎన్నో నాటికేఉండేవి భగవద్రామానుజుల వారి పరమగురువులైన శ్రీ యామునాచార్యులు శంఠోక్తిగా సగుణోపాసన - తత్రాపి విష్ణుభక్తిని - తమ రచనలద్వారా ప్రచారంచేశారు. ఈయన ఆళ్వార్ల భక్తిభావాలకు తాత్త్విక రూప మిచ్చిన ఆచార్యులు. ఈయన తమ శిష్యులకు వైష్ణవ పంచసంస్కారాల్ని ఇచ్చే వారు. తమ "సిద్ధిత్రయం"లో ఈశ్వరునికంటె భిన్నంగా జీవుని అస్తిత్వాన్ని గురించి ప్రస్తావించారు. భగవంతుని అనుగ్రహంలేనిదే తాను నిస్సహాయుడనని ఈయన అంటారు. ప్రపత్తి ("సర్వధర్మాన్ పరిత్యజ్యమామేకం శరణంవ్రజ") సిద్ధాంతానికి మూలపురుషులు. తమ "స్తోత్రరత్నం"లో:

"నధర్మనిష్ఠోఽస్మి న చాత్మవేదీ, న భక్తిమాంస్త్వచ్చరణారవిందే।
అకించనోఽనన్యగతిఃశరణ్యే, త్వత్పాదమూలం శరణంప్రపద్యే॥"

అని వ్రాసిన అహంకార రహితులు వీరు.

భగవద్రామానుజులు - శ్రీనమ్మాళ్వార్లు, శ్రీనాథమునులు, శ్రీ యామునా చార్యులు ఆదరించిన పాంచరాత్రాన్ని గౌరవించినవారే! ఏకము సర్వాత్మకము అయిన బ్రహ్మముందని అదే పరమాత్మఅని శ్రీరామానుజులు అంగీకరిస్తారు. ఈశ్వరుడు సమస్త కల్యాణగుణ సంపన్నుడు, సర్వజ్ఞుడు, సర్వవ్యాపి. దయా సముద్రుడు, సర్వశక్తిసంపన్నుడు, హేయగుణరహితుడు. పారమార్థికసత్యంగా బ్రహ్మం-నిర్గుణం నిర్విశేషం-అనే శ్రీశంకరభగవత్పాదుల వాదాన్ని ఈయన అంగీకరించరు. సర్వవిజ్ఞానము సవిశేషవస్తువులకు సంబంధించునదే గనుక శ్రీశంక రులు ప్రతిపాదించిన నిర్విశేషసత్యాన్ని నిరూపించే సాధనంలేదని శ్రీరామానుజుల వాదం, శ్రుతివాక్యాలు, బ్రహ్మం"సదేవ(సౌమ్య)ఇదమగ్ర ఆసీదేక మేవాద్వితీయం" (ఛాందోగ్యం) అని, "సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ" (తైత్తిరీయం) అని చెప్పు తున్నాయిగాని బ్రహ్మం నిర్గుణుడని చెప్పడంలేదు; సర్వజ్ఞత్వ, సర్వశక్తిత్వ, సర్వగతత్వాద్యనేక కల్యాణగుణాలు బ్రహ్మానికిఉన్నాయి అని శ్రుతులుచెప్పుతు న్నాయిగాని నిర్గుణుడని చెప్పడంలేదని శ్రీరామానుజులవాదం. ప్రపంచానికి రెండోకారణం ఏదీలేదనే అర్థంలో బ్రహ్మం "ఏకమేవాద్వితీయం"అంటారు భగవ ద్రామానుజులు. వస్తువునకు సర్వవిజ్ఞానం ప్రసక్తమై ఉంటుంది. "భ్రాంతి" లోను సత్యాంశం ఉంటుంది. శుక్తికరజతానికి ఏదోవిధంగా పోలికఉందిగనుకనే భ్రాంతి కలుగుతోంది. ఇంద్రియాల దోషాలవల్ల మనం ఇతరగుణాల్ని గమనించడంలేదు.

శుక్తియందు రజతజ్ఞానం సత్యమే, అసత్యంకాదు. శుక్తియందున్న రజతాంశాన్ని అది తెలుపుతుంది. ప్రతివస్తువునందు దానికంటె ఇతరమైన ప్రతివస్తువుయొక్క భూత పదార్థాలుఉన్నాయి అని సిద్ధాంతం. ఏపదార్థం అధికాంశఉండే దాన్ని అనుసరించి నామం ఉంటుంది. ఒకదాన్ని శుక్తి అని ఇంకోదాన్ని రజతమని అన డానికి ఇదేకారణం. వస్తురహితమైన విజ్ఞానంలేదు. సుషుప్త్యాదులందుకూడా ఆత్మ యొక్క ప్రత్యక్షానుభవమే మనకుందిగాని, శుద్ధ చైతన్యంయొక్క నిరాకారాను భూతి మనకులేదు. సవిశేషత్వంనుండి విముక్తికూడా గుణమే అనవలసివస్తుంది. శ్రుతులు బ్రహ్మన్నిగురించి చెప్పేటప్పుడు కనబడేసత్య, చైతన్యాదులు బ్రహ్మ లక్షణాలే. శ్రుతులు నిర్విశేషమైన సత్యముందని స్థాపించవు. శ్రీరామానుజులవాదం ఈవిధంగా నడిచింది. ఈయన దృష్టిలో బ్రహ్మనికి ఈశ్వరునకు మధ్య భేదం లేదు. నారాయణుడు లేదా విష్ణువుఅని పిలువబడే ఈశ్వరుడే బ్రహ్మం. భగవ ద్రామానుజులవారి తరువాత సంప్రదాయజ్ఞులచేత అంతవారుగానే పరిగణించబడే శ్రీ వేదాంత దేశికులు.జీవులకు, మనస్సునకు, బాహ్యజగత్తునకు శాసకులనబడే, సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధులనే వాసుదేవుని మూడు కార్యరూపాల్ని పేర్కొ న్నారు. ఈ ముగ్గురూ భిన్నతత్త్వాలుకారు. ఈశ్వరుని కార్యకలాపాల్ని పురస్క రించుకొని భిన్నులుగా వ్యవహరించడం జరుగుతోంది అని వారన్నారు.

పృథివ్యాదిభూతాలు, సర్వేంద్రియాలు, సర్వాత్మలు శరీరభూతంగా అంత ర్యామి ఒకడున్నాడని శ్రుతి చెప్తోంది. బృహదారణ్యకోపనిషత్తులోని బ్రాహ్మ ణాల్ని తమ వాదానికి ఆధారంగా శ్రీరామానుజులు గ్రహించారు. దీనిలో ఏడవ బ్రాహ్మణం ప్రారంభంలో అరుణుని కుమారుడైన ఉద్దాలకుడు యాజ్ఞవల్క్యుని ప్రశ్నిస్తూ ఉంటాడు : (యాజ్ఞవల్క్యుడు జనకునిసభలో ఉన్న అందరి విద్వాంసుల కంటె తానధికుడనని చెప్పి ఆవుల్ని శిష్యులచేతతోలించు కొని పోతున్న సందర్భం.) "నేను మద్రులమధ్య పతంచల కాప్యుని ఇంట్లో యజ్ఞ సంబంధమైన క్రియా కలా పాల్ని గ్రహిస్తూ ఉన్నప్పుడు ఆ కాప్యుని భార్యను కబంధ ఆధర్వణుడనే గంధర్వుడు ఆవహించి, 'ఓ కాప్య! ఈ లోకాన్ని పరలోకాన్ని సర్వ భూతాల్ని బంధించిఉంచే సూత్రం ఏమిటో నీకు తెలుసా"? అని అడుగుతాడు. తెలియదంటే, " కాప్య! ఈ లోకాన్ని పరలోకాన్ని సర్వభూతాల్ని లోనుండి పాలించే అంత ర్యామిని గురించి తెలుసా ?" అని మళ్ళీ అడుగుతాడు. మళ్ళీ తెలియదన్నప్పుడు. "ఓ కాప్య! ఆ సూత్రాన్ని ఆ అంతర్యామిని తెలుసుకొన్నవాడు బ్రహ్మవిదుడు,

లోకవిదుడు, దేవవిదుడు, వేదవిదుడు, భూతవిదుడు. ఆత్మవిదుడు, సర్వవిదుడు, అన్నాడా గంధర్వుడు. అందరికీ చెప్పాడు. నాకూ తెలుసు, ఓ యాజ్ఞవల్క్యా! నీకు తెలుసా? నీకా సూత్రం, ఆ అంతర్యామి తెలియకపోతే, బ్రహ్మజ్ఞానం ఉన్న వాళ్ళ మాత్రమే తీసుకొనిపోదగిన ఆవుల్ని నువ్వు తీసుకొనిపోతే నీ తల పడిపో తుంది." అంటాడు ఉద్దాలకుడు. ఆ సూత్రం "నాకు తెలుసు"నని యాజ్ఞవల్క్యుడు చెప్పినా, ఆ తెలిసిందేదో చెప్పవలసిందని ఉద్దాలకుడు ఒత్తిడి చేస్తే, అది "వాయువు" అని యాజ్ఞవల్క్యుడంటాడు. ("వాయుర్వై గౌతమ తత్సూత్రమ్; వాయునావై గౌతమ సూత్రేణాయంచలోకః పరశ్చలోకః సర్వాణిచ భూతాని సం దృబ్ధాని భవంతి")ఉద్దాలకుడు ఈ సమాధానానికి తృప్తుడై ఇంక "అంతర్యామి"ని గురించి చెప్పు ("అంతర్యామిణం బ్రూహి") అంటాడు. సూత్రాన్ని గురించి చెప్పడం జరిగింది గనుక, అంతర్యామిని గురించి విపులంగా వివరించాడు యాజ్ఞ వల్క్యుడు.

"పృథివి"తో ప్రారంభించి, సర్వభూతములు అంతర్యామికి శరీర స్థానంలో ఉంటాయి అని, వాటిని అంతర్యామి శాసిస్తుందని, ఆ విషయం భూతాలకు తెలియ దని చెప్తూ యాజ్ఞవల్క్యుడు ఇలా అంటాడు :

"యః పృథివ్యాం తిష్ఠన్ పృథివ్యా అంతరః, యం పృథివీ
న వేద, యస్య పృథివీ శరీరమ్, యః పృథివీ మంతరో
యమయతి, ఏషత ఆత్మాంతర్యామ్య మృతః"

ఇదే విధంగా-ఆప, అంతరిక్ష, వాయు, దివ, ఆదిత్య, దిశ, చంద్రతారక, ఆకాశ, తమ, తేజ-అని సర్వభూతాలు చెప్పబడ్డాయి.

"యః సర్వేషు భూతేషు తిష్ఠన్ సర్వేభ్యోభూతేభ్యోఽంతరః, యం సర్వాణిభూతాని న విదుః, యస్యసర్వాణి భూతాని శరీరమ్, యఃసర్వాణి భూతాన్యంతరోయమయతి, ఏషత ఆత్మాంతర్యామ్యమృతః ఇత్యధి భూతమ్"

ఏటి తరువాత-ప్రాణ (ప్రాణ), వాక్, చక్షు, శ్రోత్ర, మనస్, త్వక్, విజ్ఞాన, రేతస్ లను గూర్చి పై విధంగానే చెప్పడం జరుగుతుంది. చివరికి అంతర్యామి వైశిష్ట్యం యాజ్ఞవల్క్యుడు ఇలా వర్ణించాడు :

"అదృష్టో ద్రష్టా, అశ్రుతః శ్రోతా, అమతో మంతా, అవిజ్ఞాతో విజ్ఞాతా; నాన్యోఽతోఽస్తి ద్రష్టా, నాన్యోఽతోఽస్తి శ్రోతా, నాన్యోఽతోఽస్తిమంతా, నాన్యోఽతోఽస్తి విజ్ఞాతా, ఏషత ఆత్మాంతర్యామ్యమృతః, అతోఽన్యదార్తమ్"॥

ఈ విధంగా వర్ణించి అంతర్యామి తప్ప మిగిలినదంతా "ఆర్తమ్' అని యాజ్ఞవల్క్యుడు చెప్పగానే ఉద్దాలకుడు మౌనం వహించాడు. (తతో హోద్దాలక అరుణి రుపరరామ."

భగవద్రామానుజుల దృష్టిలో బ్రహ్మం భిన్నంగా జీవజగత్తులు సత్యం కావు. బ్రహ్మనికి జీవజగత్తులకు ఉన్న సంబంధం శరీరానికి జీవికి లేదా గుణానికి ద్రవ్యానికి ఉన్న సంబంధం లాంటిది. అపృథక్త్వ సంబంధం. జీవుడు శరీరం, గుణము ద్రవ్యము పరస్పర భిన్నాలైనా అవి అవినాభావ సంబంధంతో ఒక పూర్ణ వస్తుత్వాన్ని పొందుతున్నాయి. జీవజగత్తులకు బ్రహ్మనికి ఉన్న సంబంధం ఇలాంటి సంబంధమే! స్వవ్యతిరిక్త చేతనా చేతన పదార్థజాత మంతా తనకు శరీరంకాగా, పరాత్పరుడు మాత్రం నిరుపాధికుడు. శారీరాత్మ.

("ఏవంచ స్వవ్యతిరిక్త చేతనా చేతన వస్తుజాతం స్వశరీరమితి స ఏవ నిరుపాధికః, శారీర ఆత్మా। అత ఏ వేదం పరంబ్రహ్మాధి కృత్య ప్రవృత్తంశాస్త్రం శారీరక మిత్యభియుక్తై రభిదీయతే"॥శ్రీరామానుజులు)

ఇందుకే ఈ శాస్త్రాన్ని, "శారీరక" శాస్త్రమన్నారు. చిత్తు, అచిత్తు ఈశ్వరుని దేహం, ("ఈశ్వరశ్చిద చిచ్చేతి పదార్థ త్రితయం హరిః॥).

నానాత్వ భూతపదార్థాలు, వివిధ వికారాలతో ప్రకృతి, వివిధ వర్గాలకు పరిణామదశలకు చెందిన జీవాత్మలు బ్రహ్మం యొక్క అవయవాలు. ఇవన్నీ అంతర్యామియైన ఈశ్వరుని మీద ఆధారపడి ఉంటాయి. అయినా వాటికి అనాది నుండి ప్రత్యేకమైన స్థితి (ఉనికి) ఉంది. అవి ఎప్పుడూ బ్రహ్మంలో పూర్ణంగా లయంకావు. ఇది విశిష్టాద్వైతంలోని విశిష్టత. కల్పాంతాన్ని వచ్చే ప్రళయావస్థలో, బ్రహ్మంకారణావస్థలో ఉన్నప్పుడు, నామరూప భేదాలు అన్నీ నశించినా, ప్రకృతి అవ్యక్తంగా ఉన్నా, జీవులకు దేహసంబంధం లేకున్నా; జీవప్రకృతులు

బ్రహ్మంలో బీజావస్థలో ఉంటాయి అని సిద్ధాంతం. ఈశ్వరుని ఇచ్ఛాశక్తివల్ల ప్రళయానంతరం మళ్ళీ సృష్టి జరుగుతుంది. అవ్యక్త ప్రకృతి స్థూలమై ఇంద్రియ గోచరమవుతుంది. బ్రహ్మం కార్యావస్థలో ఉండడం జరుగుతుంది. జీవాత్మ చైతన్యంలాగే స్వప్రకాశం కావడంవల్ల దీన్ని జ్ఞానమని చైతన్యమని అనడం ఉంది. జ్ఞానం స్వయంగా నిరుపాధికమైనా సంకోచాన్ని వికాసాన్ని పొందగలదు. ("స్వయమపరిచ్ఛిన్నమేవ జ్ఞానం"; "సంకోచవికాసార్హం")

స్వయంగా శుద్ధమైన ఆత్మ, అచిత్పదార్థంతో సంయోగంవల్ల అజ్ఞానం, కామాదివికారాలకు లోను కావడం జరుగుతుంది.

అచిత్తుతో సంయోగ విచ్ఛిత్తికాగానే అవిద్యా విముక్తుడై జీవుడు మోక్షాన్ని పొందుతున్నాడు.

బంధవిముక్తుడైన జీవుడు విశిష్ట వ్యక్తిత్వంతో లేకపోతే, బంధవిముక్తికి అర్థంగాని బంధవిముక్తిలో ఆకర్షణ గాని ఉండదని శ్రీ యామునాచార్యుల భావం. "తత్", "త్వం" అనే రెండు మాటలు తమ విశిష్ట లక్షణాల్ని పోగొట్టుకో కుండ ఏకత్వాన్ని పొందడమే "తత్త్వమసి" వాక్యార్థమని భగవద్రామానుజుల వివరణ. పరమేశ్వరానుగ్రహం పొందిన భక్తులు మోక్షాన్ని పొందినప్పుడు దేవయానం ద్వారా బ్రహ్మలోకం చేరి పునరావృత్తిరహిత ఆనంద స్థితిలో ఉంటారు. జీవాత్మ నిత్యమనీ మోక్షావస్థలో కూడా తనవిశిష్ట వ్యక్తిత్వాన్ని పోగొట్టుకోదని శ్రీరామానుజుల అభిప్రాయం. కుండ కారణ ద్రవ్యమైన మట్టిలో కలిసి పోయినట్లు, జీవుడు తన వ్యక్తిత్వం నశించి పరమాత్మలో కలిసిపోవడమనే మోక్షం శ్రీ భగవద్రామానుజుల మతంకాదు. ఇదే మంత గొప్ప పురుషార్థం? అని భగవద్రామానుజుల భావం. కైవల్యం తక్కువ స్థాయికి చెందిన మోక్షమని వీరిభావం, భక్తి ద్వారానే మోక్షం రావాలి, భక్తి పరమశరణాగతి. జ్ఞాన కర్మలు రెండూ కలిసి పనిచేసి మానవుని చిత్త శుద్ధికి సహకరించి చిత్తాన్ని భక్తి కోసం సిద్ధంచేసి ఉంచుతాయి. శ్రీ రామానుజుల ననుసరించి భక్తియే మోక్ష సాధనం. కేవలం జ్ఞానంవల్ల-భక్తి లేకుండ-ఏమీ లాభం లేదని వీరి మతం.

# భక్తి ప్రపత్తులు : శరణాగతి

పరమేశ్వరుణ్ణి చేరుకోవడం విషయంలో మనపెద్దలు - కర్మయోగం, ధ్యానయోగం, జ్ఞానయోగం, భక్తియోగం అనే మార్గాలను సూచించారు. ఈసాధనా మార్గాలలో సులభమైనది. సర్వులకు అందుబాటులో ఉన్నది భక్తిమార్గం అని ఇంచుమించుగా అందరూ అంగీకరించారు. కర్మ, ధ్యాన, జ్ఞానయోగాలకు క్రమంగా జైమిని, పతంజలి, వ్యాసుడు సూత్రకర్తలు కాగా, భక్తియోగానికి నారదుని సూత్రాలు ఆలంబనంగా ఉన్నాయి. శ్రీమద్భాగవతంలో భగవంతుడే భక్తియోగ వైశిష్ట్యాన్ని వివరించాడు. కేవలం భక్తివల్లనే వైకుంఠాన్ని పొందవచ్చునని భగవద్వాక్యంగా వ్యాసుడు వ్రాశాడు:

"యత్కర్మ భిర్యత్తపసాజ్ఞాన వైరాగ్యతశ్చయత్
యాగేన దాన ధర్మేణ శ్రేయోభిరితరైరపి
సర్వం మద్భక్తియోగేన మద్భక్తోలభతేఽంజసా
స్వర్గాపవర్గం మద్ధామ కథంచిద్యదివాంఛతి")
(శ్రీమద్భాగవతం ఏకాదశస్కందం-అధ్యా XX శ్లో-33, 34)

భాగవతం సూచించిన నవవిధ భక్తులు శ్రవణం, కీర్తనం, స్మరణం, పాద సేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం కాక, నారదుడు– గుణమాహాత్మ్యాసక్తి, రూపాసక్తి, పూజాసక్తి, స్మరణాసక్తి, దాస్యాసక్తి, సఖ్యాసక్తి, వాత్సల్యాసక్తి, కాంతాసక్తి, ఆత్మనివేదనాసక్తి, తన్మయతాసక్తి, పరమ విరహాసక్తి అనే ఏకాదశ భక్తిమార్గాలను పేర్కొన్నాడు. శ్రవణకీర్తనాలను గుణ మహాత్మ్యాసక్తిలో, వందన పాదసేవనాలను దాస్యాసక్తిలో కలిపి వేశాడు. ఇంక విశేషంగా చెప్పిన - రూపాసక్తి, వాత్సల్యాసక్తి, కాంతాసక్తి, తన్మయతాసక్తి, పరమ విరహాసక్తి, మిగిలి ఉన్నాయి. ఇంక పూజాదులపై అనురాగం భక్తి అని వ్యాసుడు; భగవత్కథా విషయాలపై అనురాగం భక్తి అని గర్గుడు; ఆత్మా నందానికి అవరోధం కలగక పోవడమే భక్తి అని శాండిల్యుడు చెప్పారు. భగ వత్పదార్థాన్ని చేతనైనంత వరకు వివిధరీతులలో ఆస్వాదించడమే ఈ చెప్పిన మార్గాలన్నీ !

గుణోపాధుల భేదాన్ని బట్టి భక్తిని నారదుడు సాత్త్విక, రాజస, తామస భక్తులుగా విభజించాడు. ఈ విభజన గుణత్రయ విభాగాన్ని బట్టి జరిగిందని సులభంగానే గ్రహించవచ్చును. ("సత్త్వం రజస్తమ ఇతిగుణాః ప్రకృతి సంభవాః") ఇవి వ్యక్తుల ప్రవృత్తులను తెలుపుతాయి. శ్రీమద్భాగవతం "శుద్ధ సాత్త్వికభక్తి" అని ఇంకో భేదంకూడా చెప్పింది ఇదే విధంగా సగుణ నిర్గుణాలుగా ఉపాసనా భేదాల్ని బట్టి భక్తిని విభజించవచ్చును. పరమాత్మకు మనం కల్పించుకొన్న మూర్తామూర్తరూపాలనుబట్టి ఈ భేదాలువస్తాయి. అనగా సాకార నిరాకార విధానాలన్నమాట. సాకారపూజరావడంతో భక్తుని ప్రకృతి ప్రవృత్తులమీద ఆధారపడిన ఇష్టానిష్ట ప్రసక్తి వస్తుంది. శైవవైష్ణవ శాక్తాది భేదాలకుకూడా స్థానం లభిస్తుంది. అయితే, అవతారాలెత్తడం విషయంలో "స్థితి"కి హేతువైన విష్ణుమూర్తికి విశిష్ట స్థానం ఉన్నదిగనుక, భక్తులు అర్చించుకోవడానికి వీలుగా అర్చామూర్తులు వెలసి ఉన్నాయి గనుక, ఆయన "విభవ" రూపాలే అవతారాలు గనుక వీటికి ప్రత్యేకత వచ్చింది. పరబ్రహ్మ స్వరూపం- పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చావతార రూపాలుగా భాసించడం తెలిసినదే.

("పరమ వ్యూహ విభవాంతర్యామ్యర్చ్య భేదతః ।
సోవతీర్ణః పంచధా చ తథా ప్రకృతి కాలయోః")

పరాత్పరుడైన శ్రీమన్నారాయణుని (వాసుదేవుని) విభవ ప్రకటనయే దశావతారాలు. లోకోద్ధరణ, దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మస్థాపన వాటికృత్యాలు:

"వేదాన్వేషణ మందరాద్రి భరణక్ష్మోద్ధారణ ప్రశిత
ప్రహ్లాదావన భూమిభిక్షణ జగద్విక్రాంతయో యాత్క్రియాః
దుష్టక్షత్ర నిబర్హణం దశముఖాద్యున్మూలనం కర్షణం
కాళింద్యా అతిపాపకంసని ధనంయత్క్రీడితం తన్నుమః॥

ఈ అవతారాలు పరమేశ్వరుని స్వేచ్ఛాను సారం గ్రహించబడినవి. మాయకు వశీభూతుడైనట్లు కనబడుతూ ఈశ్వరుడు అవతార గ్రహణం చేయడం అద్వైతులు కూడా అంగీకరిస్తారు,

భనభక్తులు తేన్నర్చించుకోవడానికి వీలుగా ఏర్పడిన అర్చామూర్తుల వివరణ ఇలా ఉంది:

"శ్రీరంగస్థల వేంకటాద్రి కరిగిర్యాదౌ శతేఽష్టోత్తరే
స్థానే గ్రామనికేతనేషు చసదా సాన్నిధ్య మాసేదుషే।
అర్చారూపిణి మర్చికాభిమతి తస్స్వీకుర్వతే విగ్రహం
పూజాం చాఖిల వాంఛితాన్ వితరతే శ్రీశాయ తస్మైనమః॥"

ఉపాసనా సౌకర్యార్థం అద్వైతులు కూడా అర్చావతారాలను అంగీకరిస్తారు. ఏతత్పూజాఫలం చిత్తశుద్ధి, జ్ఞానశక్తి మొదలైనవని వారిభావన. విశిష్టాద్వైతులు అర్చా విధానానికి విశేష ప్రాముఖ్యం ఇచ్చారు. వైఖాన సాగమాలు అర్చా మూర్తికి (విగ్రహానికి) ఇచ్చిన ప్రాముఖ్యం, ఇంత అని వివరించలేనంత ఉంది:

"సాకారం చ నిరాకారం భవత్యారా ధనం ద్విధా।
ప్రతిమారాధనం శ్రేష్ఠం సాకారమభి ధీయతే॥"
"విశేష భక్తిహేతుత్వాత్ ప్రతిమారాధనం పరమ్।
"యజ్ఞేష్వేతేషు విధివద్ బేరపూజా విశిష్యతే।
"యజమానే మృతేఽప్యేషా శాశ్వతం భువితిష్ఠతి॥"
"తదర్చనం ద్విధాప్రోక్తం-అమూర్తం చ సమూర్తకమ్।
అగ్నౌహుతమ మూర్తం స్యాత్ సమూర్తం బేరపూజనమ్॥"
"అమూర్తం యజమానస్య హ్యభావే చ వినశ్యతి।
అవిచ్ఛిన్నం శాశ్వతం నిత్యం ప్రతిమారాధనం పరమ్॥"
"మానసీ హోమ పూజేతి బేరపూజేతి సాత్రిధా।"
"చక్షుషః ప్రీతికరణాన్మనసో హృదయస్యచ।
ప్రీత్యా సంజాయతే భక్తిః భక్తస్య సులభోహరిః।
"తస్మాత్ త్రయాణామేతేషాం బేరపూజా విశిష్యతే॥"

(భృగువు-ఖిలాధికార, యజ్ఞాధికార, క్రియాధికారాల నుండి గృహీతాలు-వైఖానసాగమము, తిరుమల-తిరుపతి దేవస్థానాల ప్రచురణ-1998)

భగవంతుడు భక్తానుగ్రహార్థం భక్తుల అభీష్టానుసారం నామరూపాలను గ్రహించి కొన్ని దివ్యక్షేత్రాలలో స్వయం వ్యక్తమూర్తిగా, ఇతర పుణ్య క్షేత్రా

లలో దేవర్షి మానవ ప్రతిష్ఠితమూర్తిగా దర్శన మిస్తారు. ఈ సుదర్శనమూర్తి అర్చామూర్తి.

ఈమూర్తులతో నిమిత్తం లేకుండా బ్రహ్మాండ మంతా సకల భూతాలలోపల వ్యాపించి ఉండి, సకల ప్రవృత్తులకు నియామకుడై, యోగి హృద్ధ్యాన గమ్యుడై ఉండే భగవానుడు అంతర్యామి. ఈయన "అణోరణీయాన్ మహతో మహీయన్" అన్నమాట.

ఈయన వర్ణన ఇది :

"యోదేవాది చతుర్విధేషు జనిషు బ్రహ్మాండకోశాంతరే
సంభక్తేషు చరాచరేషు చవిశన్ ఆస్తే సదాంతర్బహిః ।
విష్ణుస్తం నిఖిలేష్వణుష్వణుతరం భూ యాస్సుభూయస్తరం
స్వాంగుష్ఠ ప్రమితంచ యోగిహృదయేష్వాసీనమీశం భజే ॥

పరమేశ్వరుడు సకల జీవుల హృదయ స్థితుడైనను తద్గత దోషాలు ఆయన్ని అంటవు యోగులకు దర్శనీయుడు. ఈ అంతర్యామిని అంగీకరించడం విషయంలోను అద్వైతులకు ఏ విధమైన ఆక్షేపణ లేదు.

భగవచ్ఛాస్త్రంలో భక్తిని*. సాధనభక్తి సాధ్యభక్తి అనివ్యవహరించి ఈ విధంగా వివరించడం జరిగింది:

---

*భక్తి శబ్దం "భజ-సేవాయాం" అనే ధాతునిష్పన్నం, ఇది భ్వాదులలో చేరిన ఉభయపది, దీని వివిధ రూపాలు ఇవి: భజతి-భజతే; బభాజ; భేజే; భక్తా; భక్ష్యతి-భక్ష్యతే; అభక్ష్యత్-అభక్ష్యత; అభాక్షీత్; అభక్త; భజ్యాత్; భక్షీష్ట; విభక్షతి-విభక్షతే; భజ్యతే; అభాజి. భాజయతి-భాజయతే: అబీభజత్-అబీభజత; భక్త; భక్త్వా, భక్తుమ్॥

ఉభయపది (ఆత్మనే పద, పరస్మై పదాలు) అయిన ఈధాతువునకు సేవ చేయడం. ఆత్మసమర్పణం మొదలైనవి సామాన్యార్థాలు. కొందరు నిఘంటుకారులు- సేవా, భక్తిః, ఉపాస్తిః. అనే వాటిని సమానార్థకాలుగా చూపించారు. విధికూడా "ఉపాస్య", "భజస్వ" అంటోంది.

"సాధనం భగవత్ప్రాప్తౌ స ఏవేతి స్థిరామతిః ।
సాధ్య భక్తిః స్మృతా చైవ ప్రపత్తిరితి గీయతే ॥"

కర్మాది మార్గాలు సాధనభక్తిలోనికి చేరుతాయని ప్రపత్తి మాత్రం సాధ్య భక్తిగా ఫలమిస్తుందని పెద్దల నిర్ణయం. సమస్తోపాయాలను విడిచి. "నేను నీ వాణ్ణి, నన్ను రక్షించు "అని భగవంతుని "కాళ్ళమీదపడడం" సాధ్యభక్తి. ఇదే ప్రపత్తి, శరణాగతి. దీనికి సిద్ధ భక్తి అని కూడా పేరుంది. సిద్ధోపాయమైన ప్రపత్తికి-న్యాసం, భరన్యాసం అనే పేర్లు కూడా ఉన్నాయి. ఇవన్ని ఇంచు మించుగా సమానార్థకాలే అనవచ్చును. అర్వాచీనకాలంతో వచ్చిన తెంగల వడగల సంప్రదాయాలవారు వీటిలో అర్థభేదాలను చూపిస్తారు గాని పారమార్థికంగా-భావంలోగాని, లక్ష్యంలోగాని-వస్తువును మార్చివేసేటంతగా భేదంలేదంటే సత్య దూరంకాదు అనడంలో విప్రతిపత్తి ఉండరాదు.

---

ఆత్మనేపద, పరస్మై పద నామాలు సార్థకాలు, ధాతు బోధిత ఫలం కర్తకు చెందితే అది ఆత్మనేపదం; ఇతరునకు (పరునకు) చెందితే అది పరస్మై పదం. సంస్కృతంలో కొన్ని ధాతువులు నియతంగా ఆత్మనే పదులు; కొన్ని పరస్మైపదులు. కాని, ఈధాతువుల విషయంలో పూర్తిగా ఈనియమం పాటించడం శక్యంకాదు. ఉదాహరణగా- "ఖాదృ భక్షణే" అనుధాతువును గ్రహించ వచ్చును. ఇది నిత్యం పరస్మైపది ధాతువుగా ప్రయోగంలో ఉంది. కాని, భుజించడం వల్ల వచ్చే తృప్తి రూపమైన ఫలం కర్తకే చెందుతుందికాని, పరునకుకాదుగదా ! దీనిని బట్టి,కాలక్రమాన్ని ప్రయోగాలలో ధాతుబోధిత ఫలం (కర్తకుగాని, పరునకుగాని) చెందడాన్ని మానదండగా గ్రహించడంలో సడలింపువచ్చి చేరిందని భావించడం తప్పుకాదు. కలగాపులగంగా ప్రయోగాలు కనబడుతున్నాయి.

ఉభయ పదులలో అర్థాను సారంగా (ధాతుబోధిత ఫలం చెందడం విష యంలో) ధాతువును ఆత్మనే పదంగాగాని, పరస్మై పదంగా గాని ప్రయోగించ డానికి మార్గ దర్శకాలుగా సంస్కృత వ్యాకరణంలో చాలా సూత్రాలున్నాయి. "స్వరితేత్"లు, "ఞిత్"లు అయిన ధాతువులు ఉభయ పదులు గనుక వీటిని అర్థాను సారంగా ఆత్మనేపద పరస్మై పదాలుగా ప్రయోగించవచ్చును, "స్వరిత ఞితః కర్త్రభిప్రాయే క్రియాఫలే-పాణిని I.3.72; స్వరితేతో ఞి తశ్చధాతో

ప్రపత్తిలక్షణాని "భగవత్ప్రవృత్తి విరోధి స్వప్రవృత్తి నివృత్తిః ప్రపత్తిః" అని వివరించారు. ప్రపత్తి అనే శబ్దానికి ''ప్రకృష్టం యథాతథాపద్యతే ఇతి ప్రపత్తిః అని విగ్రహం. దీనికి దృఢంగా పట్టుకోవడం అని అర్థం చెప్పుకోవచ్చు. భగవంతుని చరణారవిందాలనే "గతి" అని గట్టిగా పట్టుకోవడం అన్నమాట. అవే రక్షకాలు అనే దృష్టితో భగవంతుని మీద అధ్యవసాయమైన బుద్ధి ఉండడం; నిరంతరాయంగా ప్రవాహరూపంలో ఉండే ప్రపత్తి అని ఫలితం తేలుతుంది. ఈ బుద్ధి త్రికరణ శుద్ధిగా ఉండగా-మానసికమైనది కాయిక, వాచికాల కంటె ఉత్తమమైనదని నిర్ణయం. ఈ ప్రపత్తినికూడా వ్యక్తి చర్యలనుబట్టి-నామమాత్ర ప్రపత్తి, సాంగ సంపూర్ణ ప్రపత్తి అని రెండు విధాలుగా భావించారు. మనలో చాలా మందిది నామమాత్ర ప్రపత్తి. మనకు ఎదుర్కొవడానికి సాధ్యం కాని సంకట పరిస్థితులు ఎదురైతే ప్రపత్తిమార్గం అవలంబిస్తాము! ఇది నామమాత్రమే అని సులభంగానే తెలిసిపోతుంది.

సాంగ సంపూర్ణ ప్రపత్తి ఇలాంటిదికాదు. ఇది శాస్త్ర జ్ఞానంవల్ల, ఆచార్యుని శిక్షణవల్ల లభిస్తుంది. కర్మాదిమార్గాలలో ఏమార్గం అనుసరించినా మోక్షార్థి భగవత్కటాక్షం కోసం నిరీక్షించవలసిందే. ఈ పరిస్థితులలో, ఆయన్నే ఆశ్రయించి ''నీవే ఉపాయ భూతుడవు" అని శరణు వేడడం సమంజసం గదా! ఈ శరణు వేడడమే సాంగ సంపూర్ణ ప్రపత్తి-శరణాగతి-అవుతుంది.

శరణాగతికి విగ్రహం "శరణం యథాతథా ఆగతిః శరణాగతిః", శరణ శబ్దానికి గృహం, రక్షకుడు అనే అర్థాలను నిఘంటువు లిస్తున్నాయి. ఇది "శ్రా హింసాయాం" 'అనేధాతువు నుండి పుట్టింది. శరణశబ్దం హింస నుండి రక్షణ కల్పించే

---

రాత్మనే పదం స్యాత్ ః కర్తృగామిని క్రియాఫలే ః" ఇత్సంజ్ఞకమైన స్వరితం ఉన్నటువంటి, ఇత్సంజ్ఞకమైన ఞ కారం ఉన్నటువంటి ధాతువునకు క్రియాఫలం కర్తకు చెందితే ఆత్మనే పద ప్రత్యయాలు వస్తాయి.

"యజదేవ పూజా సఙ్గతి కరణదానేషు'" (యజ ధాతువునకు దేవపూజ చేయడం, కలపడం, ఇయ్యడం. అనే అర్థాలు). "యజ" ధాతువులో ఉన్న జకారోత్తరవర్తి అయిన "అకారం" స్వరితం, ఇత్సంజ్ఞకం. "డుకృఞ్ కరణే'' అను ధాతువులోని "ఞ" కారం ఇత్సంజ్ఞకం, ఇలాంటి ధాతువులు-క్రియాఫలం

దిగాతేలింది. గృహం సామాన్య కష్టాలనుండి, దుఃఖాలనుండి రక్షణ కల్పిస్తుంది నిజమే! కాని జనన మరణాదికాన్ని అది అరికట్టలేదు. ఆ దుఃఖాల్ని అరికట్టేది భగవంతుని శరణు పొందడం. సర్వాపదలనుండి రక్షణ కల్పించేవాడు భగవానుడు గనుక ఆయన్ని శరణు పొందడం శరణాగతి అవుతుంది. అహిర్బుధ్న్య సంహిత (పాంచరాత్ర సంహిత) శరణ శబ్దార్థాన్ని విపులీకరించింది :

"ఉపాయే గృహరక్షిత్రోః శబ్దః శరణమిత్యయం ।
వర్తతే సాంప్రతం చైష ఉపాయార్థైక వాచకః ॥"

ఈ విపులీకరణం వల్ల శరణ శబ్దానికి ఉపాయార్థం వచ్చింది. శరణాగతిలో ఈ ఉపాయార్థాన్నే ప్రధానంగా గ్రహించాలని శ్రీవైష్ణవుల సిద్ధాంతం. భక్తుని పరమపదానికి చేర్చే ఒకేఒక ఉపాయం భగవంతుని శరణాగతి. ఆయన ఒక్కడే సాధనం. సాధనాంతరం లేదని భావం. ఈ సంహితలోనే ఇంకా స్పష్టంగా శరణాగతిని గూర్చి ఇలా ఉంది:

"అహమస్మ్య పరాధానామాలయోఽకించనోఽగతిః
త్వమేవోపాయ భూతో మే భవేతి ప్రార్థనామతిః
శరణాగతిరిత్యుక్తా సాదేవేఽ స్మిన్ప్రయుజ్యతామ్" ॥

భక్తుడు తానపరాధినని ఉపాయాంతరం లేనివాడనని, నీవే ఉపాయ భూతుడవని భగవంతుని శరణు వేడడమే శరణాగతి. ఇందులో ఆత్మార్పణం పరిపూర్ణంగా ఉంటుంది.

---

కర్తకు చెందేటప్పుడు ఆత్మనేపదంలో ప్రయోగించబడతాయి. పరునకు చెందేటప్పుడు పరస్మైపదంలో ప్రయోగించబడతాయి.

"భజ" ధాతువు ఉభయ పది అయినా- సాధారణంగా ఆత్మనే పదంగానే విశేషంగా వాడడం కనబడుతోందని కొన్ని నిఘంటువులు (ఆప్టే) సూచించాయి.

"భజ" ధాతువు ఉభయపదిగనుక, దీనిని ఆత్మనేపదంగా ప్రయోగంలో గ్రహిస్తే జ్ఞానార్థకమై నిర్గుణోపాసనను సూచిస్తుందని, పరస్మైపదంగా ప్రయోగంలో గ్రహిస్తే సగుణోపాసనను సూచిస్తుందని చెప్పి ఉభయ పది సార్థక్యాన్ని వివరించేవారు కొందరున్నారు !

శరణాగతిని వివరిస్తూ దానికి వివిధాంగాలున్నాయి అన్నారు. ప్రధానమైన ఆత్మనిక్షేపానికి న్యాసం అనే మాట న్యాసదశకంలో వాడడం జరిగింది:

"నిక్షేపాపరపర్యాయః న్యాసః పంచాంగ సంయుతః ।
సన్న్యాస స్త్యాగ ఇత్యుక్తః శరణాగతి రిత్యపి ॥"

దీనికి త్యాగం అనేపేరు కూడా ఉంది. సర్వసంగ పరిత్యాగ పూర్వకమైన శరణాగతియే న్యాసం. బ్రహ్మవేత్తలు మానసయజ్ఞాన్నే న్యాస విద్య అనడం ఉంది:

"తమేతంవై బ్రహ్మవిదోన్యాసం ప్రాహుర్మహాయశాః ।
స చ సర్వత్యాగపూర్వా భగవచ్ఛరణాగతిః ॥
(ప్రపత్తి రూపమీమాంస)

శరణా గతిలో వివరించబడిన ఆత్మ నిక్షేపానికే భరన్యాసం అనే పేరు ఉంది. శ్రీ వేదాంత దేశికులవారి "న్యాస దశకమ్"లో "ఆత్మాత్మీయ భరన్యాసో హ్యాత్మ నిక్షేప ఉచ్యతే" అని ఉంది. దీనిని బట్టి - శరణాగతి, ప్రపత్తి, న్యాసం, న్యాసవిద్య, మానసయజ్ఞం, ఆత్మనిక్షేపం, భరన్యాసం - అనేవి సమానార్థకాలుగా ప్రయోగించబడ్డాయి అనవచ్చును.

శరణాగతియొక్క వైశిష్ట్యాన్ని గురించి విన్నవారు, దీన్ని కాంక్షించే ప్రపన్నులు ఏ విధంగా మెలగాలో, ఏయే నియమాలు పాటించాలో తెలుసుకోక-లేదా తమకున్న చెడ్డ అలవాటుల్ని మానుకోలేక - "అన్నింటికి నువ్వే" అనే పద్ధతిలో తమ చెడ్డ నడవడిని మార్చుకోకుండా, భగవంతుని శరణువేడితే చాలును అనుకోవడం ఉంది. కాని "ప్రపన్న ధర్మసార సముచ్చయం" నిజమైన ప్రపన్నుని కర్తవ్యాన్ని గురించి చెప్పింది. ప్రపన్నుడు మహాభాగవతుడు కావాలి. కర్మ, జ్ఞానాదులు పరమేశ్వరుని ఆజ్ఞా రూపాలు కాబట్టి వాటిని యథావిధిగా ఆచరిస్తూ ఆచార్యాభిమానం పొంది ఉండాలి. అప్పుడు అతడే నిజమైన ప్రపన్నుడు, మహాభాగవతుడు, ఏకాంతి :

ప్రీత్యర్థం వాసుదేవస్య కర్మజ్ఞానాదికం నరః ।
సవిప్రః పరమైకాంతీ మహాభాగవతః స్మృతః ॥"

ఈ మహాభాగవతుడు తానుగా పరమ పురుష ప్రాప్తికి చేసే సకల ప్రయత్నాలను విరమించుకొని. వెనుక పేర్కొన్న భగవంతుని ఆజ్ఞా రూపా

లైన వాటిని చేయడం తప్ప - ఆయనమీదే భారం ఉంచి నిర్భరుడై ఉన్నప్పుడే శరణాగతి ప్రవత్తిని సాధించిన వాడనిపించుకొంటాడు. ప్రపత్తి ఆరు అంగాల ద్వారా పరిపుష్టి చెందుతుంది:

"ఆనుకూల్యస్య సంకల్పః ప్రాతి కూల్యస్య వర్జనం
రక్షిష్య తీతి విశ్వాసో, గో ప్తృత్వ వరణం తథా
ఆత్మనిక్షేపకార్పణ్యే షడ్విధాశ్శరణా గతిః'' (లక్ష్మీతంత్రమ్)

ఈ షడంగాలు ఇవి :

(1) ఆనుకూల్య సంకల్పం: చరాచర జగత్తునంతా భగవద్రూపంగా భావిస్తూ, శత్రుమిత్ర భేదం లేకుండా, నిత్యనైమిత్తిక కర్మలు చేస్తూ భగవత్సేవ కుచిత మైన సద్బుద్ధి కలిగి ఉండడం. ఆ లక్ష్మీ తంత్రంలోనే ఇలా ఉంది:

"ఆనుకూల్యమితి ప్రోక్తం సర్వ భూతానుకూలతా ।
మయి సర్వేషు భూతేషు హ్యానుకూల్యం సమాచరేత్॥''

(2) ప్రాతికూల్య వర్జనం : భగవంతుని నుండి తనను (భక్తుని) దూరం చేసే వాటిని విసర్జించాలి. వీటిలో ఇతరులు తన విషయంలో ప్రతికూలంగా ఉండడం, తన సహజాత గుణాలు తనకు ప్రతికూలంగా ఉండడం ఉంటాయి. ఈ రెండింటివల్ల బాధింపబడకుండా ఉండడమన్నమాట (''స్వస్యస్వామి నివృత్త్యా ప్రాతికూల్య విసర్జనమ్") ఒక్క మాటలో చెప్పాలంటే- శేషభూతుడైన తాను శేషి ఆజ్ఞోల్లంఘనం చేయకపోవడం అని.

(3) "రక్షిష్యతి" అనేవిశ్వాసం: భగ వంతుని రక్షకత్వాన్ని గురించిగాని, ఆయన సర్వశక్తి సంపన్నుడు అనే విషయంలో గాని సంశయం లేకపోవడం. భగవద్గీతలోని ''సంశయాత్మా వినశ్యతి" అనే దాన్ని ఇక్కడికి తెచ్చుకొని అన్వయించుకో వచ్చును. "నమేభక్తః ప్రణశ్యతి" అని చెప్పుకొని ధైర్యంవహించ వచ్చును. లక్ష్మీ తంత్రలోనే దృఢ విశ్వాసాన్ని వహించవలసింది అని ఉంది :

"పరత్వే సతిదేవోఽయం, భూతానా మనుకంపనః
అనుగ్రహై కధీర్నిత్యం, ఇత్యేతత్తు తృతీయకమ్॥

(4) గో ప్తృత్వవరణం: తనను (భక్తుని) తప్పక రక్షిస్తాడని; దానికి

కావలసిన శక్తి మంతుడని రక్షకునిగా భగవంతుని ఎన్నుకోవడం. లక్ష్మీ తంత్రంలో ఇలా ఉంది :

"ఏవం భూతోప్యసక్తస్సన్, నత్రాణం భవితుం క్షమః ।
ఇతి బుద్ధ్యాస్య దేవస్య, గోప్తృశక్తి నిరూపణమ్॥"

పరమేశ్వరుడు అశక్తుడు కాడుగనుక, రక్షించే సామర్థ్యం ఉన్నవాడు గనుక ఆ భావంతోనే శరణువేడడం.

(౬) ఆత్మనిక్షేపం: తనకు (భక్తునకు) సంబంధించిన సర్వవిషయాలు, సర్వభారాలు ఆయనవే అనే భావంతో సర్వేంద్రియ సర్వాత్మ సమర్పణం చేయడమే ఆత్మనిక్షేపం. దీనిని చాలా చక్కగా "న్యాసదశకమ్"లో శ్రీవేదాంత దేశికులవారు ఇలా వివరించారు:

''అహం, మద్రక్షణభరః, మద్రక్షణ ఫలం తథా ।
న మమ శ్రీపతేరేవేత్యాత్మానం నిక్షిపేత్ బుధః ॥

"భక్తుడు తన దనేది ఏమీలేదని అన్నీ ఆ శ్రీపతికే అని దృఢాధ్యవసాయంతో ఆత్మార్పణం చేసుకోవడం న్యాసం. అహంకారమమకారాదుల విసర్జన సర్వాత్మనా చేయడమే పరమ పురుషార్థంగా భావించి ప్రవర్తించడం దీని లక్ష్యం. భక్తుడు "శ్రీకైవల్య పదంబు చేరుటకునై" చింతించక" మహానందాంగనాడింభకు" ని శ్రీకైంకర్య లబ్ధికై అర్థిస్తాడు. జీవుడెప్పుడు పారతంత్ర్య బుద్ధితో జీవిస్తాడన్న మాట ! "నమమ" అని గుర్తిస్తాడన్నమాట !

"స్వయం మృత్పిండ భూతస్య పరతంత్రస్య దేహినః ।
స్వరక్షణే ప్యశక్తస్య కో హేతుః పరరక్షణే ॥''

ఈ "న్యాసం" ఎంత దూరంపోయిందంటే, శరణాగతి చెయ్యడంలో కూడా భక్తునకు కర్తృత్వంలేదు. ఆ పరమాత్మే భక్తుణ్ణి స్వయంగా తనయందు చేర్చుకొంటాడు ("స్వస్మిన్ న్యస్యసి మాం స్వయమ్")

(౭) కార్పణ్యం: దీనిలో భక్తుని అకించనత్వం, అనన్య గతికత్వం ఉంటాయి. దీన్నే కృపణత్వం అని కూడా అంటారు. "అన్యథా శరణం నాస్తిత్వమేవశరణం మమ" అనే ఆర్తితో కూడిన ఆక్రందనం ఇది. అనాది సిద్ధాలైన వాసనాపాంక్రమిక వ్యథలు, అజ్ఞాన జనిత దుర్బుద్ధులు మానవుని వెన్నాడుతూ ఉంటాయి. వీటి నుండి

విముక్తి కావాలంటే అపతిత పావనుని "నీపాలబడ్డాను, నన్నురక్షించు" అని వేడుకోవాలి. ఇదేకార్పణ్యం.

ఈ ఆరింటిలో ముఖ్యాతి ముఖ్యమైనది ఆత్మనిక్షేపం అని, దాన్ని అంగిగా గ్రహించి మిగిలిన అయిదింటిని అంగాలుగా గ్రహించాలని ఒక అభిప్రాయం ఉంది. శరణాగతిలో ఈ షడంగాలు ఉంటాయి గనుక వీటికి సమ ప్రాధాన్యం ఉందంటే దోషంలేదు. మిగిలిన అయిదు, ఆత్మనిక్షేపంలో భాగాలుకావడంలో ఆక్షేపణ ఉండకూడదు గనుక . దేని ప్రత్యేకతదానికున్నా - ఆత్మనిక్షేపం విశిష్టమైనదని అంగీకరించడంలో అసామంజస్యం లేదు. ఇదిగాక, లక్ష్మీ తంత్రశ్లోకంలో "ఆత్మనిక్షేపకార్పణ్యే" అని కలిపిచెప్పడంవల్ల, ఈ రెండూ కూడా అంగివిషయాలే అని చెప్పడం ఉంది. ఆత్మసమర్పణాక్రోశాలు రెండూ కలిసిపోయేవేగదా! వీటిలో ముందువెనుకలు విచారించడం అనావశ్యకం.

అనన్య భక్తి, శరణాగతి భగవత్ప్రాప్తికి మూలభూతవిషయాలనే దృష్టి వేదోపనిషత్తుల కాలం నుండి ఉన్నదే, ఇంక పురాణాల, ఆళ్వారుల, ఆచార్యుల, ఇతర భక్తుల విషయంలో చెప్పేదేముంది ? ఐక కంఠ్యంతో అన్ని గ్రంథాలు అందరు చెప్పడం జరిగింది. వేదఋషులు భక్తిభావంతో పరమేశ్వర (వివిధ దేవతలరూపాలన్నీ ఆయనవే అనేభావంతో లేదా తాత్కాలికంగా వర్ణిస్తున్న దేవత ఆయనకు ప్రతినిధి అనే భావంతో) స్తుతిచేయడం ఋగ్వేదాదులలో కనబడుతోంది:

"అర్చత ప్రార్చత ప్రియమేధా సో అర్చత
అర్చంతు పుత్రకా ఉతపురం నధృష్ణ్వర్చత॥
(ఋగ్వేదం-VIII-69, 8)

పరమేశ్వరునకు తమ్ముతాము అర్పించుకోవడం, తల్లిదండ్రులవలె తమ్ము రక్షించాలని వేడుకోవడం కనబడతాయి. వేదవాఙ్మయంలో, అనురాగాన్ని వ్యక్తం చేస్తూ అగ్నిని ఆత్మీయునిగా చిత్రించడం కనబడుతుంది. భ్రాతగా, పితరులుగా అభివర్ణించడం చాలా చోట్ల ఉంది :

"త్వాం వర్ధంతి క్షితయః పృథివ్యాం
త్వాం రాయ ఉభయా సో జనానామ్ ।

"త్వం త్రాతా తరణే చేత్యోభూః
పితామాతా సదమిన్మానుషాణామ్॥"

ఇంకో మంత్రంలో-ఓవమా! నువ్వే మా తండ్రివి, నువ్వే మా తల్లివి అంటూ కీర్తించడం కనబడుతుంది :

"త్వంహినః పితావసో త్వం మాతా
శతక్రతో బభూవిధ । అథాతే సుమ్నమీమహే॥"

(ఋగ్వేదం VIII-98; 11)

వైదిక దేవతలలో బలపరాక్రమాలకు ప్రతీకఅయిన ఇంద్రుని సన్నిహితునిగా భావించుకొని-నువ్వు సఖుడవేకాదు; తండ్రివేకాదు; సర్వశ్రేష్ఠుడవు; పితృతముడవు-అని కీర్తించడం ఉంది :

"సఖా పితా పితృతమః పితౄణాం
కర్తేములోకముశతేవయోధాః॥"

(ఋగ్వేదం-IV-27, 17)

అర్వాచీనకాలంలో భక్తిభేదాలుగా (నవవిధ భక్తులు) పరిగణనకువచ్చిన - అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం మొదలైనవాటికి మాతృకలనదగిన భావాలున్న ఋక్కులు ఋగ్వేదంలోనే (అతిప్రాచీనకాలానికి ఉపలక్షణంగా ఈ వేదాన్ని గ్రహించడం జరిగింది. శ్రుతులనుండి ఇచ్చిన ఉదాహరణలను - ముద్రణ సౌకర్యంకోసం-స్వరచిహ్నరహితంగా ఇచ్చినా, అవి స్వరసహితాలేనని గుర్తించాలి) దర్శనమిస్తాయి. వివిధ దేవతలను వివిధ రీతులలో ప్రస్తుతించడం కనబడుతుంది. వారితో పెంచుకొన్న సన్నిహితత్వాన్నిబట్టి, తమ అవశ్యకాల్నిబట్టి వేద ఋషులు ఆయా దేవతలను దర్శించారు; కీర్తించారు. మంత్రాలకు సంబంధించి ఋషులపేర్లున్నా, వేద సంప్రదాయాన్ని అనుసరించి (అది అపౌరుషేయం గదా!) వారు వాటికర్తలుకారు; ద్రష్టలు అని గుర్తుంచుకోవాలి.

వేదాలలో దేవతాస్తుతియే ప్రధానవిషయం. నిరుక్తకారుడైనటువంటి యాస్కుడు-స్థానవిభాగదృష్టిచే దేవతలను మూడువిభాగాలుగాచేశాడు ఆస్థానాలు-పృథివీస్థానం, అంతరిక్షస్థానం, ద్యుస్థానం-అనేవి. పృథివీస్థాన దేవతలలో అగ్నిస్థానం; అంతరిక్షస్థాన దేవతలలో ఇంద్రునిస్థానం; ఆకాశస్థాన దేవతలలో సౌర దేవతల (సూర్య, సవిత, విష్ణు) స్థానం గొప్పవి. దేవతలకు దేవుళ్ళకూడఉన్నట్లు

ఋగ్వేదంలోనేఉన్నది. ఈ దేవతాస్త్రీలందరిలో ఆకాశ (ద్యౌ) పుత్రి అయిన ఉషాదేవి చాలా అందకత్తె. అవిద తమోమయమైన రజనికి రమణీయ రూపధారిణి అయిన చెల్లెలు ఈ దేవతా బహుత్వవర్ణనను స్థూలదృష్టితో పరిశీలించిన కొందరు పాశ్చాత్య విద్వాంసులు, వారిననుసరించిన కొందరు ప్రాచ్య విద్వాంసులు-వైదిక సంస్కృతిని, దేవతావర్ణనను ప్రాక్తనకర్షక సమాజానికి చెందినవారి ప్రకృతి వర్ణనలుగా, కర్షక సంస్కృతిగా అభివర్ణించి ఆనాటివారు "అనేకదేవతావాదులు (Polytheists)"అని నిర్ణయించారు. ఆ సమాజంవారు క్రమపరిణామంగా "ఏకేశ్వరవాదులు (Monotheists)"అయి, తుదకు "విశ్వదేవతావాదులు (Pantheists)"గా స్థిరపడ్డారని తేల్చారు. ఈ ప్రాచ్య ప్రాచ్యవాదులు గుర్తించనిది ఏమిటంటె-అతి ప్రాచీనకాలంనుండి ఈ దేవతాబహుత్వంవెనుకఉన్న "సత్తా"ఒక్కటేఅని ఋగ్వేదకాలంనాటివారు గ్రహించారనేవిషయం. గ్రహించడమేకాదు; కంఠోక్తిగా వివరించారుకూడా!

యాస్కుడు నిరుక్తంలో దైవతకాండ (సప్తమాధ్యాయం)లో దేవతాస్వరూపవివేచనం స్పష్టంగా, సంశయానికి తావులేనివిధంగాచేశాడు. సర్వైశ్వర్యసంపన్నుడైన ఈశ్వరుడు ఈజగత్తునకుమూలం; ఏకము అద్వితీయము అయిన ఆ మహత్తర శక్తినే బహువిధాలుగా వర్ణిస్తూఉంటారు:

> "మహాభాగ్యాత్ దేవతా యా ఏకఏవ ఆత్మా బహుధాస్తూయతే ।
> ఏకస్యాత్మనోఽన్యేదేవాః ప్రత్యంగాని భవంతి॥"
>
> (VII-IV.8, 9)

ఇందువల్ల యాస్కునిదృష్టిలో దేవతాగణం ఒకే దేవతయొక్క భిన్నభిన్న శక్తుల ప్రతీకలు. "బృహద్దేవత"కూడా నిరుక్తాభిప్రాయాన్ని సమర్థిస్తోంది. (అధ్యా1-శ్లో 61, 65), మనవారి దృష్టిననుసరించి - సర్వవ్యాపి, సర్వాత్మకుడు అయిన పరబ్రహ్మను నిరూపించడమే ఋగ్వేదలక్ష్యం దానిలోని మిగిలినవన్నీ ఈ లక్ష్యానికి అంగాలు. మూలభూతమైన "కారణసత్తా" కార్యవర్గంలో అనుప్రవిష్టమై సర్వత్ర భిన్నభిన్న ఆకారాలుగా పరిలక్షితమవుతోంది. ప్రకృతి కార్యాలకు మూలమైన "సత్తా" ఒక్కటే. ఒకేనియంత, ఒకేదేవత. మిగిలిన దేవతలందరు ఈమూల భూతసత్తాకు వికాసమాత్రాలుమాత్రమే! ఐతరేయ ఆరణ్యకంలో స్పష్టంగా ఈ ప్రతిపాదనఉంది. ఒకే ఒక సత్తానుగురించిన ఉపాసనను

ఋగ్వేదీయులు "ఉక్థం"లో; యజుర్వేదీయులు 'యాగ్నికాగ్ని" రూపంలో; సామ వేదీయులు "మహావ్రత" యాగంలో చేస్తారు:

"ఏతం హ్యేవబహ్వృచా మహత్యుక్థే, మీమాంసంత ఏత మగ్నా వధ్వర్యవ ఏతం మహావ్రతే ఛందోగాః"
(ఐతరేయ ఆరణ్యకం-III, II, III, 12)

ఒకే పరతత్త్వాన్ని వివిధ విధాలుగా వర్ణించడం, భిన్నభిన్న నామాలతో పిలవడం మనకు వేద వాఙ్మయంలో సర్వేసర్వత్ర కనబడుతూఉంటుంది:

"ఇంద్రంమిత్రం వరుణమగ్ని మాహురథో దివ్యఃససుపర్ణాగరుత్మాన్।
ఏకం సద్విప్రావదంతి బహుధా అగ్నిం యమంమాతరిశ్వాన మాహుః॥"

(ఋగ్వేదం. I-164; 46)

నాసదీయసూక్తం మహోన్నతమైన ఆధ్యాత్మికదృష్టితో జగత్కర్త మూల తత్త్వాన్ని విశదీకరించింది. వైదిక ఋషులు "తదేకమ్"అని నిష్కర్షగ, నిర్ద్వం ద్వంగ ప్రకటించారు. ఆపరతత్త్వాన్ని గూర్చి చెప్పేటప్పుడు-తత్, సత్-శబ్దాలనే విశేషంగావాడారు.

ఆ పరతత్త్వాన్ని నపుంసక శబ్దప్రయోగంతో వ్యక్తంచేస్తూవచ్చినా, పురుషునిగా భావించి (శక్తిగా భావించి) ప్రేమాభిమానాలతో అర్చించి అర్థించడం తరుచుగా కనబడుతూనే ఉంటుంది. సర్వదేవతా మూర్తులకు వెనుక, వాటి కన్నింటికి శక్తిని ప్రసాదించే ఏకదేవత ఉన్నదనేభావం అడుగడుగునా వ్యక్త మవుతూనే ఉంటుంది. ఆ ఏకదేవతను విభిన్ననామాలతో పిలవడమూ ఉంది. ఈ ఏకదేవతకున్న విభిన్న సంజ్ఞలలో ప్రజాపతి, హిరణ్యగర్భుడు, పురుషుడు మొదలైన నామాలు ఉన్నాయి. ఇందువల్ల "కస్మైదేవాయ" (ఏదేవతకోసం?) అని ప్రశ్నించుకొని, అన్నింటికంటె (అందరికంటె) ముందు పుట్టినవాడు, సమస్త జీవకోటికి అధిపతి అయిన హిరణ్యగర్భునకు (ప్రజాపతికి) హవిష్యాన్ని హోమం చేయాలి అని "ప్రాజాపత్యుడైన హిరణ్యగర్భాఖ్యుడైన ఋషి" (హిరణ్యగర్భః ప్రాజాపత్యః) సూక్తంలో కనబడుతుంది. ఈ ప్రజాపతి హిరణ్యగర్భుడు ద్యావా

పృత్వులను ధారణచేసినవాడు, ఈయన ప్రపాదనార్థం మనం హోమాదికం నిర్వహించాలి.

" హిరణ్యగర్భః సమవర్తతాగ్రే
భూతస్య జాతః పతిరేక ఆసీత్ ।
సదాధార పృథివీం ద్యాం ఉతేమాం
కస్మైదేవాయ హవిషా విధేమ ॥"

(ఋగ్వేదం - X - 121; 1)

ఈ సూక్తం ప్రగాఢమైన ఆధ్యాత్మిక తత్త్వంతో నిండి ఉంది. ఆనంద స్వరూపుడు, ఇదమిత్థమని నిర్ణయించడం కుదరనివాడు అయినందుననే ఈ ప్రజాపతిని "కః" అనే శబ్దంద్వారా వ్యవహరించడం జరిగింది.

పాశ్చాత్యుల ఆధునికుల దృష్టిలో "కస్మై" అనేది ప్రశ్నావాచక సర్వ నామం. కాని వైదిక పరంపరలో దీనికి ప్రజాపతి అని అర్థం. సాయణ భాష్యంలో ఇలా ఉంది:.

" కిం శబ్దోఽ నిర్జ్ఞాత స్వరూపత్వా త్ప్రజాపతేవర్తతే యద్వా
కిం సుఖమ్ త ద్రూపత్వా త్ప్రజాపతిః కం ఇత్యుచ్యతే ।"

అభిప్రాయభేదాలు ఎలా ఉన్నా, సర్వశ్రేష్ఠుడైన ప్రజాపతిని అర్చించడం అర్థించడం కనబడుతోంది. ఆయన సమస్త జీవులకు ప్రాణదాత, బలదాత అనీ అమృతత్వం, మృత్యువు ఆయన చేతులలో ఉండి ఛాయలా వశమై ఉన్నాయని వర్ణన :

య ఆత్మదాబలదాయస్య విశ్వ ఉపాసతే ప్రశిషం యస్యదేవాః ।
యస్యఛాయాఽ మృతం యస్య మృత్యుః కస్మైదేవాయ
హవిషావిధేమ ॥ (ఋగ్వేదం - X - 121; 2)

ఈ సూక్తంలోని చివరి మంత్రం (పదోది)లో "మేము ఏఫలాన్నికోరి నీకు హవిస్సులను అర్పిస్తున్నామో ఆ ఫలం మాకు లభించాలి. నీ అనుగ్రహంవల్ల మేము కూడా ధనాఢ్యులంకావాలి"అని ప్రజాపతిని ప్రార్థించడం ఉంది:

" ప్రజాపతే న త్వదేతా న్యన్యో విశ్వా జాతాని పరితా బభూవ ।
యత్ కామాస్తే జుహుమస్తన్నో అస్తు వయం స్యామ పతయో
రయీణామ్ ॥"

(ఋగ్వేదం - X - 121; 10)

ఈ సూక్తంలో చాలాచోట్ల - హవిషా విధేమ, ఉపాసతే మొదలైనవి కన బడుతూ ప్రజాపతి విషయంలో భక్తి ప్రవృత్తులు, శరణాగతి ప్రదర్శితాలయ్యాయి.

తల్లిదండ్రులు, ఇతర బంధువులు శిశువును స్తుతివచనాలతో ఉపలాలనం చేసేటట్లు విప్రులు వేనుని (ఈ సూక్తానికి వేనుడు దేవత) స్తుతిస్తూ పూజిస్తున్నారని భార్గవుడైన వేనుని ("వేనో భార్గవః") సూక్తంలో ఉంది:

"అయం వేనశ్చోదయత్ పృశ్నిగర్భా
జ్యోతిర్జరాయూరజ సోవిమానే ।
ఇమమపాం సంగమే సూర్యస్య
శిశుం న విప్రామతి భీరిహంతి ॥"

(ఋగ్వేదం - X - 123,1)

మధ్యమస్థాన దేవుడైన వేనుడు మేఘమధ్యంలో ఉన్నాడు. ఉదకాన్ని పృథ్విని గూర్చి ప్రేరేపిస్తున్నాడు. సూర్యోదయకాల సంగమ మందు వేనుని మేధావులు (విప్రులు) శిశువును బంధువర్గం లాలిస్తున్నట్లు స్తుతులతో ఉప లాలన చేస్తూ పూజిస్తున్నారని స్థూలార్థం. వేద ఋక్కులకు అర్థాంతరాలు చెప్పడం ఉన్నది గనుక స్థూలార్థమని వ్యపదేశించడం జరిగింది. ఇక్కడ మనకు కావలసినది ఈ దేవతాపూజలో వాత్సల్య స్థానమైన శిశువుయొక్క ప్రసక్తి తేవడం. దీనివల్ల పూజితుడు సన్నిహితుడన్న భావన సూచించడం జరిగింది. ఇదే విధంగా మూడో మంత్రంలో "సమానం పూర్వీరభి వావశానా స్తిష్ఠన్ వత్సస్య మాతరః సనీళాః" అని ఉంది. (తల్లి శిశువును పెంచి పెద్ద చేసి నిల్పినట్లు) కనుక, శృంగారాది భావనం, వాత్సల్యాది భావనం ప్రకటన సర్వే సర్వత్రమనకు గోచరమౌతూనే ఉంటాయి.

ప్రేయసీ ప్రియుల్ని, పతిపత్నుల్ని ఉపమానాలుగా తెచ్చి ప్రకృతి విషయాలను, భక్తునకు పరమేశ్వరునకు మధ్య ఉన్న మధుర సంబంధాలను

వర్ణించడం మనకు వేదవాఙ్మయంలో చాలాచోట్ల కనబడుతుంది. వీటినన్నింటిని కేవలం శృంగార పరకాలుగా గ్రహించరాదు. విషయాన్ని భంగ్యంతరంగా వివరించడం జరిగిందని భావించాలి. భార్య భర్తను ఆలింగనం చేసుకొంటూ ఉన్నట్లు మా మతి ఇంద్రుని ఆలింగనం చేసుకొంటోంది అంటుంది కృష్ణ ఆంగిరస ఋషి ఋక్కు :

"అచ్ఛామ ఇంద్రం మతయః స్వర్విదః
సధ్రీ చీర్విశ్వా ఉశతీర నూషత ।
పరిష్వజంతే జనయో యథాపతిం
మర్యం న శుంధ్యుం మఘవాన మూతయే ॥"

(ఋగ్వేదం - X ; 43;1)

ఇదే విధంగా - "జారః కనీనాం పతిర్జనీనామ్" (I ; 66; 4)

"జారః కనీన ఇవ చక్షదానః" (I ; 117; 18) మొదలైనవి చాలాకనబడతాయి. వేదంలో పరమేశ్వరుని విషయంలో ఉన్న మధుర భావనలు, భక్తి భావనలు కోకొల్లలు. భగవంతునకు భక్తునకు మధ్య ఉండే నిత్యానుసంధానాన్ని వ్యక్తం చేసేవి ఉన్నాయి. "ప్రియోఽసిమే" అని తరువాతి కాలంలో భగవద్గీతలో శ్రీకృష్ణుడన్నట్లు, మానవులు ఆయనకు ఇష్టులు గనుక ఆయన విశ్వాన్ని ఆక్రమించుకొని ఉన్నాడు. వాళ్ళకోసమే ఆయన విశ్వాన్ని విపులం చేశాడు. దీన జనాళి దానిలో ఆశ్రయాన్ని పొందారు:

"విచక్రమే పృథివీం ఏషఏతాం
క్షేత్రాయ విష్ణుర్మనుషే దశస్యన్ ।
ధ్రువాసో అస్యకీరయోజనా స
ఉరుక్షితిం సుజని మా చకార ॥"

(ఋగ్వేదం - VII ; 100;4)

ఇంతటితో తృప్తిపడని వైదికఋషి పరమేశ్వరుని విశ్వమానవులకు అతిథిగా చేశాడు. ("విశ్వేషాం అతిథి ర్మానుషాణామ్ - IV, 1; 20) ఆయన్ని ఇంటింటికి అతిథిని చేశాడు; మిక్కిలి ఇష్టుడైన మిత్రుని వంటి వాడని ఆ అతిథిని

స్తుతించారు. ("విశో విశో వో అతిథిమ్"; "ప్రేష్ఠంవో అతిథిం స్తుషే మిత్రమివ ప్రియమ్" - VIII : 84; 1) దేవతలను మనుష్యులకు సన్నిహితుల్ని చేసి మంత్రద్రష్టలైన వేదఋషులు అర్వాచీనకాలంలో బయలుదేరిన భక్తి మార్గోద్యమాలకు మార్గదర్శకులయ్యారు

వైదికదేవతలలో మూర్ధన్యుడు వరుణుడు. ఆయన విశ్వతశ్చక్షువు, ధృతవ్రతుడు, సుక్రతువు, సర్వజ్ఞుడు. భక్తిభావన మనకు విశేషంగా వరుణసూక్తాలలో కనబడుతుంది. మానవుల గుణ దోషాలన్నింటిని సర్వజ్ఞుడైన వరుణుడు గ్రహించి సముచితంగా సత్కరించడం, శిక్షించడం చేస్తాడు. ఇది తెలిసిన భక్త ఋషి వరుణుని ఇలా వేడుకొంటాడు:

"య అపిర్నిత్యం వరుణ ప్రియః సన్
త్వా మాగాంసి కృణవత్ సఖా తే ।
మా తఏన స్వంతో యక్షిన్ భుజేమ
యం ధిష్మా విప్రః స్తువతేవరూథమ్ ॥"

(ఋగ్వేదం-VII-88-6)

"నేను నీకు నిత్యం ఆప్తుడైన ప్రియజనుడ్ని. నేను నీ విషయంలో అనేక పాపాలు చేశాను. ఈ పాపాల్ని క్షమించి నాకు నీ మిత్రత్వదయచేయువలసింది. నువ్వు అద్భుతకార్యాలు చేస్తావు. ఈ స్తుతికర్మకు అనిష్టనివారకమైన వరణీయ వస్తువులను ప్రదానం చెయ్యి" అని స్థూలంగా దీని వివరణ. ఇక్కడ మనకు సఖ్యభక్తికి సుందరోదాహరణం కనబడుతోంది.

వేదమంత్రాలలో భక్తితత్త్వ సమర్థన ప్రత్యక్షంగా గోచరమవుతుంది. శాండిల్యుడు తన భక్తి సూత్రాలలో "భక్తిః ప్రమేయా శ్రుతిభ్యః" (I-2-6) అని ఈ విషయాన్నే వ్యక్తం చేశాడు. దీనికి చాలా ఉదాహరణలు లభిస్తాయి. మనువునకు విష్ణువునకు సంబంధించిన రెండుమంత్రాలను (స్తుతులను) గ్రహిద్దాము:

"తముస్తోతారః పూర్వ్యం యథావిద
ఋతస్యగర్భం జనుషాపిపర్తన ।
ఆస్యజానంతో నామచిద్ వివిక్తన
మహస్తేవిష్ణో సుమతిం భజామహే ॥"

(ఋగ్వేదం I-156-3)

"ఈ జగత్తునకు కారణరూపుడైన విష్ణువును నీమతికి అనురూపమైన స్తుతిని చెయ్యి. ఆయన వేదాంతవాక్యాలలో ప్రతిపాద్యుడు. ఈ స్తుతివల్ల నీకు పునర్జన్మ ఉండదు. నీకు స్తుతి అసంభవం అయితే ఆ విష్ణువు నామాన్ని గ్రహించు (అంటే నామస్మరణ చెయ్యి) మేము— ఆ విష్ణువుయొక్క తేజోవంతం, సాక్షిభూతం, గుణాతీతం అయిన ప్రేమ లక్షణసేవ చేస్తున్నాము"- అని దీని స్థూలార్థం. దీనిలో నామస్మరణను గురించిన సూచన ఉండడం విశేషం "భజామహే" అనే ప్రయోగం మంత్రోద్దేశాన్ని స్పష్టం చేసింది.

ఇదే విధంగా భక్త్యాది విషయాలను గురించి విస్తృతంగా వ్యక్తం చేసే ఇంకో మంత్రం ఉంది:

"యః పూర్వ్యాయ వేధసే నవీయసే
సుమజ్జానయే విష్ణవే దదాశతి ।
యో జాతమస్య మహతో మహి బ్రవత్
సేదు శ్రవోభిర్యుజ్యం చిదభ్యసత్ ॥"

(ఋగ్వేదం—I-156-2)

అందరికంటె ప్రాచీనుడు, నూతనుడు, జగత్స్రష్ట, స్వయంభువు అయిన విష్ణువుకోసం తనసర్వస్వం, తననుకూడా- సమర్పణం చేసుకొంటాడో, ఆయన మహనీయ మహిమను కీర్తిస్తాడో- ఆ పురుషుడు సర్వసంపన్నుడై పరమపదాన్ని పొందుతాడు- అని దీని భావార్థం. దీనిలో- శ్రవణం, కీర్తనం, అర్పణం ఉన్నాయి ఈ మంత్రంలో ఉన్న "సుమజ్జానయే" అనే దానికి "స్వయమేవోత్పన్నాయ" అని అర్థం చెప్పారు. కొందరు "సమస్త సంసారంలో (జగత్తులో) మదోత్పత్తిని కలిగించే లక్ష్మీదేవి పతియైన విష్ణువు" అన్నారు. సాయన భాష్యంలో ఇలా ఉంది: "సుమజ్జానయే స్వయమేవోత్పన్నాయ । సుమత్ స్వయమితి యాస్కః (నిరుక్త, 6-22) యద్వా సుతరాం మాదయ తీతిసుమత్ । తాదృశీ జాయా యస్య స తథోక్తః । తస్మై సర్వ జగన్మాదనశీల శ్రీపతయే ఇత్యర్థః ॥ వేద ఋక్కులకు అర్థాంతరాలు స్ఫురించడం, చెప్పడం సర్వసామాన్యం

వామదేవ గౌతమ ఋషి దృష్టిలో- అఖిలోకభయంకరుడు. త్రిలోకాధిపతి అయిన ఇంద్రుడు విష్ణుత సహృదయత, భాతృభావం మూర్తీభవించిన మహాను

కాపురు. ఈ సుగుణాలను ఇంద్రునిలో గుర్తించన వాళ్ళు ఎవరైనా ఉంటారా? అని ఋషి ప్రశ్న:

"కో నానామ వచసా సోమ్యాయ
మనాయుర్వాభవతివస్త ఉస్రాః ।
క ఇంద్రస్యయుజ్యం కః సఖిత్వం
కో భ్రాత్రవష్టికవయే క ఊతీ ॥"

(ఋగ్వేదం.IV.25-2)

ఋగ్వేదంలో కొన్ని "ఖిల" ఋక్కులు, కొన్ని "ఖిల" సూక్తాలు కనబడ తాయి. (ఉదాహరణకు దశమమండలంలో సూక్తమ్ 74-ఋషిః-సిన్ధుక్షిత్ ప్రైయ మేధః, దేవతా-నద్యః, ఛందః జగతీ-దీనిలో 6వ ఋక్కు, సూక్తమ్-127-ఋషిః కుశికః సౌరభః, రాత్రిర్వాభారద్వాజీ, దేవతా-రాత్రిః, ఛందః-గాయత్రీ-దీనిలో 9నుండి 22వరకు (14 ఋక్కులు) సూక్తమ్ 129-ఋషిః-సనక, సనన్దనః సనాతనాదయః దేవతాహిరణ్యమ్, ఛందః-అనుష్టుప్, 5,8,9-త్రిష్టుప్-7 అతిశక్వరీ 11 జగతీ-దీనిలో 11 ఋక్కులు; సూక్తమ్-130-ఋషిః విహవ్య అంగిరసః, దేవతా-విశ్వేదేవాః, ఛందః అనుష్టుప్, దీనిలో 48ఋక్కులు- మొదలైనవి) వీటిని ఖిల సూక్తాలుగా, పరిశిష్టాలుగా, ప్రక్షిప్తాలుగా, అధికపాఠాలుగా ఎవరికి సమ్మత మైన పద్ధతిలో వారు-వ్యవహరించడం ఉంది.

కల్ప సూక్తాలలో వినియోగం పేర్కొబడనివాటిని "ఖిల" మంత్ర, సూక్తా లుగా చెప్పుకోవడం ఉందని కొందరి భావం. ఋషి పరంపరలో పదక్రమాది పాఠాలు విలుప్తాలై మరుగునబడి మూలం మాత్రమే పఠించబడుతూ రావడంతో అని "ఖిల"భాగాలలోపడ్డాయి అని కొందరు ఊహిస్తున్నారు కాని, "పరశాఖీయం స్వశాఖాయామపేక్షావశాత్ పఠ్యతే తత్ఖిలముచ్యతే ఇతి ఖిలలక్షణమ్" అని ఉంది. స్వశాఖకు చెందని ఇతరశాఖాగత మంత్రం గాని, సూక్తం గాని సందర్భవశం చేత అవశ్యకం కలిగి స్వశాఖలోనికి పరిగృహీతమైతే అది 'ఖిల" మంత్రంగాగాని "ఖిల' సూక్తంగాని గాని ఆ శాఖలో (ఇతరశాఖ(ల) నుండి తీసుకొన్న వారి శాఖలో) పరిగణనకు వస్తుందనవచ్చును.

ఈ "ఖిల" మంత్రాలలో సూక్తాలలో బాలా ప్రసిద్ధికెక్కిన రాత్రిదేవత

సూక్తంలోని కొన్ని మంత్రాలు (దుర్గాదేవి నద్దేశించినవి), హిరణ్యందేవతగాగల సూక్తం, విశ్వేదేవతలు దేవతగా గల సూక్తం మొదలైనవి ఉన్నట్లుగా తెలుసుకొన్నాము. వీటిలో శక్తిప్రవత్తులు, శరణాగతి స్పష్టరీతిని వెల్లడించడం కనబడుతుంది "నిన్ను మేము శరణుజొచ్చినాము. మమ్మల్ని రక్షించు" అని స్పష్టంగా ఉంది.

రాత్రి దేవతాకమైన సూక్తంలో అర్వాచీన కాలంలో చాలా ప్రచారానికి (ముఖ్యంగా శ్రీ వైష్ణవ సమాజంలో) వచ్చిన "ప్రపన్న" శబ్దంప్రయుక్తమై ఉండడం విశేషం:

"సంవేశినీం సంయమినీం గ్రహ నక్షత్రమాలినీం।
ప్రపన్నోఽహం శివాం రాత్రీం భద్రేపారమశీమహి॥"

(ఋగ్వేదం-X.127 12).

"ప్రపన్నోఽహం" అని స్పష్టంగా ఉంది. మనకు ప్రతిదినం "శ్రీవేంకటేశ ప్రపత్తి"లో

"ప్రాయః ప్రపన్న జనతా ప్రథమావగాహ్యా
మాతుఃస్తనావివశిశోరమృతాయమానౌ।
ప్రాప్తౌ పరస్పరతులామతులాంతరౌతే
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే॥"

అనే శ్లోకంలో "ప్రపన్న" శబ్దం దాని ప్రాధాన్యాన్ని తెలుపుతూ వినబడుతూనే ఉంటుంది. ప్రపన్నునకు ముఖ్యంగా ఉండవలసిన లక్షణం వినయం. ఇదే నిజమైన వైష్ణవుని లక్షణంగా "తృణాదపిసునీచేన తరోరివ సహిష్ణునా" అనే మాటలద్వారా శ్రీ చైతన్య మహాప్రభువు అర్వాచీన కాలంలో చెప్పారు.

పై ఋగ్వేద ఋక్కులో "ప్రపన్నోఽహం" అని స్పష్టంగా ఉన్నట్లే ఇంకో ఋక్కులో "శరణమహం ప్రపద్యే" అని చెప్పుకోవడం కనబడుతుంది.

"తా మగ్నివర్ణాం తపసాజ్వలంతీమ్
వైరోచనీం కర్మఫలేషు జుష్టాం।

దుర్గాందేవీం శరణమహం ప్రపద్యే
సుతరసితరసే నమః-సుతరసితరసే నమః ॥"

(ఋగ్వేదం-X-127-20)

ఇది మహానారాయణోపనిషత్తులోని ద్వితీయానువాకంలో కూడా వస్తుంది. ఈ శరణుపొందడానికి కారణంగా మానవులను కష్టాలనుండి తరింపజేసే ఆమెకున్న శక్తిని ప్రస్తావించి నమస్కరించడం దీనిలో ఉంది. ఆ శక్తి పరబ్రహ్మ శక్తియే. అది తరణ కుశల ("హే సుతరసి తరస్విని తరణ కుశలే త్వమేవ అస్మాన్ సంసారగర్తాత్ సుష్టు తారయసి । తస్మై తుభ్యం నమః అస్తు॥") దుర్గ అంటే "దుఃఖేన గంతుం శక్యా" అన్నమాట. ఆమె అనుగ్రహాన్ని పొందడం కష్టసాధ్యమన్నమాట. దీనికి పూర్వం ఉన్న ఋక్కులో లౌకికంగా అగ్ని రూపంలో దర్శనమిచ్చే పరమేశ్వరుడైన జాతవేదసుడు. కష్టాలనుండి మమ్మల్ని రక్షించాలి అని ప్రార్థన ఉంది. ఇందుకోసం ఆయనకు సోమం హోమద్రవ్యంగా సమర్పించడం అభివర్ణితం. సముద్రంలో నావికుడు నావను క్షేమంగా తీసుకొని వెళ్ళినట్లు ఆయన మనల్ని సంసార సాగరాన్ని తరింపజేస్తాడు:

"జాతవేదసే సునవామ సోమమరాతీయతో నిదహాతివేదః ।
స నః పర్షదతి దుర్గాణి విశ్వానావేవ సింధుందురితాత్యగ్నిః॥"

జాతవేదసునకు సోమం హోమద్రవ్యంగా ఇస్తాము. సమస్తం తెలిసిన ఆయన మా అమిత్రులను నాశనం చేయుగాక. ఆ దివ్యాగ్ని మమ్మల్ని రక్షించి తరింపజేయుగాక- అని స్థూలార్థం. సమస్తమైన కష్టాలనుండి రక్షణ కోరడం ఉంది "పర్షత్" అనే క్రియకు భట్ట భాస్కరుడు "రక్షించడం" అర్థం చెప్పగా సాయణుడు "నాశనంచేయడం" అర్థంగా ఇచ్చాడు. (మహానారాయణోపనిషత్తులో ద్వితీయానువాకంలో మొదటిది. ఋగ్వేదంలో-I-99-1) దీనిలో పేర్కొన్న శత్రువులు- బాహ్యశత్రువులేకాక అంతశ్శత్రువులు కూడా అని గ్రహించాలి.

ఈ ఋక్కులో "దుర్గాణి" అని నపుంసకలింగంలో ప్రయోగం ఉండగా "దుర్గాందేవీం" అని పూర్వ ఋక్కులో స్త్రీలింగ ప్రయోగం కనబడుతుంది. వేద సంప్రదాయంలో పరమేశ్వరునకు హోమద్రవ్యాన్ని సమర్పించే ఒక అగ్నికి "దుర్గ" అని పేరుఉంది. విశ్వశక్తిగా అభివర్ణిత అయిన దుర్గను, అగ్నినిపేరు

చెయ్యడం కష్టం. ఈ వేదభావమే పురాణకాలంలో దుర్గతినాశిని అయిన దుర్గగా ప్రాచుర్యాన్ని పొందింది. మార్కండేయపురాణాంతర్గతమైన శ్రీదుర్గాసప్తశతిలోని మూడు చరిత్రలలో ఆమె ఆవిర్భావ పరాక్రమాదులు గంభీరమనోహరంగా వర్ణితాలు:

"దుర్గేస్మృతాహరసిభీతిమశేషజన్తోః
స్వస్థైః స్మృతామతిమతీవశుభాం దదాసి
దారిద్ర్యదుఃఖభయహారిణికాత్వదన్యా
సర్వోపకారకరణాయసదార్ద్రచిత్తా ॥" అనేది సుప్రసిద్ధ శ్లోకం.

రాత్రి దేవతాకమైన ఈ సూక్తం (ఋగ్వేదసూక్తం) లోనే "ఖిల" భాగంలో దుర్గాదేవి పేరున చాలా మంత్రాలున్నాయి. మహానారాయణోపనిషత్తు లోని ఈ అనువాకంలోను కొన్ని ఉన్నాయి.

భక్తి ప్రపత్తులకు, శరణాగతి భావాలకు మాతృకలనదగిన ఋక్కులు ఋగ్వేదంలోనే కాక, యజుర్వేదం (15; 50)లోను కనబడతాయి.

"తం పత్నీభిరను గచ్ఛేమదేవాః పుత్రైః
భ్రాతృభిరుత వా హిరణ్యైః ।
నాకం గృహ్ణానాః సుకృతస్యలోకే
తృతీయే పృష్ఠే అధిరోచనే దివః ॥"

నాకలోకానికి పైగా ప్రకాశించే సుకృతులు మాత్రమే ప్రవేశించడానికి అర్హమైన త్రిపాద్విభూతిని పొందడానికి పత్నీపుత్ర భ్రాతృవర్గంతో, ధనజనాదులతో ఉత్తమగతి ప్రదాతవైన నిన్ననుసరిస్తూ, ఓ దేవా నిన్ను శరణుపొందుతున్నాము. అని దీని స్థూలార్థం.

ఇంక ఉపనిషత్తులను మనం గ్రహిస్తే- భక్తికి, ఆత్మ సమర్పణకు ఉన్న ప్రాధాన్యాన్ని తెలిపే భాగాలు వాటిలో చాలా కనబడతాయి. కఠోపనిషత్తులోని క్రింది భాగంలో ఆత్మను పొందే విషయంలో సాధకుని యోగ్యతలకంటెకూడా ముఖ్యమైనది, ఆత్మ చూపించే అనుగ్రహమే అని చెప్పడం జరిగింది:

"నాయమాత్మా ప్రవచనేనలభ్యో
నమేధయా న బహునా శ్రుతేన ।
యమేవైష వృణుతే తేనలభ్యః
తస్యైష ఆత్మా వివృణుతే తనూంస్వామ్ ॥''

(కఠోపనిషత్తు-I.2-23)

వేదాధ్యయనంవల్లగాని, బుద్ధిబలంచేతగాని, పాండిత్య విశేషంచేతగాని ఆత్మ లభించదు. అది ఎవరిని ఎన్నుకొంటుందో వారికే అది లభిస్తుంది అని స్థూలార్థం. శ్రీ శంకరులుయమ్=ఆత్మను, ఏషః-సాధకుని తెలియజేస్తాయని చెప్పి సాధకుడు వెదకులాడుచున్న ఆత్మే అతన్ని ఎన్నుకోవడంవల్ల, అది అతనికి తెలుస్తుంది అన్నారు. అద్వైతేతర వ్యాఖ్యాతలు_ ఏషః అంటే పరమాత్మ (భగవంతుడు) అని, యమ్ అంటే ఎవరినైతే అని అర్థం చెప్పి- భగవంతుడు ఎన్నుకొన్నవానికే అది లభిస్తుంది అన్నారు. మనకు ఇక్కడ కావలసినవి అనుగ్రహ ప్రసక్తి మాత్రమే!

ఇదే ఉపనిషత్తులో మిక్కిలి ప్రసిద్ధి కెక్కిన క్రిందిదానిలో నాలుగో పాదంలో "ప్రసాద" శబ్దం వస్తుంది. ఇది భగవంతుని అనుగ్రహాన్ని- ఆయన ప్రసాదించేదాన్ని స్పష్టంగా తెలియజేస్తుందని భగవదారాధకులు విశ్వసిస్తారు.

"అణోరణీయన్ మహతో మహీయాన్
ఆత్మాస్యజంతోర్నిహితోగుహాయామ్ ।
తమక్రతుః పశ్యంతివీతశోకో
ధాతుప్రసాదాన్మహిమానమాత్మనః ॥"

(కఠోపనిషత్తు_I-2, 20)

ఇక్కడ నాల్గోపాదంలో "ధాతుప్రసాదాత్" అని కలిపి శ్రీశంకరులు ఇంద్రియమనస్సుల పవిత్రతచేత వాంఛారహితుడు ఆత్మోన్నత్యాన్ని అనుభవిస్తాడు అని వ్రాశారు. ఇతరులు కామరహితుడైన పురుషుడు జగత్కర్త ప్రసాదంచేత తన ఆత్మయొక్క మహిమను దర్శించి శోకరహితుడవుతాడని వ్రాశారు. వీరు "ధాతుః"అని వేరుచేశారు. భక్తికి ప్రాధాన్యమున్న సంప్రదాయాలలో భగవత్ప్రసాదానికి విశిష్టస్థానం ఉంది గదా! ఇదే అయన అనుగ్రహం. శ్రీమద్భాగ

వతంలోని "పోషణ" ఇదే! ("పోషణం తదనుగ్రహః-II.-10, 4) శ్రీవల్లభుల పుష్టిమార్గానికి (సిద్ధాంతానికి) మూలమిదే!

ఈ భావం చాలా ప్రధానమైనది గనుక శ్వేతాశ్వతరోపనిషత్తులో కూడా ఈ షద్భేదంతో కనబడుతుంది:

"అణోరణీయాన్ మహతో మహీయాన్
ఆత్మా గుహాయాం నిహితోఽస్యజంతోః।
తమక్రతుః పశ్యతి వీతశోకో
ధాతుః ప్రసాదాన్మహిమానమీశమ్ ॥"

(శ్వేతాశ్వతరోపనిషత్తు - III.20)

మనకు ముఖ్యంగా కావలసినవి చివరి రెండు పాదాలు - సృష్టికర్త అను గ్రహంవల్ల, మానవుడు వాంఛా రహితుడు, దుఃఖరహితుడు అయి ఆయన్ని పరమేశ్వరునిగా గుర్తిస్తాడు—అని ద్వైతాద్వైత విశిష్టా ద్వైత సిద్ధాంతాలకు పనికివచ్చే మంత్రాలున్న ఈ ఉపనిషత్తు ఆచార్య పురుషులనందరిని ఆకర్షించింది. యోగ సాంఖ్యాలకు కూడా పనికివచ్చే మంత్రాలు ఇందులో ఉన్నాయి.

ఈ మంత్రమే మార్పులేకుండా మహానారాయణోపనిషత్తులో కూడా ఉంది. (ద్వాదశోఽనువాకః-1) ఇన్ని ఉపనిషత్తులలో ఉన్న దీని వైశిష్ట్యాన్ని గురించి వేరే చెప్పనక్కరలేదుకదా! అద్వైతులు తరుచుగా వఠించే "ఈశ్వరాను గ్రహాదేవపుంసామద్వైతవాసనా। మహాభయపరిత్రాణాత్ విప్రాణాం ఉపజాయతే॥" అనే శ్లోకం కూడా ఈశ్వరానుగ్రహాన్ని నొక్కి చెప్పుతోంది. ఉపనిషత్తులన్నింటి లోను—ఇంచుమించుగా—భక్తికున్న ప్రాధాన్యం (జ్ఞానంతోబాటు) చెప్పబడిఉన్నా, ఈ విషయంలో కృష్ణయజుర్వేదానికి చెందిన (113 మంత్రాలు మాత్రమే ఉన్న) శ్వేతాశ్వతరోపనిషత్తునకు విశిష్టస్థానం ఉన్నదని భక్తిమార్గాను యాయులందరు అంగీకరించారు. దీన్ని ప్రవచించిన అత్యాశ్రమి శ్వేతాశ్వతరమహర్షి తపః ప్రభావం చేతనేగాక, దేవ ప్రసాదం చేతకూడా జ్ఞానాన్ని పొందినట్లు స్పష్టంగా ఉంది:

"తపః ప్రభావాద్ దేవప్రసాదాచ్చ
బ్రహ్మ హ శ్వేతాశ్వతరోఽథ విద్వాన్

అత్యాశ్రమిభ్యః పరమం పవిత్రం
ప్రోవాచ సమ్యగృషి సంఘజుష్టమ్॥"
(శ్వేతాశ్వతరోపనిషత్తు - VI; 21)

పరమేశ్వరానుగ్రహంలేకపోతే, ఏమీలేవని తెలుస్తోంది. ఈ విషయాన్నే నొక్కి చెప్పుతూ ఈ ఉపనిషత్తు సమాప్తి పొందుతుంది.

"యస్యదేవే పరాభక్తిః యథాదేవేతథా గురౌ ।
తస్యైతేకథితాహ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః॥"
(శ్వేతాశ్వతరోపనిషత్తు-VI; 23)

పరమేశ్వరుని విషయంలో పరాభక్తి ఉన్నవానిలోనే (గురువునందు కూడా తత్తుల్యమైన భక్తి ఉన్న వానిలోనే) ఈ సత్యార్థాలు ప్రకాశిస్తాయి-అని శంఖోక్తిగా చెప్పడం జరిగింది.

ఈ మంత్రం కంటె పూర్వమే, పరమేశ్వరునకు మోక్షార్థి ఆత్మసమర్పణం చేసుకొని శరణుపొందడం అభివర్ణితం. ఆ పరమేశ్వరుడు సృష్టి ప్రారంభంలో బ్రహ్మను (హిరణ్యగర్భుని) రూపొందించి ఆయనకు వేద విజ్ఞానం ఇచ్చినవాడు ఆ దేవుడు-నిష్కలుడు, నిష్క్రియుడు, శాంతుడు, నిరవద్యుడు, నిరంజనుడు, ఇంధనాన్ని దహించివేసిన అగ్నిలాంటివాడు. అమృతసేతువు ఆత్మబుద్ధి ప్రకాశకుడు:

"యోబ్రహ్మాణం విదధాతి పూర్వం యోవై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై।
తం హదేవం ఆత్మబుద్ధి ప్రకాశం ముముక్షుర్వైశరణ మహం ప్రపద్యే॥

నిష్కలం నిష్క్రియం శాంతం నిరవద్యం నిరంజనమ్ ।
అమృతస్య పరం సేతుం దగ్ధేంధనమివానలమ్ ॥"
(శ్వేతాశ్వతరోపనిషత్తు - VI: 18, 19)

"శరణ మహం ప్రపద్యే" అని భక్తునివలె శరణు పొందినట్లు స్పష్టంగా చెప్పుకోవడం కనబడుతుంది.

అగ్నిలో, జలంలో, ఓషధులలో, వనస్పతులలో సర్వే సర్వత్ర వ్యాపించి విశ్వమంతా నిండి ఉన్న ఆ దేవునకు నమస్కారం అంటుంది క్రింది మంత్రం:

"యోదేవో అగ్నౌ యేఽప్సు యోవిశ్వం భువనమావివేశ ।
య ఓషధీషు యో వనస్పతిషు తస్మైదేవాయ నమోనమః ॥"
(శ్వేతాశ్వతరోపనిషత్తు - II; 17)

"తస్మైదేవాయనమోనమః" అని స్పష్టంగా-ఇష్టదైవానికి నమస్కరించినట్లు-వ్యక్తం చెయ్యడం ఇక్కడ కనబడుతుంది.

మహానారాయణోపనిషత్తులో ఒక చోటకు చేర్చబడిన చాలా మంత్రాలు, పరమేశ్వరుని దృష్టిలో ఉంచుకొని బహురూపాలలో వ్యక్తమైన ఆయనను కీర్తించినవే! ఇహపరలోకాల సుఖాలను ప్రసాదించవలసినదిగా కోరినవి చాలానే కనబడతాయి. పరమేశ్వరుని - తమ స్నేహితునిగా, తండ్రిగా, భాగ్యవిధాతగా వర్ణించడం ఉంది. ("సనోబంధుర్జనితాసవిధాతా" - ప్రథమోఽను వాకః-16)

ఈ అనువాకంలోనే పంద్రెండు గాయత్రులువస్తాయి. అవి వరుసగా-రుద్రమహాదేవః, తత్పురుష మహాదేవః, దంతిః, నందిః, షణ్ముఖః, గరుడః, బ్రహ్మ, విష్ణుః, నారసింహః, ఆదిత్యః, అగ్నిః, దుర్గిః - అనేవి. వీటిలో సాయణాచార్యులు ఆరింటిని, భట్ట భాస్కరులు అయిదింటిని మాత్రం అంగీకరించారు, రుద్ర గాయత్రియే పునరుక్తమైనదనే భావంచేత కాబోలు భట్ట భాస్కరులు తత్పురుషగాయత్రిని గ్రహించలేదు. కాని, సాయణాచార్యులు అంగీకరించి, ఇది తత్పురుష మహాదేవుని ధ్యాన మూర్తిని తెలియజేయునది అన్నాడు. ఆ ధ్యాన మూర్తి :

"భిభ్రద్దోర్భిః కుఠారం మృగమభయవరౌసుప్రసన్నో మహేశః
సర్వాలంకార దీప్తః సరసిజ నిలయో వ్యాఘ్రచర్మాత్తవాసః ।
ధ్యేయో ముక్తా పరాగామృతరసకలితాద్రి ప్రభః పంచవక్త్రైః
త్ర్యక్షఃకోటీరకోటీ కలితతుహినరుచిః కలోత్తుంగమౌళిః ॥"

అని "ప్రపంచసారం" (27-41)లో ఉంది. దంతిః అనేది దంతిన్ యొక్క వైదిక రూపం. నంది గాయత్రిం, షణ్ముఖ గాయత్రి భట్ట భాస్కరుల వ్యాఖ్యానంలో లేవు. "బ్రహ్మ" శబ్దాన్ని కొందరు నపుంసకలింగ ఏకవచనంగా గ్రహించగా, కొందరు పుంలింగ ఏకవచన రూపమైన "బ్రహ్మ"ను గ్రహించారు. సాయణుల దృష్టిలో ఇది "పరమగాయత్రి". భట్ట భాస్కరులు దుర్గా గాయత్రిని

గూర్చి వ్యాఖ్యానిస్తూ, ఒక పవిత్రమైన వేదాగ్ని దేవత దుర్గా దేవిగా గుర్తించ బడిందన్నారు! దుర్గా శబ్దం ఇక్కడ దుర్గి అయింది. ఈ గాయత్రులలో ఒక క్రమాన్ని పాటించడం కోసం లింగ, విభక్తుల మార్పు అవశ్యకమైనచోట్ల చేయడం కనబడుతుంది. వేదంలో విశేషంగా కనబడే ఛందస్సు పేరు గాయత్రి. సవితృ దేవతాకమై విశ్వామిత్రుడు ఋషిగా ఉన్న గాయత్రి (ఋగ్వేదం - III - 12 . 1) జగత్ప్రసిద్ధంగదా! అదీ ఛందస్సును బట్టి వచ్చినదే! వివిధవిధాలుగా పరమాత్మను ఉద్దేశించి చెప్పినవే ఇవన్నీ! ఆ పరమాత్మ ఒక్కడే (ఒక్కరే) అని - రూపమై విధ్యం ఉన్నట్లుగా వర్ణితమైనా- అందరూ అంగీకరించినవారే! ఈ గాయత్రులన్నింటిలోను క్రియ ఉత్తమ పురుష బహు వచనం కావడం "విద్మహే" గుర్తించవలసినది. ఇదేవిధంగా ప్రతి గాయత్రి చివర వచ్చే "ప్రచోదయాత్"నకు వైశిష్ట్యం ఉంది. ఇది పరమేశ్వరుని అను గ్రహం యొక్క ప్రాముఖ్యాన్ని తెలియజేస్తుంది. ఈ విషయాలను చాలా చక్కగా శ్రీరామకృష్ణ మఠానికి చెందిన స్వామి విమలానందులు ఇలా వివ రించారు:

"The use of the verbs in the first person plural in all these Gayatri formulas is specially noteworthy. Man is gregarious by nature. He can hardly rise above the moral and spiritual level attained by the collectivity to which he belongs. It is therefore, necessary that every religious aspirant who strives for the uplift of his own self should also remember the whole community to which he belongs so that all may be raised above the previous level. This great truth is implied in the plural expressions. May we know and May we meditate. The supplication implied in the last verb finally points out that the worshipper owes his approach to God solely to the impulse granted by God Himself "(Mahanarayanopanishad - Sri Ramakrishna Math, Madras-1957; Pages 46, 47

6)

పైని చెప్పిన పండ్రెండు గాయత్రులు కాక, నారాయణుడనే వ్యాఖ్యాత తన "దీపిక"లో క్రింది గాయత్రులనుకూడా కలిపిమొత్తం పద్దెనిమిది చేశాడు. ఆయన చెప్పినవి విశేషంగా - బ్రహ్మ, భానుః, వైశ్వానరః, భగవతీ, గౌరీ, సర్పః - అనేవి. ఆగమాలు, తంత్రాలు ఆయా ఉపాసకుల అభీష్టాల్ని అనుసరించి ఇంకా - లక్ష్మీః, రామః, సాంబః, అఘోరః మొదలైనవి చేర్చాయి. చిట్టచివరికి "గాయత్రి" లేకుండా ఏ దేవతోపాసన సంపన్నం కాదనేభావం కలిగి చాలామంది దేవీ దేవతలకు గాయత్రులు వచ్చాయి. గురుగాయత్రి ఒకటి "దత్తాత్రేయాయ విద్మహే గాయత్రీ శాయధీమహి, తన్నో గురుః ప్రచోదయాత్" అని ఉండగా "దిగంబరాయ విద్మహే అవధూతాయ ధీమహి, తన్నోదత్తః ప్రచోదయాత్" అని దత్తగాయత్రికూడా ఉంది దీనికి పాఠాంతరాలుగా ."అవధూతాయ విద్మహే అత్రి పుత్రాయ ధీమహి, తన్నోదత్తః ప్రచోదయాత్"అని ఉంది. వివిధ రూపాలలో - ఆ నామ, రూపరహితుని - భక్తులు అర్చించుకోవడాన్ని ఇవన్నీ తెలియజేస్తాయి. ఆధునిక యుగంలో కూడా, ప్రపంచ వ్యాప్తంగా భక్తులచేత అవతారపురుషులుగా పరిగణింపబడే షిర్డీ సాయిబాబా, భగవాన్ సత్యసాయి బాబా వారల గాయత్రులు ఉన్నాయి అన్నప్పుడు ఈ సంప్రదాయ ప్రభావం స్వయం వ్యక్తమవుతుంది.

వివిధ దేవీదేవతలమీద బయలు దేరిన ఉపనిషత్తులలో - వైష్ణవోపనిషత్తు, శైవోపనిషత్తు, శాక్తోపనిషత్తులలో ఆత్మార్పణం, శరణాగతి మొదలైనవి భక్తి భావంలో అంతర్గతాలుగా సర్వే సర్వత్ర కనబడతాయి ఇవి అంత ప్రాచీనమైనవి కావని పరిశోధక విద్వాంసుల అభిప్రాయం. వీటిలో కొన్ని పురాణాలకు సమకాలికంగా వచ్చినవని చాలామంది విశ్వాసం. ఇవి నామ జపానికి ప్రాముఖ్యం ఇచ్చాయి. యోగోపనిషత్తులలో గురువునకు ఆత్మ సమర్పణాదికం కనబడుతుంది. వీటిలో అడుగడుగునా భక్తికి ప్రాముఖ్యం ఇయ్యడం, నామ స్మరణ కనబడతాయి. తారసారోపనిషత్తులో "ఓం నమోనారాయణాయ ఇతి తారకం చిదాత్మక మిత్యుపాసితవ్యమ్"। త్రిపాద్విభూతి మహానారాయణోపనిషత్తులో - "యదా సద్గురుకటాక్షో భవతి తదా భగవత్కథా శ్రవణధ్యానాదౌ శ్రద్ధాజాయతే । తస్మాత్ హృదయస్థితానాది దుర్వాసనాగ్రంథివినాశో భవతి। తస్మాత్ హృదయపుండరీక కర్ణికాయాం పరమాత్మావిర్భావో భవతి । తతో

ద్వృథతరా వైష్ణవే భక్తిర్జాయతే॥"అని ఉంది. "రామషడక్షరి" ఇతర మంత్రాలకంటె శ్రేష్ఠం అని చెప్పే శ్లోకం—

"గాణపత్యేషు శైవేషు శాక్తసౌరేష్వభీష్టదః ।
వైష్ణవేష్వపి సర్వేషు రామమంత్రః ఫలాధికః॥"

రామ తాపిన్యుపనిషత్తులో కనబడుతుంది. తారసారోపనిషత్తు యజుర్వేదం (వాజసనేయి)లోనిదికాగా, త్రిపాద్విభూతి మహానారాయణోపనిషత్తు అథర్వవేదానికి చెందినది. రామతాపిన్యుపనిషత్తుకూడా అథర్వవేదానికిచెందినదే! ఈ వేదానికి చెందిన గోపాల తాపిన్యుపనిషత్తులో "భక్తిరస్యభజనమ్"అని ఉంది. దీనికే చెందిన రామరహస్యోపనిషత్తులో "శ్రీరామఃశరణంమమ"అని కనబడుతుంది. అథర్వవేదానికిచెందిన అథర్వశిఖోపనిషత్తులో శివునకు విశేష ప్రాముఖ్యమిచ్చి "శివ ఏకోధ్యేయః శివంకరః సర్వమన్యత్ పరిత్యజ్య"అని చెప్పడం జరిగింది. ఋగ్వేదానికి చెందిన త్రిపురోపనిషత్తులోదేవి "అజరాపురాణీ మహత్తరా మహిమాదేవతానామ్"అని ఉంది. అథర్వవేదానికిచెందిన సీతోపనిషత్తులో "సీతా భగవతీజ్ఞేయా మూల ప్రకృతి సంజ్ఞితా । ప్రణవత్వాత్ ప్రకృతిరితివదంతి బ్రహ్మవాదినః॥"అని ఉంది. శివ విష్ణువులకు భేదంలేదని ఒకే పరబ్రహ్మతత్త్వమే అని స్పష్టంగా చెప్పింది యజుర్వేదానికిచెందిన (తైత్తిరీయ) రుద్రహృదయోపనిషత్తు:

"యేనమస్యంతి గోవిందం తే నమస్యంతి శంకరమ్ ।
యేఽర్చయంతి హరిం భక్త్యాతేఽర్చయంతి వృషధ్వజమ్॥"

ఈవిధంగా చెప్పడంకాలక, - హరిహర భేదాన్ని భావించి - ద్వేషం వహించడం దోషమనికూడా ఇలా చెప్పింది:

"యే ద్విషంతి విరూపాక్షం తే ద్విషంతి జనార్దనమ్ ।
యే రుద్రం నాభిజానంతి తే న జానంతి కేశవమ్॥"

చివరికి, రుద్రుని తెలుసుకోనివాడు కేశవుణ్ణి తెలుసుకోలేడని నొక్కి చెప్పింది. ఉపనిషత్సాహిత్యంలో ఈ సమన్వయం కనబడుతుంది.

యజుర్వేదంలోని ప్రధాన మంత్రభాగంగా రుద్రాధ్యాయానికి విశ్వజనీనమైన వ్యాప్తిఉంది. ఋగ్వేదంలోను అథర్వణవేదంలోను దీనిలోని కొన్ని మంత్ర

భాగాలు కనబడతాయి. దీనికి-రుద్రాభిషేకంలోను, మహాన్యాసంలోను, రుద్ర యాగంలోను, లింగప్రతిష్ఠలోను, నిత్యార్చనలోను, ఇంకా చాలాచోట్ల వినియోగం ఉంది. దీనిలోని-నమకచమకాలు రెండూ భక్త్యుద్రేకంతో ఉపాసకులు, సామాన్య భక్తులు గానంచేస్తారు. సృష్టిలోని సమస్త వస్తుజాతం-నరులు, పశుపక్ష్యాదులు, ప్రకృతిశక్తులు, ఒకటేమిటి అన్నీ-రుద్రమూర్తులే! రుద్రమూర్తిని శరణుజొచ్చి ఆయన్ని తమ్ముకరక్షించవలసినదిగా, తమ శత్రువులను-అంతశ్శత్రువులనుకూడా-నాశనం చేయవలసినదిగా ప్రార్థించడం దీనిలో కనబడుతుంది. ప్రారంభంలోనే-ఆయన మన్యువు (కోపము) నకు, ఆయన ధనుస్సునకు, ఆయన బాణమునకు, ఆయన బాహువులకు నమస్కారం ఉంది:

"నమస్తే రుద్ర మన్యవ ఉతోత ఇషవేనమః।
నమస్తే అస్తు ధన్వనే బాహుభ్యాముతతేనమః॥"

సూక్తాంతంలో-అగ్నిలో, జలాలలో, ఓషధులలో, సర్వలోకాలలో అంత ర్యామిగా ఏరుద్రుడు ఉన్నాడో-అలాంటి రుద్రునకు నమస్కారం అని పఠించడం ఉంది.

"యోరుద్రో అగ్నౌయో అప్సుయ ఓషధీషు।
యోరుద్రో విశ్వాభువనావివేశ, తస్మై రుద్రాయ నమోఅస్తు॥"

ఇంతకంటె శరణాగతి ఏమిఉంది? ఏకాదశానువాకాలలోఉన్న దీనిలో ఏకా దశానువాకం చివర-"నమోరుద్రేభ్యో యే పృథివ్యాంయేఽన్తరిక్షే యేదివియేషామన్నం వాతోవర్షమిషవః। తేభ్యోదశ ప్రాచీర్దశ దక్షిణాదశ ప్రతీచీర్దశోదీచీర్దశోర్ధ్వాస్తేభ్యో నమస్తేనో మృడయంతుతేయం ద్విష్మోయశ్చనో ద్వేష్టితంవో జమ్భేదధామి॥"అని ఉంది. స్థూలంగా దీనికి-భూమిమీద, అంతరిక్షంలోను, దివంలోను ఎవరెవరు రుద్ర మూర్తులున్నారో; ఎవరికి అన్నం, వాయువు, వర్షం ఆయుధాలో అట్టివారికి నమస్కారం. తూర్పు, దక్షిణం, పడమర, ఉత్తరం, ఊర్ధ్వం-ఇలా సర్వదిక్కు లందు ఉన్న రుద్రమూర్తులకు నా పదివేళ్లకలిపి అంజలిఘటిస్తున్నాను. మేము ఎవరిని ద్వేషింపవలసివస్తుందో; ఎవరు మమ్మల్ని ద్వేషిస్తారో అట్టివారిని తెరిచి యున్న రుద్రుని నోటిలోవేస్తున్నాము-అని అర్థం చెప్పుకోవచ్చును. కొందరు-"నమోరుద్రేభ్యః" అనడంవల్ల వాచిక నమస్కారం, దశప్రాచీరిత్యాదికం చేత కాయికం, వెనుక "తేభ్యోనమః" అనడంచేత మానసికం-అనికూడా వ్యాఖ్యానిస్తారు.

ఏదిఏలాఉన్నా, రుద్రరూపుడైన పరమేశ్వరుణ్ణి శరణుజొచ్చి ప్రార్థించడం, తమ కోరికలను విన్నవించుకోవడం అనేవి వేదకాలంనాటికే ఉన్నాయి. అని తెలుసుకోవడం తెలియజెప్పడం ఇక్కడ మనకు ప్రస్తుతం.

ఇంతకంటెకూడా, వాచ్యంగా నాకు ఇదికావాలి అదికావాలి అని పరమేశ్వరుణ్ణి ప్రార్థించడం "చమకం"*లో కనబడుతుంది. దీనిలో అతిప్రసిద్ధమైనభాగం- "శం చమే, మయశ్చమే, ప్రియంచమేఽను కామశ్చమే సౌమనసశ్చమే భద్రంచమే శ్రేయశ్చమే వస్యశ్చమే, యశశ్చమే, భగశ్చమే, ద్రవిణంచమే...." మొదలైనది. ఆత్మార్పణబుద్ధిని ప్రత్యక్షంగా పరోక్షంగా ఇవన్నీ చెప్పేవే. దీని ప్రారంభంలోని- "అగ్నావిష్ణూ సజోష సేమా వర్ధన్తువాంగిరః, ద్యుమ్నైర్వాజేభిరాగతమ్"అనేది ఉంది. స్థూలంగా దీని అర్థం-ఓ అగ్నావిష్ణువులారా (అగ్ని, విష్ణువుచేరి అగ్నావిష్ణువులని సంబోధింపబడ్డారు) మీరిద్దరు మామీద సమానమైన ప్రీతినిఉంచండి. మిమ్మల్ని మేము చేసే స్తుతివాక్యాలు వృద్ధిపొందుగాక! మీరు ధనంతోను, అన్నంతోను మా దగ్గరికిరండి-అని. వీటికన్నింటికి ఆధ్యాత్మికార్థాలు చెప్పవచ్చును. ఏదిఏమైనా- అన్నిచోట్ల భక్తిప్రపత్తుల సమర్పణ మనకు కనబడుతుంది. మనకు ఈ సందర్భంలో కావలసినది ఆవిషయం.

ప్రసిద్ధములైన పంచసూక్తాలలో (పురుష, నారాయణ, శ్రీ, భూ, నీళా సూక్తాలు) ఆత్మార్పణ భావాలు, తత్ఫలితాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఉదాహరణ ప్రాయంగా పురుష సూక్తం చివరి భాగాన్ని గ్రహించవచ్చును:

"తస్యధీరాః పరిజానన్తి యోనిమ్।మరీచీనాం పదమిచ్ఛన్తి వేధసః।

---

*"చమకం"లో మే, మే, మే (నాకు, నాకోసం)అని కనబడడాన్ని తమ్ము చూచి తాము నవ్వుకోగలిగిన మన వేదాంతులలో ఒకరు-ఈ మే, మే అనే పురుష దనే అజాన్ని (మేకను) కాలమనేవృకం (తోడేలు) చంపుతుంది-అని అన్నారు! చూడండి!

"అశనంమే, వసనంమే, జాయామే, బంధువర్గోమే।
ఇతి మేమే కుర్వాణం కాలవృకోహన్తి పురుషాజమ్॥"

అన్నీ కావాలని కోరుకొంటూనే, పరతత్త్వం దృష్ట్యా ఇవన్నీ నశ్వరాలని గ్రహించి నవ్వుకోవడంలోనే మన సనాతనుల వైశిష్ట్యంఉంది!

యోదేవేభ్య ఆతపతి, యోదేవానాం పురోహితః, పూర్వో యోదేవేభ్యో జాతః నమోరుచాయ బ్రాహ్మయే, రుచం బ్రాహ్మం జనయన్తః దేవా అగ్రే తద బ్రువన్, యస్త్వైనం బ్రాహ్మణో విద్యాత్, తస్యదేవా అసన్వశే, హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ, అహోరాత్రే పార్శ్వే, నక్షత్రాణి రూపమ్ అశ్వినౌవ్యాత్తమ్, ఇష్టం మనిషాణ, అముంమనిషాణ సర్వం మనిషాణ ॥

స్థూలంగా దీని అర్థం–జ్ఞానులు ఆ ప్రజాపతి నిజరూపాన్ని తెలుసుకొంటున్నారు. బ్రహ్మలు మకిచి మొదలైనవారి స్థానాలను కోరుకొంటున్నారు. దేవతల కోసం సర్వత్ర ప్రకాశిస్తూ ఉన్నటువంటి, వారి పురోభివృద్ధిని కోరుతున్నటువంటి, వారి కంటె పూర్వమే పుట్టినటువంటి పరబ్రహ్మకు నమస్కారం. సృష్ట్యాదిని సమస్త దేవతలు ఆ పరబ్రహ్మ తత్త్వాన్ని సంబోధించి ఓ "పరమాత్మా ! పైని వివరించిన విధంగా తెలిసికొనిన జ్ఞానియైన బ్రాహ్మణునకు సర్వ దేవతలు వశులై ఉన్నారు. లజ్జాదేవి, శ్రీదేవి (హ్రీః, లక్ష్మీః) నీకు భార్యలు. రేయింబవళ్ళు నీ పార్శ్వాలు. నక్షత్రాలు నీరూపం, అశ్విని దేవతలు (తెరువబడిన నీ నోరు) నీ ముఖం, (ఓ విరాడ్రూపా!) మేము కోరుకొన్న దానిని ఇయ్యి. ఆత్మజ్ఞానాన్ని ఇయ్యి, ఐహికాముష్మికములైన సర్వాన్ని అనుగ్రహించు" అని ప్రార్థించారు.

పురుషసూక్తంతో తుల్య ప్రాధాన్యమున్న శ్రీసూక్తంలోను . భక్తుని లేదా ఉపాసకుని శరణాగతి, ప్రార్థనాదికం స్పష్టంగా గోచరిస్తుంది. మొట్టమొదటే, హిరణ్మయి అయిన లక్ష్మీదేవిని నాకోసం ఆహ్వానించు అని అగ్నిని ప్రార్థించడంతో ఈ సూక్తం ప్రారంభం అవుతుంది. ("హిరణ్మయీం లక్ష్మీం జాతవేదోమమావహ") తరువాత, పద్మస్థిత, పద్మవర్ణ అయిన లక్ష్మిని పిలుస్తున్నాను అంటాడు. "(పద్మేస్థితాం పద్మ వర్ణాం తామిహోపహ్వయే శ్రియమ్)" తరువాత ఆ లక్ష్మిని నేను ఉపాసిస్తాను అంటాడు సాధకుడు, శరణు అంటాడు. ఆమె ఉదార గనుక తనకు రక్షణ ఇస్తుందని విశ్వసిస్తాడు. "(ఉదారామ్, తాం పద్మినీం శరణమహం ప్రపద్యే)" ఇక్కడ– "ఈం" అనే బీజాక్షరంతో చెప్పడం ఉంటుంది. ఈ బీజం లక్ష్మీ సరస్వతీ స్వరూపదేవి అని తెలియజేస్తుంది. "(ఈకారోఙ్కిదశే లక్ష్మ్యాం వాణ్యాం కమలకేసరే".రత్నమాలాభిధానం)" శ్రీలక్ష్మిని

ఆహ్వానించడంలో తృప్తిపడక ఉపాసకుడు తన "అలక్ష్మి" (దౌర్భాగ్యం) నశించు గాక అనుకొంటాడు. ("అలక్ష్మీర్మేనశ్యతాం") జగజ్జననిని "త్వాం వృణే" అని వేడుకొంటాడు. సర్వమైన-అభూతిని (అనైశ్వర్యం) అసమృద్ధిని నా ఇంటి నుండి వెడలగొట్టు మంటాడు. ("అభూతిమసమృద్ధించ సర్వాం నిర్ణుదమేగృహాత్") ఇంతటితో కూడా తృప్తిపడక లక్ష్మి పుత్రుడైన చిక్లీతుని (మన్మథుని) తన ఇంట వసింపుమని, అతని జనని అయిన లక్ష్మీదేవిని సుస్థిరంగా తన కుల (వంశ) మందు ఉండునట్లుగా చేయుమని కూడా ప్రార్థిస్తాడు. "(ఆపః సృజన్తు స్నిగ్ధాని చిక్లీత వసమేగృహే! నిచదేవీం మాతరం శ్రియం వాసయ మే కులే॥)"

ఉదాహరణ ప్రాయంగా రెండు సూక్తాలనుండి ఉద్ధరణలు చూపించాను. సూక్తాలలోనేగాక శాంతి పాఠాలలో కూడా ఈ ఆత్మార్పణ భావం, భక్తి శ్రద్ధలు అడుగడుగున కనబడతాయి. ఉదాహరణకు "తైత్తిరీయోపనిషత్తు"లోని పూర్వ శాంతి పాఠాన్ని గ్రహించవచ్చును:

"శంనోమిత్ర శ్శంవరుణః। శంనోభవత్వర్యమా। శం న ఇంద్రో బృహస్పతిః। శంనోవిష్ణురురుక్రమః। నమో బ్రహ్మణే। నమస్తేవాయో। త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి। త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మవదిష్యామి। ఋతం వదిష్యామి। సత్యం వదిష్యామి। తన్మామవతు। తద్వక్తారమవతు। అవతుమామ్। అవతు వక్తారమ్। ఓం శాన్తిః। శాన్తిః। శాన్తిః॥

స్థూలంగా అర్థం ఇది : మిత్ర, వరుణ, అర్యమ, ఇంద్ర, బృహస్పతి, విష్ణుదేవతలారా! మాకు సుఖశాంతుల్ని కలుగజేసేవారుగా ఉందురుగాక! బ్రహ్మమునకు నమస్కారం. ఓ వాయుదేవతా నీకు నమస్కారం. నువ్వే ప్రత్యక్షంగా బ్రహ్మమై ఉన్నావు. నిన్నే వాగ్బ్రహ్మరూపంగా అంటున్నాను. ఋతంగా, సత్యంగా నిన్నే అంటున్నాను. ఆ బ్రహ్మం నన్ను రక్షించునుగాక! గురువును రక్షించునుగాక! నన్ను రక్షించునుగాక! గురువును రక్షించినుగాక! "శాన్తిః" అని మూడు సార్లు పలకడంవల్ల-ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక తాప త్రయాలు-శాంతించును గాక అని.

వేదాదివిద్యలను అభ్యసించేవారు కూడా భక్తిభావంతో పరమేశ్వరుని ధ్యానించడం కనబడుతుంది. తమకు ఆరోగ్యాదికాన్ని ప్రసాదించి తాము తల

పెట్టిన మహాకార్యాలు కొనసాగాలని వేడుకోవడం ఉంది. చిత్తవైకల్యాన్ని కలిగించే దృశ్యాలుగాని, మాటలుగాని కంటికి చెవికి గోచరాలు కాకుండా రక్షించవలసినదని వేడుకోవడం కనబడుతుంది. ఇలాంటి అన్నిచోట్ల ఉపాసకుడు లేదా శిష్యుడు వినీతుడై ఉంటాడు. మనం గ్రహించవలసిన ముఖ్యవిషయం ఇది. క్రింది శాంతి పాఠాలూ రెండూ ఋగ్వేదానికి చెందినవైనా అధర్వణ వేదానికి సంబంధించిన ఉపనిషత్తులలో ఉపయోగించడం కనబడుతుంది.

"ఓం భద్రం కర్ణేభిః శృణుయామదేవాః
భద్రం పశ్యేమాక్ష భిర్యజత్రాః।
స్థిరైరంగై స్తుష్టువాగ్ం స స్తనూభి
ర్వ్యశేమ దేవహితం యదాయుః॥"

"స్వస్తి న ఇంద్రో వృద్ధశ్రవాః స్వస్తినః పూషా విశ్వవేదాః।
స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః స్వస్తినో బృహస్పతిర్దధాతు॥"
ఓం శాంతిః। శాంతిః। శాంతిః॥

స్థూలంగా దీని అర్థం ఇది. ఓ దేవతలారా! మేమెప్పుడు మా చెవులతో (గురుశిష్యులము) భద్రమైనవే విందుముగాక! మాకన్నులతో మేము యజ్ఞయాగాది భద్రమైన వాటినే చూచెదముగాక! మీ గుణకీర్తన చేసే మేము మా పూర్ణజీవిత కాలాన్ని దృఢగాత్రులమై ఆరోగ్యంతో జీవింతుము గాక! వేదాంలో ద్రష్టలచేత కీర్తించబడిన ఇంద్రుడు, సర్వవిదుడు ప్రపంచపోషకుడైన పూషుడు (సూర్యుడు) అరిష్టాలనుండి రక్షించే తార్క్ష్యుడు (గరుత్మంతుడు) మా బ్రహ్మవర్చస్సును పరిరక్షించే బృహస్పతి మా వేదవిద్యాధనాన్ని, వాటిలోని సత్యాన్ని పాలించేశక్తిని అనుగ్రహింతురు గాక! అని.

గురుశిష్యులిద్దరు కలిసి పఠించే అతి ప్రసిద్ధమైన- "సహనావవతు సహనౌభునక్తు సహవీర్యం కరవావహై తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై ఓం శాంతిః శాంతిః శాంతిః దీని స్థూలార్థం ఇది పరబ్రహ్మ మా గురుశిష్యులిద్దరిని రక్షించునుగాక! (పరబ్రహ్మ) మాఇద్దరిని పరిపాలించుగాక! (మేమిద్దరం) కార్యదక్షతసామర్థ్యాలతో (పనులను) నిర్వర్తించెదముగాక! మాచేత అధ్యయనం చేయబడిన విద్య తేజోవంతమైనది. అగుగాక! (గురుశిష్యులమైన మా ఇద్దరిమధ్య) ద్వేషము కలుగకుండుగాక!- అని.

ఇవన్నీ - అతి ప్రాచీన కాలంనుండి మానవుడు పరమేశ్వరానుసంధాన విషయంలో చూపిస్తూవచ్చిన - ప్రేమానురాగాలు, భయభక్తులు, వినయవిధేయతలు తన కోరికలను తెలుపుకోవడం విషయంలో చూపిన చొరవ, ఇతరుల అభివృద్ధిని కూడా కాంక్షించే సామాజిక దృక్పథం మొదలైనవాటిని తెలియజేస్తాయి.

భక్తిప్రపత్తుల, శరణాగతి తత్త్వ ప్రకటనకు ఉత్తమోదాహరణంగా వాల్మీకిమహాకవి వ్రాసిన శ్రీమద్రామాయణ మహాకావ్యాన్ని పెద్దలు స్వీకరించారు. శ్రీవిశిష్టాద్వైత సంప్రదాయజ్ఞులు దీన్ని దీర్ఘశరణాగతికావ్యంగా సంభావించి వ్యాఖ్యానించారు. గోవిందరాజీయమిట్టిదే। ("అతఏవ రామాయణం దీర్ఘశరణాగతిరిత్యభియుక్తైః ఉక్తమ్") ప్రపన్నులకు దీనిలో. అడుగడుగున మాట మాటలోను, ప్రతిసన్నివేశంలోను, ప్రతిపాత్రలోను భక్తిరూపంలోగాని, వైరభక్తి రూపంలోగాని ఈ శరణాగతి కనబడుతుంది. దీనికి తగినట్లుగానే వాల్మీకిమహర్షి ఈ మహాకావ్యాన్ని తీర్చిదిద్దాడా అనిపిస్తుంది. భూలోకంలో వేదధర్మాన్ని ప్రచారం చేయడానికి వాల్మీకి అవతరించాడా అనిపిస్తుంది! పరమపురుషుడైన శ్రీమన్నారాయణుడు దాశరథిగా పురుషునిగా అవతరించగానే, ఆయన గుణకీర్తనైకపరాయణమైన వేదం, శ్రీవాల్మీకి ద్రష్టకాగా శ్రీమద్రామాయణంగా అవతరించింది. ఈ విషయాన్నే-

"వేదవేద్యే పరేపుంసి జాతేదశరథాత్మజే।
వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా॥"

అనే శ్లోకం మనోహరంగా వివరించింది. రామాయణ విషయమై- ఇంతకంటె అల్పాక్షరాలలో, అసందిగ్ధంగా, అనల్పార్థాన్ని వ్యక్తీకరించడం సాధ్యమా!

వేదోపనిషత్తులలో- ప్రత్యక్షంగా కొన్నిచోట్ల, పరోక్షంగా చాలాచోట్ల వ్యంగ్యమర్యాదను పాటించి, శరణాగతితత్త్వాన్ని నిరూపించిన భాగాలలో కొన్నింటిని స్థాలీపులాక న్యాయాన్ని అనుసరించి పరిశీలించిన తరువాత రామాయణాన్ని కూడా ఆ దృష్టితో చూడవలసి ఉంది. మర్యాదాపురుషోత్తముడైన శ్రీరామచంద్రుని అవతారంతో బాటు మరి రెండవతారాలు కూడా మనల్ని సంపన్నం

చేశాయి. అపౌరుషేయమైనవేదం పురుషముఖంగా వాల్మీకినోట రామాయణంగా అవతరించడం ఒకటి! అతఃపూర్వంలేని లౌకికఛ్ఛందస్సు ఆవిర్భవించడం రెండోది! ఈ రెండింటివల్లనే శ్రీమద్రామాయణం అర్హమైన ఆదికావ్యం అయింది. ఈ రెండు అవతారాలు భారతీయ సంస్కృతికి మూలభూతాలైన సహస్రాధిక గ్రంథజాతం బయలుదేరడానికి ప్రత్యక్షకారణాలయ్యాయి. పురాణేతిహాసాలు, దృశ్యశ్రవ్యకావ్యాలు, వివిధశాస్త్రాలు ఆదికావ్యావిర్భావం తరువాత మన చైతన్యాన్ని సంపన్నం చేశాయి అనడంలో సంశయం లేదుగదా। అవతారాలలో కూడా, "కృష్ణస్తుభగవాన్ స్వయం" అని భక్తులు ఆరాధించే కృష్ణావతారం, రామావతారం తరువాత వచ్చినదే గదా!

లౌకికమైన ఛందస్సులో వాల్మీకినోట "క్రౌంచ మిథునానురాగదారణము వలని, శోకమే శ్లోకమయి" (రాయప్రోలు) వెలువడిన శ్లోకం-

"మానిషాద ప్రతిష్ఠాంత్వమగమశ్శాశ్వతీస్సమాః।
యత్క్రౌంచమిథునాదేకమవధీః కామమోహితమ్॥"

అనేది. ఈ మాటలు నోటివెంట వెలువడిన వెంటనే వాల్మీకి తన శిష్యునితో ఇలా అన్నారు-

"పాదబద్ధోఽక్షరసమస్తం త్రీలయ సమన్వితః।
శోకార్తస్యప్రవృత్తోమే శ్లోకోభవతునాన్యథా॥"

తన శోకానికి. సమాక్షరాలతో పాదబద్ధమై తంత్రీలయసమన్వితమైన రూపం రావడాన్ని పరిశీలించిన వాల్మీకి మహర్షి ఇది శ్లోకం కాని ఇంకొకటి కాదని వ్యక్తంచేశాడు. మహాకవి కాళిదాసు రఘువంశంలో "శ్లోకత్వమాపద్యత యస్యశోకః" అన్నాడు. ఆనందవర్ధనాచార్యులు "శోకశ్లోకతమాగతః" అన్నాడు.

ఇంత ప్రాముఖ్యమున్న ఈ శ్లోకంలో మన పెద్దలు-రామాయణకథను, భరువదేశాన్ని, వాల్మీకిశాపాన్ని, ఇంకా ఎన్నిందినో సూచనప్రాయంగా గ్రహించారు. సామాన్యంగా శ్లోకానికి స్థూలార్థం. ఓ నిషాదుడా! క్రౌంచమిథునంలో కామమోహితమైన మగపక్షిని చంపినావు గనుక, చిరకాలం నువ్వు ప్రతిష్ఠను

పొందకుందుదువుగాక! "ఇది వాల్మీకి శాపం. దీనిలో అనేక విశేషార్థాల స్ఫూర్తి ఉంది అన్నారు ఆయా విశేషాల అభిమానులు. దీనిలో రామాయణ కథ దిఙ్మాత్రంగా సూచితమైనదని కొందరన్నారు. "మా" శబ్దానికి "లక్ష్మి" అని ప్రసిద్ధమైన అర్థం ఉందని అందరికి తెలుసును. దీన్ని బట్టి– "మానిషాద! (లక్ష్మికి స్థానమైన విష్ణూ!) నీవు రావణ మండోదరీ మిథునంలో కామమోహితుడైన రావణుని చంపినావు గనుక చాలా సంవత్సరాలు ప్రతిష్ఠపొందుదువుగాక" అనే అర్థాన్ని తీశారు కొందరు. "నిషాద" శబ్దానికి ప్రపంచస్థితికి భంగం కలిగించే "అధర్మం" అని అర్థం ఉంది గనుక, దాన్ని సంబోధిస్తూ– "ఓ అధర్మమా! నీవు అధర్మదంపతులైన సీతారాములకు వియోగం తెచ్చినావు గనుక (సీతాపహరణం కారణంగా) నీవు చిరకాలం స్థిరంగా ఉండకుందుదువుగాక!" అని చెప్పినట్లయిందని కొందరు అర్థాన్ని లాగారు. "తంత్రీలయసమన్వితః" అని వాల్మీకి మహర్షియే అన్నాడు గనుక రామాయణానికి "పాఠ్యేగేయేచ మధురమ్" అనే ప్రఖ్యాతి ఉంది కూడా గనుక ఈ శ్లోకంలోని అక్షరాలలో– స రి గ మ ప ద ని అనే స్వరాక్షరాలు గోచరిస్తూ ఉన్నాయి గనుక, వాటిలోని మొదటి అక్షరాలు క్రౌంచీ రా దానికి సంబంధించిన రాగస్వరాలను సూచిస్తున్నాయని సంగీతజ్ఞులు చెప్పడం ఉంది. కాని, రామాయణమంతా దీర్ఘశరణాగతి అని తోచక మానదు!

ఈ విశ్వాసంతోనే రామాయణాన్ని పారాయణ చేసి వ్యాఖ్యాన రచన కుపక్రమించినవారికి ప్రథమంలోనే ఈ ప్రస్తావన దృగ్గోచరం కావడంలో ఆశ్చర్యం లేదు. వారికి:

> "తపస్స్వాధ్యాయనిరతం తపస్వీవాగ్విదాంవరమ్ ।
> నారదం పరిపప్రచ్ఛ వాల్మీకి ర్మునిపుంగవమ్ ॥"

అనే శ్లోకంలో "తపః" అనే మాటలోనే "శరణాగతి" దర్శనమిచ్చింది. ఈ శబ్దానికి ఇతర నిర్వచనాల్ని ఇస్తూనే శ్రీ గోవిందరాజు తన వ్యాఖ్యానంలో "యద్వాతపోన్యాసః తస్మాన్న్యాసమేషాం తపసామతిరిక్తమాహురితి శ్రుతేః న్యాసశ్చశరణాగతిః ప్రణిపాతరూపా" అన్నాడు.

కృష్ణయజుర్వేదానికి చెంది యాజ్ఞిక్యుపనిషత్తని ప్రసిద్ధిపొందిన మహానారాయణోపనిషత్తులో 78వ అనువాకం (అష్టసప్తతితమోఽనువాకః), 79వ అను

వాకం (ఏకోనాశీతితమోఽనువాకః) భగవత్ప్రాప్తికి సాధనాలను పరిశీలించాయి. సత్పురుషుల మనస్సులు ఏఏవిషయాలను సర్వోత్తమంగా గ్రహించి ఆనందిస్తాయో వేటిని మోక్షసాధనలుగా చెప్పడం జరుగుతుందో ఈ అనువాకాలలో వివరించడం జరిగింది. వీటిలో వివిధవ్యక్తుల అభీష్టానుసారం వివరణ జరిగింది. అన్నీ శ్రేష్ఠమైనవయినా— కొందరు కొన్నింటిని మరికొందరు మరికొన్నింటిని గ్రహించినట్లు తెలుస్తుంది. ప్రతిఒక్కటి గమ్యస్థానాన్ని చేర్చగలిగినదైనా "న్యాసం" సర్వోత్తమమైనదిగా నిరూపితమైంది. ఈ న్యాసమే పరబ్రహ్మ అనేటంతటివరకు ఈ వివరణ కొనసాగింది. ఈ న్యాసాన్ని సన్న్యాసంగా అద్వైతులు గ్రహించగా, "న్యాసశ్చ శరణాగతిః, ప్రపత్తిరూపా" అని విశిష్టాద్వైతులు గ్రహించారు.

శ్రేయోర్థినులు ఏఏ విషయాలను పరమంగా గ్రహించి ఆనందిస్తారో 78వ అనువాకంలో- ఒకదాని తరువాత ఒకటి పన్నెండు విషయాలను వివరించడం జరిగింది. అవి- సత్యం (సతాంహి సత్యం, తస్మాత్ సత్యేరమంతే) తపస్సు (తస్మాత్ తపసి రమంతే) దమం (తస్మాత్ దమే రమంతే) శమం (తస్మాత్ శమే రమంతే) దానం (తస్మాత్ దానేరమంతే) ధర్మం (తస్మాత్ ధర్మేరమంతే) ప్రజననం (సంతానోత్పత్తి; ప్రజననం జాతి మనుగడకు అవశ్యకం గనుక— ప్రజననేరమంతే) అగ్నులు (వేదవిదునకు అగ్నులు ప్రాణసమానాలు, వేదం ప్రకారం ఐదుమహాగ్నులున్నాయి. అవి-గార్హపత్యం, అన్వాహార్యపచనం అనే దక్షిణాగ్ని, అగ్నేధ్రియం, అవస్థ్యం, ఆహవనీయం— అనేవి. అగ్నయ ఇత్యాహ తస్మాదగ్నయ ఆధాతవ్యాః) అగ్నిహోత్రం (యావజ్జీవం అగ్నిహోత్రం జుహుయాత్ అనివిధి. అగ్నిహోత్రమిత్యాహ. తస్మాదగ్నిహోత్రేరమంతే) యజ్ఞం (యజ్ఞ ఇతి యజ్ఞేన హి దేవాః దివం గతాః, తస్మాత్ యజ్ఞేన రమంతే) మానసం (మానసికపూజ-తస్మాత్ విద్వాంస ఏవమానసేరమంతే) న్యాసం (న్యాస ఇతిబ్రహ్మ బ్రహ్మ హిపరః పరోహి బ్రహ్మతాని వా ఏతాన్యవరాణి తపాంసి న్యాస ఏవాత్యరేచయత్ య ఏవం వేదేత్యుపనిషత్) అనేవి. సాయణాచార్యునకు పూర్వుడైన భట్టుభాస్కరుడు "న్యాసం" అనేదాన్ని "సర్వకర్మఫలత్యాగం'గా వ్యాఖ్యానించగా సాయణుడు న్యాసానికి సన్న్యాసయోగానికి భేదం లేదన్నాడు. శ్రీశంకరులు తమ బ్రహ్మసూత్రభాష్యంలో (III; 4 20) ఈ భాగాన్ని ఉదాహరిస్తూ, సన్న్యాసానికి ఇది సర్వశ్రేష్ఠత్వాన్ని కల్పించి, ఆ ఆధారాన్ని సమర్థించింది అన్నారు.

79వ అనువాకంలో మోక్షసాధన విషయంలో 78వ అనువాకంలో చెప్ప

జరినవాటినే గ్రహించి వాటి ప్రత్యేకతను విపులీకరించడం జరిగింది. మొట్టమొదట సత్యాన్నే గ్రహించి సత్యనిష్ఠులైనట్టివారు "సత్యే సర్వం ప్రతిష్ఠితం తస్మాత్ సత్యం పరమం వదంతి" అంటారు గనుక మోక్షసాధన సామగ్రిలో సత్యం పరమమైనదని. అనశనకాయక్లేశాది రూపమైన తపస్సునందు "సర్వం ప్రతిష్ఠితం తస్మాత్తపః పరమం వదంతి (అనికొందరంటారు) గనుక తపస్సు శ్రేష్ఠమైనదని; ఇంద్రియనిగ్రహాన్ని సాధించినవారు- "భూతానాం దురాధర్ష దమే సర్వం ప్రతిష్ఠితం తస్మాద్దమః పరమం వదంతి" అంటారు) గనుక దమం పరమమైనదని శమం వల్ల క్రోధాదిచిత్తవృత్తులను నిరోధించినవారు- "భూతానాం దురా ధర్షం శమే సర్వం ప్రతిష్ఠితం తస్మాచ్ఛమః పరమం వదంతి" (అంటారు) గనుక మోక్షసాధన సామగ్రిలో శమం విశిష్టమైనదని; యజ్ఞాలకు దక్షిణారూపమైన దానం గృహస్థానీయం గనుక, దానంవల్ల శత్రువులు మిత్రులవుతారు గనుక దానగుణం ఉన్నవారు "దానే సర్వం ప్రతిష్ఠితం తస్మాద్దానం పరమం వదంతి" (అంటారు) గనుక, దానం పరమమైనదని; ధర్మం జగత్తునకు ఆశ్రయం గనుక, ధర్మంవల్ల పాపాలునశిస్తాయి గనుక ధర్మిష్ఠులు "ధర్మే సర్వం ప్రతిష్ఠితం తస్మా ద్ధర్మం పరమం వదంతి"(అంటారు)గనుక ధర్మం పరమైనదని సంతానోత్పాదనం జాతిమనుగడకే మూలంగనుక, పితృఋణం తీర్చుకోవడానికి వంశాన్ని కొనసాగించ డానికి ప్రజననం ప్రతిష్ఠితం గనుక, ఆ దృష్టికలవారు "ప్రజననం పరమం వదంతి (అంటారు)గనుక ప్రజననం శ్రేష్ఠమైనదని (దేవఋణం, గురుఋణం, పితృఋణం తీర్చడానికి-జాయమానో హ వై పురుషః త్రిభి ఋణవాం జాయతే-ప్రతి పురుషుడు ఈ మూడు ఋణాలతో జన్మిస్తాడు గనుక- దేవతార్చనవల్ల దేవఋణం, విద్యా భ్యాసం చేసి ఆవిద్యను ఇతరులకు చెప్పి గురుసంప్రదాయాన్ని కొనసాగించి గురుఋణం అపత్యోత్పాదనం వల్ల పితృఋణాన్ని తీర్చాలి. కనుక ప్రజననం శ్రేష్ఠమైనది- "ప్రజాయాః తంతుం తన్వానః పితృణా మనృణో భవతి తదేవ తస్యానృణం, తస్మాత్ ప్రజననం పరమం వదంతి) త్రేతాగ్నుల సేవనం పరమ మైనదని త్రయీవిద్య దేవయానమార్గం. గార్హపత్య, అన్వాహార్యపచన, ఆహవ నీయాగ్నులు మూడు. గార్హపత్యాగ్ని ఋగ్వేదాత్మకం, పృథివీరూపం, రథంతర సామం, అన్వాహార్యపచననామకాగ్ని దక్షిణాగ్ని యజుర్వేదాత్మకం, అంతరిక్ష లోకరూపం, వామదేవ్యసామం, ఆహవనీయాగ్ని సామవేదాత్మకం, స్వర్గలోక

రూపం, బృహత్సామం "తస్మాత్ అగ్నీన్ పరమం వదంతి") అగ్నిహోత్రవిధి పరమమైనదని అనుష్ఠానపరులు చెప్పుతూ సాయంకాలం ప్రాతఃకాలం అగ్ని కార్యం వల్ల గృహసంబంధి పాపాలు నిష్కృతి పొందుతాయి గనుక యజ్ఞక్రతువులకది ప్రారంభంగనుక, మోక్షసాధనక్రియలలో అది పరమమైనదని (అగ్నిహోత్రం సాయంప్రాతర్గృహాణాం నిష్కృతిః స్విష్టం సుహృతం యజ్ఞ క్రతూనాం ప్రాయణం సువర్గస్య (స్వర్గస్య) లోకస్య జ్యోతిస్తస్మాదగ్నిహోత్రం పరమం వదంతి); యజ్ఞకర్మనిరతులు యజ్ఞం వల్లనే దేవతలు స్వర్గాన్ని పొందారని, అసురులను నిర్జించారని యజ్ఞంవల్ల శత్రువులు మిత్రులవుతారని, మోక్ష సాధనకు యజ్ఞాన్నిమించిన సాధనంలేదని సర్వం యజ్ఞమందే ప్రతిష్ఠితమై ఉన్న దనీ అంటారు గనుక యజ్ఞం పరమమైనదని(యజ్ఞేన హి దేవాదివం గతా యజ్ఞేనా సురానపానుదంత యజ్ఞేన ద్విషంతో మిత్రా భవంతి యజ్ఞే సర్వం ప్రతిష్ఠితం, తస్మాద్యజ్ఞం పరమం వదంతి) మానసోపాసన సర్వశ్రేష్ఠమని, ఆశక్తివల్లనే ఋషులు సంకల్ప మాత్రంచేతనే సృష్టిచేశారని, ప్రజాపతి స్థితిని పొందారని, అందువల్ల మానసోపాసనయందే సర్వం ప్రతిష్ఠితమై ఉన్నదని (మానసం వై ప్రాజాపత్యం పవిత్రం మానసేన మనసా సాధుపశ్యతి మనసా ఋషయః ప్రజా అసృజంత, మానసే సర్వం ప్రతిష్ఠితం తస్మాన్మానసం పరమం వదంతి). పదకొండు విషయాలను దేనికదే పరమం అని చెప్పుతూ వివరించడం జరిగింది.

సౌపర్ణేయ అరుణికి. అతని ప్రశ్నకు సమాధానంగా (కిం భగవంతః పరమం వదంతి?) ప్రజాపతి, 78వ అనువాకంలో చెప్పిన ఒక్కొక్క విషయాన్ని గ్రహించి ఈ అనువాకంలో వివరించినట్లు అనువాక ప్రారంభంలో ఉంది. (ప్రజాపత్యో హారుణిః సుపర్ణేయః ప్రజాపతిం పితరముప ససార కిం భగవంతః పరమం వదం తీతితస్మై ప్రోవాచ) ఈ వివరణలలో ఒకదాని తరువాత ఒకటి దేనికదే పరమం అని చెప్పడం. ఆరుణికి అంతతృప్తి ఇచ్చినట్లులేనట్లు తోచి నందువల్ల ప్రజాపతి పంద్రెండవదైన "న్యాసం" గూర్చి చెప్పారు. "న్యాస ఇత్యా హుర్మనీషిణో బ్రహ్మాణం బ్రహ్మవిశ్వః కతమః స్వయంభూః ప్రజాపతిః సంవత్సర ఇతి" మోక్షహేతువైన సన్న్యాసం అని గ్రహించాలి ఇక్కడ న్యాసాన్ని. మోక్ష హేతువుగా చెప్పబడింది. మనీషులు బ్రహ్మను హిరణ్యగర్భరూపునిగా చెప్పారు. ఈయన సర్వజగదాత్మకుడు (విశ్వః) అతిశయ సుఖస్వరూపుడు (కతమః) స్వయంభువుడు (స్వయంభూః) ప్రజాపాలకుడు (ప్రజాపతిః) కాలాత్మకుడు

(సంవత్సరః). భట్టభాస్కరుడు తన వ్యాఖ్యానంలో "సమ్యక్ వసంతి అనేన భూతాని ఇతి సంవత్సరః" అన్నాడు. ఈ స్థితిభూతాలకు కల్పించేవాడు సూర్యుడు గనుక ఇక్కడ కాలాత్మకుడైన సూర్యుని గ్రహించాలి అన్నాడు. ఈ భావానికి బలం కూర్చేది దీని తరువాత వచ్చే "సంవత్సరోఽసావాదిత్యోయ ఏష ఆదిత్యే పురుషః స పరమేష్ఠీ బ్రహ్మాత్మా" అనేది. సంవత్సరమే ఈ ఆదిత్యుడు. సూర్యాంతర్వర్తి అయిన పురుషుడు, హిరణ్యగర్భుడు; పరమేష్ఠి, బ్రహ్మాత్మ. ఇదంతా న్యాసానికి సన్న్యాసం అని అర్థం చెప్పి దాన్ని పరబ్రహ్మవరకు తీసుకొని వెళ్లడం వల్ల జరిగింది. ఇక్కడ సూర్యుడంటే కేవలం సూర్యబింబం కాదు. మండలాంతర్వర్తి అయిన పరమపురుషుడు శ్రీమన్నారాయణుడు. ఈ పరమపురుషుని ధ్యానించి ఉపాసించవలసినదిగా చెప్పే ప్రసిద్ధ ధ్యానశ్లోకం ఉంది:

ధ్యేయస్సదా సవితృమండల మధ్యవర్తీ
నారాయణ స్సరసిజాసన సన్నివిష్టః ।
కేయూరవాన్మకరకుండల వాన్కిరీటీ
హారీహిరణ్మయవపుర్ధృత శంఖచక్రః ॥

ఈ సూర్యనారాయణుడు సర్వదేవతా స్వరూపుడు మాత్రమే కాక మన సంప్రదాయంలో ప్రముఖులైన వారందరు ఆయన స్వరూపులే అని ఆర్షమైన శ్రీమద్రామాయణంలోని 'ఆదిత్యహృదయస్తోత్రం' ప్రవచించింది:

ఏషబ్రహ్మాచ విష్ణుశ్చ । శివస్కందః ప్రజాపతిః ।
మహేంద్రోధనదః కాలో । యమస్సోమోహ్యపాంపతిః ॥

పితరోవసవస్సాధ్యా । హ్యశ్వినౌ మరుతోమనుః ।
వాయుర్వహ్నిః ప్రజాప్రాణ । ఋతుకర్తా ప్రభాకరః ॥

సూర్యతాపిన్యుపనిషత్తు అన్నింటినికలిపి సూక్ష్మంగా ఇలా వివరించింది:

"ఏషబ్రహ్మాచ విష్ణుశ్చ । రుద్రఏవహి భాస్కరః ।
త్రిమూర్త్యాత్మాత్రిదేవాత్మా । సర్వదేవమయోరవిః ॥"

సగుణోపాసనకు ప్రాముఖ్యమిస్తూ భావించినప్పుడు "న్యాసం". ఆయన పర

బ్రహ్మ, నిర్గుణుడు అనే అనుభూతి "సన్న్యాసం". ఈ దృష్టితోనే దీని తరువాత 80వ అనువాకంలో (అశీతితమోఽనువాకః) ఆత్మయజ్ఞాన్ని గురించి చెప్పడం జరిగింది:

"తస్యైవం విదుషోయజ్ఞస్యాత్మాయజమానః శ్రద్ధాపత్నీ... అని ప్రారంభించి తస్మాద్బ్రహ్మణో మహిమానమాప్నోతి తస్మాద్ బ్రహ్మణో మహిమానమిత్యుపనిషత్" అని ఇది ముగుస్తుంది.

దీనిలో తత్త్వజ్ఞానియొక్క సర్వలౌకిక వ్యవహారాలు యజ్ఞాంగాలుగా నిరూపితాలు. దీనిలో ప్రప్రథమంగా యోగిశరీరాంగాలే యజ్ఞాంగాలు. పరబ్రహ్మ మాహాత్మ్యాన్ని సాక్షాత్కరించుకొన్న జీవన్ముక్తుని యజ్ఞంలో ఆత్మ యజమాని. ఇది దేహేంద్రియాలకు సాక్షి గనుక ఇలా చెప్పబడింది. పత్నీసహితుడు కాని వాడు యజ్ఞాన్ని చెయ్యడానికి అనర్హుడు గనుక అంతఃకరణమందున్న శ్రద్ధ పత్నిగా చెప్పబడింది. శ్రద్ధలేనివాడు యజ్ఞార్హుడు కాడు శరీరం ఇధ్మం (కట్టెలు), ఉరస్సుయజ్ఞవేదిక, రోమాలు దర్భలు, శిఖవేదం, హృదయం యూపం, కామం ఆజ్యం, కోపం పశువు, తపస్సు అగ్ని, ఇంద్రియోపశమనం దమం (దానం) దక్షిణ, వాక్కు-హోత; నేత్రం అధ్వర్యుడు, శ్రోత్రం అగ్నీధ్రుడు. (శ్రుతి-తస్యైవం విదుషో యజ్ఞస్యాత్మా యజమానశ్శ్రద్ధాపత్నీ శరీరమిధ్మమురోవేది ర్లోమానిబర్హిర్వేదశ్శిఖా హృదయం యూపః కామ ఆజ్యం మన్యుః పశుస్తపోఽగ్నిర్దమశ్శమయితా(దానం)దక్షిణావాగ్ఘోతాప్రాణ ఉద్గాతా చక్షురధ్వర్యుర్మనో బ్రహ్మశ్రోత్రమగ్నీత్.)

యోగి సామాన్యంగా చేసే నిత్యకృత్యాలు- వ్యావహారికకృత్యాలు అన్న మాట- జ్యోతిష్టోమ క్రతువు యొక్క అంగాలుగా నిరూపింపబడ్డాయి:

భుజించనికాలం దీక్ష; భుజించడం హవిస్సు (జల) పానం సోమపానం ఆట (క్రీడ) ఉపసదిష్టులు (ఉపసద్ + ఇష్టులు) నడవడం, కూర్చోవడం, నిల బడడం ప్రవర్గ్యం, ముఖం ఆహవనీయం అనే అగ్ని. మాట్లాడడం ఆహుతి చేయడం, విజ్ఞానం హోమం, సంధ్యాకాలాల భోజనం సమిధలు, త్రిసంధ్యలు సవనాలు (శ్రుతి-యావద్ధ్రియతే సాదీక్షా, యదశ్నాతి తద్ధవిర్యత్పిబతి తదస్య సోమపానం, యద్రమతే తదుపసదో యత్సంచరత్యుపవిశత్యుత్తిష్ఠతే చ వ

ప్రవర్గ్యో యన్ముఖం తదాహవనీయోయా వ్యాహృతి రాహుతిర్యదస్య విజ్ఞానం తజ్జుహోతి యత్సాయం ప్రాతర త్తి తత్సమిధం యత్ప్రాతర్మ ధ్యన్దినగ్ం సాయం చ తాని సవనాని॥)

ఇంక ఇప్పుడు కాలవిశేషాలను వివిధాలైన యజ్ఞాలుగా వర్ణించడం జరిగింది. అహోరాత్రాలు దర్శపూర్ణమాసయజ్ఞాలు, పక్షాలు, మాసాలు చాతుర్మాస్య యజ్ఞాలు; ఋతువులు పశుబంధాలు; సంవత్సర, పరివత్సరాదులు అహర్గణాలు; యోగియొక్క ఆయుర్దాయం సర్వదక్షిణాకమైన సత్రయాగం; మరణమే అవ బృథస్నానం. (ఈ స్నానం యజ్ఞాంతంలో యజమానిచేసేది. యజ్ఞ సమాప్తిని సూచిస్తుంది.)

(శ్రుతి - యే అహోరాత్రే తే దర్శపూర్ణమాసౌ, యేఽర్ధమాసాశ్చ మాసాశ్చతే చాతుర్మాస్యాని య ఋతవస్తే పశుబన్ధా యే సంవత్సరాశ్చ పరివత్సరాశ్చతేఽహర్గణాస్సర్వ వేదసం వా ఏతత్సత్రం యన్మరణం తదవబృథః॥)

జీవన్ముక్తునకు లభించే వివిధ ఫలాదులను ఈ సందర్భంలోనే విపులంగా వివరించడం జరిగింది. యోగి అయినటువంటి జీవన్ముక్తుని జరామరణాది వృత్తాంతమే సత్రయాగం (సహస్రవర్ష) వరకు ఉన్న కర్మస్వరూపం. ఈ యోగి మరణం ఉత్తరాయణంలో జరిగితే, ఇంద్రాదుల మహిమాదులను ఐశ్వర్యాన్ని పొంది, పిమ్మట ఆదిత్యుని సాయుజ్యాన్ని పొందుతున్నాడు. ఈ మరణం దక్షిణాయనంలో జరిగితే అగ్నిష్వాత్తుడు మొదలైన పితృదేవతల మహిమాదికాన్నిపొంది చంద్రసాయుజ్యాన్ని పొందుతున్నాడు. సూర్యచంద్రుల మహిమానుభూతిని అనుభవించి, సగుణబ్రహ్మస్వరూపుడైన హిరణ్యగర్భుని తెలుసుకొని తదుపాసకులలో గణనీయుడవుతున్నాడు. హిరణ్యగర్భ సాక్షాత్కారానంతరం, తల్లోకవాసుల దేహపాతానంతరం హిరణ్యగర్భుని మహిమాదికాన్ని పొందుతున్నాడు. అక్కడే బ్రహ్మతత్త్వ సాక్షాత్కారాన్ని పొంది పిమ్మట పరబ్రహ్మతాదాత్మ్యాన్ని పొందుతున్నాడు

(శ్రుతి- ఏతద్వైజరామర్యమగ్నిహోత్రగ్ం సత్త్రం య ఏవం విద్వానుదగయనేప్రమీయతే దేవానామేవ మహిమానం గత్వాదిత్యస్యసాయుజ్యం

గచ్ఛత్య థయోదక్షిణే ప్రమీయతే పిత్ర్ణాణామేవ మహిమానం గత్వా చంద్రమస స్యాయుజ్యగ్ం సలోకతామాప్నోత్యేతౌ వై సూర్యాచంద్రమసోర్మహిమానౌ బ్రాహ్మణోవిద్వానభి జయతితస్మా ద్బ్రహ్మణోమహిమానమాప్నోతి తస్మాద్బ్రహ్మణో మహిమానమ్– ఇత్యుపనిషత్॥)

ఇక్కడ "జరామర్యం"అని ఉండడాన్ని బట్టి "జరయావయోహాన్యామ్రియతే ఇతి"అని వ్యాఖ్యానించారు. కనుక, ఆత్మహత్య (ఆత్మహననం) నంగీకరించలేదని గ్రహించాలి. ఇది ధర్మవిరుద్ధం గనుక పాపంగా పరిగణించారు. పెద్ద వయస్సువచ్చి సహజంగావచ్చే మృత్యువును ఇక్కడ పేర్కొన్నారనాలి !

ఈ ఆత్మయజ్ఞాన్ని పోలినదే. ఛాందోగ్యంలో పురుషయజ్ఞం అనే పేరుతో కనబడుతుంది. (ఛాందోగ్యే తృతీయాధ్యాయే షోడశః ఖండః । స ప్తదశః ఖండః) ఇది "పురుషో వావయ జ్ఞస్తస్యయాని చతుర్విగ్ంశతి వర్షాణి తత్ప్రాతస్సవనం, చతుర్విగ్ంశత్యక్షరా గాయత్రీ, గాయత్రం ప్రాతస్సవ ం........" అని ప్రారంభించి 16, 17 ఖండాలలో ముగుస్తుంది. దీన్ని జీవాత్మయజ్ఞమని సంభావించాలి.

జీవునకు వివిధవయస్సులలో వచ్చే ఆపదలను నివారించుకొనడానికి ఏయే మంత్రాలు పఠించాలో, ఏ యే దేవతల అనుగ్రహం కావాలో ఈ ఖండాలలో చెప్పబడింది. మూడుదశలుగా ఇవి– ప్రాతస్సవనం అనీ, మాధ్యాహ్నసవనమనీ, సాయం సవనమనీ – వర్ణితాలు. ప్రాతస్సవనం గాయత్రికి సంబంధించినది. గాయత్రికి ఇరువదినాలుగక్షరాలు. దీనికి దేవతలు వసువులు. వీరే సమస్తాన్ని జీవించేలాచేసేవారు. ఇరవైనాలుగేండ్లలోపున వచ్చే ఆ ఆపదలను నివారించుకోవడానికి ఈ మంత్రజపం చెయ్యాలి. ఆరోగ్యలాభం కలుగుతుంది.

ఇరవై నాలుగేండ్లనుండి అరవైఎనిమిదేండ్ల వయస్సువరకు (44 సంవత్సరాలు) ప్రాణరక్షణచేసేవారు రుద్రులు. త్రిష్టుప్ ఛందస్సు, దీనికి నలభైనాలుగు అక్షరాలు. ఇది మాధ్యాహ్నసవనం. ఈ 44 సంవత్సరాల కాలపరిమితిలో ఆపదల నివారణకు దీన్ని జపించాలి. ఆరోగ్యం లభిస్తుంది. రుద్రులు దేవతలు.

అరవైఎనిమిది సంవత్సరాల తరువాతజరిగే నలభైఎనిమిది సంవత్సరాల కాలం (116 సంవత్సరాల వయస్సువరకు) ప్రాణరక్షణ చేసేవారు ఆదిత్యులు. ఇది సాయం సవనం. జగతీ ఛందస్సు. దీనికి నలభైఎనిమిది అక్షరాలు. ఈ

సంవత్సరాలలో వచ్చే ఆపదలను తొలగించుకొని ఆరోగ్యం పొందడానికి ఈ మంత్రం జపించాలి.

ఈ విషయాన్ని గ్రహించిన ఐతరేయ మహిదాసమహర్షి తదుపాసనద్వారా రోగాన్ని నివారించుకొని 116 సంవత్సరాలు జీవించారు. ఈవిధంగా జపించిన వారు 116 సంవత్సరాలు జీవిస్తారు.

("ఏతద్ధస్మవై తద్విద్వానాహ మహిదాస ఐతరేయః స కిం మ ఏతదుపతపసి యోఽహమనేన న ప్రేష్యామీతి సహషోడశం వర్షశతమ జీవత్ప్రం హ షోడశం వర్షశతం జీవతి య ఏవం వేద॥")

ఈ విషయాలన్నీ ఛాందోగ్యంలో మూడో అధ్యాయంలో 16వ ఖండంలో చెప్పబడ్డాయి.

దీని తరువాత 17వ ఖండంలో - పురుషునకు యజ్ఞానికి ఉన్న సామ్య గుణాలు చెప్పడం జరిగింది. ఈ భాగం- ఇంచుమించుగా — తైత్తిరీయోపనిషత్తులోని నారాయణ ప్రశ్నలోని "ఆత్మయజ్ఞ" భాగాన్ని కొన్నిభేదాలతో పోలిఉంది.

శ్రుతిలోఉన్న విషయాల స్థూలవివరణ ఇలా చేసుకోవచ్చును. "యజ్ఞంలో దీక్ష ఉంది. పురుషుడు దేన్ని త్రాగడానికి భక్షించడానికి అభిలషిస్తాడో, ఏది లభించలేదని దుఃఖిస్తాడో అది యజ్ఞవ్రతదీక్ష. దేన్ని భుజిస్తాడో, దేన్ని త్రాగుతాడో, దేన్నిపొంది సంతోషిస్తాడో — వీటిని యజ్ఞంలో ఉన్న అల్పాహారరూపమైన ఉపసదం. భోజనంచెయ్యడం, హసించడం, దాంపత్యజీవితం - అన్నీ యజ్ఞంలోని స్తోత్రాలు. తపస్సుచెయ్యడం దానం చెయ్యడం, ఋజుత్వం, అహింసానుష్ఠానం, సత్యనిష్ఠ - ఇవి యజ్ఞంలోని దక్షిణలు. యజ్ఞంలో "సోష్యతి", "అసోష్ట" అని శబ్దప్రయోగాలున్నాయి. సోమరసం త్రాగబోతున్నాడు, త్రాగినాడు అని వీటి అర్థం. ఈ రెండుపదాలు పురుషజీవితానికే అన్వయిస్తాయి. శబ్దసామ్యం చెప్పబడింది. పురుషయజ్ఞానికి అవభృథస్నానం ('తన్మరణమే వావభృథః"- ఛాందోగ్యంలో ఇట్లున్నట్లే, తైత్తిరీయంలో కూడా "యన్మరణం తదవభృథః" అని ఉంది.

ఇక్కడే ప్రసిద్ధవిషయమైన "దేవకీపుత్రుడైన కృష్ణుని ప్రసంగం" వస్తుంది. ఘోర అంగిరసుని శిష్యుడని కూడ చెప్పబడింది. ఈ ఋషివద్దనే ఉపదేశం

కృష్ణుడు పొందాడు. దీని సర్వోత్కృష్టతను తెలుసుకొనిన కృష్ణుడు ఇంకేవిద్యను అంగిరస్సును అర్థించలేదు. ఈ పురుషవిద్యను గ్రహించిన పురుషుడు తనకు మరణమాసన్నమైనప్పుడు జపించవలసిన వేదఋక్కులు - "అక్షితమసి" (లోపం లేకుండా ఉన్నావు) "అచ్యుతమసి" (చ్యుతంలేకుండా - జారడం లేకుండా - ఉన్నావు)" ప్రాణసంశితమసి" (సూక్ష్మప్రాణమవై ఉన్నావు) అనే మాటలున్నవి (''తద్ధైతద్ఘోర అంగిరసః కృష్ణాయ దేవకీపుత్రాయోక్త్వోవాచా పిపాస ఏవ సబభూవసోఽన్త వేలాయా మేత త్త్రయం ప్రతిపద్యేతాక్షితమస్యచ్యుతమసి ప్రాణసగ్ంశితమసీతి తత్రైతేద్వేఋచౌ భవతః॥")

ఆదిశంకరాచార్యులవారు బ్రహ్మసూత్రం (3-3-24) "పురుషవిద్యాయా మివ చేతరేషామన్నానాత్'' నకు వ్యాఖ్యానం వ్రాస్తూ "తాండిపైంగి" అనే వేద శాఖల రహస్యబ్రహ్మణంలో "పురుషవిద్య" అనే ఉపాసనావిశేషం ఒకటి ఉంది. పురుషుని ఆయుః ప్రమాణాన్ని మూడు భాగాలుగా విభజించి, మూడుసవనాలుగా కల్పించడం జరిగింది. ఇదేవిధంగా తైత్తిరీయంలోని నారాయణ ప్రశ్నలో "పురుషయజ్ఞం"అని ఒకటి ఉంది. ఇక్కడా మూడుసవనాలు, చివర మరణమే అవభృథం- వంటి సమానవిషయాలు కొన్ని ఉన్నా రెండూ ఒకటికావు. సామ్య ధర్మాలున్నట్లుగానే, వైలక్షణ్యంకూడా చాలా ఉంది. తైత్తిరీయాంతర్గత ఆత్మ యజ్ఞానికి అంతిమఫలం - బ్రహ్మప్రాప్తి ఛాందోగ్యంలోని పురుషయజ్ఞానికి ఆయుర్వృద్ధి అంతిమఫలం. ఇందులకు ఐతరేయమహిదాసుని ఉదాహరణకూడా ఇయ్యడం జరిగింది. ఈ రెండింటి పోలికలను తేడాలను చూపిస్తూ "వైయాసిక న్యాయమాల" ఇలా అంది.

"పుం విద్యైకా ? విభిన్నా వా ? తైత్తిరీయతాండినో ।
మరణావభృథేత్యాది సామ్యాదేకేతిగీయతే॥
బహునారూపభేదేన కించిత్సామ్యాన్య బాధనాత్।
నవిద్యైక్యం తైత్తిరీయే బ్రహ్మవిద్యాప్రశంసనాత్॥"

వీటినన్నింటిని బట్టి మనం గ్రహించవలసినది - పురుషుని ఆత్మార్పణకున్న ప్రాముఖ్యం. శ్రుతి, స్మృతి, పురాణేతిహాస కావ్యదులన్నీ గూఢంగా, వాచ్యంగా. యథోచితంగా, ప్రకరణానుకూలంగా - ఆత్మార్పణను శ్లాఘించాయి. భక్తి సిద్ధాంతదృష్ట్యా దీన్ని చూస్తే. శరణాగతిలాగే ఇది భాసిస్తుంది అనడంలో సంశయం లేదనిపిస్తుంది. కొంత తరతమభావం ఉండవచ్చును.

# రామాయణాదులలో శరణాగతి

శ్రీమన్నారాయణుని అవతారాలలో సుప్రసిద్ధమైనవి రామకృష్ణావతారాలు. వాల్మీకిరామాయణం, వ్యాసవిరచిత భాగవతం, ఇతర పురాణాలు; శ్రీమద్భగవద్గీత మొదలైన ఆధ్యాత్మిక గ్రంథాలు, ఆచార్యుల రచనలు, ఆళ్వారులవంటి భాగవతుల కృతులు - శరణాగతి ప్రాముఖ్యాన్ని సందర్భోచితంగా, సమయోచితంగా వివరిస్తూనే వచ్చాయి.

శరణాగతి తత్త్వానికి శ్రీమద్రామాయణం సమగ్రోదాహరణమని మనం గ్రహించవచ్చును. "అత ఏవ రామాయణం దీర్ఘశరణాగతిరిత్యభి యుక్తైరుక్తమ్" అన్నారు పెద్దలు. శ్రీరాముడు తనను తాను "ఆత్మానం మానుషం మన్యే" అని అనుకొన్నా, వాల్మీకి తన రామాయణంలో శ్రీరాముని తత్త్వాన్ని-అక్కడక్కడ పాత్రలద్వారా ధ్వని ప్రధానంగా, గూఢంగా—శ్రీమన్నారాయణుని అవతారంగా వివరిస్తాడు. పరశురాముడు, శ్రీరామునితో "అక్షయ్యం మధుహంతారం జానామిత్వాం సురేశ్వరం" అంటాడు. విశ్వామిత్రుడు దశరథునితో "అహం వేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమమ్ । వసిష్ఠోఽపి మహాతేజాయే చాన్యే తపసిస్థితాః॥" అంటాడు. మారీచుడు "రామోవిగ్రహవాన్ ధర్మః" అంటాడు. మాల్యవంతుడు శ్రీరామునితో సంధిచేసుకోవలసినది అని రావణునితో చెప్పేటప్పుడు- "విష్ణుం మన్యామహేదేవం మానుషం దేహమాస్థితః" అని స్పష్టంచేస్తాడు. చివరికి రావణుడే శ్రీరామునిగూర్చి ఇలా అనుకొంటాడు:

> "యస్య విక్రమమాసాద్య రాక్షసానిధనం గతాః ।
> తం మన్యేరాఘవం వీరం నారాయణమనామయమ్॥

రావణవధానంతరం బ్రహ్మ రాముణ్ణిస్తుతిస్తూ— "భవా న్నారాయణో దేవః శ్రీమాన్ చక్రాయుధో విభుః" అంటాడు.

ఈవిధంగా అప్పుడప్పుడు కొందరు—మిత్రులు, శత్రువులూ కూడా చెప్పినా మొత్తంమీద శ్రీరాముడు తన దైవత్వాన్ని మరుగుపరచుకొనే వ్యవహరించాడు. కాని, రామాయణంలోని అనేకులు — విభీషణాదులు అయన్ని శరణుపొందుతూనే

వచ్చారు. రావణుని సోదరుడైన విభీషణునకు శరణు ఇయ్యరాదని సుగ్రీవాదులు చెప్పినా, రాముడు తన శరణాగత దీక్షను ఈవిధంగా వివరించాడు:

"సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే ।
అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ॥"

ఇంక రావణుడే స్వయంగా వచ్చినా ("యదివా రావణః స్వయమ్") అతనికి శరణు ఇస్తానన్నాడు. ఈ వాగ్దానంలోని వైశిష్ట్యమే దీన్ని శ్రీవైష్ణవుల "శ్రీరామ చరమశ్లోకం" చేసింది !

క్షమించరాని దోషం చేసిన కాకాసురుడు, శరణు పొందినవెంటనే శ్రీరాముడతన్ని చంపక విడిచాడు. తన దక్షిణనేత్రాన్ని బ్రహ్మాస్త్రానికి లక్ష్యంగా సమర్పించి కాకాసురుడు బ్రతికి బయటపడ్డాడు. ఈ సందర్భంలో వాల్మీకి ఇలా వ్రాశాడు:

"త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య తమేవ శరణం గతః ।
స తం నిపతితం భూమౌ శరణ్యశ్శరణాగతమ్
వధార్హమపి కాకుత్స్థః కృపయా పర్యపాలయత్
న శర్మ లబ్ధ్వా లోకేషు తమేవ శరణం గతః
పరిద్యూనం విషణ్ణం చ స తమాయాంత మబ్రవీత్
మోఘం కర్తుం న శక్యంతు బ్రాహ్మమస్త్రం తదుచ్యతామ్
హినస్తు దక్షిణాక్షిత్వచ్ఛర ఇత్యథ సోఽబ్రవీత్
తత స్తస్యాక్షి కాకస్య హినస్తి స్మ స దక్షిణమ్
దత్త్వా స దక్షిణం నేత్రం ప్రాణేభ్యః పరిరక్షితః॥"

ఇక్కడ సీతాదేవి పురుషకారాన్ని నెరపిందని పద్మపురాణంలో ఇలా ఉంది:

"ప్రాణ సంశయమాపన్నం దృష్ట్వా సీతా థవాయసం।
త్రాహి త్రాహీతి భర్తారమువాచ దయయా విభుమ్
పురతః పతితం దేవీ ధరణ్యాం వాయసం తథా
తచ్ఛిరః పాదయో స్తస్య యోజయామాస జానకీ॥"

ఇక్కడ సీతాదేవి పురుషకారంవల్ల కాకాసురుడు రక్షింపబడ్డాడు. ఇదే విధంగా, తనను బాధించిన రాక్షసస్త్రీలను చంపడానికి హనుమంతుడు సిద్ధపడి నప్పుడు, సీత అతన్ని వారిస్తుంది:

"పాపానాం వా శుభానాం వా వధార్హాణాం ప్లవంగమ ।
కార్యం కారుణ్యమార్గేన నకశ్చిన్నా పరాధ్యతి॥
(యుద్ధకాండ- వాల్మీకం)

సుందరకాండలో త్రిజట తన స్వప్నవృత్తాంతం చెప్పి, "మీరందరు సీతాదేవి శరణుపొందండి" అని రాక్షసస్త్రీలకు హితోక్తిచెప్పుతుంది. సీతాదేవి శాశక్తి ఉన్నదని ఆమెకు తెలుసును.

"రాఘవాద్ధి భయం ఘోరం రాక్షసానాముపస్థితమ్।
ప్రణిపాత ప్రసన్నాహి మైథిలీజనకాత్మజా
అలమేషా పరిత్రాతుం రాక్షస్యోమహతోభయాత్॥

లక్ష్మియే సీతాదేవిగా అవతరించింది కనుక ("రాఘవత్వే భవేత్ సీతా...)" లక్ష్మీదేవి పురుషకారత్వం సీత స్వీకరించింది. లక్ష్మీదేవి పురుషకారాన్ని గురించి భగవద్వచనమే ఉంది:

"మత్ప్రాప్తిం ప్రతిజంతూనాం సంసారేపతతామథ।
లక్ష్మీః పురుషకారత్వే నిర్దిష్టాపరమర్షిభిః॥

ఇందువల్ల, సీతాదేవి సర్వసమర్థురాలు. అయినా, పారతంత్ర్యాన్ని ప్రదర్శించింది. ఆమె తానుగా చేసినట్లు గాక, శ్రీరామునిద్వారా చేయించింది. భక్తుల్నికరుణింపజేసింది, శత్రువుల్ని క్షమింపజేసింది.

కరుణించడం, క్షమించడం శ్రీరాముని సహజగుణాలు. శరణాగతికి-లింగభేదంతోగాని, జాతిభేదంతోగాని పనిలేదు. దీనికి- అధికారి అనగా అర్హుడుగాని, అనధికారి అనగా అనర్హుడుగాని లేదు. ఇక్కడ జటాయువు విషయాన్ని గ్రహించవచ్చు. తనకోసం ప్రాణత్యాగం చేయడానికి సిద్ధపడిన (చేసిన) జటాయువునకు, పితృసఖునకు-అగ్నిసంస్కారం చేసి ఉత్తమగతులు కల్పించాడు:(అరణ్యకాండ)

"జటాయుషం చపస్వర్శ పితృస్నేహం విదర్శయన్"(సర్గ-67)
"రాజా దశరథ శ్రీమాన్ యథామమ మహాయశాః।
పూజనీయశ్చ మాన్యశ్చతథాయం పతగేశ్వరః"
(సర్గ-68 శ్లో-26)

సౌమిత్రేహర కాష్ఠాని నిర్మథిష్యామిపావకమ్।
గృధ్రరాజం దిధక్ష్యామిమత్కృతే నిధనం గతమ్॥ (శ్లో-27)

ఈవిధంగా జటాయువునకు అగ్నిసంస్కారంచేస్తూ శ్రీరాముడు ఇలాఅన్నాడు :

"యాగతిర్యజ్ఞశీలా నామాహి తాగ్నేశ్చయాగతిః।
అపరావర్తినాం యాచ యాచ భూమిప్రదాయినామ్॥ (29)

మయా త్వం సమనుజ్ఞాతో గచ్ఛలోకాననుత్తమాన్।
గృధ్ర రాజమహాసత్త్వ సంస్కృతశ్చమయాప్రజ॥ (30)

ఏవముక్త్వాచితాం దీప్తామారోప్య పతగేశ్వరమ్।
దదాహరామో ధర్మాత్మా స్వబంధుమివ దుఃఖితః॥" (31)

ఈవిధంగా శ్రీరాముడు అగ్నిసంస్కారం చేయడంతో ఊరుకోలేదు. తాను, తన సోదరుడు లక్ష్మణుడు గోదావరిలో స్నానం చేసి "ధర్మోదకాలు" విడిచారుకూడా!

"తతో గోదావరీం గత్వానదీం నరవరాత్మజౌ।
ఉదకం చక్రతుస్తస్మై గృధ్రరాజాయతావుభౌ॥ (శ్లో-35)
శాస్త్రదృష్టేన విధినా జలే గృధ్రాయరాఘవౌ।
స్నాత్వా తౌ గృధ్రరాజాయ ఉదకం చక్రతుస్తదా॥" (శ్లో-36)

ధర్మాత్ముడైన శ్రీరాముడు, తన శత్రువుల విషయంలోను వాత్సల్యాన్ని చూపిస్తాడు. రావణునితో యుద్ధం జరుగుతూఉన్నప్పుడు, శ్రీరాముని తీవ్రబాణాలకు నొచ్చి, కిరీటభంగాన్నిపొంది రథాశ్వాలు చచ్చి, సూతుడు హతుడై- వరిశ్రాన్తిపొందిన రావణుని విశ్రాంతితీసుకొని తిరిగి యుద్ధానికి రావలసినదని శ్రీరాముడు చంపక విడిచిపెడతాడు: (యుద్ధకాండ)

"నరామబాణాభిహతో భృశార్తః శ్చచాల చాపంచ ముమోచవీరః
(శ్లో-144)

తం విహ్వలప్తం ప్రసమీక్ష్యరామ । స్సమాదదేదీప్తమథార్ధ
చంద్రమ్॥
తేనార్కవర్ణం సహసాకిరీటం । చిచ్ఛేదరక్షోధిపతేర్మహాత్మా॥
(శ్లో-145)

ఈ విధంగా కిరీటభంగమై బదలిఉన్న రావణునితో–

"ఉవాచరామో యుధిరాక్షసేన్ద్రమ్॥" (శ్లో-146)
"కృతం త్వయా కర్మమహత్సుభీమం ।
హతప్రవీరశ్చ కృతస్త్వయాఽహమ్ ।
తస్మాత్పరిశ్రాన్త ఇతి వ్యవస్య ।
న త్వాం శరైర్మృత్యువశం నయామి॥" (శ్లో-147)
"గచ్ఛాను జానామిరణార్దితస్త్వం ।
ప్రవిశ్యరాత్రించర రాజ! లంకామ్।
ఆశ్వాస్య నిర్యాహిరథీ చ ధన్వీ ।
తదాబలం ద్రక్ష్యసి మేరథస్థః ॥ (శ్లో-148)

అని పలికి విడిచిపెడతారు. రావణుడు చనిపోయిన తరువాత, లోకకంటకుడైన రావణునకు తాను అగ్నిసంస్కారాదికం చేయనని విభీషణు డన్నప్పుడు, శ్రీరాముడు–

"మరణాంతాని వైరాణి నివృత్తం నః ప్రయోజనమ్।
క్రియతామస్య సంస్కారో మమాప్యేష యథాతవ ॥"
(యుద్ధకాండ)

అని పలికి తన ఉదారతను, మహనీయతను వ్యక్తంచేశాడు.

శత్రువైన రావణుని విషయంలోనే శ్రీరాముడు ఈ విధంగా దయార్ద్ర హృదయుడైనప్పుడు, తనను శరణుపొందినవారి దోషాలను క్షమిస్తాడు అనే విషయంలో సంశయమే అక్కరలేదు. వాత్సల్యం ఉన్నచోట ఈ క్షమించడం

ఉంటుంది. ఇంతటితో తృప్తిపడక మనవారు "వాత్సల్యం నామదోషేషు గుణత్వ బుద్ధిః" అనేటంతటి దూరంపోయారు.

శ్రీరాముని సుగుణసంపదనుగూర్చి వేరే చెప్పేదేముంది ? ఆయన ధీరోదాత్తతతెలియనివారెవరున్నారు ? వాల్మీకి చెప్పవలసినదంతా చెప్పనే చెప్పాడు ! మధ్యయుగంలో ఉత్తరభారతంలో రామభక్తునిగా, మహాకవిగా ప్రసిద్ధిపొందిన గోస్వామి తులసీదాసు తన "శ్రీరామచరిత మానస్" మహాకావ్యంలో శ్రీరామచంద్రుని వ్యక్తిత్వాన్ని అత్యద్భుతంగా చిత్రించాడు. ఆయన తన మహాకావ్యం "అవధీ" భాషలో వ్రాసినా - కావ్యప్రారంభంలోను, కాండల ప్రారంభంలోను- ప్రతిపద సుందరంగా, భావనిర్భరంగా సంస్కృతంలో శ్లోకాలు వ్రాశాడు. (ఈ విషయం చాలామందికి తెలిసిఉండకపోవచ్చును!) అయోధ్యాకాండ ప్రారంభంలో భావికథా సూచకంగా వనవాసప్రస్తావన వచ్చేలా- ఈ శ్లోకం వ్రాశాడు:

"ప్రసన్నతాం యానగతాభిషేకతః
తథా నమమ్లే వనవాస దుఃఖతః ।
ముఖాంబుజ శ్రీరఘునందనస్య మే
సదాస్తు సామంజుల మంగళప్రదా ॥"

దంద్వాతీతుడైన పరబ్రహ్మస్వరూపుడైన శ్రీరామచంద్రుని "ముఖాంబుజశ్రీ" మన ముందు ఉంచాడు.

గోస్వామి తులసీదాసు భక్తికి, శరణాగతికి తన కావ్యంలో ప్రముఖస్థానం ఇచ్చినా, ఆయన వాల్మీకిరామాయణాన్ని అనుసరించినట్లుగానే అధ్యాత్మరామాయణాన్నికూడా అనుసరించడంవల్ల, వాచ్యంగా శ్రీరామచంద్రుడు పరబ్రహ్మస్వరూపుడని చెప్పడం ఉంది! అధ్యాత్మరామాయణం నిస్సంకోచంగా, వాచ్యంగా ఈ విషయం చాలా చోట్లు చెప్పింది. రామలక్ష్మణ భరతశత్రుఘ్నులు, సీత ఎవరో నిర్ద్వంద్వంగా ప్రకటించింది.

"శేషస్తు లక్ష్మణో రాజన్ రామమేవాన్వపద్యతా।
జాతౌ భరతశత్రుఘ్నౌ శంఖచక్రే గదాభృతః॥"

"యోగమాయాపి సీతేతి జాతా జనకనందినీ॥"

దీనివల్ల మనకు— లక్ష్మణుడు శ్రీరామునే ఎందుకు అనుసరిస్తాడో, శత్రుఘ్నుడు భరతునే ఎందుకు అనుసరిస్తాడో తెలుస్తుంది!

సీత, హనుమంతునకు రాముడెవరో, తానెవరో నిష్కర్షగా ఇలా చెప్పుతుంది.

"రామం విద్ధిపరం బ్రహ్మసచ్చిదానందమద్వయం।
సర్వోపాధి వినిర్ముక్తం సత్తామాత్రమగోచరమ్॥

ఆనందం నిర్మలం శాంతం నిర్వికారం నిరంజనం।
సర్వవ్యాపినమాత్మానం స్వప్రకాశమకల్మషమ్॥"

"మాం విద్ధిమూలప్రకృతిం సర్గస్థిత్యంతకారిణీం।
తస్యసన్నిధి మాత్రేణ సృజామీదమతంద్రితా॥"
"తత్సాన్నిధ్యాన్మయా సృష్టమ్ తస్మిన్నారోప్యతేఽబుధైః।"

ఇంతటితో ఆగదు. జరిగినపనులన్నీ తాను చేసినట్లు వాచ్యంగా సీత హనుమంతునితో ఇలా చెప్పుతుంది:

"ఏవమాదీనికర్మాణి మయైవాచరితా న్యపి।
ఆరోపయంతి రామేస్మిన్నిర్వికారేఽఖిలాత్మని॥"

ఇంక శంకరుడో (పార్వతికి శంకరుడు చెప్పినట్లు) రాముని నిర్గుణ పరబ్రహ్మనుగా అభివర్ణించాడు:

"రామో న గచ్ఛతి న తిష్ఠతి నానుశోచత్యా కాంక్షతే త్యజతినో
కరోతి కించిత్ । ఆనందమూర్తిరచలః పరిణామహీనో
మాయాగుణా ననుగతోహి తథావిభాతి॥"

ఈ విషయాలనన్నీ మనస్సునకు పట్టించుకొన్న గోస్వామితులసీదాసు, తన కావ్యంలో నిర్గుణసగుణ స్థితులను కలిపి వర్ణించాడు. "నేతి, నేతి" మొదలైన ప్రయోగాలుకూడా కనబడతాయి. ఇంక సీతాదేవిని, అఘటనఘటనా పటీయసి అయిన పరాశక్తిగా వర్ణిస్తాడు:

"ఉద్భవస్థితి సంహారకారిణీం క్లేశహారిణీం
సర్వశ్రేయస్కరీం సీతాం నతోఽహం రామవల్లభామ్॥"

ఈ విధంగావర్ణిస్తూ, పార్వతీపరమేశ్వరులు రూపు దాల్చిన శ్రద్ధావిశ్వాసాలు గనుక వారికి నమస్కరిస్తున్నాననీ ఆ అనుగ్రహం లేకపోతే, సిద్ధులు తమ అంతః కరణలోని పరమేశ్వరుని దర్శించలేరనీ వ్రాసి, శ్రద్ధావిశ్వాసాల ప్రాముఖ్యాన్ని తెలియజేశాడు:

"భవానీ శంకరౌవందే శ్రద్ధావిశ్వాసరూపిణౌ।
యాభ్యాం వినా నపశ్యంతి సిద్ధాః స్వాంతస్థమీశ్వరమ్॥"

వాల్మీకి రామాయణం కావ్యమర్యాదననుసరించి-అది ఆదికావ్యంగనుక, ఆమర్యాదను స్థాపించినదదే! వాచ్యంగా కథానాయకుడైన శ్రీరామచంద్రుని వ్యక్తిత్వాన్ని చాలావరకు ఆదర్శమానవునిగానే చిత్రించింది గాని, పరతత్త్వంగా చిత్రించ లేదు. ఇతరపాత్రలు ఆవిధంగా కాకుండా, ప్రకరణాన్ని అనుసరించి శ్రీరాముని పరబ్రహ్మగా కీర్తించాయి అనే విషయాన్ని కొన్ని ఉదాహరణలతో గ్రహించాము.

ఈ సందర్భంలో అధ్యాత్మ రామాయణప్రసక్తి తీసుకొని రావడానికి కారణం—భాషారామాయణాలలో ప్రచారంలో ఉన్న చాలా సన్నివేశాలు, అభిప్రాయాలు, వాల్మీకిరామాయణంలో లేకపోవడం! ముఖ్యోదాహరణంగా - రావణుడు సీతను అపహరించి తీసుకొనిపోవడం గ్రహిద్దాం. వాల్మీకంలో - రావణుడు సీత జుట్టును ఎడమచేతితోను, కుడిచేతితో ఆమె ఊరువులను గ్రహించితెచ్చి రథం మీద పెట్టినట్లు-ఉంది.

"వామేన సీతాం పద్మాక్షీం మూర్ధజేషు కరేణసః ।
ఊర్వోస్తు దక్షిణేనైవ పరిజగ్రాహ పాణినా॥"

అధ్యాత్మ రామాయణంలో, ఆమెను స్పృశించకుండ ఆమె నిలిచిన భూభాగాన్ని పెల్లగించుకొని ఆమెతోసహా రథంమీద పెట్టుకొన్నాడు. లోకంలో-భాషా రామాయణాలలో ఇదే ప్రచారంలో ఉంది. ఇదేవిధంగా గుహుని కథలోకూడా కొంతమార్పు కనబడుతుంది. శ్రీరాముడు అరణ్యవాసానికి పోయేటప్పుడు గంగా నది దగ్గర గుహుణ్ణి కలుస్తాడు. రామభక్తుడైన గుహుడు ఆయన్ని భక్తితో

సేవిస్తాడు. సీతాలక్ష్మణులతో కలిసి తాను గంగను దాటవలసిఉన్నందుకు దానికి ఏర్పాటుచేయవలసినదని రాముడు గుహుణ్ణి అడుగుతాడు. మరునాడు ఆ ఏర్పాటు గుహుడు చేయగా, సీతారామలక్ష్మణులు - సుమంత్రుణ్ణి, గుహుణ్ణి గంగాతీరంలో విడిచి, నదినిదాటుతారు. ఇది వాల్మీకం. అధ్యాత్మరామాయణంలో గుహుడే పడవ నడిపినట్లు ఉంది. ("వాహయే జ్ఞాతి భిస్సార్థ మహ మేవ సమాహితః". "గుహస్తాన్ వాహయామాస జ్ఞాతి భిస్సహితాస్స్వయమ్॥") అంతేకాదు, నదిని దాటినతరువాత తాను కూడా అరణ్యవాసానికి రావడానికి అనుజ్ఞ ఇయ్యవలసిందని అడిగినట్లు, శ్రీరాముడు దానికి అంగీకరించక, గుహుణ్ణి కౌగలించుకొని వెనక్కి పంపేసినట్లు ఉంది. అహల్యా వృత్తాంతం విషయంలోకూడా భేదం కనబడుతుంది ఈ భేదం శాపాంతీరునకు సంబంధించినది. వాల్మీకంలో- గౌతముడు ఇంద్రుణ్ణి విఫలుడవు కమ్మని; అహల్యను- వాతభక్షయు, నిరాహారయు, భస్మశాయియు, భూతాలకు అదృశ్యయు అయి తపించవలసినదని శపిస్తాడు. లోకంలో వాడుకలో ఉన్నట్లు అధ్యాత్మ రామాయణాన్నిబట్టే ఈవాడుక వచ్చిందనవచ్చు- గౌతముడు ఇంద్రుణ్ణి "యోనిలంపట ! దుష్టాత్మన్ సహస్రభగవాన్ భవ" అనీ, అహల్యను "శిలనాశ్రయించి తపించు" అని శపిస్తాడు. దశరథుడు భార్యలకు పాయసం పంచడం విషయంలోను భేదాలు కనబడుతున్నాయి. లోకంలో వాడుకలో ఉన్నట్లుగా శబరి నిషాదస్త్రీ కాదు. అది ఆమె పేరు. ఆమె మతంగమహర్షి శిష్యుల పరిచారిక. ఈ విషయం- కబంధుడు రామునకు చెప్పుతాడు:

"తేషాం గతానామద్యాపి దృశ్యతే పరిచారిణీ।
శ్రమణీ శబరీనామ కాకుత్స్థ చిరజీవినీ॥"

(అరణ్యకాండ-సర్గ-73)

తరువాత శ్రీరాముడు లక్ష్మణునితోకలిసి మతంగాశ్రమానికి వచ్చినప్పుడు ఆమె వారికి స్వాగతమిస్తుంది. గురువులందరు ఊర్ధ్వలోకాలకు పోయినతరువాత ఆమె రామదర్శనార్థం - గురువుల ఆజ్ఞననుసరించి వేచిఉంది. ఆమె చిరజీవిని గదా. ఆమెనుచూచి శ్రీరాముడు సంతోషించి ఇలా కుశలప్రశ్నలడిగాడు:

"కచ్చిత్తే నిర్జితావిఘ్నాః కచ్చిత్తే వర్ధతే తపః।
కచ్చిత్తే నియతః క్రోధః ఆహారశ్చ తపోధనే॥"

(అరణ్యకాండ-సర్గ-74)

ఆమె మతంగమహర్షి శిష్యులైన తమ గురువులు స్వర్గారోహణ చేసేముందు, రామ దర్శనార్థం తనను నిరీక్షించుమని చెప్పినట్లు అని, రామ లక్ష్మణులకు ఆతిథ్య మిస్తుంది. ఆ సందర్భంలోని వాల్మీకిశ్లోకాలలో ఎక్కడా "ఎంగిలిపండ్ల" ప్రస్తావనే లేదు. ఆమె తపస్విని. భక్తురాలు, యుక్తాయుక్త పరిజ్ఞానంలేని కేవల ఆటవికస్త్రీ కాదు. శ్రమణి, చిరకాలం మహర్షుల సేవచేసిన ధన్యురాలు. ఆమె అలాంటిది కాకపోతే శ్రీరాముడు "మీ తపస్సు బాగాజరుగుతోందా?'' మొదలైన ప్రశ్నలు వేయడుగదా. "తపోధనురాలా!" అని సంబోధించాడు. ఇది మనం గుర్తించాలి. శబరి తాను పంపాతీరంలో సేకరించిన మధురాతిమధుర ఫలాలను అతిథులైన రామలక్ష్మణులకు సమర్పించింది:

"మయాతు సంచితం వన్యం వివిధం పురుషర్షభ
తవార్థే పురుషవ్యాఘ్ర పంపాయాస్తీర సంభవమ్॥"

(అరణ్య-సర్గ-74)

ఇక్కడ "వన్యం" అంటే వన్యసంభవం అన్నమాట. ఆ వనాలు పంపాతీరస్థాయి ఇంక సంచితమంటే - ఆయా ఫలాల మాధుర్యాన్ని పరీక్షించి ఉంచినవి అన్న మాట. గోవిందరాజీయంలో "తత్తత్ఫల జాతీయమాధుర్యం పరీక్ష్య స్థాపితమితి సంప్రదాయః" అని ఉంది. దీనిలో "మాధుర్యం పరీక్ష్య" అని ఉండడంవల్ల లోకంలో "శబరి ముందుగా రుచిచూచింది"అనే అభిప్రాయం వచ్చిఉండవచ్చును. శబరి సాధారణ వన్యస్త్రీకాదని శ్రీరాముని మాటలవల్ల తెలుస్తూనేఉంది. వాల్మీకి కూడా ఆమె ఊర్ధ్వలోకాలకు పోవడాన్ని గురించి ఇలా అంటాడు:

"యత్రతే సుకృతాత్మానో విహరంతి మహర్షయః।
తత్పుణ్యం శబరీస్థానం జగామాత్మ సమాధినా॥"

(అరణ్య-సర్గ- 74)

స్థూలంగా వాల్మీకిరామాయణ కథను గ్రహించి ఆయా కాలాలలో ఆయా కవులు తమ అభిప్రాయాల ననుసరించి రామాయణేతివృత్తంమీద కావ్యరూపకాదులు రచించారు. పురాణాలలో- పద్మపురాణాదికంలో- వచ్చిన రామకథలో మార్పులు చాలా కనబడతాయి. ఈ మార్పులన్నీ వాల్మీకిరామాయణంలోని కథా సందర్భాల సమస్యలకు పరిష్కారమార్గాలనుకొని చేసినవే. జరిగిన కథలో ఇన్ని మార్పులు ఉండడానికి అవకాశం ఉన్నదా? అంటే, సనాతనులైన సంప్రదాయవాదులు

"కల్పభేదం పురస్కృత్య కథా భేదం జగాదహ" అని సమాధానం చెప్తారు. ఈ సందర్భంలో తనను అరణ్యానికి తీసుకొనివెళ్ళను, నువ్వు రావద్దుఅని సీతతో రాముడన్నప్పుడు, ఆమె ఇలా అంటుంది. ఇది అధ్యాత్మ రామాయణంలో వస్తుంది:

"అన్యత్కించిత్ప్రవక్ష్యామి శ్రుత్వామాం నయకాననమ్
రామాయణాని బహుశః శ్రుతాని బహుభిర్ద్విజైః
సీతాం వినావనం రామోగతః కిం కుత్రచిద్వద
అత స్త్వయా గమిష్యామి సర్వదా త్వత్సహాయినీ॥"

"ఇంకో కారణంకూడా చెప్తాను. దాన్ని విని నన్ను నీతో అడవికి తీసుకొనిపో. చాలామంది బ్రాహ్మణులు చాలా రామాయణాలు చెప్పగా విన్నాముగదా! సీతను విడిచి రాముడు ఒక్కడే అరణ్యానికి పోయినట్లు ఏ రామాయణంలో అయినా ఉన్నదా? కాబట్టి నేనుకూడా నీతో వస్తాను" అని దీని స్థూలార్థం.

ఈ మాటలనుబట్టి రామాయణములు ప్రతి కల్పంలోను జరుగుతున్నాయన్నమాట. కథలో మార్పులుండడానికి కారణం కల్పభేదం. కాని, ఏ రామాయణంలోను- సీతరామునితో అడవికి వెళ్ళనట్లు లేదు. సీత దీన్నిబట్టి చమత్కారంగా ఇలా అంది. అనవచ్చును. కాని ఆమె నిత్యానపాయిని. లక్ష్మీస్వరూపురాలు సీతారాములు ప్రకృతి పురుషులు, విడిచి ఉండువారు కారని ధ్వని.

అధ్యాత్మ రామాయణానికి పండితలోకంలో ఉన్న స్థానాన్నిబట్టి, దానిలోని కథలు, నన్నివేశాలు - ముఖ్యంగా అవాల్మీకమైనవి - భాషారామాయణాల ద్వారా జన బాహుళ్యంలో విశేషప్రచారాన్ని పొందడాన్నిబట్టి దాన్ని కొంత పరిశీలించడం సముచితమేగదా! పరిశీలన అన్న వెంటనే వాల్మీకిరామాయణం కూడా రంగంలోకి వస్తుంది. ఆదికావ్యమైన వాల్మీకిరామాయణాన్ని గురించి ఉన్న ప్రసిద్ధ శ్లోకం:

"వాల్మీకిగిరి సంభూతారామ సాగర గామినీ
పునాతి భువనం పుణ్యారామాయణమహానదీ"

దీనిలోని రెండోపాదానికి పాఠాంతరంగా "శ్రీమద్రామాయణీ గంగా పునాతి భువన

త్రయమ్" అని ఉంది. ఏమైనా- వాల్మీకిగిరి సంభూతమైన రామాయణమహానది రామ సాగరగామిని. సగరులవల్ల ఏర్పడ్డది సాగరం. మనకు తెలిసినదే!

ఇంక, అధ్యాత్మ రామాయణాన్ని గురించికూడా ప్రసిద్ధంగా ఒక శ్లోకం ఉంది:

"పురారిగిరి సంభూతా శ్రీరామార్ణవ సంగతా ।
అధ్యాత్మరామ గంగేయం పునాతిభువనత్రయమ్॥"

అధ్యాత్మరామాయణం పురారిగిరి సంభూతమైన నది (గంగ) ఇది శ్రీరామార్ణవ సంగిత అవుతోంది. పవిత్రత విషయంలోగాని, భువనత్రయాన్ని పవిత్రీకరించడం విషయంలోగాని రెండింటికి భేదంలేదు. ఒకటి- వల్మీకభవుడనే గిరినుండి ఉద్భవించింది. రెండోది - త్రిపురాసురులను జయించిన త్రిపురారి గిరి నుండి పుట్టింది ఇక్కడ కొంచెం సూక్ష్మంగా పరిశీలిస్తే ఈ త్రిపురారి- పరమశివుడు- స్థూల సూక్ష్మకారణ శరీరాలను జయించి తురీయమైన బ్రహ్మభావం పొందినగిరి- అనే అర్థస్ఫూర్తికి అవకాశం ఉంది. ఈ గిరి నుండి ఉద్భవించిన "అధ్యాత్మరామ గంగ" శ్రీరామార్ణవ సంగత అయింది. అది "రామసాగరగామిని", ఈ రెండు శబ్దాల ప్రయోగంవల్ల శ్రీమద్రామాయణాధ్యాత్మిక రామాయణాల ప్రయోజనంలో ఉన్న తారతమ్యం స్పష్టమవుతుంది. శ్రీరాముని కథను గ్రహించి తద్ద్వారా వాచ్యంగా అధ్యాత్మిక విషయాలను ప్రస్తుతించింది - అధ్యాత్మరామాయణం. శ్రీమన్నారాయణుని అవతారమైన శ్రీరామునికథ అయినా, వాల్మీకి తన కథను కావ్యంగా తీర్చిదిద్దడంవల్ల అది ఆదికావ్యం అయింది. అధ్యాత్మరామాయణం ఆధ్యాత్మిక గ్రంథం అయింది. మంచిచెడ్డల ప్రసక్తి, నైతిక ధార్మికవిషయాలకు మానవులకు ఉన్న సంబంధం మొదలైనవాటి చర్చలకు అధ్యాత్మరామాయణంలో స్థానం తక్కువ. ఆధునికులు ఆశించే పాత్రపోషణాదికం "వాల్మీకం"లో ఉన్నట్లుగా "అధ్యాత్మం"లో కనబడదు. వాల్మీకిరామాయణానికి కథాకథనం ప్రధానం, కథలోని తత్త్వప్రతిపాదన - కావ్యత్వానికి అడ్డులేనివిధంగా- గూఢం అధ్యాత్మ రామాయణానికి కథగౌణం అన్నా తప్పులేదనిపిస్తుంది. తత్త్వవివేచనకు- ముఖ్యంగా అద్వైత ప్రతిపాదనకు రామాయణ కథను ఆధారబగా తీసుకొన్నట్లు తోస్తుంది అధ్యాత్మరామాయణంలో.

అందువల్లనే కాబోలు, వైష్ణవ సంప్రదాయాలలో అధ్యాత్మరామాయణానికి విశేషప్రచారం ఉన్నట్లు కనబడదు.

"సర్వం ఖల్విదం బ్రహ్మ" అనే పునాదిమీద సర్వవిషయాలు, సర్వ పాత్రలు, సర్వసన్నివేశాలు నడుస్తూ ఉన్నప్పుడు ఆత్మార్పణాదులు అంత అర్థవంతంగా కనబడవు. కథలో ఉన్నపాత్రలకు మొట్టమొదటే కథ పర్యవసానం తెలిసేఉంది. సీతారాములకు సరేసరి. అదిగాక వాచ్యంగా చెప్పడంకూడా ఉంటుంది. అందరికంటె ముందే అన్ని విషయాలు శంకరుడు పార్వతికి వివరిస్తాడు. హనుమంతునితో తానెవరో, రాముడెవరో సీత చెప్పుతుంది ప్రాయోపవిష్టుడయిన భరతునకు వశిష్ఠుడు దేవరహస్యమని అంతా చెప్పుతాడు:

"వత్స! గుహ్యం శృణు................
రామాయణస్సాక్షాత్ బ్రహ్మణా యాచితః పురా
రావణస్య వధార్థాయ జాతో దశరథాత్మజః
యోగమాయాపి సీతేతి జాతా జనకనందినీ
శేషోపి లక్ష్మణోజాతో రామమన్వేతి సర్వదా
రావణం హంతుకామాస్తే దమిష్యంతి న సంశయః
కైకేయ్యా వరదానాదియద్య నిష్ఠుర భాషణం
సర్వం దేవకృతం నోచేదేవం సాభాషయేత్కథం
తస్మాత్త్యజాగ్రహం తాత! రామస్య వినివర్తనే॥"

దీని తరువాత రామపాదుకలను తీసుకొని భరతుడు వెడలిపోతాడు. మంథరా కైకేయీలలో వాణి ప్రవేశించి వారిచేత ఆవిధంగా కటువుగా మాట్లాడిస్తుంది. దేవహితార్థం ప్రార్థనవల్ల ఆమె అలా చేసింది :

"గచ్ఛదేవి భువోలోక మయోధ్యాయాం ప్రయత్నతః
రామాభిషేక విఘ్నార్థం యతస్వ బ్రహ్మవాక్యతః
మంథరా ప్రవిశస్వాదౌ కైకేయీం చ తతః పరం
తతో విఘ్నే సముత్పన్నే పునరేహి దివం శుభే!
తదేత్యుక్త్వా తథాచక్రే॥

8)

లోకంలో కూడా ఈ వాడుకఉంది. సరస్వతీదేవి వారిలో ప్రవేశించే అలా మాట్లాడించిందని.

ఇంతకంటె కూడా మనకు విచిత్రంగా కనబడేది- శ్రీరామునకు, సీతను రావణుడు అపహ:స్తాడని తెలిసి. ఆమెకు ఆ విషయంచెప్పి మాయసీతాను పర్ణశాలలో స్థాపించి తాను అగ్నిలోదాగి ఉండవలసినదనీ, సంవత్సరం తర్వాత తాను రావణుని చంపి ఆమెను పరిగ్రహిస్తాను అనీ - వివరించడం. మాయలేడి విషయంకూడా రామునకు తెలుసును. మరి రావణుని చంపడానికి కారణం ఉండాలిగనుక — అతని మారీచుని పన్నాగాన్ని తెలిసిఉండి కూడా రాముడు దాన్ని కొనసాగనిచ్చాడు. పరస్త్రీని అపహరించాడు గనుక దోషి అయిన రావణుని పైకి దండెత్తిపోయి అతన్ని చంపవచ్చునని పరబ్రహ్మస్వరూపుడైన రాముని నిర్ణయం.

సీత అంతా తెలుసుకొని భర్త ఆజ్ఞను పాలించింది.

అధ్యాత్మ రామాయణంలో ఈ విషయమంతా ఇలా ఉంది:

"అథ రామోపి తత్సర్వం జ్ఞాత్వా రావణచేష్టితం
వాచా సీతామేకాంతే శృణు జానకిమేవచః
రావణో భిక్షురూపేణ ఆగమిష్యతి తేఽంతికం
త్వం తు ఛాయాం త్వదాకారాం స్థాపయిత్వోటజేవిశ
అగ్నావ దృశ్యరూపేణ వర్షం తిష్ఠ మమాజ్ఞయా
రావణస్య వధాంతే మాం పూర్వవత్ప్రాప్స్యసే శుభే
శృత్వారామోదితం వాక్యం సాపి తత్రతథాఽకరోత్
మాయా సీతాం బహిః స్థాప్య స్వయ మంతర్దధేఽనలే॥"

సీతారాముల ఏర్పాటు ఈవిధంగాఉంటే, ఇంక రావణుని స్థితిని, ఆలోచనావిధానాన్ని పరిశీలిద్దాము. మారీచుడు రావణునితో, "నిన్ను వధించడానికే బ్రహ్మప్రార్థన ననుసరించి శ్రీమన్నారాయణుడు రామునిగా జన్మించాడు. కనుక, సీతాపహరణం మరిచిపోయి లంకకు తిరిగిపో"అని హితోక్తులు పలికినప్పుడు రావణుడు ఇలా అంటాడు. 'నన్ను చంపడానికి నిజంగా నారాయణుడే రాముడైపుట్టితే, సీత

నవహరించి ఆయన చేతులలోనే చచ్చిపోతాను. నన్ను చంపకుండా ఎందు కుంటాడు ?"

"పరమాత్మా యథారామా ప్రార్థితో బ్రహ్మణాకిల
మాం హంతుం మానుషోభూత్వా యత్నాదిహ సమాగతః
కరిష్యతిచిరా దేవసత్యసంకల్ప ఈశ్వరః
అతోహం యత్నతః సీతామానేష్యామ్యేవ రాఘవాత్॥"

శ్రీరాముని ఆజ్ఞప్రకారం నిజస్వరూపాన్ని అగ్నిలోదాచి, సీతాదేవి మాయాసీతను రావణుడు అపహరించునట్లు చేసినందువల్ల, రావణసంహారానంతరం మాయాసీత అగ్నిప్రవేశం చేయగా, నిజమైనసీత స్వస్వరూపంతో బైటపడింది. ఇది రావణునకు తెలిసినా తెలియకపోయినా, మాయాసీతను కూడా రావణుడు స్పృశించినట్లు కవి వ్రాయక, ఆమె నిలిచిన భూభాగాన్ని పెల్లగించి రథంమీద పెట్టుకొన్నట్లు వ్రాశాడు. ఇంతటితో సరిపోలేదు, రావణునకు "దేవరహస్యం" అంతా తెలిపినట్లు, రావణ వాక్యాలవల్ల మనకు తెలుస్తుంది.

"జానామి రాఘవం విష్ణుం లక్ష్మీం జానామి జానకీం
జ్ఞాత్వైవ జానకీ సీతా మయా నీతా వనాద్బలాత్
రామేణ నిధనం ప్రాప్యయాస్యామీతి పరంపదం
పరానందమయీ శుద్ధా సేవ్యతే యాముముక్షుభిః
తాం గతింతు గమిష్యామి హతోరామేణ సంయుగే
ప్రక్షాళ్య కల్మషాణీహము క్తిం యాస్యామి దుర్లభాం॥"

ఇదంతా తెలియడంవల్ల కావచ్చును. రావణుడు సీతాదేవిని అపహరించి తెచ్చినా, మాతృభావంతో ఆమెను చూశాడు.

"స్వాంతఃపురే రహస్యే తామశోకవిపినేఽక్షిపత్।
రాక్షసీభిః పరివృతాం మాతృబుద్ధ్యా స్వపాలయత్॥"

ఈ విధంగా కొంత దీర్ఘంగా అధ్యాత్మరామాయణ విషయాలను గ్రహించి నప్పుడుగాని వాల్మీకిరామాయణంలోని "శరణాగతి" తత్త్వంలోని వైశిష్ట్యం

తెలియదు. "అంతా రామమయం, ఈ జగమంతా రామమయం" అనే దృష్టికలిగి నప్పుడు - ఏ ఒక్క వ్యక్తి, వ్యక్తిత్వం నిలువనప్పుడు - అంటే ద్వంద్వదృష్టి ఉన్నప్పుడుగాని నిలువని. శరణాగతి అర్థరహితం అవుతుంది. ఆత్మార్పణానికి ఆధారం లేకపోతుంది. పారమార్థికంగా బ్రహ్మమొక్కటే సత్యమని (బ్రహ్మ సత్యం జగన్మిథ్యా, జీవోబ్రహ్మైవనా పరః) జగత్తుమిథ్య (బ్రహ్మవలె సత్యం కాదని) అనీ, జీవుడు బ్రహ్మము ఒకటే అని (జ్ఞానికి) విశ్వసించే కేవలాద్వైతంలో "శరణాగతి"కి విలువ తక్కువ. సాధకునకు ప్రాథమికావస్థలో "శరణాగతి" వల్ల భక్తికుదిరి, అది జ్ఞానానికి దారితీసి జ్ఞానంద్వారా మోక్షం లభిస్తుంది అని విశ్వసించేవారి సిద్ధాంతం ఇది.

శ్రీమద్రామాయణం "దీర్ఘశరణాగతి" అన్నప్పుడు, దానిలో శ్రీరాముని శరణుజొచ్చిన వారెవ్వరు "అహంబ్రహ్మాస్మి" అన్నట్లుగా శ్రీరాముని విషయంలో అనుకొన్నవారు కారు. శ్రీరాముని శరణుజొచ్చినవారిలో - రాకుమారులు, ప్రభుత్వోద్యోగులు, మునీశ్వరులు, ప్రజలు, నిషాదులు, రాక్షసులు, జటాయువు, వానరులు మొదలైనవారు ఎందరో ఉన్నారు. స్త్రీ పుం వివక్షగాని, జాతివివక్షగాని లేదు. శ్రీమన్నారాయణుడు భూమిమీద అవతరించి దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసి ధర్మాన్ని పరిరక్షించాలని మొదట వేడుకొన్న దేవతలున్నారు వీరందరిని యథోచితంగా శ్రీరాముడు ఆదరించాడు. ధర్మపరిపాలన విషయంలో స్వపరభేదం లేకుండా వ్యవహరించాడు. "సీతా యాశ్చరితం మహత్" అని రామాయణానికి నామాంతరం రావడానికి కారణమైన సీతాదేవి - జగజ్జనని - శక్తిసంపన్నురాలు అయినా; పారతంత్ర్యాన్ని ప్రదర్శించి, పురుషకార స్వరూపిణిగా శరణాగతులకు సాయపడుతూ శ్రీరాముని ధర్మరక్షణకు చేదోడు వాదోడుగా నిలిచింది. ఇదంతా- ఆమె ఘటకత్వం.

సీతాదేవి, భర్త అయిన శ్రీరామునియందు భరన్యాసం చేసి ఉండడంవల్ల తాను రావణుని తన పాతివ్రత్యశక్తితో భస్మం చేయగలిగిఉన్నా, కష్టాలన్నీ సహించి ఉంది. ఇది ఆమె వాచ్యంగా రావణునితో- తన్నాతడు అశోకవనంలో చూడ్డానికివచ్చి, తనను స్వీకరించవలసినదని ఒత్తిడి తెచ్చినప్పుడు - ఇలా అంటుంది :

"అనందేశాత్తు రామస్య తపసశ్చాను పాలనాత్ ।
నత్వాం కుర్మి దశగ్రీవ భస్మ భస్మార్హ తేజసా॥
(సుందరకాండ- సర్గ 22, శ్లో- 20)

"నిన్ను భస్మం చెయ్యవలసిఉన్నా చెయ్యడానికి శక్తిఉన్నా, రామాజ్ఞ లేకపోవడంవల్ల చెయ్యడంలేదు" అంటుంది. హితోక్తులు చెప్పేముందు, తన పాతివ్రత్యం మీద ఆమెకున్న విశ్వాసాన్ని గురించి వాల్మీకి ఇలా అంటాడు :

"ఉవాదాత్మహితం వాక్యం వృత్తశౌండీర్య గర్వితమ్।
నూనం నతేజనః కశ్చిదస్తి నిశ్రేయసే స్థితః॥" (శ్లో-12)

వాల్మీకిరామాయణం ప్రకారం సీతాదేవి శక్తిమంతురాలైనా, సర్వేసర్వత్ర భగవత్పారతంత్ర్యాన్నే ప్రదర్శించి ఇతరులకు మార్గదర్శకురాలైనది.

యుద్ధభూమిలో ఇంద్రజిత్తు ప్రయోగించిన నాగాస్త్రప్రభావంవల్ల మూర్ఛిల్లిన రామలక్ష్మణులను—రావణుని ఆజ్ఞమేరకు త్రిజట విమానంమీద తీసుకొనిరాగా వచ్చిన సీత - చూచి దుఃఖిస్తూ "తపస్విని అయిన మా అత్తగారికోసం శోకిస్తున్నట్లు- నేను నాకోసంగాని, రామలక్ష్మణులకోసంగాని, మా అమ్మకోసంగాని, దుఃఖించడంలేదు" అంటుంది. ఇది "మాతృదుఃఖం" అన్నింటికంటె ఎక్కువ అని సీత గుర్తించి అనడం ఆమె సౌజన్యానికి ఉత్తమతార్కాణం.

"న శోచామి తథా రామం లక్ష్మణం చ మహారథమ్ ।
నాత్మానం జననీం చాపి యథాశ్వశ్రూం తపస్వినీమ్॥"
(యుద్ధకాండ- సర్గ- 48)

సీతాదేవి తరువాత శ్రీరాముని సోదరులను ఈ విషయంలో మనం గ్రహించవలసి ఉన్నది. శేషుని అవతారమని ప్రసిద్ధిపొందిన లక్ష్మణుడు తాను సీతారాముల సేవకు ఏవిధంగా అంకితమైనాడో పరిశీలించాలి. తండ్రిమాట ననుసరించి అడవులకు వెళ్ళవలసిన అవసరం రామునకు లేదని వాదించాడు. కైకను దూషించాడు. కౌసల్యను ఊరడిస్తూనే, రామునితో "మనం ఇద్దరం కలిసి రాజ్యాన్ని ఆక్రమిద్దాము" అంటాడు లక్ష్మణుడు. భరతునికూడా సంశయిస్తాడు. ఈ మాటలవల్ల లక్ష్మణునకు పితృభక్తి లేదనికాదు. రామభక్తి దాన్ని మించిందని

భావం. ఇంక రాముడు అరణ్యానికి పోవడానికి నిశ్చయించుకొన్నప్పుడు తనను కూడా తీసుకొనిపోవలసినదనీ తాను కింకరునిగా సేవచేస్తానని అంటాడు.

"కురుష్వ మామను చరం వైధర్మ్యం నేహవిద్యతే ।
అహం సర్వం కరిష్యామి జాగ్రతస్స్వపతశ్చతే॥"

(అయోధ్యాకాండ)

ఎంతచెప్పినా రాముడు సమ్మతించనట్లు కనబడగానే ఆయనపాదాలు పట్టుకొని, సీతవైపు ప్రాధేయపూర్వకంగా చూస్తూ, ఆమె తనకు ఈ విషయంలో సాయపడాలి అనే భావం ద్యోతకంచేస్తూ- మాట్లాడినాడని వాల్మీకి వ్రాశాడు :

"సభ్రాతుశ్చరణౌ గాఢం నిపీడ్య రఘునందనః ।
సీతా ముదాచాతియ శారాఘవం మహావ్రతం ॥" (అయోధ్యా)

ఈ సన్నివేశం, సీతాదేవి పురషకారంకోసం లక్ష్మణుడు ప్రయత్నించాడని చెప్పడానికి తగినట్లున్నది.

లక్ష్మణుడు తమతో రావడానికి అంగీకరించిన రాముడు, "నువ్వురావడం మంచిదే. లేకపోతే సీతారక్షణ కష్టమయ్యేది" అంటాడు.

"త్వయాకార్యం నరవ్యాఘ్ర! మామనువ్రజతాకృతం ।
అన్వేష్టవ్యాహి వైదేహ్యా రక్షణార్థే సహాయతా" (అయోధ్యాకాండ)

అన్నచేత ఈవిధంగా అనిపించుకొన్న లక్ష్మణుడు, విధివశాత్ సీతాపహరణానికి- ఆమె దూషణలకు నొచ్చుకొని, ఆమెను విడిచివెళ్ళి- అవకాశం ఇచ్చాడు! సీతావియోగంచేత దుఃఖిస్తూన్న సోదరునకు ఉపచారవాక్యాలు చెప్పుతూ, సీతావియోగదుఃఖాన్ని వనవాసకష్టాల్ని రాముడు ఓర్చుకోగలిగినట్లు చేశాడు. శ్రీరామునకు చేసిన ఈ సేవకు, రాముడెంత సంతోషించాడో, ఎంతగా అతన్ని ప్రేమించాడో; యుద్ధభూమిలో మూర్ఛిల్లిన లక్ష్మణునిచూచి రాముడన్న ఈమాటలు నిదర్శనాలు:

"దేశేదేశేచ కళత్రాణి, దేశేదేశేచ బాంధవాః ।
తంతుదేశం నపశ్యామి, యత్రభ్రాతా సహోదరః ॥"

(యుద్ధకాండ)

ఇంతకంటె, లక్ష్మణుని జీవితాన్ని చరితార్థం చేసేమాటలుండవు. అన్నింటికి పైన ఇవి శ్రీరాముని మాటలు. ఈ సందర్భంలో అయోధ్యాకాండలో లక్ష్మణుడు శ్రీరామునిగూర్చి చెబుతూ "నేను మహారాజైన దశరథుని పితృత్వాన్ని గుర్తించడంలేదు. నాకు సోదరుడు భర్త (ప్రభువు) బంధువు, తండ్రి రాఘవుడే"

"అహం తావన్మహారాజే పితృత్వం నోపలక్షయే।
భ్రాతా భర్తా చ బంధుశ్చపి వాచమమ రాఘవః॥" (సర్గ–58)

అన్నట్టి మాటలను జ్ఞప్తికి తెచ్చుకొన్నప్పుడు శ్రీరాముని వేదన అర్థంఅవుతుంది.

శ్రీరాముని తమ్ములు భరత శత్రుఘ్నులు కూడా అన్నగారియందలి భక్తి ప్రపత్తులలో ఎవరికీ తీసిపోరు. ఈ ఇద్దరిలో, తల్లి కైకేయి వరాలవల్ల తనకే సంబంధం లేకపోయినా అపకీర్తిపాలయిన భరతుని విషయం చూద్దాము. ఆయనకు తల్లియందు ఎంతభక్తి ఉన్నదో అంతకు ఎన్నోరెట్లు పెదతల్లి కౌసల్యమీద భక్తి గౌరవాలు. పరమ భాగవతుడైన భరతుడు, భగవత్కైంకర్యమే జీవిత పరమావధిగా కలవాడు. ఇక్కడ ఆయన భగవంతుడు- అన్నగారైన శ్రీరామచంద్రుడు. భరతుని గుణగణాదులను లక్ష్మణునివద్ద శ్రీరాముడు జ్ఞప్తికితెచ్చుకొంటూనే ఉంటాడు. చిత్రకూటంలో ఉన్న శ్రీరాముని దర్శించుకోవడానికి భరతుడు-మహారాజును దర్శించుకోవడానికి ఉచితమైన పద్ధతిలో సైన్యసమేతంగా రావడం చూచిన లక్ష్మణుడు, భరతుని రాకను శంకించి యుద్ధానికి ఉద్యుక్తుడు కాగా, శ్రీరాముడతన్ని వారించి భరతుని భక్తిప్రపత్తులను వివరిస్తాడు.

భరతుడు- లోకమంతా తనను నిందిస్తూఉంటే-చాలా ఖిన్నుడై ఉంటాడు. తన తల్లిని చంపనుద్యుక్తుడై - శ్రీరాముడు ఆపనిని గర్హిస్తాడని విరమించుకొంటాడు. శత్రుఘ్నుడు మంథరను చంపడానికి ప్రయత్నించినా, "ఇంక రాముడు మనతో సంభాషించడు"అని చెప్పి అతన్ని వారిస్తాడు. "త్వాంచ మాంచ హి ధర్మాత్మానాభి భాష్యతే ధ్రువమ్." భరతుడు కౌసల్యను క్షమించవలసినదని వేడుకోవడానికి పోతూఉండగా, ఆమె కనబడి నిష్ఠురోక్తులు పలుకగా వినలేక దుఃఖంతో మూర్ఛిల్లుతాడు. చిత్రకూటానికి రామదర్శనానికి వెళ్ళే మార్గంలో ఉన్న భరద్వాజమహర్షిని దర్శించినప్పుడు ఆయన తనను దూషించగా భరతుడు

నిశ్చేష్టుడై "తన రామభక్తిని ప్రకటించి," వచ్చినవాణ్ణి ఇంకా చంపవద్దంటాడు. సమస్త భోగాలను విసర్జించి, జడలు ధరించి, నారచీరలు కట్టి భరతుడు "నంది గ్రామం"లో ఉన్నా, అడవిలోఉన్నట్లే ఉన్నాడు. చిత్రకూటం వచ్చిన భరతుడు పట్టాభిషిక్తుడవై రాజ్యాన్ని ఏలుకోవలసినదని పదే పదే శ్రీరాముని ప్రార్థిస్తాడు. తాను దాసుడనని అంటాడు.

"తస్యమేదాస భూతస్య ప్రసాదం కర్తుమర్హసి।
అభిషించ స్వచాద్యైవ రాజ్యేన మఘవానివ॥"

(అయోధ్యాకాండ సర్గ-104)

"ఇంద్రునిలా పట్టాభిషిక్తుడవుకమ్ము" అని వేడుకొంటాడు. కాని రాముడు అంగీకరించకపోవడంతో "నీ పాదుకలుఇయ్యి, వాటిని నీకు ప్రతినిధులుగా భావించి వాటి సేవచేస్తూ, నీ పక్షాన నేను కార్యనిర్వాహణచేస్తాను" అంటాడు ఇందువల్ల, భరతుని శరణాగతిలో - అది ఫలోన్ముఖం కావడానికి అన్నమాట- కాలవ్యవధివచ్చింది! పదునాల్గు సంవత్సరాల తరువాత అది ఫలించింది! ఈలోగా రామ పాదుకలు ఆయనకు శరణ్యంఅయ్యాయి! భరతుడు శ్రీరామునే తనకు ఉపాయోపేయాలుగా స్వీకరించాడు. "ఈ హేమపాదుకలమీద నీ పాదలుంచి నాకు వాటిని ప్రసాదించు" అంటాడు!

"అధిరోహార్యపాదాభ్యాం పాదుకే హేమభూషితే।
ఏతేహి సర్వలోకస్య యోగక్షేమం విధాస్యతః॥"

(అయోధ్యాకాండ-సర్గ-112)

ఆవిధంగాచేసి తనకిచ్చిన పాదుకలను రాముని స్థానంలోఉంచి, వాటిని ఆరాధిస్తూ, శ్రీరాముడు తిరిగి వచ్చేదాకా భరతుడు రాజకార్య నిర్వహణంచేశాడు. "భరణాత్ భరతః" అని గ్రహిస్తే, భరతుడు ఎన్నింటిని భరించాడో మనం ఊహించుకోవచ్చును. "భరన్యాసం" ఉన్నదిగనుక, భరతుడు ఆత్మనిక్షేపంలో స్థిరసంకల్పుడుఅని గ్రహించవచ్చును. రామాయణంలో భరతుడు నిర్వహించిన కార్యాలు-పితృకార్యం, రామప్రతినిధిగా పదునాలుగేండ్లు రాజకార్యం, రామ పట్టాభిషేకం తరువాత యువరాజుగా కార్యనిర్వహణ మొదలైనవి చాలాఉన్నాయి.

ఎన్నిఉన్నా, ఆయన రామదాసునిగా పారతంత్ర్యాన్నే ప్రదర్శించారు, తన తమ్ములలో భరతుని సాటి వచ్చేవారులేరని రామునిచేత శ్లాఘించబడ్డారు.

రామాయణంలో శత్రుఘ్నుడు నిర్వహించినపాత్ర అంతగా లేదు. లక్ష్మణ శత్రుఘ్నులిద్దరూ సుమిత్ర సంతానమైనా-రామానుయాయిలక్ష్మణుడు, భరతానుయాయి శత్రుఘ్నుడు అయ్యారు. రాముని అడవికివంపినందులకు తండ్రినికూడా దూషించడానికి జంకలేదు. మంథరను చంపాలనుకొన్నాడు! భరతునకు రాముడారాధ్యుడైతే శత్రుఘ్నునకు ఇద్దరూ ఆరాధ్యులే! శత్రుఘ్నుడు భరతానుయాయి గనుకనే ఆయనతోకలిసి భరతుని మాతులగృహానికి వెళ్లారు! ఈయనా పరతంత్రుడే! ఈయన్నిగురించివ్రాస్తూ వాల్మీకి "శత్రుఘ్నో నిత్యశత్రుఘ్నః" అన్నాడు ఇక్కడ ఈయన జయించిన శత్రువులు - అరిషడ్వర్గాలు అని గ్రహించాలి. రామాజ్ఞననుసరించి ఒక్క లవణాసురునితోనే యుద్ధంచేశాడు. అంతే! రామాయణంలో భరత శత్రుఘ్నులు కలిసిమెలిసిఉన్నా, అక్కడక్కడ భరతునిలో అరిషడ్వర్గాల విజృంభణం, సంయమనం కనబడతాయి. లక్ష్మణుని విషయంలోను-ముఖ్యంగా క్రోధం-ఇవి పొడచూపుతాయి. కాని, శత్రుఘ్నునిలో ఇవి కానరావు! తన పేరును సార్థకం చేసుకొన్నవాడు. శ్రీరాముని సేవించి భరతుడు భాగవతుడైతే, భరతుని సేవరూపంగా భాగవత సేవ శత్రుఘ్నుడు చేశాడు. రామలక్ష్మణుల, భరతశత్రుఘ్నుల ప్రేమానుబంధాన్ని వాల్మీకి ఇలా వ్రాశాడు:

"భరతస్యాపి శత్రుఘ్నో లక్ష్మణావరజో హి సః ।
ప్రాణైః ప్రియతరో నిత్యం తస్యచాసీత్తథాప్రియః ॥"

(బాలకాండ-సర్గ-18)

శ్రీరామచంద్రుని విషయంలో వీరు వారు అనే భేదంలేకుండా సర్వులు ఆయనయందు భక్తిప్రపత్తులున్నవారే! నిషాదరాజయినగుహుడు శ్రీరామున కత్యంత సన్నిహితుడుగా కనబడతాడు. రాముడరణ్యవాసానికి పోతున్నట్లు తెలిసిన గుహుడు సపరివారంగా ఆయన్ని కలుసుకోవడానికి వస్తూండగా రాముడే లక్ష్మణునితోకలిసి అతనికి ఎదురు వెడతాడు! వారిద్దరి అనుబంధం ఇలాంటిది. వాల్మీకి మహాశవే, గుహుడు శ్రీరామునకు, ఆత్మసముడంటాడు.

"తత్రరాజా గుహోనామ రామస్యాత్మ సమస్సఖా।
నిషాదజాత్యో బలవాన్ స్థపతిశ్చేతివిశ్రుతః॥"

(అయోధ్యాకాండ-సర్గ-50)

భరతుడు పంచవటికి, శ్రీరాముని రాజ్యం స్వీకరించవలసినదని కోరడానికి, పెద్ద సైన్యంతో వెడుతూఉంటే, ముందు గుహుడు భరతుని సంశయిస్తాడు! తరువాత, లక్ష్మణుడు సంశయించినట్లుగా. గుహుని రామభక్తి ఇలాంటిది! రావణ వధానంతరం అయోధ్యకు తిరిగిపోతున్న రాముడు తమ రాకనుగురించి భరతునకు తెలియజేయవలసినదిగా హనుమంతుని పంపుతూ, మార్గమధ్యంలో ఉన్న గుహున కివార్త చెప్పినతరువాత భరతునిదగ్గరికి పొమ్మంటాడు! ఆ సందర్భంలో రాముడే "భవిష్యతిగుహః ప్రీతస్సమమాత్మ సమస్సఖా॥"అంటాడు. ఒకరినొకరు ఎప్పుడు కలుసుకొన్నా కౌగలించుకొంటారు! వనవాసానికిపోతూ నదీతీరానికివచ్చిన రాముని తో "నీకు అయోధ్య ఎలాంటిదో మా ఇల్లుకూడా అలాంటిది. ఎంతో పుణ్యం చేసుకొంటేనేగాని నీలాంటి అతిథి దొరకడు" అంటాడు:

"యథాయోధ్యాతథేయం తే రామకింకరవాణితే।
ఈ దృశం హిమహాబాహోకః ప్రాప్యస్యతిథిం ప్రియమ్॥"

(అయోధ్యాకాండ-సర్గ-50)

అరణ్యవాసానికి ఉచితమైన నారచీరలుకట్టుకొన్న రాముణ్ణిచూచి గుహుడు ఎంతో ఆర్తిచెందుతాడు. తనుతాను రామునకు కింకరునిగా సమర్పించుకొంటాడు. అహంకారం ఎక్కడా కనబడదు! గుహుని ఆత్మార్పణం, శరణాగతి అనన్య సామాన్యం!

వానరులైన వాలి, సుగ్రీవులు ఇద్దరూ - మార్గాలు భిన్నమైనా-శ్రీరాముని శరణాగతులే! ఇంద్రుని అంశతో జన్మించినవాడు వాలి. సూర్యుని అంశతో జన్మించినవాడు సుగ్రీవుడు. ఇద్దరూ సోదరులు ఋక్షరజాని పుత్రులు. సుగ్రీవునకు వాలి అన్నగారు దుందుభి అనే రాక్షసునితో యుద్ధం చేయడానికి పోయిన వాలి ఎంతకాలానికి తిరిగి రాకపోవడంచూచి అతను మరణించి ఉంటాడనుకొని సుగ్రీవుడు-దూరాలోచనలేకుండా - రాజ్యాన్ని చేపట్టాడు. వాలి రాక్షసుణ్ణిచంపి, ఆశవాన్ని మతంగాశ్రమంలో పడేటట్లుతన్ని, శాపంపొంది తిరిగివచ్చాడు. తన

రాజ్యాన్ని అన్యాయంగా ఆక్రమించాడనే కోపంతో సుగ్రీవుని చంపనుద్యుక్తుడై, అతడు-మతంగశాపంవల్ల తాను చొరరాని - మతంగాశ్రమానికి పారిపోయి తల దాచుకొనగా-అధర్మంగా సుగ్రీవుని భార్య రుమను చేబట్టి రాజ్యపాలన ప్రారంభించాడు. శ్రీరామునకు సాయంచేయడానికి సృష్టించబడిన వానరులకురాజై రాముని విరోధిఅయిన రావణునకు మిత్రుడయ్యాడు.

సుగ్రీవుడు రామునితో స్నేహంచేశాడనీ కనుక, రామునితో విరోధం తగదనీ తన భార్య తార తనకు హితోపదేశంచేసినా, వాలి రాముడుధర్మాత్ముడని తనకు అపకారం తలపెట్టడనీ అంటాడు.

"న చ కార్యో౽విషాదస్తే రాఘవం ప్రతిమత్కృతే ।
ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ కథం పాపం కరిష్యతి॥"

(కిష్కింధకాండ-సర్గ-15)

దీనినిబట్టి శ్రీరాముని విషయంలో వాలివంటివానికున్న అభిప్రాయం తెలుస్తుంది. శ్రీరామబాణంచేత నేలకూలినవాలి, తనను అన్యాయంగా బాణహతుణ్ణి చేశావని రామునితో వాదోపవాదాలుచేసి, చివరికి తన తప్పుగుర్తించి శ్రీరామునితో ఇలా అంటాడు:

"త్వంహి దృష్టార్థతత్త్వజ్ఞః ప్రజానాం చ హితేరతః
కార్యకారణసిద్ధౌతే ప్రసన్నా బుద్ధిరవ్యయా
మమాప్యగత్ ధర్మాణం వ్యతిక్రాంత పురస్కృతం
ధర్మసంహితయా వాచా ధర్మజ్ఞపరిపాలయ
త్వత్తో౽హం వధమాకాంక్షన్ వార్యమాణో౽పితారయా
సుగ్రీవేణ సహభ్రాతా ద్వంద్వయుద్ధముపాగతః ॥"

"తార నివారిస్తూన్నా వచ్చాను నీ చేతిలో మరణాన్ని ఆశించాను" అని వాలి చెప్పడంవల్ల, అతడు శరణాగతుడైనట్లే భావించాలి. రామునితో చేసిన సంవాదం వల్ల, వాలి తన తప్పు తాను తెలుసుకొని పశ్చాత్తాపం చెందినట్లే భావించాలి. తన కుమారుడైన అంగదుని శ్రీరామునకు అప్పచెప్పడంకూడా దీన్నే తెలియజేస్తుంది.

వాలి మొదట రాముణ్ణి దోషిగా నిరూపించి మాట్లాడినా, చివరికి తన తప్పుతాను తెలుసుకొన్నట్లుగా వాల్మీకి చెప్పనే చెప్పారు.

"ఏము క్తస్తు రామేణ వాలీ ప్రవ్యథితో భృశం।
నదోషం రాఘవేదధ్యౌ ధర్మేఽధిగత నిశ్చయః॥"

(కిష్కింధకాండ- సర్గ- 18)

ఇంక సుగ్రీవుడున్నాడు! చాలా తొందరపాటు, విషయవాంఛా లంపట త్వం, స్వకార్య నిర్వహణత్వం కోసం ఆశ్రయించి తరువాత తనకు సాయపడిన వారి కార్యం విషయంలో ఉదాసీనత వహించడం మొదలైన దోషాలున్నవాడు. అన్నగారైన వాలి చనిపోయాడో లేదో తెలుసుకోకుండా దుందుభి వెనుక వాలి చొచ్చిన బిలాన్ని మూసేసివచ్చి రాజ్యాన్ని చేబట్టడం అతని తొందరపాటును, మాతృసమానురాలైన అన్నగారి భార్యను చెరపట్టడం, వాలి మరణానంతరం రాజ్యభోగాలు అనుభవిస్తూ శ్రీరామకార్యం విస్మరించడం అనేవి - అతని విషయ వాంఛా లంపటత్వానికి, మిత్రుల కార్యనిర్వహణలో ఉదాసీనత వహించడానికి తార్కాణాలు. వీటిలో తొందరపాటునుగూర్చి, లంపటత్వాన్ని గురించి అంగదుడే హనుమంతునితో అన్నట్లు వాల్మీకి వ్రాశారు:

"భ్రాతుః జ్యేష్ఠస్యయోభార్యాం జీవతోమహిషీం ప్రియాం
ధర్మేణ మాతరం యస్తు స్వీకరోతి జుగుప్సితః
కథం సధర్మం జానీతే యేనభ్రాత్రామహాత్మనా
యుద్ధా యాభినియు క్తేన బిలస్యపిహితం ముఖం॥"

(కిష్కింధకాండ— సర్గ—55)

ఈ కార్యాలనుబట్టి సుగ్రీవుని సహజ ప్రవృత్తి తెలుస్తుంది. రాముడు సీతను వెదకడంకోసం సాహాయ్యం కోరివచ్చాడు. నీ శరణు ఆశించాడు. వారు పూజనీయులు అని హనుమంతుడు హెచ్చరిస్తాడు.

"తస్యాస్యవసతోఽరణ్యే నియతస్య మహాత్మనః।
రావణేన హృతాభార్యా సత్వాం శరణమాగతః॥

భవతా సఖ్యకామౌతౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ।
ప్రతిగృహ్యార్చయ స్వేతౌ పూజనీయతమా ఉభౌ॥''

(కిష్కింధకాండ- సర్గ-౬)

సీతాన్వేషణలో తన ఉపేక్షచేత, క్రోధంతో లక్ష్మణుడు రావడాన్ని చూచి భయపడి సుగ్రీవుడు ముందుగా అంగదుని, తరువాత తారను అనునయవాక్యాలతో లక్ష్మణుని శాంతింపజేయవలసినదని పంపుతాడు.

ఈ అభ్యర్థన వెనుక హనుమంతుని ఉపదేశం, రాజనీతి ఉన్నాయి. మొత్తం మీద సుగ్రీవుని శరణాగతిలో ఆత్మార్పణం తక్కువగా కనబడుతుంది. లక్ష్మణుని శాంతించవలసినదని కోరినప్పుడుకూడా "లోకంలో తప్పు చెయ్యనివాడెవడుంటాడు. చనువుతో తాను తప్పుచేసి ఉండవచ్చును. మీలాంటివారు క్షమించవచ్చును" అంటాడు.

"యదితించి దతిక్రాంతం విశ్వాసాత్ప్రణయేనవా ।
ప్రేష్యస్య క్షమితవ్యం యేనకశ్చిన్నాపరాధ్యతి॥

(కిష్కింధకాండ- సర్గ-౩౬)

సుగ్రీవుడు, మొట్టమొదట్లోకూడా శ్రీరాముని పరీక్షించి, సప్తతాళభేదనాది క్రియలను చూచిన తరువాతనే. శ్రీరాముని శరణుపొందుతాడు.

"సమూర్ధ్నాన్యపత ద్భూమౌ ప్రలంబీకృత భూషణః ।
సుగ్రీవః పరమప్రీతో రాఘవాయకృతాంజలిః ॥"

(కిష్కిందాకాండ– సర్గ–12)

పీటినిబట్టి చూచినప్పుడు— సుగ్రీవుని శరణాగతి, విభీషణుని శరణాగతి కంటె తక్కువస్థాయిలో ఉన్నదనాలి. ఇదిగాక, విభీషణుడు శరణుపొందడానికి వచ్చినప్పుడు, అతనికి శరణు ఇయ్యరాదని "రావణస్య నృశంసస్య భ్రాతా హ్యేష విభీషణః" అనీ "సవధ్యస్సచివైస్సహ" అనీ రామునకు హితోక్తిగా భావించి చెప్పినవాడు సుగ్రీవుడు. అప్పుడే రాముడు తన "శరణాగతి తత్త్వం" చెప్పవలసి వచ్చింది. తన పరమేశ్వరతత్త్వాన్ని - పరమేశ్వరునకు భేదభావం ఉండదని- నిరూపించే "అభయం సర్వభూతేభ్యోదదామి" అని చెప్పవలసి వచ్చింది.

"అనయైనం హరిశ్రేష్ఠ! దత్తమస్యాభయం మయా।
విభీషణో వా సుగ్రీవ! యదివా రావణస్స్వయమ్॥"

అని కూడా అన్నాడు రాముడు.

రామాయణంలో విభీషణుని పాత్ర విచిత్రమైనది. ధర్మాన్ని నాశనం చెయ్యడానికి బద్ధకంకణులైన రాక్షసవంశంలో జన్మించినా, ఆ రాక్షసులకు రాజయిన రావణుని తమ్ముడైనా - మూర్తీభవించిన సత్వగుణుడు విభీషణుడు. అతని ఈ లక్షణం బంధువులకు, ఇతరులకు అందరికి తెలిసినదే! అరణ్యకాండ ప్రారంభంలోనే- సీతాపహరణానికి ముందే-రావణ విభీషణుల సోదరి శూర్పణఖ శ్రీరామునితో తన కుటుంబాన్ని గూర్చి చెప్పుకొనేసందర్భంలో "విభీషణస్తు ధర్మాత్మా నతు రాక్షసచేష్టితః"అని చెప్పుతుంది. విభీషణుని భార్య, పిల్లలుకూడా ధర్మాత్ములు. సీత స్వయంగా హనుమంతునితో "తనను అపహరించి తీసుకొని రావడం రాక్షస వినాశహేతువవుతుందని రావణునితో విభీషణుడు చెప్పినా"అతని కది రుచించలేదనీ కాలవశుడైన రావణుని యుద్ధంలో వశవర్చుకోవడానికి మృత్యువు వెదకుతోందనీ విభీషణుని పెద్దకూతురు అనల అనే ఆమె తల్లిపంపగా వచ్చి ఆ విషయాలు చెప్పిందనీ అంటుంది. దీనిని బట్టి మనకు విభీషణుని శీల సంపత్తి తెలుస్తుంది.

"విభీషణేన చ భ్రాత్రామమ నిర్యాతనం ప్రతి।
అనునీతః ప్రయత్నేన నచతత్కురుతే మతిం॥

మమప్రతి ప్రదానం హి రావణస్య న రోచతే।
రావణం మార్గతే సంఖ్యే మృత్యుః కాలవశంగతమ్ ॥

జ్యేష్ఠాకన్యాఽనలా నామ విభీషణసుతా కపే।
తయా మమేద మాఖ్యాతం మాత్రాప్రహితయా స్వయం॥

(సుందరకాండ- సర్గ-37)

ఇందువల్లనే, లంకాదహన సమయంలో హనుమంతుడు విభీషణుని ఇంటిని దహించకుండా విడిచివేసినాడు.

"వర్ధయిత్వా మహాతేజా విభీషణగృహం ప్రతి।
క్రమమాణః క్రమేణైవ దదాహ హరిపుంగవః ॥
(సుందరకాండ- సర్గ-54)

ఇదిగాక, పట్టుబడిన హనుమంతుని చంపివేయవలసినది అని రావణుడు ఆజ్ఞాపించగా, "దూతను చంపరాదు" అని వారించినవాడు విభీషణుడు.

"క్షమస్వరోషం త్యజ రాక్షసేంద్ర।
ప్రసీదమద్వాక్య మిదం శృణుష్వ।
వధం న కుర్వంతి పరావరజ్ఞాః।
దూతస్య సంతో వసుధాధిపేంద్రాః ॥ (సుందరకాండ-సర్గ-52)

వీటి నన్నింటిని బట్టి చూచినప్పుడు, శ్రీరాముని కలుసుకొని శరణువేడకపూర్వం నుండి- విభీణుడు. అతని కుటుంబసభ్యులు ధర్మతత్పరులనీ, రావణుని అనుచిత కార్యాన్ని గర్హించే వాళ్ళని తెలుస్తుంది.

తన హితోక్తులను వినకు తనను బహిష్కరించిన అన్నయందు ద్వేషం పూనక, విభీషణుడు నలుగురు మంత్రులతో రాముని శరణువేడడానికి పోతూ రావణునితో ఇలా అంటాడు :

"తన్మర్షయతు యచ్చోక్తం గురుత్వాద్ధితమిచ్ఛతా।
ఆత్మానం సర్వథా రక్ష పురీం చేమాం సరాక్షసామ్।
స్వస్తితేఽస్తు, గమిష్యామి, సుఖీభవ మయావినా॥"
(యుద్ధకాండ- సర్గ-16)

"నీ హితాన్నికోరి నీకు అప్రియాన్ని చెప్పినందులకు క్షమించు. ఈ నగరాన్ని రాక్షసుల్ని, నిన్ను సర్వథా రక్షించుకో. నీకు స్వస్తి. నేను పోతున్నాను. నేనులేకుండా నువ్వు సుఖంగా ఉండు" అని విభీషణుడు అంటాడు. అన్న తనను త్యజించడంవల్ల స్వతంత్రుడైన విభీషణుడు-శ్రీరాముని భగవంతునిగా భావించిన విభీషణుడు - శరణాగతుడయ్యాడు. ఆ సందర్భంలో ఆయన - అయోధ్యలో లక్ష్మణుడు శ్రీరాముని విషయమై చెప్పినట్లే తానుకూడా అన్నింటిని త్యజించి వచ్చాను అంటాడు.

"త్యక్త్వా దారాంశ్చ పుత్రాంశ్చ రాఘవం శరణం గతః।
పరిత్యక్తా మయాలంకా మిత్రాణి చ ధనానిచ॥"

అన్నింటిని విడిచివచ్చి- అన్నీ అందరూ రాఘవుడే- అంటాడు. ఇది విభీషణుని శరణాగతి వెనుకఉన్న సర్వస్వత్యాగం. ఈ త్యాగం అయన్ని ఉత్తమశరణాగతుణ్ణి చేసింది. (ఇతర రామాయణాలలో - మిగిలిన అన్ని ఘట్టాలలో లాగే ఇక్కడకూడా ఎన్నో విషయాలు - తల్లి కైకసిదగ్గిర సెలవుతీసుకోవడానికి పోయినట్లు మొదలైనవి ఉంటాయి. అవన్నీ అవాల్మీకాలు. మనం వాల్మీకి రామాయణాన్నే అనుసరిస్తున్నాము. పోలిక కోసం అధ్యాత్మ రామాయణాదులను అక్కడక్కడ తీసుకొనిరావడం ఉంది).

భక్తుడు భగవంతుని శరణుజొచ్చినప్పుడు పురుషకారం ప్రాముఖ్యం వహిస్తుంది. ఇక్కడ భాగవతులైన వానరుల పురుషకారాన్ని అయన స్వీకరించాడు. కనుక, సుగ్రీవాదులముందు తన స్థితిని వెల్లడించుకొన్నాడు. ఒకవిధంగా నైచ్యానుసంధానం చేశాడనవచ్చును. ఆ సందర్భంలో వాల్మీకి రామాయణంలో ఇలా ఉంది.

"సోహం పరుషితస్తేన దాసవచ్చావమానితః।
త్యక్త్వాపుత్రాంశ్చ దారాంశ్చ రాఘవం శరణంగతః॥
సర్వలోక శరణ్యాయ రాఘవాయ మహాత్మనే।
నివేదయత మాంక్షిప్రం విభీషణ ముపస్థితమ్॥

(యుద్ధకాండ- సర్గ-17)

రాముని సమీపించిన తరువాత, తనరక్షణ భారమంతా అయనకే అప్పగిస్తూ ఇలా అంటాడు:

"అనుజోరావణస్యాహం తేన చాస్మ్యవమానితః ।
భవంతం సర్వభూతానాం శరణ్యం శరణాగతః॥" (సర్గ-19)

"భవద్గతంమేరాజ్యం చజీవితం చ సుఖానిచ।"

దీని తరువాత రావణుని బలాన్నిగురించి చెప్పడం ప్రారంభించాడు, "రావణస్య

బలం సర్వమాఖ్యాతు ముపచక్రమే।" ఇదంతా విన్నతరువాత రాముడు విభీషణునకు అభయమిస్తూ ఇలాఅన్నాడు:

"అహంహత్వా దశగ్రీవం సప్రహస్తం సబాన్ధవమ్ ।
రాజానం త్వాం కరిష్యామి సత్యమేత ద్బ్రవీమితే॥"
(యుద్ధకాండ-సర్గ-19)

ఈ విధంగా అని, విభీషణుని కౌగలించుకొని ("రామస్తు పరిష్వజ్య విభీషణమ్") వెంటనే లంకారాజ్యానికి విభీషణుని సముద్రతీరంలోనే-పట్టాభిషిక్తుణ్ణి చేయించాడు.

"అబ్రవీ ల్లక్ష్మణం ప్రీత స్సముద్రా జ్జలమానయ
తేనచేమం మహాప్రాజ్ఞ మభిషించ విభీషణమ్
రాజానం రక్షసాం క్షిప్రం ప్రసన్నేమయి మానద
ఏవముక్తస్తు సౌమిత్రి రభ్యషించ ద్విభీషణమ్॥" (సర్గ-19)

విభీషణుడు రాజ్యకాంక్షతో వచ్చాడని ముందే హనుమంతుడంటాడు:

"ఉద్యోగం తవసంప్రేక్ష్య మిథ్యావృత్తం చరావణమ్ ।
వాలినశ్చ వధంశ్రుత్వా సుగ్రీవం చా భిషేచితం
రాజ్యం ప్రార్థయ మానశ్చ బుద్ధిపూర్వ మిహాగతః॥" (సర్గ-17)

రామునకుకూడా ఇది తెలియకపోలేదు. సుగ్రీవునితో రాముడు ఈ సందర్భంలో ఇలా అంటాడు:

"నవయం తత్కులీ నా శ్చరాజ్యకాంక్షీ చ రాక్షసః ।
పండితా హిభవిష్యంతి తస్మాద్గ్రాహ్యో విభీషణః॥" (సర్గ-18)

ఇవికాక, రామలక్ష్మణులు నాగపాశబద్ధులై మూర్ఛలో మునిగి ఉన్నపుడు, విభీషణుడు దుఃఖిస్తూ ఇలా అనుకొన్నాడు:

"యయోర్వీర్య ముపాశ్రిత్య ప్రతిష్ఠా కాంక్షితామయా
తావుభౌ దేహనాశాయ ప్రసుప్తౌ పురుషర్షభౌ

జీవన్నద్య విపన్నోస్మి నష్టరాజ్య మనోరథః
ప్రాప్తప్రతిజ్ఞ శ్చరిపుః సకామోరావణః కృతః॥" (సర్గ-50)

వీటి నన్నింటిని బట్టి రాజ్యకాంక్షతోనే విభీషణుడు రాముని ఆశ్రయించా డనీ, శరణాగతుడయ్యాడనీ చెప్పవలసిఉంటుంది. అర్థార్థిఅయినా ఆర్తితో వచ్చాడు గనుక 'రావణునకే శరణు ఇయ్యడానికి సంశయించను" అని చెప్పిన రాముడు విభీషణునకు శరణుఇచ్చాడు. రాజ్యాభిలాష ఉన్నదిగనుక లంకా విజయానికి ముందే రాజ్యాభిషేకం చేయించాడు. కాలాంతరంలో, ఇక్ష్వాకుల కులదైవమైన నారాయణ (జనార్దన) ప్రతిమ, విభీషణునకు అర్చనార్థం లభించి మోక్షమార్గాన్ని చూపించింది. ఈవిధంగా "శరణాగతి" తాత్కాలిక ఫలాన్ని మోక్షమనే పరమ ఫలాన్ని విభీషణునకు సంప్రాప్తింపజేసింది. విభీషణుడు ధర్మాత్ముడు గనుకనే ఇవి రెండూ లభించాయి!

సోదరుడైన కుంభకర్ణుని మరణానంతరం రావణుడు దుఃఖిస్తూ, "ధార్మికుడైన విభీషణుని త్యజించడమనే కర్మ విపాకమే తన కాదుఃఖం కలిగిస్తోంది" అనుకొంటాడు!

"తస్యాయం కర్మణః ప్రాప్తో విపాకో మమశోకదః ।
యన్మయా ధార్మిక శ్రీమాన్ ననిరస్తో విభీషణః॥" (సర్గ-68)

వీటి నన్నింటిని బట్టి విభీషణుని ధార్మికత, ఔన్నత్యం తెలుస్తున్నాయి.

శ్రీమద్రామాయణానికి "దీర్ఘశరణాగతి" అని ప్రసిద్ధి ఉందిగనుక, ఇంకా ఎందరో ఆ అవతారమూర్తి శరణుపొందిన వారున్నారు. అవతార ప్రయోజనం దుష్టులను శిక్షించడంకంటెకూడా ఎక్కువగా సాధు సంరక్షణమే అని గుర్తించాలి. ధర్మాత్ములకు తమ దర్శనమిచ్చి తరింపజేయడమే రామకృష్ణాద్యవతారాలు ముఖ్యంగా-నిర్వహించిన కార్యం!

రావణుడు వరగర్వితుడై లోకకంటకుడుకాగా దేవతలందరూ బ్రహ్మదేవునితో విషయం చెప్పుకొన్నారు:

"సుమహాన్నో భయం తస్మాత్ రాక్షసాత్ ఘోర దర్శనాత్ ।
వధార్థంతస్య భగవన్ను పాయంకర్తు మర్హసి॥"
(బాలకాండ-సర్గ-15)

ఒక విధంగా బ్రహ్మ ఇక్కడ పురుషకారం వహించాడని చెప్పాలి. రావణుడు-మానవులచేతనే వధ్యుడు అని బ్రహ్మవల్ల తెలుసుకొని, అందరూ శ్రీమన్నారాయణుని భూలోకంలో మానవునిగా అవతరించి రాక్షస సంహారం చేయవలసినదని ప్రార్థించ నిశ్చయించుకొన్నారు. దేవతలు, బ్రహ్మవచ్చినట్లే, విష్ణువుకూడా హవిర్భాగ స్వీకారంకోసంవచ్చి వారికి దర్శనంఇచ్చాడు. దశరథుడు అశ్వమేధయాగం పూర్తిచేసి పుత్రకామేష్టి చేస్తున్న సమయమది! అర్త్రాణ పరాయణుడైన విష్ణువు తానేరావడంతో దేవతలు ధైర్యంవహించారు. వచ్చినవాడు చతుర్భుజుడై శంఖ చక్రాది ఆయుధాలను ధరించివచ్చాడు దశరథునకు పుత్రునిగా జన్మించవలసినదని వేడుకొన్నారు. తమకోసంకాక లోకహితంకోసం జన్మించవలసిందిఅన్నారు. ("త్వాం నియోక్ష్యామహే విష్ణో లోకానాం హిత కామ్యయా") శరణాగతికి ముఖ్యాంగాలుఅయిన-ఆత్మనిక్షేపకార్పణ్యాలు ప్రదర్శించారు. "నువ్వేగతిమాకు" అన్నారు ("త్వంగతిః పరమాదేవ సర్వేషాం నః పరంతప") విష్ణువుఅంగీకరించి అంతర్ధానమయ్యాడు. విష్ణువుచేసిన వాగ్దానానికి బ్రహ్మాది దేవతలందరూ ఆనందించారు. దేవతల కోరికమేరకు, రామావతారంలో శ్రీమన్నారాయణుడు, మానవునిగానే వ్యవహరించాడు. రావణుడు, మానవునిచేతులలో గదా చావవలసినది! బ్రహ్మదేవునివరం వమ్ముకానివిధంగా, రావణుని-మానవ మాత్రునిగా ప్రవర్తించి-శ్రీరాముడు సంహరించాడు.

సీతారామ లక్ష్మణులు అరణ్యంలో సంచరించారు. ముందురాముడు, మధ్య సీత, వెనుక లక్ష్మణుడు ఇదీ వరుస. వాల్మీకి ఇలా అంటాడు:

"అగ్రతః ప్రయయౌరామః । సీతా మధ్యే సుమధ్యమా ।
పృష్ఠతస్తు ధనుష్పాణిర్లక్ష్మణోఽను జగామహ॥"

(అరణ్యకాండ-సర్గ-11)

ఈవిధంగా భగవంతుడే తమదగ్గిరికి రావడం ఋషీశ్వరులకు ఆశ్చర్యాన్ని కలిగించింది. పరబ్రహ్మస్వరూపుడైన రాముడు ముందునడుస్తూఉండగా మాయా స్వరూపిణి సీత మధ్యనుండగా దాసుడైన జీవుడు వెనుకఉన్నాడు. మాయా స్వరూపిణి మధ్యనుండడంవల్ల జీవునకు పరమాత్మ దర్శనం లభించడంలేదు! ఆమె దయతలచి కొంచె తొలగితే జీవాత్మకు పరమాత్మ దర్శనం లభిస్తోంది.

ఆధ్యాత్మిక జ్ఞాన సంపన్నులయిన ఋషీశ్వరులకు వీరు ముగ్గురు

"చిదచిదీశ్వర తత్త్వత్రయం"గా భాసించారు! బ్రహ్మసంహితప్రకారం - మహా విష్ణువు, లక్ష్మి, దాసభూత జీవుడు-కలిసి "ఓం"కారమయిందని! అకార-ఉకార-మకారాలుకలిసి "ఓం" అయిందని ప్రసిద్ధి! అకారం విష్ణువునకు, ఉకారం లక్ష్మికి, మకారం జీవునకు సంకేతాలు:

"అకారేణోచ్యతే విష్ణుః సర్వలోకైకనాయకః ।
ఉకారేణోచ్యతే లక్ష్మీః మకారో దాసవాచకః॥
అకారేణోచ్యతే విష్ణుః సర్వదేవేశ్వరోహరిః ।
ఉద్ధృతా విష్ణు నాలక్ష్మీరు కారేణ తథోచ్యతే ।
మకార స్తుతయోర్దాస ఇతి ప్రణవలక్షణమ్॥"

సీతారాములు లక్ష్మీనారాయణులని మనకు తెలిసినదే; ఇంక లక్ష్మణుడు వారి దాసుడు "భగవచ్ఛేషత్వం" ఆచరణలో చూపించాడు.

ఋషీశ్వరులు రావణ సంహారం చేయవలసినదని కోరలేదు. ఎవరినీ దండించుమనలేదు. ఇవన్నీ తామస రాజసవ్యాపారాలు, సత్త్వగుణసంపన్నులయిన వీరు కోరినది "మమ్మల్ని రక్షించు. గర్భస్థశిశువును తల్లి రక్షించినట్లుగా నువ్వు ఎక్కడఉన్నా, మాకు రాజువే । లోకహితంచెయ్యి" అని. వారి భావాలను వాల్మీకి చక్కగా ఇలా వ్యక్తంచేశాడు-వారిమాటలుగా.

"నగరస్థోవనస్థో వాత్వంనో రాజా జనేశ్వరః ।
న్యస్తదండావయం రాజన్ జితక్రోధాః జితేంద్రియాః ।
రక్షితవ్యా స్త్వయాశశ్వత్ గర్భభూతా స్తపోధనాః॥"

(అరణ్యకాండ-సర్గ-1)

శ్రీరాముడు రాక్షసుడైన ఖరుని సంహరించడానికిముందు "ఇక్కడిమునులు నిశాచరులను చంపడానికి నన్ను రాజుగా ఆశ్రయించారు" అంటాడు.

"పాపమాచరతాం ఘోరంలోకస్యాప్రియ మిచ్ఛతామ్ ।
అహమాసాదతో రాజ్ఞా ప్రాణాన్ హన్తుం నిశాచరః॥"

(అరణ్య-సర్గ-29)

ఈ ముగ్గురి దర్శనంతో బ్రహ్మానందానుభూతి వారికి కలిగింది. తమ తపస్సులు నిరాటంకంగా జరగడానికి కావలసిన రక్షణ వారు కోరారు. వారు రాక్షసులను దండించడానికి తగిన శక్తిమంతులే. కాని తమ తపస్సు ఈ తామస కార్యంవల్ల నష్టపోకూడదని భావించారు. శ్రీరాముడు రాక్షస సంహారంకోసం అవతారం ఎత్తిన పరమపురుషుడని వారికి తెలుసును. వేరే అడగడం ఎందుకు ? కాని, వారి శరణాగతి పూర్తికావడంకోసం, ప్రవత్తికి అవశ్యకమయిన అనన్య శరణత్వం ప్రదర్శించారు. "నువ్వుతప్పగతిలేదు" అనుకోవడం! అవిధంగా వేడు కోవడం! ఇది వారు చేసింది:

"తతస్త్వాం శరణార్థంచ శరణ్యం సముపస్థితాః
పరిపాలయనో రామ వధ్యమానాన్నిశా చరైః
పరాత్వత్తో గతిర్వీర పృథివ్యాంనో పపద్యతే
పరిపాలయనః సర్వాన్ రాక్షసేభ్యో నృపాత్మజ॥" (సర్గం.6)

శరణువేడడం జీవుని కర్తవ్యం, రక్షణ ఇయ్యడం పరమేశ్వరుని ధర్మం! శ్రీరాముడు "నేను మీకోసమేవచ్చాను"అంటాడు. "నన్ను మీరు ఆజ్ఞాపించాలిగాని, అడగడమేమిటి?"అని "పితృవాక్య పరిపాలనకోసం వచ్చాను, కాని మీ కార్యసిద్ధి జరుగుతుంది"అంటాడు.

"నైవమర్హతమాం వక్తుమాజ్ఞాప్యో హంతపస్వినాం
కేవలేనాత్మ కార్యేణ ప్రవేష్టవ్యం మయా వనం
విప్రకార మపాక్రష్టుం రాక్షసైర్భవతా మిమం
పితుస్తు నిర్దేశకరః ప్రవి ష్టోహమిదం వనమ్
భవతామర్థ సిద్ధ్యర్థ మాగతోఽహం యదృచ్ఛయా
తస్య మేయంవ నివాసో భవిష్యతి మాహాఫలః॥

దండకారణ్యంలో రాముడు నివసించడంతో అక్కడి మునులకు రాక్షస భయం తగ్గింది. భంగపడిన శూర్పణఖ ప్రోత్సాహంతో ఖరదూషణ త్రిశిరసులు సైన్యంతోవచ్చి శ్రీరామునిచే సంహరింపబడడంతో ఆబాధ తొలగిపోయింది! రామ దర్శనంకోసం నిరీక్షిస్తూ శరభంగుడు-స్వయంగా స్వర్గానికి తనను తీసుకొని పోవ

దానికి దేవేంద్రుడువచ్చినా-అంగీకరించక, రామదర్శనం తరువాత యోగమార్గం ద్వారా బ్రహ్మలోకానికి పోయాడు. తరువాత రాముడు సుతీక్ష్ణుని ఆశ్రమంచేరాడు. సుతీక్ష్ణుడు రామదర్శనం చేసుకొని, తనదేహాన్ని విసర్జించాలని నిశ్చయించుకొన్న వాడు గనుక రామునిచూచి ఇలా అంటాడు:

"ప్రతీక్షమాణ స్త్వామేవ నారోహేఽహం మహాయశః ।
దేవలోకమితో వీరదేహం త్యక్త్వామహీతలే॥" (సర్గ-7)

తరువాత శరభంగునిలాగే తన తపఃఫలాన్ని పరమేశ్వరుడైన శ్రీరామునకు ధారపోసి పునరావృత్తిరహిత బ్రహ్మలోకానికిపోతాడు. తమ తపోబలంచేతనే స్వర్గాదిలోకాలు పొందగలిగిన మునీశ్వరులు, శ్రీరామ దర్శనంకోసం వేచిఉండి, దర్శనానంతరం ఉత్తమలోకాలకుపోవడం శరణాగతివైశిష్ట్యాన్ని చాటడానికే!

శ్రీరాముని విషయంలో-అంతఃపురస్త్రీలు, రాజోద్యోగులు, అయోధ్యాపుర వాసులు-వీరు వారు అనడం ఎందుకు సర్వులు-ఆయన్ని శరణ్యునిగా గ్రహించారు. ఆయన సీతా లక్ష్మణులతో కలిసి అరణ్యవాసానికి పోతున్నారంటె "మాకు దిక్కెవరు?"అని ఆక్రోశించారు. అంతఃపుర స్త్రీలన్నప్పుడు దుర్బలులు, పోష్య వర్గ, తపస్వినులు పరిచారికాదులనవచ్చును:

"అనాధస్యాస్య జనస్య దుర్బలస్య తపస్వినః ।
యోగతిశ్శరణం చాసీత్సనాథఃక్వను గచ్ఛతి॥"

(అయోధ్య-సర్గ-41)

ఇక్కడ-అనాథ, సనాథ శబ్దాలను ప్రయోగించి వాల్మీకి, శ్రీరాముని విషయంలో పోష్యవర్గం ఆయన్ని ఏవిధంగా భావించేవారో సూటిగా వ్యక్తం చేశాడు. ఇంకా, అయోధ్యాపురవాసులు ఆయన్నిగురించి భావించేటప్పుడుకూడా "నాథ" శబ్దాన్ని మహాకవి ప్రయోగించి ప్రజల మనోభావాలను తెలియజేశాడు:

"పాదచ్ఛాయా సుఖాభర్తుస్తా ద్రృశస్యమహాత్మనః ।
సహినాథో జనస్యాస్య సగతిస్స పరాయణమ్॥"

అయోధ్యాపురవాసులు శ్రీరామునియందంత భక్తిశ్రద్ధలతో ఉన్నారు. ఆయన ధర్మతత్పరతయందు వారికి దృఢవిశ్వాసం.

రాజోద్యోగులలో - అష్టమంత్రులలో ఒకరైన సుమంత్రుడు ప్రత్యేకంగా ఈ సందర్భంలో పేర్కొనదగినవాడు. ఈయన మంత్రిమాత్రమేగాక దశరథుని రథసారథి, మిత్రుడు. రాజకీయోద్యోగులలో రామాయణంలో సుమంత్రునిపాత్ర గణనీయమైనది. అంతఃపుర ప్రవేశంకూడా ఉన్న విశ్వాసపాత్రుడు. సీతారాము లిద్దరూ ఆయన్ని చాలా ఆదరాభిమానాలతో చూచేవారు. రామాయణంలోని పాత్రలన్నింటిలోను, శ్రీరాముని అవతార పురుషునిగా తెలుసుకొన్నవారిలో సుమంత్రుడు ప్రముఖుడు. రాముని కొనితెమ్మని సుమంత్రుని దశరథుడు పంపగా, సుమంత్రుడు రామమందిరంలో ప్రవేశించి సీతా రాములు ఏకాంతంగాఉన్నప్పుడు వారిని దర్శించే భాగ్యం పొందాడు. రాముడు పర్యంకంమీదఉండగా, సీత వీవన వీస్తూ ఉండగా సుమంత్రుడు వారిని దర్శించి లక్ష్మీనారాయణ దర్శనలాభాన్ని పొందినట్లు భావించాడు. సనత్కుమారునిద్వారా రామావతార విషయం విన్న ధన్యుడు సుమంత్రుడు. ఈ విషయం ఆయన దశరథునకేచెప్పాడు! సీతారాముల అభ్యంతర మందిరంలో వారి దర్శనం ఇలా అయింది.

"తంవైశ్రవణ సంకాశముపవిష్టం స్వలంకృతం
దదర్శసూతః పర్యంకే సౌవర్ణే సోత్తరచ్ఛదే
వరాహరుధిరా భేణశుచినా సుగంధినా
అనులిప్తం పరార్థ్యేన చందనేన పరంతపం
స్థితయా పార్శ్వతశ్చాపివాల వ్యంజనహస్తయా
ఉపేతం సీతయా భూయశ్చిత్రయా శశినంయథాం॥"

(అయోధ్యాకాండ-సర్గ-16)

ఇలాంటి దర్శనం లభించిన సుమంత్రుని భక్తి ప్రపత్తులనుగూర్చి వేరే చెప్పడం ఎందుకు? కైకేయి అంతఃపురానికి దశరథుని ప్రబోధించడానికి పోయిన సుమంత్రుడు నాటిస్థితిని సర్వం గ్రహించాడు. శ్రీరాముని అడవికి పంపుతున్న మహారాజ్ఞి కైకేయినికూడా-ఆమె చేస్తున్న దృష్కార్యానికి-దూషించడానికి జంక లేదు! అంత నిర్భయుడైన ధర్మతత్పరుడు! రాజాంతఃపురంలో చనువుగలవాడు. గంగదగ్గిర రాముణ్ణి విడిచిపోలేక రోదిస్తాడు. ఆ సందర్భంలో వాల్మీకి:

"ఇతిబ్రువన్ ఆత్మసమంసుమంత్రస్సారథిస్తథా ।
దృష్ట్వా దూరగతం రామం దుఃఖార్తో రురుదేచిరం॥"(సర్గ-52)

అంటాడు. గుహుని విషయంలో ప్రయోగించిన "ఆత్మసమః" అనే శబ్దాన్నే ["గుహోంనామ రామస్యాత్మసమః] సుమంత్రుని విషయంలోను ప్రయోగిస్తాడు ("ఆత్మసమం") వాల్మీకి, ఇదిగాక, రాముడే స్వయంగా సుమంత్రుని విషయంలో "భర్తృవత్సల"అనీ "పరమాంభక్తిం" అనీ ప్రయోగిస్తాడు ("జానామి పరమాం భక్తిం మయితే భర్తృవత్సల") అవతారమూర్తి అయిన శ్రీరామచంద్రునిచేతనే పరమభక్తుడవు అనిపించుకొన్న సుమంత్రుని ధన్యతనుగూర్చి వేరేచెప్పడం ఎందుకు?

శ్రీమద్రామాయణ మహాకావ్యంలో నవవిధ భక్తులు ఎడనెడ దర్శన మిచ్చినా, మొత్తంమీద "శరణాగతి" పూసలలో దారంలా" కనబడుతూ ఉంటుంది. ఆత్మసమర్పణ రూపకమైన ఇది లేకపోతే ఇంకేదీ లేదు! ఆయా పాత్రల ప్రకృతినిబట్టి, ప్రకరణాన్ని బట్టి ఈ భావంలో మార్పులున్నట్లు కనబడినా- అన్నింటికి పునాది ఇది. ఆత్మ సమర్పణమంటే స్థూలంగా అహంకార త్యాగం అని అర్థం చెప్పవచ్చును. ఇది లేకపోతే భక్తిలేదు అహంకార విమూఢుడు నేను కర్తను అనుకొంటాడు ("అహంకార విమూఢాత్మా కర్తాహమితి మన్యతే"- భగవద్గీత) భక్తుడు- నిరహంకారి- కర్తను నేను కాను అని గ్రహిస్తాడు. అప్పుడే స్వస్వరూప జ్ఞానం కలుగుతుంది.

శరణాగతికి, నామస్మరణకు, దాస్యభక్తికి మన సంప్రదాయంలో అత్యుత్తమం, అత్యున్నతం అయిన ఉదాహరణ హనుమంతుడు. దాస్యభక్తిని గురించి భక్తిరసామృత సింధువు ఇలా అంటుంది "దాస్యం కర్మార్పణం తస్య కైంకర్యమపి సర్వదా", సర్వకర్మలను భగవదర్పణం చేయడం, ఆయన కైంకర్యం చేయడం- దాస్యం అనిపించుకొంటుంది. "దాస" శబ్దానికి "దంస యతే స్వామికార్యాణి సావధానే నేతిదాసః" అనివ్యుత్పత్త్యర్థం హనుమంతుని విషయంలో ఇది చక్కగా అతికిఉంది. దీర్ఘ శరణాగతి అయిన రామాయణంలో ఎందరో- ఇంచుమించుగా అందరూ అన్నా దోషంలేదు-శరణాగతి మార్గగాములైనా అందరిలోను విశిష్టుడు హనుమంతుడు.

అనపాయిని అయిన లక్ష్మి అందరికి సాయపడే పురుషకార స్వరూపిణి. శ్రీమన్నారాయణు డవతరించినప్పుడల్లా ఆమె అవతరిస్తూనే ఉంటుంది.

"రామవత్యే భవేత్ సీతా, రుక్మిణీ కృష్ణజన్మని ।
అన్యేషు చావతారేషు విష్ణోరేషాన పాయినీ ॥"

ఆమె సర్వశక్తిమంతురాలైనా తన స్వాతంత్ర్యాన్ని ప్రదర్శించక శ్రీరాముని విషయంలో పారతంత్ర్యాన్నే ప్రదర్శించింది. కాని ఆమె పురుషకారస్వరూపిణి గనుక, శరణాగతులు కోరినా కోరకపోయినా రక్షణ ఇచ్చేది సీత. కోరితేనే రక్షణ ఇచ్చేవాడు రాముడు. ఇది సంప్రదాయజ్ఞులమాట! లోకంలో అపరాధాలు చేయని వారే ఉండరుగనుక వారిని క్షమించి, క్షమింపజేసి రక్షించడమే సీత పని. ఆమె ప్రకృతియే ఇది. అపరాధులను క్షమించవలసినదిగా భగవంతునకు నివేదించి, ఆయన ఆగ్రహాన్ని నివారించి వారి విషయంలో భగవంతుని అనుగ్రహం ప్రసాదింపజేసేది సీతామాత. ఈ పురుషకారాన్నే ఘటకత్వం అనికూడా అంటారు.

శ్రీమద్రామాయణంలో ఈ జగన్మాతకు, పురుషకారస్వరూపిణికి దాసాంజనేయుడు సాయపడ్డాడు. సీతామహాదేవికి ఆనందాన్ని కలిగించాడు. దీన్ని పెద్దలు ఆచార్య పురుషకారం అంటారు. పతివియోగంతో దుఃఖిస్తున్న సీతకు, పతిక్షేమ వార్తచెప్పి, ఆమె సంశయాలు తీర్చి, ఆమెనుగూర్చి రామునకుచెప్పి, త్వరితగతిని ఆయనవచ్చి ఆమెను ఉద్ధరించే ప్రయత్నాలుచేసి చివరికి ఉద్ధరించడం- ఆ సీతా రాములను కలపడంద్వారా- హనుమంతుని పురుషకారం వల్లనే జరిగింది. ఆచారత్వం నిర్వహించడానికి భగవంతుని ఆజ్ఞ కావాలి. అత్యుత్తమ శీలసంపద కావాలి. విషయం తాను గ్రహించి ఇతరులకు చెప్పి వారిచేత చేయించి తానుకూడా ఆచరించి ప్రవర్తించడమే ఆచార్య లక్షణమన్నారు పెద్దలు:

"ఆచినోతి హి శాస్త్రార్థాన్ ఆచారే స్థాపయత్యపి ।
స్వయమాచరతే యస్మాత్ తస్మాదాచార్య ఉచ్యతే॥"

ఇవన్నీ హనుమంతుని యందున్నాయి. అంగుళీయకం శ్రీరాముడిచ్చి హనుమంతుడు సీతాన్వేషణం చేయడానికి శ్రీరాముడు అనుజ్ఞ ఇచ్చాడు. అందే భగవదాజ్ఞ అయిందన్నమాట. లంకలో-వికారాలకు లోనుకావడానికి చాలా అవకాశాలున్నా రావణాంతఃపురంలో, రాత్రి సీతను అన్వేషించి ఏవికారాలకు లోనుగాక తన జితేంద్రియత్వాన్ని స్థాపించుకొన్నాడు. ఈ సందర్భంలో వాల్మీకి ఇలా వ్రాశాడు.

"నిరీక్షమాణశ్చ తదా తాస్త్రియస్స మహాకపిః ।
జగామమహతీం చింతాం ధర్మసాధ్వస శంకితః॥

పరదారావరోదస్య ప్రసుప్తస్య నిరీక్షణమ్ ।
ఇదంఖలు మమాత్యర్థం ధర్మలోపంకరిష్యతి ॥
నహిమే పరదారాణాం దృష్టిర్విషయవర్తినీ ।
అయం చాత్రమయా దృష్టః పరదారపరిగ్రహః ॥
తస్య ప్రాదురభూచ్చింతా పునరన్యా మనస్వినః ।
నిశ్చితైకాంతచిత్తస్య కార్యనిశ్చయ దర్శినీ॥
కామందృష్ట్వామయా సర్వావిశ్వస్తా రావణస్త్రియః।
నహిమేమనసః కించిద్వైకృత్య ముపపద్యతే॥
మనోహి హేతుస్సర్వేషా మింద్రియాణాం ప్రవర్తనే ।
శుభాశుభా స్వవస్థాసుతచ్చమేసువ్యవస్థితమ్ ॥
(సుందరకాండ– సర్గ–11)

హనుమంతుడు ఈ విధంగా తన ఇంద్రియ నిగ్రహత్వాన్ని గురించి అనుకొని, "అయినా నేనింకోచోట సీతను వెదుకరాదు. వెదుకుతే ఎప్పుడైనా, స్త్రీలు స్త్రీల మధ్యలోనే కనిపిస్తారు గదా" అనుకొంటాడు.

"నాన్యత్రహి మయాశక్యా వైదేహీపరిమారితుమ్ ।
స్త్రియోహి స్త్రీషు దృశ్యంతేసదా సంపరిమార్గణే॥"

తన కార్యాన్ని నెరవేర్చి కృతకృత్యుడై సీతారాములకు ఆనందాన్ని కలిగించాడు. దీనితో ఆచార్య పురుషకారం నిర్వర్తించబడిందనాలి. విభీషణునకు రాముడు శరణు ఇయ్యడంలో సాయపడి భాగవత పురుషకారంకూడా నిర్వర్తించాడు. ఈవిధంగా, దీర్ఘశరణాగతి అని పేర్కొనబడిన రామాయణంలో హనుమంతునిపాత్ర అనన్య సామాన్యమైనది. మహాజ్ఞాని, యోగి అయినా "దాసోఽహం" అనే భావంతో హనుమంతుడు వ్యవహరించాడు. ఇది అసామాన్యవిషయం. అందరికంటె ధ్యానయోగి అధికుడని శ్రీకృష్ణవచనం భగవద్గీతలో ఉండనేఉంది.

"తపస్విభ్యోఽధికోయోగి జ్ఞానిభ్యోఽపిమతోఽధికః ।
కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భావార్జున॥
(ధ్యానయోగం- శ్లో-46)

"ధ్యాన నిష్ఠుడైన యోగి, కృచ్ఛ చంద్రాయణాది తపోనిష్ఠులకంటె శ్రేష్ఠుడు; శాస్త్రజ్ఞులైన పండితులకంటె అధికుడు. యజ్ఞపరాయణులైన కర్మిష్ఠులకంటెకూడా ఎక్కువ అయినవాడు. కాబట్టి, అర్జునా ! నువ్వు యోగివికావాలి" అని ఊరుకో కుండా తరువాతి శ్లోకంలో-

> "యోగినామపి సర్వేషాం మద్గతేనాంతరాత్మనా ।
> శ్రద్ధావాన్భజతే యోమాం సమేయుక్త తమోమతః ॥"

అనికూడా అంటాడు. "ఎవడు మద్గతచిత్తుడై శ్రద్ధతో నన్ను భజిస్తాడో అతడు ఇతర ధ్యానపరులైన యోగులకంటె (రుద్రాదిత్యాది దేవతా ధ్యానపరులకంటే) శ్రేష్ఠుడని నా అభిప్రాయం" అంటాడు. ఈవిధంగా చూచినా, శ్రీమన్నారాయణుని అవతారమైన శ్రీరాముని భక్తుడు- హనుమంతుడు- సర్వశ్రేష్ఠుడు అనడంలో అతిశయోక్తిలేదు.

రుద్రాంశ సంభూతుడైన హనుమంతుడు తన వ్యక్తిత్వాన్ని గురించి చెప్పుకొంటూ సుందరకాండలో ఇలా అంటాడు:

> "దాసోఽహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్టకర్మణః ।
> హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః॥"
> (శ్లో-34)

కోసలదేశాధిపతి అయిన రామునకు నేను దాసుడను. వాయుపుత్రుడను, నా పేరు హనుమంతుడు- అంటాడు. తానెంతగొప్పవాడైనా, నేను రామదాసుడనని చెప్పుకోవడానికి ఆయన సంశయించలేదు. ఇది ఆంజనేయుని విశిష్టత. ఇంతకిపూర్వం ఇలా అంటాడు:

> "జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః ।
> రాజాజయతి సుగ్రీవో రాఘవేణాభి పాలితః॥" (శ్లో-33)

అతి బలుడైన రామునకు జయం. మహాబలుడైన లక్ష్మణునకు జయం. రాముని చేత పాలింపబడే రాజైన సుగ్రీవునకు జయం-అంటాడు. ఇక్కడా- సుగ్రీవుడు "రాఘవేణాభి పాలితుడు" అని చెప్పుతాడు. కింకర రాక్షసులతో చెప్పిన దీనినే (సర్గ-42, శ్లోకం-33), జాంబవంతాదులతో తన లంకాయాత్రనుగురించి చెప్పే

టప్పుడు [59వ సర్గలో 23వ శ్లోకంగా] తిరిగి చెప్పుతాడు. రెండుసార్లు చెప్పబడిన ఈ శ్లోకం మహామహిమాన్వితం అని పెద్దలంటారు. ఇక్కడకూడా దీని తరువాత, తాను రాముని దాసుడనని చెప్పినట్లుగా ఇలా అంటాడు, కొంచెం భాషమార్చి:

"అహం కోసలరాజస్య దాసః పవనసంభవః।
హనుమానితి సర్వత్రనామ విశ్రావితంమయా॥" (శ్లో-24)

ఇక్కడ కూడా ఇలా చెప్పడంవల్ల, తన విషయంలో తాను శ్రీరాముని సంబంధాన్ని పురస్కరించుకొని ఎలా ఊహించుకొంటున్నాడో తనవారికి కూడా చెప్పినట్లయింది. ఇది - హనుమంతుని గొప్పదనం . ఏ కోశాన్ని అహంకారంలేదు. దీనిని ఆదర్శంగా గ్రహించే తరువాత వైష్ణవ సంప్రదాయంలో-

"శ్రీ శ్రీనివాస! పురుషోత్తమ! దేహిదాస్యమ్"
"అహంతు నారాయణ దాసదాస-దాసస్య దాసస్య చ దాసదాసః"
"త్వద్భృత్య భృత్యపరిచారక భృత్య భృత్య।
భృత్యస్య భృత్య ఇతి మాంస్మరలోకనాథ"

మొదలైనవి బయలుదేరాయి. రామాయణంలో- హనుమంతుడే కాదు-సుగ్రీవుడు, భరతుడు మొదలైనవారుకూడా దాస శబ్దాన్ని తమ విషయంలో ప్రయోగించుకొన్నవారే. సుగ్రీవుడు రావణునితో-

"లోకనాథస్య రామస్య సఖా దాసోఽస్మి రావణ"

భరతుడు శ్రీరామునితో-

"దాసభూతో భవిష్యామి సుస్థితే నాంతరాత్మనా ।
భ్రాతుశ్శిష్యస్య దాసస్య ప్రసాదం కర్తుమర్హసి"

అంటారు. అయితే, వీరందరికంటె విశిష్టమైనది హనుమంతుని దాసభావం. ఈ ఈ విషయం అందరూ అంగీకరించారు.

రామాయణంలో హనుమంతుని ప్రాధాన్యం, కిష్కింధకాండతో ప్రారంభం అవుతుంది. "కిమ్‌కిమ్ దధాతి ఇతి కిష్కింధా"అని శబ్ద కల్పద్రుమంలో వ్యుత్పత్తి ఇలా చెప్పబడింది. "పారస్కరాది త్వాత్ పూర్వస్య కిమః మలోపః, సత్వం

షత్వం చ నిపాతనాత్" అంటే - ఏదోఏదో అనిర్వచనీయమైన దానిని "దధాతి" ధరించేది- అని అర్థంచెప్పారు. మొదటి "కిమ్"నకు మంచి అని, రెండో "కిమ్" నకు చెడ్డ అని అంతరార్థం ఊహించి, మంచి చెడ్డలు రెండూ కలిసిఉండేదని కొందరు అర్థం చెప్పుతున్నారు.

ఈ కాండలోనే - శ్రీరామునకు హనుమంతునకు పరిచయ సన్నిహిత త్వాలు, శ్రీరామ సుగ్రీవులు అగ్నిసాక్షిగా మిత్రులుకావడం, వాలివధ, వానరుల సీతాన్వేషణ, సంపాతిద్వారా సీత లంకలో ఉన్నదని తెలియడం, తరువాత సము ద్రందాటి లంకకు పోవడానికి హనుమంతుడు సమర్థుడని నిర్ణయించడం, ఆయన ఉద్యుక్తుడుకావడం-ఉన్నాయి. ఈ కాండాంతలో భావికథ పరంపరకు బీజావాపం జరిగిందనాలి. శ్రీహనుమంతుని పాత్రోన్మీలనం కిష్కింధాకాండలో ప్రారంభ మైనది. రామలక్ష్మణులు ఋష్యమూకపర్వతం దగ్గరకుచేరి ఒకచోట విశ్రమిం చడం చూచిన సుగ్రీవుడు, వారిని వాలిపంపినవారిగా భావించి కలవరపడి ఇటు అటు తిరగడం మొదలుపెట్టాడు. అతని అవస్థచూచి హనుమంతుడు, "నువ్వు స్థిరచిత్తతతో ఒకచోట నిలవక నీ వానరత్వాన్ని చూపిస్తున్నావు" అని పరిహ సిస్తాడు.

"అహోశాఖా మృగత్వం తే వ్యక్తమేవ ప్లవంగమ ।
లఘుచిత్త తయాత్మానం నస్థాపయసి యోమతౌ॥"

(కిష్కింధాకాండ- సర్గ-2)

ఈ వాక్యాలు హనుమంతుని ధీరత్వాన్ని, రాజయిన సుగ్రీవుని విషయంలో ఆయన చూపగలిగిన చనువు మనకు తెలుపుతాయి. సుగ్రీవుడు హనుమంతునితో వారెవరో కనుక్కొని రావలసినదని, ప్రాకృతవేషంలో పొమ్మని చెప్పుతాడు. హనుమంతుడు ఆ విధంగా కాక భిక్షుకవేషంలో పోయి - అనగా బ్రహ్మచారి రూపంలో పోయి- రామలక్ష్మణులకు నమస్కరించి వారివిశేషాలను అడుగుతాడు. ఆ సందర్భంలో శ్రీరాముడు హనుమంతుని మాటతీరును ఉచ్చారణను చాలా మెచ్చుకొని లక్ష్మణునితో ఇలా అంటాడు:

"నానృగ్వేద వినీతస్య నాయజుర్వేద ధారిణః ।
నా సామవేదవిదుషః శక్యమేవం ప్రభాషితమ్॥"

(కిష్కింధకాండ- సర్గ-3)

"ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం చక్కగా అర్థంగ్రహించి అధ్య యనం చేసినవాడుగాని ఇలా సంభాషించలేడు" అంటూ:

"నూనం వ్యాకరణం కృత్స్నం అనేన బహుధాశ్రుతమ్।
బహువ్యాహర తానేన న కించిదపశబ్దితమ్॥ (కిష్కింధ సర్గ-3)

"ఇతడు వ్యాకరణాధ్యయనం బాగా చేసినాడనేది నిశ్చితం. ఇన్ని విషయాలను గురించి మాట్లాడుతూ ఉన్నా ఒక్క అపశబ్దంలేదు."

శ్రీరాముని ఈ ప్రశంసకు హనుమంతుడు సర్వవిధాల అర్హుడు. హనుమం తుని అష్టోత్తర శతనామావళిలో, ఇందువల్లనే- "నవవ్యాకృతి పండితాయ నమః" అనీ, "వాగ్మినే నమః"అని ఉన్నాయి. హనుమంతుని ఒక ధ్యానశ్లోకం ఇలాఉంది:

"మహావ్యాకరణాంభోధి మంథమాన సమందరమ్।
కవయం తం రామకీర్త్యా హనుమంత ముపాస్మహే॥"

హనుమంతుడు ఇంత విజ్ఞానవంతుడు గనుకనే రామలక్ష్మణులు సామాన్యులు కారని సుగ్రీవునకు చెప్పగలిగినాడు.

రామలక్ష్మణులను కలుసుకొన్న హనుమంతుడు వారి గోత్ర నామాదులు ప్రశ్నించాడు. రామప్రభువు వైశిష్ట్యాన్ని గుర్తించిన హనుమంతుడు తన గోత్ర నామాలు చెప్పుకొన్నాడు. ఈ సన్నివేశంలోనే హనుమంతునకు దాసభావం ఏర్ప డింది. ఈ మానసిక దాస్యం వెనువెంటనే వారిని తన భుజస్కంధాలమీద ఎక్కించు కొని సుగ్రీవుని సన్నిధికి తీసుకొనిపోయాడు. ఈ రామశరీర స్పర్శవల్ల పుల కితుడై శారీరక దాస్యం ప్రారంభించాడు. రామలక్ష్మణులను సుగ్రీవునకు ఇలా పరిచయం చేశాడు :

"అయం రామో మహాప్రాజ్ఞః సంప్రాప్తో దృఢవిక్రమః।
లక్ష్మణేన సహ భ్రాతా రామోయం సత్యవిక్రమః।
ఇక్ష్వాకూణాం కులేజాతో రామో దశరథాత్మజః॥

(కిష్కింధాకాండ- సర్గ-5)

ఈ పరిచయంలోని విశేషం— హనుమంతుడు మూడుసార్లు రామనామాన్ని స్మరిం

చదం- "అయం రామః; రామోఽయం; రామో దశరథాత్మజః" రామగాత్ర స్పర్శతో హనుమంతుడు దాసాంజనేయుడై రామనామజపిత అయ్యాడన్నమాట! మూడుసార్లు రామనామం జపిస్తే సహస్రనామ స్తోత్రపాఠఫలం లభిస్తుంది.

"శ్రీరామ రామరామేతి రమేరామే మనోరమే।
సహస్ర నామతత్తుల్యం రామనామవరాననే॥"

అనే శ్లోకం, శివుడు పార్వతికి చెప్పినట్లుగా పెద్దల సంప్రదాయంలో ఉంది. మూడుసార్లు "రామ" నామోచ్చారణ, వేయిసంఖ్యను సంపాదించి పెట్టుతుందని చెప్పడానికి ఒక గణితం చూపించడంకూడా ఉంది. "రామ" శబ్దంలోని "ర"కారం అంతస్థాలలో (యరలవ), రెండో అక్షరం "మ"కారం ఓష్ఠ్యాలలో (పఫబభమ) అను నాసికమైన ఐదో అక్షరం. ఈ రెండు సంఖ్యలను గుణిస్తే "పది"(10) వస్తుంది. ఈ గుణకారపద్ధతినే మూడుసార్లు ఉచ్చరించిన "రామ" శబ్దానికి అన్వయిస్తే $10 \times 10 \times 10 = 1,000$ (వేయి) అవుతుందిగదా! ఇది పెద్దలవల్ల విన్నది.

సంపాతివల్ల సీత రావణుని లంకలో ఉందని తెలిసిందిగాని ఆమె వద్దకు పోయి రాముని కుశలవార్తను చెప్పి ఆమెకు ధైర్యంచెప్పి రాగలిగినవాడు, నూరు యోజనాల విస్తీర్ణతఉన్న సముద్రాన్ని దాటిపోయి రావాలి. వానరులు ఆలోచనలో పడ్డారు. జాంబవంతుడు తాను తొంభైయోజనాలు పోగలనన్నాడు. అంగదుడు పోగలనుగాని రాగలనో లేదో తెలియదన్నాడు అప్పుడు జాంబవంతుడు "మాకు స్వామివైన నిన్ను మేము కాపాడుకోవాలి" కనుక పోవడానికి వీలులేదంటాడు. ఇంక హనుమంతుడున్నాడు. మహర్షుల శాపంవల్ల, హనుమంతునకు తన బలం ఇతరులు చెప్పితేనేగాని తెలియదుగనుక, జాంబవంతుడు హనుమంతుని బల పరాక్రమాదులను ప్రశంసించి సముద్రలంఘనం కర్తవ్యమంటాడు. హనుమంతుడు తన బలాన్ని స్మరించి దేహాన్ని పెంచుతాడు.

కిష్కింధాకాండ తరువాత వచ్చే సుందరకాండకు నాయకుడు హనుమంతుడు. సీతారాముల పిమ్మట దుష్టుడైన రావణుని దూరంచేసి చూస్తే హనుమంతుడే ముఖ్యునిగా భాసిస్తాడు శ్రీమద్రామాయణానికున్న "సీతయాశ్చరితం", పౌలస్త్య వధమ్" అనే మరిరెండు పేర్ల తరువాత-అనగా రామాయణంతో కలుపుకొనిఉన్న

మూడు పేర్ల తరువాత - హనుమంతునికథే కావ్యమంతా నిండిఉన్నట్లు కనబడు తుంది. ("కావ్యం రామాయణం కృత్స్నం సీతాయాశ్చరితం మహత్, పౌలస్త్య వధమిత్యేవ చకార చరితవ్రతః)" కర్ణునౌదల భారత సంహిత" నిల్చినట్లు, హను మంతుని భుజస్కంధాలమీద రామాయణకథ నిల్చి ఉన్నదంటే అతిశయోక్తిలేదు. కర్ణునకు హనుమంతునకు పోలికఉందని ఈ వాక్యానికి అర్థంకాదు. పాత్రల ప్రాముఖ్యాన్ని బట్టి అన్నమాట.

సుందరకాండ అంతా జితేంద్రియుడును, భక్తి మద్వరిష్ఠుడును, అమిత బల సంపన్నుడును అయిన హనుమంతుని పరాక్రమగాథ, సుందరకాండనుగూర్చి ఇలా అన్నారు:

సుందరే సుందరోరామః, సుందరే సుందరీకథా।
సుందరే సుందరీసీతా, సుందరే సుందరం వనమ్ ॥

సుందరే సుందరం కావ్యం, సుందరే సుందరః కపిః।
సుందరే సుందరం మంత్రం, నుందరే కిం న సుందరమ్॥"

పండితులు సుందరశబ్దానికి "సుతరామ్ాద్రి యతే ఇతి సుందరః" అని వ్యుత్పత్తిచెప్పి ఆ సుందరుడు హనుమంతుడే అన్నారు. ఆంజనేయ సహస్రనామా వళిలో "సర్వసుందరాయ నమః" అనే నామంకూడా ఉంది. సత్యం, శివం, సుందరం అనే పదాలు పరమాత్మ తత్త్వాన్ని తెలిపేవిగా జగత్ప్రసిద్ధాలు. సుందరీ శబ్దం ప్రకృతిని (త్రిపురసుందరీ) చెప్పేపదంగా గ్రహిస్తే (సత్త్వరజస్తమో గుణాత్మిక) సుందరశబ్దం పురుషుని తెల్పేపదం అవుతుంది. సుందరీ సుందరుల కథచెప్పే ఈ కాండ సుందరకాండ అని పేరుపొందడం సహజమే. పురుషునితో (పరమాత్మతో) ప్రకృతిని చేర్చేది సుందరకాండ (సుందరౌ - ఏకశేషవృత్తి). సాధకునిలోని పరమాత్మాంశ రాముడు: ప్రకృత్యంశ సీత. ఈ అంశలనుకలుపు టకు చేసిన ప్రయత్నమే సుందరకాండలోని కథ అనీ, ఆంజనేయుడంటే బుద్ధి యోగమనీ చెప్పేవారు కొందరున్నారు. వీరి దృష్టిలో. జ్ఞానాన్ని కాంక్షించే సాధ కుని బుద్ధికే ఆంజనేయుడని పేరు. ముక్తిసాధనా మార్గాలలో ఉత్తమోత్తమమైన దిగా మనకు సుందరకాండ సాధన- అనగా ఆంజనేయసాధన- చెప్పబడిందని వీరి

విశ్వాసం. సాధకునకు బుద్ధియోగం లభించిన తరువాతనే భగవత్ప్రాప్తి. ఈబుద్ధి యోగం భగవత్ప్రసాదం. భగవద్గీతలో ఈ విషయం ఇలా ఉంది:

"తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకం।
దదామి బుద్ధియోగం తు యేన మా ముపయాంతితే॥"

ఎవరు నిత్యయుక్తులై ప్రీతిపూర్వకంగా నన్ను భజిస్తారో వారికి నేను తత్త్వవిషయకమైన జ్ఞానాన్ని ఇస్తాను. దీనివల్ల వారు నన్ను పొందుతారు–అని భగవద్వచనం.

సుందరకాండలో - ముక్తిస్వరూపజ్ఞానం, స్వస్వరూపజ్ఞానం, సాధన, ఫలం, అజ్ఞానం-అనే అర్థపంచకాలున్నాయి. అవి-రామతత్త్వం, సీతస్థితి, శరణాగతి, ఆంజనేయకృత్యం, రావణానుభవం - అనేవి అవే! ఈశ్లోకం ఈవిషయాన్ని విశదీకరిస్తోంది:

"ప్రాప్తస్య బ్రహ్మణోరూపం, ప్రాప్తిశ్చ ప్రత్యగాత్మనః ।
ప్రాప్త్యుపాయం ఫలంప్రాప్తేః, తథాప్రాప్తి విరోధిచ॥"

వీటి కన్నింటికి కీలకం హనుమంతుడు. కనుకనే ఆయన్ని "బుద్ధిమతాం వరిష్ఠం"అని స్మరించుకొని శిరసా నమస్కరించడం!

ప్రదర్శించడానికి అవకాశమిచ్చే శబ్దసంపద, భావగాంభీర్యం, సన్నివేశ వైవిధ్యం, పాత్రబాహుళ్యం, మానవత్వమూల్యాలు రామాయణంలోఉన్నాయి. "ముఖేముఖే సరస్వతి" అన్నది ఇక్కడ అక్షరాలాసత్యం. వాల్మీకినోటశాపంగా వెలువడిన "మానిషాద"శ్లోకంలో కావ్యార్థసూచన ఉన్నదని విద్వాంసులు నిరూపించారు. అదేవిధంగా, శ్రీరామునితో అడవులకు పోవడానికి నిర్ణయించుకొని తల్లి దగ్గర సెలవు తీసుకోవడానికివచ్చిన లక్ష్మణునితో సుమిత్ర పలికిన అనుమతి పలుకులు గంభీరార్థభరితాలై, పండితులకు ఆదరణ పాత్రమయ్యాయి:

"రామం దశరథం విద్ధి, మాం విద్ధి జనకాత్మజాం ।
అయోధ్యామటవీం విద్ధి, గచ్ఛతాత! యథాసుఖమ్॥"

దీనికి బాహ్యార్థం - రామునిదశరథుడనుకో! సీతను నన్నుగా భావించుకో!

అడవిని అయోధ్యగా గ్రహించు! సుఖంగా వెళ్లిరా, నాయనా! అని తల్లి చెప్పిన హితోక్తిగా భాసిస్తుంది. కాని, దీనిలో వాల్మీకిమహర్షి గూఢంగా-శ్రీరాముని నిజ స్వరూపాన్ని, సీతా మహాదేవి ఎవరో, అయోధ్యఅంటే ఏమిటోకూడా వ్యక్తం చేశాడంటారు పెద్దలు. "దశరథం" అంటే పక్షి (గరుత్మంతుడు) వాహనంగాకల విష్ణువుగాననీ, "మాం" అనగా "లక్ష్మి"నిగా అనీ, "అయోధ్యా"అంటే స్వర్గంగాననీ ("దేవానాం పూరయోధ్యా"అరుణం) అర్థాలుతీస్తారు. వీటినిబట్టి సీతారాములు పరమేశ్వరీ పరమేశ్వరులని (లక్ష్మీనారాయణులని) వ్యక్తంచేసినట్లయింది. రామాయణం కావ్యంగనుక, ఆధ్యాత్మిక విషయాలు - అధ్యాత్మ రామాయణంలోలాగ బహిరంగంగా -గూఢంగా వ్యంగ్యమర్యాదానుసారం సువ్యక్తాలయ్యాయి.

రామాయణం గొప్పదనాన్నిగూర్చి, దానికి జనబాహుళ్యంమీద ఉన్న ప్రభావాన్ని గురించి Winternitz అనే పాశ్చాత్య విమర్శకుని వాక్యాలు ఇక్కడ ఉటంకించదగినవి:

**"It is a true popular epic like the Mahabharata and has become the wealth of the whole nation. Scarcely has any other poem in the range of world literature influenced the poetry and the life of the people for Centuries. It has been kept alive for more than twenty Centuries and Continues to live. People of all grades and classes, high and low, princes and peasants, merchants and artisans, princesses and shepherdesses-all are familiar with the characters and the story of the great epic."**

ఇప్పుడు మనకు ప్రస్తుతమైన హనుమద్విషయాన్ని గ్రహించిచూస్తే, సుందరకాండలో మనకు దర్శనమిచ్చే హనుమ-ఒకవైపు తన భీమరూపంతో విక్రమిస్తూఉన్నా, సీతాదేవి దగ్గిర వినీతుడై రామదాసునిగా వ్యవహరించడం కనబడుతుంది. హనుమంతునిచూచినవెంటనే సీత "అహోభీమ మిదంరూపం వానరస్య దురాసదమ్ దుర్నిరీక్షమ్"అలుకొని మూర్ఛపోతుంది. ఆమెకు స్పృహవచ్చేటప్పటికి ఈ "భీమ" రూపుడు, "వినీతవ దుపస్థితమ్" ఉండడం జరిగింది. అప్పుడామె "దదర్శపింగాధిపతేరమాత్యం । వాతాత్మజం సూర్యమి వోదయస్థమ్" సీతనుచూచిన హనుమంతుడు ఆమెతో ఏభాషలో మాట్లాడాలి అని వితర్కించుకొని "ద్విజాతిరివ" సంస్కృతంలోమాట్లాడితే తనను కామరూపుడైన రావణుడనుకొన వచ్చునని "అవశ్యమేవ వక్తవ్యం మానుషం వాక్యమర్థవత్" అని నిర్ణయించు

కొన్నారు. ఇది ఆయన విజ్ఞతకు, బుద్ధి సూక్ష్మతకు నిదర్శనం. అందుకే ఆయన స్తోత్రంలో "బుద్ధిమతాంవరిష్ఠమ్"అని ఉంది!

కాని ఆయన "భీమ" రూపం ఉందనే ఉంటుంది. రాక్షసస్త్రీలు రావణునితో హనుమంతునిగూర్చి చెప్పేటప్పుడు "అశోకవనికా మధ్యేరాజన్ భీమవపుః కపిః" అంటారు. రాక్షసులు తనను పరివేష్టించి ప్రహరిస్తూ ఉన్నప్పుడు హనుమను వర్ణిస్తూ వాల్మీకి "తతోవాతాత్మజః క్రుద్ధోభీమం రూపంసమాశ్రితః" అంటాడు. గోస్వామి తులసీదాసు తన "హనుమాన్ చాలీసా"లో, హనుమంతుడు సీతకు కన బడ్డప్పుడు "సూక్ష్మ"రూపంలో, లంకనుకాల్చేటప్పుడు "వికట"రూపంలో, అసుర సంహారం చేసేటప్పుడు "భీమ"రూపంలో వ్యవహరించినట్లుగా వ్రాశాడు. ("సూక్ష్మ రూపధరిసియహిఁదిఖావా, వికట రూపధరి లంకజరావా, భీమరూపధరి అసుర సంహారే") సీతతో మాట్లాడి అశోకవనాన్ని ధ్వంసంచేసిన ఆకపిని దండించాలి అని చెప్పినప్పుడు "ఉగ్ర"శబ్దం ప్రయుక్తమైనది. ("తస్యోగ్రరూపస్యోగ్ర! త్వం దండమాజ్ఞాతు మర్హసి । సీతా సంభాషితా యేన తద్వనం చవినాశితమ్॥" "భీమ, ఉగ్ర" శబ్దాలు రుద్రునకు విశేషణాలుగా ప్రసిద్ధాలుగదా! "నమ ఉగ్రాయచ, భీమాయచ"అని మనకు రుద్రాధ్యాయంలో కనబడతాయి. హనుమంతుడు కేవలం వానరుడుకాడు; రుద్రాంశ సంభూతుడు అని మనకు తెలియజేయడానికా అనట్లు వాల్మీకి ప్రయోగించాడు అనాలి. బంధితునిగా తనదగ్గిర ప్రవేశపెట్టబడిన హను మంతునిచూచి "భగవాన్నందీ"అని అనుకొని రావణుడు భ్రమించడం ఈ శైవాం శాన్ని తెలియజేస్తూనే ఉంది.

సీతకూడా హనుమంతునితో ఇది గురించి మాట్లాడుతుంది. "నహిత్వం ప్రాకృతం మన్యేవానరం వానరర్షభ । యస్యతేనాస్తి సంత్రాసోరావణాన్నాపి సంభ్రమః॥""విక్రాంతస్త్వం సమర్థస్త్వం ప్రాజ్ఞస్త్వం వానరోత్తమ॥"నువ్వుకాకపోతే ఎవరు సముద్రాన్ని "గోష్పదీకృతమ్" చెయ్యగలరు? అంటుంది. "శతయోజన విస్తీర్ణః సాగరోమకరాలయః । విక్రమ శ్లాఘనీయేన క్రమతా గోష్పదీకృతః॥" అంటుంది.

లంకనుండి తిరిగివచ్చిన హనుమంతుడు జాంబవతాదులను చూచినవెంటనే "దృష్టాసీతా" అని సంక్షేపంగా చెప్పుతాడు. తరువాత సీతాదేవికి ప్రణమిల్లి ("ప్రణమ్య శిరసాదేవ్యై సీతాయై ప్రత్యభాషత") వానరులకు వివరాలు చెప్ప

తాడు ఇదేవిధంగా శ్రీరామునితో చెప్పేటప్పుడుకూడా "ప్రణమ్యశిరసాదేవ్యై సీతాయై తాం దిశం ప్రతి" విషయాలన్నీ చెప్పాడు. ఈ సందర్భంలో వాల్మీకి హనుమంతుని గూర్చి "వాక్యజ్ఞః"అని ప్రయోగించాడు. ఈ సందర్భంలో హనుమంతుని మాటలు-ఆయనకు "వాక్యజ్ఞః"అనే కవిప్రయోగం ఎంత ఉచితమో - తెలియజేస్తాయి: (సుందరకాండ-సర్గ-65)

"తత్రదృష్ట్వామయా సీతా రావణాంతః పురేసతీ ।
సన్న్యస్యత్వయి జీవంతీరామా రామమనోరథమ్॥ (శ్లో-10)

దృష్టామే రాక్షసీమధ్యే తర్జ్యమానా ముహుర్ముహుః ।
రాక్షసీ భిర్విరూపాభీ రక్షితా ప్రమాదావనే॥ (శ్లో-11)

దుఃఖమాసాద్యతే దేవీ తథాఽదుఃఖోచితా సతీ ।
రావణాంతః పురేరు ద్ధారాక్షసీ భిస్సురక్షితా॥ (శ్లో-12)

ఏకవేణీధరాదీనా త్వయిచింతా పరాయణా ।
అధశ్శయ్యా వివర్ణాంగీ పద్మినీవహిమాగమే॥" (శ్లో-14)

రామునితో లంకలో తాను కావించిన వీరకృత్యాలన్నీ-వానరులతో చెప్పినట్లుగా- చెప్పకపోవడం ఆయన వినయానికి తార్కాణం. లంకలో సీతతో మాట్లాడినప్పుడుకూడా, "నాకంటె చాలా బలాఢ్యులు సుగ్రీవుని దగ్గిర ఉన్నారు నాకంటె తక్కువ వాడెవ్వడులేడు"-

"నావంటివాడే సముద్రాన్ని దాటినప్పుడు ఇంతకంటె బలమైనవారిమాట చెప్పేదేమిటి? దూత కార్యానికి సామాన్యుని ప్రభువులు పంపుతారుగాని శ్రేష్ఠులను పంపరుగదా!" వాల్మీకంలో ఇలాఉంది:

"మద్విశిష్టాశ్చ తుల్యాశ్చ సన్తి తత్రవనౌకసః ।
మత్తః ప్రత్యవరః కశ్చిన్నాస్తి సుగ్రీవసన్నిధౌ॥" (సర్గ-39)

అహంతావ దిహప్రాప్తః కిం పునస్తే మహాబలాః
నహి ప్రకృష్టాః ప్రేష్యంతే ప్రేష్యంతే హీతరేజనాః॥" (సర్గ-39)

ఈ వినయం ఆయనకు వన్నె తెచ్చేది. తిరిగివచ్చిన తరువాత వానరుల దగ్గరకూడా, అంగవాదులు తన్ను ప్రశంసించినప్పుడు - రాముని అనుగ్రహం చేత, మీ అందరి తేజస్సుచేత, సుగ్రీవుని ఆజ్ఞగా సర్వంచేశాను - అంటాడు వినయంతో.

రాఘవస్య ప్రసాదేన భవతాం చైవతేజసా ।
సుగ్రీవస్య చకార్యార్థం మయా సర్వమనుష్ఠితమ్॥" (సర్గ-58)

ఇంత వినయసంపన్నుడు హనుమంతుడు. రామ కార్యాన్ని సాధించి వచ్చినా ఎంతో సంయమనంతో ప్రవర్తించాడు. నిజమైన శరణాగతి పొందిన వ్యక్తి దేనికీ చలించడు. సుఖదుఃఖాలు జయాపజయాలు ఆయనకు సమంగా ఉంటాయి. ఆయన సమదృష్టిని గ్రహించినరాముడు, "నాకింత ప్రియవార్త చెప్పిన నీకు ఏమి ఇయ్యగలను" అని హనుమంతుని కౌగిలించుకొన్నాడు. భక్తునకు భగవంతుని పరిష్వంగం లభించింది. ఈ ఘట్టాన్ని వాల్మీకి ఈ విధంగా వివరించాడు.

"ఇదంతుమమదీనస్య మనోభూయః ప్రకర్షతి ।
యదిహాస్య ప్రియాఖ్యాతుః నకుర్మిసదృశం ప్రియమ్॥

ఏషసర్వస్య భూతస్తు పరిష్వంగో హనూమతః ।
మయాకాల మిమంప్రాప్య దత్తస్తస్య మహాత్మనః॥

ఇత్యుక్త్వా ప్రీతిసంహృష్టో రామస్తం పరిషస్వజే ।
హనూమంతం మహాత్మానం కృతకార్య ముపాగతమ్॥"

శ్రీరామచంద్రుడు స్వయంగా హనుమంతుణ్ణి కౌగలించుకొని ఆతనికి ధన్యత చేకూర్చాడు. ఇంక జగజ్జనని అయిన సీతా మహాలక్ష్మి సమ్మానంకూడా ఆయనకు లభించింది. యుద్ధవిజయానంతరం, సీతాదేవి తన మెడనుండి ముత్యాల హారాన్నితీసి వానరులనందరినీ తన భర్తను మాటిమాటికి సాభిప్రాయంగాచూస్తూ ఉంది. ఇంగితజ్ఞుడైన రాముడది గుర్తించి "నువ్వు ఎవరి విషయంలో ప్రసన్నురాలవో వారికి అదిఇయ్యి"అన్నాడు. వెంటనే ఆ జగజ్జనని ఆ హారాన్ని హను

మంతునకిచ్చింది. ఆ హారాన్ని పొందిన హనుమంతుడు చంద్రకాంతులతో మెరిసే తెల్లమబ్బులా ఉన్నాడు-అని వర్ణించాడు మహాకవి వాల్మీకి:

"అవముచ్యాత్మనః కంఠాత్ హారం జనకనందినీ ।
అవైక్షత హరీన్ సర్వాన్ భర్తారం చ ముహుర్ముహుః॥

తామింగితజ్ఞస్సం ప్రేక్ష్య బభాషే జనకాత్మజామ్ ।
ప్రదేహి సుభగే హారం యస్యతుష్టాసి భామిని॥

దదౌ సావాయుపుత్రాయతం హారమసితేక్షణా ।
హనూమాంస్తేన హారేణ శుశుభేవానరర్షభః॥
చంద్రాంశు చయగౌరేణ శ్వేతాభ్రేణ యథాచలః॥"

(యుద్ధకాండ)

ఈవిధంగా మహాభక్తుడైన హనుమంతునకు లక్ష్మీనారాయణ స్వరూపులయిన సీతారాములకు ఆత్మార్పణం చేసుకోవడంవల్ల పరమేశ్వరుని పరిష్వంగం, పరమేశ్వరి బహూకృతి లభించాయి. శ్రీవైష్ణవుల చరమ శ్లోకంలోని "సర్వ ధర్మాన్ పరిత్యజ్యమామేకం శరణంవ్రజ"అన్న శ్లోకార్థాన్ని "తు. చ" తప్పకుండ పాటించిన ఈ దాసునకు రామాయణంలో ఇంకెవరికి లభించని రెండు సత్కారాలు లభించాయి! ఒక సత్కారం లభించిన గుహునివంటి వారుంచే ఉండవచ్చును!

ఈ హనుమంతుడేమైనా సామాన్యుడా ? కాదు! పురుషసూక్తంలోని "త్రిపాదూర్ధ్వ ఉదైత్పురుషః" అనే దానికి తుల్యమైన "త్రిపాదూర్ధ్వగాయనమః" అని ఈయన సహస్ర నామాలలో ఉంది! పరమ పురుషత్వం ఉన్నవాడు! రామభక్తిని ప్రపంచంలో చాటడానికి రూపుదాల్చిన రుద్రుడని తెలిపే నామాలు - రుద్రాయ నమః, జేష్ఠాయనమః, సదాశివాయనమః, మహేశ్వరాయనమః, అష్టమూర్తిధరాయ నమః, సద్యోజాతాయనమః మొదలైనవి — ఆంజనేయ సహస్ర నామావళిలో ఉన్నాయి. ఇంతేకాదు-శ్రీమన్నారాయణుడెత్తిన అవతారాల నామాలు-మత్స్యాయ నమః, కూర్మాయనమః, నారసింహాయనమః, వామనాయనమః, బుద్ధాయనమః, కల్కినేనమః మొదలైనవి - కనబడతాయి. ఇవిగాక-గణేశాయనమః, గురుడాయ నమః, పుండరీకాక్షాయనమః, సంకర్షణాయనమః మొదలైనవి ఆయన నామావళిలో ఉన్నాయి. ఆయన సహస్ర రూపాలను దర్శించినవారు ఆయనలో నవగ్రహాలను

చూచి-రవయోనమః, చంద్రాయనమః, కుజాయనమః, శనైశ్చరాయనమః మొద లైన వాటినికూడా పేర్కొన్నారు. ఇది "ఏకంసత్ విప్రాబహుధావదంతి" అనే సనాతన మతసంప్రదాయానికి అనుగుణమైనదే! అన్నిరూపాలు ఆయనవే అనే పరమసత్యం తెలిపే విషయమే ఇది! దీనితోబాటు "జీవుడు" శరణాగతుడుకావాలి అనే భక్తిసిద్ధాంత పరమసూత్రాన్నికూడా లోక సంగ్రహంకోసం హనుమ దవ తారం తెలుపుతోంది!

ప్రస్థాన త్రయంలో స్థానం సంపాదించి, ఉపనిషత్తుగా గౌరవంపొంది, ప్రముఖులైన ఆచార్యులచేత ముఖ్యంగా-అద్వైత, విశిష్టాద్వైత, ద్వైతమతాచార్యుల చేత వ్యాఖ్యానింపబడి - సనాతన మతావలంబుల తాత్త్వికచింతనకు మూల గ్రంథంగా సర్వులచేత-పాచ్యపాశ్చాత్య విద్వాంసులచేత-గ్రహింపబడిన మహా భారతాం తర్గతమైన శ్రీమద్భగవద్గీతలో ("ఇతి శ్రీమహాభారతే భీష్మపర్వణి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే....") భక్తి విశిష్ట తను గూర్చి శరణాగతినిగూర్చి విశేషంగా ప్రవంచింపబడింది. భగవద్రామాను జులవారి సంప్రదాయజ్ఞులచేత "చరమశ్లోకం"గా, పరమపవిత్రంగా గృహీతమైన:

"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణంవ్రజ ।
అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః॥"
(అధ్యాయం-18-మోక్షసన్న్యాసయోగం-శ్లోకం-66)

అనేది ఈ భగవద్గీతలోనిదే! ఇది భగవంతుడైన శ్రీకృష్ణునిచే ప్రగీతమై నందున భగవద్గీత అనీ సంసారాన్ని భంగించేది గనుక ఉపనిషత్తనీ బ్రహ్మ ప్రాపకం కావడంచేత బ్రహ్మవిద్యఅనీ ఉపాయసూచకాలయిన యోగాలను నిర్దే శించడంవల్ల యోగశాస్త్రమనీ-చెప్పడం జరిగింది.

శ్రీమద్భాగవతంలో ఏకాదశస్కంధంలో 20వ అధ్యాయంలో ఉద్ధవునకు శ్రీకృష్ణపరమాత్మ యోగాలనుగూర్చిచెప్పి అవి ఎవరెవరు ఎలా ఆచరించాలో వివరించాడు:

"యోగాస్త్రయో మయాప్రోక్తాన్నృణాం శ్రేయోవిధిత్సయా ।
జ్ఞానం కర్మచ భక్తిశ్చనోపాయోఽన్యోఽస్తికుత్రచిత్॥ శ్లో-6)

నిర్విణ్ణానాం జ్ఞానయోగో న్యాసినామిహ కర్మసు ।
తేష్వ నిర్విణ్ణా చిత్తానాం కర్మయోగస్తు కామినామ్॥ (శ్లో-7)

యదృచ్ఛయా మత్కథాదౌ జాతశ్రద్ధస్తుయః పుమాన్ ।
ననిర్విణ్ణో నాతిసక్తో భక్తియోగోఽస్య సిద్ధిదః॥" (శ్లో-8)

స్థూలంగా పీటిభావం ఇది-జ్ఞాన, కర్మ, భక్తియోగాలని యోగాలు మూడు. కర్మలయం దాసక్తి కలవారికి కర్మయోగం, అంతగా ఆసక్తి వైరాగ్యంలేనివారికి భక్తియోగం, వైరాగ్య యుక్తులకు జ్ఞానయోగం సిద్ధిప్రదాలు.

శ్రీమద్భగవద్గీత-కర్మజ్ఞానయోగాలనుగూర్చి చెప్పినా, భక్తియోగంయొక్క మహిమ అడుగడుగున చెప్పుతూనేవచ్చింది. ఈశ్వరుడు సృష్ట్యాదికార్యాల్ని చేస్తున్నా ఆప్తకాముడు గనుగ నిరహంకారి. సృష్టియందు ఉత్తమాధమాది భేదాలుండినా, ఈశ్వరునకు ఎలాంటి వైషమ్యంలేదు:

"సమోఽహం సర్వభూతేషు, నమేద్వేష్యోఽస్తి నప్రియః ।
యేభజంతి తుమాం భక్త్యామయితే తేషుచాప్యహమ్॥
(అధ్యా-9-శ్లోకం-29)

ఈశ్వరుని కరుణాదృష్టి అందరి విషయంలోను సమానమే. దానిని గ్రహింపలేనివారిది తప్పు. ఈ సందర్భంలో శ్రీధరస్వామి అగ్నితో భగవంతుని పోల్చాడు. అగ్నిని ఉపయోగించుకొనువారికి తమశ్శీతాది జనితమైన దుఃఖం పోతుంది. ఉపయోగించుకొననివారికికాదు. ఇదేవిధంగా భక్తితో భగవంతుని సేవించేవారికి ఆయన కరుణ లభిస్తుంది ఇది భక్తియొక్క విశిష్టత. లేనివారికి లేదు. అగ్నికి వైషమ్యం లేనట్లే భగవంతునకు వైషమ్యంలేదు.

"భక్తియోగం"లో సగుణ నిర్గుణోపాసనలలో ఏది శ్రేయస్కరం అనేది ఈ ద్వాదశాధ్యాయంలో వివరించబడింది.

నిర్గుణోపాసనస్యైవ్యం సగుణోపాసనస్యచ ।
శ్రేయః కతరది త్యేతన్నిర్ణేతుంద్వాదశోద్యమః॥
(శ్రీధరస్వామి)

జ్ఞానయోగం క్లేశకర గనుక భక్తియోగం సుకరం అని చెప్పబడింది. ("క్లేశోఽధి

కతరస్తే షామవ్యక్తా సక్త చేతసామ్") గుణోపాసకులైన నా భక్తులను నేనుద్ధరి
స్తాను అని శ్రీకృష్ణుడే స్వయంగా చెప్పాడు:

"యేతు సర్వాణి కర్మాణి మయి సంన్యస్య మత్పరాః ।
అనన్యే నైవయోగేనమాం ధ్యాయంత ఉపాసతే॥ (శ్లో-6)

తేషామహం సముద్ధర్తా మృత్యు సంసారసాగరాత్ ।
భవామి నచిరాత్పార్థమయ్యా వేశితచేతసామ్॥ (శ్లో-7)

మయ్యేవ మన ఆధత్స్వమయి బుద్ధిం నివేశయ ।
నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం నసంశయః॥" (శ్లో-8)

వీటికి స్థూలంగా అర్థం ఇది-అర్జునా! ఎవరు సమస్త కర్మలను నాకు సమ
ర్పించి, నాయందు ఆసక్తి కలిగిఉండి ఐకాంతికమైన భక్తియోగంతో నన్ను
ధ్యానిస్తూ ఉపాసిస్తున్నారో అవ్యక్తులను నేను శీఘ్రంగా జనన మరణాలున్న
సంసార సాగరంనుండి ఉద్ధరిస్తున్నాను. కాబట్టి, నువ్వు నాయందే మనస్సునిలుపు.
నాయందే బుద్ధిని ఏకాగ్రంచెయ్యి, ఈవిధంగాచేస్తే దేహాంతంలో నువ్వు నాయందే
వసిస్తావు. ఈవిషయంలో సంశయంలేదు. ఇదీ చెయ్యలేకపోతే కర్మఫలం త్యాగం
చెయ్యి. ఇది చేస్తే నువ్వు నా అనుగ్రహంవల్ల కృతార్థుడవవుతావు.

"అథైత దప్యశక్తోఽసికర్తుం మద్యోగమాశ్రితః ।
సర్వకర్మఫలత్యాగం తతఃకురుయతాత్మవాన్॥" (శ్లో-11)

ఈవిధంగా చెప్పిన తరువాత, తనకు ఎవరు ప్రియుడో వివరించాడు-
ఏప్రాణియందు ద్వేషంలేనివాడు, మిత్రభావంకలవాడు, దయాళువు, మమత్వ
బుద్ధిలేనివాడు, నిరహంకారి, సుఖదుఃఖాలలో సమానంగాఉండేవాడు, క్షమాశీలుడు,
నిత్యసంతోషి, సమాహితచిత్తుడు, తత్త్వ విషయాలలో దృఢనిశ్చయుడు, మనో
బుద్ధులను నాకర్పించినవాడుఅయిన భక్తుడు నాకు ప్రియుడు.

"అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణఏవచ ।
నిర్మమో నిరహంకారః సమదుఃఖ సుఖఃక్షమీ॥ (శ్లో-13)

సంతుష్టః సతతం యోగీయతాత్మా దృఢనిశ్చయః ।
మయ్యర్పిత మనోబుద్ధిర్యోమద్భక్తః సమేప్రియః॥ (శ్లో-14)

ఎవరు తనకు ప్రియులో ఇంకా వివరణగా శ్రీకృష్ణుడు పార్థునకు ఇలా చెప్పాడు. ఎవడు ఇతరులెవ్వరికీ ఉద్వేగాన్ని కలిగించడో, ఎవడు ఉద్వేగాన్ని పొందడో, ఎవడు ఆనందవిషాద, భయ, సంక్షోభాలనుపొందడో అతడు నాకు ప్రియుడు:

"యస్మాన్నో ద్విజతేలోకో లోకాన్నో ద్విజతేచయః ।
హర్షామర్ష భయోద్వేగైర్ముక్తోయః సచమేప్రియః॥" (శ్లో-15)

నిస్పృహుడు, బాహ్యాభ్యంతర శౌచమున్నవాడు, దక్షుడు, పక్షపాత శూన్యుడు, సమస్త సకామకర్మత్యాగి అయినభక్తుడు ఇష్టుడు:

"అనపేక్షః శుచిర్దక్ష ఉదాసీనో గతవ్యథః ।
సర్వారంభ పరిత్యాగీ యోయద్భక్తః సమేప్రియః॥" (శ్లో-16)

ఈవిషయాన్నే ఇంకా కొనసాగిస్తూ.ఎవడు మంచి జరుగుతే సంతోషించడో, చెడ్డ జరిగితే ద్వేషాన్నిపొందడో, ఇష్ట వియోగంవల్ల దుఃఖంపొందడో, లేనివస్తువు కోసం ఎవడు కోరికపెంచుకోడో, ఎవడు శుభాశుభకర్మలను పరిత్యజిస్తాడో అలాంటి భక్తుడు నాకు ప్రియుడు:

"యోనహృష్యతి నద్వేష్టి నశోచతి న కాంక్షతి ।
శుభాశుభ పరిత్యాగీ భక్తిమాన్యః సమేప్రియః॥" (శ్లో-17)

వీటి తరువాత రెండు శ్లోకాలలో (18,19 శ్లోకాలు) ఇంకా ఎవరెవరు తనకు ప్రియులో విపులీకరించాడు:

"సమః శత్రౌ చ మిత్రే చతథామానావ మానయోః ।
శీతోష్ణ సుఖదుఃఖేషు సమః సంగవివర్జితః॥"

"తుల్యనిందాస్తుతి ర్మౌనిసంతుష్టో యేనకేనచిత్ ।
అనికేతః స్థిరమతిర్భక్తిమాన్మే ప్రియోనరః॥"

శత్రుమిత్రులయందు, మానావమానాలయందు, శీతోష్ణ సుఖదుఃఖాల యందు సమదృష్టిఉంది; ఉన్నదానితో తృప్తిపడి, మౌనిగా, స్థిరనివాసంలేక, నిశ్చల చిత్తం, భక్తిఉన్న వ్యక్తి నాకు ప్రియుడు.

ఈరీతిగా చెప్పిన తరువాత అత్యంత ప్రియభక్తులెవరో చివర ఇలా వివరించారు:

"యేతు ధర్మామృతమిదం యథోక్తం పర్యుపాసతే ।
శ్రద్దధానా మత్పరమాభక్తాస్తేఽతీవమే ప్రియాః॥" (శ్లో-20)

ఎవరు శ్రద్ధావంతులు, మత్పరాయణులు అయి అమృతతుల్య ధర్మాన్ని అనుష్ఠిస్తున్నారో అలాంటిభక్తులు నాకు మిక్కిలి ప్రియులు.

ఈ వివరణలో భక్తునకుండవలసిన మొత్తం 42 కల్యాణ గుణాలు ఇయ్యడం జరిగింది. ఇవన్నీ ఉన్నవాడు నాకత్యంతప్రియుడు అని భగవంతుని అభిప్రాయం. దీనినిబట్టి భగవంతునకు ప్రియుడైన భక్తుడు శరణాగతుడని తెలు తోంది. "నీవేతప్ప ఇతఃపరంబెరుగ"నన్నవ్యక్తియే ఈ కల్యాణగుణ సంపన్నుడు కాగలడు! ఈ గుణాలను ఆభక్తుడు "సంపాదించాలి"అనే దృష్టితో సంపాదించినవి కావు. అనన్యభక్తి ఈగుణాలనన్నింటిని ఆభక్తునకు లభింపజేస్తుంది. సంపాదించి పెట్టుతుంది: "భక్తి సత్త్వాన్ని అవలంబించినభక్తులు (బుధులు) సుఖంగా శ్రీకృష్ణపదాంభోజాలను భజింతురుగాక!" అని భక్తి యోగధ్యాయం చివర, శ్రీధరస్వామి (తన సుబోధినీ వ్యాఖ్యాలో వ్రాసినది - శ్రీధరస్వామి అధ్యాయ ప్రారంభంలోను చివరను ఆయా అధ్యాయాల సంగ్రహార్థం సూచించినారు.) ఈ శ్లోకం వ్రాశారు:

"దుఃఖమవ్యక్తవర్త్మైతదృహు విఘ్నమతో బుధః ।
సుఖం కృష్ణపదాంభోజం భక్తిసత్త్వభవాన్భజేత్॥"

భగవంతుడు అవతారం ఎత్తడానికి ముఖ్యకారణాలుగా చెప్పిన ప్రసిద్ధ శ్లోకాలు భగవద్గీతలోనే జ్ఞానయోగాధ్యాయంలో (అధ్యా-4) వస్తాయి.

"యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్॥ (శ్లో-7)

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చదుష్కృతాం ।
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే॥" (శ్లో-8)

ధర్మానికిగ్లాని, అధర్మానికి అభివృద్ధి వచ్చినప్పుడు నేను నామాయచే శరీరాన్ని గ్రహిస్తున్నాను. శిష్టరక్షణ, సాధురక్షణ, చేయడంకోసం ధర్మ సంస్థాపన కోసం ప్రతియుగంలోను అవతరిస్తాను అని భగవంతుడన్నాడు. ఈ శ్లోకాలకు పూర్వ శ్లోకంలో తన మాయవల్ల శరీరాన్ని ధరిస్తున్నాను అని కంఠోక్తిగా చెప్పాడు:

"అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపిసన్ ।
ప్రకృతిం స్వామిదిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా॥" (శ్లో-6)

"నేను జన్మరహితుణ్ణి అయినా, అలుప్త జ్ఞానశక్తి స్వభావుణ్ణి అయినా సర్వభూతేశ్వరుణ్ణి అయినా- ఈజగత్తు దేనివంశలోఉందో. ఆ నా త్రిగుణాత్మకమైన ప్రకృతిని వశంచేసుకొని నా మాయవల్ల శరీరాన్ని ధరిస్తున్నాను". ఇందువల్లనే తరువాత "ఆత్మానం సృజామ్యహమ్"అని ఆయన చెప్పుకొన్నాడు.

అవతారం దేహాన్ని గ్రహించినట్లున్నా పుట్టినట్లున్నా - భగవంతుని దివ్య భావం ఉండనేఉంటుంది. మాయాధీనుడుకాడు. మాయాధీశుడు. నిత్య-శుద్ధ-బుద్ధ-ముక్తస్వభావుడు! ఇందువల్లనే అర్జునునితో-"నీకు నాకు చాలా జన్మలు గతించాయి. నేను వాటిని ఎరుగుదును. నువ్వుఎరుగవు" అంటాడు:

"బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున।
తాన్యహం వేద సర్వాణి నత్వం వేత్థపరం తప॥" (శ్లో-5)

నరుడైన అర్జునుడు మాయాధీనుడు. ధర్మాధర్మాది సంస్కారాలవల్ల ఆయన జ్ఞానశక్తి అవృతమైనది. కాని, భగవంతుడైన కృష్ణుని జ్ఞానశక్తి- మాయాధీశుడు గనుక- సర్వదా అనావృతం.

భగవద్గీతలో అవతార ప్రయోజనాలుగా- సాధురక్షణ, దుష్టశిక్షణ, ధర్మ సంస్థాపన- చెప్పడం జరిగింది. శ్రీమద్భాగవతం- ఇంకో రెండింటినికూడా

చెప్పింది. ఒకటి—

"మర్త్యావతార స్త్విహ మర్త్యశిక్షణం।
రక్షోవధాయైవ న కేవలం విభోః।
కుతోఽన్యథాస్యాద్రమతస్స్వ ఆత్మన్।
సీతాకృతానివ్యసనా నిశ్వరస్య"
(స్కంధం-5, అధ్యాయం-19 శ్లోకం-3)

ఇంక రెండోది- దశమస్కంధంలో 33వ అధ్యాయంలో 38వ శ్లోకం.

"అనుగ్రహాయ భూతానాం మానుషం దేహమాశ్రితః।
భజతేతాదృశీః క్రీడాయాశ్శ్రుత్వా తత్పరోభవేత్॥"

మర్త్యశిక్షణం, తన క్రీడలయందు (లీలలయందు) తత్పరత కలిగించడం ప్రయోజనాలే! ఈ తత్పరత కలిగిన వ్యక్తి తరిస్తాడు. శ్రీమద్భాగవతంలో ఇలా చెప్పబడింది :

"యాని తే చరితానీశమనుష్యాస్సాధవః కలౌ।
శృణ్వం తః కీర్తయం తశ్చతరిష్యం త్యంజసా తమః॥"
(ఏకాదశస్కంధం- షష్ఠోఽధ్యాయః, శ్లో-24)

భగవద్గీతలోని జ్ఞానవిజ్ఞానయోగం (7వ అధ్యాయం)లో ఎవరెవరు తనను భజిస్తారో శ్రీకృష్ణుడు ఇలా వివరించాడు. కారణాలు వేరైనా అందరు ఆయన్ని భజించేవారే!

"చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోఽర్జున।
ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీచ భరతర్షభ॥" (శ్లో-16)

"విపన్నుడు, తత్త్వజిజ్ఞాసువు, అర్థకామి, తత్త్వజ్ఞాని- అనే నలుగురు నన్ను భజిస్తారు"అంటాడు కృష్ణుడు. ఇలా భజించేవారే నా మాయను అతిక్రమించి సంసారబంధంనుండి విముక్తి పొందుతున్నారు. లేకపోతే— అత్యద్భుతం, త్రిగుణాత్మకం అయిన నామాయను అతిక్రమించడం చాలాకష్టం అయితే ఎవరు నన్నే ఆశ్రయించి భజిస్తున్నారో, వారే దుస్తరమైన మాయనుండి తరిస్తున్నారు":

"దైవీ హ్యేషా గుణమయీ మమమాయా దురత్యయా ।
మామేవయే ప్రపద్యంతే మాయామేతాం తరంతితే॥" (శ్లో-14)

ఇందువల్ల, శరణాగతియే, గుణమయి అయిన మాయను తరించడానికి ఒకే ఒకమార్గం! నన్ను భజించే నాలుగు తెగలకు చెందిన భక్తులు నాకు ప్రియులైనా, జ్ఞాని అందరికంటె శ్రేష్ఠుడు. అయనకు నేను, నాకు ఆయన ప్రియులము:

"తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే ।
ప్రియోహి జ్ఞానినోఽత్యర్థమహం సచ మమప్రియః॥"
(శ్లోకం- 17)

ఈ నాలుగువిధాలైన వారిని మనం మన పురాణాముల నుండి గ్రహించవచ్చును. ద్రౌపది, గజేంద్రుడు మొదలైనవారు ఆర్తభక్తులు. ఉద్ధవుడు జిజ్ఞాసువు; ధ్రువుడు అర్థకామి; ప్రహ్లాదుడు తత్త్వజ్ఞాని.

ఏ యే దేవతామూర్తులను ఏ యే భక్తులు శ్రద్ధతో అర్చిస్తారో వారికి ఆయా దేవతారూపాలయందు దృఢభక్తిని అంతర్యామినైన నేను- కలిగిస్తున్నాను.

"యోయో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి ।
తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్॥"
(శ్లోకం- 21)

"అయితే, ఆ యా దేవతామూర్తులను అర్చించే వారికి ఆయా ఫలితాలే లభిస్తాయి. నన్ను అర్చించేవారికి- నా భక్తులకు- అనాద్యనంతం పరమానందం అయిన నేను లభిస్తున్నాను:

"అంతవత్తు ఫలం తేషాం తద్భవత్యల్పమేధసామ్ ।
దేవాన్దేవయతో యాంతి మద్భక్తాయాంతి మామపి॥ (శ్లోకం-23)

"నా భక్తులు నన్ను పొందుతున్నారు" అని చెప్పి, ఏ పుణ్యాత్ముల పాపం (ప్రతిబంధరూపకమైనది) క్షీణించినదో వారు దంద్వమోహాలనుండి విడివడి దృఢనిష్ఠతో నన్ను భజిస్తున్నారు" అంటాడు కృష్ణుడు:

"యేషాం త్వంతగతం పాపం జనానాం పుణ్యకర్మణామ్।
తే ద్వంద్వమోహ నిర్ముక్తా భజంతేమాం దృఢవ్రతాః॥"
(శ్లోకం- 28)

పైని చెప్పినట్లుగా తనను భజించేవారికి కలిగే లాభాన్ని గురించి చెప్పి, "అక్షరబ్రహ్మయోగం"లో (8వ అధ్యాయం) "అవసానకాలంలో ఎవడు నన్ను స్మరిస్తూ శరీరాన్ని త్యజించి వయనిస్తాడో ఆ భక్తుడు నా భావాన్నే పొందుతాడు; సంశయంలేదు" అంటాడు పరమాత్మ కృష్ణుడు. (శ్లోకం-5)

"అంతకాలేచ మామేవస్మర న్ముక్త్వా కలేబరమ్ ।
యః ప్రయాతి సమద్భావం యాతినా స్త్యత్ర సంశయః॥" (శ్లో-5)

ఈ విధంగా అందరి భక్తుల విషయంచెప్పి ప్రత్యేకంగా అర్జునుణ్ణి సంబోధిస్తూ ఇలా అంటాడు :

"తస్మాత్సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్యచ।
మయ్యర్పిత మనోబుద్ధిర్మామే వైష్యస్య సంశయమ్॥" (శ్లో-7)

అంతకు పూర్వమున్నవాసనలే అంత్యకాల స్మృతికి కారణాలవుతున్నాయి గనుక, ఆ వివశస్థితిలో జీవునకు భగవన్నామస్మరణ ప్రయత్నముండదుగనుక "నిరంతరం నువ్వు నన్ను గురించి ఆలోచించు (చిత్తశుద్ధి లేకపోతే ఈ నిరంతర స్మరణ ఉండదు గనుక, దాన్ని పొందడానికి స్వధర్మాచరణ చెయ్యి.) యుద్ధం చెయ్యి మనస్సును బుద్ధిని అర్పించు, నిస్సంశయంగా నన్నే పొందుతావు"అంటాడు ఇంత ధైర్యం చెప్పి, "ఎవడు అనన్యచిత్తుడై నన్ను యావజ్జీవం నిరంతరం స్మరిస్తాడో, ఎల్లప్పుడు సమాహితచిత్తుడై ఉంటాడో ఆ యోగికి నేను సహజంగా లభిస్తాను" అంటాడు. "ఓ పార్థా! నువ్వు అలా ఉండు" అని భంగ్యంతరంలో చెప్పడమే ఇది !

"అనన్యచేతాః సతతం యోమాంస్మరతి నిత్యశః।
తస్యాహం సులభః పార్థ నిత్యయుక్తస్య యోగినః॥" (శ్లో-14)

తాను ఏ విధంగా చేస్తే లభిస్తాడో చెప్పి, ఆ పరమేశ్వరుణ్ణి పొందడానికి అనన్యభక్తి మార్గమని తిరిగి జ్ఞాపకంచేస్తాడు:

పురుషః స పరః పార్థ భక్త్యాలభ్యస్త్వనన్యయా ।
యస్యాంతః స్థాని భూతాని యేన సర్వమిదం తతమ్॥"

(శ్లోకం— 22)

తరువాత "రాజవిద్యా రాజగుహ్య యోగాధ్యాయం"లో బ్రహ్మవిద్యయొక్క వైశిష్ట్యాన్ని ఉగ్గడిస్తూ, "ఇది తెలుసుకోలేని శ్రద్ధా రహితులగు పురుషులు నన్ను పొందలేక మృత్యు సంకులమైన సంసారమార్గంలో తిరుగాడుతున్నారు" అంటాడు

"అశ్రద్ధ ధానాః పురుషా ధర్మస్యాస్య పరంతప।
అప్రాప్యమాం నివర్తంతే మృత్యు సంసారవర్త్మని॥" (శ్లో–2)

దీని తరువాత తాను అవతరించి మనుష్యదేహాన్ని ఎందుకు ధరిస్తున్నాడో చెప్పి, మూఢులు తనను తెలుసుకోలేక అవజ్ఞ చేస్తున్నారు- అంటాడు :

"అవజానంతి మాం మూఢామానుషీం తనుమాశ్రితమ్।
పరం భావమజానంతో మమ భూతమహేశ్వరమ్॥" (శ్లో-11)

భగవంతుడు, నిత్య-శుద్ధ-బుద్ధ-ముక్త స్వభావుడు. సర్వాత్మ స్వరూపుడు, సర్వేశ్వరుడు అయినా– "భక్తులను అనుగ్రహించడానికి (శుద్ధసత్త్వమయమైన) మనుష్యదేహాన్ని ధరిస్తున్నాను. నా పరమ స్వరూపాన్ని తెలుసుకోలేని మూఢులు నన్ను లెక్కచెయ్యడంలేదు''. అంటాడు పరమేశ్వరుడైన శ్రీకృష్ణుడు.

అయితే దైవీ స్వభావాన్ని ఆశ్రయించిన మహాత్ములు అనన్యమనస్కులై నన్ను నిత్యునిగా, జగత్కారణంగా తెలుసుకొని భజిస్తున్నారు.

"మహాత్మానస్తు మాం పార్థ దైవీంప్రకృతి మాశ్రితాః।
భజంత్యనన్యమనసో జ్ఞాత్వా భూతాది మవ్యయమ్॥" (శ్లో-13)

"సతతం కీర్తయంతోమాం యతంతశ్చ దృఢవ్రతాః।
నమస్యంతశ్చమాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే॥" (శ్లో–14)

ఎవరు ఎవరు ఏయేవిధంగా ఉపాసిస్తున్నారో ఆవిధంగా వివరించి చెప్తాడు

"జ్ఞానయజ్ఞేన చాప్యన్యేయజంతో మాముపాసతే।
ఏకత్వేన పృథక్త్వేన బహుధా సర్వతోముఖమ్॥" (శ్లో.15)

ఈ శ్లోకంలో- వీలున్న ఉపాసనా భేదాల నన్నింటిని వివరిస్తూ వాటిలో "పృథక్త్వేన" అంటే "దాసోఽహమ్' అనే భావాన్నికూడా పేర్కొన్నారు. "కొందరు సర్వాత్మ దర్శనరూపమైన జ్ఞాన యజ్ఞంద్వారా, కొందరు అభేదబుద్ధితో (ఏకత్వభావంతో) కొందరు (బహుధా) బ్రహ్మరుద్రాదిరూపాలతో- నన్ను ఉపాసిస్తున్నారు" అంటాడు.

ఆధునిక కాలంలో అవతార పురుషునిగా పరిగణింపబడిన శ్రీరామకృష్ణ పరమహంస (1836-1886) ద్వైతా ద్వైత విశిష్టాద్వైత సిద్ధాంతాలను తార్కిక విషయాలుగా గ్రహించక ఉపాసనా మార్గాలుగా గ్రహించాలని ఉద్ఘోషించాడు. ఈ శ్లోకం ఆయన అనుభవానికి, శాస్త్రవిషయానికి సమన్వయం కుదిర్చేలా పనికి వస్తుంది. పరమహంస శిష్యుడై భారతీయ తత్త్వచింతనను ప్రపంచ వ్యాప్తంగా ప్రచారంచేసిన స్వామి వివేకానంద (1863-1902) ఈ మార్గాన్నే అవలంబించాడు "ఏకత్వేన"అభేదదృష్టి, "పృథక్త్వేన" భేదదృష్టి, "బహుధా" ద్వైతదృష్టి అని వీరిద్దరు భావించారు. ఈ "అనుభవాలను" నొక్కిచెప్పే ప్రాచీన శ్లోకాలు ఉన్నాయి:

"దేహబుద్ధ్యాస్మి దాసస్తే, జీవబుద్ధ్యాత్వదంశకః।
ఆత్మబుద్ధ్యా త్వమేవాహం ఇతి మేనిశ్చితామతిః॥"

ఈ అభిప్రాయాన్నే. అన్యశబ్దప్రయోగంతో చెప్పిన శ్లోకం ఇది:

"దాసస్తేహం దేహబుద్ధ్యా విశిష్టః।
అంశత్వం తే జీవదృష్ట్యా ప్రభో మే।
నష్టే మోహే ఆత్మ సంస్థోయ దాహం।
పశ్యామేక్యం త్వాం త్వహం వాప్రసిద్ధమ్॥"

శంభువును సంబోధిస్తూ-ఇదేభావాన్ని-చెప్పిన శ్లోకం ఇది:

దాసస్తేఽహం దేహదృష్ట్యాస్మి శంభో
జాతస్తేఽంశో జీవదృష్ట్యా త్రిదృష్టే।

సర్వస్యాత్మన్ ఆత్మదృష్ట్యాత్వమేవే।
త్త్యైవంధీర్మే నిశ్చితా సర్వశాస్త్రైః॥

అయితే, ద్వైత విశిష్టాద్వైత సంప్రదాయాలను స్థాపించిన ఆచార్యులను గాఢాభినివేశంతో అనుసరించే విద్వాంసులుగాని, వారి అనుయాయులుగాని వీటిని ఆమోదిస్తారని తోచదు. కాని, ప్రాచ్యపాశ్చాత్య తాత్త్విక చింతనతో పరిచయ మున్న ఆధునికులు-పై ఆలోచనా విధానాలను-చాలావరకు ఆమోదిస్తారు.

ఈ "రాజవిద్యా రాజగుహ్య యోగాధ్యాయం"లోనే "నా భక్తుల యోగక్షేమాల పరిరక్షణ భారాన్ని నేను వహిస్తాను" అని భగవంతుడు వాగ్దానం చేసిన సుప్రసిద్ధ శ్లోకం వస్తుంది.

"అనన్యాశ్చింతయంతోమాం యేజనాః పర్యుపాసతే।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్॥"
(శ్లోకం-22)

అనన్య భక్తులకు ఇది "కొంగుబంగారం" వంటిది. యోగం అంటే పొందనిదాన్ని పొందడం (అప్రాప్యస్య ప్రాప్తిర్యోగః), క్షేమం అంటే పొందినదాన్ని రక్షించడం (ప్రాప్తస్య పరిరక్షణమ్ క్షేమః) వీటి బాధ్యతను నేను వహిస్తాను అని భగవంతుడు అనడం ఎంతగొప్ప విషయం.

ఇంక, "దుర్మార్గుడైనా అనన్యచిత్తుడై నన్ను భజిస్తే అతనిని సాధువుగానే గ్రహించాలి. (ఇది భగవంతుని యందలి భక్తియొక్క అవితర్క్య ప్రభావం) అతని సంకల్పం మంచిది. భగవద్భజనవల్ల కృతార్థుడనుకావాలి అని నిర్ణయించుకొన్నాడు గనుక".

ఇంక, "ఆ దురాచారి నన్ను భజిస్తూ శీఘ్రంగా ధర్మచిత్తుడవుతున్నాడు. విత్యశాంతిని పొందుతున్నాడు. కౌంతేయా! నా భక్తుడెన్నడును వినష్టుడు కాడు. కృతార్థుడే కాగలడు. ఇది నిశ్చితమైన విషయమని గ్రహించు."

"అపిచేత్సు దురాచారో భజతేమామనన్యభాక్।
సాధురేవ సమంతవ్యః సమ్యగ్వ్యవసితో హిసః॥ (శ్లో. 30)

"క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి।
కౌంతేయ! ప్రతిజానీ హి న మే భక్తః ప్రణశ్యతి॥" (శ్లో-31)

ఇంత కంఠోక్తిగా చెప్పినతరువాత కూడా ఇంకా మోహంలో పడిపోయి తనను భజించడం మానివేసి పతనాన్ని పొందుతాడేమో అనే భయంతో భక్త శ్రేయోభిలాషి అయిన ఆ కృష్ణపరమాత్మ-"అనిత్యం, అసుఖం అయిన ఈ లోకం పొందావు. నన్ను భజించు" అంటాడు. ("అనిత్యమసుఖం లోకమిదం ప్రాప్య భజస్వమామ్") ఇది అనిత్యం గనుక "తొందరపడు.", అది సుఖరహితమైనది గనుక "సుఖ ప్రయత్నం చెయ్యకు". "దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకో" అన్న సామెత ప్రకారం- భగవద్దత్తమైన ఈ దేహం ఉండగానే అన్నమాట- కాలం ఉన్నప్పుడే "నన్ను భజించు". ఇది బాగానే ఉంది. మరి, భజించడం ఎలాగ?

"మనస్సు నాయందు నిలుపు. నా భక్తుడవు అయి నన్ను పూజించు. నాకు నమస్కరించు. ఈవిధంగా శరణాగతుడవై, నీ మనస్సు నాయందే నిలిపితే నన్ను పొందగలవు" అని ఉపదేశించాడు:

"మన్మనాభవ మద్భక్తో మద్యాజీమాం నమస్కురు।
మామే వైష్యసి యుక్త్వైవ మాత్మానం మత్పరాయణః॥"
(శ్లోకం. 34)

అధ్యాయాంతంలో మత్పరాయణుడవు కావలసినది అని చెప్పినాడు. "భజస్వమామ్" అన్నారు. మరి, భగవంతునకు ఏమి ఇయ్యగలను అని భక్తుడు సంశయంతో "సంశయాత్మా వినశ్యతి"అని భయపడిపోతాడేమో అని, అధ్యాయం మధ్యలోనే "ఏ ఆకో, ఏ పువ్వో, ఏ పండో, లేకపోతే నీళ్ళో" భక్తితో ఇయ్యి అంటాడు. మహావిభూతిపతి అయిన భగవంతుని కరుణ ఇది. ఆయనకు మనం ఏమి ఇయ్యగలము?

"పత్రం పుష్పం ఫలంతోయం యోమే భక్త్యాప్రయచ్ఛతి।
తదహం భక్త్యుపహృత మశ్నామి ప్రయతాత్మనః॥" (శ్లో-26)

ఈ పత్ర పుష్ప ఫలతోయాదులను కూడా శ్రమపడి సంపాదింపనక్కర లేదు. కౌంతేయ! నువ్వు ఆచరించే శాస్త్రసిద్ధ కర్మలను, వ్యావహారిక కర్మలను,

నువ్వు భుజించేవాటిని, నీ తపోదానహోమాదులను నాకర్పించు. అవన్నీ "కృష్ణార్పణమ్" అనే భావంతో చెయ్యి:

"యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసియత్।
యత్తపస్యసి కౌంతేయ। తత్కురుష్వ మదర్పణమ్॥" (శ్లో-27)

ఈవిధంగా "సమస్త కర్మలను నాకర్పిస్తే, నువ్వు కర్మబంధాలనుండి (శుభా శుభకర్మ ఫల బంధాలనుండి) ఇహ జీవితంలోనే ముక్తుడవై ఉంటావు. (జీవన్ముక్తిని పొందుతావు) దేహ పతనానంతరం నన్ను పొందుతావు. పునర్జన్మ ఉండదు." అని స్పష్టంగా ప్రబోధిస్తాడు.

"శుభాశుభ ఫలైరేవం మోక్ష్యసే కర్మబంధనైః।
సన్న్యాస యోగయుక్తాత్మా విముక్తో మాముపైష్యసి॥" (శ్లో-28)

ఈ అధ్యాయం చివర శ్రీధరస్వామి వ్రాసిన శ్లోకంలో- "కృపతో అచ్యుతుడు ఆశ్చర్యకరమైన తన ఐశ్వర్యాన్ని, భక్తియొక్క అద్భుతవైభవాన్ని, రాజగుహ్యాన్ని నవమాధ్యాయంలో వివరించాడు"అని చెప్పాడు.

"నిజమైశ్వర్య మాశ్చర్యం భక్తేశ్చాద్భుతవైభవమ్।
నవమే రాజగుహ్యాఖ్యే కృపయాఽవోచదచ్యుతః॥"

దశమాధ్యాయమైన "విభూతియోగం"లో భక్తివల్ల అజ్ఞానంతొలగి జ్ఞానం కలుగుతుంది అని శ్రీకృష్ణుడు ఉద్ఘాటించాడు.

"అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే।
ఇతి మత్వాభజంతే మాం బుధాభావసమన్వితాః॥" (శ్లో-8)

"సమస్త జగత్తునకు నేను ఉత్పత్తిస్థానాన్ని అనీ నానుండే సామర్థ్యాదులన్నీ ప్రవర్తిల్లుతున్నాయి అనీ- తెలుసుకొని జ్ఞానులు నన్ను భక్తితో భజిస్తున్నారు" అంటాడు.

తన భక్తులస్థితిని శ్రీకృష్ణుడు అర్జునునకు ఇలా వివరించి చెప్పాడు"విభూతి యోగం"లో-

"మచ్చిత్తా మద్గత ప్రాణాబోధయంతః పరస్పరమ్।
కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతిచ రమంతి చ॥" (శ్లో-9)

మద్గత చిత్తులును, మద్గత జీవనులును అయినవారు నిత్యం నన్నుగూర్చి అన్యోన్యం చెప్పుకొంటూ, నా కథలను కీర్తించుకొంటూ సంతోషిస్తున్నారు; ఆనందిస్తున్నారు.

"తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్।
దదామి బుద్ధియోగం తం యేన మాముపయాంతితే॥" (శ్లో-10)

నిత్యయుక్తులై ప్రీతిపూర్వకంగా భక్తితో నన్ను భజించేవారికి తత్త్వజ్ఞానాన్ని నేను ఇస్తున్నాను. ఆ బుద్ధియోగంచేత వారు నన్ను పొందుతున్నారు.

తమనుతాము అర్పించుకొంటే భగవంతుడు కరుణామయుడై, భక్తులకెంత సాయపడతాడో వీటివల్ల తెలుస్తోంది.

ఇంతేకాదు- "ఆ భక్తులను అనుగ్రహించడంకోసం వారి బుద్ధి వృత్తియందుండి, సమ్యగ్దర్శనదీప్తితో, ఉజ్జ్వలమైన వివేకదీపంతో - అవివేక జనితమూ మిథ్యా ప్రత్యయరూపమూ అయిన వారి మోహాంధకారాన్ని నాశనం చేస్తున్నాను" అంటాడు:

"తేషా మేవానుకంపార్థ మహమజ్ఞానజం తమః।
నాశయామ్యాత్మ భావస్థో జ్ఞానదీపేన భాస్వతా॥" (శ్లో-11)

తన భక్తుని విషయంలో ఇంతటితో భగవంతుడు తృప్తిపడలేదు. గుణత్రయ విభాగయోగంలో సత్త్వరజస్తమోగుణాలను అతిక్రమించి త్రిగుణాతీతుడై బ్రహ్మభావాన్ని పొందడానికి సమర్థునిగా నా భక్తునికి సాయపడతాను అంటాడు కూడా!

"మాంచయోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే।
సగుణాన్సమతీ త్యైతాన్బ్రహ్మ భూయాయకల్పతే॥

ఇంతటి సాహాయ్యం పొందడంకోసం ఆ పురుషుడు చేయవలసినది ఏమిటి? ఐకాంతిక భక్తితో సర్వభూత హృదయస్థుడైన శ్రీమన్నారాయణుని సేవించడం. అంతే. మిగిలినది ఆయనపని.

భగవద్గీత చివరి "మోక్షసన్న్యాసయోగం''అనే అష్టాదశాధ్యాయం ప్రారం భంలో శ్రీధరస్వామి "భగవద్గీతార్థ సంగ్రహం''అని ఒక శ్లోకం వ్రాశారు:

న్యాసత్యాగ విభాగేన సర్వగీతార్థసంగ్రహమ్।
స్పష్టమష్టాదశే ప్రాహపరమార్థ వినిర్ణయే॥

పరమార్థ నిర్ణయంకోసం - న్యాస, త్యాగవిభాగం చేయబడి గీతయొక్క సారాశం ఈ అధ్యాయంతో (18వ అధ్యాయం) చెప్పబడుతోంది. ఈ అధ్యాయాన్ని జాగరూకతతో పరిశీలిస్తే, భక్తికి శరణాగతికి - గీతాశాస్త్రం ఇచ్చిన ప్రాధాన్యం తెలుస్తుంది.

మొట్టమొదటి శ్లోకంలోనే అర్జునుడు - సన్న్యాసానికి, త్యాగానికి ఉన్న భేదాన్ని- దాని తత్త్వాన్ని తెలియజేయవలసింది అని అడుగుతాడు:

సన్న్యాసస్య మహాబాహో తత్త్వమిచ్ఛామి వేదితుమ్।
త్యాగస్యచ హృషీకేశ పృథక్కేశి నిషూదన॥'' (శ్లో-1)

దీనికి స్పష్టంగా కృష్ణుడు- "స్వర్గాది ఫలాలనిచ్చే కామ్యకర్మల పరిత్యాగమే సన్న్యాసమనీ అనుష్ఠేయమైన నిత్యనైమిత్తిక కర్మల ఫలత్యాగాన్ని త్యాగమనీ అంటారు" అని సమాధానమిచ్చాడు.

"కామ్యానాం కర్మణాం న్యాసం సన్న్యాసం కవయోవిదుః।
సర్వ కర్మఫలత్యాగం ప్రాహుస్త్యాగం విచక్షణాః॥ (శ్లో-2)

తరువాత, త్రిగుణాలకు సంబంధించిన కర్మలను, కర్తలనుగూర్చి చెప్పడం జరిగింది. దీని తరువాత- "సర్వకర్మల్ని నా కర్పించి, నన్నే పరమపురుషార్థంగా గ్రహించి, ఏకాగ్రమైన బుద్ధితో నాయందు చిత్తాన్ని సమాహితం చెయ్యి. అనన్య శరణ్యుడవై నన్ను శరణుపొందు."

"చేతసా సర్వకర్మాణిమయి సన్న్యస్యమత్పరః।
బుద్ధియోగము పాశ్రిత్యమచ్చిత్తః సతతం భవ॥" (శ్లో-57)

ఈవిధంగాచేస్తే- "నా అనుగ్రహంవల్ల దుస్తరమైన సంసారాన్ని, సంసార

హేతువుల్ని తరించగలవు. కాని, నువ్వు అహంకారంచేత నేను చెప్పినది వినక పోతే పురుషార్థ భ్రష్టుడవవుతావు."

"మచ్చిత్తః సర్వదుర్గాణి మత్ప్రసాదా త్తరిష్యసి ।
అథ చేత్త్వమహంకారాన్న శ్రోష్యసి వినంక్ష్యసి॥" (శ్లో-58)

దీని తరువాత కంఠోక్తిగా "నువ్వు ఈశ్వరుణ్ణే శరణుపొందు. పరమేశ్వరుని ప్రసాదంవల్ల నీకు పరమశాంతి లభిస్తుంది" అంటాడు:

"తమేవశరణం గచ్ఛ సర్వభావేన భారత।
తత్ప్రసాదాత్పరాం శాంతిం ప్రాప్స్యసిశాశ్వతమ్॥" (శ్లో-62)

ఈవిధంగా చెప్పి- "పరమగుహ్యమైన విషయం నీకు చెప్పాను. నువ్వు ఆలోచించుకొని నీ ఇష్టంవచ్చినట్లు చెయ్యి" అంటాడు. ఈ చివరివాక్యం "నువ్వు ఏదిచేసినా, దాని కర్తృత్వం నీది సుమా!" అని హెచ్చరించడంగా గ్రహించాలి:

"ఇతితే జ్ఞానమాఖ్యాతం గుహ్యాద్గుహ్యతరం మయా।
విమృశ్యై తదశేషేణ యథేచ్ఛసి తథాకురు॥" (శ్లో-63)

"అయితే, ఇంత గుహ్యమైన విషయం నీకు చెప్పడం ఎందుకు? అంటే, నువ్వునాకు చాలా ఇష్టుడవు. కనుక నీ హితంకోరి చెప్పాను" అంటాడు.

"సర్వగుహ్యతమం భూయః శృణు మేపరమం వచః।
ఇష్టోసి మేదృఢమితి తతోవక్ష్యామి తేహితమ్॥" (శ్లో- 64)

ఇంతవరకుచెప్పి ఊరుకోకుండా, అర్జునుడు (జీవుడని మనం గ్రహించవచ్చును) ఏమి చెయ్యాలో కర్తవ్యాన్ని కూడా బోధించాడు శ్రీకృష్ణపరమాత్మ.

"మన్మనాభవ మద్భక్తో మద్యాజీమాం నమస్కురు।
మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే॥" (శ్లో-65)

నువ్వు మద్గతచిత్తుడవును, మద్భక్తుడవును, నన్ను పూజించువాడవును అగుము. నాకు నమస్కారం చెయ్యి. అప్పుడు నన్నే పొందుతావు. ప్రతిజ్ఞాపూర్వకంగా సత్యాన్ని చెప్తున్నాను. నువ్వునాకు ప్రియుడవు అవుతున్నావు.

ఈ శ్లోకం తరువాతనే, అతి ప్రసిద్ధమైన "సర్వధర్మాన్ పరిత్యజ్య...." శ్లోకం వస్తుంది, భగవద్గీతలో చాలాసార్లు వివిధ అధ్యాయాలలో భగవంతుడు భక్తుడైన నరునితో "నువ్వు నాకు ప్రియుడవు, ఇష్టుడవు" అంటాడు. ఇది తన సృష్టిని తాను ప్రేమించడమన్నమాట.

ఈ అధ్యాయంలో ఆత్మార్పణను గురించి బాగా చెప్పడం జరిగింది. "మన్మనాభవ........" శ్లోకంలో చెప్పినవన్నీ భక్తుడుచేస్తే తరిస్తాడు. దీనికి సంశయంలేదు. దీనిలో "చెయ్యి" అని చెప్పిన ఒక్కొక్క క్రియయొక్క వైశిష్ట్యాన్ని పెద్దలు వేరువేరుగా అభివర్ణించారు.

"మన్మనాభవ" పరమేశ్వరుణ్ణి నిరంతరం స్మరించాలి. విధినిషేధాలన్నీ దీని కింకరులే।

"స్మర్తవ్యః సతతం విష్ణుర్విస్మర్తవ్యో న జాతుచిత్।
సర్వేవిధినిషేధాః స్యురేతయోరేవ కింకరాః॥"

(భక్తిరసామృత సింధువు)

"మద్భక్తో"- భగవంతుని భక్తునకు ఎల్లప్పుడు సుఖ శాంతులే, అన్నీ శుభ కార్య పరంపరలే జరుగుతాయి.

"నిత్యోత్సవో భవేత్తేషాం నిత్యశ్రీర్నిత్య మంగళమ్।
యేషాం హృదిస్థోభగవాన్ మంగళాయతనమ్ హరిః॥"

(ప్రపన్న గీత)

"మద్యాజీ"- భగవంతుని పూజించడం ఎందుకు? ఈ విధంగా చెయ్యవలసినదని పెద్దలు చెప్పారా? చెప్పారు!

"ఆలోడ్య సర్వశాస్త్రాణి విచార్యచ పునఃపునః।
ఇదమేకం సునిష్పన్నం ధ్యేయోనారాయణః సదా॥"

(ప్రపన్న గీత)

"మాం నమస్కురు"- భగవంతునకు నమస్కారం చేస్తే ఏమి ఫలం? నరునకు విశిష్టంగా వచ్చేది ఏమైనా ఉందా?

"ఏకోఽపికృష్ణస్య కృతః ప్రణామోద శాశ్వమేధావభృథేనతుల్యః।
దశాశ్వమేధీ పునరేతిజన్మ, కృష్ణప్రణామీన పునర్భవాయ॥"
(ప్రపన్న గీత)

భక్తినిగూర్చి పదేపదే చెప్పిన ఈ గీతాశాస్త్రంలో చివరకూడా-"ఈ గుహ్యమైన గీతాశాస్త్రాన్ని ఎవరు నా భక్తులకు వివరించి చెప్పువాడో అతడుకూడా పరమ భక్తిద్వారా నిస్సంశయంగా నన్ను చేరుతాడు''అని శ్రీకృష్ణుడు అన్నాడు:

"య ఇదం(మం)పరమం గుహ్యం మద్భక్తేష్వభిధాస్యతి ।
భక్తింమయి పరాంకృత్వామామేవైష్యత్య సంశయః॥" (శ్లో-68)

ఇంతటితో ఊరుకోలేదు. "ఈ గీతోపదేశాన్ని చేసేవాడికంటె మనుష్యులలో అధికుడైన ప్రియుడు నాకి "భువి''లో లేడు. అంతకంటె ప్రియతరుడు ఉండబోడు'' అని కూడా అంటాడు:

నచ తస్మాన్మనుష్యేషు కశ్చిన్మేప్రియ కృత్తమః।
భవితా న చమేతస్మాదన్యః ప్రియతరోభువి॥" (శ్లో-69)

భక్తికింత ప్రాధాన్యాన్ని ఇచ్చి చివరి అధ్యాయంలో కూడా చెప్పడంవల్ల, గీతోపదేశం చేసిన శ్రీకృష్ణపరమాత్మ దృష్టిలో భక్తిమార్గానికున్న విశిష్టత వ్యక్తమవుతూనే ఉంది.

గీతోపదేశం విన్న అర్జునుడు మోహంతొలగి కర్మాచరణకు ఉద్యమిస్తాడు:

"నష్టోమోహః స్మృతిర్లబ్ధ్వా త్వత్ప్రసాదాన్మయాచ్యుత ।
స్థితోఽస్మిగత సందేహ, కరిష్యే వచనం తవ॥" (శ్లో-73)

"అచ్యుతా ! నీ ప్రసాదంవల్ల మోహం (అజ్ఞానం) నష్టమైంది (పోయింది) స్మృతి కలిగింది (పొందబడింది). సందేహంపోయి ఉన్నాను. నువ్వు చెప్పినట్లు చేస్తాను (యుద్ధంచేస్తాను).''

ఇందులో ప్రయుక్తాలైన "స్మృతి'',''సందేహ'' శబ్దాలకు విశిష్టమైన అర్థం ఉందనాలి, స్మృతి లభించింది; సందేహం గతమయింది(పోయింది). స్మృతి

విషయంలో ఛాందోగ్యంలో ఇలా ఉంది. "ఆహారశుద్ధౌ సత్త్వ శుద్ధిః। సత్త్వశుద్ధౌ ధ్రువాస్మృతిః । స్మృతిలంభే సర్వగ్రంథీనాం విప్రమోక్షః॥" (ఛాందోగ్య ఉపనిషత్తు- 7-26-2) స్మృతివలన హృదయగ్రంథులు (సందేహాలు) విచ్ఛిన్నమవుతాయి. సందేహ రహితత్వం, భయరహితత్వం అనేవి రెండూ ముక్తపురుషుని విశిష్టలక్షణాలు. ముండకోపనిషత్తు "ఛిద్యంతే సర్వసంశయాః" (2-28)అన్నది. సందేహం లేనివాడు భయరహితుడవుతాడు. బృహదారణ్యకంలో "అభయం వై జనక ప్రాప్తోసి"(4-2-4)అని ఉంది. అర్జునునకు మోహం తొలగిపోయి స్మృతి కలిగినవెంటనే సందేహనివృత్తి అయింది. సందేహ నివృత్తితో భయంపోయింది. యుద్ధం విషయంలో సంశయగ్రస్తుడైన నరుడు "కరిష్యేవచనం తవ"అన్నాడు వెంటనే కృష్ణునితో-

ఈ అధ్యాయం చివర శ్రీధరస్వామి వ్రాసిన శ్లోకం ఇది-

"భగవద్భక్తియుక్తస్య తత్ప్రసాదాత్మబోధతః।
సుఖం బంధవిముక్తిః స్యాదితి గీతార్థ సంగ్రహః ॥

భగవద్భక్తియుక్తునకు ఈశ్వరప్రసాదంచేత ఆత్మజ్ఞానం లభించి సహజంగానే బంధవిముక్తి కలుగుతుంది. ఇదే గీతార్థ సంగ్రహం. శ్రీధరస్వామి భగవద్గీతకు వ్రాసిన తన సుబోధినీ వ్యాఖ్యలో - అధ్యాయ ప్రారంభంలోను, అంతంలోను ఆయా అధ్యాయాల సంగ్రహార్థం సూచించే శ్లోకాలు వ్రాశాడని మనం తెలుసుకొన్నాము. ఇది అదే! ఇలాంటివి ప్రసంగానుకూలంగా చేర్చడమూ జరిగింది.

భగవద్గీత- కర్మజ్ఞాన భక్తిమార్గాలలో దేనికి విశేషప్రాముఖ్యం ఇచ్చింది? శ్రీకృష్ణుని దృష్టిలో ఏమార్గం ఉత్తమం, ప్రశస్తం? అనే ప్రశ్నలు వేసుకొనే వివిధ సిద్ధాంతాలను లేవదీశారు. ఆచార్య పురుషులు వారి వారి అభీష్టానుసారం నిర్ణయించుకొని వ్రాశారు. ప్రస్థానత్రయంలోని మిగిలిన రెండింటి విషయంలోను ఇంతే! భగవద్గీతలోని మొదటి ఆరు అధ్యాయాలను కర్మషట్కమనీ, మధ్య ఆరు అధ్యాయాలను భక్తి (ఉపాసన) షట్కమనీ చివరి ఆరు అధ్యాయాలను జ్ఞాన షట్కమనీ పిలవడం ఉంది. ప్రసంగవశాత్ యథోచితంగా ఒక్కొక్కమార్గానికి ప్రాధాన్యంఇచ్చి చెప్పినట్లు తోస్తుంది. మూడుమార్గాలూ ఉపాదేయాలే. ఏ మార్గాన్ని చిత్తశుద్ధితో అనుసరించినా గమ్యస్థానం చేరడం తప్పదు. కొంతదూరం

విశిష్టమార్గాలలో నడిచిన తరువాత అన్నిమార్గాలూ ఒకేవిధంగా ఉంటాయి అనీ కనబడతాయి అనీ ఆధునిక యుగంలోని మహాపురుషులు వారి వారి అనుభవాలను పురస్కరించుకొని చెప్పారు. చెప్పుతున్నారు. భక్తినెవ్వరూ త్రోసిపుచ్చలేదు, ఆత్మార్పణాన్ని, శరణాగతిని కాదనలేదు. ఆదిశంకరుల దృష్టిలో జ్ఞానం ఉపేయం; భక్తి ఉపాయం. శ్రీమద్భాగవత విష్ణుపురాణాలకు టీక వ్రాసిన శ్రీధర స్వామి, భగవద్గీతకు తాను వ్రాసిన టీకలో జ్ఞానాన్ని భక్తియొక్క అవాంతర వ్యాపారంగా గ్రహించాడు. ఆధునికయుగంలోని మహాపురుషులైన శ్రీ రామకృష్ణ పరమహంస శుద్ధభక్తి, శుద్ధజ్ఞానం ఒకటే అని చెప్పుతూవచ్చినట్లు మనకు తెలుస్తోంది.

అర్జునుడు శ్రీకృష్ణునితో తనకున్న లౌకికసంబంధాల్ని పురస్కరించుకొని "ఆత్మార్పణం" మొదట చేసుకోలేకపోయాడు. ఇది ఆయనే "విశ్వరూపదర్శన" సందర్భంలో చెప్పిన మాటలవల్ల తెలుస్తుంది.

"సఖేతిమత్వా ప్రసభం యదుక్తం
హే కృష్ణ హే యాదవ హే సఖేతి
అజానతా మహిమానం తవేదం
మయాప్రమాదాత్ప్రణయేన వాపి (అధ్యా-11, శ్లో-41)

యచ్చావహాసార్థ మసత్కృతోఽసి
విహారశయ్యా సనభోజనేషు
ఏకోఽథ వాప్యచ్యుత తత్సమక్షం
తత్క్షామయే త్వామహమ ప్రమేయమ్॥ (శ్లో-42)

పితాఽసి లోకస్య చరాచరస్య
త్వమస్య పూజ్యశ్చ గురుర్గరీయాన్ ।
నత్వత్సమోఽస్త్యభ్య ధికః కుతోఽన్యో
లోకత్రయేఽప్య ప్రతిమప్రభావ॥ (శ్లో-43)

తస్మాత్ప్రణమ్య ప్రణిధాయకాయం
ప్రసాదయే త్వామహ మీశమీడ్యమ్ ।

పితేవపుత్రస్య సఖేవసఖ్యుః
ప్రియః ప్రియాయార్హసి దేవసోఢుమ్॥ (శ్లో-44)

స్వామీ! నీ మహిమను గుర్తించలేక నిన్ను సఖునిగా భావించి పొరపాటున గాని, చనువుచేతగాని-హేకృష్ణా, హేయాదవా, హేసఖా అని వినయరహితంగా పిలిచి ఉన్నందుకు, అచ్యుతా! విహారశయ్యాసన భోజనకాలాల్లోగాని, నీ ఎదుట గాని, వెనుకగాని, నువ్వు ఒక్కడివేఉన్నప్పుడుగాని లేదా ఇతరులతో ఉన్నప్పుడు గాని పరిహాసార్థంగాని నేను నీకుచేసిన అమర్యాదకు అప్రమేయుడవైన నిన్ను క్షమింప ప్రార్థిస్తున్నాను.

అప్రతిమప్రభావా! స్థావరజంగమాత్మకమైన ఈ జగత్తునకు నువ్వు స్రష్టవు. పూజనీయుడవు, గురుడవు, పెద్దవు. ముల్లోకాల్లో నీకు సములులేరు. నీకంటె అధికులెక్కడ ఉంటారు?

కనుక, దేవా! నీకు వంగిదండ ప్రణామంచేసి వందనీయుడవు, ఈశ్వరుడవు అయిన నిన్ను ప్రసన్నుడవు కావలసినదని వేడుకొంటున్నాను. తండ్రి కొడుకుయొక్క, సఖుడుసఖునియొక్క, ప్రియుడు ప్రేయసియొక్క అపరాధాలను క్షమించినట్లు క్షమించడానికి అర్హుడవు.

ఈ విధంగా అర్జునుడు శరణాగతుడై ప్రార్థించడంతో శ్రీకృష్ణుడు ఇలా అంటాడు :

"మయా ప్రసన్నేన తవార్జునేదం
రూపం పరం దర్శితమాత్మయోగాత్ ।
తేజోమయం విశ్వమనంతమాద్యం
యన్మే త్వదన్యేన న దృష్టపూర్వమ్॥" (శ్లో-47)

"అర్జునా! నేను నీకు ప్రసన్నుడనైనాను గనుకనే ఆత్మయోగశక్తి ప్రభావం వల్ల తేజోమయం, సర్వవ్యాపకం అనంతం అయిన నావిశ్వరూపాన్ని చూపించాను. నువ్వుగాక ఇంతకిపూర్వం ఇతరులెవ్వరు ఈ రూపాన్ని చూడలేదు."

తరువాత, మానుషరూపం ధరించి

"ఈ విశ్వరూప దర్శనం వేదజ్ఞానంవల్లగాని, తపస్సుచేతగాని, దానంచేతగాని, యజ్ఞంవల్లగాని లభించదు. కేవలం అనన్యభక్తివల్ల లభిస్తుంది.

నన్ను గురించిన జ్ఞానం, సాక్షాత్కారం, మోక్షం (నాలో ప్రవేశించడం) అనన్య భక్తివల్లనే లభించవి. అనన్యభక్తిమాత్రమే విశ్వరూప దర్శనం చేయించగలదు" అంటాడు:

"నాహంవేదై ర్నతపసా న దానేన న చేజ్యయా ।
శక్యఏవం విధో ద్రష్టుం దృష్టవానసి మాంయథా॥ (శ్లో-53)
భక్త్యాత్వనన్యయా శక్య అహమేవం విధోర్జున।
జ్ఞాతుం ద్రష్టుంచ తత్త్వేన ప్రవేష్టుంచ పరంతప॥ (శ్లో-54)

భగవద్గీతలో ఈవిధంగా అడుగడుగునా అనన్యభక్తివైశిష్ట్యాని యోగేశ్వరుడైన కృష్ణుడు నొక్కి చెప్తూనేఉంటాడు. ఆయన అవతార వైశిష్ట్యాన్ని గుర్తించని నరుడు, విశ్వరూపదర్శనంతో గుర్తించి శరణాగతుడవుతాడు. పాదాక్రాంతుడవుతాడు.

ఇంక "విశ్వరూపదర్శన యోగాధ్యాయం"చివర అర్జునుణ్ణి పాండవా! అని సంబోధించి కృష్ణుడు ఇలా అంటారు:

"మత్కర్మకృన్మత్పరమో మద్భక్తః సంగవర్జిత ।
నిర్వైరః సర్వభూతేషుయః సమామేతి పాండవ॥" (శ్లో-55)

"పాండవా! నాకోసం ఎవడు కర్మలుచేస్తాడో, నన్నే పరమ పురుషార్థంగా భావిస్తాడో వద్భక్తుడో సంగవర్జితుడో, సర్వభూతాలయందు శత్రుభావంలేకుండా ఉంటాడో అతడే నన్ను పొందుతాడు"—అంటాడు.

అధ్యాయాంతంలో శ్రీధరస్వామి వ్రాసిన:

"దేవైరపిసుదుర్దర్శం తపోయజ్ఞాది కోటిభిః ।
భక్తాయ భగవానేవం విశ్వరూప మదర్శయత్॥

అనే శ్లోకం—భక్తుని విషయంలో భగవంతుని కృపా విశేషాన్ని తెలుపుతుంది. "దేవతలకు, తపోయజ్ఞాది కర్మలకు సాధ్యంకాని విశ్వరూపాన్ని భగవంతుడు తన భక్తుడైన అర్జునునకు చూపించాడు."

శ్రీభగవద్గీత పరిశీలనవల్ల శరణాగతుడైన భక్తునకు భగవంతుడు ప్రసాదించని దేదీలేదని తెలుస్తుంది.

వివిధ దేవతల పేర్లతోవచ్చిన పురాణాలలో ఆయా దేవతల విశేష విషయాలన్నీ ఉండడంలో ఆశ్చర్యంలేదు. అది సమంజసంకూడా! ఆయా దేవత సర్వ దేవతాస్వరూపమనీ అందరికంటె విశిష్టత గలిగినదని చెప్పడంలోను, మన సంప్రదాయానికి విరుద్ధమైనది ఏదీలేదు. దేవీభాగవతంలో దేవి అవతార విశేషాలన్నీ చెప్పడంలోను, ఆమె జగజ్జనని ("యావిద్యా శివకేశవాది జననీ") అని వర్ణించడంలోను, శివపురాణంలో శివుని ప్రత్యేకతలను వివరించడంలోను "శివాత్పరతరం" నాస్తి అనడంలోను, విష్ణు పారమ్యాన్ని చెప్పే పురాణాలలో "సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి"అనే భావం ప్రస్ఫుటంగా కనబడడంలోను-సనాతన సంప్రదాయజ్ఞులు ఆమోదించని దేదీలేదనవచ్చును. భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ అర్జునునితో జ్ఞానయోగంలో (అధ్యాయం-4)

"యే యథామాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహమ్॥ ।
మమవర్త్మానువర్తంతే మనుష్యాః పార్థసర్వశః॥" (శ్లో-11)

అన్నప్పుడు, విపులార్థ గ్రహణంవల్ల (ఇంద్రాది దేవతలేగాక) సర్వ స్వరూపులు గతార్థులవుతారు. విభూతియోగంలో (అధ్యాయం-10)

"నాంతోఽస్తి మమ దివ్యానాం విభూతీనాం పరంతప ।
ఏషతూద్దేశతః ప్రోక్తా విభూతేర్విస్తరోమయా॥ (శ్లో-40)

"యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జితమేవవా
తత్తదేవావగచ్ఛత్వం మమతేజోంశసంభవమ్॥" (శ్లో-41)

అన్నప్పుడు సర్వదేవతా స్వరూపులు చేరిపోతారు. ఇంతమాత్రం చేత వ్యక్తి ఇష్టానిష్టాలు లేవనికాదు. పరమార్థంలో అంతా ఒకటే అనే సువిశాలభావం మనం గ్రహించాలి అని వీటి నిర్ణయం, నిశ్చితార్థం.

మత్స్య, కూర్మ, వారాహ పురాణాల పేర్లనుబట్టే వాటి నిజస్వరూపం తెలుస్తోంది. నారద, బ్రహ్మవైవర్త, పద్మ, విష్ణు భాగవత పురాణాలలో విష్ణు దేవుని మహిమాదికం, ఆధ్యాత్మిక నేపథ్యం సోపపత్తింగా వివరించడం జరిగింది.

వీటిలో చివరి నాలుగు-భారతదేశంలో వైష్ణవసంప్రదాయం యొక్క ఐతిహాసక వికాసం ఎలాజరిగిందో తెలుసుకోవడానికి బాగా పనికివస్తాయి ఈ నాలుగింటిలో బ్రహ్మ వైవర్తపురాణం - చైతన్య, వల్లభ, రాధావల్లభ వైష్ణవ సంప్రదాయాల ఆలోచనావిధానాలకు, ఆచారవ్యవహారాలకు మూలకందమయింది. దీనిలో అంతిమ ఖండం"కృష్ణజన్మఖండ". ఇది చాలా ముఖ్యమైనది. ఈ పురాణంలో రాధాకృష్ణుల వివాహంకూడా వర్ణితమయింది. ఇందులో "రాధా" శబ్దానికి వ్యుత్పత్తి రెండు విధాలుగాఉంది:

"రాధేత్యేవం సంసిద్ధా రాకారో దానవాచకః ।
స్వయం నిర్వాణదాత్రీయా సారాధా పరికీర్తితా॥"
(అధ్యాయం-15, శ్లో-228)

"రాధా" శబ్దానికి "సంసిద్ధ" అని అర్థం. అంటే "సమ్యక్‌స్థిత" అన్నమాట. అనగా "నిత్య". "రా"అంటే-దానం. 'ధా'అంటే "ఆ ధానం"చేసేది. దీనిప్రకారం ఆమె స్వయంగా నిర్వాణ దాత్రి గనుక "రాధ" అయింది.

రెండోశ్లోకం ఇలా ఉంది:

"రా చ రాసే చ భవనాద్ ధా ఏవ ధారణాదహో ।
హరే రాలింగనాదా రాత్ తేన రాధా ప్రకీర్తితా॥"
(అధ్యాయం-17. శ్లో-224)

"రా" అంటే రాసక్రీడలో స్థితి; "ధా"అంటే "ధారణ", రాసక్రీడలో ఉండడమే కాక, శ్రీకృష్ణునకు ఆలింగనం ఇయ్యడంకూడా కారణంగా ఆమెను"రాధా" అంటారు - ఈశ్లోకాల అర్థాలు రాధాకృష్ణుల యుగళార్చనకు ప్రాధాన్యమిచ్చే సంప్రదాయజ్ఞులు చెప్పేవి.

ఇంక, విష్ణుపురాణాన్ని గ్రహించి కొంత పరిశీలిద్దాము.పరిమాణంలో ఇది చిన్నదయినా, తత్త్వోన్మీలనంలో చాలా పెద్దది. భగవ ద్రామానుజులవారి సంప్రదాయంలో దీన్ని శ్రీమద్భాగవతంకంటె కొంత అధిక ప్రామాణ్యం కలదిగా గ్రహిస్తారంటే అది అతిశయోక్తి అనిపించుకోదు. భాగవతంకంటె ఇది పరిమాణంలో చిన్నది. దీనిలో 6 ఖండాలు (అంశలు) ఉన్నాయి. మొత్తం 126 అధ్యాయాలున్నాయి. దీనిలో అధ్యాత్మిక విషయాల వివేచన చాలా సరళంగా, సుగమంగా జరిగింది. 5వ అంశ (ఖండ)లో శ్రీకృష్ణుని లీలాదికవర్ణనలున్నాయి.

దీనిలో భక్తికి, యోగానికి సమప్రాముఖ్యం కనబడుతుంది. దీనిలో 6వ అంశంలో 5వ అధ్యాయంలో ఆధాత్మిక విషయాల వివేచన చాలా విశదంగా జరిగింది. ఇందు వాసుదేవుని వర్ణన ఇలా ఉంది:

"సర్వాణి తత్ర భూతాని వసంతి పరమాత్మని ।
భూతేషుచ ససర్వాత్మా వాసుదేవస్తతః స్మృతః॥"
(విష్ణుపురాణం, అంశ-6, అధ్యాయం-5-శ్లో-80)

ఈ వాసుదేవుని పొందడం ఎలాగ? స్వాధ్యాయంవల్ల, యోగంవల్ల. శాస్త్రాల శ్రవణ మననాలు స్వాధ్యాయం క్రిందికి వస్తాయి. యోగం-నిదిధ్యాసనం-వీటితోబాటు భగవానుని నామస్మరణ, కీర్తన - కూడా ముక్తికి సాయపడతాయి. విష్ణుపురాణం దృష్టిలో-యోగం, భక్తి-వీటి సముచ్చయం ముక్తిసాధనలో ముఖ్యోపాయాలు:

"అవశేనాపి యన్నామ్ని కీర్తితే సర్వపాతకైః
పుమాన్ విముచ్యతే సద్యః సింహత్రస్తైర్వృకైరివ॥
యన్నామకీర్తనం భక్త్యా విలాయన మనుత్తమమ్ ।
మైత్రేయా శేషపాపానాం ధాతూ నామివపావకః॥"
(విష్ణుపురాణం, అంశ-6-అధ్యా-8, శ్లో-19 20)

భక్తికి, శరణాగతికి విశేష ప్రాధాన్యం ఉండడంవల్ల శ్రీసంప్రదాయం వారికి 'విష్ణుపురాణం' పూర్ణంగా ఉపాదేయం అయింది. అదిగాక-సమస్త జగత్తు విష్ణువునందు ఓతప్రోతంకావడం, ఆయననుండే ఉత్పత్తికావడం, ఆయనయందే ఉండడం, ఆయనే సమస్త జగత్తు కావడం-అనే భావనలతో శ్రీసంప్రదాయానికి సన్నిహితత్వం ఉండడంవల్లకూడా 'విష్ణుపురాణం' భగవద్రామానుజులవారి సంప్రదాయంవారికి విశిష్టపురాణం అయింది:

"తత్ర సర్వమిదం ప్రోతమోతం చైవాఖిలం జగత్ ।
తతోజగత్ జగత్తస్మిన్ స జగచ్చాఖిలంమునే॥"
(అంశ-1. అధ్యా-22 శ్లో-64)

ఈ విషయాన్ని సూక్ష్మంగా "హరిరేవజగత్, జగదేవహరిః । హరితో జగతో నహి భిన్నతనుః॥"అని చెప్పవచ్చును

ఇంక పద్మపురాణాన్ని తీసుకొని పరిశీలిద్దాము. వైష్ణవ సంప్రదాయం యొక్క వ్యావహారికరూపం అర్థంచేసుకోవడానికి ఇది విశేషంగా ఉపయోగిస్తుంది. రామకృష్ణుల చరిత్ర విస్తారరూపంలో ఉందికూడా. ఈ అవతారపురుషుల విషయాలేగాక-వైష్ణవతీర్థాల, వ్రతాల విస్తృత వివరణ దీనిలో ఉంది. ఉదాహరణార్థం-ఏకాదశీ వ్రతవిధాన వర్ణన గ్రహించవచ్చును ఉత్తరఖండలోని 31వ అధ్యాయం మొదలుకొని 66వ అధ్యాయంవరకు ప్రతిమాసంలోను వచ్చేఏకాదశీమాహాత్మ్యం-ఉపాఖ్యానాలతోసహ. వర్ణితమైంది. భిన్నభిన్న మాసాలలో వచ్చే వైష్ణవవ్రతాల వర్ణనలున్నాయి చైత్రశుద్ధ ఏకాదశీ "డోలోత్సవం", ద్వాదశినాడు "దమనక మహోత్సవం, వైశాఖాది నెలలలో "దేవశయనీ" మహోత్సవం, శ్రావణంలో "పవిత్రారోపణవిధానం", కార్తికమాఘ మాసాలలో అమాసాల మాహాత్మ్యవర్ణన మొదలైనవి ఉన్నాయి. తరువాత ఊర్ధ్వపుండ్రధారణాది ఆచారవ్యవహారాల వివరణ కనబడుతాయి. వివిధావతారాల వివరణకూడాఉంది. ఈ విధంగా పద్మ పురాణం-వైష్ణవధర్మ సంబంధమైన ఆచారవ్యవహారాల్ని, స్వరూపస్వభావాల్ని, తీర్థయాత్రల్ని, వ్రతాల్నిగురించి విపులంగావర్ణించి-భక్తికున్న ప్రాముఖ్యాన్ని నిర్ద్వంద్వంగా ప్రకటించింది.

దేవదేవుని ఉత్సవాలను యథాశక్తిగా జరిపించవలసిందని పద్మపురాణం చెబుతోంది :

"యథా దామోదరో భక్తవత్సలో విదితోజనైః ।
తస్యాయం తాదృశోమాసః స్వల్పమప్యురుకారకః॥"

స్వామికి జరుపవలసిన ఉత్సవాలను ప్రతివ్యక్తి యథాశక్తిగా మాసోచితంగా జరిపించాలి.

పాపకలుషితమైన జీవితాన్నిగడిపిన వ్యక్తికూడా భగవంతుని శరణు పొందితే, భగవంతుడాతనిని రక్షిస్తాడు అని పద్మపురాణం చెప్పింది.

"సర్వాపరాధకృదపి ముచ్యతే హరి సంశ్రయః ।
హరిరప్యపరాధాన్ యఃకుర్యాత్ ద్విపదపాంశులః॥"

భక్తి ప్రాముఖ్యాన్ని ఉగ్గడించడంతోబాటు - భగవత్ ప్రసాదభక్షణం,

చరణామృతపానం పదివేల యజ్ఞయాగాది క్రతువులుచేసిన వారికివచ్చే పుణ్యాన్ని ఇయ్యగలవని పద్మపురాణవచనం–

"నైవేద్యమన్నం తులసీవిమిశ్రం విశేషతః పాదజలేనసిక్తమ్ ।
యోఽశ్నాతినిత్యం పురతోమురారేః ప్రాప్నోతియజ్ఞాయుత

"చరణామృతమ్"ను గూర్చి ప్రత్యేకంగా దానిలో ఉంది:

"నదానం నహవిర్యేషాం స్వాధ్యాయోన సురార్చనమ్ ।
తేఽపిపాదోదకం పీత్వాప్రయాంతి పరమాంగతిమ్॥"

దానధర్మాలుచేయకపోయినా, యజ్ఞయాగాదులు చేయకపోయినా వేదాధ్యయనం చేయకపోయినా భగవంతుని పాదోదకం (చరణామృతం) స్వీకరిస్తే భగవద్రాజ్యంలో ప్రవేశించే అర్హతపొందుతాడు.

శ్రీకృష్ణునకు భక్తితో ప్రణమిల్లితే సర్వపాపాలు నశిస్తాయని పద్మపురాణం అంటుంది. దీనిలో స్మరణకు ఫలితం చెప్పబడింది.

"ప్రయాణేచా ప్రయాణేచ యన్నామస్మరతాంనృణామ్ ।
సద్యోనశ్యంతి పాపౌఘా నమస్తస్మైచిదాత్మనే॥"

మరణ సమయంలోగాని జీవితకాలంలోగాని శ్రీకృష్ణుని స్మరించే వ్యక్తికి సర్వపాపాలునశిస్తాయి. కనుక, నేను దేవదేవునకు నమస్కరిస్తున్నాను.

పద్మపురాణము-వైష్ణవుడెట్లు తన దేహాన్ని అలంకరించుకొని విష్ణుభక్తునిగా లోకులకు తెలియజేయాలో ఇలా వివరించింది:

"యేకంఠలగ్నతులసీ నలినాఖ్యమాల
యేబాహుమూల పరిచిహ్నితశంఖచక్రాః
యేవాలలాటఫలకే లసదూర్ధ్వపుండ్రాః
తేవైష్ణవాభువన మాశుపవిత్రయంతి॥"

మెడలో తులసిమాలలను, బాహుమూలలలో శంఖ చక్రాది చిహ్నాలను,

నుదట దేహంమీద ఊర్ధ్వపుండ్రాలను ధరించినవారిని ఈ భువనంలో విష్ణుభక్తులుగా గురించాలి. వారు లోకాన్ని వెంటనే పవిత్రం చెయ్యగలరని దీనిస్థూలార్థం.

వైష్ణవుడు అన్యదేవతల భక్తుడు కాకపోయినను ఇతరదేవతలను గౌరవించాలని పద్మపురాణం ఇలా చెప్పింది:

"హరిరేవసదాఽఽరాధ్యః సర్వదేవేశ్వరేశ్వరః ।
ఇతరేబ్రహ్మరుద్రాద్యా నావజ్ఞేయాఃకదాచన॥"

హరియే దేవదేవుడు. ఆయన్నే సదా ఆరాధించాలి. కాని, ఇతరులైన బ్రహ్మరుద్రాదులను ఎన్నడు నిరాదరించరాదు. అనే ఉన్నతాశయాన్నికూడా వివరించింది-పద్మపురాణం.

"గరుడపురాణం" శ్రవణంయొక్క ప్రాముఖ్యాన్ని చక్కగా నిరూపించింది. సంసార సర్పదష్టుడైనవ్యక్తి అచేతనుడై పడిఉన్నప్పుడు కృష్ణమంత్ర శ్రవణంవల్ల ముక్తుడవుతాడు-అంది.

"సంసారసర్పసందష్ట నష్టచేష్టైక భేషజమ్ ।
కృష్ణేతివైష్ణవమంత్రం శ్రుత్వాముక్తోభవేన్నరః॥"

హరికి ఆత్మార్పణం చేసుకొన్నవ్యక్తికి స్వర్గద్వారాలు తెరుచుకొంటాయి అనీ, మోక్షంలభిస్తుందనీ "స్కందపురాణం"అంటుంది.

హరిముద్దిశ్యయత్కించిత్కృతం విజ్ఞాపనంగిరా ।
మోక్షద్వారార్గలా మోక్షస్తేనైవ విహిత స్తవ॥"

స్కందపురాణంలోనే, భక్తులైనవారు మూడువిధాలుగా శరణాగతులు కావచ్చునని ఉన్నది మొదటిది-సంప్రార్థనాత్మిక శరణాగతి- అనగా ప్రార్థనారూపంలో మనఃపూర్వకంగా శరణాగతి చేసుకోవడం; రెండోది- దైన్యబోధక శరణాగతి- తన దీనస్థితిని విన్నవించుకొనే శరణాగతి; మూడోది- లాలసమయీ శరణాగతి-ఒక ఉన్నతస్థితిని అభిలషిస్తూ చేసే శరణాగతి అనగా ఆధ్యాత్మిక జీవనంలో ఒక ఉత్తమస్థితిని కోరడం అన్నమాట. దేవదేవునితో తనకు పూర్వమున్న సంబంధాన్ని కోరడం ఉంటుంది గనుక- కృష్ణునకు చెలికానిగానో, సేవకునిగానో,

ప్రేయసిగానో, తండ్రిగానో, తల్లిగానో – వెనుక జన్మలలో భావించిన భావనలు– దీనికి లాలసమయీ శరణాగతి అన్నారు. దీనికి స్వరూపసిద్ధి అనికూడా పేరుంది ముక్తియొక్క పరిణత దశలో లభించేది ఇది.

వీటికి పద్మపురాణంలో మంచి ఉదాహరణ శ్లోకాలున్నాయి. యువకులు యువతులను, యువతులు యువకులను సహజంగా ఎలా ప్రేమిస్తారో, అదేవిధంగా సహజసిద్ధమైన ఆకర్షణ నీ పాదారవిందాలయందు కలుగునట్లు అనుగ్రహించు అని శరణాగతి సంప్రార్థనాత్మక శరణాగతి :

"యువతీనాం యథాయూని యూనాం చ యువతౌ యథా।
మనోఽభి రమతేతద్వన్మనో మే రమతాం త్వయి॥"

ఈ పురాణంలోనే దైన్యావబోధక శరణాగతికికూడా దృష్టాంతం ఉంది. ఓ భక్తుని విలాపం ఇది నాకంటె పాతకుడు ఇంకోడులేడు. నాకంటె అపరాధియు ఇంకోడులేడు. నా పాపాల్ని, అపరాధాల్ని నీకు విన్నవించుకోవడానికి సిగ్గుపడుతున్నాను– అంటాడు.

"మత్తుల్యోనాస్తి పాపాత్మా నాపరాధీచ కశ్చన।
పరిహారేఽపిలజ్జా మే కిం బ్రువే పురుషోత్తమ॥"

ఇంక లాలసమయీ శరణాగతికి నారదపాంచరాత్రంలో ఒక దృష్టాంతం లభిస్తుంది ఒక భక్తుడు స్వయంగా దేవదేవునకు వింజామర వేయాలని కోరుకొంటున్నాడు. ఈ పని చేయాలంటే దేవదేవునకు అత్యంత సన్నిహితుడు కావాలి ఆ భక్తుడు. ఆ స్థానాన్ని లభింపజేయాలని దేవదేవుణ్ణి ఈ లాలసభావంతో వేడుకొంటున్నాడు :

"కదా గంభీరయా వాచా శ్రియా యుక్తో జగత్పతే।
చామరవ్యగ్రహస్తం మామేవం కుర్వితి వక్ష్యసి॥"

ఈ నారద పాంచరాత్రంలోనే భక్తుని ఇంకో కోరికను తెలియజేసే ఈ శ్లోకం ఉంది. పుండరీకా! యమునా నదీ తీరంలో నీ దివ్యనామాన్ని జపిస్తూ ఆనంద బాష్పాలతో పిచ్చివానిలా నర్తించేరోజు ఎప్పుడువస్తుందో అంటాడు ఒక భక్తుడు.

"కదాఽహం యమునాతీరే నామానితవ కీర్తయన్।
ఉద్బాష్పః పుండరీకాక్ష! రచయిష్యామి తాండవమ్॥

ఈ విధంగా లాలసముఖ అయిన శరణాగతి వివిధ పురాణాదులలో వర్ణిత మైనది. 'నారదపాంచరాత్రం'లో "నేను- సాలోక్య, సారూప్యాదులను కోరను, నీ నిత్య కైంకర్య కార్యంలో నేను నిమగ్నుణ్ణి అయ్యేలా వరం ప్రసాదించు" అని భక్తుడు కోరినట్లుంది.

"ధర్మార్థ కామ మోక్షేషు నేచ్ఛామమ కదాచన
త్వత్పాదపంకజ స్యాధో జీవితం దీయతాం మమ।
మోక్ష సాలోక్య సారూప్యాన్ ప్రార్థయే న ధరాధర
ఇచ్ఛామిహి మహాభాగకారుణ్యం తవ సువ్రత॥"

నృసింహపురాణంలో నృసింహావతారమూర్తియే ఇట్లన్నట్లున్నది. "నన్నే స్తుతించి నాకు శరణాగతుడైనవాడు నా పరివారంలో చేరతాడు. నేనే ఆ భక్తుణ్ణి సమస్త దుఃఖాలనుండి కాపాడుతాను. ఉద్ధరిస్తాను."

"త్వాం ప్రపన్నోఽస్మి శరణం దేవదేవ! జనార్దన!
ఇతి యఃశరణం ప్రాప్తస్తం క్లేశాదుద్ధరామ్యహమ్॥"

త్రికరణశుద్ధిగా భగవంతుని శరణాగతి పొందినవ్యక్తి నిశ్చింతగా దివ్యానందాన్ని పొందుతాడు అని "హరిభక్తవిలాసం"లో ఉంది.

"తవాస్మీతివదన్ వాచాత థైవమనసా విదన్
తత్స్థాన మాశ్రిత్య స్తన్వా మోదతే శరణాగతః॥"

ఈ విధముగా వివిధపురాణాలలో శరణాగతి వైశిష్ట్యం వర్ణితమైఉంది. భక్తి విషయంలో ప్రాతఃస్మరణీయమైన శ్రీమద్భాగవతంలో-అడుగడుగునా శరణాగతి చేసి తరించిన భక్తుల కథలు కనబడుతూనే ఉంటాయి. రామాయణాన్ని దీర్ఘ శరణాగతి అన్నట్లు శ్రీమద్భాగవతం విషయంలోను చెప్పవచ్చును. అయితే- ఇందు వివిధావతారాల ప్రసక్తి రావడంవల్ల, ఆ యా అవతారాలను భక్తితో కొలి చినవారు, శరణాగతి పొందినవారు ఉంటారు. అవతారాలన్నీ దేవదేవునివే గనుక ఆయనకే భక్తులందరు శరణాగతిరూపంలో తమ్ముతాము ఆత్మనివేదన చేసు

కొన్నట్లు గ్రహించాలి. ఈ అవతారాలలో కృష్ణుని వైశిష్ట్యం (కృష్ణస్తు భగవాన్ స్వయం) ఉందిగనుక, దశమస్కంధంలో ఈ శరణాగతి ప్రాభవం అధికంగా గోచరిస్తుంది. నవవిధ భక్తులకు ఉత్తమోదాహరణలు ఇందున్నాయి.

పురాణాలలో శ్రీమద్భాగవతమ్ ప్రఖ్యాతి ప్రచారం తెలియనివారులేరు. సంస్కృతభాగవతం ఏవిధంగా విశ్వజనీనమైనదో అదేవిధంగా పోతన విరచిత తెలుగు భాగవతం యావదాంధ్ర జనసందోహానికి పఠనీయగ్రంథం అయింది. చదువుకొన్న తెలుగువారిలో పోతన భాగవతంలోని ఒక పద్యమైనా నోటికి రాని తెలుగువాడుండడు అంటే అది అతిశయోక్తి అనిపించుకోదు. వివిధ వేదాంత సిద్ధాంతాలను ప్రతిపాదించిన ఆచార్యపురుషులు, వారి శిష్యులు శ్రీమద్భాగవతాన్ని భక్తి గౌరవాలతో ప్రస్తుతించారు.

పద్మపురాణాదులు భాగవత వైశిష్ట్యాన్నిగురించి చెప్పాయి. దీనిలోని ద్వాదశస్కంధాలు శ్రీకృష్ణపరమాత్మ దేహభాగాలుగా, దశమస్కంధంలోని రాసపంచాధ్యాయి ఆయన పంచప్రాణాలుగా రూపింపబడ్డాయి. "ఓం నమో భగవతే వాసుదేవాయ" అనే వాసుదేవ ద్వాదశాక్షరికి దీనితో సంబంధంచూపించారు. "ఓం" ప్రణవం ప్రథమస్కంధం అని, "నమః" అనేది ద్వితీయ, తృతీయ స్కంధాలని, "భగవత్" అనేది- చతుర్థ, పంచమ, షష్ఠ, సప్తమ స్కంధాలని, "వాసు" అనేది అష్టమ, నవమస్కంధాలని, "దేవ"అనేది దశమ, ఏకాదశస్కంధాలని. విభక్తి ద్వాదశస్కంధమని పెద్దలు నిర్ణయించారు. "కౌశిక సంహిత"లో- ఇతర పురాణాలలో చెప్పినదానికంటె కొంత విశేషంగా శ్రీమద్భాగవత ప్రశంస కనబడుతుంది. దీనిలోని కొన్నిశ్లోకాలను గ్రహిద్దాము:

"ఐహికాముష్మిక సుఖం శ్రీమద్భాగవత శ్రుతేః।
సాత్త్వికాశ్చ భవేద్విప్రా భక్తిశ్శ్రద్ధాపురస్సరమ్॥

గాయత్రీభాష్య భూతోఽసౌవేదార్థ పరిబృంహితః।
అర్థోయం బ్రహ్మసూత్రాణాం భారతార్థ వినిర్ణయః॥

పురాణానాం సామరూపః సాక్షాద్భగవతోదితః।
గ్రంథోఽష్టాదశ సాహస్ర శ్రీమద్భాగవతాభిధః॥

దీని తరువాతి శ్లోకంలో భాగవతాన్ని కల్పవృక్షంతో పోల్చి వర్ణించడం జరిగింది.

"సద్బీజః ప్రణవాంకురో రవిమితస్కంధైర్యుతః కల్పవృట్
పంచత్రి త్రిమితాః శభాశ్రివసుభూః శాఖాః ప్రశాఖాస్తథా
శూన్యాకాశ భషడ్గరీమ సమితాః పత్రాణియస్య స్ఫుటం
సశ్రీ భాగవతాహ్వ ఇష్టఫలదో భక్త్యర్థితో రాజతే॥"

దీనికి- పరమాత్మయే బీజం; ఓంకారం అంకురం. ఇది 12 స్కంధాలతోను; 12 పెద్దకొమ్మలతోను; 335 అధ్యాయాలనే శాఖలతోను, 18,000 శ్లోకాలనే రెమ్మలతోను; 5,76,000 అక్షరాలనే ఆకులతోను వేద కల్పవృక్షంలా విరాజిల్లుతోంది.

దీని తరువాత భాగవతశబ్దార్థ విచారం చేసిన శ్లోకం ఉంది:

"భా"శబ్దో కీర్తివచనో, "గ"శబ్దో జ్ఞానవాచకః।
సర్వేష్ట వచనో "వ"శ్చ, "తో"విస్తారస్య వాచకః॥

ధర్మార్థ కామ మోక్షాంశ్చ ముక్తివర్గ చతుష్టయీ।
తేప్రాప్యంతే యతోఽనేన తస్మాద్భావగతం స్మృతమ్ ॥

వీటి తరువాత శ్లోకాలలో శ్రీకృష్ణుని దేహభాగాలతో స్కంధాలను సమన్వయ పరిచారు.

పాదాదిజానుపర్యంతం ప్రథమస్కంధ ఈరితః।
తతోర్ధ్వం కటిపర్యంతం ద్వితీయస్కంధ ఉచ్యతే॥

తృతీయోనాభిరిత్యుక్తః చతుర్థముదరం మతం।
పంచమో హృదయం ప్రోక్తం షష్ఠఃకంఠం సబాహుకమ్॥

సర్వలక్షణ సంయుక్తం సప్తమోముఖ ముచ్యతే।
అష్టమ శ్చక్షుషీవిష్ణోః నవమోశ్రుకుటిః పరః॥

దశమో బ్రహ్మరంధ్రం చ మన ఏకాదశస్మృతః।
ఆత్మాతు ద్వాదశస్కంధః శ్రీకృష్ణస్య ప్రకీర్తితః॥

ఈ శ్లోకాల తరువాత ఫలశ్రుతిలా కొన్ని శ్లోకాలున్నాయి. వాటిలో ముఖ్యమైనవి కొన్ని-

జీవన్ముక్తో న సందేహో జాయతే శ్రుతిమాత్రతః।
తస్మాదేషా సదాశ్రావ్యా శ్రీమద్భాగవతీకథా॥

కలౌనాస్తి కలౌనాస్తి శ్రీమద్భాగవతం వినా।
శ్రేయసాం నిగమః శ్రేష్ఠోవిద్యతే జగతీతలే॥

సర్వధర్మాన్ పరిత్యజ్య శ్రీమత్ భాగవతం నరైః।
సేవనీయం ప్రయత్నేన నధర్మోఽస్తి తతః పరమ్॥

పురాణాలలో శ్రీమద్భాగవతానికి ఇచ్చిన ప్రత్యేకస్థానం వీటివల్ల మనకు తెలుస్తుంది.

శ్రీమద్భాగవతంలో - శ్రీవైష్ణవ సంప్రదాయంలో ప్రచారానికి వచ్చిన శరణాగతిరూపమైన భక్తిప్రతిపాదన స్పష్టంగా కనబడకపోయినా, ఆయా భక్తుల ఆర్తినివ్యక్తంచేసే ఘట్టాలలో ఆత్మసమర్పణ కొంత కనబడుతుంది. శ్రీమద్భాగవతం స్తోత్రాలసంపుటి వంటిది. ఇంచుమించుగా ప్రతి స్కంధంలోను భక్తుని మొర వినబడుతూనే ఉంటుంది అనవచ్చును భాగవతం ప్రథమస్కంధంలో కుంతీ స్తుతి, భీష్మస్తుతి సుప్రసిద్ధాలు. ఇదేవిధంగా- గజేంద్రమోక్షణ కథలోని గజేంద్రుని స్తుతి జగత్ప్రసిద్ధం. ఇవిగాక-దశమస్కంధంలోని అక్రూరాదుల స్తోత్రాలు, గోపికా గీతలు, భ్రమరగీతలు భక్తిమార్గవైశిష్ట్యాన్ని తెలిపేవే! ఇవిగాక ప్రాసంగికంగా ఆర్తభక్తులు - గర్భస్థుడైన పరీక్షిత్తు మొదలుకొని గజేంద్రునివరకు గల వారందరుచేసే స్తోత్రాలు వారి శరణాగతిని చెప్పకయే చెప్పుచున్నవి వ్యాసభాగవతాన్ని తెలుగులోనికి తెచ్చిన పోతనామాత్యుడు మహాకవి మహాభక్తుడు కావడం వల్ల తెలుగుకవి పద్యాలు కొన్నికొన్నిచోట్ల ఉదాహరణార్థం ఇయ్యడం సముచితమని భావించాను. సప్తమస్కంధంలోని ప్రహ్లాదచరిత్ర ఆత్మార్పణకు పరాకాష్ఠ. ఆర్తులుకాని భక్తులు కొందరు చరిత్రప్రసిద్ధులు కాకపోయినా సుదాముడు మొదలైనవారు చేసిన స్తుతులు- ముఖ్యంగా పోతనగారి తెలుగుపద్యాలలో- విశేషప్రచారానికి వచ్చినవి కొన్నిఉన్నాయి. "శుకయోగి యేమిటికి భాగవతం బభ్యసించె"

అనే శౌనకుని ప్రశ్నకు సూతుడుచెప్పిన సమాధానంవంటివి కొన్ని భక్తివైశిష్ట్యాన్ని తెలిపేవి ఉన్నాయి. వాటినికూడా లఘువుగా పరిశీలించవలసి ఉన్నది.

కుంతీస్తుతి గంభీరంగా సాగింది. కృష్ణుడు తమ కుటుంబానికిచేసిన మేళ్లను ప్రస్తావించింది. ఆయనకు కృతజ్ఞతలు చెప్పింది. కాని, మొట్టమొదట - సకల భూతాంతర్యామివైన నిన్ను చర్మచక్షువులు చూడలేవు. ప్రకృతికి నువ్వులోబడిన వాడవుకావు. నువ్వు ఆద్యపురుషుడవు నీకు నమస్కారం- అంటుంది:

నమస్యేపురుషం త్వాద్యమీశ్వరం ప్రకృతేః పరమ్।
అలక్ష్యం సర్వభూతానామంతర్బహి రవస్థితమ్ ॥
(భాగవతం–ప్రథమస్కందం-అష్టమాధ్యాయం-శ్లో-18)

తరువాత భక్తియోగ వైశిష్ట్యాన్ని తెలుపుతూ ఇలా అంటుంది.

"తథా పరమహంసానాం మునీనా మమలాత్మనామ్।
భక్తియోగ విధానార్థం కథం పశ్యేమహిస్త్రియః॥ (శ్లో-20)

పరమహంసలు, మునులుకూడా నీ స్వరూపాన్ని పూర్తిగా తెలుసుకోలేరు. అలాంటివారికి భక్తియోగం నేర్పడానికే నీ అవతారం. ఇంక నావంటి స్త్రీలు నిన్నెలాగ తెలుసుకోగలరు. కనుక నేను నీకు నమస్కారం మాత్రం చేస్తాను. అని చెప్పి, కృష్ణుని కుటుంబదృష్ట్యా కీర్తించింది.

"కృష్ణాయ వాసుదేవాయ దేవకీనందనాయ చ।
నందగోపకుమారాయ గోవిందాయ నమోనమః॥ (శ్లో–21)

నమః పంకజనాభాయ నమః పంకజమాలినే।
నమః పంకజనేత్రాయ నమస్తే పంకజాంఘ్రమే॥ (శ్లో-22)

ఈ రెండుశ్లోకాలు కేవలం భక్తిని వ్యక్తంచేసినవే! భగవంతుని నామాలను గుదిగుచ్చి ప్రార్థనచేయడం సహజమేగదా!

ఈ సందర్భంలో ఆమె తన స్తుతిని ఈవిధంగా ముగిస్తుంది:

"శ్రీకృష్ణ కృష్ణసఖ వృష్ణ్యృషభావనీధ్రు
గ్రాజన్య వంశదహనా నపవర్గవీర్య

గోవింద గోద్విజసురార్తిహరావతార
యోగీశ్వరాఽఖిలగురో భగవన్నమస్తే॥ (శ్లో-44)

దీనికి పోతనామాత్యుని అనువాదాన్ని లేదా అనుసరణాన్ని పరిశీలిస్తే తెలుగుకవి విశిష్టత బోధపడుతుంది.

"శ్రీకృష్ణా! యదుభూషణా! నరసఖా! శృంగారరత్నాకరా!
లోకద్రోహి నరేంద్రవంశదహనా! లోకేశ్వరా! దేవతా
నీక బ్రాహ్మణ గోగణార్తిహరణా! నిర్వాణ సందాయకా!
నీకున్ మ్రొక్కెద ద్రుంపవే భవలతల్ నిత్యానుకంపానిధీ!"

శరతల్పగతుడై, ఉత్తరాయణాన్ని ప్రతీక్షిస్తూఉన్న భీష్మదర్శనానికి కృష్ణద్వితీయుడై ధర్మరాజు వెళ్ళినప్పుడు ఆ పితామహుడు పరమాత్మ అయిన శ్రీకృష్ణుని స్తుతిస్తాడు. ఇది కూడా చాలా ప్రసిద్ధం.

ఈ సందర్భంలో పోతన రచన-తెలుగువారికి చాలా ప్రియమైనది, భీష్ముని మానసిక స్థితిని చక్కగా తెలిపేది.

"ఆలాపంబులుమాని చిత్తమునమనీషాయత్తముంజేసి దృ
గ్జాలంబున్ హరిమోముపైఁ బఱపి తత్కారుణ్య దృష్టిన్విని
ర్మాలీ భూత శరవ్యథానిచయుఁడై మోదించి భీష్ముఁడు సం
శీలంబొప్ప నుతించెఁగల్మష గజశ్రేణీహరిన్ హరిన్"

వచనం- "ఇట్లు పరమేశ్వరుండైన హరియందు నిష్కాముండై ధారణావతియైన బుద్ధిని సమర్పించి, పరమానందంబు నొంది, ప్రకృతివలన నైన సృష్టి పరంపరలఁ బరిహరించు తలంపున మందాకినీ నందనుం డిట్లనియె." (పోతన-1-9-215, 216)

"త్రిభువన కమనం తమాలవర్ణం
రవికర గౌరవరాంబరం దధానే।
వపురలకకులావృతాననాబ్జే
విజయసఖే రతిరస్తుమేఽనవద్యా॥"వ్యాస భాగవతం (1-9-33)

పోతనామాత్యుని పద్యం ఇది:

"త్రిజగన్మోహన నీలకాంతి తనువద్దీపింపఁ బ్రాభాతనీ
రజబంధు ప్రభమైన చేలముపయిన్ రంజిల్లనీలాలక
వ్రజ సంయుక్త ముఖారవిందమతి సేవ్యంబై విజృంభింప మా
విజయుం జేరెడువన్నెలాఁడు మది నావేశించునెల్లప్పుడున్"

తెలుగుపద్యంలోని "మా విజయుం జేరెడు" అనే దానిలోని "మా" శబ్దం సొగసు, "వన్నెలాఁడు" అని కృష్ణునకు వాడిన సాభిప్రాయ ప్రయోగం మూలంలో కన బడవు.

ఈ ఘట్టంలో- భీష్ముడు తనను చంపడానికి కోపంతో వస్తూఉన్న యుద్ధ భూమిలోని కృష్ణునిరూపాన్ని వర్ణించి- ఆ దేవదేవుడే నాకు దిక్కు అన్నప్పుడు పోతనమహాకవి వ్రాసిన పద్యం తెలుగువారికతి ప్రియమైనది.

"కుప్పించి యెగసినఁగుండలంబులకాంతి, గగన భాగంబెల్ల
గప్పికొనఁగ
నుఱికిన నోర్వక యుదరంబులోనున్న జగముల వ్రేఁగున
జగతి ఁగదల
జక్రంబుఁజేపట్టి చనుదెంచు సమయమునఁ బైనున్న పచ్చని
పటముజాఱ
నమ్మితి నీలావునగుఁబాటు సేయక మన్నింపుమని క్రీడి
మఱలఁ దిగువఁ

గరికి లంఘించు సింహంబు కరణి మెఱసి
"నేడు భీష్మునిఁ జంపుదు నిన్నుగాతు
విడువు మర్జున!" యనుచు మద్విశిఖవృష్టిఁ
దెరలి చనుదెంచు దేవుండు దిక్కునాకు" (పద్యం-221)

మూలంలో చివరిపాదం "సభవతు మే భగవాన్ గతిర్ముకుందః". అని మాత్రమే

ఉంది తెలుగుపద్యంలో నాటకీయమైన ఒక దృశ్యచిత్రణ ఉంది స్తుతిలో చివరి శ్లోకంగా ఇది ఉంది-

"తమిమ మహమజం శరీర భాజాం
హృదిహృది ధిష్ఠితమాత్మ కల్పితానామ్।
ప్రతిదృశమివ నైక ధార్కమేకం
సమధిగతోఽస్మి విధూతభేదమోహః॥ (శ్లో-43)

తెలుగుమహాకవి పోతన పద్యం జనామోదాన్ని పొందిన క్రిందిది :

"ఒక సూర్యుండు సమస్తజీవులకుఁ దానొక్కొక్కఁడై తోఁచు పో
లికనే దేవుఁడు సర్వకాలము మహాలీలన్ నిజోత్పన్నజ
న్యకదంబంబుల హృత్సరోరుహములన్ నానావిధానూనరూ
పకుఁడై యెప్పుడునుండునట్టి హరినే ప్రార్థింతు శుద్ధుండనై"
(పద్యం-225)

అష్టమస్కంధంలోని గజేంద్రుని దీనాలాపాలతో కూడినస్తోత్రం- తెలుగు వారికందరికీ-ఇంచుమించుగా-కంఠస్థమైఉన్నదే. ఈ కరిని మకరి పట్టినప్పుడు మొట్టమొదటనే భగవంతుని రక్షింపుమని ప్రార్థించలేదు. పురుషప్రయత్నంచేసి అదివ్యర్థమని తెలిసిన తరువాత శరణాగతి చేశాడు గజేంద్రుడు. గజేంద్రమోక్షణం లోని పోతన పద్యాలు ఎంతప్రసిద్ధం అంటే, కష్టకాలంలో, విషయం తెలిసిన తెలుగువారు తమకు కష్టాలువచ్చినప్పుడు వాటిని చదువుకొని భగవంతుని శరణు పొందుతారు. సుప్రసిద్ధ వైష్ణవాదార్యులు, మహాకవులు అయిన కవితార్కిక సింహ వేదాంత దేశికులవారు "అడైక్కలప్పత్తు" అనే పేరున్న పాశురాల ప్రబంధంలో ఒకదానిలో "కాక-విరాక్కదర్-మన్నర్కాదలి-కత్తిరబందు-నాగ-మర-నయన్ ముదలా........"అని శరణాగతిచేసిన భక్తులపేర్లు - కాకాసురుడు, విభీషణుడు, ద్రౌపది, పుండరీకుడు, గజేంద్రుడు, శివుడు, బ్రహ్మ అంటూ పేర్కొన్నారు. ఈ భక్తులలో దుర్మార్గుడైన కాకాసురుడు ఒకడు. శరణాగతిపొందినవాడు సన్మార్గ గామికానక్కరలేదు. గత్యంతరంలేక-కాకాసురునిలాగ-శరణుపొందినా పరమేశ్వ రుని అనుగ్రహం లభిస్తుంది

ముని శాపవశంచేత కరిగా జన్మించిన గజేంద్రుడు పూర్వజన్మలో ఇంద్ర

ద్యుమ్నుడనేరాజు. ద్రవిడాధీశుడు. ("ద్రవిడాధీశుఁడతండు పుణ్యాతముఁడింద్ర ద్యుమ్ననాముండు") కరిగా జన్మించినా, జన్మాంతర సంస్కారం ఉంది పోలేదు. దీనిని కవి వ్యక్తంచేశాడు. గజేంద్రుడు తాను తన "కరేణుసముదయంబును", "తెలంగుదప్పి తొలంగుడు వడి" పోయారు. ఈ దారితప్పడానికి కారణం "యూశ్వరాయత్తంబైన చిత్తంబు సంవిత్తంబు గాకుండుట". సరసిలో దిగి దాని నల్లకల్లోలంచేస్తూ ఉండగా, "బాను గబళించి పట్టుస్వర్భానుపగిది, నాక్రమక రేంద్రుఁ డిభరాజు నాడిని పట్టె". పట్టిన వెంటనే విడిపించుకోవడానికి తన ప్రయత్నం మానక- "రాత్రులు సంధ్యలు, దివసంబులు, సలిపెన్ బోరాక్ర వేయిసంవత్సరముల్". దాని తరువాతకూడా తాను విడిపించుకోలేనని గ్రహించి "పూర్వపుణ్యఫల దివ్యజ్ఞాన సంపత్తితో" పరమేశ్వర ధ్యానం ప్రారంభించాడు. శరణాగతి చేశాడు.

"ఎవ్వనిచే జనించుజగమెవ్వనిలోపల నుండులీనమై
యెవ్వనియందు డిందుఁబరమేశ్వరుఁడెవ్వఁడు మూలకారణం
బెవ్వఁడనాది మధ్యలయుఁడెవ్వఁడు, సర్వముదానయైనవాఁ
డెవ్వఁడు, వాని నాత్మభవునీశ్వరు నే శరణంబువేడెదన్"
(స్కంధం-8 అధ్యాయం-3, పద్యం-73)

ఈ విధంగా అతనిలో అనుకూల్య సంకల్పం కలిగింది. ప్రార్థన కొనసాగిస్తూ-

"లోకంబులు లోకేశులు
లోకస్థులుఁ దెగినఁదుది నలోకంబగు పెం
జీఁకటి కవ్వల నెవ్వం
డేకాకృతి వెలుఁగు నతనినే సేవింతున్॥" (పద్యం-75)

అన్నాడు. కాని-"నిపుణుఁడైన వాని నిష్కర్మతకు మెచ్చు, వానికే నొసర్తు వంద నములు" అని భగవంతుడు నిష్కర్మతను మెచ్చుననుకోవడంతో కొంత ప్రాతి కూల్య భావం కనబడింది. శరణాగతి బలంతగ్గింది. ఇంతటితో దాలదన్నట్లు "కలఁడు కలండనెడువాఁడు గలడోలేఁడో" అనే సంశయాన్ని వెలిబుచ్చాడు. కాని తిరిగి భక్త్యుదేకంతో "శాశ్వతుఁ బ్రహ్మ ప్రభు, నీశ్వరు నిం బరమ పురుషునే సేవింతున్'' అని నిర్ణయించుకొని,

"తనమనంబున నగ్గజేంద్రుఁడీశ్వర సన్నిధానఁబుఁగల్పించుకొని"

"లావొక్కింతయులేదు, ధైర్యము విలోలంబయ్యెఁ బ్రాణంబులున్
ఠావుల్ తప్పెను, మూర్ఛవచ్చెఁ దనువున్ డస్సెన్,
శ్రమంబయ్యెడిన్,
నీవే తప్ప నితఃపరం బెఱుఁగ, మన్నింపన్ దగున్ దీనునిన్
రావే యీశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా"
(పద్యం-90)

అని వేడుకోవడంతో- తన కర్తృత్వ భావాన్ని విడిచిపెట్టి అన్నమాట- స్వామి కరుణ కలిగింది. "నీవే తప్ప నితఃపరం బెఱుఁగ'' అనడంలో- గజేంద్రుని అనన్యగతికత్వం, అకించనత్వం- వ్యక్తమయ్యాయి. ఆత్మసమర్పణం జరిగింది. వెంటనే స్వామి "ఆపన్న ప్రపన్నుండు'' గనుక, "విహ్వల నాగేంద్రము'' పాహి పాహి "యనఁగుయ్యాలించి సంరంభియై", "గజప్రాణావనోత్సాహియై'' వచ్చి "కరుణాసింధుఁడు శౌరివారి చరమున్ ఖండింపఁగా బంపె........ చక్రమున్". ఈ వృత్తాంతంలో సామాన్యంగా భక్తునకు కలిగే శంకాదికాన్ని సూచించి, భక్తుడు గజేంద్రుడు చిట్టచివరికి "రావే కరుణింపవే, తలఁపవే శరణార్థిని నన్నుఁగావవే" అని "త్వమేవ శరణం మమ" అన్నప్పుడు, శ్రీమన్నారాయణుడు వచ్చి రక్షించడం- "శరణాగతి" సౌలభ్యాన్ని, ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది.

సప్తమ స్కంధంలోని ప్రహ్లాదచరిత్ర శరణాగతి తత్త్వాన్ని స్పష్టంగా, నిర్దుష్టంగా తెలియజేస్తోంది. గజేంద్రునిలోని సంశయంలేదు. నారదముని ఉపదేశం వల్ల గర్భస్థుడై ఉండగానే, ఆయనలో భగవద్భక్తి కలిగి అనుకూల్య సంకల్పం ఏర్పడింది. ప్రహ్లాదుడు "వాసుదేవునియందు సహజసంవర్ధమాన నిరంతర ధ్యాన రతుఁడు". దీనివలన అతడు "నిత్యపరిపూర్ణుఁడగుచు నన్నియును మఱచి జడత లేకయు నుండును జడుని భంగి" ప్రహ్లాదుడు-"సంతత శ్రీనారాయణ పాదపద్మ యుగళీ చింతామృతా స్వాదసం ధానుండై మఱచెన్ సురారి సుతుఁడేత ద్విశ్వ మున్". దీనినిబట్టి అతడు సంపూర్ణంగా ఆత్మన్యాసం-ఆ పరమాత్మలో చేయగలిగినాడని తెలుస్తోంది. తాను పరమేశ్వరుడైన శ్రీమన్నారాయణునియందు మనస్సు చేర్చి, తనను తన మార్గమునకు త్రిప్పాలని ప్రయత్నించే తండ్రికి ఇలా చెప్పుతాడు :

"తత్సాధుమన్యేஉసురవర్య దేహినాం
సదా సముద్విగ్న ధియామస ద్గ్రహాత్ ।
హిత్వాత్మపాతం గృహ మంధకూపం
వనంగతో యద్ధరి మాశ్రయేత ॥" (వ్యాసభాగవతం-7-5-5)

పోతన భాగవతంలో ఇలా ఉంది (7-5.142)

"ఎల్ల శరీరధారులకు నిల్లను చీఁకటి నూతిలోపలం
ద్రెళ్ళక వీరు మేమను మతి భ్రమణంబున భిన్నులై ప్రవ
ర్తిల్లక సర్వమున్నతని దివ్య కళామయమంచు విష్ణు నం
దుల్లముఁజేర్చితారడవి నుండుటమేలు నిశాచర్గా గ్రణీ."

ఇంత నిశ్చలభక్తి కలవాడు గనుకనే ప్రాచీన భక్త పరంపరను చెప్పే టప్పుడు- నారదునికంటే ముందే- ప్రాతఃస్మరణీయుడయ్యాడు ప్రహ్లాదుడు- "ప్రహ్లాద నారద పరాశర పుండరీక...." అనే పరమ భాగవతులను స్మరించే శ్లోకంలో.

గజేంద్రమోక్షణ కథలోని తెలుగు పద్యాలవలెనే ప్రహ్లాద చరిత్రలోని తెలుగుపద్యాలు తెలుగువారి రసనాగ్ర నర్తకులయ్యాయి. గజేంద్రునిలో క్షణకాల మైనా కనబడే కాతరత్వం ప్రహ్లాదునిలో కనరాదు. రాక్షసులు తండ్రి ఆజ్ఞ ననుస రించి తనను బాధిస్తూ ఉంటే, అతని నోటివెంట ఒక్క బాధాసూచకమైన ధ్వని కూడా వెలువడకపోవడం అందరిని ఆశ్చర్యచకితుల్ని చేసింది ఇదేవిషయాన్ని వ్యక్తంచేశారు.

"తన్ను నిశాచరుల్ వొడువ దైత్య కుమారుఁడు మాటిమాటికో
పన్నగశాయి! యోదనుజభంజన! యోజగదీశ! యో మహా
పన్నశరణ్య! యోనిఖిలపావన! యంచు నుతించుఁగాని తాఁ
గన్నుల నీరుదేఁడు భయకంప సమేతుఁడు గాఁడు భూవరా!"
(పోతన-7-5-193)

చిట్టచివరకు హింసోపాయాలన్నీ వ్యర్థంకాగా, దానవుడు హరిని చూపించవలసిన దని గర్జిస్తాడు. ఆ సందర్భంలోనిదే.

"ఇందుగలడందులేఁడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకిచూచిన
నందందే కలఁడు దానవాగ్రణి! వింటే" (7-8-275)

అనే పద్యం దీని తరువాత భక్తవత్సలుడైన శ్రీహరి- రాక్షసుడు ప్రహ్లాదుని "హరిని చూపించు" అని ఎక్కడ. దేనిలో అని తర్జిస్తాడో అనే భావంతో "నర హరి" రూపంలో- "నానాజంగమ స్థావరోత్కర గర్భంబుల నన్నిదేశముల" ఉన్నాడట! ఈ సందర్భంలో వ్యాసభాగవత శ్లోకం ఇది :

"సత్యం విధాతుం నిజభృత్య భాషితం
వ్యాప్తించ భూతేష్వఖిలేషు చాత్మనః ।
అదృశ్యతాత్యద్భుత రూపముద్వహం
స్తంభేసభాయాం నమృగం న మానుషమ్ ॥ (7-8-18)

దీనికి భక్తకవి పోతన పద్యం ఇది :

"హరి సర్వాకృతులంగలడనుచుఁ బ్రహ్లాదుండు భాషింప స
త్వరుఁడై యెందునులేఁడు లేఁడని సుతున్ దైత్యుండు తర్జింప శ్రీ
నరసింహాకృతి నుండెనచ్యుతుఁడు నానా జంగమ స్థావరో
త్కర గర్భంబుల నన్నిదేశముల నుద్దండ ప్రభావంబునన్.
(పోతన 7-8-277)

పోతన పద్యంలోని చివరిరెండు పాదాలలోని సొగసు సంస్కృత భాగవతంలో లేదు. సంస్కృత భాగవతంలో "ముందేస్తభంలో" వచ్చి ఉన్నాడు. తెలుగు భాగవతంలో సర్వే సర్వత్ర నిండిఉన్నాడు రాక్షసుడు ప్రహ్లాదుని "హరిని చూపించు" అని ఎక్కడ ఏ ప్రదేశాన్ని చూపించి అడుగుతాడో అనే "భయం"తో. శ్రీధరస్వామి తన సంస్కృత భాగవత వ్యాఖ్యలో "భృత్య" శబ్దానికి బ్రహ్మ" అని వ్రాశాడు. బ్రహ్మ ఇచ్చినవరాన్ని వమ్ముచేయరాదనే భావం దానిలో ఉంది. తెలుగు భాగవతంలో పోతన ప్రహ్లాదునకు అన్వయించాడు " భక్తవత్సలుండగు శ్రీహరి పరమ భక్తుండైన ప్రహ్లాదుండిట్లనియె"-

"అంభోజాసనుఁడాది గాఁగఁ దృణపర్యంతంబు విశ్వాత్ముఁడై
సంభావంబుననుండు ప్రోఁద విపులస్తంభంబులో నుండఁడే
స్తంభాంతర్గతుఁడయ్యు నుండుటకు నే సందేహమున్ లేదు ని
ర్దంభత్వమున నేఁడు గానఁబడుఁ బ్రత్యక్ష స్వరూపంబునన్"
(7-8-282)

ప్రహ్లాదుని ఈ సమాధానానికి కారణం ఇంతకిముందు హిరణ్యకశిపుడు ప్రహ్లాదునితో "మిగుల సంరంభంబునఁ బలికెద వీ స్తంభంబునఁ జూపఁగలవే చక్రిన్ గ్రక్కిన్" అనడమే! వెంటనే స్తంభంలో ఎందుకు ఉండడు అనడంతోనే హిరణ్యకశిపుడు :

"వినరా! డింభక! మూఢచిత్త! గరిమన్ విష్ణుండు విశ్వాత్మకుం
డని భాషించెదవైన నిందుఁగలఁడే యంచున్ మదోద్రేకియై
దనుజేంద్రుండతిచేత వ్రేసెను మహోదగ్ర ప్రభాశుంభమున్
జనదృగ్భీషణ దంభమున్ హరిజనుస్సంరంభమున్ స్తంభమున్"
(7-8-284)

అతిచేత స్తంభాన్ని కొట్టాడు. నరసింహుడు వెంటనే ఆవిర్భవించాడు.

వ్యాసభాగవతంలో, ప్రహ్లాదవరదుడైన నరహరి అవతరణ ఈ విధంగా వర్ణితమైనది. (7-8-21, 22)

ప్రతప్త చామీకరచండలోచనం।స్ఫురత్సటా కేసరజృంభితాననమ్।
కరాళ దంష్ట్రం కరవాల చంచల । క్షురాంత జిహ్వం భ్రుకుటీ
ముఖోల్బణమ్ ॥

స్తబ్ధోర్ధ్వకర్ణం గిరికందరాద్భుతం । వ్యాత్తాస్యనాసంహను
భేదభీషణమ్ ।

దివి స్పృశత్కాయ మదీర్ఘపీవర । గ్రీవోరువక్షస్థలమల్ప
మధ్యమమ్ ॥

దీనికి పోతన సుదీర్ఘమయిన వచనంలో నృసింహమూర్తి రూపు వర్ణించారు.

ఆ విధంగా అవతరించిన నృసింహుడు "ఉరగేంద్రుఁడు మూషికంబు నొడిసిన భంగిన్" పట్టి "అదిరిపట్టిని" "సాగ్రహుఁడై యూరువులందుఁజేర్చి నఖసంఘాతంబులన్ వ్రచ్చె", ఆ నృసింహమూర్తిని- బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు, ఋషులు, పితృదేవతలు, సిద్ధులు, విద్యాధరులు, భుజంగులు, మనువులు, ప్రజాపతులు, గంధర్వులు, చారణులు, యక్షులు, కింపురుషులు, వైతాళికులు, కిన్నరులు, విష్ణుసేవకులు, "వేఱువేఱ వినుతించిరి". ఆ ఉగ్రనారసింహుని శాంతింపజేయలేక దేవతలు లక్ష్మీదేవిని "నరహరిరోషము డింపవమ్మ, హరివరమధ్యా" అని ప్రార్థించారు. అప్పుడామె "నరహరిరూపంబు........వీక్షించి, శంకించి, శాంతుండైన వెనుకడగ్గఱి యెద"నని చింతింపుచున్న, వారిజ సంభవుండద్దేవుని రోషంబు నివారింప నితరుల కలవిగాదని ప్రహ్లాదుంజేరి "చక్రి దారుణమూర్తిన్.... తండ్రీ శీతలునిఁజేసి దయసేయఁగదే" అని వేడుకొన్నాడు. అప్పుడు ప్రహ్లాదుడు "సాష్టాంగ దండ ప్రమాణంబులు సేసిన, భక్తపరాధీనుండగునయ్యీశ్వరుండాలోకించి కరుణాయత్త చిత్తుఁడై", "బాలుని మౌళియందులో, కాళినుతుండు వెట్టెనసురాంతకుఁడుద్భట కాలసర్పభీ, తాభయ దానశస్త్రము ననర్గళ మంగళ హేతు హస్తమున్". అప్పుడు ప్రహ్లాదుడు, నరహరిని "భక్తి సేయంగ వలయును భక్తిగాని, మెచ్చఁదర్థంబు లొసఁగెదు మేరలందు, ఁబరమ కరుణుండు హరిభక్తబాంధవుండు" అని గ్రహించినవాడు గనుక భక్తితో ప్రార్థించి ఆయనను శాంతుని చేశాడు. ఆ ప్రార్థనలో చివర "నిన్నుఁజెవులార వినఁదేని నీకు సేవఁ, జేయరాఁదేని బ్రహ్మంబుఁ జెందఁగలఁడె, యోగియైనఁ దపోవ్రత యోగియైన, వేదియైన మహాతత్త్వవేదియైన"; కావున భవదీయ దాస్యయోగంబు కృపసేయుము అని ప్రణతుండైన ప్రహ్లాదుని వర్ణనంబులకు మెచ్చి, నిర్గుణుండైన హరి రోషంబు విడిచి"నాడు. ప్రహ్లాదచరిత్ర- భగవంతుని పొందడం విషయంలో భక్తియోగానికి శరణాగతికి, దాసభావానికి ఎంత ప్రాధాన్యమున్నదో తెలియజేస్తోంది

ఈ విధంగానే శ్రీమద్భాగవతంలో శ్రీకృష్ణావతారంలో ఉన్న శ్రీమన్నారాయణుని శరణుపొందినవారిలో– దేవకీ వసుదేవులు, కాళీయుని భార్యలు, గోపికలు, అక్రూరుడు, ఉద్ధవుడు, ముచికుందుడు మొదలైన వారెందరో ఉన్నారు. భగవంతుడు–భక్తులు, పరమభాగవతులు, భగవతి- లేకుండా నివసించలేడు. ఇదే విషయం-

"వైకుంఠేతు పరేలోకే శ్రియాసార్థం జగత్పతిః ।
ఆస్తే విష్ణురమేయాత్మా భక్తైర్భాగవతైస్సహ॥"

అని చెప్పబడింది. భగవంతునకు సంబంధించినది భాగవతం; భగవతికి సంబంధించినది భాగవతం; భాగవతులకు సంబంధించినది భాగవతం. భాగవతంలోని- గోపికాగీతలు, భ్రమరగీతలు, ఉద్ధవగీతలు- భక్తి వైశిష్ట్యాన్ని మూడు దృక్పథాల నుండి తెలియజేస్తాయి. గోపికా గీతలలో భగవద్విరహాన్ని భరించలేని గోపికల (జీవాత్మల) ఆత్మార్పణం వర్ణితం. వారికి కావలసినది జ్ఞానంకాదు- భక్తకామదం, బ్రహ్మసేవితం, మంగళకరం అయిన శ్రీకృష్ణపరమాత్మ అంఘ్రియుగం. "నిన్ను చూడకపోతే నిమిషాలు మాకు యుగాలుగా ఉంటాయి" అంటారు గోపికలు.

"అటతి యద్భవా నహ్ని కాననమ్
త్రుటియుగాయతే త్వామ పశ్యతామ్ ।
కుటిల కుంతలం శ్రీముఖం చతే
జడఉదీక్షతాం పక్ష్మకృద్దృశామ్॥ (10-31-15)

దీనికి పోతన మహాకవి పద్యం ఇది-

"నీవడవిం పవల్దిరుగ నీ కుటిలాలక లాలితాస్యమి
చ్ఛావిధిఁ జూడకున్న నిమిషంబులు మాకు యుగంబులై చనుం
గావున రాత్రులైన నినుఁగన్నుల నెప్పుఁడుఁ జూడకుండ ల
క్ష్మీవర! ఱెప్పలడ్డముగఁజేసె నిదేల విధాత క్రూరుఁడై"
(10-31-1049)

భక్తులకు. ఆత్మార్పణం చేసుకొన్నవారికి భగవద్విరహం నిమిషాలు యుగాలుగా భాసించడంలో అసహజ మేమీలేదు. మధ్యయుగానికి చెందిన చైతన్య మహాప్రభువు తన శిక్షాష్టకంలో ఇలా అంటాడు :

"యుగాయితమ్ నిమేషేణ, చక్షుషా ప్రావృషాయితమ్ ।
శూన్యాయితమ్ జగత్సర్వమ్, గోవింద విరహేణమే" ॥
(శిక్షాష్టకమ్)

రాధాకృష్ణ యుగళమూర్తిని తనయందే నిక్షిప్తం చేసుకొన్నవాడు చైతన్య మహా ప్రభువని భక్తుల విశ్వాసం.

"భ్రమరగీతలు"లో ఉద్ధవునిద్వారా సందేశమంపిన శ్రీకృష్ణుని-గోపికలు, తుమ్మెదమీద పెట్టి ఉపాలంభించడం వర్ణితం గోపికలు మునీశ్వరులకంటె భగవంతునకు గర్వభూతలు, మునీశ్వరుల విషయం చెప్పిన "గర్వభూతస్తపోధనాః" అనేది వీరికి వర్తిస్తుంది. ఆ సమయంలో-ఉద్ధవుడు సందేశం తెచ్చినప్పుడు— కన బడిన తుమ్మెద నుద్దేశించి చేసినట్లుగా కృష్ణుని ఉపాలంభించారు గోపికలు. కాని, నిజానికి ఇది ఉపాలంభంకాదు ఆత్మనిర్వేద వ్యక్తీకరణం. ఆత్మార్పణం చేసుకొన్న గోపికల అనుతాపం ఈ సందర్భంలో పోతన గోపికల ఆత్మార్పణాన్ని శరణాగతిని ఇలా వర్ణించారు :

బంధుల బిడ్డలన్ మగల భ్రాతలఁదల్లులఁ దండ్రులన్ మనో
జాంధతఁజేసి డించి శరణందిన మమ్ము వియోగదుర్దశా
సింధువునందుఁద్రోసి యిటుజేరకపోవుట పాడిగాదు పు
ష్పంధయ! మీయధీశునకుఁ బాదములఁ బడియొత్తి చెప్పవే!"

(స్కంధం-10, అధ్యాయం-47; పద్యం-1462)

కృష్ణుడు తనద్వారా పంపిన సందేశాన్ని ఉద్ధవుడు వివరించేటప్పుడు, కృష్ణుని మాటలుగా ఇలా అంటాడు :

"మయ్యావేశ్యమనః కృత్స్నం విముక్తా శేష వృత్తయః ।
అనుస్మరంత్యోమాం నిత్య మచిరాన్మాముపైష్యథ ॥

(10–47–36)

ఏకాదశస్కంధంలో ఉద్ధవ గీతలు వస్తాయి. ఇక్కడ శ్రీకృష్ణుడుపదేశించినది పరతత్త్వవిశేషం. అర్జునునకుపదేశించిన భగవద్గీతసారమే ఉపాసనామార్గంలో చెప్పబడింది దీనిలో "విభూతి" యోగాన్ని, ఉద్ధవునకు తిరిగి చెప్పినట్లుంటుంది. ఉద్ధవుడు ఇలా అడుగుతాడు— (ఉద్ధవ ఉవాచ)

"యాః కాశ్చభూమౌ దివి వా రసాయాం
విభూతయో దిక్షుమహావిభూతే

తామహ్య మాఖ్యాహ్యను భావితాస్తే
నమామితే తీర్థపదాంఘ్రిపద్మమ్"
(వ్యాస-XI-అధ్యా-16-శ్లో-5)

దీనికి సమాధానంగా- శ్రీకృష్ణ ఉవాచ॥

"ఏవమేతమహం పృష్టః ప్రశ్నం ప్రశ్నవిదాంవర ।
యుయుత్సునా వినశనే సపత్నైరర్జునేనవై ॥" (XI-16-6)

ఈ అధ్యాయంలో తన విభూతులను గూర్చి చెప్పి చివర ఇలా అంటాడు :

"సంఖ్యానం పరమాణూనాం కాలేన క్రియతేమయా ।
నతథామే విభూతీనాం సృజతోఒండాని కోటిశః ॥ (శ్లోకం-40)

ఇది భగవద్గీతలోని విభూతియోగంలోని "నాంతోఒస్తి మమ దివ్యానాం విభూతీనాం పరంతప"ను జ్ఞాపకం చేస్తోంది. ఉద్ధవునితో శ్రీకృష్ణుడు చెప్పతూ చెప్పతూ చివర ఇలా అంటాడు :

"తేజశ్శ్రీః కీర్తిరైశ్వర్యం హ్రీ స్త్యాగస్సౌ భగం భగః ।
బలం తితిక్షా విజ్ఞానం యత్ర యత్ర సమేఒంశకః ॥"
"ఏతాస్తే కీర్తితా స్సర్వా స్సంక్షేపేణ విభూతయః ।
మనోవికారా ఏవైతే యథా వాచాభి ధీయతే॥"

(XI-16-41, 42)

ఈ శ్లోకాలు భగవద్గీతలోని-

"యద్యద్విభూతి మత్సత్త్వం శ్రీమదూర్జితమేవవా ।
తత్తదేవావగచ్ఛత్వం మమతేజోంశ సంభవమ్ ॥"

అనేదాన్ని జ్ఞాపకం చేస్తాయి.

ఈ ఏకాదశ స్కంధంలోనే ఉద్ధవునకు శ్రీకృష్ణుడు స్పష్టంగా ఆత్మార్పణాన్ని గురించి, దాసభావాన్ని గురించి వివరిస్తాడు :

"మత్కథా శ్రవణే శ్రద్ధా మదనుధ్యానముద్ధవ ।
సర్వలాభోపహరణం దాస్యే నాత్మ నివేదనమ్ ॥
(అధ్యా-11, శ్లో-34)

14వ అధ్యాయంలో ఇంకా విపులంగా భక్తి ప్రాముఖ్యాన్ని వివరించి ఉద్ధవునకు ఉపదేశిస్తాడు :

"నసాధయతి మాం ధర్మో న సాంఖ్యం యోగఉద్ధవ ।
న స్వాధ్యాయస్తపస్త్యాగో యథాభక్తిర్మమోర్జితా॥" (శ్లోకం-20)

భక్త్యాహ మేకయాగ్రాహ్య శ్శ్రద్ధయాత్మా ప్రియస్సతాం ।
భక్తిః పునాతి మన్నిష్ఠాశ్వపాకానపి సంభవాత్ ॥ (శ్లోకం-21)

ఇంకా వివరిస్తూ తనకు భక్తుడైనవాడు భువనాన్ని పవిత్రం చేస్తాడంటాడు :

''వాగ్గద్గదాద్రవతే యస్యచిత్తం । హసత్యభీక్ష్ణం రుదతిక్వచిచ్చ ।
విలజ్జ ఉద్గాయతి నృత్యతేచ । మద్భక్తి యుక్తో భువనం పునాతి॥
(శ్లోకం-24)

శ్రీ చైతన్య మహాప్రభువు జీవితంలో మనకు- గద్గదవాక్కు, ఆనందరోదనం, ఉద్గానం, నృత్యం మొదలైనవన్నీ కనబడతాయి. ప్రభువే స్వయంగా తమ శిక్షాష్టకంలో ఇలా అన్నారు :

"నయనం గలదశ్రుధారయా । వదనం గద్గదరుద్ధయా గిరా ।
పులకైర్నిచితం వపుఃకదా । తవనామ గ్రహణే భవిష్యతి ॥"

కాశీలోనున్న శాంకరాద్వైత సన్యాసులు సమావేశమైన గోష్ఠికి వెళ్ళినప్పుడు చైతన్యమహాప్రభువు వినయంతో వేదికకు క్రిందుగా కూర్చున్నారు. ఆ సన్యాసులకు నాయకుడైన శ్రీ ప్రకాశానందుడు "మీరు మా గోష్ఠులలో పాల్గొనడానికి ఎందుకురారు ?" అని ప్రశ్నించినప్పుడు, మహాప్రభువు- 'తనకు వేదాంత విషయాలు బాగా తెలియవని, తన బుద్ధిమాంద్యాన్ని గుర్తించిన తమ గురువు కృష్ణమంత్రాన్ని ఉపదేశించారని దానికి సంబంధించిన కీర్తనాదులను గానం చేసేటప్పుడు తనకు భక్త్యుద్రేకం కలుగుతుందని, అప్పుడు తన ప్రవర్తన ఉన్మత్తుని

పరత్వాన్ని పోరి ఉంటుందని; కృష్ణప్రేమయే పరమోత్కృష్టమైనదని తమగురువులు చెప్పారని' అంటారు. తమ గురువులైన శ్రీ ఈశ్వరపురి శ్రీమద్భాగవత పురాణమంతటిలోను సారతమమైన శ్లోకం "ఇది" అని చెప్పారని, తానదే విశ్వసిస్తున్నానని ఆ శ్లోకం చదివారు :

"ఏవంవ్రతః స్వప్రియ నామకీర్త్యా ।
జాతానురాగో ద్రుతచిత్త ఉచ్చైః ।
హసత్య సౌరోదితి రౌతిగాయ ।
త్యున్మాదవన్నృత్యతిలోక బాహ్యః ॥" (11.2.40)

దీనినిబట్టికూడా శ్రీమద్భాగవతంలో-కృష్ణునకు శరణాగతి, ఆత్మసమర్పణ మొదలైన భక్తిశాస్త్ర సంబంధమైన అంగాలు ఎంతముఖ్యమో తెలుస్తుంది. ఏకాదశ స్కంధంలో రెండో అధ్యాయంలో వచ్చే ఈ విషయాలే తరువాతి అధ్యాయాలలో కూడా కనబడతాయి. ఈ శ్లోకపఠనం ద్వారా చైతన్య మహాప్రభువు తన సంప్రదాయ సిద్ధాంతాన్ని పరోక్షంగా చెప్పినట్లయింది.

భాగవతంలోని ఏకాదశస్కంధంలో-భక్తి వైశిష్ట్యాన్ని కృష్ణపరమాత్మ ఎంత విపులీకరించి వివరించినా ఆయనకే తృప్తిలేదన్నట్లు. సర్వం భక్తివల్లనే లభిస్తుంది అని, 21వ అధ్యాయంలో ప్రవచిస్తాడు :

"యత్కర్మభిర్యత్తపసాజ్ఞాన వైరాగ్యతశ్చయత్ ।
యోగేన దానధర్మేణ శ్రేయోభిరితరైరపి॥" (శ్లోకం-33)

సర్వం మద్భక్తియోగేన మద్భక్తోలభతేం జసా ।
నకించిత్సాధనో ధీరాః భక్తాహ్యేకాంతికో మమ॥ (శ్లోకం-34)

ఐకాంతిక భక్తి సాధించి పెట్టలేనిది ఏదీలేదని ప్రతిజ్ఞా పూర్వకంగా చెప్పతాడు.

శ్రీమద్భాగవతంలో ఎందరో ఆత్మసమర్పణం చేసుకొన్న భక్తులు మనకు కనబడతారు. వీరిలో-మహారాజులు మొదలుకొని మాలాకారుల వరకు ఉంటారు. మహారాజులకు ప్రతినిధిగా శ్రీ పరీక్షిత్తునే గ్రహించవచ్చును. శ్రీమద్భాగవతం శ్రీశుకమహర్షి ఆయనకోసమే ప్రవచించాడు గదా! శ్రీమద్భాగవతం "ఆత్మారాములు" కూడా పఠించడం ఎందుకు? వారికికూడా దానిలో ఆనందం ఉంది,

కనుకనే, శ్రీశుకునివంటివారుకూడా నిరపేక్షులుకూడా హరిని భజిస్తారు సూతుడు శౌనకుడడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పిన ఉత్తరం శ్రీమద్భాగవత వైశి ష్ట్యాన్ని తెలియజేస్తుంది. శౌనకుడు అడిగిన ప్రశ్న ఇది-

సవై నివృత్తి నిరతస్సర్వత్రోపేక్షకో మునిః।
కస్యవా బృహతీమేతా మాత్మారామస్సమభ్యసత్॥
(ప్రథమస్కంధం-అధ్యాయం-7, శ్లోకం-9)

పరమ నివృత్తిశీలుడు, సర్వవిషయాలయందు ఉపేక్షాభావం కలవాడు, మనన శీలుడు, ఆత్మారాముడు అయిన శ్రీశుకుడు బృహద్గ్రంథమైన భాగవతాన్ని ఎందుకు పఠించాడు- అని ప్రశ్నించాడు. విశిష్టమైన ఈ ప్రశ్నే భాగవత ప్రత్యే కతను నిరూపించేది. సాధించవలసినదంతా సాధించిన శ్రీశుకమహర్షికి ఇది ఎందుకు ?

దీనికి సమాధానంగా సూతుడు చెప్పినది ఇది-

ఆత్మారామాశ్చమున యోనిర్గ్రంథా అప్యురుక్రమే।
కుర్వంత్యహైతుకీం భక్తిమిత్థం భూతగుణోహరిః॥ (శ్లో-10)

ఆత్మారాములు (నిరంతరం ఆత్మయందే రమించువారు) అయిన మునులు, గ్రంథి (అహంకారాదులు) నశించినవారైనా, వీర్యశాలి అయిన హరియందు ఫలాభిసంధిరహిత భక్తిని కలిగిఉంటారు. శ్రీహరి గుణాలు అలాంటివి. దీనికి తెలుగులో పోతనమహాకవి పద్యమిది.(1-7-137)

"ధీరులు నిరపేక్షులునా
త్మారాములునైన మునులు హరిభజనము ని
ష్కారణమ చేయుచుందురు
నారాయణుఁడట్టివాఁడ నవ్యచరిత్రా.

సమస్తాన్ని సాధించిన మునులు నిష్కారణంగా హరిభజనచేయడానికి కారణం నారాయణుని విశిష్టగుణాలు. "నారాయణుఁడట్టి వాఁడ" అనేది చాలా సొగసుగా పోతన ప్రయోగించాడు. మూలానికి వన్నె పెట్టింది. ఏ గుణాల్ని వివరించవలసిన

ఆవశ్యకం లేకపోయింది. ఈ పద్యం(శ్లోకం)భక్తికి భాగవతంలోఉన్న స్థానాన్ని చెప్పకే చెప్పుతోంది.

ఈ శ్లోకానికి చైతన్య సంప్రదాయంలో విశేష ప్రాముఖ్యంఉంది. జీవన్ముక్తులు, ఆత్మారాములు అయిన మునులుకూడా భగవద్భక్తులని ఈ శ్లోకం సూచిస్తున్నప్పుడు శాంకరాద్వైతాన్ని (మాయావాదం అంటారు వారెప్పుడూ) కాదనే సగుణోపాసులకు ఇంతకంటె కావలసినదేమున్నది? చైతన్యమహాప్రభువు కాలం నాటి (15, 16 శతాబ్దుల మధ్య) ఉత్కళరాష్ట్రంలో రాజాస్థాన విద్వాంసునిగా, శాంకరాద్వైతానికి మూలస్తంభంగా పేరుపొందిన సార్వభౌమభట్టాచార్యుని ఎదుట ఈ శ్లోకానికి అనేకార్థాలుచెప్పి- అవేవీ మాయావాదాన్ని సమర్థించవని రుజువుచేసి మహాప్రభువు ఆ విద్వాంసుని తనవైపు తిప్పుకొన్నాడు.

మొట్టమొదట సార్వభౌమభట్టాచార్యుడు ఆ శ్లోకానికి అర్థంచెప్పితే వినాలని ఉందని చైతన్యమహాప్రభువు కోరగా, ఆ మహావిద్వాంసుడు తర్కాన్ని వ్యాకరణాన్ని ఆధారంగా తీసుకొని తొమ్మిది విభిన్నార్థాలు చెప్పాడట. చైతన్యమహాప్రభువు అతని పాండిత్యాన్ని అభినందించి, కేవలం పాండిత్యాన్ని ఆధారంచేసుకొని వ్యాఖ్య ప్రారంభిస్తే దానికి అంతం ఉండదని- ఆ శ్లోకంలోని పదాలు పదకొండు అని 1) ఆత్మారామాః 2) చ 3) మునయః 4) నిర్గ్రంథాః 5) అపి 6) ఉరుక్రమే 7) కుర్వన్తి 8) అహైతుకీమ్ 9) భక్తిమ్ 10) ఇత్థంభూతగుణః 11) హరిః) వాటిని వేరువేరుగా విశ్లేషించి అర్థాలుచెప్పి మొత్తం శ్లోకానికి 61 అర్థాలు చెప్పాడట! కాని ఇవేవీ ముఖ్యమైనవి కావని, శ్రీమద్భాగవతదృష్టిలో - ఆత్మారాములైన జీవన్ముక్తులుకూడా భగవంతుని (శ్రీకృష్ణుని) గుణవిశేషంవల్ల ఆకర్షితులై నిర్హేతుకంగా భక్తులవుతారు అనేది ముఖ్యమైనదని, చైతన్య మహాప్రభువు అభిప్రాయం. మహాప్రభువు ప్రభావంక్రింద సార్వభౌముడు ఎంతగామారినాడంటే, శ్రీమద్భాగవతంలోని(10-14-8) క్రింది శ్లోకంలోని "ముక్తి"శబ్దాన్ని "భక్తి"గా మార్చి శ్రీ చైతన్యుని ఎదుట చదివినాడని అంటారు.

"తత్తేఽను కంపాం సుసమీక్షమాణో।
భుంజాన ఏవాత్మకృతం విపాకమ్।
హృద్వాగ్వపుర్భిర్విదధాన్ నమస్తే।
జీవేతయో ముక్తిపదే సదాయభాక్॥

ఈ మార్పునకు కారణమేమిటని ప్రభువు ప్రశ్నిస్తే, "శుద్ధభక్తునకు 'ముక్తి' శిక్షవంటిది"అని సమాధానం చెప్పినాడట!

శ్రీసనాతనగోస్వామి అభ్యర్థనమేరకు శ్రీచైతన్యమహాప్రభువు ఈశ్లోకా ర్థాన్ని తిరిగి గోస్వామికి వివరించాడు. ఈ సంభాషణాదికం కాశీలో జరిగింది. ప్రభువునుండి ఆధ్యాత్మికవిషయాల నన్నింటిని గ్రహించి శ్రీ సనాతనుడు వ్రజ భూమికి వెళ్ళిపోయాడు. చైతన్య సంప్రదాయంలో ప్రసిద్ధుడయిన రూపగోస్వామి ఈయన సోదరుడు; షడ్గోస్వాములలో ఒకరైన జీవగోస్వామి వీరి సోదరుని పుత్రుడు. వీరు ముగ్గురుకాక - రఘునాథభట్టగోస్వామి, రఘునాథ దాసగోస్వామి, గోపాలభట్టగోస్వామి అనువారు మిగిలిన ముగ్గురు. ఈ సంప్రదాయంవారికి శ్రీమద్భాగవతం ప్రాణప్రదం.

శ్రీమద్భాగవతంలో మహారాజులు మొదలు మాలాకారునివరకు శరణాగతి చేసినవారున్నారనుకొన్నాము. మధురానగరంలో రాజవీధినిపోతూ ఉన్న బలరామ కృష్ణులు– రజకుని మర్దించి రాజోచితవస్త్రాలను ధరించి, వాయకుడిచ్చిన మృదు పటాభరణాలను గ్రహించి వానిని సంభావించి సుదాముడనే మాలాకారుని గృహా నికి వెళ్లారు. తన గృహం వారి రాకవల్ల పవిత్రమైనదని "లేచి గ్రక్కునమ్రొక్కి, దక్కని నర్ఘ్యపాద్యాదికంబు లాచరించి, సానుచరులయిన వారలకుఁ దాంబూల కుసుమ గంధబు లొసంగి" సత్కరించాడు. తరువాత "సుదాముఁడు ఘనసురభి కుసుమదామములు" వారికిచ్చాడు. బలరామకృష్ణులు ప్రీతులై వాటిని గ్రహించి "నీవు కోరిన వరమిచ్చెదము"అన్నారు. మాలాకారుడు చాలా ఉదాత్తంగా "నీ పాద కమలసేవయు, నీ పాదార్చకులతోడి నెయ్యమును నితాం, తాపార భూతదయ యును, దాపసమందార! నాకు దయసేయఁగదే!" అని కోరుకొన్నాడు. చక్కని ఈ తెలుగుపద్యం చాలా ప్రచారానికి వచ్చింది. ఆ మాలికునకు "బలాయుఃకాంతి కీర్తిసంపద"లను మాధవు డనుగ్రహించాడు.

శ్రీమద్భాగవతం శ్రీకృష్ణుని రూపమే అని విశ్వసించేవారు వివిధ సంప్ర దాయాలవారున్నారు. భాగవతంలోనే శౌనకాదిమునులు సూతుని "శ్రీకృష్ణుడు స్వధామానికి వెళ్ళాడు గదా ఇప్పుడు ధర్మం ఎవరిని ఆశ్రయించింది" అని ప్రశ్నించారు.

"బ్రూహియోగేశ్వరో కృష్ణే బ్రహ్మణ్యే ధర్మవర్మణి।
స్వాం కాష్ఠామధునోపేతే ధర్మః కంశరణం గతః॥ (1-1-24)

దానికి సమాధానంగా సూతుడు ఇలా అన్నాడు.

"కృష్ణే స్వధామోపగతే ధర్మజ్ఞానాదిభిస్సహ।
కలౌ నష్ట దృశామేష పురాణార్కోఽధునోదితః॥" (1-3-45)

కృష్ణుడు స్వధామానికి పోయినప్పుడు ఆయనతోబాటు ధర్మజ్ఞానాది కల్యాణగుణాలు కూడా పోయినట్లయింది. కలియుగంలోని ప్రజలు గ్రుడ్డివారిలాగ అయిపోగానే ఈ పురాణం (భాగవతం పురాణం) అనే సూర్యుడు ఉదయించాడు.

దీనినిబట్టి శ్రీమద్భాగవత పురాణానికి లోకంలో ఎంతస్థానం ఉందో తెలుస్తుంది. భక్తికి పట్టంగట్టిన పురాణరాజం ఇది. ఏకాదశస్కంధంలో భాగవతసారమంతా ఇమిడిఉంది. మొట్టమొదట వసుదేవునకు నారదుడు చెప్పిన విదేహరాజు కథలోను, తరువాత కృష్ణుడు ఉద్ధవునకు బోధించిన తత్త్వంలోను ఈసారమంతా ఒకచోట చేర్చబడిఉందని చెప్పవచ్చును. ఒకసారి నారదమహర్షి ద్వారకకు వచ్చినప్పుడు వసుదేవుడా దేవర్షిని ముక్తిమార్గానికి సులభమైన ధర్మాచరణను వివరించవలసినదిగా అర్థిస్తాడు. దానికి సమాధానంగా పూర్వం విదేహుడు అను రాజునకు ఋషభకుమారుడైన "కవి"అను ముక్తపురుషుడు చెప్పిన పరమార్థాన్ని నారదుడు చెప్తాడు. తెలుగు భాగవతంలోని ఈ భాగాన్ని పోతనామాత్యుని ప్రియ శిష్యుడైన వెలిగందల నారాయణాఖ్యకవి (నారయ)రచించాడు,

"కరణత్రయంబుచేతను నరుఁడే కర్మంబు సేయు నయ్యోవేళన్।
హరికర్పణమని పలుకుట, పరుపడి సుజ్ఞానమంత్రడు పరమ
మునీంద్రుల్ ॥

వచనం- "జ్ఞానాజ్ఞానంబులందు సంకలితుండైన స్మృతి విపర్యంబు నొందునట్లు గావున గురుదేవతాత్మకుండయి బుద్ధిమంతుండైన మర్త్యుండు శ్రీవల్లభు నుత్తమోత్తమునిఁగాఁ జిత్తంబునఁజేర్చి సేవంపవలయు. స్వప్నమనోరథేచ్ఛాద్యవస్థలయందు సర్వసంకల్పనాశంబగుటంజేసి వానిఁగుఁడియం బట్టి నిరంతర హరిధ్యానపరుండైన వానికిఁ గైవల్యంబు సులభంబుగఁ గరతలామలకంబైయుండు."

"సంతతంబును గృష్ణ సంకీర్తనంబులు,
వీనులకింపుగా వినఁగవలయు
హర్షంబుతోడుత హరినామ కథనంబు,
పాటల నాటలఁబరఁగ వలయు
నారాయణుని దివ్యనామాక్షరంబులు.
హృద్వీథి సంతతంబు నిలుపవలయుఁ
గంజాక్షులీలలు కాంతారములనైన,
భక్తి యుక్తంబుగాఁ బాడవలయు.

వెఱ్ఱిమాడ్కిని లీలతో విశ్వమయుని
నొడువుచును లోకబాహ్యత నొందవలయు
నింతయును విష్ణుమయమని యెఱుఁగవలయు
భేదమొనరింప వలదు మేదినీశ !"

(తెలుగుభాగవతం; స్కంధం-11, అధ్యాయం-2- 42,43,44)

ఈ భాగంలోనే సంస్కృతమూలంలో ఈ శ్లోకం ఉంది:

"కాయేన వాచామనసేంద్రియైర్వా
బుద్ధ్యాత్మనా వానుసృతస్స్వ భావాత్ ।
కరోతి యద్యత్సకలం పరస్మై
నారాయణాయేతి సమర్పయేత్తత్॥" (11-2-36)

ఈ శ్లోకమే చిన్నచిన్న మార్పులతో-"బుద్ధ్యాత్మనా వా ప్రకృతేః స్వభావాత్"అని; కరోతి "స్థానంలో" "కరోమి"అని; "సమర్పయామి" అని వాడుకలో ఉంది.

ఇంక ఎవరు భాగవతులు ? అనే ప్రశ్నకు కూడా దీర్ఘంగా విషయవివరణ ఉంది. ఈ వివరణచేసినది "హరి"అని పేరున్న ఋషభపుత్రుడు. ఋషభునకు నూరుగురు పుత్రులు. వారిలో 'కవి' మొదలుకొని తొమ్మండుగురు జీవన్ముక్తులు. శ్రీమద్భాగవతంలో వారి పేర్లు శ్లోకరూపంలో ఇలా చెప్పడం జరిగింది.

"కవిర్హరిరంతరిక్షః ప్రబుద్ధః పిప్పలాయనః ।
ఆవిర్హోత్రో ద్రమిళశ్చమసః కరభాజనః॥ (11-2-21)

(కవిః, హరిః, అంతరిక్షః, ప్రబుద్ధః, పిప్పలాయనః, ఆవిర్హోత్రః, ద్రమిళః, చమసః, కరభాజనః ॥)

వీరందరు ఒకరితరువాత ఒకరుగా విదేహుడడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పుతారు. ఆత్మవిద్యా విశారదులైనవారి సమాధానాలు జ్ఞానదాయకాలై అనేకాలైన సంశయాలను నివృత్తి చేస్తాయి.

ఎవరు భాగవతులు అనే ప్రశ్నకు సమాధానంగా ఋషభుని కొడుకులలో ఒకకొడుకు, 'హరి' అనే మహాభాగుడైన జీవన్ముక్తుడు భాగవతోత్తమునుగూర్చి ఇలా చెప్పాడు. ఈ భాగవతోత్తములలో తరతమభావం కూడా ఉంది.

"సర్వభూతేషుయః పశ్యేత్, భగవద్భావ మాత్మనః ।
భూతాని భగవత్యాత్మన్, యేన భాగవతోత్తమః॥ (11-2-45)

ఈశ్వరే తదధీనేషు, బాలిశేషు ద్విషత్సుచ।
ప్రేమమైత్రీ కృపోపేక్షాయః కరోతి సమధ్యమః॥ (11-2-46)

అర్చాయామేవతు హరేః పూజాయశ్శ్రద్ధయేహతే ।
నతద్భక్తేషు చాన్యేషు సభక్తః ప్రాకృతస్మృతః॥ (11-2-47)

అన్నిభూతాలయందు భగవంతుని దర్శించి, ప్రాణులన్నీ తనవంటివే అని భావించేవాడు భాగవతోత్తముడు. ఈశ్వరునియందు ప్రేమ, వైష్ణవులయందు మైత్రి, అజ్ఞానులయందు కృప. శత్రువులయందు ఉపేక్ష ఉన్నవాడు భాగవతులలో మధ్యముడు భగవంతుని శ్రద్ధగాపూజిస్తూ, భగవద్భక్తుల ఇతర ప్రాణుల విషయంలో శ్రద్ధ చూపించనివాడు ప్రాకృతుడైన- అనాగరకుడైన-భక్తుడు.

ఈ విధంగా భాగవతస్వరూపాన్ని "హరి" వివరించి చెప్పాడు. తెలుగు భాగవతంలో ఈ సందర్భంలోని పద్య. వచనాదులు కొన్ని ఇలా ఉన్నాయి.

"సర్వభూతమయుఁడైన సరసిజాక్షుఁ
డతఁడె తనయాత్మయందుండ ననెడువాఁడు

శంఖచక్ర ధరుండంచుఁ జనెడివాఁడు
భక్తిభావాభిరతుఁడు వో భాగవతుఁడు. (11-2-46)

"నారాయణాంఘ్రినఖమణి చంద్రికా నిరస్తహృదయ పావుఁడై యాత్మీయ భక్తిరసనానుబంధబంధురంబైన వాసుదేవ చరణసరోరుహధ్యానానంద పరవశుండగునతండు భాగవత ప్రధానుండని యెఱింగించెను."
(11-2-48)

శ్రీమద్భాగవత కథనంతా శుకమహర్షి పరీక్షిత్తునకు వినిపించినట్లు సూతుడు శౌనకాదులకు చెప్పాడు. కథనంతా చెప్పి శుకమహర్షి ఇలా అంటాడు.

"నేనెఱింగినంతయుం జెప్పితి. సంసారంబుదాఁట హరికథ
యనెడి నావయె సహాయంబుగాని, వేఱొకటిలేదనిచెప్పి"
(12-4-24)

"ఏనుమృతుండ నౌదునని యింతభయంబు మనంబులోపలన్
మానుము సంభవంబుగల మానవకోట్లకుఁ జావునిత్యమౌఁ
గానహరిం దలపుమిఁకఁగల్గదు జన్మమునీకు ధాత్రిపై
మానవనాథ! పొందెదవు మాధవలోక నివాససౌఖ్యముల్."
(12-5-25)

అనే హితోక్తి వినిపించాడు. "సమస్తంబును నారాయణార్పణంబు చేసి విగత శోకుండవై, నిత్యంబును హరిధ్యానంబు సేయుము" అని చివరికి చెప్పి "శుకుం డును యథేచ్ఛా విహారుఁడై చనియె." (12-5-25)

ఈ విధంగా మన వేదాలలో, ఉపనిషత్తులలో కావ్యపురాణేతిహాసాదులలో ఆత్మార్పణ వైశిష్ట్యం-సర్వేసర్వత్ర-చెప్పబడేఉంది.

# భాగవత వైష్ణవ సంప్రదాయాలు

ప్రహ్లాద నారద పరాశరపుండరీక
వ్యాసాంబరీష శుకశౌనక భీష్మదాల్భ్యాన్ ।
రుక్మాంగదార్జున వసిష్ఠ విభీషణాదీ
న్పుణ్యాని మాన్పరమ భాగవతాన్స్మరామి॥

అనే ప్రసిద్ధ శ్లోకంలో పరమ భాగవతులనందరినీ స్మరించడం జరిగింది. వీరందరు భగవానుడైన శ్రీమన్నారాయణుని భక్తులు. "భగవతి భక్తాః భాగవతాః" ఈ భాగవతులందరు విష్ణుభక్తులు కావడంవల్ల వైష్ణవులయ్యారు. వైష్ణవ శబ్దం "తస్యేదమ్" అనే పాణిని సూత్రాన్నిబట్టి (4.3-120) "విష్ణోరిదం వైష్ణవమ్" అయింది. భాగవతులు, వైష్ణవులు అనేవి పర్యాయపదాలుగా ప్రచారంలోకి వచ్చాయి. అర్వాచీనకాలంలో బయలుదేరిన భాగవత వైష్ణవ సంప్రదాయాల సిద్ధాంతాలతో పైన పేర్కొనబడిన పరమ భాగవతులకు నిమిత్తం లేదు. సర్వభాగవత వైష్ణవ సంప్రదాయలవారికి- వేదోపనిషత్తులు, రామాయణ భారత భాగవత కావ్యేతిహాస పురాణాదులు ఉపాదేయా లయినట్లే, ఈ పరమభాగవతులందరు పూజ్యులే! ఐతిహాసిక కాలంలో జీవించిన - ఆళ్వార్లు, ఆచార్యులు, కవులు, వాగ్గేయకారులు, భగవద్విభూతిని ఈ షన్మాత్రమైనా ప్రకటించినవారందరు మహానుభావులే! అన్య దేవతారాధకులైనవారూ ఆ యా దేవతామూర్తుల భక్తులే. భాగవత శబ్దం విష్ణుభక్తుల పరంగా ప్రయుక్తమై రూఢమై ప్రచారాన్ని పొందింది. శివ భాగవత శబ్దంకూడా ప్రాచీనమైనా, శివభక్తుల విషయంలో భాగవత శబ్దం విశేషవ్యాప్తిలోనికి రాలేదు. పాణిని సూత్రమైన "అయః శూలదండాజి నాభ్యాం ఠక్ఠఞౌ" (5.2-76) అనే దానికి వ్యాఖ్యానం వ్రాస్తూపతంజలి తన మహాభాష్యంలో "శివ భాగవత" శబ్దం ప్రయోగించాడు ("కిం యోఽయః శూలేనాన్విచ్ఛతి స ఆయశూలికః । కిం చాతః. శివభాగవతేఽపి ప్రాప్నోతి । ఏవం తర్హి ఉత్తరపదలోపోఽత్ర ద్రష్టవ్యః॥") "శివభాగవత" శబ్దం అంత ప్రాచీనమైనా, వైష్ణవుల విషయంలో వాడుకలోనికి వచ్చినట్లుగా "భాగవత" శబ్దం శైవులవిషయంలో రాలేదనేది గ్రహించాలి.

ఐతరేయ బ్రాహ్మణ ప్రారంభంలో "అగ్నిర్వై దేవానామవమః, విష్ణుః పరమః"అని ఉంది. అగ్ని దేవతలలో (అవమః=తక్కువవాడు) ప్రారంభంలో పేర్కొదగినవాడు. తరువాత విష్ణువు దేవతలలో పరముడు. "తదంతరేణ సర్వా అన్యాదేవతాః" అని ఉండడంవల్ల మిగిలిన దేవతలందరూ – పైవారిద్దరి నడుమ వస్తారని– పరిగణనలో– తెలుతోంది. యజుర్వేదం పంచమకాండలో పంచమ ప్రశ్నలో కూడా "అగ్నిరవమో దేవతానాం విష్ణుః పరమః"అని ఉంది నాలుగో కాండలో నాలుగో ప్రశ్నాంతంలో "అస్యేశానా జగతో విష్ణుపత్నీ" అని ఉంది. దీనినిబట్టి కూడా విష్ణువునియంత- ఆయన పత్ని నియంత్రి అనబడినది గనుక- అని తెలుతోంది. కఠోపనిషత్తులో "సోఽధ్వనః పారమాప్నోతి, తద్విష్ణోః పరమం పదమ్" (3-9) అని ఉంది. జీవుడు సంసారాధ్వ పారభూతమైన పరమాత్మ విష్ణువుయొక్క స్థానమైన పరమపదాన్ని పొందుతున్నాడని ఇది తెలుపుతోంది. విష్ణు పురాణంలో "భగవచ్ఛబ్దం" ప్రయోగించి పరవాసుదేవుని పరాశరమహర్షి వర్ణించాడు :

"జ్ఞానశక్తి బలైశ్వర్యవీర్యతేజాంస్యశేషతః ।
భగవచ్ఛబ్ద వాచ్యాని వినా హేయై ర్గుణాదిభిః॥"

ఈ "భగవాన్" శబ్దం, వాసుదేవునకే చెల్లునని ఈ శ్లోకంకూడా చెప్పుతోంది.

"ఏవమేష మహాన్శబ్దః మైత్రేయ భగవానితి ।
పరమబ్రహ్మభూతస్య వాసుదేవస్య నాన్యగః॥" (6-5-79)

శ్రీమద్భాగవతం వాసుదేవుని వైశిష్ట్యాన్ని ఇలా ఉగ్గడించింది.

"వాసుదేవ పరావేదా, వాసుదేవ పరామఖాః ।
వాసుదేవ పరాయోగా, వాసుదేవ పరాఃక్రియాః ।
వాసుదేవ పరంజ్ఞానం, వాసుదేవ పరంతపః ।
వాసుదేవ పరోధర్మో వాసుదేవ పరాగతిః

(భాగవతం-1-2-28,29)

దీనికి తెలుగులో పోతన మహాకవి వచనం ఇలా ఉంది-"మోక్షమిచ్చుటం జేసి నారాయణుండు సేవ్యుండు. వేదయాగయోగ క్రియాజ్ఞాన తపోగత ధర్మంబులు వాసుదేవ పరంబులు"

ఇంక-నారాయణ, వాసుదేవ, విష్ణుశబ్దాలు-ఒకే దేవతామూర్తిని చెప్పేవిగా ప్రయుక్తాలైన విష్ణుగాయత్రి ఉండనే ఉంది. "నారాయణాయవిద్మహే, వాసుదేవాయ ధీమహి । తన్నో విష్ణుః ప్రచోదయాత్॥" దీనికి వ్యాఖ్యానం వ్రాసిన భట్టభాస్కరుని దృష్టిలో - నారాయణశబ్దం పరమాత్మని తెలియజేస్తుంది. ఆయన అంతర్యామిగా భావితుడైనప్పుడు-వాసుదేవ శబ్దవాచ్యుడు; వ్యాపకునిగా ఊహితుడైనప్పుడు-విష్ణుశబ్ద సూచితుడు.

సత్యము, నిత్యము అయిన భగవద్విభూతిలో మూడుపాదాలకు 'త్రిపాద్విభూతి' అని (శ్రీమన్నారాయణోపనిషత్తు త్రయోదశోఽను వాకంలో దీన్ని వివరించింది.) మిగిలిన నాల్గోపాదానికి 'ఏకపాద్విభూతి' అని పేర్లు. పునరావృత్తి రహితమైన విష్ణుమూర్తియొక్క పరమపదస్థానం - 'త్రిపాద్విభూతి'. దృశ్యమానమైన జగత్తంతా విష్ణుభగవానుని 'ఏకపాద్విభూతి'. సృష్ట్యాది భగవల్లీలకు వస్తువైన, త్రిగుణాత్మకమైన మాయకు ఇందే ప్రచారం. ఏకపాద్విభూతికి - అవిద్యాపాదమని పేరు. ఈ రెండు విభూతులకు-నిత్యవిభూతి, లీలావిభూతులకు-మధ్యగా, హద్దుగా-సూక్ష్మాతి సూక్ష్మంగా - ప్రవహించేది విరజానది. ముక్తాత్ములు-విరజానదిని దాటి త్రిపాద్విభూతిలోని మొదటిపాదమైన సువిద్యాపాదాన్ని చేరి, దాని తరువాతి పాదమైన ఆనందపాదాన్ని అధిగమించి తురీయపాదాన్ని పొంది శ్రీమన్నారాయణునితో బ్రహ్మానందాన్ని అనుభవించడం జరుగుతుంది. ఇదియే సాయుజ్యం.

ఈ సందర్భంలో-సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్యాలను గూర్చి కొంత తెలుసుకొనవలసి ఉంటుంది మోక్షమనగా వీరిదృష్టిలో-సాయుజ్యం. "సమానో యుక్ యోగో యస్య సః సయుక్, తస్య భావః సాయుజ్యమ్" అని వ్యుత్పత్తి. శ్రీమద్భాగవతంలో తృతీయస్కంధంలో ఇలా ఉంది.

"సాలోక్య సార్ష్టిసామీప్య సారూప్యైకత్వ మిత్యుత ।
దీయమానం న గృహ్ణంతి జనామత్సేవనం వినా॥ (29-14)

స ఏవభక్తియోగాఖ్య ఆత్యంతిక ఉదాహృతః ।
యేనాతివ్రజ్య త్రిగుణాన్మద్భావాయోప పద్యతే॥ (29-15)

దీనికి తెలుగు భాగవతంలో ఇలా ఉంది :

"నిష్కాములైన మదీయభక్తులకు నట్టి భక్తియోగంబు సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్యంబులకు సాధనంబు గావున మహాత్ములగువారు తమ మనోరథ ఫలదాయకంబులైనను మదీయ సేవా విరహితంబులైన యితర కర్మంబుల నాచరింప నొల్లరు. దీని నాత్యంతిక భక్తియోగంబని చెప్పుదురు. సత్త్వరజస్తమో గుణహీనుండైన జనుండు మత్సమానా కారతంబొందు అని చెప్పెను."

(3-29-949)

క్రింది దానివలన వైష్ణవులలో సాయుజ్యమే మోక్షమని స్పష్టమవుతోంది.

"లోకేషు విష్ణోర్నివసంతి కేచిత్, సమీపమృచ్ఛన్తి చ కేచిదన్యే।
అన్యేతు రూపం సదృశం భజన్తే సాయుజ్యమన్యే స తు
మోక్ష ఉక్తః ॥

సర్వవైష్ణవ సంప్రదాయాలకు సగుణోపాసన మూలం. శ్రీమన్నారాయణుడు మూలదైవం. ఈయనకున్న వివిధ నామాలను కొన్ని సంప్రదాయాలవారు మూల దైవంగా పేర్కొన్నారు. కొందరు సంప్రదాయజ్ఞులు వివిధావతారాలను ఉగ్గడించారు వీరందరు భాగవతులే! విష్ణుపారమ్యాన్ని- ఆయన్ని ఏ పేరుతో పిలిచినా- అంగీకరించినవారే! జగత్తు సత్యం, నిత్యం అని అంగీకరించినవారే! శాంకరాద్వైతాన్ని ఏదోవిధంగా ఖండించినవారే!

ఆధునిక పరిశోధక పండితులు, తత్త్వశాస్త్రవేత్తలు వైదికమైన విష్ణ్వారాధన వివిధ సమయాలలో భిన్న భిన్న సంప్రదాయాలను కలుపుకొని విజృంభించి భారతదేశంలోని ఉత్తరాపథాన్ని లోగొని, ఇతర ద్వీపాలకు వ్యాపించి క్రమంగా దక్షిణాపథానికి విస్తరించిందని భావించి వివరించారు. "నారాయణ్ శాసనాన్ని బట్టి భక్తి ప్రధానమైన భాగవత వైష్ణవం, క్రీస్తుపూర్వం మొదటిశతాబ్దిలో దక్షిణాపథానికి వచ్చిఉంటుందని" డా॥ సర్వేపల్లి రాధాకృష్ణపండితులు తమ "ఇండియన్ ఫిలాసఫీ" అనే గ్రంథంలో వ్రాశారు. (Indian Philosophy, vol II; Page 667) ఆచార్య హేమచంద్రరాయ్ చౌధరి తమ గ్రంథమైన Materials for the study of the Early History of the Vairhnava sectలో

Page-112) "ఉత్తర భారతదేశం నుండి దక్షిణభారతానికి భాగవత సంప్రదాయాన్ని తెచ్చిన ప్రథములు శ్రీనాథమునులు కావచ్చును" అని వ్రాశారు. ఆచార్య టి. రాజగోపాలాచారియర్ తమ "Vaishnavite Reformers of India" అనే గ్రంథంలో Page-2) పైదానితో ఏకీభవించారు. ఉత్తర భారతానికిచెందిన సాత్వత రాజవంశజుల వలన ఈ భాగవత సంప్రదాయం దక్షిణానికి వ్యాపించిందని, శూరసేనదేశానికి చెందిన వీరివల్లనే ఈ వ్యాప్తి జరిగిందని డా॥ ఎస్ కె. అయ్యంగార్ వ్రాశారు. Proceedings of the Second Oriental Conference Calcutta - 1928) యావద్భారతంలో కాలక్రమాన్ని వ్యాపించిన వైష్ణవం, అతి ప్రాచీనకాలంలోనే విదేశీయుల్ని ఆకర్షించిందని చెప్పడానికి "బెసనగర్" శాసనం (క్రీ. పూ 2వ శతాబ్ది) ఉత్తమోదాహరణ. అనాడు భాగవత ధర్మం 'హెలియోదరస్' అనే ఒక యవన రాయబారినికూడా ఆకర్షించి, ఆయన చేత దేవాధిదేవుడైన వాసుదేవుని గౌరవార్థం గరుడ స్తంభ ప్రతిష్ఠ చేయించింది. వాసుదేవ పరభక్తుడు, భాగవతుడు ఆయన! ఈ కాలంనాటిదే (క్రీ. పూ 2వ శతాబ్ది) బలరాముని విగ్రహం ఒకటి లక్నో సంగ్రహాలయంలో ఉన్నట్లు తెలుస్తోంది ఆయన ద్విభుజమూర్తి. ఒక చేతిలో - రోకలి, ఇంకో చేతిలో- నాగలి ఉన్నాయి. ఈ మూర్తి, ఆ కాలంనాటికే సంకర్షణోపాసన ఉన్నట్లు తెలుపుతోందని పరిశోధకులు అంటున్నారు. ఇదేవిధంగా మథురలో ఒక శాసనం శక- క్షత్రపుల కాలంనాటిది కనబడుతోంది. ఆ ప్రాంతం అప్పుడు క్షత్రపులపాలనలో ఉండేది. ఈ శాసనం క్రీ. పూ 80_57 మధ్య పరిపాలన చేసిన మహాక్షత్రప శోడాశకు సమకాలీ మైనది. అప్పుడు వసు అనేవాడు భగవానుడైన వాసుదేవునికోసం ఒక చతుశ్శాలామందిరం, వేదిక అక్కడ నిర్మించినట్లుగా చెప్తోంది.

ఇవన్నీ ఇలా ఉండగా పాణినిముని అష్టాధ్యాయిలో 'వాసుదేవార్జునాభ్యాం వున్' (4-3-98) అని ఉంది. పాణిని కాలాన్ని గురించి మతభేదాలున్నాయి. భారతీయ విద్వాంసులలో యుధిష్ఠిర మీమాంసకుల వంటివారు, ఆయన కాలం క్రీ పూ 2900 అనగా- పాశ్చాత్య పండితులు క్రీ. పూ. 4వ శతాబ్దికి చెందినవాడని కొందరు 7వ శతాబ్దికి చెందినవాడని కొందరు - అంటారు. పతంజలి ఈ సూత్రానికి వ్యాఖ్య వ్రాస్తూ చేసిన చర్చవల్ల ఈ పేరు భగవాన్ వాసుదేవునకు సంబంధించినదే అని తేలుతోంది. కైయటాదులైన వైయాకరణులు అనేకులు

దీనితో ఏకీభవించారు. ఇందువల్ల అనాటికే వాసుదేవుడు భగవానునిగా పరిగణిం చదం ఉందని తేలుతోంది. క్రీ. పూ. 4వ శతాబ్దికి చెందిన మౌర్యచంద్రగుప్తుని కాలంనాటి గ్రీకు రాయబారి మెగస్తనీసు రచనవల్ల కూడా-ఆ మధుర ప్రాంతంలో చాలా పూర్వకాలమే శౌరసేనిరాజుల పరిపాలన ఉండేదనీ, హెర్క్యులీసును పోలిన ఒక వీరుని ఆరాధన ఉండేదని-తెలుస్తోంది. తరువాతి కాలంలోని గుప్త రాజులు తమ్ముతాము పరమభాగవతులమని చెప్పుకొన్నారు, ఈ విధంగా భాగవత వైష్ణవం ఉత్తరభారతంలో చాలా పూర్వమే ఉన్నట్లు తెలుస్తోంది. భాగవత, వైష్ణవ, పాంచరాత్ర శబ్దాలు అతి ప్రాచీనకాలంనుండి వాడుకలో ఉన్నాయి. ఏకార్థ కాలయ్యాయి. వీటిని చక్కగా సూచించే "ఏకాయన" శబ్దం, ఇంకా ప్రాచీనకాలం నుండి - ఉపనిషత్కాలం నుండి-ఉంది. ఈ గ్రంథం ప్రథమాధ్యాయంలో వీటి వివరణచేయడం జరిగింది.

భాగవత ధర్మం మొట్టమొదటి నుండి మానవుల విషయంలో-జాతి, మత, దేశ, ప్రాంత, భాషాభేదాల్ని పాటించకుండా- ఉదారతతో వ్యవహరించింది ఈ ఉదారతవల్లనే విదేశీయులు చాలామంది ఈ ధర్మాన్ని అనుసరించారు. శ్రీమద్భాగవతంలోని ఈ క్రింది శ్లోకం ఈ విషయాన్ని తెలుపుతోంది.

"కిరాత, హూణాంధ్ర, పులిందపుల్కసా
ఆభీర, కంకా, యవనా, కషాదయః
యేఽన్యే చ పాపా యదుపాశ్రయాశ్రయా
శుద్ధ్యంతి తస్మై ప్రభవిష్ణవే నమః ॥" (2-4-18)

వైష్ణవధర్మం భారతదేశంలో ఎల్లలుదాటి చుట్టువట్ల దేశాలలో, ద్వీపాలలో ప్రచారం పొందడానికి ముఖ్యకారణం – భక్తిలోని ఆకర్షణ, మాధుర్యం. కర్మ కలాపాదులబెడద విశేషంగా లేకపోవడం. బృహద్భారతంలో ఈ ధర్మప్రచార మంతా ప్రేమానురాగాలలో జరిగినదేగాని, సంఘర్షణాత్మకంగా కాదు. ఆ నాటి భారతీయుల నాగరకతా సంస్కృతులలోని ప్రాభవం అందరిని ఆకర్షించింది. భారతీయ తాత్త్విక చింతనం, సాహిత్యం, శిల్పకళ అన్నీ కలిసిపోయి పరిసర దేశాలను ప్రభావితం చేశాయి. ఈనాడు మనం 'గ్రేటర్ ఇండియా' అనేది అదే! సముద్రం దాటి ఈ నాగరకతా సంస్కృతులు పయనించాయి. వైష్ణవ ధర్మం, వైదిక ధర్మంలోని భాగంగా అక్కడికిపోయి ఆ ప్రజల జీవితవిధానాన్ని తీర్చి

దిద్దింది. బౌద్ధధర్మం కూడా ప్రచారంలోనే ఉంది. జావాలో ప్రచారంలో ఉన్న ఒక కథప్రకారం, అక్కడ మొట్టమొదటి హిందూరాజ్యస్థాపన క్రీ॥ శ॥ 56లో జరిగిందని, భారతదేశంలో క్రీ॥ శ॥ 78న శకసంవత్సరం ప్రారంభమైనప్పుడే అక్కడకూడా ఈ శకసంవత్సరమే ప్రారంభం అయింది. సుమత్రాలో మిక్కిలి ప్రాచీనమైన హిందూరాజ్యం పేరు శ్రీవిజయ అనీ దానిస్థాపన క్రీ॥ శ॥ 4వ శతాబ్ది కంటె ముందే జరిగిందని అంటారు.

ఈ రాజ్యాభివృద్ధి క్రీ॥శ॥ 7వ శతాబ్ది చివరినుండి జరిగింది. తరువాత ఇప్పటి బోర్నియోలో 4వ శతాబ్దికి పూర్వమే అక్కడ క్షత్రియ రాజ్యాలు ఏర్పడ్డాయి అనీ, మూలవర్మ అనే ఆయన యజ్ఞయాగాదులుచేసి యూపస్తంభాలు స్థాపించాడని తెలిపే సంస్కృత శాసనాలు నాలుగు అక్కడ లభించాయి. బాలీ ద్వీపంలో నేటికీ హిందూ నాగరకతా సంస్కృతులు స్ఫుటంగా కనబడుతూనే ఉన్నాయి. బాలీలో పండితుల్ని "పదండ్" అంటారు. ఒక్క అక్షరం అర్థం తెలియక పోయినా ఇప్పటికీ వీరిలో కొందరు సంస్కృతభాషలోని ఎన్నో స్తోత్రాదికాన్ని అప్పజెప్పగలరు. తమపూర్వసంపత్తి అనే భావంతో- దేశమంతా ఇస్లాం ధర్మం వ్యాపించిఉన్నా - తమ విజ్ఞాన సంస్కృతులను రక్షించుకొంటూ ఉన్నారు. ఈ "పదండ్"లు (పండితులు) కంఠస్థంగా ఉంచుకొన్న గ్రంథాన్ని, కొన్ని దశాబ్దాలపూర్వం డా॥ లెవీ అనే ఫ్రెంచి విద్వత్పరిశోధకుడు లిపిబద్ధంచేసి "బాలీద్వీప గ్రంథా:" అని ప్రచురించాడు. (గాయక్ వాడ్ ఓరియంటల్ సీరీజ్- నం-67, 1933) ఈ భాషశుద్ధ సంస్కృతం. ఒక్క అక్షరం, ఒక్క పదం తెలియకపోయినా ఎంతో శ్రద్ధతో, భక్తిభావంతో ఇన్ని శతాబ్దాలు ఆ"గ్రంథాన్ని" కంఠస్థం చేసుకొని రక్షించిన "ఈ పదండ్"లు మన కృతజ్ఞతలకు పాత్రులు. వీటిలో కొన్ని భారతదేశంలోని సంస్కృత సాహిత్యంలో కనబడతాయి. కొన్ని కొత్తవి, అక్కడే బయలుదేరినవికూడా ఉన్నాయి. వీటిలో ఒక్క అపాణినీయ ప్రయోగం కనబడదని పండితుల కథనం.

జావాలో వైష్ణవ ధర్మంతోబాటు శైవధర్మం కూడా వ్యాపించి ఉంది. కాని అనాటి రాజవంశాలలో వైష్ణవధర్మానికి ప్రాధాన్యం అధికం. జావాలో- భగవాన్ విష్ణువు, భగవతి లక్ష్మి, వాహనమైన గరుత్మంతుడు సుందర విగ్రహాలరూపంలో దేశమంతటా వ్యాపించి ఉండడం కనబడుతుంది. విష్ణువుయొక్క శిలానిర్మితమైన

నానావతార మూర్తులు కనబడతాయి. బ్రహ్మరూపం కూడా చెక్కబడి ఉంది. ఇవన్నీ క్రీ॥శ॥ 9వ శతాబ్దినాటివని పరిశోధకులు నిర్ణయించారు. ఎన్నో మహా దేవుని ప్రతిష్ఠఉన్న మందిరాలు జీర్ణావస్థలో ఉన్నాయి. మంచి స్థితిలోఉన్నమంది రంలో రామజన్మకథ అంతా చిత్రితమై ఉంది. "బేల్హాన్" అనేచోట విష్ణుదేవుని మూర్తులు చాలా కనబడతాయి. ఈవిధంగా, జావాలో సామాజిక జీవనంతో కళా త్మక జీవనంతో ముడిపడిన వైష్ణవధర్మం కనబడుతుంది.

"చంపా"లోకూడా వైష్ణవధర్మం బాగా వ్యాపించి ఉంది. విష్ణుదేవుని మూర్తులు, లక్ష్మీదేవి మూర్తులు, గరుత్మంతుని మూర్తులు దేశవ్యాప్తంగా కనబడ తాయి. ముఖ్యంగా, కృష్ణుని మూర్తులు అన్నిచోట్లఉన్నాయి. ఆయన గోవర్ధన ధారణ వాటిని చాలా ఆకర్షించి ఉండవచ్చును. ఆ శిల్పాలు చాలాచోట్ల కనబడ తాయి. అక్కడి ప్రజలకు బాగానచ్చిన పక్షి గరుత్మంతుడు. ఆ మూర్తులు ఎన్నో ఉన్నాయి.

'సయాం'లో (థాయ్‌లాండ్) బౌద్ధధర్మం విశేషంగా ప్రచారంలో ఉన్నా వైష్ణవధర్మంలోని అహింసాదికం వారిని ఆకర్షించడంవల్ల దీనివిషయం ఆ ప్రజ లకు తెలిసినదే 14వ శతాబ్ది మధ్యకాలంలో (1350 క్రీ॥శ॥) సువనపునీ లేదా ఓటంగ్ అని పిలువబడే ప్రాంతానికి రాజైన ఆయన అయోధ్య పేరుమీదుగా "అజూథిఅ" అనే నవ్యరాజధానిని నిర్మించి రామాధిపతి అనే పేరుతో రాజ్యం చేసి నట్లు తెలుస్తోంది. ఈ విధంగా- బౌద్ధధర్మ ప్రభావం ఉన్నదేశంలోకూడా-రామ నామం, అయోధ్య పేరు కనబడుతున్నాయి.

కంబోజ్‌దేశం (కంబోడియా) కాంభోజదేశంగా మనకు పూర్వంనుండి తెలిసేఉంది. ఇక్కడకూడా శైవధర్మంతోబాటు వైష్ణవమూ వ్యాపించిఉంది. ఇక్కడ మిగిలిన దేశాల్లోకంటె భారతీయ సంస్కృతి విశేషంగా కనబడుతుంది. ఈ దేశప్రజలు ఈ సంస్కృతిని పూర్ణంగా స్వీకరించినట్లుంటుంది. ఇక్కడి హిందూమందిరాల్లో రామాయణ, భారతాలతోబాటు ఇంకా ఎన్నో పురాణాల ప్రతిదిన ప్రవచనం ఉంది. ఇక్కడ వైష్ణవ ధర్మానికి విశేషంగా ఆదరణ ఇచ్చిన రాజు రెండో సూర్యవర్మ (1113 నుండి 1145 క్రీ॥శ॥) దీనికి చిహ్నంగా ప్రపంచ విఖ్యాతిపొందిన "అంగోర్‌వాట్" దేవాలయ సముదాయాన్ని గ్రహించ వచ్చును. ఇది కంబోడియా- భారతీయ కళల సుందర సమ్మేళనానికి ఉత్తమో

దాహరణ. రామాయణ, మహాభారత, హరివంశాది రచనలలోని ముఖ్యమట్టాల చిత్రాలు, శిల్పాలు (విరాధవధ, రామసుగ్రీవుల మైత్రి, వాలిసుగ్రీవుల మల్ల యుద్ధం, హనుమంతుడు లంకను కాల్చడం మొదలైనవి) ఇక్కడ కనబడతాయి. వైష్ణవధర్మానికి ఇంత ప్రాధాన్యం ఇచ్చి చిత్రాల్ని, శిల్పాల్ని ప్రదర్శించిన దేవ స్థానం మనకు భారతదేశం దాటిన తరువాత కనబడదంటే అతిశయోక్తి కాదు.

ఇదివరలో మనం అనుకొన్నట్లే, బాలీద్వీపంలో సనాతన హిందూధర్మం నేటికి అనుష్ఠానంలో కనబడుతుంది. అయితే, అది దేశకాల పాత్రానుసారంగా మారి కనబడుతుంది. కాని, ఆ మార్పుల వెనుక సనాతన ధర్మంయొక్క పునా దులు కనబడతాయి. హిందూదేవతల ఉపాసన, ఆచారవ్యవహారాలు ప్రచలితంగా ఉన్నాయి. విష్ణుస్తోత్రాల్లో రెండు అక్కడ మంచి ప్రచారంలో ఉన్నాయి ఒకటి మనదేశంలో నేటికీ వాడుకలో ఉన్న "విష్ణుపంజర" స్తోత్రం. రెండోది బాలీ ద్వీపంలో ప్రచారంలో ఉన్న గద్యాత్మకమైన "విష్ణుస్తవమ్". ఇది రమణీయమైన ప్రౌఢశైలిలో ఉంది. విష్ణుపంజర స్తోత్రంనుండి ఉదాహరణార్థం ఒకటి, రెండు శ్లోకాలను గ్రహిద్దాము :

> పాదౌ రక్షతు గోవిందో, జంఘాభ్యాం త్రివిక్రమః ।
> ఊర్వంతం కేశవో రక్షేత్, రక్షేత్ గుహ్యం తథాహరిః ॥
>
> ఉదరం పద్మనాభశ్చ, కటిం చైవ జనార్దనః ।
> నాభికమచ్యుతో రక్షేత్, పృష్ఠః రక్షతు మాధవః ॥

ఈ విష్ణుపంజరస్తోత్రం భారతదేశంలోను ప్రచారంలో ఉంది. ఇక్కడ ప్రచారంలో లేని (సంస్కృత స్తోత్ర సాహిత్యంలో కనబడని) గద్యాత్మకమైన 'విష్ణుస్తవం' ఒకటి అక్కడ కనబడుతోంది. దీన్ని బాలీ పదండ (పండిత) భక్తులే రచించి ఉండవచ్చును. ఉదాహరణార్థం :

"ఓం నమోఽస్తు పురుషోత్తమాయ పరమరిపు పర పుర హరణ పరాక్రమాయ పరమబలభటోలటోల లోలిత గళిత మహాబలాయ చ జాగ్రత సుప్త తూర్యచతుర్భుజాయ నారాయణాయ నరసింహ వామ నాయ నారాయణార్ధనాయ నరగదాయుద్ధే దానవాంతక రిపుమర్దన పాంచ

జన్య సుదర్శనాయుధాయ దైత్యదానవయక్ష రాక్షస పిశాచ భూతగణ ధరణీధర ధీరదరాయ చ గాంధర్వమధురగీత సురవిద్యాధర ఋషి ప్రభృతి సేవితాయ చ పరమరిపురావణార్జున ధేనుక ప్రలంబ కేశరావి ష్టక మేనిగజబల తరగమిన సృగాలాది నిధనాయ చ పురుషోఽనంత సముద్రాశ్రయః ఖగవరవరేంద్రః శ్రీప్రియో ధనదప్రియో వైశ్రవణాంగ కోఽస్మాన్ రక్షతు అస్మాన్ గోపాయతు స్వాహా॥"

ఈ స్తోత్రాన్నిబట్టి బాలీవాసులకు విష్ణుగాథలు, అవతారాలు, కృష్ణకథలు తెలుసునని గ్రహించవచ్చును. సలక్షణమైన సంస్కృతంలో కమనీయ శబ్ద ప్రయోగంతో రచితమైన ఈ స్తోత్రం భారతదేశంలో కనబడదు. గద్యరచనను బట్టిచూస్తే భగవద్రామానుజులవారి గద్యత్రయం బాలీవారికి తెలిసినట్లనిపిస్తుంది! ఈ స్తోత్రరాజాలను రక్షించిన వారిలో చాలామందికి వీటి అర్థం తెలియదు నేడు. భక్తిప్రపత్తులతో మనదేశంలో వేదాలను రక్షించినట్లు- వీటిని "పదండులు" రక్షించారు.

శ్రీమన్నారాయణునిదేవి, పురుషకార స్వరూపిణి అయిన లక్ష్మీదేవికి బాలీ ద్వీపంలో విశేష ప్రసిద్ధిఉంది. బాలీవాసులు ఆమెను శ్రీదేవిగా వ్యపదేశించి ఆరా ధిస్తారు. అక్కడ ఆమె ధాన్యదేవత. కనుక ఆమెను బాలీవాసులు-శ్రీతాండులీ అనీ, ధాన్యరాజ్ఞి అనీ పిలుస్తారు. ఆమెను గురించిన ఒక శ్లోకం ఇది-

"శ్రీతాండులీ మహాదేవీ శీమత్ కమల శోభితా ।
దదాసిమే మహాభోగ్యం సర్వద్రవ్యహితం ధనమ్ ॥"

ఆమె సౌందర్యరాశి; స్నిగ్ధకోమల తనువు ఆమెది. ఇంకో శ్లోకం ఇది-

"శ్రీశాలికాంతరూపా త్వం స్నిగ్ధగాత్రం చ తాండులమ్ ।
దదాతిమే సదా చిత్రం సౌభాగ్యం లోకపూజితమ్ ॥"

బాలీద్వీపవాసులు- శ్రీదేవి అనుగ్రహంవల్ల పంటలు బాగా పండి దేశం సుభిక్షంగా ఉంటుందని విశ్వసిస్తారు. అక్కడ ఒక పురాణకథలో శ్రీదేవిని ఒక రాక్షసుడు అపహరించగా ఆమె చనిపోతుంది. తరువాత ఆమె శరీరంనుండి అనేక వృక్షజాతులు ఉద్భవిస్తాయి. నాభినుండి ధాన్యసంబంధమైన అనేక బీజాలు జన్మి

స్థాయి. ధాన్యం వాడుకలో బియ్యంగా మారడాన్ని పురస్కరించుకొని ఆయా అవస్థలకు దేవీనామాలు పెట్టుకొన్నారు. ధాన్యపుగింజలకు "ఉమాదేవి" అని పేరు. కొత్తగా మొలకెత్తినప్పుడు దానికి పేరు "గిరినాథ్"; మొలకల్ని వేరుగా ఆకు మళ్ళనుండి తీసి పాతేటప్పుడు (ఉబాలు లేదా ఊడ్పులు) ఆ మొక్కకు "గంగీ దేవీ" అని పేరు. ఈ శ్రీదేవిమీద ఒక సుందర స్తుతి ఉంది దీనిలోనుండి రెండు శ్లోకాలు ఉదాహరణార్థం ఇస్తున్నాను :

"శ్రీదేవీ మహావక్త్రి చతుర్వర్ణా చతుర్భుజా ।
ప్రజ్ఞావీర్య సారక్షేయా చింతామణి కురుస్మృతా ॥
శ్రీధనదేవికా రమ్యా సర్వరూపవతీతథా ।
సర్వజ్ఞాన మణిశ్చైవ శ్రీ శ్రీదేవి ! నమోస్తుతే ॥"

(బాలీ ద్వీపానికి సంబంధించిన ఉదాహృత పద్య (శ్లోక) గద్యాలు పాశ్చాత్య విద్వాంసుడు, ఫ్రాంసుదేశస్థుడు అయిన డా॥ సిల్వియన్ లెవీ సంపాదించి, గైక్వాడ్ ఓరియంటల్ సీరీజ్‌లో నంబరు 67; (1933)గా ప్రచురించిన "బాలి ద్వీప గ్రంథాః" నుండి గృహీతాలు)

ధాన్యదేవత అయిన శ్రీదేవి పేర్లనుబట్టి (శ్రీతాండులీ, శ్రీధాన్యరాజ్ఞీ మొదలైనవి) ఆమె శరీరంనుండి వివిధ వృక్షజాతులు, ధాన్యజాతులు ఉద్భవించడాన్ని బట్టిచూస్తే మనకు 'శ్రీదుర్గాసప్తశతి'లోని శాకంభరీదేవి జ్ఞాపకం వస్తుంది :

తతోఽహ మఖిలం లోకమాత్మ దేహ సముద్భవైః ।
భరిష్యామి సురాఃశాకై రావృష్టేః ప్రాణధారకైః
శాకంభరీతి విఖ్యాతిం తదా యాస్యామ్యహం భువి ॥

(శ్రీదుర్గాసప్తశతి—11-48, 49)

"ఆత్మదేహ సముద్భవమైన శాకాదులతో అనావృష్టి పీడితులను భరిస్తాను కనుక, నాకు శాకంభరి అనే విఖ్యాతి కలుగుతుంది" అని జగజ్జనని చెప్పడం, బాలీ ద్వీపంలోని శ్రీదేవి దేహంనుండి వృక్షజాతులు, ధాన్యజాతులు ఉద్భవించడం పోల్చిచూస్తే మన సంస్కృతి, తాత్త్విక చింతన బృహద్భారతం (గ్రేటర్ ఇండియా)లో వివిధదేశాలలో బయలుదేరిన గాథలను, ఆలోచనా విధానాలను,

ఆచారవ్యవహారాలను ఎంతగా ప్రభావితం చేశాయో తెలుస్తుంది. మన సంస్కృతిలో- వేదోపనిషత్తులు, కావ్యేతిహాస పురాణాదులు; మన భాగవతుల, ఆచార్య పురుషుల రచనలు భాగాలుగదా! ఇంత విశిష్టమైన సంస్కృతి పరదేశాలను ప్రభావితం చేయడంలో ఆశ్చర్యంలేదు. దీనిలో సంఘర్షణగాని, క్రౌర్యంగాని, పరపీడనగాని లేకపోవడంవల్ల ఈ సంస్కృతి అచిరకాలంలోనే సర్వుల ఆమోదాన్ని పొంది స్వదేశ సంస్కృతితో కలిసిపోయి, ఒకటిగా అయిపోయి, నేటి వరకు నిలిచిఉంది; కొనసాగుతూనూ ఉంది.

## శ్రీ రామానుజ సంప్రదాయం

శ్రీ సంప్రదాయం అని, శ్రీవైష్ణవ సంప్రదాయం అని, శారీరక మీమాంసా దర్శనం అని, ఉభయ వేదాంతదర్శనం అని, శుద్ధాంత దర్శనం అని, భాగవత మతమని, శ్రీ రామానుజ దర్శనం అని ఈ విశిష్టాద్వైత సంప్రదాయానికి పేర్లు. ఈ సంప్రదాయానికి నిశితమూ, నిష్కర్షమూ, గంభీరమూ అయిన తాత్త్విక సంపన్నతను తమ రచనలద్వారా కలిగించి, జగజ్జేగీయమానంగా ప్రపంచంలో ప్రచారం తెచ్చిన మహామనీషులు, యతిసార్వభౌములు, దయైక సింధువులు భగవద్రామానుజులవారు. సగుణోపాసనను శ్రుతి స్మృతుల ఆధారంతో, ఆగమశాస్త్ర సాహాయ్యంతో, పురాణాదుల తోడ్పాటుతో తీర్చిదిద్ది సుస్థిరం చేసిన దార్శనికులు వీరు. వీరి సంప్రదాయ స్థాపన తరువాత వచ్చిన, సగుణోపాసనను ఆమోదించిన వివిధ సంప్రదాయ ప్రవర్తకులందరు వీరికి ఋణపడి ఉన్నారంటే అది అతిశయోక్తి అనిపించుకోదు!

భగవద్రామానుజులవారిచే, వారి అనుయాయులచే శతాధిక గ్రంథజాతం ద్వారా సుప్రతిష్ఠితమైన శ్రీ విశిష్టాద్వైత సిద్ధాంతానికి శ్రీ ఆళ్వార్లపాశురాలు, వాటిపై వచ్చిన వ్యాఖ్యానాలు సాహిత్యపరమైన మూలస్తంభాలు అనవచ్చును. ఆచార్యులందరు ఆళ్వారులయందు తమ భక్తి ప్రవృత్తులను ప్రదర్శించారు. మహాభక్తులైన శ్రీ వేదాంత దేశికులవంటి మహానుభావులైన మహావిద్వాంసులు "ద్రమిడోపనిషత్తాత్పర్య రత్నావళి"ని రచించారు. వేదవ్యాసులవారనుగ్రహించిన సంస్కృత వేదాంత శాస్త్రానికి, శ్రీ నమ్మాళ్వారు మహానుభావులను గ్రహించిన ద్రావిడ వేదాంత శాస్త్రానికిని-భాష విషయంలో తప్ప- ఏకవాక్యత ఉన్నదని

శ్రీ వైష్ణవులు ఐకకంఠ్యంతో చెప్పారు. శ్రీ అద్యాన్ పిళ్లై మహోదయులు ఒక శ్లోకంద్వారా- భగవద్రామానుజులు అవతరించి దీన్ని- ఈ ఏకవాక్యతను- స్థాపించారని ఇలా చెప్పారు :

"పురానూత్నే త్రిర్వ్యాసః శ్రుతిశరశిరోఽర్థం గ్రథితవాన్
విపత్రవేతం శ్రావ్యం వకుళధరతామేత్య స పునః
ఉభావేతా గ్రంథౌ ఘటయితుమలం యుక్తిభిరసౌ
పునర్జజ్ఞేరామావరజ ఇతి స బ్రహ్మముకురః ॥"

(పూర్వము వేదవ్యాసులవారనుగ్రహించిన వేదాంత శాస్త్రానికి శ్రీ వకుళాభరణు లైన నమ్మాళ్వారులు అనుగ్రహించిన ద్రావిడ వేదాంత శాస్త్రానికి ఏకవాక్యత సంపాదించి పరమార్థాన్ని తెలిపి అందరిని తరింపజేయడానికి బ్రహ్మముకుర (దర్పణం) స్థానీయులైన భగవద్రామానుజులు అవతరించారు-స్థూలార్థం)

మహాభక్తులైన ఆళ్వార్లను పేర్కొనే శ్లోకమొకటి ఉంది :

"భూతం సరశ్చమహదాహ్వయ భట్టనాథ
శ్రీ భక్తిసార కులశేఖర యోగివాహాన్ ।
భక్తాం ఘ్రిరేణు పరకాల యతీంద్ర మిశ్రాన్
శ్రీమత్పరాంకుశ మునిం ప్రణతోఽస్మి నిత్యమ్ ॥

ఆళ్వార్ అనే తమిళపదానికి-భక్తుడు, భక్తి తన్మయుడు, భక్తిలో మునిగినవాడు అని అర్థం. వీరిలో అన్నికులాలవారు- అంత్యజునిగా పరిగణింపబడే వారొకరు, ఒక స్త్రీ-కూడా ఉన్నారు. పైశ్లోకంలో-పదిమంది ఆళ్వార్లు కీర్తించబడ్డారు. ఆళ్వార్లు పన్నిద్దరాళ్వారులని ప్రసిద్ధి ఈ శ్లోకంలో పేర్కొబడ్డ ఆళ్వార్లు- పూదత్తాళ్వారు, పొయిగైయాళ్వారు, పేయాళ్వారు, పెరియాళ్వారు, తిరుమళిశైయాళ్వారు, కులశేఖరాళ్వారు, తిరుప్పాణాళ్వారు, తొండరడిప్పొడియాళ్వారు, తిరుమంగైయాళ్వారు నమ్మాళ్వారు అనేవారు ఈ పదిమంది. దీనిలో పేర్కొబడిన 'యతీంద్రమిశ్రులు' భగవద్రామానుజులు. ఈ మహానుభావుని ఆళ్వార్లలో చేర్చడం గౌరవార్థం అని గ్రహించాలి. "ఈ ప్రస్తావనలో వీరికి అన్వయంలేదు." ఈ శ్లోకంనుండే పన్నిద్ద రాళ్వార్ల పేర్లను సాధించేవారున్నారు. అప్పుడు "శ్రీ భక్తిసార" అనేమాటనుండి

"శ్రీ"ని వేరుచేసి శ్రీశబ్ద ప్రయోగంచేత "అండాళ్" చెప్పబడినదని భావించి; "శ్రీమత్పరాంకుశ" అన్నప్పుడు, "శ్రీమత్" శబ్దంచేత "మధురకవి ఆళ్వార్" అని గాని, "యతీంద్రమిశ్రాన్" అనుచోట "మిశ్ర" శబ్దంచేత ''శ్రీరామమిశ్రు"లను గాని చెప్పి "పంన్రెండు" సంఖ్యను సాధిస్తారు. "దివ్య ప్రబంధములకు ప్రథమా శ్రయమగు 'పెరియకోవిల్' (శ్రీరంగము) నందు 'అరైయర్లు' శ్రీరంగనాథునకు 'కట్టియం' చెప్పునప్పుడు 'పదిన్మర్ పాడుం పెరుమాళ్' (పదిమంది ఆళ్వారులు పాడినదేవు(డు) అని యను సంధించుట- మొదటిపక్షమునకు గమకము. నాలా యిర దివ్యప్రబంధ నిర్మాతలలో 'అండాళ్', 'మధురకవి'- ఈ యిరువురును చేర్చబడుట రెండవ పక్షమునకు సాధకము. ఇట్లే- లోకవ్యవహారము ప్రసిద్ధి జెందినది" (పన్నిద్దరాళ్వారుల వైభవము: శ్రీమాన్ రొంపిచర్ల పార్థసారథి భట్టా చార్యులు- శ్రీ రామానుజ కీర్తికౌముది, మొదటిభాగము-పుట-213).

కలియుగంలో ప్రజలు భక్తిహీనులై అధోగతికి పాలవుతూ ఉండడాన్ని నివారించి వారిని సన్మార్గగాములుగా చేయాలని శ్రీమన్నారాయణుడు సంకల్పించి తమ్ము పరివేష్టించి ఉన్న- అనంత, గరుడ, విష్వక్సేనులను; తాము ధరించిన- శ్రీవత్స. కౌస్తుభ, వనమాలా వైజయంతీ, పంచాయుధాలను భూలోకంలో కావేరీ, తామ్రవర్ణి, కృతమాలా (వైగై) పయస్వినీ (పాలార్) నదీతీరాలలో యథోచిత మైన స్థానాలలో, వివిధవర్ణాలలో, యథోచిత రీతిని అవతరించండి అని ఆజ్ఞా పించడంతో ఆయా దివ్యపరివారమంతా ఆళ్వారులుగా అవతరించారని శ్రీ వైష్ణ వుల విశ్వాసం. ఆండాళ్ (గోదాదేవి) భూదేవ్యంశ, (విశ్వంభరాంగోదాం); పూద త్తాళ్వారు (భూతయోగులు)విష్ణుమూర్తి గదయైన కౌమోదకిఅంశ, పొయిగైయాళ్వారు (సరోయోగులు) విష్ణుమూర్తి శంఖమైన పాంచజన్యాంశ; పేయాళ్వారు (మహా యోగులు) విష్ణుమూర్తి ఖడ్గమైన నందకాంశ; పెరియాళ్వారు (భట్టనాథులు) విష్ణుమూర్తి వాహనమైన గరుడాంశ; తిరుమళిశైయాళ్వారు (భక్తిసారయోగి) విష్ణు మూర్తి చక్రమైన సుదర్శనాంశ; కులశేఖరాళ్వారు విష్ణుమూర్తి కౌస్తుభాంశ; తిరు ప్పాణాళ్వారు (యోగివాహనులు) విష్ణుమూర్తి శ్రీవత్సాంశ; తొండరడిప్పొడి యాళ్వారు (భక్తాంఘ్రిరేణువు) విష్ణుమూర్తి వనమాలాంశ; తిరుమంగైయాళ్వారు (పరకాలయోగులు) విష్ణుమూర్తి కార్ముకాంశ; నమ్మాళ్వార్లు (పరాంకుశమునులు) విష్వక్సేనాంశ. శ్రీభక్తిసార అనే శబ్దంలోని 'శ్రీ'- భూదేవ్యంశ అయిన అండా ళమ్మను; శ్రీమత్పరాంకుశ అన్నశబ్దంలోని 'శ్రీమత్' మధురకవి ఆళ్వారును

సూచిస్తాయి అని తెలుసుకొన్నాము. మధురకవి ఆళ్వారు, విష్వక్సేనుని గణాధి పులలో ఒకరైన 'కుముదుదు' అనే ఆయన అంశలో జన్మించారు. యతీంద్ర మిత్రులు భగవద్రామానుజులు. ఆదిశేషుని అంశలో జన్మించారు. వీరికి "ఉదయ వర్లు" అనేది తమిళనామం.

ఈ ఆళ్వార్లకు దివ్యసూరులని, పరమయోగులని ప్రసిద్ధమైన పేర్లు. "చూడి కొడుత్త నాచ్చియార్" అనే అన్వర్థ నామమున్న పెరియాళ్వార్ పెంపుడు కూతురైన గోదాదేవి కథను "ఆముక్త మాల్యద" అనే పేరుతో తెలుగులో ప్రౌఢ ప్రబంధంగా తీర్చిదిద్దిన శ్రీకృష్ణదేవరాయలు—పరరాజ భయంకరులైనా, పరమ వైష్ణవులు గనుక- తమ ప్రబంధ ప్రారంభంలో ఆళ్వార్లను ఇలా స్మరించారు :

"అలపన్నిద్దఱు సూరులందున సముద్యల్లీలఁగా పున్నవె
గ్గలపుం దాపముఁబాపనా నిజమనఃకంజాత సంజాతపు
ష్కల మాధ్వీకఝరిన్మురారి సొగియంగాఁ జొక్కి- ధన్యాత్ములౌ
నిలపన్నిద్దఱు సూరులందలఁతు మోక్షేచ్ఛామతిన్ దివ్యులన్."

మొట్టమొదటిసారిగా తెలుగులో మనకు ఆళ్వారాచార్యుల చరిత్ర "ఆముక్త మాల్యద"లో కనబడుతుంది. సంస్కృతంలో శ్రీరంగనాథాలయ మహాసభాధ్యక్షులు (రంగాధిపారోగ్య శాలా వల్లభులు)గరుడవాహన పండితులు "దివ్యసూరి చరితమ్" అని వ్రాశారు. ఆళ్వారాచార్యులను గురించి వివరించి చెప్పే తొలి గ్రంథం ఇది అని పండిత పరిశోధకుల విశ్వాసం. దీనిలో 18 సర్గలున్నాయి. ఈ కవికి "కవి వైద్య పురందర" అనే బిరుదు ఉంది. దీని తరువాత తమిళంలో మణిప్రవాళ (తమిళం సంస్కృతం కలిపిన) శైలిలో "గురు పరంపరా ప్రభావమ్" అని వీరి చరిత్రను వివరించే గ్రంథాన్ని వైష్ణవాచార్యులు శ్రీమాన్ పిన్బళగియ పెరుమాళ్ జీయర్ వ్రాశారు ఈ గ్రంథం భగవద్రామానుజులవారి కాలానికి- కొంచెం ఇటో ఆటోగా- సమకాలికంగా అని కొందరంటారు— వచ్చింది. తరువాత శ్రీమాన్ అనంతాచార్యులు అనే విద్వాంసులు సంస్కృతంలో "ప్రపన్నామృతమ్" రచించారు. ఈయన 16వ శతాబ్దివాడు. ఆళ్వారాచార్యుల చరిత్రను తాళ్ళపాక అన్నమాచార్యులుగారి పౌత్రుడైన తాళ్ళపాక తిరువేంగళనాథుడు "పరమయోగివిలాసము" అనే పేరుతో తెలుగులో వ్రాశారు. తరువాత మంగళగిరి వాస్తవ్యులైన శ్రీమాన్ నంబూరి కేశవాచార్యులు "ఆచార్య సూక్తి ముక్తావళి" అనే గ్రంథాన్ని 18వ

శతాబ్ది చివరిభాగంలో వ్రాశారు. ఈయనకు సమకాలికుడైన శ్రీమాన్ వంగల సీతారామాచార్యులు అనే కవి "ఆచార్య రత్నమాల" అనే పేరుతో వీరిచరిత్ర వ్రాశారు. 18వ శతాబ్దిలో సురపుర రాజ్యాన్ని పాలించిన రాఘవ పామానాయకుడు (1752-1778) సంస్కృతంలో ఉన్న భార్గవపురాణంలోని ఉత్తరఖండాన్ని తెలుగు చేయడంతో దానిలోని ఆళ్వారాచార్య చరిత్ర ప్రబంధ పక్కీలో తెలుగులోనికి వచ్చింది. శ్రీమాన్ మేడేపల్లి వేంకట రమణాచార్యులు (1862-1943) ప్రపన్న జనకూటస్థులను కీర్తిని పొందిన నమ్మాళ్వారుల దివ్యప్రబంధమైన "తిరువాయిమొళి"కి తెలుగు పద్యానువాదం, సంస్కృతానువాదం చేసి "ఆంధ్రగీర్వాణ శఠకోప సహస్రమ్" అని కలిపి ప్రకటించారు. ఈనాడుకూడా ఎందరో భక్తులైన విద్వాంసులు ఆళ్వారాచార్యులనుగూర్చి పరిశోధనాత్మకంగా వ్రాస్తున్నారు. విద్యాభూషణ-ఉపన్యాసకరత్న-కవితా విశారద శ్రీమాన్ ధనకుధరం వరదాచార్యులు గారు సంపాదకులుగా, శ్రీ వైష్ణవధర్మ విజ్ఞాన సర్వస్వమై భక్తులైన విద్వాంసుల రచనలతో సంపుటాలుగా వెలువడిన "శ్రీరామానుజ కీర్తికౌముది"ని ఈ సందర్భంలో పేర్కొనాలి.

ఈ ఆళ్వారుల కాలాన్నిగురించి వాదోపవాదాలు చాలా ఉన్నాయి. ఐతిహాసిక విషయాలలో గురుపరంపరలను విశ్వసించే సంప్రదాయాభినివేశం ఉన్నవారు వీరికాలాన్ని ద్వాపరయుగం దాకా తీసుకొని వెళ్లారు. వీరు క్రీ॥శ॥ మూడో శతాబ్దినుంచి తొమ్మిదో శతాబ్దివాకా ఉండి ఉంటారనీ, వీరిని కాలానుగుణంగా మూడువర్గాలుగా విభజించవచ్చుననీ కొందరంటారు. ప్రథమవర్గంలో—పొయ్‌గై యాళ్వార్, పూదత్తాళ్వార్, పేయాళ్వార్‌ను; వీరికి సమకాలికులైన తిరుమళిశైయాళ్వార్- వస్తారు. మధ్యమవర్గంలో నమ్మాళ్వార్, కులశేఖరాళ్వార్, మధురకవియాళ్వార్, పెరియాళ్వార్, అండాళ్ళమ్మ వస్తారు. అంతిమవర్గంలో- తొండరడిప్పొడియాళ్వార్, తిరుప్పాణియాళ్వార్, తిరుమంగైయాళ్వార్ వస్తారు. ఈ వర్గాలన్నీ ఆధునిక పరిశోధకులు తమకు లభించిన సామగ్రినిబట్టి చేసినవే. ఈ వర్గీకరణకు ప్రధానంగా "కాలం" ఉపకరణంగా గ్రహించడం జరిగింది. ఆళ్వారుల ఆస్తిక్య దృక్పథానికి, వారి రచనల విషయానికి సంబంధించినదికాదు. ఇది స్థూల వర్గీకరణ. వారిలో హెచ్చుతగ్గులు మొదలైనవి ఏవీలేవు. అందరూ మహాభక్తులే; మహాకవులే; మహాపురుషులే!

ఈ మహాభక్తులు దేశంలోని- ముఖ్యంగా దక్షిణ భారతంలో—వివిధ పుణ్య

క్షేత్రాలను దర్శించినప్పుడు చేసిన గానరుచులే వీరి పాశురాలు. భగవదంశలో అవతరించిన వీరు భక్తి తత్త్వ ప్రచారానికి పూనుకొన్న- అప్రయత్నంగా అందాం మహాకవులు. శాస్త్రాదులభ్యసించి సిద్ధాంతాలను ప్రతిపాదించే కాంక్షఉన్న దార్శనికులుకారు. తాము భగవద్భక్తిలో మునిగితేలుతూ లోకాలను తన్మయుల్ని చేసి తరింపజేసినవారు. రససిద్ధులైన కవులు. "రసో వైసః" అనేదాన్ని భక్తిభావంతో అర్థంచేసుకొన్న భగవత్కవులు వీరు. అందరూ సహజంగా విష్ణుభక్తులే. ఆయన అవతారాల నన్నింటియందు వారివారి అభిరుచుల ననుసరించి భక్తిని ప్రదర్శించిన వారే. అందరికి లక్ష్మీనారాయణులు సర్వదేవతా మూర్తులకంటె ఉన్నతులే! లక్ష్మీ సహితుడు గనుకనే ఆయన శ్రీమన్నారాయణుడు.

మహాభక్త శిఖామణులైన ఆళ్వార్ల పాశురాలు కొన్నిశతాబ్దులు భక్తులైన ప్రజల నాలుకలపై నాట్యమాడుతూ ఉన్నా వాటినన్నింటిని ఒకచోటచేర్చి క్రమబద్ధంగా అభ్యసించే, అర్చనాదికంలో ఉపయోగించేవిధానం స్థిరరూపాన్ని పొందనట్లు కనబడుతుంది. ఆ మహాకార్యాన్ని నెరవేర్చడానికి శ్రీమన్నారాయణుడు ఒక ఆచార్య పురుషుని ఎన్నుకొనే ఉన్నాడు. ఆ మహాపురుషుడు శ్రీనాథమునులు. ఈ మహానుభావులను ఇందువల్లనే ఇలా నమస్కార పూర్వకంగా కీర్తించారు :

"నమోఽచిన్త్యాద్భుతా క్లిష్టజ్ఞాన వైరాగ్యమూర్తయే ।
నాథాయమునయేఽగాధ భగవద్భక్తి సిన్ధవే ॥

దీనినిబట్టి- శ్రీనాథమునుల జ్ఞానవైరాగ్యాలు అచింత్యాలు, అద్భుతాలు- అని పెద్దలందరూ అంగీకరించినట్లు తెలుస్తోంది. వీరిపౌత్రులు, మహానుభావులు అయిన శ్రీయామునాచార్యులు వీరినిగూర్చి "అకృత్రిమత్వచ్చరణారవింద ప్రేమ ప్రకర్షావధి మాత్మవంతమ్" అన్నారు. "భగవద్భక్తికి నాథమునులే అవధి" అని కీర్తించబడ్డారు.

శఠమర్షణ గోత్రోద్భవులైన శ్రీనాథమునులు బహుదీర్ఘజీవులు. ఇంచుమించుగా క్రీ॥శ॥ తొమ్మిదో శతాబ్దిలో చాలాకాలం జీవించి ఉన్నట్లును క్రీ॥శ॥ 920లో ఈయన పరమపదించినట్లును చెప్పుకొంటారు వీరి పౌత్రులైన శ్రీయామునాచార్యులు భగవద్రామానుజులకంటె వయస్సులో పెద్ద అయిన సమకాలికులు. ఈ విషయాన్ని బట్టి వీరికాలాన్ని మనం గ్రహించవచ్చును. ఉత్తరభారతంనుండి

దక్షిణభారతానికి తరలివచ్చిన భాగవత కుటుంబాల సంతతికి చెందినవారు నాథమునులని పరిశోధకుల అభిప్రాయం. చోళదేశంలోని వీరనారాయణపురం(మన్నారుగుడి)లో శ్రీ ఈశ్వర భట్టునకు ఈయన ఉదయించారు. చిన్ననాటినుండి ఆ గ్రామంలో ఉన్న మన్నారు (రాజగోపాల) కృష్ణుని భక్తులు. ఈయన బాల్యంలోనే దేశాటనానికి బయలుదేరి దేశం నలుమూలల ఉన్న పుణ్యక్షేత్రాల నన్నింటిని దర్శించివచ్చారు. ఒకనాడు మేల్నాడునుండి వచ్చిన వైష్ణవులు కొందరు శ్రీనమ్మాళ్వారు రచించిన "ఆరావముదే అడియే నుడలం నిన్బాలన్ బాయే" అనే పది పాశురాలు "మన్నారు రాజగోపాలదేవు''ని సేవలో గానంచేశారు. అప్పుడు శ్రీనాథమునులు ఆపాశురాల కవితా ప్రాగల్భ్యానికి మాధుర్యానికి ముగ్ధులై, మిగిలినవాటిని కూడా తమకు అనుగ్రహించవలసినదని ఆ స్వాములను ప్రార్థించారు. వారు మాకింతవరకే తెలుసును– అని చెప్పగా, శ్రీనాథమునులు చింతించి శ్రీనమ్మాళ్వార్లు జన్మించిన కురికా పురానికే పోయి విచారించగా అక్కడవారికి శ్రీమధురకవి ఆళ్వార్ల శిష్యపరంపరలోని పరాంకుశదాసులు అనేవారు కనబడ్డారు. ఆయనవల్ల శ్రీ నమ్మాళ్వారు నుద్దేశించి తపస్సుచేస్తే లాభం ఉండవచ్చునని విని, ఆ విధంగా చేయగా శ్రీ నమ్మాళ్వారులు సాక్షాత్కరించి గ్రంథమంతా తెలిపితే శ్రీనాథమునులు వ్రాసుకొని, వారి ఆజ్ఞమేరకు దివ్యప్రబంధ ప్రచారానికి పూనుకొన్నారు.

"నాథమునులు నాలాయిర దివ్యప్రబంధములను ఆమూలాగ్రముగ పరిశీలించి, వ్యాసభగవానులు వేదములను ఋగాది రూపములుగా విభజించినట్లు, నమ్మాళ్వారుల తిరువాయిమొళి తిరువిరుత్తం తిరువాశిరియం, పెరియతిరువందాది అను ప్రబంధములను చతుర్వేదములుగా విభజించి, పెరియాళ్వారుల తిరువల్లాండును ఆవేదములకు ఓంకార స్థానముగా నిలిపి, తిరుమంగై ఆళ్వారుల షట్ప్రబంధములను ఆవేదములకు షడంగములుగా నేర్పరచి, తక్కిన దివ్య ప్రబంధములను ఉపాంగములుగా విభజించి. వానికి గానరీతి కల్పించెను. దీనికి హేతువు. ఆ ప్రబంధములయందు పెక్కుచోట్ల పాట అనియుండుట, తాళానుకూలమగు పద్ధతిలో నుండుటయును. తరువాత నాథమునులు- తమ మేనల్లుండగు కీళైఅగత్తాన్, మేలై అగత్తాన్ అనువారలకు దివ్య ప్రబంధములను గానరూపమున బోధించి, 'పలుదివ్య దేశములందు ఆ ప్రబంధ గానమును నెలకొల్పుఁడు' అని, యింకను అనేక వైష్ణవ ప్రపన్నులకు బోధించిరి. అనాఁటినుండి, సంస్కృత వేద వేదాంతములతోపాటు, ఆ దివ్య ప్రబంధములు శిష్యాచార్య సమయ పద్ధతిని బోధింపబడు

చున్నవి. అందుచేతనే నాటినుండి నేటివరకు వైష్ణవ పండితోత్తములు 'ఉభయ వేదాంత ప్రవర్తక' బిరుదముతో నలరారుచుండిరి. ఆ విధముగా నాథమునులు లోకోత్తారకులైరి." (శ్రీనాథమునుల వైభవము-సంగీత సాహిత్య కళానిధి శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు. శ్రీ రామానుజ కీర్తి కౌముది-ఐదవభాగము పుటలు-183-184)

ఈ విధంగా నాథమునులు - ఆచార్యులకు మూలపురుషులు కావడమే కాకుండా, శ్రీవైష్ణవులకు ప్రాణప్రదాలైన దివ్యప్రబంధాలను సేకరించి, వింగడించి, అనుభవించడానికి సమకూర్చిపెట్టారు. "అందుచేతనే, ప్రపన్నుల తిరువారాధనమునందు 'నాథయామునాది పూర్వాచార్యేభ్యోనమః' అని షోడశోపచారములందు వారికి స్థానముండుట, వాక్యగురు పరంపరయందు- 'శ్రీమన్నాథమునయేనమః అని అను సంధింపఁబడుట, మణవాళ మహామునులు ఉపదేశ రత్నమాలయందు"నాదముని ముదలాన నందేశికరై అల్లాల్ పేదైమనమే ఉండో పేశు' నాథముని మొదలైన దేశికులులేక ఆళ్వారుల దివ్యప్రబంధములుగాని, తదర్థములుగాని మనకు కరతలా మలకములయి యుండెడివి కావు' అనిరి." (శ్రీనాథమునుల వైభవము-శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు- పుటలు-177, 178)

ఇప్పుడు మనం పన్నిద్దరాళ్వారులలో కొందరిని స్మరించుకొందాము. మొదటి ముగ్గురు ఆళ్వార్లకును పరమేశ్వరానుగ్రహం- ఒకేసారి ఒకేచోట, తిరుక్కోవలూరు (దేహళీనగరం) అనే ఊరిలో ఒక భాగవతోత్తముని ఇంటి చిన్న అరుగుమీద వానలో ముగ్గురూ తడిసివచ్చి నిలువబడినప్పుడు—లభించింది. వారు ఒకరినొకరు ఎరుగరు. నిలువడానికి తప్ప, కూర్చోడానికికూడా స్థలంలేని ఆ అరుగుమీద వారు ముగ్గురూ నిలిచిఉండగా- ఇంకా ఎవరో వారిమధ్యవచ్చి తోస్తూ ఉన్నట్లు అనుభవం కలిగింది. అది భగవత్పరీక్షగా భావించి, వారు ఆ ఒత్తిడిని తట్టుకొని అతివుగా దేవదేవుడైన శ్రీమన్నారాయణుని పాశురాలతో స్తుతించారు. నాల్గోవాడిని గుర్తించడానికి దీపం ఉంచే బాగుండునుకొని పొయ్‌గై యాళ్వారు పరవశులై తమ మాతృభాష తమిళం గనుక దానిలోనే గానం చేశారు.

ఆళ్వారాచార్యుల చరిత్ర సమగ్రంగా వ్రాసిన తాళ్ళపాక తిరువేంగళనాథుడు (తాళ్ళపాక అన్నమాచార్యుల పౌత్రుడు- 16వ శతాబ్ది) తన 'పరమయోగి విలాసం'లో పొయ్‌గైయాళ్వార్లు పాడిన పాశురాన్ని ఇలా తెలిగించారు :

"ధరణిపంఠియ సముద్రంబులునేయి
యరుణు దీపముఁజేసి యరుణాంశుతతుల
గారాబు చక్రంబుకైఁ బూన్చినట్టి
నీరజాక్షునకిత్తు నీరాజనంబు"

రెండోవారైన పూదత్తాళ్వార్లు ఇలా గానం చేశారు :

"........................................ప్రేమ
పంతియమితిలేని భక్తియేచముురు
ఆనంద భరిత హృదబ్జంబె వత్తి
గానొనరించి వికాసమైయాత్మఁ
దిరమొందు జ్ఞానంబు దీపంబుఁజేసి
పెరిమెనారాయణార్చితముఁ గావించె"

ఇంక మూడోవారైన పేయాళ్వార్లు, తమకంటె ముందుగా ఇద్దరాళ్వార్లు వెలిగించిన జ్ఞానదీపకాంతిలో, భగవానుని దివ్యమంగళ విగ్రహాన్ని నేత్రపర్వంగా దర్శించి ఇలా గానంచేశారు. పరమభక్తుడు. వైష్ణవుడు అయిన తిరువేంగళనాథుడు తన్నుతాను మరిచిపోయి ఈ పాశురాన్ని ఇలా అనుసరించారు :

"సిరిగంటి, చెన్నుమించిన మేనుగంటి
కరమొప్పు వదన వికాసంబుగంటి
సల్లలితావ సీస్తన కుంభకుంభ
పల్లవంబులఁబోలు పాదముల్గంటి
సరసిజహల శంఖ చక్రాంకుశాంక
చరణముల్ జగదేక శరణముల్ కంటి
తరణి బింబముచాయఁ దరళించు కనక
సురుచిరాంశుకము నంశుకముఁగన్గొంటి,
శ్రీమించు కటితట శ్రీసతీవరణ
దామముల్ మేఖలా దామముల్గంటి,

వాత్సల్య జలధి కైవడి నొప్పుచున్న
వత్సంబుగంటి, శ్రీవత్సంబుఁగంటి
చుట్టుఁగ్రైదువు వలచుట్టు కంఠంబు
పట్టి చూపట్టిన బాహువుల్గంటి,
శీతాంశుమండల శతకోటి కోటి
రీతిఁజూపట్టు కిరీటంబుఁగంటి,
మలగులై తెలఁదామరలఁ దామరలఁ
గలహించు నిడువాలుఁ గన్నులఁగంటి,
మకరకుండల బాలమార్తాండ రుచుల
వికసించు వదనారవిందంబుఁగంటి."

(పరమయోగి విలాసము)

అప్రాకృత దివ్యమంగళ విగ్రహుడైన శ్రీమన్నారాయణుని చర్మచక్షువులతో చూచేభాగ్యం, ఈ ముగ్గురాళ్వార్లకు అప్రయత్నంగా ఒకేచోట పరాత్పరుని అనుగ్రహంవల్ల కలిగింది. ఇందువల్లనే ఈ ముగ్గురకు "ముదలాళ్వారులు" అనే పేరు రూఢంమైనది. సంస్కృతవ్యాకరణ సంప్రదాయంలో "మునిత్రయం"లా (పాణిని, కాత్యాయన. పతంజలులు) తెలుగు సాహిత్యంలో "కవిత్రయం"లా (నన్నయ, తిక్కన, ఎఱ్ఱన) ఈ "ముదలాళ్వారులు" ప్రాతఃస్మరణీయులు.

ఈ పన్నిద్దరు ఆళ్వారులలో ప్రతి ఆళ్వారునకు-జన్మ నక్షత్రాన్ని, రాశిని, అంశను తెలియజేసే తిరునక్షత్ర తనియ, జన్మించిన ప్రదేశాన్ని తెలియజేసే నిత్యతనియ సంస్కృతంలో శ్లోకరూపంలో సంప్రదాయ సిద్ధంగా ఉన్నాయి. ఈ వివరణలోని అలౌకిక అతిమానుష విషయాలను దేశకాల పాత్రానుసారంగా గ్రహించవలసి ఉంటుంది. కాని వీరందరు అత్యుత్తమ శ్రేణికి చెందిన మానవ భక్తులను విషయంలో సంశయం ఉండనక్కరలేదు.

భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ చెప్పినట్లు-

"యద్యద్వి భూతి మత్సత్త్వం శ్రీమదూర్జిత మేవవా
తత్తదేవావ గచ్ఛత్వం మమతేజోఽంశ సంభవమ్ ॥" (X. 41)

అని గ్రహించాలి. ప్రపత్తిని లోకంలో వ్యాపింపజేయడానికి వీరవతరించారు. శ్రీమద్భాగవతంలో ఈ శ్లోకాలున్నాయి :

"తామ్రపర్ణీ నదీయత్ర కృతమాలా పయస్వినీ ।
కావేరీ చ మహాభాగా ప్రతీచీ చ సరస్వతీ ॥

కలౌ ఖలు భవిష్యన్తి నారాయణ పరాయణాః ।
క్వచిత్క్వచిన్మహా భాగా ద్రామిడేషు భూరిశః ॥"

(XI-అధ్యాయం, 5; శ్లో-38, 39)

ఈ మహాభక్తులందరు, వివిధ విష్ణ్వాలయాలలో సుప్రతిష్ఠమై ఉన్న అర్చామూర్తులను దర్శించి భక్త్యుద్రేకంతో గానం చేసినవే ఈ పాశురాలు. ఈ భక్తుల మాతృభాష తమిళం గనుక దానిలో గానంచేశారు. కాని, వీరికందరికి వేదోపనిషత్తుల. కావ్యేతిహాస పురాణాదుల విజ్ఞానం, సంస్కృతి కరతలా మలకమని గ్రహించాలి. సంస్కృత భాషనుగూర్చి వీరికి తెలియదనికాదు. పెరుమాళ్ అనే బిరుదును సంపాదించిన శ్రీకులశేఖరాళ్వారు సంస్కృతంలో వ్రాసిన అత్యుత్తమ భక్తికావ్యం "ముకుందమాల" ఉండనే ఉంది. ఈ ఆళ్వారులలో అన్నికులాలవారు ఒక స్త్రీకూడా ఉన్నారు. కాని, భక్తుల విషయంలో వారిని గౌరవించడం విషయంలో "కులం"యొక్క ఎక్కువ తక్కువలకు స్థానంలేదని ఎందరో రుజువు చేశారు. చతుర్థ కులజాలుగా పరిగణింపబడిన శ్రీ నమ్మాళ్వారులు ఈ శ్రీ వైష్ణవ సంప్రదాయంలో సర్వులచేత ప్రపన్న జనకూటస్థులుగా కీర్తించబడి నమస్కరించబడ్డారు

పత్యుశ్శ్రియః ప్రసాదేన ప్రాప్త సర్వజ్ఞ సంపదమ్ ।
ప్రపన్నజన కూటస్థం ప్రపద్యే శ్రీపరాంకుశమ్॥"

శ్రీ ఆళవందారు అనే బిరుదునామాన్ని ధరించిన శ్రీ యామునాచార్యులు శ్రీనాథమునుల పౌత్రులు నిస్సంకోచంగా భక్తిప్రవృత్తులు ప్రదర్శిస్తూ శ్రీనమ్మాళ్వారులను ఈ విధంగా కీర్తించారు :

"మాతా పితా యువతయస్తనయా విభూతిః
సర్వం యదేవ నియమేన మదన్వయానామ్ ।

ఆద్యస్యనః కులపతేర్వ కుళాభిరామం
శ్రీమత్త దంఘ్రి యుగళం ప్రణమామి మూర్ధ్నా ॥"

శ్రీ నమ్మాళ్వారులు "సాయించిన" తిరువాయిమొళి "ద్రావిడ వేదసాగరమ్" అని కీర్తి పొందింది :

"భక్తామృతం విశ్వజనాను మోదనమ్
సర్వార్థదం శ్రీశఠకోప వాఙ్మయమ్ ।
సహస్ర శాఖోప నిషత్సమాగమం
నమామ్యహం ద్రావిడ వేదసాగరమ్ ॥"

ఈ శఠకోప మహానుభావులకు, సామశాఖీయులైన నారాయణులనే విద్వాంసునకు పుత్రులైన మధురకవి నామధేయుడు శిష్యులై ఆయన పాదపద్మాలను ఆశ్రయించి తరించారు. పరాంకుశ మహామాన్యులకు "పరాంకుశం వందే" అనే శ్లోకం ఎంబెరు మానారులే "సాయించారు".

"పద్మాసనోపవిష్టం పరపద యుగళనివిష్ట చైతన్యమ్ ।
పరతత్త్వబోధ ముద్రమ్ పరమౌదార్యం పరాంకుశం వందే॥

గురువులైన శ్రీనమ్మాళ్వారులు పరమపదానికి వేంచేసిన తరువాత వారి విగ్రహాన్ని స్థాపించి గుడికట్టించి వారి సేవచేస్తూ మధురకవి ఆళ్వారులు వారి జీవితశేషాన్ని గడిపారు. గురుభక్తితో గురువులమీద "కణ్ణినుణ్ శిరుత్తాంబు" అనే పేరుతో పద కొండు పాశురాలు పాడి వారి ఘనత కీర్తించారు. శ్రీ మధురకవులు వయస్సులో శ్రీ నమ్మాళ్వారుల కంటె పెద్దవారుకూడాను. శ్రీ మహావిష్ణువే ఆచార్యరూపి :

"ఆచార్యస్సహరి స్సాక్షాత్ చరరూపీ న సంశయః ।
మగ్నానుద్ధరతే లోకాన్ కారుణ్యాచ్ఛాస్త్ర పాణినా ॥"

"కణ్ణినుణ్ శిరుత్తాంబు" అంటే ముళ్ళువేసి ఉన్న సన్నని చిన్నకన్నెతాడు. విశ్వంభరుడైన సర్వవ్యాపి అయిన శ్రీకృష్ణపరమాత్మను యశోదమ్మ చిన్న తాడుతో కట్టివెయ్యలేదా ! ఈ ప్రబంధం పరిమాణంలో చాలాచిన్నది. కాని గురు భక్తి పూరితమైనది. అందువల్ల అందరికి ఆస్వాదయోగ్యమైనది అయింది. అది

గాగ పరమేశ్వరుని సద్గురువుద్వారా సమీపించాలనే పరమసత్యాన్ని ఇది తెలుపు తోంది. భక్తితత్త్వాన్ని ప్రదర్శిస్తోంది. ఈ భక్తి తత్త్వం ఇలాంటిది.

"హస్తస్థితాళ ద్వితయం ప్రపద్యే
తలారి వాగ్వ్యాస ముదారకీర్తిం
మాధుర్య సంశ్లిష్ట కవిత్వయుక్తం
మహత్వ సంభావిత భక్తితత్వం".

భక్తునకు కులంగాని, వయస్సుగాని ఆరాధనకు అడ్డుకాదని తెలుస్తోంది.

ఆళ్వారులలో శ్రీ తిరుప్పాణాళ్వారులు విశిష్టులు. వీరు గొప్పగాయకులు; "గాయక సార్వభౌమ" బిరుదుతో ప్రసిద్ధికి వచ్చారు. ఆయన భక్తిపూరిత గానా నికి పరవశులైన శ్రీరంగనాథులు తమ అర్చకుని పంపి అంత్యజునిగా పరిగణింప బడిన శ్రీ తిరుప్పాణాళ్వారులను "మునివాహనుని"చేశారు. శ్రీరంగనాథుని అర్చక సేవకుడైన లోక సారంగముని అవాహనమయ్యారు. నిత్యతనియ ఈ విషయాన్ని ఇలా చెప్పతోంది :

"శ్రీలోక సారంగ మహామునీంద్ర
స్కంధాధిరూఢం కలయామి నిత్యమ్ ।
కళంకహీనం కమనీయభక్తిం
కవీశ్వరం గాయక సార్వభౌమమ్ ॥"

స్వామిని చూసిన కళ్ళతో అన్యాన్ని చూడనొల్లని ఆ పరమ భాగవతోత్త ముడు ఈ పదో పాశురాన్ని స్వామిముందు గానంచేస్తూ ఆయనలో లీనమయ్యారు:

తమిళం- "కొణ్ణల్ వణ్ణనై క్కోవలనాయ్ వెణ్ణెయ్
ఉణ్డవాయిన్ వెన్నుళ్ళం కవర్న్దానై
అణ్డర్ కోవాణి యరఙ్గం, ఎన్నముదనై
కణ్డ కణ్గళ్ మత్రొన్ఱినైకాణావే" (పాశురం-10)

తెలుగు- "జలము గ్రోవిన మొయిలు ఛాయ గోపాలకుని
తెలివెన్నెలను మెసవ

కమ్మనగు ఆస్యంబుగల ఘనుని నామనసు
దినుసు ముచ్చిలువాని
అండాంతరిత జగములన్ని ఏలెడివాని
ఆ రంగ ఫణిశయను
అరయజాలిన కనుల అమృతమానిన కనుల
అన్యమును కననొల్ల"

(శ్రీమాన్ బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు- "సిరినోము"లోని శ్రీ తిరుప్పాణా ళ్వారుల 'అమలనాది పిరాన్" నకు అనువాదమైన "శ్రీరంగనాథ శోభ" నుండి పుట-71).

శ్రీరంగనాథుని చూచిన వెంటనే పరవశుడైన ఆ పరమ భాగవతోత్తముడు తమిళంలో "అమలనాదిపిరాన్" అనే ప్రారంభంతో ఉన్న 10 పాశురాలు గానం చేశారు.

పరమ భాగవతుల విషయంలో భక్తులు కులాల ఎక్కువ తక్కువలను గణింపరనేదానికి శ్రీ యామునాచార్యుల శిష్యులైన శ్రీ పెరియనంబి శ్రీతిరుప్పాణా ళ్వారులను చేసిన ఈ స్తుతి ఇంకో తార్కాణం.

"ఆపాత చూడమను భూయ హరింశయానం
మధ్యేకవేరమహితుః ముదితాంతరాత్మా ।
ఆ దృష్ట్వతాం నయనయోః విషయాంతరాణాం
యో నిశ్చికాయ మనవై మునివాహనం తమ్॥"

శ్రీ నమ్మాళ్వారులు గురుభక్తిని ఆయన ప్రభావాన్ని గూర్చి ఇలా అన్నారు

"కులన్దాంగునాదిగళ్ నావిలుమ్ కీళ్ళిన్దు- ఎత్తనై
నలన్దా నిలన్ద శణ్డాళ గళాగిలుమ్ ।
మన్దాంగుళక్కరత్తణ్ణల్ మణివణ్ణక్కాళెన్ను ఉళ్
కలన్దార్- అడియార్ తమ్ అడియారెమ్మడిగళే ॥

(తిరువాయిమొళి; 3-7-9)

(గురువు తక్కువజాతికి చెందినవాడైనా, చండాలుడుగా పుట్టినవాడైనా, ఆ మహాత్ముని ప్రభావం దేనితోటి పోల్చిచెప్పడానికి వీలులేనిదిగా ఉంటుంది. కాబట్టి అలాంటి మహానుభావునకు సేవచేయడం మంచిది.)

ఈ హితోక్తి వారి విషయంలోనే అన్వయిస్తుంది. లౌకిక జగత్తులో, ఆయన భక్తులైన మధురకవి ఆళ్వారులు, ఆయనకంటె-నమ్మాళ్వారులు చతుర్థకులజులు- ఉన్నత (బ్రాహ్మణ) కులానికి చెందినవారు.

పన్నిద్దరాళ్వారులలో ఒకరు భూమ్యంశ అయిన శ్రీ ఆండాళ్ళు. శ్రీ పెరియాళ్వారు పుత్రిక. స్వయంగా ఆమె మహాకవయిత్రి. ఆమెపాడిన- తిరుప్పావై, నాచ్చియార్ తిరుమొళి-శ్రీ వైష్ణవ భక్తసమాజంలో నాటికి నేటికి అత్యంత గౌరవాభిమానాలతో- పండితులు, పామరులు అనే భేదంలేకుండా సర్వులు పాడుకొని ఆనందానుభూతిని పొందుతున్నారు. కులప్రసక్తి లేకుండా ఆళ్వారుల దివ్య ప్రబంధాలు అందరు పాడుకొని తరిస్తున్నట్లే; లింగ వివక్ష చూపించక శ్రీ ఆండాళ్ళు రచనల్ని అందరూ ఆమోదించి గానం చేస్తున్నారు. భగవద్రామానుజులవారికి 'తిరుప్పావై' అంటే ఎంత ఆదరాభిమానాలో, "తిరుప్పావైజీయరు"అని ఆయనకు పేరు రావడమే తెలియజేస్తోంది. వారి నిత్యానుసంధానంలో ఉన్నదే ఇది! శ్రీ గోదాదేవి తనకు శ్రీరంగేశునితో వివాహం జరిగితే "నీకు నేను నూరువెన్నకుండలు నూరు చక్కెరపొంగలి కుండలు అరగింపు చేయిస్తాను" అని సుందరాచలం (వానాద్రి)లోని సుందరబాహుస్వామికి తాను పాడిన "నాచ్చియార్ తిరుమొళి"లో ఒక పాశురంలో మొక్కుకొన్నది. ఆ మొక్కు తీర్చడానికి పూర్వమే ఆమె శ్రీరంగనాథునిలో ఐక్యమయినది. కనుక ఎన్నో శతాబ్దులు గడిచినా మొక్కు తీరలేదు. ఇది తీర్చడానికి పూనుకొని భగవద్రామానుజులు ఆ మొక్కు తీర్చి ఆమె జన్మించిన శ్రీవిల్లి పుత్తూరుపోయి, అక్కడి వటపత్రశాయిని సేవించి, విష్ణుచిత్తాత్మజ ఎదుట బద్ధాంజలి అయి నిలిచినప్పుడు ఆ తల్లి ఆనందించి తీర్థప్రసాదాలిప్పించి అర్చకముఖంగా "అన్నలాగ తన మొక్కు చెల్లించినందుకు" భగవద్రామానుజుల వారికి "గోదాగ్రజ" బిరుదాన్ని ఇప్పించింది! ఈ విధంగా శ్రీఉదయవర్య "తిరుప్పావై జీయరు"గా, "గోదాగ్రజులు"గా ప్రసిద్ధులయ్యారు.

ఆచార్యులందరు గౌరవాభిమానాలతో దివ్య ప్రబంధాలను ఆదరించారు. సామాన్య ప్రజలసంగతి చెప్పనక్కరలేదు. సామాన్యప్రజల మాతృభాషలో, కుల

వివక్ష లేకుండ సర్వులు గానం చేయదగిన భక్తి రచనలు గనుకనే ఆళ్వారుల పాశురాలకు విశేష ప్రాచుర్యం వచ్చింది. కాలక్రమంగా దివ్యప్రబంధాలు వేద తుల్యాలయ్యాయి. సర్వులకు అందుబాటులో లేని వేదాలకంటెకూడా ప్రాముఖ్యా నికి వచ్చాయి. ఇది గుర్తించిన ఆచార్యులు వేదాలతో వాటికి సమప్రాధాన్యాన్ని ఇచ్చి రెండింటిని రక్షించారు.

దివ్యప్రబంధాల ప్రస్తావన అతి ప్రాచీన కాలంనుండి ఉన్నదనుటకు ఆధా రాలను విద్వాంసులు చూపించారు. మార్కండేయ పురాణంలో, భగవద్ధర్మంలో ఆరో అధ్యాయంలో ద్రావిడ ప్రబంధాల ఆధిక్యం "విపులముగ ముక్తకంఠముగ అభివర్ణితమైయున్నది". అచ్చట సేనేశ సనత్కుమారుల సంభాషణ ఇలా ప్రారంభం అయింది-

"కృపయా తత్ప్రణీతాంతు బ్రహ్మవిద్యాం మహత్తరామ్ ।
అధ్యేషన్తి ద్విజా భూపా వైశ్యాశ్శూద్రాశ్చ సర్వశః ॥

తరువాత-

"సంస్కృత శ్రుతయో యద్వత్ ద్రావిడ శ్రుతయస్తథా"

అని ఉంది, ద్విజులకును అవి ఉపాదేయాలని ఉంది.

ఇవిగాక యజుర్వేదంలో 7వ కాండలోని 5వ ప్రశ్న యందిలా ఉంది:

"పృథివ్యైస్వాహా । ఋగ్భ్యస్స్వాహా । యజుర్భ్యస్స్వాహా। సామభ్య స్స్వాహా । అంగిరోభ్యస్స్వాహా । వేదేభ్యస్స్వాహా । గాథాభ్యస్స్వాహా- నారా శగ్ంసీభ్యస్స్వాహా । రైభీభ్యస్స్వాహా ॥

దీనిలోని "నారాశగ్ంసీభ్యః నరప్రోక్తములైన 'గాథాభ్యః' దివ్య ప్రబంధ ములచేత అని, ఆళ్వారుల దివ్యప్రబంధములే కీర్తింపబడుచున్నవని పెద్దలు నిష్క ర్షించుచున్నారు "

ఇదేవిధంగా శ్రీ మద్భాగవతంలోను "ద్రావిడ దివ్య ప్రబంధా"లను అను సంధించే వారియందు నాకు ప్రీతి అధికం అని భగవానుడే అన్నట్లున్నదని వ్రాశారు. "శ్రియఃపతి అయిన భగవానునకు శ్రీమద్ద్రామిడోపనిషత్ప్రబంధాను

సంధానము జేయు వారలయందే ప్రీత్యతిశయము గలదని భగవానుఁడే అనతిచ్చి నటుల శ్రీ భాగవతమున నున్నది."

"న ప్రీతి రస్తి మమ వక్షసి లాలితాయాం
లక్ష్మ్యాం తథా సకల భూత నిదాన సీమ్ని।
మజ్జన్మ కర్మ గుణ బన్ధయుతాన్ ప్రబన్ధాన్
సంకీర్త యత్యనఘ భక్త జనేయథైవ॥

"ఈ భగవద్వాక్యములో- అట్టి దివ్య ప్రబంధములు, ద్రావిడ దివ్య ప్రబంధములేగాని వేరుగాదు. "ఈ విషయమును శ్రీరంగ రాజభట్టరువారే ఇట్లు నిర్ణయించియున్నారు :"

"విద్యన్తే హి పరాశరాది మునిభిః ప్రోక్తాః ప్రబంధాః పరాః
భక్తా ఏవహితే తథాఽపి సకలంత్యక్త్వాఽత్ర రంగేశ్వరః।
భక్తానేవ పరాంకుశాది పురుషాన్ తత్ప్రబంధాంశ్చతాన్
అత్యాదృత్యసదోపలాల యతి యత్తద్జాపనం తత్ప్రియే॥"

(శ్రీ నమ్మాళ్వారుల వైభవము-దర్శన సార్వభౌమ-తర్క-భూషణ-న్యాయవేదాంత శిరోమణి ఉభయవేదాంత విద్వాన్ శ్రీమాన్ టి.కె.వి.ఎన్. సుదర్శనాచార్యులు. శ్రీ రామానుజ కీర్తి కౌముది-నాల్గవభాగము. పుట-50)

భగవద్రామానుజులు ద్రావిడ దివ్య ప్రబంధాలయందు విశేష గౌరవం కలవారని, వారి రచనలలో కొన్నింటికి అవి ప్రోత్సాహకారులని- భగవద్రామానుజుల అంతరంగిక శిష్యులయిన తిరువరంగత్త ముదనారులు తమ "ఇరామానుశ నూత్తన్దాది" యందు వ్రాశారు. భగవద్రామానుజులే శ్రీ శఠకోపులను ఇలా కీర్తించారు :

"వకుళ ధవళమాలా వక్షసం వేదబాహ్య
ప్రబల సమయవాదిచ్ఛేదనం పూజనీయమ్।
విపుల కురుకనాథం కారిసూనుం కవీశం
శరణముపగతోఽహం చక్రహస్తైక చక్రమ్॥"

శ్రీ నమ్మాళ్వారులు జన్మించిన నాటి దివ్యమహిమాన్వితులై విలసిల్లారు. తల్లిదండ్రులు నాథనాయకి (ఉదయనంగై) కారి అనేవారు. 'తిరుక్కుఱుజ్గుడినంబి అనే మహాత్ముల అనుగ్రహంవల్ల పుత్రలాభాన్ని పొందారు. ఆ మహానుభావులే, విష్వక్సేనాంశలో ఉదయించిన పరాంకుశులు. వారు జన్మించిన నాటి ప్రాకృత శిశువులా స్తన్యాన్ని గ్రోలడం మొదలైనవి ఏవీ చేయక కళ్ళుమూసుకొని ధ్యాన నిష్ఠులై ఉండిపోయారు. తల్లిదండ్రులు "పొలిన్దుని న్దపిరాన్" అనే భగవంతుని సన్నిధికి తీసుకొని పోయినవెంటనే, ఆ దివ్యశిశువు కళ్ళుతెరిచి ఆ స్వామిని నేత్ర పర్వంగా చూచి ఆనందమగ్నులయ్యారు. ఆస్వామి ఒక విశిష్టమైన వకుళ మాలి కను ఆ దివ్యశిశువునకిచ్చారు. అక్కడినుండి దేకుచు ఆ దివ్యశిశువు సమీపంలోనే ఉన్న ఒక తింత్రిణీ వృక్షమూలం చేరి, మెల్లిగా దానికోటరంలో పద్మాసనస్థులై కూర్చుండిపోయారు. ఆ చింతచెట్టు శ్రీమన్నారాయణుని ఆజ్ఞ ననుసరించి-విష్వ క్సేనుని అంశతో పరాంకుశులు ఉదయించడానికి పూర్వమే- ఆదిశేషుని అంశతో ఉద్భవించి ఉన్నది. దివ్యతేజస్సుతో విరాజిల్లుతూ కూర్చున్న ఆ మహానుభావునకు "మాఱన్" అనే పేరు నాటినుండి వచ్చింది. పదహారు సంవత్సరాలు ఈ విధంగా ఉండిపోయారు. పుణ్యక్షేత్రాలన్నీ తిరిగివస్తూ ఉన్న మధురకవికి దక్షిణదిశలో గొప్ప వెలుగు కనబడింది దాన్ని గుర్తుగా పెట్టుకొని పయనించి పయనించి కురికా పురి చేరి తింత్రిణీ వృక్షకోటరంలో ఉన్న 'మాఱన్'ను చూచి ఆశ్చర్యచకితులై, ఆయన కన్నులు తెరిచే సమయంకోసం చిరకాలం నిరీక్షించి, ఆయన కన్నులు తెరవకపోవడం వల్ల, ఆయన ఎదుట ఒక పెద్దరాతిని ఎత్తిపారవేసి పెద్దధ్వనిని చేశారు. అప్పుడు ఆయన కన్నులు తెరిచిన వెంటనే నమస్కరించి; ఆయన మహి మాతిశయాన్ని గ్రహించాలని "స్వామీ, అచేతనమైన ప్రకృతిగర్భంలో చేతను డుదయిస్తే, దేనిని తిని ఎక్కడ ఉంటాడు ?'' అని ప్రశ్నించారు. వెంటనే శ్రీశఠ కోపులు "దానినే తిని అక్కడే ఉంటాడు" అని సమాధానం చెప్పినవెంటనే తృప్తి పడి మధురకవులు అక్కడే ఆయన్ని గురువుగా స్వీకరించి ఉండిపోయారు. తింత్రిణీ వృక్షమూలమందు శఠకోపులుండిపోవడంవల్ల దివ్యక్షేత్రాలలోని అర్చా మూర్తులన్ని ఆయనకు అక్కడికేవచ్చి దర్శనమిచ్చాయి.

"శఠకోప మునిం వందే శఠానాం బుద్ధి దూషణమ్ ।
అజ్ఞానాం జ్ఞాన జనకం తింత్రిణీ మూల సంశ్రయమ్॥"

ఈ మహానుభావులు "సాయించిన" 100 పాశురాలున్న "తిరువిరుత్తమ్", ఋగ్వేదతుల్యమని; 7 పాశురాలున్న "తిరువాశిరియమ్" యజుర్వేదతుల్యమని; 82 పాశురాలున్న "పెరియతిరువందాది" అధర్వవేదతుల్యమని, 1102 పాశురాలున్న "తిరువాయి మొళి" సామవేదతుల్యమని సంప్రదాయం. తిరువాయిమొళి ఛాందోగ్యోపనిషత్సారమనికూడా అంటారు దీని ప్రాధాన్యానిబట్టి దీన్ని "దీర్ఘ శరణాగతి ప్రబంధం" అనడమూ ఉంది. మహాప్రవాహంల లాగ కదాతనాలైన శ్రీమద్రామాయణ భారత భాగవతాదులు రామకృష్ణాది విభవావతారాల వైభవాన్ని ప్రతిపాదిస్తుంటే, శాశ్వత జలాశ్రయాలు లాగ సర్వకాల సర్వావస్థలయందు ఆశ్రయించి అనుభవించదగిన అర్చావతార విషయకం "తిరువాయిమొళి". అనగా— అర్చావతారం ప్రమేయ చరమమని, తిరువాయిమొళి ప్రమాణచరమమని స్పష్టమవుతోంది.

"తిరువాయిమొళి"కి ఉన్నన్ని వ్యాఖ్యానాలు ఇంక ఏ ఆళ్వారుల పాశురాలకు లేవంటే అతిశయోక్తి కాదు. ఈ ఆళ్వారులకున్న బిరుదులలో "వేదం తమిళ్ శెయ్ద మాఱన్" అనేది వీరి పాశురాల ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. తిరువాయిమొళి మీద బయలుదేరిన మొదటి భాష్యం శ్రీమద్రామానుజుల ఆదేశానుసారం ఆయన శిష్యులయిన "తిరుక్కురుగై పిరాన్ పిళ్లాన్" వ్రాసిన "ఆరాయిరప్పడి" అనే 6,000 పరిచ్ఛేదాలున్న భాష్యం. "పడి" అనేది ఒక పరిమాణాన్ని తెలియజేసేమాట. ఇక్కడ 32 అక్షరాల కూర్పు అన్నమాట. తరువాత శ్రీపెరియభట్టర్ వారి శిష్యులయిన "నంజీయర్" వారు రచించిన "ఒన్బదా రాయిరప్పడి" అనే 9,000 వేల పరిచ్ఛేదాలున్న భాష్యం. దీని తరువాత ప్రతిపదార్థంగా "అళగియ మణవాళ జీయర్" అనువారు వ్రాసిన "పన్నిరాయిరప్పడి" (12 వేల పరిచ్ఛేదాలు) అనేది. ఈయన "నంజీయరు" వారి ప్రశిష్యులు. వీరు తెలుగుదేశానికి చెందిన "నంబిళ్ళ" వారి శిష్యులు. దీని తరువాత బయలుదేరినది అతి ప్రఖ్యాతిపొందిన "ఈడు ముప్పత్తాఱాయిరప్పడి"(భగవద్విషయం) ఇది సుప్రసిద్ధులయిన "నంబిళ్ల" మహోదయుల పర్యవేక్షణంలో ఆయన శిష్యులయిన "వడక్కుతిరువీధిపిళ్లై" అనే విద్వాంసులు వ్రాసినది. దీనిలో 36 వేల పరిచ్ఛేదాలున్నాయి. దీనికి "ఈడు" అనే సార్థకమైన బిరుదుఉంది. తమిళంలో "ఈడు" అంటే లిఖితపూర్వకంగా స్తుతించడం అని అర్థం. ఇవన్నీ కాక, "నంబిళ్ళ" విద్వాంసుల శిష్యులలో ఒకరైన "పెరియవాచ్చాన్ పిళ్లై" అనేరు. నాలాయిరదివ్య ప్రబంధానికి అంటే నాలుగువేల

పాశురాలకు-దీనిలో "తిరువాయి మొళి" కూడా చేరుతుంది) వ్యాఖ్యానం వ్రాశారు. దీనిలో ప్రత్యేకంగా "తిరువాయిమొళి"కి ఉన్న వ్యాఖ్యానానికి "ఇరువత్తునాలాయిరప్పడి" (24 వేల పరిచ్ఛేదాలు) అని పేరు. ఈ వ్యాఖ్యానాల నన్నింటిని బట్టి "తిరువాయిమొళి" విషయంలో శ్రీవైష్ణవులకున్న భక్తిప్రపత్తులు తెలుస్తాయి. భాష్యకర్తలు నాలాయిర దివ్యప్రబంధంలో "తిరువాయిమొళి"లోని వేయి పాశురాయి ఒక భాగంగా, మిగిలిన మూడువేల పాశురాలు ఒక భాగంగా గ్రహిస్తూ వచ్చారు. (దివ్యప్రబంధ నీరాజనము- విద్యాభూషణ-ఉపన్యాసక రత్న-కవితా విశారద శ్రీమాన్ ధనకుధరం వరదాచార్యులు- శ్రీరామానుజ కీర్తికౌముది. 8వ భాగం-పుటలు-29,30) ఈ భాష్యాలన్నీ మణిప్రవాళ శైలిలో బయలుదేరినవే. తమిళ సంస్కృత శబ్దాలు కలిపి వ్రాసిన తమిళశైలికి ఈపేరు ప్రసిద్ధం. ఈ వ్యాఖ్యాతల కాలాన్ని, ఇంచుమించుగా 12వ శతాబ్ది, 15వ శతాబ్ది మధ్యకాలం అనవచ్చును,

వేదవేద్యుడు. పరాత్పరుడు అయిన శ్రీమన్నారాయణుడు శ్రీరామునిగా అవతరించిన వెంటనే, ఆ దివ్య విభూతిని ప్రతిపాదించే వేదం మహాకవి వాల్మీకి నోటివెంట శ్రీమద్రామాయణంగా వెలువడినట్లే. భారత ప్రపంచం నాలుగుమూలల పరమేశ్వరుడు అర్చారూపంగా అవతరించిన వెంటనే ఆ మూర్తుల ప్రస్తుతిరూపంలో వేదవిజ్ఞానం ద్రావిడ దివ్య ప్రబంధాలుగా అవతరించింది అని విద్వాంసుల భావం :

"వేదైక వేద్య విభవేత్వయ్యర్చామూర్తి మాస్థితే జగతి
వేదాః కిలా విరాసన్ ద్రావిడ మూర్త్యా పరాంకుశాది ముఖామ్"

ఈ ద్రావిడ దివ్య ప్రబంధ కర్తలలో పరాంకుశులైన శ్రీ నమ్మాళ్వారులకు ప్రత్యేక స్థానం ఉంది. ఇందువల్లనే తిరువాయి మొళికి ప్రత్యేకస్థానం. ఈ దివ్య ప్రబంధాలలో శ్రీనమ్మాళ్వారుల తిరువాయిమొళి సామవేద సారమని గ్రహించాము సామవేదంలో ఉద్గీథప్రణవ స్వరూపం. కనుక, ప్రణవాన్ని (ఓం) ఉద్గీథగా ఉపాసించాలి ప్రణవం 'అకార-ఉకార-మకారాల' సంపుటి. "తస్యోదితనామ" అని ఉండడంవల్ల, దీనిచేత ప్రతిపాదింపబడిన పరాత్పరుడు "ఉత్" శబ్దవాచ్యుడు.

'కావున తిరువాయిమొళి - ఉయర్వర' అను పాశురమున ఉకారముతో ప్రారంభమై, 'ఉయర్ స్తే' అని తకారముతో పూర్తియగుచున్నది. ఇట్లే-

"ఉయర్వఱ వుయర్ వలము డైయవన్ యవనవన్
మయర్వఱ మదినల మరుళినన్ యవనవన్
అయర్వఱు మమరర్గళ్ అదిపతి యవనవన్
తుయరఱు శుదరళి తొళు తెళిళన్ మననే" (1-1-1)

అను మొదటి పాశురమున, మొదటి మూడుపాదముల మొదటి అక్షరములు అ—ఉ—మ—అనునవి. ప్రణవాక్షరములే ముందు వెనుకలుగ ప్రయుక్తములైనవి. కావున ఇది సామవేద ప్రతికృతి యని నమ్మాళ్వారులే సూచించిరి."

(భగవద్విషయము-తద్విశేషములు—ఉభయవేదాంత శిరోమణి శ్రీమాన్ కిడాంబి శఠకోప రామానుజాచార్యులు, ఎం.ఏ., శ్రీరామానుజ కీర్తికౌముది, 8వ భాగం, పుట-41)

ఆళ్వారులలో శ్రీ శఠకోపులు ఇంత విశిష్టులు గనుకనే సంప్రదాయజ్ఞులైన విద్వాంసులు శ్రీనమ్మాళ్వారులను అవయవిగాను (అంగిగాను) ఇతరులైన ఆళ్వారులు అవయవములు (అంగములు) గాను అభివర్ణించిరి. ఇది సముచితమైన సత్యమే అనడం స్వభావోక్తి.

"భూతం శిరో హ్రద మహాహ్వయ మక్షియుగ్మమ్
భట్టార్య మాన్యమధ భార్గవమస్యకంఠమ్ ।
బాహూవదన్తి కులశేఖర యోగివాహౌ
దోర్మధ్యనాభి చరణా నితరాన్ శఠారేః ॥"

ఈ శ్లోకంలో శ్రీ శఠారులకు-పూదత్తాళ్వారులు శిరస్సని, పొయ్గై పేయాళ్వారులు నేత్రయుగ్మమని, పెరియాళ్వారులు ముఖమని, తిరుమళిశైయాళ్వారులు కంఠమని, కులశేఖర తిరుప్పాణాళ్వారు లిద్దరు బాహువులని; ఇతరాళ్వారులు చేతులు, నడుము, బొడ్డు, కాళ్ళు అని వర్ణించడం జరిగింది.

ఈ ఉపమానాలు, వర్ణనలు అన్నీ శ్రీనమ్మాళ్వారుల ప్రాధాన్యాన్ని తెలియజేయడానికి వచ్చినవే అని గ్రహించాలి. ఇదేవిధంగా ఈ మహానుభావునకున్నన్ని పేర్లు ఇంక ఏ ఆళ్వారునకు లేవు. ఇవి- కారిమాఱులు, మాఱన్, వేదం తమిళ్ శెయ్దమాఱన్ పెరుమాళ్, ఉదయభాస్కరులు, కురుకేశులు, గురుగైప్పిరాన్,

తిరుక్కురు గూర్‌నంబి, తిరునాపీఋడైయపిరాన్‌, తిరువాయిమొళిప్పెరుమాళ్, తెన్నరంగం పొన్నడి, వకుళాభరణులు, అరుళ్‌మాఱన్, ప్రపన్నజనకూటస్థులు, తిరువరంగన్‌పొన్నడి మొదలైనవి వాడుకలో ఉన్నాయి వీరిని-ఋషులు.మునులు అనడంకూడా ఉంది. ఈ ఆళ్వారులు వివిధరీతులలో భగవత్ప్రేమను అనుభ వించారు. సాధారణ భక్తునిగానేకాక, తమ్ముతాము స్త్రీగా భావించుకొని తోళిమార్ (చెలికత్తె) తాయిమార్ (తల్లి) మంగళ్ (నాయిక)గా- పరమేశ్వరుని రసస్వరూ పాన్ని ఆస్వాదించి ధన్యులయ్యారు. ఈ విషయంలో కొన్నింటిలో వీరికి. పెరి యాళ్వార్‌తో, శ్రీ ఆండళ్ళు తల్లితో పోలికలు కనబడతాయి.

శ్రీ నమ్మాళ్వారులు శ్రీమన్నారాయణుని దివ్య మంగళమూర్తిని దర్శించి మోహితులయ్యారు. పరాత్పరుడు "పుంసాం మోహనరూపాయ "గదా! ఈ మోహం వీరికి నాయికా (మంగళ్ వస్థను కల్పించింది చెలికత్తెవల్ల సాయంలభిం చడం సహజంగదా! ప్రణవంలోని 'అ'కారం పరమాత్మకు, 'మ'కారం జీవునకు సంకేతాలు గాన ఆ ఇరువురికి నడుమ నున్న సంబంధజ్ఞానం జీవుని పరమాత్మతో చేరుస్తుంది. ఇది సఖి (తోళిమార్)వని. నమశ్శబ్దం ("మః, న" నేను నాకుచెందిన వాణ్ణి కాను) అస్వతంత్రతను తెలిపి ఉపాయాధ్యవసాయజ్ఞానాన్ని ప్రతిపాది స్తుంది. ఇది జనని (తాయిమార్). వీరి రచనలలో ఈ భావాలన్నీ తొంగిచూస్తూ ఉంటాయి. 35 సంవత్సరాలుమాత్రమే ఈ విభూతిలోనున్న ఈ ఋషిపుంగవులు తమ పాశురాలద్వారా విష్ణుభక్తిని జగద్వ్యాపకం చేశారు. వీరి ప్రబంధాల మీద వచ్చిన వ్యాఖ్యానాలు, తిరువాయిమొళి మొదలైన వీరి ప్రబంధాలలో గూఢంగా ఉన్న అర్థసౌందర్యాదులను వెలికితీసి మహోపకారంచేశాయి. ఇందువల్లనే, ఈయన శిష్యులు, పరమభక్తులు అయిన మధురకవి ఆళ్వారులు తమ "కణ్ణినుణ్ శిరు త్తాంబు"లో శ్రీ నమ్మాళ్వారుల మహత్త్వం తమ గురుభక్తిని "బిందువులో సింధువును"ను చూపిస్తూ భాగవతలోకం ముందుంచారు. మధురకవి ఆళ్వారుల దృష్టిలో భగవద్దర్శనకంటె భాగవతదర్శన-విశేషించి ఆ భాగవతులు తమ గురువు లైనప్పుడు-అధిక ఫలప్రదం:

తమిళం –

"కణ్ణినుణ్ శిరుత్తాంబినాల్
కట్టుణ్ణప్పణ్ణియ పెరుమాయన్, ఎన్నప్పనిల్

నణ్ణిత్తెన్ కురుగూర్ నమ్బియెన్నక్కాల్
అణ్ణిక్కుమముదూఱు మెన్నావుక్కే॥" (పాశురం–1)

తెలుగు -

"కఱకు చిఱుత్రాటిచే
కట్టుబడు మాయావి ఆస్వామినుతికంటె
పూని మా కురుగూరుపతి పేరెనుడువుచో
తేనెయౌ అమృతమౌగద నాదు నాల్క!"

(సిరినోము - శ్రీమాన్ బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు; శఠగోప శరణాగతి (కణ్ణినుణ్ శిరుత్తామ్బు) పుట-51).

శ్రీ నమ్మాళ్వారుల దివ్యప్రబంధాల ప్రభావం ఆనాటి సమాజంమీద పడ డమే కాకుండా; తమిళమహాకవి, శ్రీమద్రామాయణం తమిళంలోనికి తెచ్చిన 'కంబ'కవి చక్రవర్తిమీద కూడా పడింది. ఈ మహాకవి శ్రీ నమ్మాళ్వారుల ప్రశి ష్యుడు కావడమేకాకుండా "శ్రీ శఠకోపరందాది"అనే కావ్యరత్నమాలను భక్తితో పరమగురువులకు సమర్పించారు. నవరసభరితాలైన శ్రీ శఠగోపుల దివ్య ప్రబం ధాలు అజరామరాలు.

శ్రీ రంగనాథస్వామినే అల్లునిగా చేసుకొన్నవారు, పాండ్యరాజసభలో విష్ణువే పరతత్త్వమని వాదించి జయాన్ని పొందినవారు, పరాత్పరునే ఆశీర్వదించిన వారు, గరుడాంశలో జన్మించినవారు శ్రీవైష్ణవ ప్రపంచంచేత పెరియాళ్వారు అని కీర్తించబడినవారు–భట్టనాథుడైన శ్రీవిష్ణు చిత్తులు. విల్లిపుత్తూరులో వటపత్రశాయిని అర్చించడం తప్ప అన్య మెరుగని అనన్యభక్తులు–సార్థక నామధేయులు. కనుకనే తిరునక్షత్ర తనియన్, నిత్యతనియన్‌లలో ఈ విషయాలున్నాయి:

తిరునక్షత్ర తనియన్–

మిథునే స్వాతిజం విష్ణోరథాంశం ధన్వినః పురే।
ప్రపద్యే శ్వశురం విష్ణోః విష్ణుచిత్తం పురశ్శిఖమ్ ॥

నిత్యతనియన్–

గురుముఖ మనధీత్య ప్రాహ వేదానశేషాన్
నరపతి పరిక్లృప్తం శుల్కమాదాతు కామః।

శ్వశురమమరవంద్యం రంగనాథస్య సాక్షాత్
ద్విజకులతిలకం తం విష్ణుచిత్తం నమామి॥

శ్రీమన్నారాయణుని అనుగ్రహం (వటపత్రశాయి అర్చావతారమూర్తి - విల్లిపుత్తూరు) పూర్ణంగా ఉండడంవల్ల పాండ్యరాజు సభలో విష్ణుపారమ్యాన్ని స్థాపించి రాజసత్కారంతో తిరిగివస్తూ ఉన్న శ్రీవిష్ణుచిత్తులకు ఎదురుగా వచ్చి, భువనమోహన రూపంతో, పరివారజనంతో శ్రీహరి సాక్షాత్కరించాడు. అప్పుడు విష్ణుచిత్తులు తమ్ముతాము మరిచిపోయి దివ్యమంగళ విగ్రహుడు, సర్వశక్తి సమన్వితుడు అయిన ఆ జగన్నాథునకు ప్రాకృత జనదృష్టివల్ల "దిష్టి" ఎక్కడతగులుతుందో అనే భయంతో తమ్ము తాము పెద్దచేసుకొని, ఏనుగు పక్కగా వేళ్లాడే ఘంటలు పట్టుకొని తాళంవేస్తూ, 12 పాశురాలతో "స్వామికి రక్ష" చెప్పి పెరియాళ్వారు అని పిలిపించుకొన్నారు. దీని ప్రారంభం ఇది :

తమిళం –

"పల్లాండు పల్లాండు పల్లాయిరత్తాండు
పలకోడి నూరాయిరమ్
మల్లాండ తిండోళ్ మణివణ్ణా ఉన్
శేవడి శెవ్వి తిరుక్కాప్పు"

తెలుగు -

"మంగళము! మంగళము! బహువేలవత్సరాల్
బహుకోటి నూరుల వత్సరాల్ మంగళము!
మల్లగర్వహరణా! మణినీలవర్ణ! నీ
ఇంపగు అడుగుదోయి కెంపునకు శ్రీరక్ష!"

(సిరినోము- శ్రీమాన్ బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు; మంగళాశాసనము (తిరుప్పల్లాండు-శ్రీ పెరియాళ్వారు) పుట-88)

ఈ "తిరుప్పల్లాండు" మంగళాశాసనం నేటికీ విష్ణ్వాలయాలలో ప్రతిదినం పఠించబడుతూనే ఉంది.

శ్రీకృష్ణ భక్తులైన వీరు (విల్లిపుత్తూరు వటపత్రశాయికి మాలాకైంకర్యం నిత్యకృత్యం) తమ్ముతాము యశోదగా భావించుకొని శ్రీకృష్ణలీలను మనోహరంగా భక్త్యుద్రేకంతో తమ "పెరియాళ్వార్ తిరుమొళి"లో గానంచేశారు. తన్మయత్వంతో చేసిన ఈ వర్ణనలన్నీ నేటికీ భక్తజనుల నాలుకలమీద నాట్యమాడుతూనే ఉన్నాయి. శ్రీకృష్ణలీలలలో ఆయనకు విశేషానందాన్ని కలిగించినవి-చంద్రుని పిలవడం, చప్పట్లుచరిచి బాలకృష్ణుని నవ్వించడం, తప్పటడుగులు వేయించడం, స్తన్యపానం చేయించడం మొదలైనవి. శ్రీకృష్ణుని శిశురూపవర్ణన, మురళిగానం, గోపికలతో విహారం చేయడం మొదలైన లీలావర్ణనలతో బాటు ఆయన పరమాత్మ తత్త్వకీర్తనమూ కనబడుతుంది దాస్య, సఖ్య, వాత్సల్య, మధుర భావాలలో పెరియాళ్వారులను కృష్ణుని విషయంలో వాత్సల్యభావం బాగా ఆకర్షించింది. కృష్ణావతారంలోని మాధుర్యం ఆకర్షకం కావడంలో ఆశ్చర్యం లేదుగదా!

సహజంగా స్త్రీ అయిన విష్ణుచిత్తాత్మజ శ్రీ గోదాదేవిని ఆ గోపికాలోలుడు శ్రీకృష్ణుడు ఆకర్షించడంలో విశేషం ఏమీ లేదు! ఆమె భూదేవ్యంశ గనుక శ్రీమన్నారాయణుని పొందుకోరడం సముచితమే గదా! ఆమెను అభివర్ణించిన తనియలు వీటిని సూచిస్తూనే ఉన్నాయి:

తిరునక్షత్ర తనియన్ :

> కర్కటే పూర్వఫల్గున్యాం తులసీ కాననోద్భవామ్ ।
> పాండ్యే విశ్వంభరాం గోదాం వందే శ్రీరంగనాయకీమ్॥

నిత్యతనియన్ శ్రీపరాశర భట్టరువారే "సాయించారు".

> నీలాతుంగ స్తనగిరి తటీసుప్తముద్బోధ్య కృష్ణమ్
> పారార్థ్యం స్వం శ్రుతిశత శిరస్సిద్ధమధ్యాపయన్తీ।
> స్వోచ్ఛిష్టాయాం స్రజినిగళితం యాబలాత్కృత్య భుంక్తే
> గోదా తస్యై నమ ఇదమిదం భూయ ఏవాస్తు భూయః॥

ఈ ఆండాళ్ళు తల్లి గానంచేసిన "తిరుప్పావై" అనే 30 పాశురాలున్న దివ్య ప్రబంధం ప్రపంచవిఖ్యాతి పొందింది. ఆండాళ్ళు అంటే రక్షకురాలు లేదా భక్తు

లను ఏలుకొనేది అని స్థూలార్థం. మధురభక్తికి నిదానం. దీనికి నేపథ్యమాసం మార్గశీర్ష మాసం. శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో విభూతియోగంలో "మాసానాం మార్గశీర్షోఽహం" అన్నారు. చాంద్రమానం ప్రకారం మార్గశీర్షమయిన మాసమే, సౌరమానం ప్రకారం ధనుర్మాసం. విష్ణుప్రీతికరమైనది. శ్రీకృష్ణుని పతిగా పొంద వలెననే కోరికతో పూర్వం గోపబాలికలు కాత్యాయనీవ్రతం చేశారని విని తాను కూడా ధనుర్మాసంలో స్నానరూపమైన ఒక వ్రతం శ్రీ ఆండాళ్లు ఆచరించింది.

శ్రీమద్భాగవతంలో కాత్యాయనీవ్రత ప్రసంగం దశమస్కంధంలో ద్వా వింశోఽధ్యాయం (22)లో వస్తుంది. శ్రీశుక ఉవాచ-

"హేమంతే ప్రథమే మాసి నందవ్రజ కుమారికాః।
చేరుర్హవిష్యం భుంజానా మాసం కాత్యాయనీ వ్రతమ్॥" (1)

గోపికలు కాత్యాయనీదేవిని ఇలా ప్రార్థించి వారి కోరికను తెలిపారు:

"కాత్యాయని మహామాయే మహాయోగి న్యధీశ్వరి।
నందగోపసుతం దేవి పతిం మే కురు తే నమః॥" (4)

"ఇతి మంత్రం జపంత్యస్తాః పూజాం చక్రుః కుమారికాః" (5)

"ఏవం మాసం వ్రతం చేరుః కుమార్యః కృష్ణచేతసః।
భద్రకాళీం సమానర్చుర్భూయాన్నంద సుతః పతిః॥" (6)

పోతనామాత్యుడు ఇలా తెలుగు చేశాడు : (x- అధ్యాయం- 22)

వ॥ "ఇట్లు నితాంతం బగు హేమంతంబున మొదలి నెలతొలి
దినంబునందు నందుని మందంగల గోపకుమారికలు
రేపకడలేచి చని కాళిందీ జలంబులం దోఁగి జలతీరం
బున నిసుమునం గాత్యాయనీ రూపంబుఁ జేసి సురభి
కుసుమ గంధంబులిడి ధూప దీపంబులిచ్చి బహు
విధోపహారంబులు సమర్పించి" (805)

"ఓ కాత్యాయని భగవతి
నీకున్ మ్రొక్కెదము నేము నేఁడను కంపన్।
మా కిందఱకును వైళమ
శ్రీకృష్ణుఁడు మగఁడు గాఁగఁ జేయుము తల్లీ॥" (806)

"ఓ తల్లి! మాకుఁ గృష్ణుఁడు
చేతో విభుఁడైన నాఁడు చెలువలమెల్లన్
నేతి వసంతము లాడుచు
జాతర సేసెదము భక్తిచాతురితోన" (807)

వ॥ అని నమస్కరించి హవిష్యంబులు గుడుచుచు
నవ్విధంబున మాసవ్రతంబు సలిపిరం దొక్కనాఁడు" (808)

(దీని తరువాత కాళిందీ నదిలో గోపికలు స్నానం చేస్తూఉండగా శ్రీకృష్ణుడు గోపికా వస్త్రాపహరణం చేయడం మొదలైనవి జరుగుతాయి.)

మహాభక్తురాలు, కవయిత్రి అయిన శ్రీ ఆండాళ్ళ తల్లి తన వ్రతాన్ని ఒక విశిష్ట పద్ధతిలో చేసింది. ప్రతిదినం ఒక పాశురం గానం చేసి 30 పాశురాలతో ఆ మాసం పూర్తిచేసింది. వ్రత సమాప్తి అయింది. వాటిని శ్రీవిల్లి పుత్తూరులో అర్చావతారంగా అవతరించిన శ్రీ వటపత్రశాయి (వడ పెరుంకోయిలుదయాన్-ఉత్తర మహాధామనివాసి)కి అర్పించింది. అస్మదాదులైన చేతనులకు ఉజ్జీవనోపాయాలు ముఖ్యమైనవి మూడున్నాయి అని పెద్దలంటారు. అవి - భగవత్ప్రపత్తి, భగవద్గుణకీర్తనం, పుష్పకైంకర్యం-అనేవి. ఈ మూడు ముఖ్యకార్యాలను నిర్వర్తించడానికి అవతరించిన భూదేవి అవతారము శ్రీ ఆండాళ్ళ తల్లి. ఆమె ఈ మూడింటిని ఆచరించి మార్గదర్శకురాలై మనకు "తిరుప్పావై", ప్రసాదించింది. తిరు = శ్రీ; పావై = వ్రతం, అనగా లక్ష్మి (శ్రీ) ప్రదమైన వ్రతం. ఆలనాడు శ్రీకృష్ణుని పొందుకై గోపికలు చేసిన కాత్యాయని వ్రతానికి ఈ వ్రతం కాలాంతరంలోని ప్రతిబింబం దీని వలన శ్రీ ఆండళ్ళ తల్లికి ఆమె కోరిన ఫలితం లభించింది

శ్రీ ఆండాళ్ళ తల్లి తన ముప్పది పాశురాల ద్వారా ముప్పదిరోజులు కొనసా

గించిన ఈ వ్రతంలో మూడు దశలున్నాయి. మొదట ఉపోద్ఘాతరూపంలో-అయిదు పాశురాలలో వ్రతస్వరూపజ్ఞానం కలిగించడం-ఒకదశ, రెండోదశలో ఉన్న పది పాశురాలలో ఆయా గోపికల ఇళ్లకుపోయి వారిని మేల్కొల్పి తమతో చేర్చుకో వడం. మూడోదశలో మిగిలిఉన్న పదిహేను పాశురాలలో – నందయశోదలను, నీలా బలరామకృష్ణులను మేల్కొల్పి, చివరికి కృష్ణునితో తమ కోరిక విన్నవించు కొని కృతార్థత పొందడం. పోయిన కళలను తిరిగిపొంది చంద్రుడు సంపూర్ణుడు కావడానికి ఒకమాసం పట్టుతుందిగదా! ఇదేవిధంగా భక్తుడు-అభిముఖ్యం ద్వారా ఆశ్రయణం, తద్ద్వారా అనుభవం పొందడం దీనిలో సూచితాలు.

శ్రీవిల్లి పుత్తూరులోని అర్చామూర్తి వటపత్రశాయి యందే ఆమె శ్రీమన్నా రాయణుని దర్శించింది. మొదటి పాశురంలో "నారాయ్ణనే"(నారాయణుడే) అని సర్వశేషి ఆయనే గనుక ఆయన్ని ఉపాసించారు. రెండో పాశురంలో-వ్యూహావ తారమైన శేషశాయిని ఉపాసించారు. మూడోపాశురంలో వామనునిగా అవతార మెత్తి త్రివిక్రమునిగా విజృంభించిన విభవావతారాన్ని కొలిచారు. నాల్గో పాశు రంలో మూర్తీభవించిన ధర్మమైన శ్రీరాముని ధనుస్సు నుండి బాణవర్షం కురిసి నట్లు వర్షపాతం కావాలని (అందువల్ల గోకులం వర్ధిల్లాలని) శ్రీరాముని ఉపాస్యం చేసుకొన్నారు. ఐదో పాశురంలో సర్వసులభుడైన గోపికాకృష్ణుని ఉపాసించారు. "వడమదురై" అని ఉత్తరదేశంలోని మధురలో బాలాలి ("మైన్దనై") అయిన కృష్ణుని వేడుకొన్నారు. యమునానది పవిత్రతను పేర్కొన్నారు. శ్రీకృష్ణావతా రంలో- యమున, మధుర; రామావతారంలో-సరయు, అయోధ్య. "పరమపదం" నగరం అయితే; అక్కడి "విరజా" నది భూలోకనది అయి అవతారమూర్తితో ఉంటుంది.

ఈ పాశురాలలో ఆళ్వారులను "మేల్కొల్పడం" సూచితమైనదని వ్యాఖ్యా తృశిరోమణులు అన్నారు. వీటిలో వివిధావతారాల ప్రసక్తి ఉంటుందని వేరే చెప్ప వలసింది లేదు. భగవత్ప్రాప్తికోసం ఏమి చెయ్యాలో గోపికలద్వారా- ఇక్కడి గోపీభావం పొందిన శ్రీ ఆండాళ్లు తల్లిద్వారా-వ్యక్తం చెయ్యడం జరిగింది. విష్ణు పాదోద్భవ అయిన గంగలాగ పవిత్రమైన ఈ పాశురాలు, శ్రీ పెరియాళ్వారు పుత్రిక అయిన శ్రీఅండాళ్లు తల్లి పవిత్రవదనం నుండి లోకోద్ధరణకోసం అవత రించాయి. కనుకనే వల్మకులితో-ఈ వ్రతం చెయ్యలేనివాళ్ళు వీటిని భక్తితో పఠిం

తప్పక పాడుకొంటే చాలు, చతుర్భుజుడైన శ్రీకృష్ణుని దివ్యకటాక్షం లభించి ఆనందిస్తారు. ("ముప్పదుమ్ తప్పామే । ఇజ్గు ఇప్పరి శురైప్పార్ । ఈరి రణ్డు మాల్ వరైత్తోళ్ శెజ్గణ్ తిరుముగత్తు చ్చెల్వ త్తిరు మాలాల్ । ఎజ్గుమ్ తిరువరుళ్ పెత్తు ఇన్బురువర్" తిరుప్పావై; పాశురం_ 30) అని ఆండాళ్ల తల్లి అనుగ్రహించారు. తమ్మ గురించి తాము "అణిపుదువై పైగ్గమ లత్తణ్డె రియల్ పట్టర్‌పిరాన్ కోదై । శొన్న శఙ్గత్తమిళ్ మాలై ॥"(ప్రబంధానికి అలంకారప్రాయమైన శ్రీ విల్లిపుత్తూరులో అవతరించి వాఖింపదగిన తామరపూసలమాల ధరించిన శ్రీభట్టనాథుల గోద చెప్పిన సంఘద్రావిడ (తమిళ) భాషామాల)అని చెప్పుకోవడమే కాక తమిళ భాషామాలను గూర్చి కూడా ఆ తల్లి చెప్పారు. ఇందువల్ల ఈ "తిరుప్పావై"కి పావనత్వ భోగ్యత్వాలు రెండూవచ్చాయి.

శ్రీ ఆండాళు తాను పుట్టిపెరిగిన శ్రీవిల్లి పుత్తూరులోని ఆలయంలోని "శ్రీ వటపత్రశాయిని" సేవించింది. ఆనాటి గోపికలు శ్రీకృష్ణుని మధురలో సేవించినట్లుగా భావించి, ఈ "వడపెరుం కోయిలుడయాన్"ను తాను గోపిక ననుకొని సేవించింది. ఆమె మనస్సులో శ్రీకృష్ణుడున్నాడు. 108 దివ్య తిరుపతుల నుండి వివిధ అర్చామూర్తులలో నీ కిష్టమైనవరుని నీవు ఎన్నుకోవలసినదని శ్రీపెరియాళ్వారు చెప్పారు. అంతకి పూర్వమే ఆమె తండ్రితో, తాను విష్ణువును తప్ప ఇంకొకరిని వివాహమాడనని చెప్పినప్పుడు ఆయన ఈ అర్చామూర్తులను వర్ణించారు :

అష్టాదశస్థలాన్యత్ర పాండ్యదేశే రమాపతేః
కేరళేషు మహాభాగే దివ్య దేశాశ్చతుర్దశ
ద్విచత్వారింశ దిత్యాహుశ్చోళదేశస్థలాని హి ।
తే త్రయోవింశతిర్దివ్యదేశాస్తొండీరమండలే
ఉదీచ్యాం దిశిదివ్యాని స్థలాన్యేకాదశస్ఫుటమ్॥

(పాండ్యదేశంలో 18, కేరళలో 14, చోళదేశంలో 42, తొండీరమండలంలో 23, ఉత్తరభారతంలో 11 దివ్యదేశాలు ఉన్నాయి.)

ఇంతేకాదు, ఆయన అభ్యర్థనమేరకు దివ్యమైన ఆ అర్చామూర్తులు శ్రీ ఆండాళునకు దర్శనమిచ్చారు. వారిలో సౌందర్యాది గుణవిశిష్టుడయిన శ్రీరంగనాథుని ఆమె ఎన్నుకొన్నది. ఆ శ్రీరంగనాథునితో తన్ను కలుపవలసినదని-

పూర్వం శ్రీకృష్ణుని పొందుకోసం గోపికలు, కాత్యాయనీ వ్రతం చేసినట్లు— ఈ మార్గశీర్షమాసవ్రతం ప్రారంభించి చేసింది. ఫలితం లభించింది. ఆమెకు శ్రీరంగ నాథుని పొందు లభించింది. ఆ వ్రతసమయంలోని ముప్పైరోజులలో దినానికి ఒకటి చొప్పున గానంచేసిన దివ్యపాశురాలే "తిరుప్పావై" ప్రబంధం.

సనాతన ధర్మ సంబంధమైన తాత్త్విక చింతన, విష్ణుపారమ్యాన్ని తెలు పుతూఉన్న వేదోపనిషద్విషయాలు తనలో ఇమిడ్చుకొన్న దివ్యప్రబంధం "తిరుప్పావై". ఉపనిషత్సారమైన బ్రహ్మవిద్యలను ఈ దివ్యప్రబంధంలో శ్రీ ఆండాళ్లు తల్లి ప్రవచించింది. భక్తిజ్ఞాన వైరాగ్యాది వివిధ మార్గాల యథోచిత ప్రసంగంచేసినా, శరణాగతికి అత్యున్నత స్థానాన్ని ఇచ్చిన ప్రబంధ రాజం "తిరుప్పావై". శ్రీ ఆండాళ్లు తల్లి తలపెట్టిన ఈ వ్రతం పైకి స్నానవ్రతంలా, 'వఱ' అనే వాద్యవిశేషాన్ని వాంఛిస్తున్నట్లుగా కనబడే వ్రతం. కాని, దీనిలోని మహిళలందరు కోరుకొన్నది భగవంతుని నిత్యసహవాసం, నిత్యకైంకర్యలాభం. దీనిలో శ్రీమన్నారాయణుని దివ్యావతారాల ప్రసక్తి, దివ్యసూరుల స్మరణ; భగ వంతుని సమీపించడానికి భాగవతుల, ఆచార్యుల, లక్ష్మీదేవి పురుషకారం ఎంత ఆవశ్యకమో గోపికల అనుభవం ద్వారా వ్యక్తంచేయడం జరిగింది. శ్రీమన్నారా యణుడే ఉపాయము, ఉపేయము, అని గ్రహించినవారికి కూడా పురుషకారం ఎంత ప్రాధాన్యాన్ని వహిస్తుందో ఇందులో విశదీకరించబడింది.

మొదటి దశలోని ఐదు పాశురాల తరవాత – ఆరోపాశురం మొదలుకొని పదిహేనో పాశురం చివరకు–భగవంతుని విషయంలో వివిధ దశలలో అనుభవం ఉన్న గోపికలను నిద్రనుండి మేల్కొల్పి తమతో చేర్చుకోవడం జరిగింది. ఈ పదిమంది, పరమ భాగవతోత్తములైన ఆళ్వారులని సూచించడం జరిగింది. ఆయా ఆళ్వారుల వైశిష్ట్య కథనంద్వారా ఇది జరిగింది. భగవత్కటాక్షాన్ని పొందిన భక్తులను మనతో కలుపుకొన్నప్పుడే భగవత్కృప మనకు లభిస్తుంది. వీరి పురు షకారం ఉంటుంది. దీని తరువాత ఆచార్యపురుషకారం, చివరికి జగజ్జననిపురుష కారం లభించి తద్ద్వారా ఆ శ్రీమన్నారాయణుని పొందు లభిస్తుంది.

6, 7, 8, 9 పాశురాలలో మేల్కొలుపబడిన గోపికలు ఒకవిధంగా విశి ష్టలు. భగవంతుని పొందు సామూహికంగా లభించినప్పుడు కలిగే ఆనందం అనిర్వచనీయం. అందుకే గోపికలనందరిని "నిద్ర"లేపి తీసుకొని వెళ్ళడం. భగ

వంతుని సన్నిధికి మహాభక్తులతో కలిసిపోతే. మార్గం సుగమం అవుతుంది. నిద్ర పోతున్నవారి నిద్ర, సామాన్యమైన తామసనిద్రకాదు. సమాధ్యవస్థను పోలినది.

ఈ మొదటిగోపిక(6వ పాశురం) దివ్యానుభూతినిపొంది దానిని విడిచిరావ డానికి ఇష్టంలేనిది. "పిరెట్లు నిద్ర మేల్కొనిరి" అన్న ఆమె ప్రశ్నకు-పక్షుల కలకలం, ఆలయ శంఖధ్వని, భక్తుల "హరి"నామ సంకీర్తన మమ్మల్ని లేపినవి అని వీరు సమాధానం ఇచ్చి ఆమెను లేపారు. రెండో గోపిక (7వ పాశుర)లోపల పరుండిఉన్నా భగవదనుభవంవల్ల ఆమెకు సంక్రమించిన తేజస్సును తలుపు సందులనుండి చూచిన గోపికలు "తేశముడై యాయ్" (తేజోవతీ) అని ఆమెను సంబోధించి లేపినారు. భరద్వాజ పక్షుల మాటలు, గోపికలు పెరుగుచిలుకుతూ ఉంటే పుట్టే గాజుల చప్పుడు, కవ్వంచేసే ధ్వనులు వినలేదా నువ్వు అని కూడా అడుగుతారు. ఈవిధంగా వీళ్ళిద్దరు "శ్రవణంద్వారా" శుభసమయం ఆసన్నమైన దని తెలుసుకోవలసినవారు; తెలుసుకొన్నవారు. మూడో గోపిక(8వ పాశురం)తో "తూర్పున తెల్లవారిన లక్షణాలు కనబడుతున్నాయి (కీళ్ వానమ్ వెళ్లెన్రు). ఆ వెలుతురు నువ్వు చూడలేదా? పశువులను తెల్లవారేముందు చిన్న బీళ్ళకు వదులు తారుగదా! ఆ విధంగా విడిచిపెట్టారు. నువ్వులే" అన్నారు. ఇక్కడ తూర్పున తెల్లవారడం సంకేతం. ఈవిధంగా ఈ ముగ్గురు గోపికలు లేచారు. ఆళ్వారుల లోని మొదటి ముగ్గురు ఆళ్వారులు (పొయ్‌గై ఆళ్వారులు, భూదత్తాళ్వారులు, పేయాళ్వారులు) సిద్ధోపాయ నిష్ఠులు. పరమేశ్వరానుగ్రహం వల్లనే-ఆయనే వారి మధ్య వచ్చిచేరి దర్శనమిచ్చిన విషయం గుర్తుంచుకోవాలి) దివ్యానుభవాన్ని పొందారు. 6, 7, 8 పాశురాలలో వీరి సూచన ఉంది. తొమ్మిదో పాశురంలో ఇంకో గోపికను లేపారు. ఆమె-ఉపాయం, ఉపేయం రెండూ భగవంతుడే అని గ్రహించిన ఆవిడ, ఇందువల్ల ఈమెలో నిర్లిప్తత ఉన్నది. మణిమయ సౌధంలో సుఖంగా నిద్రించిఉంది. ఆమెను లేవడానికి భగవంతుని నామాలను మహామాయావీ! మాధవా! వైకుంఠవాసా అనే వాటిని ఉపయోగించారు. ("మామాయన్, మాదవన్, వైగున్దన్ ఎన్రెను నామమ్ పలవుమ్ నవిన్రు)"ఆళ్వారులలో ఇట్టినిర్లిప్తులు "తిరుమళిశై ఆళ్వారులు" (భక్తిసారులు, సుదర్శనాంశ) వీరు కూడా సిద్ధోపాయ నిష్ఠులైన మొదటి ముగ్గురు (ముదలాళ్వారులు) ఆళ్వారులకోవకు చేరినవారే!

**పదో పాశురంలో-ఉన్మించినదాని పరిపూర్ణంగా భగవదనుభూతిని పొందుతూ**

వచ్చి, ప్రపన్న జనపారిజాతమైన "తిరువాయ్‌మొళి"ని భక్తులకు ప్రదానం చేసి సాయుజ్యాన్ని పొందిన మహానుభావులు ("విష్వక్సేనాంశ") శ్రీ నమ్మాళ్వారులు. నాలుగు వేదాలసారాన్ని తమ "తిరువిరుత్తమ్ (ఋగ్వేదసారం). తిరువాశిరియమ్ (యజుర్వేదసారం) పెరియతిరువందాది (అధర్వణ వేదసారం) తిరువాయిమొళి (సామవేదసారం. ఛాందోగ్యవని షడ్వివరణ, చరమ ప్రబంధం– అని కూడా వాడుక)" ప్రపన్నజనులకు "పాయించి" ఇచ్చిన కూటస్థులు. ఈ మహానుభావునకు సాధన ప్రసక్తేలేదు. వీరును సిద్ధోపాయనిష్ఠులే ! ఈ పాశురంలో "పిలువబడిన గోపిక" సిద్ధ్యసిద్ధులు, లాభనష్టాలు అన్నీ ఆ పరమాత్మవే అని గాఢవిశ్వాసంతో నిశ్చలంగా ఉంది. అన్నీ ఆయనే చూచుకొంటాడు అని ఊరుకొనే, అహంకార మమకారాలు లేని పారతంత్ర్య పరాకాష్ఠతో ఉన్న గోపిక. భగవంతుడే ఉపాయం అనే అధ్యవసాయంతో నిశ్చలంగా నిద్రించి ఉంది. ఈమెను కుంభకర్ణునితో పోల్చి చెప్పడంతో ("కుమ్బకరణనుమ్ తోత్తునక్కే పెరునుయిల్ తానే తన్దానో?"- కుంభకర్ణుడును నీకు ఓడిపోయి గాఢనిద్రను ఇచ్చాడా?) ఆమె కొంచెం కినుకతో నిద్రలేచింది. పదకొండో పాశురంలో నిద్రపోతున్న గోపిక సద్గుణాలు, సౌంద ర్యం, అభిజాత్యం ఉన్నది. అన్నీ ఉన్న తనవల్ల ఆకర్షితుడై కృష్ణుడే వస్తాడనే ధైర్యంతో నిద్రించి ఉన్నది. ఈ పాశురంలో సూచింపబడిన ఆళ్వారు శ్రీతిరు మంగై ఆళ్వారు (శార్ఙ్గాంశ) పరకాలులు, కలివైరి అనే పేర్లుకూడా ఉన్నాయి.

భాగవత తదీయారాధనకోసం తన ధనాన్ని అంతా వెచ్చించడమే కాకుండా, నిర్ధనుడైనప్పుడు దొంగతనాలు చేసి ఆరాధన కొనసాగిస్తూ చిట్టచివరికి తనను కరుణించాలని పెండ్లికుమారుని వేషంలో వచ్చిన శ్రీమన్నారాయణునే దోచుకోవాలని ప్రయత్నించి ఆ పరాత్పరునివల్ల తిరుమంత్రాన్ని పొంది తరించిన మహానుభావులు పరకాలులు. గోవులమందల పాలుపితకడం దీనిలో వర్ణితమై, గోరూపమైన భూమి ప్రసాదించే సంపదను భగవద్భాగవత కైంకర్యానికి వినియోగించిన శ్రీ తిరుమంగై ఆళ్వారులు సూచితులయ్యారు. ఆయన "పాయించిన" – "పెరియతిరుమొళి, తిరుక్కురుందాండకమ్, తిరునెడుందాండకమ్, తిరువెళుక్కూత్తిరుక్కై, శిరియతిరుమడల్, పెరియ తిరుమడల్" అనే ఆరింటిని, శ్రీనమ్మాళ్వారులు "పాయించిన" నాలుగు వేదతుల్యాలయిన దివ్యప్రబంధాలకు ఆరు అంగాలుగా (వేదాలకున్న షడంగాలులాగ) వ్యవహరిస్తారు. పన్నెండో పాశురంలో పరమరామభక్తులైన మహారాజైనా విరక్తులయిన, ఏనాడికానాడు శ్రీరంగం పోవా

అనే ఔత్సుక్యం కలవారయిన, విశిష్ట భగవద్భాగవత సేవానిష్ఠులైన కారణంగా పెరుమాళ్ అని పిలువబడే కీర్తిని పొందిన, సంస్కృతంలో యావద్భారతఖ్యాతిని పొందిన "ముకుందమాల"ను వ్రాసిన, తమిళంలో "పెరుమాళ్ తిరుమొళి" ప్రబంధం రచించిన- కౌస్తుభాంశ సంభూతులైన శ్రీకులశేఖరాళ్వారులు ప్రస్తావితులయ్యారు. వీరిని సూచించడానికా అన్నట్లు, నిద్రలో ఉన్న గోపికను లేవడానికి ఈ పాశురంలో శ్రీరాముని గుణగణాదుల వర్ణనాదికం ఉంది. పదమూడో పాశురంలో-నేత్ర సౌందర్యం ఉన్న గోపికను మేల్కొల్పారు. భగవత్కృపవల్ల అజ్ఞానం నశించి, పాండ్యరాజుసభలో విష్ణువే పరతత్త్వమని వాదించి గెలిచిన శ్రీ పెరియాళ్వారుల (గరుడాంశ) సూచన దీనిలో ఉంది. అజ్ఞాన నాశనానికి సూచకకగా గుర్వస్తమయం జ్ఞానోదయానికి సూచనగా శుక్రోదయం వర్ణితమైనది. తన సమ్మానాన్ని చూడవచ్చిన శ్రీమన్నారాయణుని దివ్యమంగళరూపాన్ని దర్శించి, ప్రాకృతజనుల దృష్టివల్ల ఆ జగన్నాథునకు "దిష్టి" తగులుతుందేమో అనే భయంతో "పల్లాండు, పల్లాండు"అని గానం చేసిన భట్టనాథులు వారు. శ్రీ ఆండాళు తల్లి జనకులు. వేదాలకు "ఓం"కారంలాగ శ్రీద్రావిడ దివ్యప్రబంధాలకు ముందుగా ఈ తిరుపల్లాండు, అధ్యయనం జరుగుతుంది. పద్నాలుగోపాశురంలో ప్రబోధిత అయిన గోపిక పెరటితోటలో దిగుడుబావి, దానిలో వికసించిన ఎఱ్ఱ తామరలు ఉన్నాయి."మమ్మల్ని లేపుతానని నువ్వే నిద్రపోవుతున్నావు ఏమిటి"అని ఆమెను ప్రశ్నించారు లేపడానికివచ్చిన గోపికలు. ఈ పాశురంలో గోపిక పెరటిలో దీర్ఘిక, తామరలు, కాషాయవస్త్రధారులైన సన్యాసుల ప్రస్తావనఉంది. పరమ భాగవతోత్తములు, వైజయంత్యంశలో జన్మించిన తొండరడిప్పొడి ఆళ్వారుల (భక్తాంఘ్రిరేణువు) తోట, దిగుడు బావి మొదలయినవి సూచితాలై ఆయన స్మృతికి వస్తారు. వీరు "తరువ్వళ్లి యెళుచ్చి, తిరుమాలై" పాయించి ప్రఖ్యాతి పొందారు. పదిహేనో పాశురంలో భూషణతిరస్కారాలకు అతీతంగా అహంకార రహితస్థితిలో ఉపేక్షాభావంతో ఉన్న గోపికను మేల్కొల్పుతారు. ఈలక్షణాలన్నీ ఉన్న మహానుభావులు-శ్రీవత్సాంశగా జన్మించిన శ్రీ తిరుప్పాణాళ్వారులు దీనిలో ప్రస్తావితులయ్యారు. వీరి దివ్యప్రబంధమైన "అమలనాదిపిరాన్" భక్తులపాలిటి కల్పవల్లి.

ఈ విధంగా తిరుప్పావైలో పదిమంది ఆళ్వారుల ప్రస్తావన గూఢంగా కన

బడుతోందని వ్యాఖ్యాతృశిరోమణులు నిర్ణయించారు. తమ నిర్ణయానికి తగిన ఆధారాలు పాశురాలలో చూపించారు. బతిహాసికంగా ఈ ఆళ్వారులందరి తరువాతనే శ్రీ ఆండాళ్లు తల్లి వచ్చారా? ఇవి, ఆమెగారు తమ పాశురాలలో సంకల్పానుసారం ప్రవేశపెట్టారా? మొదలైన ప్రశ్నలకు తావులేదు. కాలనిర్ణయం అందరి విషయంలోను నిష్కర్షగతేలేదుకాదు. భక్తికి కాలంలేదు. ముందు వెనుకల నిమిత్తంలేదు. ఇదికాక, శ్రీ ఆండాళ్లతల్లికి ముందే ఎందరో కొందరైనా - ఆళ్వారులు గానంచేశారనడంలో సంశయంలేదు. ఆమె తండ్రిగారు పరమ భాగవతోత్తములైన శ్రీ పెరియాళ్వారులేగదా. శ్రీమన్నారాయణుని దర్శనం లభించిన త్రికాలవేదులు. ఆయన గురుత్వం ఆమెకు లభించిందిగదా! గురు పరంపర ప్రకారం వీరిలో కొందరు ద్వాపరయుగంవారు. కొందరు కలియుగ ప్రారంభంలోనివారు. పొయ్‌గైయాళ్వార్ తిరునక్షత్ర తనియన్‌లో "ద్వాపరే పాంచజన్యాంశం సరోయోగినమాశ్రయే" అని ఉంది. శ్రీనమ్మాళ్వారులు "వృషభేతు విశాఖాయాం కురుకాపురి కారిజమ్। పాండ్య దేశే కలేరాదౌ శఠారిం సైన్యపంభజే"అని తిరునక్షత్ర తనియన్‌లో కీర్తించబడ్డారు. కలి ప్రారంభం అంటే నేటికి కొన్ని వేల సంవత్సరాల పూర్వం అన్నమాట. ఇందువల్ల ఈ ఆళ్వారులకాలం విషయంలో ఏకవాక్యతలేదనీ, లేకపోయినా ఈ భాగవతోత్తముల భగవద్భక్తి విషయంలోను, వారి దివ్యప్రబంధాల ప్రభావం విషయంలోను అభిప్రాయభేదాలే లేవనీ గ్రహించాలి. ఇక్కడ, అందరిలోను ఏకవాక్యతఉంది. అందరూ శ్రీమన్నారాయణుని దివ్యాయుధాల, శయ్యావాహన పరివార జనాదుల అంశలలో ఉదయించినవారే. శ్రీఆండాళ్లు-చాలామంది అంగీకరించినట్లు-భూదేవ్యంశయే! జగజ్జనని స్వరూపురాలు!

స్నాన వ్రతం నిమిత్తం బయలుదేరిన గోపికలు, తమతోపాటు మరో పది మంది గోపికలను మేల్కొలిపి తన శయనాగారంలో నిద్రిస్తున్న శ్రీకృష్ణుని లేవడానికి బయలుదేరి నందుని భవనంచేరారు. భగవంతుని సమీపించడానికి భాగవతుల, ఆచార్యుల, జగజ్జననియొక్క సాయంకావాలి; వారి పురషకారంకావాలి. పదహారో పాశురంలో భవన ద్వారపాలకులను అనుకూలంగా చేసుకొని, పదిహేడో పాశురంలో.నందుని, యశోదను, శ్రీకృష్ణుని, బలరాముని మేల్కొల్పారు. కాని, ఉపయోగంలేకపోయింది. తరువాత నాలుగు పాశురాలలో శ్రీనీలాదేవి (శ్రీనప్పిన్న)ని ప్రార్థించి ఆమె పురుషకారాన్ని గ్రహించి శ్రీకృష్ణునిచేరారు. ఆయన వచ్చి సింహాసనారూఢుడు కావడంతో మంగళాశాసనంచేసి తమ కోనకమ మనవి

చేసుకొన్నారు. ఇరవైమూడో పాశురంలోని గోపికల ప్రార్థనానుసారం శ్రీకృష్ణుడు సింహాసనంమీద కూర్చుండగా ఇరవైనాలుగో పాశురంలో సహజారుణమైన ఆయన పాదల కెంపువారికి ఆకర్షకమయి, గోపాలకునిగా ఆయనచేసిన ఘన కార్యాలను కీర్తిస్తూ "సౌందర్యసారసర్వస్వ"మైన ఆనందాత్మజునకు "పోత్రి","పోత్రి" "పోత్రి" అని మంగళం పాడారు. ఇది శ్రీపెరియాళ్వారులు దివ్యమంగళ విగ్రహుడై తనకు దర్శనమిచ్చిన శ్రీమన్నారాయణునకు "పల్లాండు""పల్లాండు"పల్లాండు"అనిపాడిన దాన్ని స్మరింపజేస్తోంది! శ్రీఆండాళ్ళతల్లి శ్రీభట్టనాథుల కుమార్తెగదా!

25వ పాశురంలో శ్రీకృష్ణావతార విశిష్టతను గానంచేసి, 26వ పాశురంలో తాము చేస్తున్నవ్రతానికి వలయు సామగ్రి-శంఖాలు, "పఱం"అనే వాద్యం, మంగళ గీతాలుపాడే భాగవతులు, దీపాలు, ధ్వజాలు, వితానాలు కావాలి-అన్నారు. వీటి కన్నింటికి ఆధ్యాత్మికార్థాలను వ్యాఖ్యాతలు చెప్పారు. జగజ్జనని పురుషకారమే దీపం. ఇది చాలా ముఖ్యం 27వ పాశురంలో వ్రతం ముగిసిన తరువాత తమకు లభించవలసిన ఆభరణాదులనుగూర్చి. శ్రీకృష్ణునితోకలిసి పాలు, అన్నం, నేయి కలిపిన మధురపదార్థం తినడాన్నిగురించి ముచ్చటించారు. భగవానుని పొందు ఇంత మధురమైనదని భావం. 28వ పాశురంలో గోపికలు తమ అల్పత్వాన్ని, పరమాత్మ అయిన శ్రీకృష్ణుని ఔన్నత్యాన్ని; తమలో పరమేశ్వరానుగ్రహం పొందడానికి ఏవిధమైన అర్హతలేదని, సత్కర్మల జ్ఞానమే లేదని విన్నవించు కొంటారు. ఈ నైచ్యానుసంధానం భాగవత లక్షణం. "పరమాత్మవైన నువ్వు మా గోపవంశంలో జన్మించడమే మాపుణ్యం; అజ్ఞానంచేత నిన్ను మేము తగినవిధంగా సంబోధించలేకపోయాము క్షమించాలి. మాకు నువ్వుతప్ప వేరే ఉపాయంలేదు."- అని విన్నవించుకొంటారు. 29వ పాశురంలో - మొదటినుండికావాలి అని కోరు కొంటూ ఉన్న "పఱ"అనే వాద్య విశేషంకాదు. మాకు కావలసినది, "మాకు కావల సింది నువ్వు"అంటారు. గోపికలు భగవత్ప్రాప్తితప్ప ఇంకొకటి కోరినవారు; భగ వత్సేవ, సేవకోసమే చేసినవారుగాని అన్యప్రయోజనాన్ని కోరికాదు. వ్రతంకోసం "పఱ" కావాలి అన్నారుగాని, వారికి కావలసినది శ్రీకృష్ణప్రాప్తిగాని అన్యం ఏదీ కాదు. ఈ పాశురాలను ఈ మిషతో గానంచేసిన శ్రీ గోదాదేవికి-శ్రీ ఆండాళ్ళతల్లికి- కావలసినది భగవంతుని పొందు; శ్రీరంగనాథుని భర్తగా చేసుకోవడం, ఈ పాశు రంలో గోపికలు దాచకుండా తమకు కావలసినది బైటపెట్టారు. ఇది ప్రాకృత జనుల కందరికి కావలసిన భగవత్కైంకర్యమే! దీనిలో తమ కర్తృత్వం ఏమీ

లేదని గ్రహించడంకూడా ఇమిడిఉంది. 30వ పాశురం ఫలశ్రుతిని పోలినది. దీన్ని గురించి వెనుకనే తెలుసుకొన్నాము. శ్రీమన్నారాయణుని కరుణాకటాక్షానికి పాత్రులై బద్ధ జీవులందరు తరిస్తారు.

ఈ "తిరుప్పావై"లో ముఖ్యంగా మూడు అవతారాల ప్రసక్తివస్తుంది. అవి- వామనావతారం, రామావతారం కృష్ణావతారం-అనేవి. వామనమూర్తి త్రివిక్రము నిగా బలిచక్రవర్తి అహంకారాన్ని నాశనంచేసి అతనిలో పారతంత్ర్యాన్ని నెల కొల్పాడు దీనిలో దివ్యత్వ ప్రదర్శనఉంది రామావతారంలో దివ్యత్వస్పర్శలేని- మానుషత్వంలో వీరత్వం చూపించి రావణాదుల అహంకారాన్ని అణచివేశాడు.

కృష్ణావతారంలో సామాన్య జనులమధ్య మెలగి ప్రేమతో వాత్సల్యంతో గోపికల గోపాలకుల ఇంద్రాదుల అహంకారాన్ని అణచివేశాడు. శ్రీగోదాదేవి మన భారతీయ సంప్రదాయానుసారంగా సర్వస్వరూపాలు ఆ శ్రీమన్నారాయ ణునివే అనినమ్మి ప్రవర్తించింది శ్రీవైష్ణవ సంప్రదాయంలో అర్చామూర్తికున్న ప్రాధాన్యం తన భక్తి ద్వారా శ్రీగోదాదేవి నిరూపించింది. అన్ని అర్చామూర్తులు ఒకే పరమాత్మకు ప్రాతినిధ్యం వహిస్తాయి అని తెలియజేసింది. భగవత్ప్రాప్తికి భాగవతుల, ఆళ్వారుల, ఆచార్యుల, సాహాయ్యం; పురుషకార స్వరూపిణి అయిన ఆ జగజ్జనని శ్రీమహాలక్ష్మి (ఆమె రూపమే అయిన శ్రీనీలాదేవి) కరుణ ఎంత ఆవశ్యకమో శ్రీగోదాదేవి వివరించింది.

శ్రీగోదాదేవి తన కృష్ణప్రేమను 143 పాశురాలలో వర్ణించింది. దీనికి "నాచ్చియార్ తిరుమొళి" అని పేరు. దానిలో ఒక దశకంపేరు "వారణమాయి రమ్". శ్రీగోదాదేవి తన చెలికత్తెతో శ్రీకృష్ణుడు వచ్చి తనను వివాహం చేసుకొ నట్లు కలవచ్చింది అని చెప్పుతుంది ఆ కల సంగతి ఇది. ద్రవిడప్రబంధ సంప్ర దాయానుసారం, దశకంలోని మొదటి పాశురం మొదటి పదబంధం, ఆ దశ కానికి శీర్షిక అవుతుంది నాచ్చియార్ తిరుమొళి లోని ఆరోదశకంలోని మొదటి పాశురం మొదటి పదబంధం "వారణమాయిరమ్" ఇదే దానికి పేరయింది. నారా యణుడు వేయి ఏనుగుల బలగంతో పెళ్ళికి తరలివచ్చినట్లు తోరణాలు కట్టినట్లు వచ్చింది ఆ కల. ప్రతి పాశురం "కనాక్కండేన్ తోళీనాన్" అనే మకుటంతో ముగుస్తుంది.

తమిళం -

"వారణమాయిరం శూళవలం శెయ్దు
నారణనంబి వడక్కి న్రా నెన్దెతిర్
పూరణ పొఱ్కుడం వైత్తుప్పుఱ మెంగుం
తోరణం నాట్ట క్కనా క్కండేన్ తోళి నాన్"

తెలుగు -

"వేయి ఏనుగులు పరివేష్టించి వెంటరా
నారాయణుడు తానె నడిచి వచ్చిన యట్లు
పూర్ణకుంభములతో పురమెల్ల ఎదురుచన
కట్టినటు తోరణలు కలిగంటినే చెలి"

(సిరినోము- శ్రీమాన్ బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు-గోదా స్వప్నము (వారణమాయిరమ్) 1981 పుట-78)

ఆళ్వారులలో కొందరు తమయందు స్త్రీత్వాన్ని ఆరోపించుకొని నాయికా భావంతో శ్రీమన్నారాయణుని పతిగా భావించుకొని పాశురాలు గానంచేశారు. సహజ స్త్రీత్వం ఉన్న శ్రీ గోదాదేవి భగవత్ప్రేమకు పరాకాష్ఠగా వెలుగొందింది. "తిరుప్పావై"లో కారణజన్మురాలైన ఆమె తాను వలచిన శ్రీరంగనాథుని పొందుకోసం నియమ నిష్ఠలతో మాసవ్రతం చేస్తూ దినానికి ఒక పాశురంచెప్పున పాడి తమ ఊరి దైవం, తమ తండ్రిగారి అర్చామూర్తి అయిన శ్రీవటపత్ర శాయికి సమర్పించింది. ఆ అర్చామూర్తిలోనే ఆమె శ్రీమన్నారాయణుని ఇతర దివ్యదేశాలలో వేంచేసియున్న అర్చామూర్తులను, అవతారాలను అన్నింటిని దర్శించింది ఆమెకు భేదభావం లేదు. శ్రీరంగనాథునే వలచి వలపించుకొన్న ఆండాళ్ల తల్లి, తనను శ్రీ వేంకటేశ్వరునకు ప్రియురాలినిగా చేయవలసినదని మన్మథుని ప్రార్థించింది! ఆమెదృష్టిలో అన్ని అర్చామూర్తులు ఒక భగవానుని ప్రతినిధులనే విశ్వాసానికి ఇంతకంటే వేరే నిదర్శనం ఏముంటుంది? ఆమె చేసే నిత్యపూజలు, మాలాసమర్పణ, వ్రతాదికం శ్రీవిల్లిపుత్తూరు, శ్రీ వటపత్రశాయి సన్నిధిని; తనపాశురాలద్వారా తన అభీష్టాన్నిపొంది తాను తరించి మనం తరించడానికి వాటిని ఇచ్చి

పోయింది. ఇదేవిధంగా ఆ మహాభక్తురాలు విరహిణిగా గానంచేసిన పాశురాలైన "నాచ్చియార్ తిరుమొళి"లోని "వారణమాయిరం" అనే పేరున్న పాశురదశకాన్ని నేటికీ శ్రీ వైష్ణవుల గృహాంలో వివాహాది శుభసమయాలలో గానంచేసి ఆ ఆండాళ్ల తల్లి అనుగ్రహంపొంది అభ్యుదయ పరంపరలను అనుభవిస్తూ ఉండడం కనబడుతూనే ఉంటుంది.

భారతీయ సంప్రదాయాలలో- విశేషించి వైష్ణవ సంప్రదాయాలలో—అర్చామూర్తికున్న ప్రాధాన్యం కొందరికి ఆశ్చర్యం కలిగించవచ్చును. కాని అర్చామూర్తి భగవంతునకు కేవలం ప్రతీక కాదు. భగవంతుడే అనే విశ్వాసం ఆళ్వారులకందరికీ ఉంది. ఈ విషయమై సుప్రసిద్ధ విద్వాంసులు, ఆచార్యులు అయిన ఆచార్య కే.సి. వరదాచారిగారు ఇలా అంటున్నారు:

"The South Indian religious mystic is however very much aware of the iconic presence of God in the temples. For him the icon is a real speaking and communicating presence of God and not merely a sign or linga or pratika of God mediating between the need for a sign of presence and the presence itself. This is rather extraordinary in mysticism and yet it must be said that the consistency with which the experience of God had happened in and through the icons which they worshipped leads one to assert that this kind of worship has sanctity and reality" (Alwars of South India—K C Varadachari Introduction- Page- XVII, Bharatiya Vidya Bhavan Bombay—1966).

మన ఆళ్వారులందరు-అర్చామూర్తులతో సంభాషించినవారే అంటే అది అతిశయోక్తి అనిపించుకోదు. ఈ అర్చామూర్తులలో - శ్రీరంగంలోని శ్రీరంగనాథస్వామి, కంచిలోని శ్రీవరదరాజస్వామి, తిరుపతి-తిరుమలలోని శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీవిల్లిపుత్తూరులోని శ్రీ వటపత్రశాయి మొదలైనవారిని పేర్కొ-

వచ్చును. ఆళ్వారులలో ప్రసిద్ధంగా శ్రీ పెరియాళ్వారులను పేర్కొవచ్చును. ఈయనతో వటపత్రశాయి మాట్లాడడమే గాదు, వాదించడానికి పాండ్యరాజాస్థానానికి పంపుతాడు.

ఇంక ఆళ్వారుల తాత్త్విక దృక్పథాన్ని పరిశీలించినప్పుడు వారు భక్తులు, పరిపూర్ణమైన భారతీయ సంప్రదాయజ్ఞులని తేటతెల్లమవుతుంది. ఈ విషయమై ఆచార్య కె సి. వరదాచారిగారు ఇలా వ్రాశారు:

"The Alwar philosophy is deeply indebted to the Vedic and Puranic scriptures and is seeping with the mystic mysticism characteristic of the latter The Alwars were also conversant with the Agamas (Pancharatra) which provided them with the concrete worship of the icons " (Alwars of South India K C Varadachari, Introduction P IX, Bharatiya Vidya Bhavan, Bombay, 1966)

ఆళ్వారులు దార్శనికులు కాకపోయినా, వారి పాశురాలలో- ఈశ్వరుడు, జగత్తు, జీవుడు అనే తత్త్వత్రయానికి సంబంధించినవారి భావాలు స్ఫుటంగా వ్యక్తమై కనబడతాయి. ఆళ్వారులు జగత్తును సత్యంగా నిత్యంగా విశ్వసించినట్లు వారి పాశురాలు వ్యక్తంచేస్తాయి. మాయామయమైన సంసారం మాత్రం అనిత్యం అన్నారుగాని, జగత్తు అనిత్యమనలేదు. జీవజగత్తులు రెండూ పరమేశ్వరునిఅంశాలన్నారు ఆళ్వారులు పరమాత్మను గురించి విస్తారంగా వర్ణించారు. అంతవిస్తారంగా జీవునిగూర్చి చర్చించలేదు. ఆళ్వారుల పాశురాలలో- జీవన్ముక్తావస్థ, దేహపతనానంతరం లభించే ముక్తావస్థల ప్రస్తావన ఉంది భగవానునకు సగుణ నిర్గుణ రూపాలు రెండూ ఉన్నాయి అన్నారు. ఆళ్వారులు-సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్య ముక్తి మార్గాలను ప్రస్తావించారు ఆళ్వారులు తమ దివ్య ప్రబంధాలలో విరాట్పురుషుని వర్ణన రమణీయంగా చేశారు ఇది పురుష సూక్తాన్ని, భగవద్గీతలోని విశ్వరూప సందర్శనా ధ్యాయాన్ని జ్ఞాపకం చేస్తుంది. మన్నుతిన్న కృష్ణుణ్ణి నోరుతెరచి చూపించు అని యశోద గద్దించినప్పుడు, ఆ లీలా మానుషవిగ్రహుడు నోరు తెరుస్తూ సమస్తలోకాలు దర్శనమిస్తాయి. ఈ విషయాన్ని పెరియాళ్వారులు

చాలా రమణీయంగా తమ "పెరియాళ్వార్ తిరుమొళి"లో వర్ణించారు. ఆళ్వారులు చాలామంది భగవంతుని అర్చారూపాలను వర్ణించారు. ఇవి మనకు "తిరువాయి మొళి"లోను "పెరియ తిరుమొళి" లోను ఇంకా ఇతర ప్రబంధాలలోను తరచుగా కనబడుతూఉంటాయి. "అట్టపుయకరమ్" అనే దివ్యక్షేత్రంలో మత్స్యకూర్మావ తారాలు ఎత్తిన భగవానుడున్నాడని, "వీరామవిణ్ణగర్" అనే క్షేత్రంలో వరాహావ తారాన్ని ఎత్తిన పరమేశ్వరుడున్నాడని తమ పెరియతిరుమొళిలో తిరుమంగై యాళ్వారు వర్ణించారు. వేదాలు వర్ణించిన బ్రహ్మ "తిరుమాలిరుంశోలై" అనేచోట ఆలయంలో ఉన్నాడని—నమ్మాళ్వారులు తమ "తిరువాయిమొళి"లో వర్ణించారు.

"వేదముమ్ విరిత్తాన్ విరుంబియ కోయిల్ ।
మాదుబుమయిల్ శేర్ మావిరుంశోలై ॥" (II-10-10)

కులశేఖరాళ్వారు తన పెరుమాళ్ తిరుమొళిలో దేవతలను రాక్షసులను సృష్టించింది భగవంతుడే. ఆయన అందరిచేత స్తుతింపబడదగినవాడు" అని వ్రాశారు.

"తేవరైయుమ్ అశురైయుమ్ తిశైక్కళైయుమ్ పడైత్తవనే ।
యావరుమ్ వన్దు అడిపణఙ్గ అరంగ నగర్తుఇన్దవనే ॥" (8-10)

తొండరడిప్పొడియాళ్వారు తన "తిరుమాలై"లో "అచ్యుతా, దేవదేవా! అని పిలుస్తూ త్రిభువనమోహనుడైన భగవంతుని కల్యాణగుణాలను గానంచేస్తూ ఉండడమే నాకు ఆనందం సర్వమోక్షసుఖాలు నాకు వద్దు" అంటారు.

"అచ్చుదావమరరేఱే ఆయర్తమ్ కొళున్దేయెన్నుమ్
ఇచ్చువై తవిరియాన్పోయ్ ఇన్దిరలోకమాళుమ్
అచ్చువై పెఱీమమ్ వేణ్డేన్............" (2)

ఆళ్వారులు—పరమాత్మునియొక్క పర-వ్యూహ-అంతర్యామి-విభవ-అర్చారూపా లను వర్ణించారు మహాభక్తులు-తమిళ సంస్కృతభాషలలో సమాన ప్రతిభతో కవిత్వం చెప్పిన కులశేఖర పెరుమాళ్- "తిరుమలలో శ్రీనివాసుని దివ్యసన్ని ధిలో "కొంగ"గా నైనా జన్మిస్తే నా జన్మ ధన్యం" అనుకున్నారు "వేంకటాచలం మీది పూదోటలో నేనొక్క చంపకపుష్పమైనా, నా జన్మధన్యం" అనుకొన్నారు. "శ్రీరంగంలో ఆనందోద్వేగాలతో నృత్యసంకీర్తనలతో భగవంతుణ్ణి సేవిస్తూ

తన్మయతతో ఉన్మత్తుణ్ణి ఎప్పుడు కాగలనో!" అన్నారు కులశేఖరులు తమ పెరుమాళ్ తిరుమొళిలో (1-9)

> తిరువరఙ్గత్తరవణైయిల్పళ్ళికొళ్ళుమ్
> పోరాళియమ్మానై కణ్డుతుళ్ళి
> పూదలత్తి వెన్నుకొలో పురుళునాళే ॥"

ఆళ్వారులందరు శ్రీమన్నారాయణుని భక్తులే, అన్ని అవతారాలయందు శ్రద్ధాభక్తులు కలవారే, కాని కొన్నికొన్ని అవతారాలను విశేషంగా అభిమానించి పాశురాలను గానం చేశారు. ఆ అవతారాలలో శ్రీ రామకృష్ణావతారాలు సహజంగానే ప్రముఖస్థానాన్ని ఆక్రమించాయి. వారి దివ్య ప్రబంధాలలో ఈ అవతారాలకు సంబంధించిన పాశురాలు అధికంగా కనబడతాయి. రామావతారాన్ని వర్ణించడానికి కావలసిన సామగ్రివారికి వాల్మీకి రామాయణంద్వారా లభించింది. రామాయణంలో భక్తి ప్రపత్తులను తెలియజేసే, పెంచే ఘట్టాలను గ్రహించి విశేషంగా గానంచేశారు. రామాయణాన్ని అంతా తీసుకొని అనువాదంగాగాని, సొంతగా గాని ఏ ఆళ్వారు రచనచేయలేదు. ఈ వాక్యాలన్నీ శ్రీకృష్ణావతారానికి కూడా అన్వయిస్తాయి. ఈ రెండు అవతారాల లీలావిశేషాల్ని యథోచితంగా గ్రహించి కీర్తించినవారున్నారు. ఒక అవతారాన్ని విశేషంగా కీర్తించి, రెండో అవతారాన్ని గూర్చి తక్కువ పరిమాణంలో కీర్తించిన వారున్నారు. మన పన్నిద్దరాళ్వారులలో రామకథలోని ఘట్టాలను తీసుకొని విశేషంగా రచనలు చేసిన ఆళ్వారులు—కులశేఖరాళ్వారులు, తిరుమంగై ఆళ్వారులు, పెరియాళ్వారులు, నమ్మాళ్వారు అనువారు.

వీరందరిలో కులశేఖరాళ్వారులు రామభక్తి విషయంలో రామకథాభాగాలను ఇతివృత్తంగా తీసుకొని పాశురాలు గానం చేయడంలో ప్రముఖులనవచ్చును. పెరుమాళ్ తిరుమొళి అనే వారి దివ్య ప్రబంధంలో చివరి మూడు దశకాలు రామకథకు సంబంధించినవే. ఈ మూడింటిలో మొదటిది రాముని బాల్యాన్ని గురించి చెప్పేది. ఈ పాశురాలలో కౌసల్యా జోలపాట మొదలైనవి ఉన్నాయి. రాగతాళాలతో పాడడానికి అనువుగా ఉన్నాయి దీనిలోనే రాముని జీవితానికి సంబంధించిన ఘట్టాలవర్ణనకూడా ఉంది కులశేఖరులు తమయందు మాతృత్వాన్ని ఆరోపించుకొని హృదయంగమంగా రచన సాగించారు వాత్సల్యభక్తికి

విదర్శనం. ఇది పెరియాళ్వారు కృష్ణుని విషయంలో ప్రదర్శించిన దానికి పోటీగా నిలువగలిగినది. రెండో దశకంలో రామవనగమన దుఃఖంవల్ల దశరథుడు శోకించడం హృదయ విదారకంగా వర్ణితమైనది. దీనిలో దీనాతిదీనంగా తన దోషాలను క్షమించివేయనిదిగా వేడుకోవడం ఆ మహారాజు దాస్యభావాన్ని ఎంత చక్కగా అలవర్చుకున్నారో తెలుపుతుంది.

శ్రీకులశేఖరాళ్వారుల తరువాత రామకథకి సంబంధించిన పాశురాలను అధికసంఖ్యలో వ్రాసిన వారుగా తిరుమంగై ఆళ్వారులు గణనకు వస్తారు, ఆయన ఆరు రచనలలో రామాయణకథకు సంబంధించిన పాశురాలు నూరునూటయాభై దాటి ఉంటాయి. కాని అవి అన్నీ ఒక క్రమపద్ధతిలో రావు. కొన్ని ఘట్టాలను మాత్రం వివరిస్తాయి. ఈ ఆళ్వారుల పెరియతిరుమొళిలో ఒక దశకంలో ఓడి పోయిన రాక్షసవీరులు శ్రీరాముని గుణగణాదులు కీర్తించడం విశేషంగా కనబడు తుంది. బాలకాండలోని కథకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు, అరణ్యకాండ లోని కొన్ని ఘట్టాలకు సంబంధించినవి, కిష్కింధాకాండలోని కథకు సంబం ధించినవి. సుందరకాండలోని కొన్ని సన్నివేశాలకు సంబంధించినవి, యుద్ధ కాండలోని కొన్ని ఘట్టాలకు సంబంధించినవి- పెరియతిరుమొళి పాశురాలలో పాడబడ్డాయి. ఇదేవిధంగా ఈయన ఇతరరచనలైన - పెరియతిరుమడల్, శిరియతిరుమడల్, తిరుక్కురుందాండకం, తిరునెడుందాండకంలలో వివిధ కాండలలోని రామాయణ సన్నివేశాదులు గానం చెయ్యబడ్డాయి. పెరియా ళ్వారులు - ముఖ్యంగా కృష్ణభక్తులుగా తమ పాశురాలలో దర్శనమిస్తారు. కాని, మర్యాదాపురుషోత్తముడైన శ్రీరాముని కథకు సంబంధించిన కొన్ని ఘట్టాలవర్ణన ఈయన పెరియాళ్వార్ తిరుమొళిలో కనబడుతుంది. దీనిలోని రెండు దశకాలలో ఈ వర్ణన కనబడుతుంది. ఇది ఇద్దరు సఖుల సంభాషణ రూపంలో నిర్వహించ బడింది. రామకృష్ణావతారాలను గూర్చి చెప్పేటప్పుడు రామావతారంలో జరిగిన పరశురామ గర్వభంగం, రామవనగమనం, సేతునిర్మాణం, లంకాప్రవేశం మొద లైనవి హనుమంతుడు చెప్పినట్లు చెప్పడం జరిగింది. సీతారాములగుణపరంపర ఆంజనేయుడు ప్రస్తుతిస్తూ ఉన్నట్లు చెప్పడం జరిగింది. పెరియాళ్వారులరచనలలో దాస్యవాత్సల్యభక్తుల ప్రకటన విశేషంగా ఉంటుంది.

ఈ ఆళ్వారులే కాక నమ్మాళ్వారులు కూడా తమ తిరువాయిమొళిలో-

బాలకాండలోని, అయోధ్యాకాండలోని, కిష్కింధాకాండలోని, యుద్ధకాండలోని కొన్ని సన్నివేశాలను గ్రహించి పాశురాలు గానం చేశారు. వీరే కాక మిగిలిన ఆళ్వారులందరు రామాయణకథాఘట్టాలను గ్రహించి తమ పాశురాలలో పాడారు. కృష్ణభక్తురాలైన శ్రీ ఆండాళ్లకూడా ఒకటి రెండు పాశురాలలో రామకథా విషయాన్ని ప్రస్తావించింది. ఆళ్వారులు రామకథకు సంబంధించి పాడిన పాశురాలను ఒకచోటికి చేర్చి అనంతరకాలంలో మహావ్యాఖ్యాతగా పేరుపొందిన శ్రీ పెరియ వాచ్చాన్ పిళ్లై అనే భక్త పండితులు ఒక రామాయణాన్ని సిద్ధం చేశారు. ఈ సంకలిత రామాయణం "పాశురప్పడి రామాయణం" అనే పేరుతో- ఆళ్వారు లెవ్వరూ రామయణాన్ని పూర్తిగా వ్రాయని లోపాన్ని కొంత పూరించింది.

ఆళ్వారులలో చాలామందిని కృష్ణావతారం విశేషంగా ఆకర్షించింది అనాలి. శ్రీరాముని అవతారజీవితం కంటె శ్రీకృష్ణుని అవతారజీవితం విశిష్ట సన్నివేశభరితం కావడం, ఆయన తన దైవత్వాన్ని-శ్రీరామునిలాగ మరుగు పర్చుకోకపోవడం, దీనికి కారణాలుగా చెప్పవచ్చును. శ్రీకృష్ణుడు ముగ్గురు మూర్తులు. భాగవత కృష్ణునిగా, భారత కృష్ణునిగా, భగవద్గీత కృష్ణునిగా ధరించినవే ఆ మూడుమూర్తులు అని సర్వవిదితం. ఆళ్వారుల పాశురాలలో శ్రీకృష్ణుని దివ్యలీలలను విశేషంగా ప్రపంచించినవి- పెరియాళ్వారులపాశురాలు శ్రీ ఆండాళ్లు తల్లి పాశురాలు. భగవత్కృపులైన ఆళ్వారులందరు యథోచితంగా యథాసంభవంగా శ్రీకృష్ణుని లీలామానుషవిగ్రహాన్ని వర్ణించినా, తానే యశోద ననుకొన్న పెరియాళ్వారుల పాశురాలలో, ప్రియునిగా శ్రీకృష్ణుని భావించుకొని తనను గోపికగా ఎంచుకొని ఆయన పొందుకోసం మానవ్రతం త్రికరణశుద్ధిగా చేసిన భూదేవ్యంశ అయిన శ్రీగోదామాత పాశురాలలో, శ్రీకృష్ణప్రేమ వెల్లివిరియడంలో ఆశ్చర్యంలేదు. శ్రీ పెరియళ్వారులలో దాస్యవాత్సల్యభావాలు ప్రథమస్థానం పొందగా, శ్రీ గోదాదేవి పాశురాలలో మధుర శృంగారభావాలు అగ్రస్థానం పొందడమేకాదు- మిగిలిన భావాలనన్నింటిని "త్రోసిరాజు" అన్నాయి.

లీలామానుషవిగ్రహుడైన శ్రీకృష్ణుని అనన్యభక్తుడైన పెరియాళ్వారుల ముఖవియత్పథంనుండి దాస్యవాత్సల్యాది భావనిర్భరమైన "తిరుపల్లాండు, తిరుమొళి" పాశురాలు-గాంగ ఝరీవేగంతో ఆవిర్భవించాయి. విష్ణుపాదోద్భవ పవిత్ర

తను గూర్చి వేరే చెప్పవలసింది ఏముంది? ఆరాధయౌవన అయిన శ్రీ గోదా దేవి మానసాబ్జంలో శృంగార సౌందర్యనిధానమైన నందాత్మజుడు నిత్యనివాసి గనుక ఆమె పవిత్రవక్త్రంనుండి కృష్ణస్పర్శవల్ల తద్వర్ణమే పొందిన యమునా తరంగిణీ తుల్యాసమ్మోహజనకమైన "తిరుప్పావై, తిరుమొళి" పాశురాలు వెలువడి నాయి. ఈ తండ్రి కూతుళ్ల పాశురాలు గంగాయమునా సదృశాలు గనుకనే. ఒకటి పెరియాళ్వారు తిరుమొళి" కాగా రెండోది "నాచ్చియార్ తిరుమొళి" అయింది. "తిరువల్లాండు తిరుప్పావై"లు తత్తిరస్థ స్నానఘట్టాలు అయ్యాయి.

బాలకృష్ణుని రూపలావణ్యంతో ముగ్ధులైన పెరియాళ్వారులు ఆరవై పాశు రాలలో ఆయన సౌందర్యాన్ని నఖశిఖ పర్యంతం వర్ణించారు. పెరియాళ్వారు తిరు మొళి బాలకృష్ణుని పాదాలు కమలాలులా అందంగా ఉన్నాయి అంటుంది.

"పాదక్కమలంగళ్ కాణీరే"

ప్రవాళవర్ణ సదృశాలైన పెదవుల నడుమ పలపంకలా పలువరుస వెలుగు తోంది అంటుంది:

కోలవఱుమ్ పవళ చెందువర్ వాయినిడై
కోమలవళ్ళిముళై పోల్ శిలపల్లిలక ॥

శ్రీకృష్ణుని బాల్యదశలన్నీ ప్రేమభక్తి భావాలతో పెరియాళ్వారు వర్ణించారు. ఆయన శ్రీకృష్ణుని నామకరణం, పూతనసంహారం శకటాసురభంజనం గజ్జలు ఘల్లుఘల్లుమంటూంటే మట్టిలో పొరలాడ్డం, పాకడం తప్పటడుగులు వేయడం వెన్నదొంగిలించి కుండలు పగలగొట్టడం- ఒకటేమిటి- అన్నీ- బాల్యక్రీడలు వర్ణించారు. తరువాత కిశోరరూపసౌందర్యాన్ని, చేష్టలను వర్ణించారు.

పెరియాళ్వారులే కాక తిరుప్పాణాళ్వారులు కూడ తమ "అమలనాది పిరాన్" అనే దివ్య ప్రబంధంలో శ్రీమన్నారాయణుని సౌందర్యాన్ని శ్రీరంగ నాథుని ఆధారంగా చేసుకొని కీర్తించారు. దీనిలో వెంకటాచలపతి, త్రివిక్రముడు రావణుని దునిమిన శ్రీరాముడు, నరసింహావతారం, వటపత్రశాయి, గోపాలుడు కీర్తించబడ్డారు. ఆళ్వారులందరు శ్రీకృష్ణుని అతిమానుష కృత్యాలను వర్ణించారు.

ఆళ్వారులు చేసిన శ్రీకృష్ణవర్ణనలో వారి దాస్య, సఖ్య, వాత్సల్య, మధుర

భావాల తీవ్రత మనకు విశదమౌతుంది. వీటిలో- వాత్సల్య, మధురభావాల వర్ణనలు అన్నింటిని అతిశయించి ఉన్నాయి ఈ రెండు భావాల వ్యక్తీకరణ పరాకాష్ఠ మనకు శ్రీ పెరియాళ్వారుల, శ్రీ గోదాదేవి పాశురాలలో కనబడుతుందని గ్రహించాము. వీటిలో మధుర భావప్రకటన అన్నింటినిమించి మన హృదయాలను ఆకర్షిస్తుంది. సహజంగా స్త్రీ అయిన శ్రీ ఆండాళ్లు తన తిరుప్పావైలో, నాచ్చియార్ తిరుమొళిలో తన హృదయగత ప్రేమ శృంగారభావాలను అతిమనోహరంగా వ్యక్తంచేసి యావద్భారతంలోని తరువాతి మధురభక్తి కవులకు మార్గదర్శకురాలైనది. శ్రీకృష్ణుని వేణునాదం సమ్మోహజనకమై సర్వజనాకర్షకమైనది. ద్రావిడసంప్రదాయంలోని శ్రీకృష్ణునిమేనమామ కుంభగోపుని కూతురైన 'నప్పిన్న' స్థానాన్ని ఉత్తరదేశవైష్ణవ సంప్రదాయంలోని రాధ ఆక్రమించింది. శ్రీ మహావిష్ణువునకున్న ముగ్గురు దేవేరులలో- శ్రీ, భూ, నీలాదేవులు- నీలాదేవి అంశోద్భవయే కృష్ణావతారంలోని "నప్పిన్న" శ్రీరాముడు శివధనుస్సును భగ్నంచేసి సీతామహాదేవిని పరిణయమాడినట్లే, శ్రీకృష్ణుడు సప్తవృషభాలను బంధించి నీలాదేవిని వివాహమాడుతాడు. ఈ అవతారంలో ఈ వృషభమర్దనం వివాహశుల్కం. శ్రీ మహావిష్ణువు దేవేరుల ప్రస్తావన వేదసూక్తాలలో ఉన్నది. శ్రీసూక్త-భూసూక్త నీలా సూక్తాలు జగత్ప్రసిద్ధాలు. ఈనీలాదేవి అనుగ్రహంకోసం "తిరుప్పావై"లో నాలుగు పాశురాలలో గోపికలు-శ్రీగోదా "గోపిక"తో కలిపి- శ్రీ నీలాదేవి సౌందార్యాన్ని వర్ణించి కీర్తిస్తారు. అక్కడ ఆమె పురుషకారం చేసింది. నాయికా విరహాన్ని తెలిపే శ్రీగోదాదేవి రచనలు మధురభక్తికి ఉత్తమోదాహరణలు.

సంస్కృతభాగవతంలో ప్రముఖస్థానాన్ని పొందిన "రాసక్రీడ"ను ఆళ్వారులు ఆ విధంగా తమ పాశురాలలో వర్ణించలేదు. కాని వారు పేర్కొన్న "కురవైకూత్తు"- గోపకన్యకలు చేతులు పట్టుకొని నాట్యం చెయ్యడం- దీనిని పోలినదే అని ప్రముఖ తమిళ విద్వాంసులు భావించారు. ఇంక భ్రమరగీతల విషయం చూస్తే- అవికూడా గోపికలు తమ విరహవ్యథను తెలియజేసుకొన్నవే అవుతాయి. శ్రీమద్భాగవతంలో దశమస్కంధంలో వచ్చేవి ఇవి. శ్రీకృష్ణుని వార్తను తెచ్చిన ఉద్ధవునితో పలికిన పలుకులివి. ఇవి పలుకుతూ ఉన్నప్పుడు అక్కడికి యథాలాభంగా వచ్చిన తుమ్మెదను ఉద్దేశించినట్లుగా భాసింపజేసింది ఈ పలుకులు పలికిన గోపిక. పోతన తన భాగవతంలో "హరి తన్నుం బ్రార్థింప బుత్తెంచిన దూతయని కల్పించుకొని, యుద్ధవున కన్యాపదేశంబై యొఱుకపద,

నయ్యేశికిందొయ్యేలి యిట్లనియె" గోపిక తుమ్మెదను సంబోధించినా ఉపాలంభం మాత్రం శ్రీకృష్ణు నుద్దేశించి. ఈ ఉపాలంభంలో కోపం కంటె వ్యధ, వియోగ బాధ ఎక్కువగా ఉన్నాయి. తమ సొత్తు అనుకొన్న కృష్ణుడు దూరమైనాడు అనే ఆత్మ నిర్వేదనాత్మకం ఇది! శరణాగతిచేసిన వారిని ఉపేక్షించడం తగదని చెప్పుకోవడం. ఇక్కడ గోపికలవ్యధను పోతనామాత్యుడు హృదయవిదారకంగా ఒక గోపికచేత వ్యక్తం చేయించాడు.

"బంధులబిడ్డలన్ మగల భ్రాతలఁదల్లులఁదండ్రులన్ మనో
బాంధవతఁజేసి డించి శరణందిన మమ్ము వియోగదుర్దశా
సింధువునందుఁ ద్రోసియిటు చేరకపోవుట పాడిగాదు, పు
ష్పంధయ! మీయధీశునకుఁ బాదములంటిడియొత్తి చెప్పవే!"

(దశమస్కంధం-47 అధ్యాయం-1482 పద్యం)

శ్రీమద్భాగవతంలోని ఈ ఘట్టాన్ని గ్రహించి నమ్మాళ్వారులు "తిరువిరుత్తమ్" లోను తిరుమంగై యాళ్వారులు "పెరియతిరుమొళి"లోను నాయికా విరహావస్థను భ్రమరగీతానుసారంగా వర్ణించారు. నాయిక నాయకునకు తన మనోవ్యధను (గోపిక శ్రీకృష్ణునకు తెలిపినట్లుగా) సందేశం ద్వారా తెలియజేయడం ముఖ్యవిషయం. నాయికాభావంతో నమ్మాళ్వారులు రచనలు చెయ్యడం వల్లనే, "వకుళభూషణనాయకి" (వకుళభూషణనాయిక) అని ఆ పాశురాల ప్రసంగ సందర్భంలో ఈయన్ని వ్యవహరించడమూ ఉంది. పతివ్రతకుండవలసిన ఆకార త్రయం - అనన్యార్హత్వం, అనన్యభోగ్యత్వం, అనన్యశరణ్యత్వం - ఈ భక్తశిఖామణిలో కనబడతాయి. ఈ భావాన్ని ఈయన ఆరోపించుకొన్నారనే విషయం ఈ శ్లోకం తెలియజేస్తోంది:

"యో మునిర్నాయికా భావమాత్మన్యారోప్య చక్రిణః ।
హరిం ప్రాప శఠారాతిం తం వందే భగవత్కవిమ్॥"

పరమేశ్వరుడొక్కడే పురుషుడనేభావంతో, తమ్ముతాము నాయికగా భావించుకొని మృదుమధురభాషలో, కోమల భావసంపదతో గానం చేసిన పురుషపుంగవులలో నమ్మాళ్వారులే ప్రథములని పెద్దలభావం.

పరమేశ్వరుడొక్కడే పురుషుడు గనుక నాయికా భావంతో తమ విరహార్తిని శ్రీ నమ్మాళ్వారులు ప్రకృతిలోని వస్తుజాతంతో, జంతు పక్షులతో చెప్పుకొని వాటిలో కొన్నింటిని దూతకార్యానికి నియోగిస్తారు. వీటిలో ఒక బెగ్గురుపక్షి (సారస పక్షి) ఉంది.

"అంజిఱైయ మడనారా యళియత్తాయ్ నీయుమ్ నిన్
అంజిఱైయ శేవలుమా యావా వెన్తెనక్కరుళి
వెంజిఱై ప్పుళ్ళుయర్త్తార్కెన్ విడుతూతాయ్ చ్చెన్ఱక్కాల్
వన్శిఱైయి లవన్ వైక్కిల్ వైప్పుండా లెన్ శెయ్యుమో!"

(తిరువాయిమొళి-1-3-1)

(నీకు రెక్కలు ఉన్నాయి గనుక నువ్వు క్షణంలో ఎగిరి నా స్వామిని సమీపించి నా దయనీయస్థితిని తెలియజేయి. నా స్వామి వియోగంవల్ల నాకు రాత్రి నిద్ర లేనట్లే, నీకూ వియోగం వల్ల నిద్రలేనట్లున్నది. కనుక నువ్వు అర్థం చేసుకో గలవు. శరణాగతుల్ని రక్షించే బిరుదం ఉన్నది గనుకనే నా స్వామి గరుత్మం తుణ్ణి వాహనంగా గ్రహించాడు. ఆయన ఒకవేళ నా ప్రార్థనను మన్నించక పోయినా, నువ్వు శ్రమతీసుకోకతప్పదు. -స్థూలానుసరణం)

ఆళ్వారుల రచనలను గూర్చి వ్రాసేటప్పుడు పన్నిద్దరాళ్వారుల పాశురాలనే కాక ఆ ఆళ్వారులలో విశిష్టుడై పెరుమాళ్ అని అనిపించుకొన్న కులశేఖరాళ్వారులు సంస్కృతంలో రచించిన "ముకుందమాల"ను కూడా గ్రహించాలి ఇది తమిళంలోని పాశురతెగకు చేరినది కాదు గనుక, నాలాయిర దివ్యప్రబంధంలో చేరలేదుగాని, భక్తి తత్పరతవిషయంలో, ఆత్మార్పణ నిరూపణ విషయంలో, శరణాగతి తత్త్వబోధన విషయంలో పైవాటికి తీసిపోదు. ఈయన తమిళంలో రచించిన "పెరుమాళ్ తిరుమొళి" కున్న మాన్యత దీనికీఉంది. ఇది సంస్కృతంలో ఉన్నది గమక దీనికి శ్రీవైష్ణవేతరులైన భక్తులలో కూడా విశేష ప్రచారం ఉంది. ఇది తెలుగువారి విషయంలో పరమసత్యం. భక్తకవి పోతన, ముకుంద మాలలోని చాలా శ్లోకాలను అనుసరించి తన భాగవతంలోని ప్రహ్లాదచరిత్ర, గజేంద్రమోక్షణాది ఘట్టాలలో పద్యాలు వ్రాశాడు. ఈ రాజకవి 8వ శతాబ్ది (768 క్రీ॥శ॥)లో కేరళను పరిపాలించిన దృఢవ్రతుడనే చేరవంశ రాజపుత్రుడు

ఈయన తిరునక్షత్రతనియన్ ఇది:

"కుంభేపునర్వ సూజాతం కేరళేకోళిపట్టణే
కౌస్తుభాంశం ధరాధీశం కులశేఖర మాశ్రమే"

ఈ రాజకవి భక్తిప్రపత్తులను పూర్ణంగా తెలియజేస్తుంది ఈయన నిత్యతనియన్.

"ఘుష్యతే యస్యనగరే రంగయాత్రా దినేదినే ।
తమహంశిరసా వందే రాజానం కులశేఖరమ్॥"

శ్రీరంగయాత్రకు బయలుదేరుతున్నట్లు ప్రతిదినం ఆయన రాజధానిలో ప్రకటన జరుగుతూఉండడం, శ్రీరంగం పోతే అతన్యుద్రేకంలో అక్కడే మనరాజు ఉండి పోతాడనేభయంతో రాజ్యక్షేమంకోసం మంత్రులు కొందరు భాగవతులను ఆయనకు ఎదురుగా పంపుతూ ఉండడమూ భగవత్సేవకంటె భాగవతసేవ ప్రథమకర్తవ్యం గనుక రాజు వారిసేవకోసం ఆనాటి ప్రయాణం వాయిదావేసు కోవడం ప్రతిదినం జరుగుతూఉండేదట! భాగవతసేవా ప్రాధాన్యాన్ని తెలిపే క్రింది శ్లోకాలు ఆయన మనస్సులో మెలగుతూ ఉండడమే దీనికి కారణం:

"పూజనాద్విష్ణుభక్తానాం పురుషార్థోఽస్తి నేతరః ।
తేనతద్వేషతః కించిన్నాస్తి నాశనమాత్మనః॥
షష్టిర్వర్ష సహస్రాణి విష్ణోరారాధనే ఫలమ్ ।
సకృద్వైష్ణవపూజాయాః కలాం నార్హతి షోడశీమ్॥"

మన ప్రాచీన సంప్రదాయంలోని జనకమహారాజునకు వీరికి పోలిక ఉంది. వీరిద్దరు రాజర్షులు. ఉభయులు జీవించిన కాలాలభేదాన్ని బట్టి కొన్ని భేదాలు కనబడ్డా వీరిద్దరు ఆధ్యాత్మిక జీవితాలే జీవించి తమ సమకాలంవారికి మార్గదర్శకులై నేటికి మన గౌరవమర్యాదలను పొందుతున్నారు. జనకమహర్షి జ్ఞానిగా పేరుపొందగా, కులశేఖరులు మహాభక్తులుగా, ఆళ్వారులుగా లబ్ధప్రతిష్ఠులయ్యారు. వీరిద్దరు పైకి లౌకిక జీవితాలు జీవించినట్లు కనబడినా. "పద్మపత్రమివాంభస" ఉపమానానికి ఉత్తమోదాహరణులై జీవించారు.

శ్రీమద్రామాయణం నిత్యపారాయణశ్రవణాదుల వల్ల కులశేఖరాళ్వారులకు శ్రీరామునియందు అనన్యభక్తి. శ్రీరాముడు దండకారణ్యంలో ఉండగా

పదునాల్గువేల రాక్షసులతో ఖరదూషణాదులు యుద్ధానికి వచ్చారని రామాయణంలో విని తీవ్రంగా చలించి ఏకాకి అయిన ఆ అవతారమూర్తికి సాయంచేయడం కోసం తమ సైన్యాన్ని ఆయత్తపరిచి యుద్ధానికి బయలుదేరినప్పుడు రాజ్యక్షేమం కోరిన మంత్రులు, ఆ మహారాజును శాంతింపజేయడానికి కొందరు వైష్ణవభాగవతోత్తములను ఆయనకు ఎదురుగా పంపి వారిద్వారా, శ్రీరాముడు రాక్షసులనందరిని దునిమి క్షేమంగా ఉన్నారని చెప్పించి, యుద్ధప్రస్థానాన్ని ఆపారు. ఇదే విధంగా సీతను రావణుడు అపహరించుకొని పోయినాడని విన్నప్పుడు రావణుని దండించడానికి సేనతో సముద్రముచొచ్చి లంకకు పోతూఉండగా శ్రీరాముడు సీతాలక్ష్మణులతో ఎదురువచ్చి, సీతను తాను క్షేమంగా తీసుకొని వచ్చినట్లు చెప్పి ఆ మహారాజునకు ఊరట కల్పించి లంకాప్రయాణం విరమింపజేసినట్లు ఐతిహ్యం ఒకటి ఉంది.

ఈ మహారాజు "సాయించిన" పెరుమాళ్‌తిరుమొళి భక్తికవితలకు తలమానికం. భక్తుల కొంగుబంగారం. అవతారాలలో రామావతారం అంటే అర్చామూర్తులలో వెంకటేశ్వరస్వామి అంటే ఈయనకు అపరిమితమైన భక్తి. శ్రీరంగనాథుడన్నా అంతే. తిరుమలలోని పూదోటలలోని బావులలో చేపనై పుట్టితే బాగుండును. ఆ భాగ్యం కోరుకొంటున్నాను అంటారు. "రంభాది అప్సరసులు పరివేష్టించి ఉండగా స్వర్గంలో ఉండడంకోరను. తేనెలొలికే పూవులున్న తిరుమలలోని తోటలలోని బావులలో ఒక చిన్న చేప కావడం నా కోరిక. నా భాగ్యం కావాలి" అంటారు.

"ఆనాద సెల్వత్త రంభై యర్‌గళ్ తరశూళ
వానాళుం శెల్వముంమణ్ణరశుం యాన్వేండేన్
తేనార్ పూం శోలై తిరువేంగడచ్చునైయిల్
మీనాయ్ పిరక్కుం విరియుడైయే నావేన్"

(పెరుమాళ్ తిరుమొళి IV-2)

ఈ మహారాజు భక్తిప్రపత్తులకు సంతోషించి శ్రీమన్నారాయణుడే అనుగ్రహంతో విష్వక్సేనులను పంపి ఈయనకు శ్రీవైష్ణవులకు అత్యంత ముఖ్యమైన పంచసంస్కారాలను (తాపః పుండ్రస్తథా నామమంత్రోయాగశ్చపంచమః) చేయించారు.

శ్రీ వేంకటేశ్వరస్వామి పట్ల ఆళ్వార్ల అనన్యభక్తికి తార్కాణంగా "పెరుమాళ్ తిరుమొళి"నుండి ఇంకొక్కటి గ్రహించవచ్చును. "వేంకటాద్రీశుని వాకిటి మెట్టు నయినా, నాకాయన దర్శనం (పగడపుమోవి) లభించి, ఆనందాతిశయంతో ఒడలు మరచిపోవుదును గదా!" అంటారు.

"శెడియాయ్‌వల్ వినైకళ్ తీర్‌క్కుం తిరుమాలే।
నెడియానే వేంగడవానిన్ కోయిల్‌వాశల్ ॥
అడియారుం వానవరు మరుందై యరుం కిడంది యంగుమ్।
పడియాయ్ కిడందున్ పవళవాయ్ కాణ్బేనే ॥"

ఈయన సాయించిన "పెరుమాళ్ తిరుమొళి" అనే దివ్యప్రబంధంలో చివరి మూడు దశకాలు రామకథకు సంబంధించినవి. మొదటిదశకంలో బాల రాముని లీలలు, రెండో దశకంలో హృదయవిదారకమైన దశరథవిలాపం, మూడోదానిలో సంగ్రహరామకథ ఉన్నాయి. "పరమయోగివిలాసము" వ్రాసిన తాళ్ళపాక తిరువేంగళనాథుడు ఇలా వ్రాశాడు:

"దశరథనందన! తాటకా జైత్ర!
దశరథకౌశికాధ్వర విఘ్నహరణ!
హరిచాపభంజన! యవనిజారమణ!
పరశురామాభంగ! పటుతపోహారి!
గురువాక్యపాలన! గుహవంద్య! మౌని
వరదాయి! దండకా వసభూమి విహార!
కుటజసన్నుత! మౌనికులనత! పంచ
వటవాస! రాక్షస దర్పహారి!
ఖరదూషణాది రాక్షసకంఠదళన!
శరభిన్నమారీచ! శబరీ ప్రసన్న!
వాలిశాత్రవ! మాల్యవద్గిరివాస!
పాలితసుగ్రీవ! పౌలస్త్యవరద!
కంధిబంధన! దశకంఠ సంహారి!

బంధుర నిర్జరపతి ముఖ్యప్రణుత!
భూమిజా సంయుత! పుష్పకారూఢ!
స్వామి! రాఘవ! భరద్వాజపూజార్హ!
సాకేతపురనాథ! జగదేకనాథ!
నాకులస్వామి! వైనాకులస్వామి!

ఈ మహాభక్తుని 'ముకుందమాల' భక్త జనకల్పకం. ఆయన ఎంత రామ భక్తుడే అంత కృష్ణదాసుడు. "నా ప్రాణ ప్రయాణసమయంలో నిన్ను నేను స్మరించలేకపోవచ్చును. ఇప్పుడే నీ పాదపంకజపంజరంలో నా మానసరాజహంస ప్రవేశించుగాక!" అంటారు.

"కృష్ణ! త్వదీయ పదపంకజపంజరాంత
మద్యైవ మేవిశతు మానసరాజహంసః।
ప్రాణప్రయాణసమయే కఫవాతపిత్తైః
కంఠావరోధన విధౌస్మరణంకుతస్తే॥"

భగవంతుని పాదారవిందపంజరంలో ఉన్న మానసరాజహంసను కఫవాత పిత్తాలు ఏమీ చేయలేవు. ఇందువల్ల పాదారవింద ధ్యానదర్శనాదులు ప్రాణ ప్రయాణసమయంలో కూడా నిలిచిఉంటాయి. సంబంధం పోదు కనుక ఇప్పుడే నీ పాదపంకజ పంజరంలో నా మానరాజహంస చేరుగాక! అంటారు.

భగవత్సేవకంటె భాగవతుల సేవవాంఛితార్థ ప్రదాయిని అని గ్రహించిన శ్రీ కులశేఖరులు నైచ్యాను సంధానంతో మధుకైటభారిని సంబోధిస్తూ ఇలా కోరుకున్నారు:

"మజ్జన్మనః ఫలమిదం మధుకైటభారే
మత్ప్రార్థనీయ మదను గ్రహ ఏషఏవ
త్వద్భృత్యభృత్య పరిచారక భృత్యభృత్య
భృత్యస్య భృత్య ఇతిమాం స్మర లోకనాథ!"

ఈ రామభక్తుడు శ్రీ రామచంద్రుని కళ్యాణ గుణ పరంపరను మననం

చేస్తూ కీర్తిస్తూ తమిళంలో "పెరుమాళ్ తిరుమొళి" అనే దివ్య ప్రబంధాన్ని గానం చేశారు. అదే విధంగా శ్రీకృష్ణదాసులై:

"జయతు జయతుదేవో దేవకీ నందనోఽయం
జయతు జయతు కృష్ణో వృష్ణివంశ ప్రదీపః।
జయతు జయతు మేఘశ్యామలః కోమలాంగో
జయతు జయతు పృథ్వీభారనాశో ముకుందః॥"

అని శ్రీకృష్ణుని ఉగ్గడించారు.

తమ "పెరుమాళ్ తిరుమొళి"లో శ్రీరాముని నిద్రపుచ్చడానికి కౌసల్య లాలిపాట పాడినట్లుగా "తాలాట్టు" అనే ప్రక్రియలో శ్రవణశుభగంగా రాగతాళ యుక్తంగా గీతాలు వ్రాశారు పెరియాళ్వారు తమ్ముతాము యశోద అనుకొని పాశురాలు గానం చేసినట్లుగానే, కులశేఖర పెరుమాళ్లు తమ్ముతాము కౌసల్యగా భావించుకొని పాశురాలు గానం చేశారు ఒక పాశురంలో "మా కులానికి దివ్యామృతం వంటి రాఘవా! నిద్రపో" అంటారు ఆయన:

"కణ్ణైఙులుమ్ తీర్త మలికణపురెత్తిన్ కరుమణియే
ఎఙ్గళ్ కులత్తిన్నముదే ఇరాగవనే! తాలేలో (పెరుమాళ్ తిరుమొళి)

శ్రీ కులశేఖరాళ్వారులు-ఇటు రామభక్తిని, అటు కృష్ణప్రేమను సమానంగా అనుభవించి, ఆత్మార్పణభావంతో జీవితం గడిపారు ఈ రెండు అవతారా విషయంలో వారికి భేదభావంలేదు. వారిది భేదంలేనిభక్తి. ఈ సందర్భంలో ఒక విశేషాన్ని చెప్పాలి. రామభక్తుడైన రామచరితమానసం వ్రాసిన గోస్వామి తులసీదాసునకు, కృష్ణ భక్తుడైన శ్రీకృష్ణకర్ణామృతం వ్రాసిన లీలాశుకునకు సంబంధించినది అది గోస్వామి తులసీదాసునకు భగవానుడు శ్రీకృష్ణరూపంలో దర్శనమిస్తే ఆయన ఇలా అన్నారు:

"కావరనవు ఛవి ఆజకీ భలే విరాజెపునాథ్।
తులసిమస్తక్ తబ్ నవై, ధనుషబాణ లేవుహాథ్॥

(నీ కృష్ణరూపం ఎంత మనోజ్ఞంగా ఉన్నా, నువ్వు ధనుర్బాణాలు ధరించి ప్రత్యక్షమైతేనే, ఈ తులసీదాసు శిరస్సు నీ పాదాల మీద వాలుతుంది).

శ్రీ లీలాశుకునకు భగవానుడు శ్రీరాముని రూపంలో దర్శనమిస్తే ఆయన ఇలా అంటారు:

"విహాయకోదండ శరౌ ముహూర్తమ్
గృహాణ పాణౌ మణిచారువేణుమ్।
మాయూరబర్హం చ నిజోత్తమాంగే
సీతాపతే! త్వాం ప్రణమామిపశ్చాత్॥"

(ఓ సీతాపతీ! నీ కోదండశరాలను కొంచెంసేపు విడిచిపెట్టి మణిచారు వేణువును పాణియందు (గ్రహించి) తలమీద నెమలిపింఛం ధరించు తరువాత నీకు ప్రణామం చేస్తాను).

శ్రీ తులసీదాసునకు ఇష్టదైవం శ్రీరాముడు గనుక, ఆయనకు శ్రీరామ దర్శనం కావాలి. లీలాశుకునకు ఇష్టదైవం శ్రీకృష్ణుడు గనుక ఈయనకు శ్రీకృష్ణ దర్శనం కావాలి, ఇద్దరూ ఒక్కరే అని తెలియని వారుకారు వీరు. కాని ఇష్టదైవం అంటే ఇంత ప్రీతి. ఆళ్వారులు రామకృష్ణాద్యవతారాలను సమానంగా అభిమానించి అనుభవించినా విశేషంగా రామగుణగానం చేసినవారు, అంతగా కృష్ణగుణగానం చేయనివారు; విశేషంగా కృష్ణగుణగానంచేసి రామగుణగానం అంతగా చెయనివారు ఉన్నారు మొత్తంమీద ఆళ్వారులలో చాలామంది శ్రీకృష్ణుని భువనమోహన రూపంచేత ఆకర్షితులైనారనీ భక్తిప్రచారోద్యమానికి శ్రీకృష్ణలీలాదులగానం ఆకర్షకమౌతుందని భావించారని కొందరు పెద్దలంటారు. శ్రీమన్నారాయణుడే పరతత్త్వం గనుక, అవతారాలన్నీ ఆయనవే గనుక వివిధభక్తుల అభిమానాభినివేశాలకు పారమార్థికంగా పెద్ద ప్రాముఖ్యం లేదంటారు అందరు.

పరమపవిత్రములైన మంత్రత్రయం–అష్టాక్షరి, ద్వయము, చరమశ్లోకము–ఆచార్యులు చెవిలో చెప్పగాపొంది, గురుపరంపరా పూర్వకంగా అనుసంధించుకోవాలి. "ఓం నమో నారాయణాయ" అనే అష్టాక్షరి–పరమాత్మ జీవాత్మల స్వరూపస్థితిని, ప్రవృత్తిని నిరూపిస్తుంది. ఓం పదం జీవాత్మ. పురుషకారమైన లక్ష్మితో కూడిన పరమాత్మను; నమః పదం సేవను; నారాయణాయ అనే పదం జీవాత్మకు, పరమాత్మ అయిన నారాయణుడు తప్ప వేరే స్వజనం లేదనే విషయాన్ని తెలుపుతాయి. ఇది తారకమంత్రం. భగవంతుని తత్త్వాన్ని, ఆయన

సర్వవ్యాపకత్వాన్ని తెలియజేసే ముఖ్యమైన మూడు వైష్ణవమంత్రాలలో 1. విష్ణు షడక్షరి–ఓం నమోవిష్ణవే 2. వాసుదేవ ద్వాదశాక్షరి–ఓం నమోభగవతేవాసు దేవాయ, 3. నారాయణాష్టాక్షరి–ఓం నమో నారాయణాయ– అష్టాక్షరి విశిష్టమైనది విష్ణువాసు దేవశబ్దాలు భగవంతుని వ్యాపకత్వాన్ని తెలియజేసినా, నారాయణ శబ్దం ఆయన ఏ ఏ విధాలుగా ఏ ఏ పదార్థాలలో వ్యాపించి ఉంటాడో తెలుపు తుంది. ఇది తిరుమంత్రం, మూలమంత్రం, అతిరహస్యం. చెవిలో చెప్పాలి. జపించుకోవడం మెల్లిగా చెయ్యాలి. శౌచం అతిముఖ్యం. ఇంక ద్వయ మంత్రం "శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే। శ్రీమతే నారాయణాయ నమః॥ దీని పూర్వార్థంలో ఉపాయ ప్రతిపాదన, ఉత్తరార్థంలో ఉపేయ ప్రతిపాదన ఉన్నందువల్ల ఇది ద్వయ మంత్రం అయింది. "శ్రీ" మధ్యవర్తిని (పురుషకారం) ఉండగా నారయణుని చరణాలే ఉపాయంగా స్వీకరిస్తున్నాను. నేను నిర్వర్తించే సర్వవ్యాపారాలు అపరాత్పరుడైన శ్రీమన్నారాయణుని కోసమే గాని (కైంకర్యం కోసమే గాని) నాకు చెందేవికావు. ఇది సర్వ పరిస్థితులలో సర్వావేళల అను సంధించుకోవచ్చు ననే స్వేచ్ఛ ఉన్నది. దీనికి–ఇతరుల చెవిని పడరాదనే నియ మమున్నదని పెద్దల మాట. ఇది శ్రీమద్రామాయణసారమే అంటారు. దీనికి మంత్రరత్నం అనికూడా పేరుఉంది. ఇంక రహస్యత్రయంలోని మూడోది చరమ శ్లోకం.

"సర్వధర్మాన్ పరిత్యజ్యమామేకం శరణం వ్రజ।
అహంత్వా సర్వపాపేభ్యోమోక్షయిష్యామి మాశుచః॥"

శ్రీమద్భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ అర్జునునకు మోక్షసన్న్యాసయోగాధ్యా యంలో (18వ అధ్యాయం–66వ శ్లోకం) ఉపదేశించినది.

సర్వధర్మాలను పరిత్యజించి నన్నే శరణుపొందు నేను నిన్ను సర్వ పాపాలనుండి విముక్తుణ్ణి చేస్తాను. శోకించకు– అనే పరమేశ్వరుని వాగ్రూప మైనది. నువ్వు దీన్ని ఇలా అనుష్ఠిస్తే, ఇది దీని ఫలం–అని చెప్పేది ఇది. ముక్త్యు పాయాలలో చివరిదిగా ఇది ఉపదిష్టమైనది ఇది చరమోపాయం గనుక చరమ మంత్రం అయింది.

ఈ శ్లోకంలో శ్రీకృష్ణ పరమాత్మయే "నరునకు" శరణాగతి అవశ్యకాన్ని

తత్త్వాలన్నీ బోధించి ఉండడంవల్ల ప్రపత్తి వథగాములకు భగవదనుగ్రహం ఎంత సులభసాధ్యమో బోధపడుతుంది. భక్తి మార్గంలో ఉన్న సాధనకూడా ప్రపత్తి వథంలో అనావశ్యకమైపోతోంది "నీవే తప్ప నితః పరం బెఱుగమన్నింవ దగున్ దీనునిన్" అని ఆత్మార్పణం చేస్తే, అన్నీ ఆయనే చూచుకొంటాడు అనే శరణాగతి దృఢమైఉండాలి. రహస్యత్రయంవల్ల శ్రీమన్నారాయణుడే పరతత్త్వమనీ అవతారాలలో రామకృష్ణావతారాలకు ఒక ప్రత్యేకత ఉందని తెలుస్తోంది.

రామభక్తిని, కృష్ణప్రేమను సమానంగా అనుభవించిన కులశేఖరాళ్వారులు పెరుమాళ్ తిరుమొళిలో రెండు అవతారాల లీలాదికాన్ని వర్ణించినా తనివితీరక సంస్కృతంలో ముకుందమాల వ్రాశారని తెలుసుకొన్నాము. దీనిలో కృష్ణ సంబోధనాత్మకంగా చాలా శ్లోకాలు కనబడినా ఆయన మనస్సులో మెలగుతూ ఉన్నవాడు పరతత్త్వమైన శ్రీమన్నారాయణుడే. పురుషకారస్వరూపిణి అయిన "శ్రీ"తో కూడిన నారాయణునే ఆయన కీర్తించినది. కావ్యారంభమే "శ్రీవల్లభేతి" అని చేశారు. ఈ 40 శ్లోకాల స్తుతికావ్యంలో సంస్కృత విభక్తులన్నీ వచ్చేలా ఒకశ్లోకం కృష్ణస్తుతిపరంగా వ్రాసి తరువాతి కాలంలో ప్రసిద్ధికివచ్చిన-ముఖ్యంగా తెలుగులో-ఉదాహరణ వాఙ్మయానికి శ్రీకారం చుట్టారు ప్రథమావిభక్తి మొదలు సప్తమీవిభక్తి వరకు-సంబోధన ప్రథమావిభక్తితో బాటు-సర్వవిభక్తులు కృష్ణ శబ్దానికి దీనిలో వచ్చాయి. విభక్తులు సంబంధాన్ని తెలియజేస్తాయి గనుక, ఈ శ్లోకం ద్వారా-కులశేఖరులు మనకు - శ్రీకృష్ణునితో సర్వవిధాల సంబంధం వాంఛనీయం అని తెలియజేయదలచినారన్న మాట!

"కృష్ణోరక్షతు నో జగత్త్రయ గురుః కృష్ణం నమస్యామ్యహమ్
కృష్ణే నామరశత్రవో వినిహతాః కృష్ణాయతస్మై నమః।
కృష్ణాదేవ నముత్థితం జగదిదం, కృష్ణస్య దాసోఽస్మ్యహం
కృష్ణేతిష్ఠతి సర్వమేత దఖిలం హే కృష్ణ! రక్షస్వ మామ్॥"

(ముకుందమాల శ్లోకం-33)

కృష్ణః=కృష్ణుడు ప్రథమ) కృష్ణః రక్షతు నః జగత్త్రయగురుః
(ముల్లోకాలకు గురువు(తండ్రి) అయిన కృష్ణుడు మనల్ని రక్షించు గాక!)

కృష్ణమ్=కృష్ణుని (ద్వితీయ) కృష్ణమ్ నమస్యామి అహమ్।
(కృష్ణుని (నకు) నేను నమస్కరిస్తున్నాను)

కృష్ణేన=కృష్ణునిచేత (తృతీయ) కృష్ణేన అమరశత్రవో వినిహతాః।

(కృష్ణునిచేత అమరుల శత్రువులు చంపబడ్డారు)

కృష్ణాయ=కృష్ణునికొఱకు (చతుర్థి) కృష్ణాయ తస్మైనమః।
(కృష్ణునికొఱకు (నకు) నమస్కారం)

కృష్ణాత్=కృష్ణునివలన (పంచమి) కృష్ణాత్ ఏవ సముద్భితం జగత్ ఇదం।

(కృష్ణుని వల్లనే ఈ జగత్తంతా బయలువెడలుతోంది)

కృష్ణస్య=కృష్ణునియొక్క (షష్ఠి) కృష్ణస్య దాసోస్మ్యహమ్।
(నేను కృష్ణుని (యొక్క) దాసుణ్ణి)

కృష్ణే=కృష్ణునియందు (సప్తమి) కృష్ణేతిష్ఠతి సర్వమేత దఖిలమ్)।

(కృష్ణునియందే (మీదే) ఆధారపడి ఈ సమస్త జగత్తు నిలిచిఉంది)

హే కృష్ణ! ఓ కృష్ణా (సంబోధన ప్రథమ) హేకృష్ణ। రక్షస్వ మామ్।

(ఓ కృష్ణా! నన్ను రక్షించు)

ముకుందమాల చివరిశ్లోకం (40)లో కులశేఖరాళ్వారులు తమకు "ద్విజన్మ వరుడు" "పద్మశరుడు" అనే ఇద్దరు మిత్రులున్నట్లు తెలియజేశారు:

"యస్యప్రియౌ శ్రుతిధరౌ కవిలోకవీరౌ
మిత్రౌ ద్విజన్మవర పద్మశరావభూతామ్।
తేనాంబుజాక్ష చరణాంబుజషట్పదేన
రాజ్ఞాకృతా కృతిరియం కులశేఖరేణ॥"

(తాత్పర్యం- వేదవిద్యా ప్రతిష్ఠాపకులు, కవిలోకవీరులు అయిన ద్విజన్మవరుడు,
18)

పద్మశరుడు అనేవారు మిత్రులుగా ఉన్న, అంబుజాక్ష చరణాంబుజ షట్పదమైన కులశేఖర మహారాజు ఈ కృతిని రచించాడు.)

ఎవరీ ఇద్దరు మిత్రులు? అని పండిత పరిశోధకులు ఆలోచనలో పడ్డారు. ఆ మిత్రులకు వాడిన విశేషణాలను పరిశీలించారు. ఇద్దరూ శ్రుతిధరులు. అంటే వేదవిదులు. ఒకరు "ద్విజన్మవరుడు" కిరాతునిగా జన్మించి వల్మీకంనుండి మహాకవిగా ద్వితీయ జన్మపొందిన వాల్మీకి-ఈ "ద్విజన్మవరుడు" అనవచ్చును. వేదం సాక్షాత్తు రామాయణంగా అవతరించిందని ఉండడంచేత ("వేదః ప్రాచేతసా దాసీత్సాక్షాద్రామాయణాత్మనా") వాల్మీకి శ్రుతిధరుడే! ఇంక-పద్మశరుడున్నాడు. ఎవరీయన? సంప్రదాయజ్ఞులయిన పెద్దలు ఈయన "నమ్మాళ్వారులు" అన్నారు. నమ్మాళ్వారులకు "మారన్" అనే పేరు ప్రసిద్ధంగా ఉంది. దీన్ని సంస్కృత శబ్దంగా గ్రహిస్తే "మారుడు = మన్మథుడు"గా తెలుస్తుంది. కులశేఖరులు ప్రయోగించిన శబ్దం-పద్మశరుడు! పుష్పబాణుడైన మారుడు పద్మశరుడే!

నమ్మాళ్వారులు "పాడించిన" - "తిరువిరుత్తమ్" "తిరువాశిరియమ్" "పెరియతిరువందాది", "తిరువాయిమొళి" అనే దివ్యప్రబంధాలు వరుసగా-ఋగ్వేద, యజుర్వేద, అథర్వణవేద, సామవేదసారాలని శ్రీవైష్ణవ విద్వాంసులందరు అంగీకరించారు. దివ్యప్రబంధాలు ద్రావిడవేదాలు గదా! కనుక, నమ్మాళ్వారులను శ్రుతిధరులే! (ముకుందమాల (సంస్కృతమూలము) తెలుగువ్యాఖ్యానము (పుట-8) వ్యాకరణ విద్యాప్రవీణ-భాషాప్రవీణ ఉభయవేదాంతశిరోమణి శ్రీమాన్ శ్రీ భాష్యం అప్పలాచార్యులు, ఎం, ఏ. శ్రీ రామానుజకీర్తి కౌముది-5వ భాగం-1984).

శ్రీమన్నారాయణులు - శ్రీకులశేఖరాళ్వారుల భక్తిప్రపత్తులకు, సంతుష్టులై శ్రీ విష్వక్సేనులచేత పంచ సంస్కారాలు చేయించినట్లు అంటారు. ఈయన సంస్కృతంలో 'ముకుందమాల'నే కాక "సుభద్రా పరిణయము, తపతీ సంవరణము" అను రెండు రూపకాలు కూడా వ్రాసినట్లు పరిశోధకులు అంటారు.

శ్రీ కులశేఖరాళ్వారులకు వాల్మీకి రామాయణమన్నా, శ్రీ నమ్మాళ్వారుల దివ్యప్రబంధాలన్నా-ముఖ్యంగా "తిరువాయిమొళి" అన్నా- విశేషగౌరవిమానాలు"

సంస్కృతంలో కమనీయమైన భక్తికావ్యం "ముకుందమాల"ను, తమిళంలో "నాలాయిర దివ్యప్రబంధంలో"చేరిన "పెరుమాళ్ తిరుమొళి"గానం చేసిన పెరుమాళ్ బిరుదాంకితులైన శ్రీకులశేఖరాళ్వారులు శ్రీమద్రామాయణాన్ని వ్రాసిన వాల్మీకిని నాలాయిరదివ్యప్రబంధంలో చేరిన చతుర్వేదతుల్యాలైన "తిరువాయిమొళి" మొదలైన నాలుగుదివ్య ప్రబంధాలను "సాయించిన" ప్రపన్నజనకూటస్థులైన నమ్మాళ్వారులను, మిత్రులయిన కవిలోకవీరులుగా పేర్కొనడం సహజము, సముచితము! ఈ మహాభక్తులు కొంతకాలం రాజ్యంచేసి పరమవిరాగులై వివిధ తీర్థయాత్రలు చేసి శ్రీరంగంచేరి రంగనాథుని అర్చిస్తూ అక్కడ కొంతకాలం ఉండి నమ్మాళ్వారులు అవతరించిన తిరునగరికి వెళ్ళి దాని దగ్గరనే ఉన్న బ్రహ్మదేశపురమనే దివ్యక్షేత్రంలో పరమపదించినట్లు తెలుస్తోంది. ఈ మహారాజభక్తుని పుత్రిక నీలాదేవి నీలాంశజ అపరగోదాదేవి అయి శ్రీ రంగనాథునే భర్తగా భావించుకొని శ్రీరంగంలోనే స్వామిని చేరినట్లును తెలుస్తోంది.

ఆళ్వారులు మహాభక్తులేకాక, మహాకవులు మహాగాయకులు కూడా. అందరు విష్ణువే పరతత్త్వమని విశ్వసించి ఆయన గుణకీర్తన చేసినవారు. శ్రీమన్నారాయణుని కళ్యాణ గుణాలను గానంచెయ్యడంలో భక్తివైభవాన్ని ప్రచారం చెయ్యడంలో నిరంతరం శ్రమించిన భక్తవీరులు ఆళ్వారులు. వీరిలో అనేకులు వివిధ ప్రాంతాలలో ఉన్న 108దివ్యదేశాలను సందర్శించి, అయా అర్చామూర్తుల ప్రాభవాలను పండితులు, పామరులు అనే భేదం లేకుండా అనుభవించడానికి వీలుగా ప్రజలభాషలో, ఉదాత్తగంభీరరీతులలో గానం చేసిన మహానుభావులు. భారతీయతాత్త్విక సిద్ధాంతాలను వివిధమార్గాలను ఆకళింపునకు తెచ్చుకొన్నవారైనా "భక్తిమార్గం" సర్వోత్తమమైనదని గ్రహించి ఆ మార్గంలో నడిచినవారు "భక్తి రేవైనం గమయతి । భక్తి రేవైనం దర్శయతి । భక్తివశః పురుషః" అన్న సత్యాన్ని తాము గ్రహించి ప్రచారం చేశారు సిద్ధపురుషులైనా మహామహిమోపేతులైనా సామాన్యులవలె ప్రవర్తించారు. తమకుల గోత్రాదులలో లౌకిక జీవితాలలో ఉన్న హెచ్చుతగ్గులను ఎప్పుడూ తమ పాశురాలలోగాని, నిత్యజీవిత విధానంలోగాని తీసుకొని వచ్చి తరతమభావాలను గుర్తించలేదు. నిర్హేతుకప్రపత్తి మార్గంలో నడిచి ఇతర ప్రాంతాలవారికి మార్గదర్శకులయ్యారు మహారాజైన కులశేఖరాళ్వారులు "భక్తులపాదధూళి నా శిరస్సున ఎప్పుడు ధరింతునో" అని తహతహలాడారు. తమ అభిజాత్యాన్నిగాని, పాండిత్యాన్నిగాని ఆయన గణనకు

తేలేదు. ఆళ్వారులలో అన్ని కులాలవారు, నిరుపేదలుకూడా ఉన్నారు పెరియాళ్వార్లు తొండరడిప్పొడి ఆళ్వార్లు భక్తులలో కులవివక్ష లేదన్నారు.

ఆళ్వారులలో కొంతమందికి ఆనాటి సామాజిక పరిస్థితిననుసరించి వేదాధ్యయనాధికం లేకపోయినా. గురువుద్వారా విద్యాభ్యాసం లేకపోయినా, శ్రీమన్నారాయణుని అనుగ్రహంవల్ల విద్యలన్నీ కరతలామలకాలయినట్లుగా వారు పాయించిన దివ్య ప్రబంధాలలో కనబడే ఆధ్యాత్మిక విషయాలు, గహనమైన తాత్త్విక విషయాలు తెలియజేస్తాయి. వేదోపనిషత్తుల పురాణశాస్త్రాదుల విజ్ఞానం వారి పాశురాలలో కనబడుతుంది. భక్తికి-దానిని మించిన ప్రపత్తికి తమ రచనలలో ప్రధాన స్థానం ఇచ్చినంతమాత్రాన వారికి సనాతన ధర్మవిషయాలు తెలియవని భావించరాదు. ఆళ్వారులయుగం తరువాత వచ్చిన ఆచార్యయుగంలోని ఆచార్యులందరూ-శ్రీనాథ మునులు, శ్రీయామునులు, భగవద్రామానుజులు, శ్రీవేదాంత దేశికులు మొదలైన వారందరు-ఆళ్వారులను "నెత్తిమీద పెట్టుకొని"పూజించినవారే. ఆళ్వారుల వేదవిజ్ఞానానికి ఉదాహరణంగా శ్రీ తిరుమళిశై ఆళ్వారుల జీవితంలో జరిగిన ఒక ఘట్టాన్ని గ్రహించవచ్చును.

ఈ మహాభక్తులు పెరుంబులియూరు అనే గ్రామంలో దేవాలయానికి ప్రదక్షిణం చేస్తూఉంటే, ఆ ప్రాంగణంలో వేదాధ్యయనం చేస్తున్న కొందరు వైదికులు-ఆయనకు ద్విజసంస్కారం లేదని తెలిసిన వారు—వేదాధ్యయనం మానివేశారట. ఆళ్వారులు ప్రాంగణందాటి వెళ్ళిపోయినతరువాత మళ్ళీ వేదాధ్యయనం ప్రారంభించాలని ప్రయత్నిస్తే తాము అధ్యయనంలో విడిచినచోటు జ్ఞాపకం రాక వేదోచ్చారణే కుదరక తికమకపడ్డారు. ఇంతలో ఆళ్వారులు దేవాలయంలో అర్చకులు చేస్తున్న యాగానికి వచ్చి వారివల్ల అగ్రపూజపొందారు. ఆళ్వారుల గొప్పదనం యజమానికి తెలుసుకనుక అలాపూజించాడు. అక్కడ ఉన్న వేదవిద్వాంసులు, ఇతరులు దీనికి ఆశ్చర్యపడి యజమానిని దూషింపగా, ఆ ఆలయంలో అర్చామూర్తి శంఖచక్రాలతో ఆ ఆళ్వారుల తలపై సాక్షాత్కరించి ఆయన విశిష్టతను తెలిపారు. ఇదంతా చూస్తున్న మొదటి వేదాధ్యయన పరులు ఆళ్వారులను క్షమింపవేడి తమ పశ్చాత్తాపాన్ని తెలిపారు. వెంటనే తిరుమళిశై ఆళ్వారులు చిరునవ్వుతో అక్కడ పడిఉన్న ఒక నల్లని వడ్లగింజను తీసుకొని దానిని గోటితో చీల్చి చూపించారు. వెంటనే అధ్యయనపరులు దాని భావాన్ని గ్రహించి తాము అధ్యయనంలో విడిచిన స్థలం "కృష్ణానాం వ్రీహీణాం నఖనిర్భిన్నమ్" అనేచోటు

అని జ్ఞాపకం తెచ్చుకొని తమ అధ్యయనం కొనసాగించారుట! ఆళ్వారులు వారితో తనకు వేదవేదాంగాదులన్నీ తెలిసినా, ద్విజసంస్కారం లేకపోవడంవల్ల నోటితో చెప్పక, చేసి చూపించాను అన్నారుట! ఆళ్వారుల విషయంలో ఇలాంటి కథ లెన్నో ఉన్నాయి. మునివాహనులైన తిరుప్పాణాళ్వారుల కథ మనకు తెలిసినదే! ఇవి ఆనాటి సామాజిక పరిస్థితులను, వాటికి ఆళ్వారులు ఎంతటి అతీతులో-రెండింటిని తెలియజేస్తాయి. అలాంటి కాలంలోనే, అగ్రవర్ణానికి చెందిన ఆచార్య పురుషులందరు ఆళ్వారుల పాదపద్మాలకు నమస్కరిస్తూ రచనలు చేశారంటే, భక్తి ప్రవర్తుల వైశిష్ట్యం వెల్లడవుతుంది.

పన్నిద్దరాళ్వారులు పాడిన పాశురాలు ప్రజాబాహుళ్యంలో ప్రచారంలో ఉండగా వాటిని విషయాన్ని అనుసరించి ఔచిత్యపురస్కృతంగా పౌర్వాపర్యాలు కల్పించి ప్రాచీనులు "నాలాయిర దివ్యప్రబంధం" (నాలుగువేల ద్రావిడపాశురాలున్న గ్రంథం) సంకలనం చేశారు. ఈ మహాకార్యాన్ని నిర్వహించిన ఘనత ఆచార్యపురుషులైన నాథమునులకు చెందుతుందని చాలామంది విశ్వాసం. కాని "శాదనుక్కు నాలాయిర మరుశినాన్" అనే బిరుదు నమ్మాళ్వారులకు ఉండడాన్ని బట్టి, శ్రీనాథమునులకు పూర్వమే ఈ నామం వ్యవహారంలో ఉందని అంటారు. కాని బహుళప్రచారంలో ఉన్నా-ఒక పద్ధతిలో విభజనాదికం లేక, కొంతభాగం నష్టమై సులభంగా లభించక, ఈ దివ్యసూరుల పాశురాలు ఉండగా, వాటిని ఒక చోటచేర్చి, దేశాటనం చేసి కొన్ని పాశురాలను వెలుగులోనికి తెచ్చి ఒక నిర్దిష్ట విధానంలో గానాదికాన్ని నిర్ణయించిన మహాచార్యులు శ్రీనాథమునులు. ఈ ఆళ్వారులపేర్లు, వారి ప్రబంధాలపేర్లు, వాటి సంఖ్యలను గుర్తిద్దాము.

| ఆళ్వారు పేరు | ప్రబంధం పేరు | పాశురసంఖ్య |
|---|---|---|
| 1. శ్రీ పొయ్‌గై ఆళ్వారులు (కాసారయోగులు, సరోయోగులు అనికూడా పేర్లున్నాయి) పాంచజన్యాంశ | 1. ముదల్ తిరువందాది | 100 |
| 2. శ్రీ భూదత్తాళ్వారులు (భూతయోగులు) గదాంశ | 2. ఇరండాం తిరువందాది | 100 |

| ఆళ్వారు పేరు | ప్రబంధం పేరు | పాశురసంఖ్య |
|---|---|---|
| 3. శ్రీ పేయాళ్వారులు<br>(మహాయోగులు)<br>నందకాంశ | 3. మూన్రాం తిరువందాది | 100 |
| 4. శ్రీ తిరుమళిశై ఆళ్వారులు<br>(భక్తిసారులు)<br>సుదర్శనాంశ | 4. నాన్ముగన్ తిరువందాది<br>5. తిరుచ్ఛంద విరుత్తం | 96<br>120 |
| 5. శ్రీ పెరియాళ్వారులు<br>(భట్టనాథులు, విష్ణుచిత్తులు)<br>గరుడాంశ | 6. తిరుపల్లాండు<br>7. పెరియాళ్వారు తిరుమొళి | 12<br>461 |
| 6 శ్రీ కులశేఖర ఆళ్వారులు<br>(కులశేఖర పెరుమాళ్)<br>కౌస్తుభాంశ<br>సంస్కృతంలో "ముకుందమాల" | 8. పెరుమాళ్ తిరుమొళి | 105 |
| 7. శ్రీ తిరుప్పాణాళ్వారులు<br>(ముని (యోగి) వాహనులు)<br>శ్రీ వత్సాంశ | 9. అమలనాది పిరాన్ | 10 |
| 8. శ్రీ తొండరడిప్పొడి ఆళ్వారులు<br>(భక్తాంఘ్రిరేణువు-విప్ర నారాయణులు)<br>వైజయంత్యంశ | 10. తిరుపళ్ళి యెళుచ్చి<br>11. తిరుమాలై | 10<br>45 |
| 9. శ్రీ తిరుమంగై ఆళ్వారులు<br>(పరకాలయోగులు)<br>శార్ఙ్గాంశ | 12. పెరియతిరుమొళి<br>13. తిరుక్కుఱుం దాండకమ్<br>14 తిరునెడుం దాండకమ్<br>15. తిరువెళుక్కూత్తిరుక్కై<br>16. శిరియ తిరుమడల్<br>17. పెరియ తిరుమడల్ | 1084<br>20<br>30<br>1<br>77½<br>148½ |

| ఆళ్వారు పేరు | ప్రబంధం పేరు | పాశురసంఖ్య |
|---|---|---|
| 10. శ్రీ నమ్మాళ్వారులు | 18. తిరువిరుత్తమ్ (ఋగ్వేద సారం) | 100 |
| (కొన్ని పేర్లు–కారిమారులు, | 19. తిరువాశిరియమ్ (యజుర్వేద సారం) | 7 |
| మారన్, శఠకోపులు, పరాం | | |
| కుశులు, వేదం తమిళ్ శెయ్ద | 20. పెరియతిరువందాది (అధర్వణవేదసారం) | 87 |
| మారన్ పెరుమాళ్లు, ఉదయ | 21. తిరువాయిమొళి (సామవేదసారం–ఛాందోగ్యోపనిష ద్వివరణ) | 1102 |
| భాస్కరులు, వకుళభూషణులు, | | |
| తెన్నరంగంపొన్నడి, తిరు | | |
| వరంగన్‌పొన్నడి, ప్రపన్న | | |
| జనకూటస్థులు) | | |
| 11. శ్రీ మధురకవి ఆళ్వారులు (విష్వక్సేనుని గణాలలోని కుముదుని అంశ) | 22. కణ్ణినుణ్ శిరుత్తాంబు (ముడులున్న సన్నని చిన్న కన్నెతాడు) | 11 |
| 12. శ్రీ ఆండాళ్లు | 23. తిరుప్పావై | 30 |
| (శ్రీ గోదాదేవి, ఆముక్తమాల్యద. | 24. నాచ్చియార్ తిరుమొళి | 143 |
| చూడికొడుత్త నాచ్చియార్) | | |
| | "నాలాయిరమ్" | 4,000 |

ఈ లెక్క ప్రకారం నాలాయిర దివ్యప్రబంధంలోని అవాంతర ప్రబంధాల సంఖ్య 24. ఇది ఇలా ఉండగా, భగవద్రామానుజుల ప్రశిష్యులు, కూరత్తాళ్వారుల శిష్యులు అయిన 'తిరువరంగత్తముదనార్' రచించిన 'రామానుజ నూత్తందాది' అనే ప్రబంధం (108 పాశురాలు) ఒకటిఉంది. దీన్నికూడా నాలాయిర దివ్య ప్రబంధంతో కలిపి-కలిపినా అవాంతర ప్రబంధాల సంఖ్య 24 నకు మించకుండా ఉండడానికి–వడగలై వారు పెరియాళ్వారుల 'తిరుప్పల్లాండు'ను 'పెరియాళ్వారు తిరుమొళి'తో చేర్చి – రెండింటిని ఒకటిగా భావించి – లెక్క సరిపెట్టుతున్నారు. శ్రీవైష్ణవశాఖలోని తెంగలై వారు అలా చేర్చడంలేదు. శ్రీ నాథమునులనాటికే

"నాలాయిర" ప్రసిద్ధి ఈ పాశురసంపత్తికి వచ్చిఉండగా, శ్రీనాథమునుల తరువాతి కాలంలోవిచ్చిన 'రామానుజ నూత్తందాది'ని "నాలాయిరం"తో కలపడం న్యాయం కాదని వీరి వాదన. ఇదేవిధంగా పాశురసంఖ్య విషయంలో అభిప్రాయ భేదా లున్నాయి. ఏ "ఆయిరం"లో ఏ అవాంతర ప్రబంధాలుఉన్నాయి అనే విషయం లోను అభిప్రాయ భేదాలున్నాయి. కొన్నింటిలో పాశుర సంఖ్య వెయ్యికి తక్కువ ఉండగా, కొన్ని భాగాలలో వెయ్యికంటె ఎక్కువ పాశురాలు ఉన్నాయి. ఏది ఏమైనా మొత్తంమీద 4000 పాశురాలు ఉన్నాయిగదా అని తృప్తి పడేవారు కొందరు, కొన్ని తక్కువఅయితేమాత్రం ఏమిటి? పాశురాల మాధుర్యం, పవిత్రత తగ్గుతాయా? అని అడిగేవారు కొందరున్నారు. సంఖ్య విషయంలో అవాంతర ప్రబంధాల ముందు వెనుకల విషయంలో తేడాలున్నా ఈ దివ్యప్రబంధాల గొప్ప దనం ఇసుమంతైనాతగ్గదు-వీటికున్న వ్యాఖ్యానాలలో "పెరియవాచ్చాంబిళ్లై"గారు వ్రాసిన వ్యాఖ్య ప్రసిద్ధమై, వడగలై-తెంగలై సంప్రదాయాల వారిరువురి ఆద రాన్ని పొందింది. ఆధునికులలో-తెంగలై సంప్రదాయానికి చెందిన శ్రీమాన్ ప్రతి వాది భయంకరం అణ్ణంగరాచార్యులవారు, వడగలై సంప్రదాయానికి చెందిన ఉత్తమూరు వీరరాఘవాచార్యులవారు వ్రాసిన వ్యాఖ్యానాలు ప్రసిద్ధంగాఉన్నాయి. ఈ వ్యాఖ్యానాలు మణిప్రవాళ శైలిలోనే ఉన్నాయి. ఈనాలాయిర దివ్య ప్రబంధం లోని కొన్ని ప్రబంధాలకుమాత్రమే వ్యాఖ్యలు వ్రాసినవారున్నారు. నమ్మాళ్వారుల "తిరువాయిమొళి"కి ఉన్న ప్రాముఖ్యాన్నిబట్టి దానికి మాత్రమే వ్యాఖ్యలు కొన్ని బయలుదేరాయి.

ఆళ్వారుల దివ్యప్రబంధం మొత్తం పాశురాలు నాలుగువేలు కావడంవల్ల "నాలాయిర దివ్యప్రబంధం"అని పేరువచ్చింది. శ్రీనాథ మునులకు పూర్వమే దీనికి ఈ పేరు ఉండి ఉండవచ్చుననుకొన్నా, నిర్ణీతమైన పద్ధతిలో, ఆళ్వారుల జీవితకాలం ముందు వెనుకలతో సంబంధంలేకుండా, ఒక ఆళ్వారుల పాశురాలన్నీ ఒకేచోట ఉండాలనే నియమంలేకుండా - ఉదాహరణకు: తిరుమళి శైయాళ్వారుల తిరుచ్చంద విరుత్తమ్ "మొదటివేయి"లో రాగా, ఆయనదే-"నాన్ముగన్ తిరువం దాది-"నాల్గోవేయి"లో వస్తుంది-వీటిని శ్రీనాథమునులు ఇలా వింగడించారు.*

---

* భార్గవ పురాణము-ఉత్తరఖండము-రాఘవ పామానాయకుడు.
పీఠిక-శ్రీమాన్ తిరుమల రామచంద్ర (పుటలు-48,49-అనుసరించి తయారు చేసినది.)

## మొదటి వేయి

1 శ్రీ పెరియాళ్వారులు-తిరుపల్లాండు (12 పాశురాలు) - పెరియాళ్వారు తిరు మొళి (461)

2 శ్రీ ఆండాళ్లు-తిరుప్పావై (30)-నాచ్చియార్ తిరుమొళి (143)

3 శ్రీ కులశేఖరాళ్వారులు-పెరుమాళ్ తిరుమొళి (105)

4 శ్రీ తిరుమళిశై యాళ్వారులు-తిరుచ్చంద విరుత్తమ్ (120)

5 శ్రీ తొండరడిప్పొడియాళ్వారులు-తిరుమాలై(45)-తిరుప్పళ్ళియెళుచ్చి (10)

6 శ్రీ తిరుప్పాణాళ్వారులు-అమలనాదిపిరాన్ (10)

7 శ్రీ మధురకవి యాళ్వారులు-కణ్ణినుణ్ శిరుత్తాంబు (11)

మొత్తం పాశురాలు-947

## రెండవ వేయి

8 శ్రీ తిరు మంగై యాళ్వారులు - పెరియ తిరుమొళి (1084)
,, ,, ,, తిరుక్కుఱుందాండకమ్ (20)
,, ,, ,, - తిరునెడుందాండకమ్ (30)

మొ॥ పాశురాలు-1134

## మూడవ వేయి

9 శ్రీ నమ్మాళ్వారులు - తిరువాయి మొళి (1102)

మొ॥ పాశురాలు 1102

## నాల్గవ వేయి

10 శ్రీ పొయ్‌గై యాళ్వారులు - ముదల్ తిరువందాది (100)
11 శ్రీ పూదత్తాళ్వారులు - ఇరండాం తిరువందాది (100)
12 శ్రీ పేయాళ్వారులు - మూన్ఱాంతిరువందాది (100)
శ్రీ తిరుమళిశైయాళ్వారులు - నాన్ముగన్ తిరువందాది (96)

శ్రీ నమ్మాళ్వారులు - తిరువిరుత్తమ్ (100)
,, ,, - తిరువాశిరియమ్ (7)
,, ,, - పెరియతిరువందాది (87)
శ్రీ తిరుమంగైయాళ్వారులు - తిరువెళుక్కూత్తిరుక్కై (1)
,, ,, - శిరియ తిరు మడల్ (77½)
,, ,, - పెరియ తిరు మడల్ (148½)
మొ॥ పాశురాలు-817

మొదటి విభాగంలో వేయి లేవు. నాల్గవ విభాగంలో వేయి లేవు. రెండు, మూడు విభాగాలలో వేయికంటె ఎక్కువగా ఉన్నాయి.

మొత్తం మాత్రం-4,000 పాశురాలు.

సాధారణంగా ఇలాంటి విషయాలలో అభిప్రాయభేదాలు ఉండడంసహజం. ఇక్కడాఉన్నాయి. అయితే, ఆళ్వారులు "సాయించిన" పాశురాలన్నీ దివ్యమైనవే గనుక-ఏవి ఏవేయిలో చేరాలి, ఏవి కొత్తగాచేరాలి మొదలైన ఒకటి రెండు విషయాలలో తప్ప మిగిలిన విషయాలలో ఏకవాక్యతఉంది. మచ్చునకు ఒకటి, రెండు చూపిస్తున్నాను. వైయాకరణ పంచానన - విద్వత్కవి సార్వభౌమ, ఆగమాచార్య వందిత శ్రీమాన్ రొంపిచర్ల పార్థసారథి భట్టాచార్యులవారు, శ్రీరామానుజ కీర్తి కౌముది మొదటిభాగంలో 'పన్నిద్దరాళ్వారులవైభవము' అని వ్రాసిన వ్యాసంలో - శ్రీ నమ్మాళ్వారులు సాయించిన 'తిరువాయిమొళి'ని "నాల్గవవేయి"గా చూపించారు (పుట-216). శ్రీ నమ్మాళ్వారుల తిరువిరుత్తమ్ లోని పాశురసంఖ్య 180 అన్నారు. డా॥ శ్రీమాన్ తిరుమల రామచంద్రగారి ప్రకారం, తిరువిరుత్తమ్ పాశుర సంఖ్య 100 వీరు శ్రీ నమ్మాళ్వారుల "తిరువాయిమొళి"ని మూడో వేయిలో చేర్చారు. ఇదేవిధంగా - విద్యావిశారద, 'ఉపనిషదుద్యానకోకిల" శ్రీమాన్ కె. టి. ఎల్. నరసింహాచార్యులుగారు వ్రాసి, ముద్రించిన (1973) ద్వాదశ సూరి చరిత్రలో 449, 450, 451 పుటలలో శ్రీ ఆళ్వారులు గానం చేసిన దివ్య ప్రబంధాలలో ఏఏ శీర్షికలుగలవి ఏఏ 'ఆయిరం' లలో (నాలాయిర దివ్య ప్రబంధంలో) చోటు చేసుకొన్నాయో తెలియజేశారు. ఈ వింగడింపులో - ముదలాయిరంలో శ్రీ తిరుమళిశైయాళ్వారులు గానంచేసిన 'తిరుచ్చంద విరుత్తం' చివరిదిగా చోటుచేసుకొన్నది. శ్రీమాన్ రొంపిచర్ల పార్థసారధి భట్టాచార్యుల వారి ననుసరించి

"మురళాయిరం"లో ఇచరిది - శ్రీ మధుర కవి ఆళ్వారులు వ్రాసిన కణ్ణినుణ్ శిరుత్తాంబు - డా॥ తిరుమల రామచంద్రగారి వింగడింపులోను ఇలాగే ఉంది. పై రెండింటిలో ఇది లేదనికాదు, స్థానం మారింది. శ్రీమాన్ రొంపిచర్లవారి వింగడింపులో రెండో అయిరంలో శ్రీ తిరుమంగై యాళ్వారుల మూడు దివ్య ప్రబంధాలురాగా, శ్రీమాన్ నరసింహాచార్యులవారి గ్రంథంలో ఇవి తృతీయ సహస్రంలోవచ్చాయి. డా॥ తిరుమల రామచంద్రగారి వింగడింపులో కూడా శ్రీ తిరుమంగై యాళ్వారుల మూడు దివ్య ప్రబంధాలు రెండో అయిరంలోనే వచ్చాయి. ఈ భేదాలన్నీ పెద్దగా చెప్పుకో వలసినవి కావని భావించవచ్చును. పాశురాలను గానంచేసే భక్తుల ప్రాంతాలను బట్టిగాని, వారి పరంపరను బట్టిగాని ఇవి వచ్చినవని మనం అనుకోవచ్చును శ్రీనాలాయిర దివ్య ప్రబంధం శ్రీ వైష్ణవులకు జీవగఱ్ఱ. భక్తులు ఈ భేదాలను - పరిశోధకులులాగ - అంతగా పట్టించుకోరు. వారికి భక్తి ప్రపత్తులు ముఖ్యవిషయాలు.

ఆచార్య పురుషుల అవతరణకు ముందే ప్రభవించి ప్రజల హృదయ క్షేత్రాలలో భక్తి బీజాలను నాటి, ఆచార్యుల తాత్త్విక సిద్ధాంతాలను - పామరులు పండితులు అనే భేదం లేకుండా - సర్వులు స్వీకరించడానికి అనువుగా వాటిని తీర్చిదిద్దారు. భగవత్కృపులైనవారు గానం చేసిన దివ్య ప్రబంధాలలో సిద్ధాంత పరమైన తాత్త్వికచర్చలు లేకపోయినా - ఈశ్వరుడు, జీవుడు, జగత్తు - అనే తత్త్వ త్రయాన్ని గురించిన ప్రస్తావనాదికం కవితా పద్ధతిలో ఉంటుంది. సనాతన సంప్రదాయానికి సంబంధించిన సమస్త ధార్మిక విషయాలు వాటిలోవచ్చి భక్తులైన ఆళ్వారుల విజ్ఞాన సంపత్తిని మనకు తెలియజేస్తాయి. ఆళ్వారుల దివ్య ప్రబంధాలను గూర్చి "The Hymns of Alwars" అనే ఉద్గ్రంథం వ్రాసిన J. S. M. Hooper అనే పాశ్చాత్య విద్వాంసుడు – ఆళ్వారులకు, ఆచార్యులకు – ముఖ్యంగా భగవద్రామానుజులకు - ఉన్న సంబంధాన్ని ఇలా తెలియజేశాడు.

"The Alwars provided the soil out of which Ramanuja's teaching naturally sprang and in which later it could bear fruit. He is not really (as been erroneously asserted) the "Morning Star" of Bhakti Movement, that is

**a name far more fitly given to Alwars, but in him Bhakti shines in the full splendour of a greatly Philosophical Exposition"**

శ్రీ ఆళ్వారుల యుగం తరువాత వచ్చిన ఆచార్యయుగంలో - శ్రీనాథ మునులు, శ్రీ యామునులు, భగవద్రామానుజులు, శ్రీ వేదాంతదేశికులు ప్రముఖులు. వీరిలో కొందరికి గురుత్వం నెరపినవారు కొందరున్నా, వారి గురుత్వం ఆ యా విషయాలకు పరిమితమై ఉంటుంది. ఈ ఆచార్యులందరు మహావిద్వాంసులు; వైదిక వాఙ్మయాన్ని కరతలామలకం చేసుకొన్నవారు. జైన, బౌద్ధ, చార్వాకాది అవైదిక తాత్త్విక సిద్ధాంతాలను ఎరిగినవారు. తత్కాలశైవాచార సిద్ధాంతాలను పరిశీలించినవారు. శ్రీ శాంకరాద్వైతాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసినవారు, ఆగమాలనన్నింటిని అవలోడనం చేసినవారు. కావ్యేతిహాస పురాణాలలో నిష్ణాతులు, మహారచయితలు, మేధావులు. ఈ మేధాశక్తితో పోటీపడగలిగిన హృదయమున్న భగవద్భక్తులు, విశాలహృదయులు.

సంస్కృత ప్రాకృతాదులను తప్ప ప్రాదేశిక భాషలనంతగా విద్వాంసులు గౌరవించని కాలంలో- గౌరవించకపోవడమేకాదు, ఈసడించేకాలంలో-ప్రాదేశిక భాష అయిన తమిళాన్ని ఆదరించి గౌరవించి-దానిలోని భక్తుల రచనలను వేద తుల్యంగా భావించి స్వీకరించి వాటిని అనుభవించగలిగిన సహృదయ చక్రవర్తులు ఆచార్యపురుషులు. సామాజికంగా "కులాల గొడవలు" కొనసాగుతున్న కాలంలో కులాల కట్టుబాట్లను త్రికరణశుద్ధిగా ధిక్కరించి, సడలించి వ్యవహరించిన ధైర్య సాహసాలున్న బ్రాహ్మణులు ఈ ఆచార్యపురుషులు - ఆధునిక భావలతో పోల్చి చూచినప్పుడు, ఈ ధిక్కారం మనకు అంత విప్లవాత్మకంగా కనబడకపోవచ్చును. కాని శతాబ్దుల క్రిందటి కాలాన్నిబట్టి దీన్ని పరిశీలించాలి. చతుర్థకులజాలైన శారిసూనులు పరాంకుశులై ప్రపన్నజన కూటస్థులై నమ్మ(మన) ఆళ్వారులు అయ్యారు.

"పత్యుశ్శ్రియః ప్రసాదేన ప్రాప్త సర్వజ్ఞసంపదమ్।
ప్రపన్నజనకూటస్థం ప్రపద్యే శ్రీ పరాంకుశమ్॥

**వేదవేదాంగ పారంగతులైన శ్రీనాథమునులు (క్రీ॥ 824 జననం) శ్రీ**

నమ్మాళ్వారులు అవతరించిన కురికాపురికి పోయి శ్రీ మధురకవులు తమ గురువు లైన శ్రీ శఠకోపులను స్తుతిస్తూ పాడిన "కణ్ణిమణ్ శిరుత్తాంబు" ప్రబంధాన్ని పన్నెండువందల పర్యాయాలు జపించి శ్రీ వకుళాభరణులను సాక్షాత్కరింపజేసుకొని వారివల్ల అష్టాక్షరి మంత్రాన్ని, తాము పాడిన తిరువాయిమొళి మొదలైన దివ్య ప్రబంధాలతోబాటు ఇతర ప్రబంధాలను పొంది కృతకృత్యులయ్యారు. నాటినుండి శ్రీ నమ్మాళ్వారులు ప్రపన్నజన కూటస్థులైనట్లే, శ్రీ నాథమునులు ఆచార్య జన కూటస్థులయ్యారు. వీరి పౌత్రులు, మహా విద్వాంసులు, "ఆళవందార్"గా ప్రసిద్ధ నామధేయులు మహారాజభోగాల ననుభవించి విరక్తులై శ్రీరంగనాథుని సేవాప్రవణులు అయిన శ్రీ యామునాచార్యులు, శ్రీ నమ్మాళ్వారులమీది భక్తి ప్రపత్తులను వెల్లడించిన తనియన్ శ్లోకం—

"మాతా పితా యువతయస్తనయా విభూతిః
సర్వం యదేవ నియమేన మదన్వయానామ్।
ఆద్యస్యనఃకులపతే ర్వకుళాభిరామం
శ్రీమత్తదంఘ్రి యుగళం ప్రణమామిమూర్ధ్నా॥"

ఇదే విధంగా "అస్మత్కుల ధనం" అని పేర్కొన్న శ్లోకం ఉంది.

"వకుళాలంకృతం శ్రీమచ్ఛఠకోప పద ద్వయమ్ ।
అస్మత్కులధనం భోగమస్తు మే మూర్ధ్ని భూషణమ్ ॥"

ఇదేవిధంగా శ్రీ శఠకోపులను కీర్తించే శ్లోకాలు చాలాఉన్నాయి.

"వకుళ ధవళమాలా వక్షసం వేద బాహ్య
ప్రబల సమయవాది చ్ఛేదనం పూజనీయమ్ ।
విపుల కురుకనాథం కారిసూనుం కవీశం
శరణముపగతోఽహం చక్రహస్తైక చక్రమ్ ॥"

శ్రీనమ్మాళ్వారులు పసిపాపగా ఉన్నప్పుడే (పండ్రెండవ దినంనాడు) తల్లి దండ్రులు-ప్రాకృత శిశులక్షణాలులేని తమ శిశువును, "పొలిన్ద నిన్దపిరాన్" అనే భగవానుని సన్నిధికి కొనిపోవడం, వెంటనే శిశువు కన్నులుతెరిచి ఆ స్వామిని

దర్శించడం ఆయన ప్రీతుడై విశిష్టమైన వకుళమాలికను ఒకదానిని శిశువునకు అనుగ్రహించడం జరిగిన నాటినుండి వకుళాభరణుడనే పేరు శారిసూనునకు వచ్చింది. ఈయన అంఘ్రియుగ్మానికి నమస్కరిస్తూ వ్రాసిన ఇంకోశ్లోకం ఇది:

"త్రైవిద్యవృద్ధ జనమూర్ధ విభూషణం యత్
సంపచ్చ సాత్త్విక జనస్యయదేవ నిత్యమ్ ।
యద్వాశరణ్య మశరణ్య జనస్య పుణ్యమ్
తత్సం శ్రయేమ వకుళాభరణాం ఘ్రియుగ్మమ్॥"

భాగవతోత్తములందరు ఆయన దేహమందే స్థానాన్నిపొంది ఉన్నారని వర్ణించే శ్లోకం ఒకటి ఉంది:

"భూతం మస్తక, మక్షిణీ హ్రద మహత్సూరీచ, భట్టేశ్వరమ్
వక్త్రం, భక్తిఘనంగళం, కులశిరోభూషం మునింగాయకమ్ ।
దోర్యుగ్మం, హరిదాసపద్రజ ఉరో, నాభిం కలిధ్వంసినమ్
శ్రీపాదం మధురం కవిం యతిపతిం బాహుశ్శఠారేర్బుధాః ॥"

ఈ శ్లోకాలలో వీరిని కీర్తించినవారందరూ అగ్రవర్ణంవారే! భక్తుల విషయంలో కులప్రస్తావన లేదని ఇవి తెలుపుతాయి. విబుధవరులు ఆళ్వారులనందరిని భక్తిప్రపత్తులతో స్తుతించారు. శ్రీ నమ్మాళ్వారుల వైశిష్ట్యాన్ని బట్టి ఆయన్ని విశేషంగా కీర్తించారు.

"భక్తిప్రభావభవ దద్భుత భావబంధ
సింధుక్షితప్రణయసార రసౌఘ పూర్ణః।
వేదార్థరత్న నిధిరచ్యుత దివ్య ధామా
జీయాత్పరాంకుశ పయోధిరసీమ భూమా ॥"

సమాజంలో అగ్రవర్ణాలుగా భావింపబడే వారందరు - శ్రీ వైష్ణవులయిన తరువాత - కులవివక్ష లేకుండా ఆళ్వారులనందరిని భక్తిప్రపత్తులతో సేవించే వారని చెప్పడమే ఇక్కడి ఉద్దేశం శ్రీమన్నారాయణుని దాసుడైతేచాలు, ఆయన శ్రీ వైష్ణవులకందరికి ఆప్తుడు; బంధువు. ఇక్కడ చతుర్థకులజాలైన శ్రీ మారవే

ర్నంబి అనే మహాజ్ఞాని మృతి సందర్భాన్ని గురించి ఉదాహరణంగా చెప్పుకో వచ్చును. ఈ మహాజ్ఞాని, భక్తుడు మరణించినప్పుడు. భగవద్రామానుజుల గురు వులలో బ్రాహ్మణులైన శ్రీమహాపూర్ణులు (పెరియనంబి) బ్రహ్మమేధవిధానంతో ఆయనకు సంస్కారం చేశారు. కులం పట్టింపులున్న కొందరు వైష్ణవులు దీన్ని గర్హించారట! ఈ విషయంతెలిసిన భగవద్రామానుజులవారు గురువుగారి వైశి ష్ట్యాన్ని సర్వులకు తెలియజేయడంకోసం ఆయన్ని సమీపించి "మీ ప్రతి పనికిని నేదో గూఢార్థ ముండకపోదు. మీ కర్మాంతరములేనిచో దానినీ దాసునకు తెలుప ప్రార్థన" యని ప్రశ్నించిరి. అపుడు మహా పూర్ణులిట్లనిరి - "వత్సా, ధర్మము సామాన్యము, విశేషము అని రెండు విధములు. ఒకప్పుడు ధర్మమయినది మరొకప్పుడధర్మముకావచ్చును, అట్లే అధర్మముగూడ ధర్మము కావచ్చును. ఇక్ష్వాకు వంశాలంకారుఁడగు శ్రీరామచంద్రుని కంటె నేను గొప్పవాడనా? గృధ్ర రాజు జటాయువుకంటె నీ మారనేర్నంబి తక్కువ వాడా? సామాన్య ధర్మ నిరతుఁడగు ధర్మరాజుకంటె నేను గొప్పవాఁడనా? విదురునికంటె యానంబి తక్కువవాడా?"

"ఈ మాటలువిని ఉభయ వరుల సందేహము తీరిపోయెను. మహాత్ముల వృత్తము లిట్లే యుండునుగదాయని వారు తలచిరి." (ద్వాదశ సూరి చరిత్ర - విద్యావిశారద, ఉపనిషదుద్యాన కోకిల శ్రీమాన్ కె. టి. యల్. నరసింహా చార్యులు, 1973, పుటలు - 393, 394)

భగవద్రామానుజులవారే తమ జీవితంలోనే తమ సముచిత ప్రవర్తన ద్వారా భక్తులవిషయంలో కులగోత్రాదులకు అనుచిత ప్రాధాన్యం ఇయ్యకుండా వ్యవహరించినట్లు మనకు తెలుస్తోంది. ప్రప్రథమంగా శ్రీకాంచీపూర్ణుల (తిరు కచ్చినంబి) విషయాన్ని గ్రహించ వచ్చును. ఆయన కంచి వరద రాజస్వామి అనన్య భక్తులని తెలుసుకొని ఆయన అవరవర్ణులైనా ఆయన్ని విశేషంగా గౌరవించి, ఆయన భుక్త శేషాన్ని (ఇక్కడ ఎంగిలి అనుకోకూడదు. వండిన వంటలో ఆయనకు పెట్టగా మిగిలినదని అర్థం.) తాము అరగించాలనేభక్తి భావంతో ఆయన్ని భోజనానికి తమ ఇంటికి పిలిచారు. ఆయన ముందుగానే వచ్చి భోజనంచేసి వెళ్ళిపోయారు భగవద్రామానుజుల ధర్మ పత్ని రక్షకాంబ, ఆచారాన్ని పాటించి తిరుకచ్చినంబి భుక్తశేషాన్ని పారవేసి తిరిగి స్నానంచేసి

భర్త కోసం మళ్ళీ వంటచేసింది. తిరుకచ్చినంబి వెళ్ళిపోయిన తరువాత ఇంటికి వచ్చిన భగవద్రామానుజులు ఈ విషయాన్ని తెలుసుకొని పరమ భాగవతుని భుక్తశేషం తమకు లభించలేదని భార్యమీద కోపగించుకొని ఆమెను క్షమించ లేదు, ఇంట్లో అన్నంఉన్నా లేదనిచెప్పి తనకు సేవచేసిన బ్రహ్మచారికి రక్షకాంబ అన్నంపెట్టకపోవడం, గురువైన శ్రీ మహాపూర్ణుల భార్యతో తన అభి జాత్యాన్ని పురస్కరించుకొని కలహించడం కూడా ఆయనకు నచ్చక భార్యను ఆమె సోదరి వివాహం సాకుగా చెప్పి పుట్టింటికి పంపించివేశారు. తరువాత సన్న్యసించారు. అవర వర్ణులైన కాంచీపూర్ణుని కూడా తమకు సంస్కారాదులు అనుగ్రహించవలసినదని అభ్యర్థించారు. ఆయన అంగీకరించనందున శ్రీమహా పూర్ణుల (పెరియనంబి) నుండి పంచ సంస్కార లాభాన్ని తరువాత పొందారు.

అనంతరకాలంలో శ్రీగోష్ఠిపూర్ణుల (తిరుక్కోట్టి యూర్ నంబి) నుండి మంత్రోపదేశాన్ని పొందాలని కుతూహలపడి - ఆయన మంత్రోపదేశం చేయక పద్దెనిమిది సారులు త్రిప్పినా - పట్టుదలతో వారినే అర్థించి మంత్రోపదేశాన్ని పొంది; ఆ మంత్రం తారకమంత్రం గనుక, ఎవరికీ చెప్పవద్దనీ చెప్పితే నరక ప్రాప్తి అని గురువు ఆదేశించినా, గురువు ఆజ్ఞను ధిక్కరించి - తా నొక్కడు నరకానికి పోయినా, మంత్రాన్ని విన్నవారందరు తరిస్తారని, గుడి గోపురం ఎక్కి అందరికీ వినబడాలని ఉచ్చైః స్వరంతో ఆ మంత్రాన్ని బహిరంగంగా వినిపించిన ఉదార హృదయులు భగవద్రామానుజులు. మొదట తమను ధిక్కరించినందులకు గురువు కోపించినా, తరువాత శిష్యుని ఉదారతను గురువు అర్థం చేసుకొని "అయ్యో! ఇలాంటి ఉదారత నాకు లేకపోయినదే" అని వాపోయి, శిష్యునితో "నువ్వు (నాకు నాథుడవు) నాకంటె గొప్పవాడవు" (ఎంబెరుమానార్) అన్నారు. ఆమాటే భగవద్రామానుజులకు ఒక బిరుదునామం అయింది.

తాము సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించిన తరువాత ధనుర్దాసు అనే మల్లుని పరమ భాగవతునిగా తీర్చిదిద్ది, తమ స్నానానంతరం కావేరి నుండి తిరిగి వచ్చే టప్పుడు అవరవర్ణుడైన ఆ మల్లుని హస్తావలంబంతో నడిచి రావడం, స్నానానికి పోయే ముందు పూర్వాశ్రమంలో తమ మేనల్లుడు, ఇప్పుడు శిష్యుడు అయిన దాశరథి హస్తావలంబంతో నడిచిపోవడం చూచిన కొందరు పూర్వాచార పరాయణులైన వైష్ణవులు ఆశ్చర్యపడి గురువు గారిని అడిగారు. "స్వామీ! ఇది ఆశ్చర్యంగా

ఉంది. స్నానాత్పూర్వం బ్రాహ్మణులైన దాశరథి హస్తావలంబం, స్నానాత్పరం పరిశుద్ధులైన పిదప అవరవర్ణుని హస్తావలంబం మాకు అర్థం కావడంలేదు" అన్నారు. అప్పుడు ఆచార్యులు, ధనుర్దాసు మదత్రయాన్ని దమించిన వాడని వారికి చెప్పి తరువాత దాన్ని నిరూపించారు. మదత్రయాన్ని జయిస్తే, అది అస్తవ్యస్తం అయి దమం అవుతుంది.

ఈ విషయాన్ని పెద్దలు ఈ శ్లోకం ద్వారా తెలియజెప్పారు.

"విద్యామదో ధన మదస్తృతీయోభి జనోమదః ।
ఏతేర్మదావలిప్తానామే తఏవ సతాందమాః ॥"

భక్తులవిషయంలో ఈ ఉదారత ప్రదర్శించినవారు సమాజంలో ఏ కష్టాలు పడలేదనికాదు. భగవ ద్రామానుజులవారి విషయంలోనే ఇది చాలా సార్థ నిరూపితమైనది. ఇతరుల - ఈర్ష్యా ద్వేషాలను, అసహనాన్ని ఆయన చవి చూచిన వారే. ఆయన మొదటి గురువైన యాదవ ప్రకాశులే ఆయన్ని చంపా లని ప్రయత్నించినట్లు తెలుస్తోంది. చోళరాజే దుర్మార్గానికి ఒడిగట్టితే ఆయన తమిళదేశం విడిచి వెళ్ళిపోవలసివచ్చి రాజు మరణం తరువాత వచ్చారు. మత వైషమ్యం వల్ల రాజు విధించిన శిక్షవల్ల భగవద్రామానుజుల ప్రియశిష్యులైన శ్రీ కూరేశులు నేత్రాలను పోగొట్టుకొనవలసివచ్చింది. కాని, మొత్తంమీద జన బాహుళ్యంలో సహనభావం ఉండడం వల్ల ఆచార్య పురుషులు దేశం నాలుగు మూలల సంచరించి తమ సిద్ధాంతాలను ప్రచారం చేసుకో గలిగారు. అక్కడక్కడ ఇతర ధర్మాలవారి పీడ మధ్య మధ్య సోకుతూ వచ్చినా అది తాత్కాలికమే అయ్యేది. భక్త్యుద్యమాలు దక్షిణ భారతంలో వైష్ణవ, శైవశాఖాత్మకాలుగా ప్రారంభమై మధ్యయుగంనాటికి వైష్ణవోద్యమం విజృంభించి భారత దేశమంతా వ్యాపించి ఉత్తర భారతంలో అనేక వైష్ణవ సంప్రదాయాల ఆవిర్భావ వికాసాలకు సాయపడింది. అంతకి పూర్వమే యావద్భారతాన్ని ప్రభావితం చేసిన శాంకరాద్వైతం - అవైదిక ధర్మాల ప్రాభవాన్ని అరికట్టి-వేద ప్రామాణ్యాన్ని, బ్రహ్మ సత్యత్వాన్ని (అది నిర్గుణ బ్రహ్మమైనా) స్థాపించి; తరువాత బయలుదేరి విజృంభించిన సగుణోపాస నాత్మక సర్వవైష్ణవ సంప్రదాయాలకు సుస్థిరమైన పూర్వరంగాన్ని కల్పించి ఇచ్చింది. ఇందువల్ల - ఈ సంప్రదాయ ప్రవర్తకులు, తదను యాయులు తమకు ముఖ్య ప్రత్యర్థిగా శాంకరాద్వైతాన్ని నిలుపుకోవలసి

వచ్చిన వారైరి గాని, అవైదిక ధర్మాల ఖండనకు విశేషంగా పూనుకోవలసి వచ్చినవారు కారైరి. వారికా ఆవశ్యకం అంతగా కలగలేదు గనుక. యావ ద్భారతావనిని ప్రభావితంచేసిన విశిష్టాద్వైత, ద్వైత సంప్రదాయాల ప్రముఖ ప్రవర్తకులైన భగవద్రామానుజులవారు, పూర్ణ ప్రజ్ఞులైన మధ్వాచార్యులవారు వేదాంత ప్రథమ పాఠాలను - తరువాత గురువుల అద్వైత సిద్ధాంతంతో ఏకీభ వించక వాటిని ఖండించినను - అద్వైత గురువుల దగ్గిర అభ్యసించినవారే కావడం ఆనాటి తాత్త్విక పరిస్థితికి అద్దం పట్టుతుంది. ఆ గురువులు వరుస క్రమంలో - శ్రీ యాదవ ప్రకాశులు, శ్రీ అచ్యుత ప్రేక్షులు అనేవారు. ఆయా సంప్రదాయానుయాయులనుబట్టి ఈ గురువులిద్దరు చివరికి తమ శిష్యుల సిద్ధాంతా లనే అంగీకరించి వారికి శిష్యులైనట్లు తెలుస్తుంది.

ఆళ్వారుల యుగం తరువాత, భక్తి ప్రపత్తులకు సంబంధించిన ఈ మహోద్యమానికి తాత్త్విక బల సంపత్తిని కూర్చి దేశవ్యాప్తంగా పండితులలో విశిష్టాద్వైతాన్ని వ్యాపింపజేసినవారు ఆచార్యులైనా, ఆళ్వారులు నెలకొల్పిన భక్తి ప్రతిష్ఠాపనం మీదనే తరువాతి వారి కృషి అంతా ఆధారపడి ఉందనవచ్చును. దర్శన సార్వభౌమ - తర్కభూషణ - న్యాయ వేదాంత శిరోమణి - ఉభయ వేదాంత విద్వాన్ శ్రీమాన్ టి. కె. వి. యన్. సుదర్శనాచార్యులుగారు తమ "శ్రీ నమ్మాళ్వారుల వైభవము" అనే వ్యాసంలో (పుట-60 శ్రీ రామానుజ కీర్తికౌముది; నాల్గవ భాగం 1983) "ద్రావిడ దివ్య ప్రబంధాలే లేకున్న, శ్రీమద్విశిష్టాద్వైత సిద్ధాంతమే ప్రతిష్ఠితము గాదనిన అతిశయోక్తికాదు" అని వ్రాశారు.

ఆచార్యయుగంలో ప్రప్రథమంగా పేర్కొనవలసినవారు శ్రీనాథమునులు (823 క్రీ॥ శ॥) వీరు ఉదయించకపోతే, ఆళ్వారుల దివ్యప్రబంధాలు మనకు అందేవికావు, శ్రీ మణవాళ మహామునులు ఉపదేశ రత్నమాలయందు - నాదముని ముదలాన నందేశికరై అల్లాల్ పేదైమనమే ఉండోపేశు - నాథముని మొదలైన దేశికులు లేక, ఆళ్వారుల దివ్య ప్రబంధములు గాని, తదర్థములు గాని మనకు కరతలామలకములయి యుండెడివికావు అనిరి... ........ - ... ... అందుచేతనే విశిష్టాద్వైత సంప్రదాయము నాథోపజ్ఞం ప్రవృత్తం - నాథమునులచే ప్రవర్తింప చేయ బడెనని ప్రశస్తి గాంచినది" (శ్రీనాథ మునుల వైభవము - సంగీత

సాహిత్య కళానిధి శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమా చార్యులు (పుటలు- 177, 188) శ్రీరామానుజ కీర్తి కౌముది, 5వ భాగం - 1984)

శ్రీనాథ మునులు దివ్య ప్రబంధాదికానికి ఒక మార్గం ఏర్పర్చి తమ జీవితం కృతార్థత చెందిందని భావించి ప్రియశిష్యులైన శ్రీ కురుగావలప్పన్‌నకు యోగ రహస్యాలు. శ్రీ పుండరీ కాక్షులకు నాలాయిర దివ్య ప్రబంధసారమని చెప్పదగిన శరణాగతిని ఉపదేశించి, దివ్య ప్రబంధాల రక్షణ ప్రచార బాధ్యతలను అప్పగించారు పుత్రులైన ఈశ్వరమునులకు "నీకు జన్మించే కుమారునకు "యమునైత్తురైవన్" (యమునాతట విహారి) అనే పేరు పెట్టవలసింది"అని చెప్పారు. తమ మనుమలకు వారికి తెలిసిన సమస్త విజ్ఞానాన్ని బోధించవలసినదని ఆదేశించారు. "కృత కృత్యాః ప్రతీక్షంతే మృత్యుం ప్రియామివాతిథి" అన్నట్లు భగవద్భాగవతారాధనతో జీవితం గడిపి యోగమార్గంలో దేహవిసర్జనచేశారు.

శ్రీనాథమునుల తరువాత పేర్కొనదగిన ఆచార్యోత్తములు శ్రీ యామునాచార్యులు (క్రీ॥ శ॥ 918-1037) వీరు శ్రీనాథముని పుత్రులయిన శ్రీ ఈశ్వరముని పుత్రులు. పితామహుల ప్రతిభాదికం ఇతోధికంగా వీరిలో తేజరిల్లింది. ఈ తాత, మనుమల విశిష్టతచేతనే గురుం పరధ్యానంలో ఇలా ఉంది.

> "లక్ష్మీనాథ సమారంభాం నాథయామున మధ్యమామ్ ।
> అస్మదాచార్య పర్యన్తాం వందేగురు పరంపరామ్ ॥"

శ్రీ యామునాచార్యులు క్రీ॥ శ॥ 918లో వీరనారాయణపురంలో (కొట్టు మన్నార్ కోవిల్) సింహాసనాంశతో జన్మించారు తాతగారికోరిక ననుసరించి వీరికి నామకరణం చేయడం జరిగింది. మహా ప్రతిభావంతులైన వీరు బాల్యమందే తమ శేముషీ విశేషాన్ని ప్రదర్శిస్తూ వచ్చారు. తాతగారి శిష్యులనుండి విషయ గ్రహణం చేశారు శ్రీరామ మిశ్రులవద్ద వేదాధ్యయనం, శ్రీమహా భాష్య భట్టరు వద్ద శాస్త్రాదులు అభ్యసించి పన్నెండు సంవత్సరాల వయస్సు వచ్చేటప్పటికే వేదవేదాంగ శాస్త్రాదులలో నిష్ణాతులై కవిగాకూడా రాణించడం మొదలు పెట్టారు. ఇంకా గురుకులంలో ఉండగానే, తమ గురువుల గౌరవాన్ని కాపాడడానికి చోళరాజాస్థానం ప్రవేశించి, ఉద్ధతుడు. దూర్తుడు అయిన విద్వజ్జన కోలాహలుడనే రాజపురోహితుడు — తమ చిన్నవయస్సును చూచి హేళనగా "ఆళారో

హ్రస్వః" అనగానే. "ఆకారోదీర్ఘః" అని శ్రీయామునులు సమాధానం చెప్పి, ఆ గర్వ్విషిని నిరుత్తరుణ్ణి చేశారు

ఈ సందర్భంలో శైవుడైన చోళరాజు, శ్రీయామునులను చూచి ఇలా అన్నట్లు, "సాహితీ సమరాంగణ సార్వభౌములైన" శ్రీకృష్ణదేవరాయలు తమ ఆముక్తమాల్యదలో వ్రాశారు:

"సంగతి యెయోయి యినుమంత టింగణావు
తత్త్వనిర్ణయ వాదంబుదరమె నీకు
నోడి తేనియుఁబట్టి మొట్టోయనంగ
లింగమును గట్టకుడుగ మెఱిగి నుడువు!"

తరువాత యుక్తివాదంతో ఆ అహంకారిని పరాజితుణ్ణిచేసి. మహారాజ్ఞిచేత "ఎన్నై ఆళవందారో ?" (నన్ను కాపాడడానికి వచ్చారా ?") అని అనిపించు కొన్నారు. ఆ "ఆళవందారే" పౌరుషనామంగా ఆయనకు తుదివరకు నిలిచి ఉంది. రాజు రాణి మొదట చేసుకొన్న ఒప్పందం ప్రకారం, రాజు వైష్ణవుడ య్యాడు. తన ప్రతిజ్ఞప్రకారం వాదంలో జయించిన 'ఆళవందారు'నకు అర్ధ రాజ్యం ఇచ్చాడు. శ్రీయామునులు రాజభోగాలలో మునిగితేలుతూ, విద్వాంసులుగా తను కర్తవ్యాన్నే విస్మరించారు. అప్పుడు, శ్రీనాథమునుల శిష్యులైన శ్రీరామ మిశ్రులు, ఒక ఉపాయం ద్వారా రాజైన యా మునుల దర్శనంచేసి "మీకు అప్ప గించవలసినదిగా మీ పితామహులైన శ్రీనాథమునులు ఒక నిధిని ఉంచారు. మీరు నాతోవస్తే అది మీకు చూపిస్తాను" అన్నారు. ప్రాజ్ఞులైన శ్రీ యామునులు తమ విద్యుక్త ధర్మాన్ని స్మరించి, గుర్తించి వెంటనే శ్రీరామమిశ్రులతో బయలు దేరి, శ్రీరంగంలో శ్రీరంగనాథుని దర్శనం చేశారు. "శ్రీరంగనాథులే మీ తాత గారి నిధి" అన్నారు శ్రీరామమిశ్రులు. మహా విద్వాంసులైన శ్రీయామునులు శ్రీవైష్ణవ సమాజానికి సహజంగావే నాయకులయ్యారు. శ్రీనాథమునులు పరమ పదించారు గనుక, వారి పౌత్రులు, శేముషీదురంధరులు అయిన శ్రీయామునులను శ్రీవైష్ణవ సమాజం తమ ఆచార్యులుగా ఎన్నుకొన్నది. నాటినుండి వీరు ఆచార్య పరంపరలో ప్రస్తుతింపబడ్డారు. శ్రీయామునాచార్యులవారికి ముఖ్యశిష్యులు ఏక వింశతి అని ప్రతీతి. వీరిలో పెరియనంబి, తిరుక్కోట్టియూర్‌నంబి, తిరుమలై నంబి, తిరుకచ్చినంబి మారనేరనంబి మొదలైన వారున్నారు. మహావిద్వాంసులైన

శ్రీయామునులు, భగవద్రామానుజులకు వయోవృద్ధులయిన సమకాలికులై తమ స్తోత్ర కావ్యాల ద్వారా తాత్త్వికగ్రంథాల ద్వారా అనాటి విద్వజ్జనులనందరిని ఆకర్షించారు. శ్రీయామునాచార్యులవారు భగవద్రామానుజులను కలిసిమాటలాడక పోయినా-కంచిలో అద్వైతాచార్యునిగా పేరుపొందిన శ్రీయాదవప్రకాశుల శిష్యునిగా భగవద్రామానుజులకు "కప్యాసం పుండరీక మేవమక్షిణీ" (ఛాందోగ్యం1-6-7) అనేదాని అర్థవివరణలోను, "సత్యం, జ్ఞానమనంతం బ్రహ్మ" అనే దాని వ్యాఖ్య విషయంలోను-గురువుతో అభిప్రాయభేదం వచ్చినట్లు విన్నారు. భగవద్రామాను జుల వివరణవ్యాఖ్యలు ఆయనకు నచ్చాయి. వారు స్వయంగా కంచి వచ్చినప్పుడు గురువైన శ్రీయాదవప్రకాశులతోను, సతీర్థ్యులతోను భగవద్రామానుజులు కలిసి పోతున్నప్పుడు దూరంనుండి చూచి ఆకర్షితులయ్యారు. తమ తరువాత శ్రీవైష్ణవ సమాజానికి నాయకత్వం వహించడానికి తగిన ప్రతిభాపాండిత్యాలు, వ్యక్తిత్వం భగవద్రామానుజుల వారికున్నాయని ఆయన సంతృప్తిపడ్డారు. భగవద్రామాను జుల వారి దక్షత మీద శ్రీయామునాచార్యుల వారికి విశ్వాసం కుదిరింది. తరువాత గురువునుండి విడిపోయి భగవద్రామానుజులు శ్రీ వరదరాజస్వామికి తీర్థకైంకర్యం చేస్తూ వేరుగా ఉన్నారని విన్నవెంటనే ఆయనను శ్రీరంగం తీసుకొని రావలసిన దని తమ అంతరంగ శిష్యులైన శ్రీ మహాపూర్ణుల (పెరియనంబి)ను కంచికి పంపించారు.

అప్పటికప్పుడే శ్రీయామునాచార్యులు "స్తోత్రరత్నం" వ్రాసి శ్రీరంగనాథు నకు సమర్పించి ఉన్నారు కనుక, ఆస్తోత్రరత్నాన్ని భగవద్రామానుజులకు వినిపించవలసినదని కూడా ఆదేశించారు.

శ్రీయామునాచార్యులవారికి శ్రీ నమ్మాళ్వారుల దివ్యప్రబంధాలయందు ప్రీతి ఎక్కువ. భక్తితత్త్వమంతా వారి రచనలలో ఓతప్రోతమై ఉంటుంది. వారి రచనలన్నింటిమీద "తిరువాయిమొళి" ప్రభావం పడింది అంటే అది అతిశ యోక్తి అనిపించుకోదు! వారెంత తత్త్వశాస్త్రవేత్తలో అంతకంటెకూడా ఎక్కువగా కవులు. వారు ఆరు గ్రంథాలు రచించారు. 1. స్తోత్రరత్నం 2. చతుశ్లోకి 3. సిద్ధిత్రయం 4. గీతార్థ సంగ్రహం 5. ఆగమప్రామాణ్యం 6. మహాపురుష నిర్ణయం-అనేవి.

ఆయన రచనలన్నింటిలోను తలమానికమైనది. భక్తజనహృదయాహ్లాది

"స్తోత్రరత్నం" అరవైయైదు శ్లోకాలున్న ఈ భక్తికావ్యం నిజంగా రత్నమే! శ్రీమన్నారాయణుని దివ్యమంగళ విగ్రహవర్ణన, ఆయన కల్యాణగుణగానం, ఆత్మదోషప్రకటన, శరణాగతి మొదలైనవాటితో బాటు తమ పితామహులైన శ్రీనాథములకు అంజలిఘటించడం ఈ "రత్నం"లో కనబడతాయి. తమ అకించనత్వం, అసహాయస్థితి మొదలైనవి చెప్పుకొని నైచ్యానుసంధానం చేయడంతో బాటు ఆ శ్రీమన్నారాయణుని "మా తాతగారైన శ్రీనాథమునులను చూచి అయినా నన్ను రక్షించు" అని స్తోత్రాన్ని ముగించడం మన గుండెలను తాకుతుంది.

"అకృత్రిమత్వచ్చరణారవిన్ద
ప్రేమ ప్రకర్షావధి మాత్మవన్తమ్ ।
పితామహం నాథమునింవిలోక్య
ప్రసీద మద్వృత్తమ చిన్తయిత్వా"॥ (శ్లోకం-65)

దీనికి ముందున్న శ్లోకంలో "నేను నీవాణ్ణి" అని అనుకొన్నవాళ్లనందరికీ అభయమిచ్చి రక్షించడం నావ్రతం అన్నావే మరి నన్నెందుకు వర్జించావు ఇదేమి వ్రతం?" అంటారు భక్తకవులు శ్రీ యామునాచార్యులవారు.

"నను ప్రపన్నస్స కృదేవనాథ!
తవాహమస్మీతి చ యాచమానః ।
తవాను కంప్యః స్మరతః ప్రతిజ్ఞాం
మదేకవర్జం కిమిదం వ్రతంతే॥" (శ్లోకం-64)

ఈ శ్లోకం శ్రీమద్రామాయణంలోని విభీషణ శరణాగతిని పురస్కరించుకొని శ్రీరాముడిచ్చిన వాగ్దానాన్ని జ్ఞాపకంచేస్తుంది:

"సకృదేవ ప్రపన్నాయతవాస్మీతి చ యాచతే ।
అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతంమమ॥"

స్తోత్రరత్నానికి శ్రీ ఆళవందార్ స్తోత్రం అనికూడా ప్రసిద్ధిఉంది. దీనిలోని చాలా శ్లోకాలు - "నమోనమోవాఙ్మనసాతిభూమయే" (21) "నధర్మనిష్ఠోఽస్మిన చాత్మవేదీ" (22) "విలాస విక్రాంత పరావరాలయం" (30) "కదాపునశ్శంఖ

రథాంగకల్పక" (81) "అపరాధ సహస్రభాజనం"(48) మొదలైన శ్లోకాలు శ్రీవైష్ణవులు కాని భాగవతుల నాల్కలమీదకూడా నేటికి నాట్యమాడుతున్నాయి.

ఈ విషయంలో "స్తోత్రరత్నం" శ్రీకులశేఖరాళ్వారులు రచించిన "ముకుందమాల"తో పోటీపడుతుంది! ఇలాంటి స్తోత్రరత్నానికి వ్యాఖ్యలుండడంలో ఆశ్చర్యం లేదు. శ్రీవేదాంత దేశికులవారు తమ వ్యాఖ్యానంలో దీని హృదయం "ప్రపత్తి"అని నిర్ణయించారు.

శ్రీయామునాచార్యులవారి ఇంకో స్తోత్రం "చతుశ్లోకి" అనే పేరున్న లక్ష్మీ స్తోత్రం. శ్రీవైష్ణవ సంప్రదాయంలో పురుషకార స్వరూపిణి అయినలక్ష్మీదేవికున్న స్థానం అద్వితీయమైనదిగదా! ఈమె పురుషకారం కేవలం చేతనులంకేకాదు! దేవులకు (ఇతరులు) నిత్యసూరులకు, ఆచార్యులకుకూడా లక్ష్మీదేవి ద్వారానే! స్వతస్సిద్ధంగా వీరికి లేదని తెలుతోంది. శ్రీఅళగియ మణవాళ జీయరుస్వాముల రచన అయిన "తత్త్వదీప సంగ్రహం"లో అలాఉంది:

ఏతత్సాపేక్ష సంబంధాదన్యేషా మమ లాత్మనామ్ ।
దేవీ సూరిగురూణాం చఘటకత్వం నతుస్వతః ॥

మంత్రరత్నమని ప్రతిష్ఠఉన్న ద్వయమంత్రంలో రెండు భాగాలలోను శ్రీమచ్ఛబ్దంఉండి లక్ష్మీదేవి విశిష్టతను తెలుపుతోంది. ఆమె పురుష కారత్వం కంఠోక్తిగా చెప్పడంజరిగింది. శ్రీమన్నారాయణులు అవతరించినప్పుడు, ఆమెకూడా అవతరించి ఈ కార్యాన్ని నెరవేరుస్తుంది. విష్ణుపురాణంలోని-"రాఘవత్వే భవేత్సీతా, రుక్మిణీ కృష్ణజన్మని"అని శ్లోకార్థం ఈ విషయాన్నే తెలియజేస్తోంది.

శ్రీయామునులుకూడా తమ చతుశ్లోకి స్తోత్రంలో (కాన్తా చతుశ్లోకి) లక్ష్మీదేవికున్న ఈ ప్రత్యేకతను వివరించారు:

"ఈషత్త్వత్కరుణా నిరీక్షణ సుదాసన్ధుక్షణాద్రక్ష్యతే
నష్టం ప్రాక్తదలాభతస్త్రిభువనం సంప్రత్య నన్తోదయమ్ ।
శ్రేయోనహ్యరవిందలోచన మనఃకాన్తా ప్రసాదాదృతే
సంసృత్యక్షర వైష్ణవాధ్వసు నృణాం సమ్భావ్యతే కర్హిచిత్॥" 3

శ్రీ యామునాచార్యులవారి మూడో గ్రంథం-సిద్ధిత్రయం. దీనిలోని మూడు

సిద్ధులలో (ఆత్మ, ఈశ్వర, సంవిత్) సంవిత్సిద్ధిలో శ్రీ శంకర భగవత్పాదుల మాయావాద ఖండనం ఉంది.

శ్రీ ఆళవందారుల నాలుగో గ్రంథం-గీతార్థసంగ్రహం. భగవద్గీతా సిద్ధాంతాల నిందులో సగుణోపాసనానుగుణంగా నిరూపించడం జరిగింది.

శ్రీ సింహాసనాంశముని (శ్రీ యామునాచార్యులు) వైదుష్యాన్ని ప్రకటించే, పాంచరాత్ర సిద్ధాంతాన్ని ప్రమాణీకరించే విశిష్టరచన-ఆగమ ప్రామాణ్యం అనే ఐదవ రచన. దీనిలో శ్రీ యామునాచార్యులు - ఈశ్వర, పరమ, శాండిల్య, సనత్కుమార, పద్మోద్భవాది సంహితలను పాంచరాత్ర సిద్ధాంతానికి ప్రమాణ గ్రంథాలుగా స్వీకరించారు.

శ్రీ యామునాచార్యవర్యులు "మహాపురుష నిర్ణయం"అనే విష్ణు పారమ్యాన్ని తెలిపే గ్రంథం వ్రాసినట్లున్నా, ఇప్పుడది లభించడంలేదని పండిత పరిశోధకులంటున్నారు.

శ్రీ యామునాచార్యులవారు శాంకరాద్వైతాన్ని ఎడ నెడ ఖండించారు. "బ్రహ్మసత్యం జగన్మిథ్యా"అంటే, జగత్తుమిథ్య అని అర్థంకాదని, బ్రహ్మవంటి వస్తువు ఇంకొకటిలేదని అర్థం అని వ్యాఖ్యానించారు. ప్రపంచం, ఈశ్వరతత్త్వం రెండూ సత్యాలే అన్నారు. శ్రీ యామునులు వారి సిద్ధాంతస్థాపనకోసం తర్కశాస్త్ర పద్ధతిని అవలంబించారు. పాంచరాత్రం అవైదికమన్న అద్వైతుల వాదనను ఖండించి, శ్రీమన్నారాయణ ప్రోక్తంగనుక అదివేదతుల్యం అన్నారు. ఇదిగాక, "పాంచరాత్రస్య కృత్స్నస్య వక్తానారాయణస్స్వయమ్" అని ఉంది గనుక, ఇది వేదసారం అన్నారు. భక్తి ప్రపత్తులే మానవాళిని తరింపజేసేవి అనే దృఢవిశ్వాసాన్ని సర్వవిధాల ప్రచారంచేశారు. శ్రీ యామునాచార్యులవారి తిరునక్షత్ర తనియన్ ఇది:

శుచౌ మాస్యుత్త రాషాఢా జాతం యామునదేశికమ్ ।
శ్రీరామ మిశ్ర చరణ సరోజాశ్రిత మాశ్రయే॥

ఇంక, నిత్యతనియన్ శ్లోకమిది:

యత్పాదాంభో రుహధ్యాన విధ్వస్తాశేష కల్మషమ్ ।
వస్తుతా ముప యాతోఽహం యామునేయం నమామితమ్॥

ఇంక, తమ పాండిత్యాదికాన్ని గురించి విన్నతనంలో వారే చోళ రాజ స్థానంలో రాజ పురోహితుడైన విద్వజ్జన కోలాహలుడైన అక్కియాళ్వాన్ దగ్గర చదివిన బిరుద శ్లోకం ఇది:

"ఆశైలా దద్రికన్యాచరణ కిసలయన్యాస ధన్యోపకంఠా
దారక్షోనీత సీతాముఖకమల సముల్లాస హేతోశ్చ సేతోః ।
ఆచప్రాచ్య ప్రతీచ్యక్షితి ధరయుగళా దర్కసోమావతంసా
న్మీమాంసా శాస్త్రయుగ్మ శ్రమ విమల మనా మృగ్యతాం
మాదృశోన్యః॥

దీని తరువాత రాజసభలో అక్కియాళ్వాన్‌ను ఓడించి రాజ్యం సంపాదించి, కొన్ని ఏళ్లు ఏలి, భోగాల్ని అనుభవించి, రామ మిత్రులవల్ల తమ కర్తవ్యాన్ని గుర్తించి, సన్న్యసించి శ్రీరంగంలో వైష్ణవ సమాజానికి నాయకత్వం వహించి స్తోత్ర కావ్యాలను శాస్త్రగ్రంథాలను రచించి విశిష్టాద్వైత సిద్ధాంత స్థాపనకు తత్ప్రదారానికి అర్వాచీన కాలంలో మూల పురుషులయ్యారు. విద్వాంసులందరు ఈ విషయాలను అంగీకరించారు.

శ్రీ యామునాచార్యులవారి వైశిష్ట్య మిది:

"పూర్వము బోధాయనుఁడే వైష్ణవసిద్ధాంత ప్రవర్తకుఁడైనను, ఆయనచే రచింపఁబడిన బ్రహ్మసూత్ర వృత్తి ఉపలబ్ధము కానందున, యామునాచార్యులే అర్వాచీన వైష్ణవసిద్ధాంత ప్రవర్తకులలో మొదటివారని చెప్పనొప్పును. టంక, ద్రమిడ, భారుచి ప్రభృతులు బోధాయన వృత్తిననుసరించి గ్రంథములురచించి, పూర్వవాదముల నిరసించిరి. ద్రమిడ భాష్యము శ్రీవత్సాంక మిత్రులచే విపులీకరింపఁబడి, యామునులచే నుట్టంకింపఁబడినది. అర్వాచీనసిద్ధాంత చరిత్రకు యామునాచార్యులే నాందిపల్కిరని చెప్పవచ్చును. యామునులు మహాపూర్ణులకు గురువులు. ఈరీతిగా శ్రీమద్రామానుజులకు పరమాచార్యులు..." (శ్రీ యామునాచార్య వైభవము-సంగీత సాహిత్యకళానిధి శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు; శ్రీరామానుజ కీర్తికౌముది; ఐదవభాగము-1984; పుటలు-198, 199. శ్రీరామానుజ కీర్తికౌముదీ గ్రంథమాల; శ్రీలక్ష్మీనారాయణపురము-గుంటూరు-6)

శ్రీ యామునాచార్యుల ప్రసిద్ధ స్తోత్ర గ్రంథం"స్తోత్రరత్నం"భగవద్రామాను

జులను శ్రీ యామునాచార్యుల దర్శనం చేయాలనే కోరిక కలిగించింది! భగవ ద్రామానుజులకు స్తోత్రరత్నం వినిపించి ఆయన్ని కంచినుండి శ్రీరంగం తీసుకొని రావలసినదని, శ్రీ యామునాచార్యులు తమ ముఖ్య శిష్యులైన మహాపూర్ణులను (పెరియనంబి) కంచికి పంపించారు. అప్పటికప్పుడే, భగవద్రామానుజులు శ్రీ యాదవ ప్రకాశుల శిష్యత్వాన్ని విడిచి శ్రీ కాంచీపూర్ణులను (తిరుకచ్చినంబి) తమకు పంచసంస్కారాలను అనుగ్రహించవలసినదని వేడినా, అవరవర్ణుడైన తాను అగ్నిని సంధానించి బ్రాహ్మణుడైన భగవద్రామానుజులకు చంక్రాంకనం చేయడం శాస్త్ర విరుద్ధమని చెప్పి ఆయన తప్పించుకొన్నారు. అప్పుడు భగవ ద్రామానుజులు శ్రీ వరదరాజస్వామికి తీర్థకైంకర్యంచేస్తూ ఉన్నారు.

గురువు ఆదేశాన్ని అనుసరించి పెరియనంబి కంచికివచ్చి శ్రీ వరదరాజ స్వామిదగ్గిర స్తోత్రరత్నంనుండి శ్లోకాలను భక్తితో పఠించడం ప్రారంభించారు. స్వామికి తీర్థకైంకర్యం చేయడానికివచ్చిన భగవద్రామానుజుల చెవిని ఈ శ్లోకం పడింది:

"స్వాభావికా నవధికాతి శయేశితృత్వం
నారాయణ త్వయి నమృష్యతి వైదికః కః ।
బ్రహ్మ శివశ్శతమఖఃపరమస్స్వరాడి
త్యేతేఽపియస్య మహి మార్ణవ విప్రుషస్తే॥"

భగవద్రామానుజులవారు తన్మయులై ఆశ్లోకాన్ని విని దాని శబ్దసౌష్ఠవానికి, భావగాంభీర్యానికి, అర్థచమత్కృతికి, భక్తి నిర్భరతకు ముగ్ధులయ్యారు. శ్రీమన్నా రాయణుని సంబోధిస్తూ-ఆయన సర్వానికి అధీశుడని, ఈ అధీశత్వం స్వాభావిక మని, అవధిలేనిదని, వేదవిదు డెవడూకాదనలేనిదని – బ్రహ్మ, శివుడు, ఇంద్రుడు అనేవారందరు ఆయన మహిమార్ణవంలో నీటిబొట్లు అని వర్ణించిన ఈ శ్లోకం భగవద్రామానుజులవారి హృదయానికి హత్తుకొంది. వెంటనే వారు, శ్రీ మహాపూర్ణులకు నమస్కరించి "స్వామీ! ఈ శ్లోకం ఏకృతిలోనిది? దీన్ని రచించిన మహానుభావులెవరు?"అని ప్రశ్నించారు. శ్రీ పెరియనంబి. భగద్రామాను జుల భక్తి తత్పరతకు సంతోషించి ఆశ్లోకం "స్తోత్రరత్నం"అనే స్తుతికావ్యంలోని దని; తద్రచయిత తమ గురువులు, మహావిద్వాంసులు, విశిష్టాద్వైత సిద్ధాంత పరి పోషకులు శ్రీనాథమునుల పౌత్రులు అయిన శ్రీ యామునాచార్యులవారని చెప్పారు.

ఇది విన్న వెంటనే, భగవద్రామానుజులు-శ్రీరంగం పోయినవారి దర్శనంచేసి పంచ సంస్కారలాభం పొందాలని నిర్ణయించుకొని చేతులుజోడించి, తమ్ము శ్రీరంగం తీసుకొనిపోయి శ్రీ యామునాచార్యులవారి దర్శనభాగ్యం కలిగించవలసినదని శ్రీ పెరియనంబిని వినయపూర్వకంగా అర్థించారు.

అప్పుడు శ్రీ పెరియనంబి చాలా ఆనందించి తమ గురువుల ఆజ్ఞననుసరించే భగవద్రామానుజులను శ్రీరంగం తీసుకొనిపోవడానికి వచ్చినట్లు చెప్పారు. వెంటనే బయలుదేరుదాము అని భగవద్రామానుజులు శ్రీ పెరియనంబిని తొందరపెట్టి కంచినుండి శ్రీరంగానికి బయలుదేరారు. కాని, శ్రీరంగనాథుని లీలావిలాసం అన్యథాఉంది. వీరు శ్రీరంగం చేరేటప్పటికే శ్రీ యామునాచార్యులవారు పరమ పదించారు. శ్రీ యామునుల చరమదేహాన్ని చూచి, వారి ఉపదేశలాభం తమకు లభించలేదేఅని భగవద్రామానుజులు దుఃఖితులై వారి దేహాన్ని పరికించగా-ఆ మహాపురుషుని దక్షిణహస్తమందలి అంగుళిత్రయంముడుచుకొని ఉండడం గుర్తిం చారు ఆవిధంగా వారు జీవించిఉన్నప్పుడులేదని అక్కడివారు చెప్పినవెంటనే పరేంగితజ్ఞులైన భగవద్రామానుజులవారు శ్రీ యామునాచార్యులవారి చరమాశయా లను క్షణంలో ఊహించి అందరు వింటూఉండగా ఇలా ప్రతిజ్ఞచేశారు:

"అహంవిష్ణు మతేస్థిత్వా జనానజ్ఞానమోహితాన్
పంచ సంస్కార సంపన్నాన్ ద్రావిడామ్నాయపారగాన్
ప్రపత్తి ధర్మ నిరతాన్ కృత్వారక్షామి సర్వదా
సంగృహ్య నిఖిలానర్థాన్ తత్త్వజ్ఞాన పదంశుభమ్"
శ్రీభాష్యంచ కరిష్యామి జనరక్షణహేతునా
జీవేశ్వరాదీన్ లోకేభ్యః కృపయాయః పరాశరః
సందర్శయన్ తత్స్వభావాన్ తదుపాయగతీంస్తథా
పురాణరత్నం సంచక్రేమునివర్యః కృపానిధిః
తస్యనామ్నా మహాప్రాజ్ఞ వైష్ణవస్యచ కస్యచిత్
అభిదానం కరిష్యామి నిష్క్రియార్థం మునేరహమ్॥"

(ప్రపన్నామృతమ్ – అనంతాచార్యులు)

నేను శ్రీవైష్ణవమతంలోఉండి అజ్ఞాన మోహితులైన ప్రజలను పంచసంస్కార

సంపన్నులుగాను, ద్రావిడ వేదపారంగతులుగాను, ప్రవత్తి ధర్మ నిరతులుగాను చేసి సర్వదా రక్షిస్తానుఅని భగవద్రామానుజులు ప్రతిజ్ఞచేయడంతో, శ్రీయాము నాచార్యుల ముడిచినవేలు ఒకటి లేచి ఋజువుగా అయింది.

నిఖిలార్థ ప్రతిపాదకం, తత్త్వజ్ఞాన నిర్ణాయకం అయిన శ్రీభాష్యం రచిస్తాను అని రెండో ప్రతిజ్ఞ చేయడంతో శ్రీ ఆళవందారుల ముడిచిన ఇంకో వేలుకూడాలేచి ఋజువుగా అయింది.

జీవేశ్వరుల ప్రకృతుల స్వరూప స్వభావాలను వాటి ఉపాయగతులను వివరించే పురాణరత్నం అయిన విష్ణుపురాణాన్ని వ్రాసిన కృపానిధి పరాశరుని పేరు ప్రాజ్ఞుడైన ఒక వైష్ణవునకు-ఆఋషి ఋణవిమోచనంకోసం- పెడతాను అని మూడో ప్రతిజ్ఞకూడా చేయడంతో శ్రీయామునాచార్యులవారి ముడిచి ఉన్న మూడో వేలుకూడా లేచింది.

అక్కడ ఉన్న వైష్ణవులందరూ భగవద్రామానుజుల ప్రజ్ఞాప్రాభవాలను భక్తి ప్రపత్తులను ఉగ్గడించినా, "శ్రీయామునాచార్యులులేని శ్రీరంగం నాకువద్దు" అని భగవద్రామాజులు కంచికి తిరిగివచ్చివేశారు. తిరిగివచ్చి ఇదివరలో లాగే శ్రీవరదరాజస్వామిసేవ, శ్రీకాంచీపూర్ణులను (తిరుకచ్చినంబి) భక్తి శ్రద్ధలతో గౌరవించడం ఆయనకు నిత్యకృత్యాలు అయ్యాయి. తిరుకచ్చినంబి అంగీకరించ లేదు గనుక పంచ సంస్కారలాభం అప్పటికింకా ఆయనకు కలగలేదు. తమ కర్తవ్య విషయం నిర్ణయించుకోవడానికి శ్రీవరదరాజస్వామితో నిత్యం సంభాషించే-శ్రీకాంచీపూర్ణులను తమ మనస్సులోఉన్న ఆలోచనలకు సమాధానాలు శ్రీస్వామిని అడగి తెలుసుకోవలసినదిగా భగవద్రామానుజులు అర్థించారు. ఆనాటి రాత్రి పరమ భక్తులైన శ్రీకాంచీపూర్ణులు తాము తాళవృతంతో స్వామిని సేవిస్తున్నప్పుడు ప్రస్తావన చేయగా స్వామి "రామానుజుల మనస్సులో ఆరు విషయాలున్నాయి. వాటి సమాధానాలు ఇవి"అని వివరించారు.

1. అహమేవ పరబ్రహ్మ జగత్కారణకారణమ్ ।
2. క్షేత్ర క్షేత్రజ్ఞయోర్భేదస్సిద్ధ ఏవమహామునే ।
3. మోక్షోపాయోన్యాస ఏవజనానాం ముక్తిమిచ్ఛతామ్ ।
4. మద్భక్తానాం జనానాం చ నాంతిమ స్మృతిరిష్యతే ।

5. దేహావసానే భక్తానాం దదామి పరమంపదమ్ ।
6. పూర్ణాచార్య మహాత్మానం సమాశ్రయ గుణాశ్రయమ్ ।

ఇతి రామానుజార్యాయ మయోక్తంవద సత్వరమ్ । (ప్రపన్నామృతమ్ । )

మరునాడు, తిరుకచ్చినంబి భగవద్రామానుజులకు శ్రీవరదరాజస్వామి చెప్పిన పైసమాధానాలను చెప్పడంతో ఆయనకు తాను విశ్వసిస్తూ ఉన్నవి సత్యమే అని విశ్వాసం కుదిరింది. అవి విశిష్టాద్వైత సిద్ధాంతాలే అయ్యాయి. అన్ని కారణాలకు కారణం పరబ్రహ్మఅయిన శ్రీమన్నారాయణుడే అని, క్షేత్ర క్షేత్రజ్ఞులకు భేదం సహజ సిద్ధమైనదని, ముముక్షువులకు న్యాసంకంటె మించిన మోక్షోపాయంలేదని, శ్రీమన్నారాయణుని భక్తులు మరణ సమయంలో భగవంతుని స్మృతికి తెచ్చుకొనకపోయినా వరవాలేదని, మహాత్ములైన పూర్ణాచార్యులను గురువుగా స్వీకరించుమని-శ్రీవరదరాజస్వామి చెప్పినవన్నీ-భగవద్రామానుజుల మనస్సులో మెలుగుతూఉన్నవే గనుక-ఆయనకు తృప్తికలిగింది.

వెంటనే భగవద్రామానుజులు శ్రీరంగానికి బయలుదేరారు. అక్కడ, శ్రీయామునాచార్యులవారు పరమపదంచేరినతరువాత శ్రీవైష్ణవలోకానికి "పెద్దదిక్కు" లేకపోవడం జరిగింది. దీనితో శ్రీయామునాచార్యులవారి శిష్యులైన కొందరు ఆలోచించి తమ సమాజానికి నాయకత్వం వహించగలిగిన భగవద్రామానుజులవారిని ఏదోవిధంగా శ్రీరంగం తీసుకొని రావలసినదని మహాపూర్ణులను పంపించారు. ఆయన, భార్య బయలుదేరి వస్తూఉండగానే మధురాంతకంలో, కంచినుండి శ్రీవరదరాజస్వామి ఆజ్ఞానుసారం మహాపూర్ణులను గురువుగా గ్రహించాలని శ్రీరంగం బయయదేరి వస్తూఉన్న భగవద్రామానుజులు తారసపడ్డారు. ఇద్దరూ ఎంతోసంతోషించారు. కంచికిపోయిన తరువాత పంచసంస్కారాలను పొందవచ్చునని గురువుగారు అంటూఉన్నా, భగవద్రామానుజులు "శరీరం అశాశ్వతం; కనుక ఇక్కడే నన్ను" "సంస్కరించి అనుగ్రహించవలసిన"దని మహాపూర్ణులను ప్రార్థించారు. మహాపూర్ణులు, భగవద్రామానుజులవారి ఆతురతను అర్థంచేసుకొని అక్కడే అగ్నిని సంధానించి వారికి పంచ సంస్కారాలు చేశారు. తరువాత గురువుగారితో కంచి చేరిన భగవద్రామానుజులు, గురుపత్నిని గురువుగారిని తమ ఇంటనే ప్రవేశపెట్టుకొని వారివద్ద దివ్యప్రబంధాదులను అధ్యయనంచేస్తూ కాలంగడిపారు. కాని, భగవద్రామానుజులవారి భార్య రక్షకాంబ కారణంగా మహాపూర్ణుల భార్యకు

ఆమెకు కలహంవచ్చి; మహాపూర్ణులు, భార్యతో - భగవద్రామానుజులకు చెప్పకుండ-కంచినివిడిచి శ్రీరంగానికి వెళ్ళిపోవలసివచ్చింది. భగవద్రామానుజులు చాలా చింతించి, ఇటువంటి తప్పులే ఆమె ఇంకా రెండుచేయడంతో ఆమెను పుట్టింటికి పంపివేసి తాము సన్న్యసించారు. శ్రీయామునాచార్యుల దివ్యచరణ రాజీవాలను మనస్సులో నిలుపుకొని, శ్రీవరదరాజస్వామివారిని గురువుగా భావించుకొని కాషాయాన్ని ధరించి, దండకమండలాలు చేతబట్టి సన్న్యాసాశ్రమ స్వీకారంచేశారు. శ్రీ వరదరాజస్వామి అర్చకముఖంగా వారికి "యతిరాజ" బిరుదాన్ని ప్రసాదించారు. తమ దేవాలయాపరణలోనే వారికి మఠం ఏర్పాటుచేశారు. ఇక్కడ మొదటి శిష్యులుగా పూర్వాశ్రమంలో అయన మేనల్లుడయిన శ్రీ దాశరథి 'కూర' గ్రామానికి చెందిన శ్రీ కూరేశుడు అనువారు వచ్చిచేరారు. ఇద్దరూ విద్యావినయసంపన్నులు. అనంతరకాలంలో శ్రీ గోష్ఠీపూర్ణులతో భగవద్రామానుజులు వారినిగూర్చి దాశరథి నా "దండం" అని, కూరేశుడు నా "యజ్ఞోపవీతం" అని అన్నారు శ్రీ దాశరథి భరతుని అంశం అని కూరేశులు శ్రీరాముని అంశ అని సంప్రదాయజ్ఞులలో ఉంది. భగవద్రామానుజులు ఆశ్రమ స్వీకారం చేయడంతో వారికి లౌకికమైన బంధాలనుండి విముక్తి కలిగి అది పునర్జన్మ తుల్యమయినది. అప్పటికి వారి వయస్సు 32 సంవత్సరాలు నిండినాయి. శ్రీ శంకరభగవత్పాదులు (జననం క్రీ॥శ॥ 788) 32 సంవత్సరాలకు తాము వచ్చిన పనిని ముగించుకొని సిద్ధి పొందారు. ఈ విషయాన్ని గురించి పూజ్యశ్రీ శ్రీమన్నారాయణరామానుజ జీయరు స్వామివారు తాము రచించిన "శ్రీరామానుజావతరణము" అను వ్యాసంలో (శ్రీరామానుజ కీర్తి కౌముది-శ్రీ వైష్ణవ ధర్మవిజ్ఞాన సర్వస్వము-ఆఱవభాగము, 1985-పుట-51) ఇలా సెలవిచ్చారు:

"శంకరాచార్యులు 32 సంవత్సరములు మాత్రమే ఈ లోకముననుండిరి. శ్రీమద్రామానుజులు కూడ 32 సంవత్సరముల వఱకు పూర్వమతములనన్నింటిని సింహావలోకనము చేయుచుండిరి. 32 సంవత్సరముల ప్రాయము పూర్తియగుసరికి శంకరాచార్యుల జ్ఞానయోగపూర్వకమైన అద్వైతమత విషయసారమును గ్రహించినవారై అనంతరము అనగా-33 సంవత్సరముల ప్రాయమున భక్తి-ప్రపత్తి పూర్వకవిశిష్టాద్వైత ప్రచారమునకు తురీయాశ్రమ స్వీకారముతో బయలుదేరెను"

భగవద్రామానుజులవారు కల్యబ్ధి 4119 నాటి పింగళ చైత్ర శుద్ధపంచమి

గురువారం ఆర్ద్రానక్షత్రం కర్కాటలగ్నంలో (4-4-1017 క్రీ॥శ॥) చెన్నపురికి సమీపంలో ఉన్న శ్రీ పెరుంబూదూరు గ్రామంలో జన్మించారు. ఈ మహానుభావులు శేషాంశసంభూతులు. ఈ ఆదిశేషులు సామాన్యులు కారు. తమ శరీరం తోనే శ్రీమహావిష్ణువునకు-శయ్య, ఆసనం, వస్త్రం ఛత్రం మొదలైన ఉపకరణాలు చేసేపని చేసేవారు, శ్రీయామునాచార్యులు తమ స్తోత్రరత్నంలో ఇలా వ్రాశారు:

"నివాసశయ్యా సనపాదుకాంశుకో
పధానవర్షాతపవారణాదిభిః।
శరీరభేదై స్తవశేషతాంగతై
ర్యథోచితం శేష ఇతీర్యతేజనైః॥" (శ్లోకం-40)

ఈ ఆదిశేషుడు తానే అవతరించి జీవులను విష్ణుసేవా పరతంత్రులను చేస్తానని శ్రీ మహావిష్ణువుతో చెప్పి భగవద్రామానుజులుగా అవతరించినట్లు "ఆచార్యసూక్తి ముక్తావళి" (శ్రీమాన్ నంబూరి కేశవాచార్యులు) ఇలా చెప్తోంది.

"సర్వజ్ఞుఁడై సర్వశక్తిసంపన్నుఁడై
సత్యసంకల్పుఁడై సర్వశేషి
యైన సర్వేశ్వరుండమిత జన్మములెత్తి
యొక్కాత్మనైనను జక్కఁబఱుప
శక్తుండుగాక విచారింప, శేషుఁడా
హరితోడఁ బంతములాడి వచ్చి
రామానుజాచార్యభూమిక ధరియించి
జ్ఞానాంజనంబున మానవులకుఁ
జూపె నచ్యుత పదదాస్య సులభ ధనము
నిట్టికలిమిచ్చు సద్గురుండెందు గలఁడు
యితనియంఘ్రు లుపాయము పేయమనుచు
వాదిభీకరగురుఁడనె మోదమలర"

ఆదిశేషుడు తానే బద్ధజీవులను హరిసేవద్వారా తరింపజేయడానికి అవతరించాడు.

గనుకనే, భగవద్రామానుజ సంబంధం లేకుండ ముక్తి లభించదని కంఠోక్తిగా చెప్పడం జరిగింది.

"తస్మాదయం లక్ష్మణదేశికేంద్రః
సాక్షాద్ధరిర్లోక గురుర్మహాత్మా ।
తస్యైవ సంబంధబలేనతేన
మోక్షోహి సిద్ధోనిఖిలాత్మకానామ్ ॥"

భగవద్రామానుజులవారి జననీజనకులను గురించి వారి వంశమర్యాదికాన్ని గురించి "హిందూమతవైశిష్ట్యము" అనే తమ వ్యాసంలో– (శ్రీరామానుజ కీర్తి కౌముది శ్రీ వైష్ణవ ధర్మవిజ్ఞాన సర్వస్వము మొదటిభాగము-సంపాదకుడు, విద్యాభూషణ - ఉపన్యాసక రత్న-కవితావిశారద ధనకుధరం వరదాచార్యులు శ్రీరామానుజ కీర్తికౌముదీ గ్రంథమాల–శ్రీ లక్ష్మినారాయణపురము, గుంటూరు) "కవిత్రయమిత్ర-కవితాకళానిధి– కవికంఠీరవ-విమర్శక శిరోమణి-విద్యారత్న" శ్రీమాన్ గొట్టుముక్కల రమాకాంతాచార్యులు బి.ఏ. గారు ఇలా వ్రాశారు.

"అనాది సిద్ధంగా తెనుఁగు దేశమైన చెన్నపురికి సుమారు 26 మైళ్ళ దూరమునున్న 'శ్రీ పెరంబూదూరు' అను గ్రామములో శ్రీరామానుజాచార్యులు అవతరించెను. ఆ గ్రామవాసులలో కొందరు అరవదేశమునకు వలసవెళ్ళిన బ్రాహ్మణులను వడమలు (ఉత్తరాది వాండ్లు) అని పిల్చుచుండిరి. శ్రీరామానుజాచార్యులు వడమవైష్ణవ కుటుంబములో జన్మించినవాఁడు. శ్రీ శంకరభాష్యకారులు తన వేదాంతభాష్యత్రయమునందును విష్ణుసహస్రనామభాష్యమునందును విష్ణు పారమ్యమును బహుముఖముల స్థాపించిన పరమవైష్ణవశిఖామణి* భాగవతమతములోని వేదాంతతత్త్వభాగము భోధాయనవృత్తికారుని ద్వారా రామానుజుని తండ్రి వరకును అవలంబింపఁబడిన భాగవతసంప్రదాయములోని వాఁడే-శ్రీరామానుజులు శ్రీరామానుజుని తండ్రి పేరు కేశవభట్టారకుఁడు. ఈయన ఇప్పటి రామానుజీయ

---

* శ్రీ శంకర భగవత్పాదులను గూర్చి శ్రీ ఆచార్యులుగారు వ్రాసిన ఈ వాక్యంతో భగవత్పాదుల అనుయాయులు ఏకీభవించక పోవచ్చును. నిర్గుణ బ్రహ్మవాదులకు ఆ అవాఙ్మానసగోచర బ్రహ్మాన్ని ఏ పేరుతో పిలిచినా ఒకటే! అందుకు తగినట్లుగా ఆ "బ్రహ్మం" వారిచేత నిషేధ

సంప్రదాయములోని వడగల శ్రీ వైష్ణవులవలె శ్రౌతయజ్ఞము లొనర్చి 'సోమయాజి' యను బిరుదము గల యజుర్వేద శిక్షాశ్రౌతముమీఁద, ననేకములగు ఉద్గ్రంథములను రచించిన విద్వాంసుఁడు. ఈయన యింటిపేరు అసూరివారు, మేనమామలు తిరుమలవారు, భాగినేయులు కందాడవారు, తిరుమలయనఁగా- తిరుపతి. తిరుపతివలెనే 'కందాడ' యనునది గ్రామనామదేయము. శ్రీవారి యింటిపేరు అసూరివారనుటను చూడఁగా- వీరి వంశము విద్వద్వంశమే యని తోచుచున్నది. తండ్రిగారు విద్వాంసుఁడనుట సత్యమేగదా! ఆయన తల్లిగారి పేరు కాంతిమతీదేవి" (పుట-30)

సుప్రసిద్ధ విద్వాంసులైన శ్రీమాన్ గొట్టుముక్కల రమాకాంతాచార్యులు

---

ముఖాన్ని ప్రస్తావించబడింది. ఆచార్య శంకరుల స్తోత్రాది రచనలనుబట్టి ఆయనను పిలువదలిస్తే ఆయన్ని వైష్ణవుడు, శైవుడు, శాక్తేయుడు అని ఇంకా ఎన్ని పేర్లతోనో పిలువవలసివస్తుంది. మానవుల ఉపాసనా సౌకర్యార్థం అద్వైతులు కూడా అర్చావతారాలను, స్తోత్రాలను అంగీకరిస్తారు. ఏతత్ఫ్రలాపలం-చిత్తశుద్ధి, జ్ఞానసక్తి మొదలైనవి కలగడం, పంచాయతన పూజ సర్వవిదితం. (ఆదిత్యమంబికాం విష్ణుం గణనాథం మహేశ్వరం బ్రాహ్మణః పూపియేత్నంచ పంచపూజాపరాయణః॥) ఇష్ట దైవాన్ని మధ్య ఉంచి మిగిలిన నలుగురిని నాలుగు దిక్కుల ఉంచి పూజించడం సంప్రదాయం. ఇది భక్తికి, పూజకు ఉన్న ప్రాధాన్యాన్ని తెలుపుతోంది. నిర్గుణ బ్రహ్మవాదులైన శ్రీ శంకరులు కూడా భక్తికి సముచితస్థానం ఇచ్చారు. వివేకచూడామణిలో "మోక్షసాధనసామగ్ర్యాం భక్తిరేవ గరీయసీ" అన్నారు. వారి దృష్టిలో క్రమం-భక్తివల్ల జ్ఞానం, జ్ఞానంవల్ల మోక్షం అనేది. వేదాంతపదజాలానికి-నిర్గుణ బ్రహ్మవాదులు, సగుణబ్రహ్మవాదులు ఇచ్చే అర్థాలు, నిర్వచనాలు వేరువేరుగా ఉంటాయి. వ్యాఖ్యానాలు-వారి వారి సంప్రదాయాల సిద్ధాంతాలకు అనుగుణంగా ఉండడం సహజమేగదా! ఈ సంప్రదాయ వైవిధ్యాన్ని (వైరుధ్యాన్ని) కాపాడుతూ వాటిని ఏకసూత్రానికి కట్టి ఉంచింది-అన్ని సంప్రదాయాలు, అన్ని సంప్రదాయాలవారు వేదప్రామాణ్యాన్ని అంగీకరించడం అనే ముఖ్య విషయం! సత్యం బహుముఖీనం అనే దృఢ విశ్వాసం!

20)

గారు (1882-1962) భగవద్రామానుజులవారి పూర్వజుల ధార్మిక సంప్రదాయాదులను క్రోడీకరించి చెప్పిన పైవాక్యాలు, ఉదయవరులను మనంబాగా అర్థంచేసుకోవడానికి పనికి వస్తాయి అని ఉదాహరించాను.

భగవద్రామానుజులవారు-ఉపనయనాది సంస్కారాదులన్నీ తండ్రిగారు సకాలంలోనిర్వర్తించగా వారివద్దనే వేదవిద్యనభ్యసించారు. కుశాగ్రబుద్ధులైనవారు పుంభావసరస్వతులై శాస్త్రాది విద్యల నభ్యసించారు. తండ్రిగారి ఆజ్ఞ ప్రకారం గృహస్థాశ్రమాన్ని స్వీకరించారు. సత్కులప్రసూన, రూపవతి అయిన ఆ గృహిణి పేరు రక్షకాంబ (రక్షకాంబాళ్) భగవద్రామానుజుల పితృపాదులైన శ్రీ కేశవయజ్వ తను పుత్రికను పురుషమంగళమనే అగ్రహారంలోని శ్రీ అనంత దీక్షితుల కిచ్చి వివాహం చేశారు. భగవద్రామానుజుల ఈ సోదరి పుత్రుడే భావి కాలంలో శ్రీ దాశరథి అనే పేరుతో ప్రఖ్యాతికి వచ్చారు. సాంసారికమైన ఈ బాధ్యతలను తీర్చుకొని శ్రీ కేశవభట్టారకులు పరమపదించారు. అప్పుడు భగవద్రామానుజులవారు, శ్రీ పెరుంబూదూరు విడిచి తల్లితో భార్యతో కంచికిచేరి తమ పాండిత్యానికి మెరగులు పెట్టుకోవాలని కృషి ప్రారంభించారు.

అక్కడవారు వేదాంతాది విషయాలను అద్వైతాచార్యులైన శ్రీ యాదవ ప్రకాశులవద్ద గ్రహించడానికి ప్రారంభించి గురువునకును తమకును సిద్ధాంత విషయాలలో భేదాభిప్రాయాలు వచ్చి అక్కడ చదువు విరమించడం మనకు తెలిసిన విషయమే. తరువాత శ్రీ యామునాచార్యులవారి శిష్యులనుండి వివిధ విషయాలు గ్రహించారు. తమకు పంచసంస్కారాలు చేసిన శ్రీ మహాపూర్ణుల (పెరియనంబి) నుండి శ్రీ యమునాచార్యులవారి గీతార్థసంగ్రహం, సిద్ధిత్రయం ఆగమ ప్రామాణ్యం-అనే ఉద్గ్రంథాల విషయాలను సంపాదించారు. భగవద్రామానుజులవారికి గురువులైన శ్రీ మహాపూర్ణులు తమ కుమారులైన శ్రీ పుండరీకాక్షులను వారికి శిష్యునిగా చేశారు. భగవద్రామానుజులవారు శ్రీ గోష్ఠిపూర్ణుల (తిరుక్కోట్టియూర్‌నంబి) నుండి మంత్రోపదేశాన్ని పొంది దాన్ని వెంటనే సర్వులకు ఉపదేశించి గురువులవల్ల "ఎంపెరుమానార్" బిరుదపొందడం మనకు తెలిసినదే. ఈ గురువుగారు తమ పుత్రులైన శ్రీ సౌమ్యనారాయణులను భగవద్రామానుజులకు శిష్యులనుగా చేశారు. శ్రీ గోష్ఠిపూర్ణులే భగవద్రామానుజుల ఉదారతను మెచ్చుకొని నాటినుండి శ్రీ వైష్ణవదర్శనం "శ్రీరామానుజదర్శనం" అని పేరు పొందుతుంది అని వారి అధికాన్ని వ్యక్తం చేశారు.

భగవద్రామానుజులవారు శ్రీమాలాధరులు (తిరుమలయాండాన్)గురువుగా "భగవద్విషయం" పూర్ణంగా గ్రహించారు. "అరియాక్కాలత్తు శ్నే" మొదలైనవాటి అర్థవివరణంలో గురుశిష్యులకు అభిప్రాయ భేదాలువచ్చి, శ్రీమాలాధరులు పాఠం ఆపివేయగా కార్యాంతరంమీద అక్కడికివచ్చిన శ్రీగోష్ఠీపూర్ణులు విషయం తెలుసుకొని శ్రీమాలాధరులతో భగవద్రామానుజులు సామాన్యులు కారని "సాక్షాత్తు యామునాచార్యులేసుమా! అనినచ్చజెప్పి పాఠంతిరిగిప్రారంభింపజేశారు. తరువాత శిష్యుని వైశిష్ట్యాన్ని గుర్తించిన శ్రీమాలాధరులు తమపుత్రులైన శ్రీ సుందరబాహువును ఆయనకు శిష్యునిగా చేశారు. తరువాత భగవద్రామానుజాచార్యులు శ్రీ యామునాచార్యుల పుత్రులైన శ్రీవర రంగార్యుల సేవ ఆరుమాసాలు చేసివారివల్ల అత్యంత గూఢమైన తాత్త్వికవిషయాలను గ్రహించారు దీనివల్ల ఆచార్య ప్రపత్తి పంచమోపాయంగా గ్రహించి, ఉపాయోపేయాలు-సాధనాగమ్యాలు-రెండూ గురువే అనే పరమసత్యం అనుభవానికి తెచ్చుకొన్నారు:

"గురురేవ పరంబ్రహ్మ గురురేవ పరంధనమ్ ।
గురురేవ పరఃకామో గురురేవపరాయణమ్ ।
గురురేవ పరావిద్యా గురురేవ పరాగతిః ।
యస్మాత్తదుపదేష్టా సౌతస్మాద్గురు తరోగురుః ।
ఉపాయశ్చాప్యుపేయశ్చ గురు రేవేతి భావయ॥

(శ్రీ వేదాంత దేశికులవారు తమ రహస్యత్రయసారమ్"లో (అధ్యాయం-28) "సాత్యకితంత్రం" లోనిదని ఉదాహరించినది. మద్రాసు శ్రీరామకృష్ణ మఠంవారు ప్రచురించిన 'Life of Sri Ramanuja by Swami Ramakrishnanada' పుట-157-ద్వితీయ ముద్రణం 15-2-1965)

తమకు తెలిసిన సర్వరహస్యాలు ఉత్తమ శిష్యులైన భగవద్రామానుజుల పరంచేసి శ్రీ వర రంగార్యులవారు బ్రహ్మచారులు గనుక తమ ప్రియ సోదరులైన శ్రీ కొట్టనంబిని ఆయనకు శిష్యులుగా చేశారు.

భగవద్రామానుజులవారికి పూర్వాశ్రమంలో మేనమామలు, శ్రీ యామునాచార్యులవారి శిష్యులు అయిన శ్రీశైలపూర్ణులు (తిరుమలైనంబి) తిరుపతి నివాసులై ఉన్నప్పుడు యతిరాజులైన భగవద్రామానుజులు వారినుండి శ్రీమద్రామాయణ

రహస్యాలను గ్రహించారు. అంతకుపూర్వమే శ్రీ శ్రీనివాసుల సేవచేయడానికి తిరుమలపోయి అక్కడ బృందావనం స్థాపించి నిత్యకైంకర్యం చేయడానికి పోయిన శ్రీ అనంతాచార్యులనే భగవద్రామానుల శిష్యులు, తమగురువులు తిరుమల వచ్చినప్పుడు వారికి స్వాగతం పలికారు. తమ శిష్యులకు భగవద్రామానుజులవారు "తిరువాయిమొళి"లోని "శిందుపూమగిళుం తిరువేంగడత్తు" అనేదాన్ని బోధిస్తున్నప్పుడు, శ్రీ శ్రీనివాసులకు నిత్యకైంకర్యం చేయడం ఎలాగఅని ఆలోచిస్తున్నప్పుడు శ్రీ అనంతాచార్యులు తాను ఆ పనికి పూనుకొంటానని చెప్పి, గురువు అనుమతితో తిరుమలవచ్చి స్థిరపడ్డారు. భగవద్రామానుజులు తిరుపతినుండి తిరిగివచ్చేటప్పుడు పూర్వాశ్రమంలో తమ పినతల్లి కొడుకు, కొంతకాలం తాము శ్రీ యాదవప్రకాశుల వద్ద వేదాంత శాస్త్రాధ్యయనం చేస్తున్నప్పుడు తమ సతీర్థ్యుడు, అప్పుడు తిరుపతిలో శ్రీశైలపూర్ణుల సేవచేస్తూ ఉన్న శ్రీ గోవిందుని తమతో తమ గురువుల అనుమతి పొంది తీసుకొని శ్రీరంగం వచ్చారు. శ్రీ గోవిందులు తరువాత "ఎంబార్" అనీ మహాచార్యుడు అనీ పేరుపొంది శ్రీ రామానుజార్యాష్టపదిని రచించి ప్రఖ్యాతికి వచ్చారు. భగవద్రామానుజులను కాశీయాత్రలో మట్టుపెటాలని సంకల్పించిన శ్రీ యాదవ ప్రకాశుల దురాలోచనను భగవద్రామానుజులవారికి ముందుగా తెలిపి ఆయన్ని హెచ్చరించింది ఈ గోవిందమిత్రులే.

భగవద్రామానుజులు తాము ఆదిశేషుల అవతారమైనా-మహాభక్తులు, విద్వచ్ఛిరోమణులు అయిన సద్గురువులను సేవించి తద్ద్వారా గురువుయొక్క ప్రాధాన్యాన్ని లోకానికి తెలిపి, ఉభయ వేదాంతాలను కూలంకషంగా గ్రహించి ప్రసిద్ధులయ్యారు. వీరికి "పంచాచార్యపదాశ్రయః అనే బిరుదు ఇందువల్లనే లభించింది. శ్రీమన్నారాయణుని అవతారాలైన రామకృష్ణాదులకే గురువులుండడం మన సంప్రదాయంలోని విశిష్టత!

సంప్రదాయజ్ఞులైన పెద్దలు ఆళ్వారుల భగవద్రామానుజుల అవతార ప్రస్తావన-ఉపనిషత్తులలో, పురాణాదులలో ఉన్నట్లు నిరూపించారు. వీటిలో అష్టోత్తర శతోపనిషత్తులలోని కృష్ణోపనిషత్తు, బ్రహ్మవైవర్త పురాణం, పాద్మ పురాణం బ్రహ్మాండ పురాణం, భవిష్యపురాణం, నారదీయపురాణం, స్కాంద పురాణం, భార్గవపురాణం మొదలైనవి ఉన్నాయి. వీటిలో కొన్నింటిలో నైనా ఆళ్వారుల, ఆచార్యుల ఆవిర్భావం తరువాత ఈవిషయాలు చేర్చబడి ఉండవచ్చునని భావించే ఆధునిక పరిశోధకులు కొందరు లేకపోలేదు!

*కృష్ణోపనిషత్తులో ఆదిశేషుని అవతారాలను గూర్చి చెప్పేటప్పుడు ఇలా ఉంది:

"స ఏవ భగవాన్ భగవంతం బహుధావిప్రియమాణః అఖిలేన స్వేన రూపేణ యుగేయుగే తే నైవ జాయ మానః స ఏవ సౌమిత్రే రై క్ష్వాకః।............స ఏవ భగవాన్ సంధికాలే శారదాభ్ర సన్నికాశో రౌహిణే యో వాసుదేవః సర్వాణి గదాద్యాయుధ శాస్త్రాణి వ్యాచక్షో నైకాన్ రాజన్య మండలాన్ని రాచికీర్షుః భూభారమఖిలం నిచఖాన। స ఏవ భగవాన్ యుగేయుగే తురీయేఽపి బ్రహ్మకులే జాయమానః సర్వాఉపనిషదః ఉద్దిధీర్షుః, సర్వాణి దర్మశాస్త్రాణి విస్తారయిష్ణుః, సర్వా నపి జనాన్ సంతార యిష్ణుః, సర్వా నపి వైష్ణవాన్ దర్మాన్ విజృంభ యన్ సర్వానపి పాషం డాన్ నిచఖాన। స ఏవ జగదంతర్యామీ, సఏవ సర్వాత్మకః, స ఏవముముక్షుభిర్ధ్యేయః, స ఏవమోక్ష ప్రదః ఏవం స్మృత్వా సర్వేభ్యో పాపేభ్యో ముచ్యేత। తన్నామ సంకీర్తయన్ విష్ణుసాయుజ్యం గచ్ఛతి.......... "

స్థూలంగా దీనిలోని ముఖ్య విషయం ఇది: ఆదిశేషుడే ప్రతియుగంలోను అయినతో (భగవంతునితో) అవతరిస్తాడు. ఆయనే (ఆదిశేషుడు)ఇక్ష్వాకువంశీయు డైన సౌమిత్రి (లక్ష్మణుడు) ద్వాపర కలియుగసంధికాలంలో వసుదేవుని పుత్రు డైన, శరత్కాల మేఘసదృశ దేహకాంతిగల రౌహిణీయుడు (రోహిణి కొడుకైన బలరాముడు) కలియుగంలో (తురీయ/నాలుగో) బ్రాహ్మణ కులంలో ఆయనే జన్మించి సర్వజనులను తరింపజేస్తాడు. పాషండులను నశింపజేస్తాడు. ఆయనే అందరికీ మోక్షప్రదుడై ఉంటాడు.

నారదీయ పురాణంలో శ్రీమన్నారాయణుడే మహర్షులకు- ఆదిశేషుని గూర్చి స్పష్టంగా ఇలా చెప్పినట్లుంది:

---

* శ్రీ రామానుజ వాఙ్మయము-తద్విశేషము: విద్యావారిధి, మహాకవి శ్రీమాన్ విక్రాల శేషాచార్యులు-శ్రీరామానుజ కీర్తి కౌముది, 6వ భాగం 1988; పుట-176.

"అనంతః ప్రథమం రూపం, లక్ష్మణశ్చతతః పరం।
బలభద్రస్తృతీయశ్చ కలౌకశ్చి ద్భవిష్యతి॥"

దీనికి పాఠాంతరంగా ఇలకా స్పష్టంగా-

"అనంతః ప్రథమం రూపం, త్రేతాయాం లక్ష్మణస్తదా।
ద్వాపరేబలభద్రస్తు, కలౌ రామానుజోఽభవత్ ॥"

అని ఉంది. "కలౌ కశ్చిత్" అనినా, కృష్ణోపనిషత్తులో" బ్రహ్మకులేశాయమానః" అనినా— ప్రసంగాన్ని బట్టి-అవి భగవద్రామానుజులవారినే సూచిస్తాయి అని వ్యాఖ్యాతలన్నారు.

పద్మపురాణంలో ఆళ్వారుల, భగవద్రామానుజుల పేర్లు కూడా ఉన్నాయి. ఇవన్నీ శ్రీమన్నారాయణుని మాటలే. ఇవన్నీ భవిష్యత్కాలంలో జరిగేవిగా చెప్పబడ్డాయి:

"అనంత గరుడాదీనాం సూరీణాం నిత్యయోగినామ్
అంశోద్భవా మహాభాగా జాయంతే హిమదాజ్ఞయా
కాసాలో భూతయోగీ చ మహదాఖ్యః కృతయుగే
విష్ణుచిత్తో భక్తిసార స్త్రేతాయాం కులశేఖరః
భక్తాంఘ్రిరేణు ర్ద్వాపరే మునివాహః పరాంతకః
పరాంకుశః కవిర్మిశ్రః కలౌ రామానుజో మునిః ॥

(నా ఆజ్ఞవల్ల నిత్యయోగులైన అనంత గరుడాదుల అంశలతో మహాయోగులు అవతరిస్తారు. కాసార, భూత, మహాయోగులు కృతయుగంలోను, విష్ణుచిత్త, భక్తిసార, కులశేఖరులు త్రేతాయుగంలోను, భక్తాంఘ్రిరేణు, మునివాహన పరకాలులు ద్వాపరయుగంలోను, పరాంకుశ, రామానుజులు కలియుగంలోను అవతరిస్తారు.)

ఈ పేర్లన్నీ ఇంచుమించుగా ఇదే విధంగా చిన్న చిన్న మాటలమార్పుతో బ్రహ్మవైవర్తపురాణంలో ఉన్నాయి. బ్రహ్మాండపురాణాంతర్గతమైన శ్రీ వేంకటాచల మాహాత్మ్యం (11వ అధ్యాయం)లో కలియుగంలో శ్రీ వేంకటేశ్వరస్వామి

మూర్తి ఆయుధాలు లేకుండా ఉండడాన్ని గూర్చి విపులంగా చెప్పబడిఉంది. స్వామికి అనన్యభక్తుడైన ఒక చక్రవర్తికి ప్రబలశత్రువులో యుద్ధం వచ్చినప్పుడు, ఆ భక్తుని ప్రార్థనను మన్నించి, స్వామి తన పంచాయుధాలను ఆ చక్రవర్తికి సాయంకోసం ఎరువుగాఇస్తాడు. యుద్ధంలో శత్రుజయాన్ని సాధించి ఆ చక్రవర్తి తిరిగి స్వామికి ఆయన ఆయుధాలను సమర్పించదలచుకొని సమీపించినప్పుడు, శ్రీ వేంకటేశ్వరస్వామి ఆ రాజును, తన ఆయుధాలను సంబోధిస్తూ ఇలా అంటారు:

"రాజన్యదేచ్ఛసి జయమజయ్యే సాంపరాయకే
తదేమాన్యాయుధాన్యత్ర సాహాయ్యం కుర్వతాం తవ
మే శంఖచక్ర శార్ఙ్గాఽసే కౌమోదకి మహాగదే
రాజ్ఞోఽన్యకామదాః కాలే స్వస్వతీర్థేషు తిష్ఠత
మానసా మేన్త సద్యోహం ప్రత్యక్షవిగతాయుధః
కంచిత్కాలం వసిష్యామి తతః కేనాఽపి హేతునా
కలౌ కశ్చిన్మహా భాగశ్శంఖచక్రే కృత్రిమే
కారయిత్వా స్థాపయితా విమానాదీంశ్చ మేపునః
తతస్త ద్భక్తి వశగస్సర్వ ప్రత్యక్ష గోచరః
ఆకల్పం నివసిష్యామి వరాభయద హస్తదః
ఊర్ధ్వాభ్యా మపిచాఽన్యాభ్యాం హస్తాభ్యా మతిసుందరే
దధాన శ్శంఖ చక్రేణ కల్పితే లోకతుష్టయే ॥"

"ఓ రాజా! అసాధ్యమైన యుద్ధాలలో నువ్వు జయాభిలాషివై ఎప్పుడు సాయంకోరితే అప్పుడు ఈ ఆయుధాలు వచ్చి నీకు సాయం చేస్తాయి. ఓ (హే) శంఖ (పాంచజన్య) చక్ర (సుదర్శన) శార్ఙ్గ (ధనుస్సు) ఖడ్గ (అసి–నందక) గద (కౌమోదకి) లారా! ఈ రాజు కోరికలను తీర్చినవారై మీరు మీమీ తీర్థ స్థానాలలో ఉండండి. ఇప్పుడు నా మనస్సులో వసించండి. నేను కొంతకాలం ప్రత్యక్షంగా విగతాయుధునిగా ఉంటాను. తరువాత కలియుగంలో కారణాంతరం చేత ఒక మహాభాగుడు (కలౌకశ్చిన్మహాభాగః) కృత్రిమమైన శంఖచక్రాలను చేయించి స్థాపిస్తాడు. నాకు విమానం మొదలైన వాటిని పునర్నిస్తాడు. ఆ మహా

భాగుని భక్తికి లోనై నేను లోకతుష్టికోసం ఊర్ధ్వహస్తాలలో సుందరమైన శంఖ చక్రాలను అన్యమైన హస్తాలలో వీరాభయముద్రలను ధరించి సర్వులకు ఆకల్పం ఉంటాను" అని ఉన్నట్లుగా మనం దీని స్థూలార్థాన్ని గ్రహించవచ్చును. ఇక్కడ కూడా స్పష్టంగా భగవద్రామానుజుల పేరులేకపోయినా "కలౌకశ్చిన్మహాభాగః" అన్నదాన్ని, నారదీయపురాణంలో "కలౌకశ్చిత్" అన్నప్పుడు, కృష్ణోపనిషత్తులో "బ్రహ్మకులే జాయమానః" అన్నప్పుడు ప్రసంగాన్ని బట్టి భగవద్రామానుజులు అని గ్రహించినట్లే-గ్రహించాలి.

ఇదిగాక, శైవులకు వైష్ణవులకు తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరుని (విగతా యుధమూర్తి)మూర్తి సుబ్రహ్మణ్యుడా? శ్రీనివాసుడా? అనేవాదం చెలరేగినప్పుడు ఆ దేశపు అప్పటి రాజు-పురాణాదులలో ఉన్న విషయాలను గూర్చి విన్నా-ఎటూ నిర్ణయించక తటస్థంగా ఉన్నప్పుడు, భగవద్రామానుజులవారు అక్కడికి వచ్చి విష్ణువునకు సహజమైన ఆయుధాలు శంఖచక్రాలు గనుక, సుబ్రహ్మణ్యునకు సహజమైన పాశాంకుశాలను కృత్రిమంగా చేయించి స్వామి సన్నిధిని గర్భగుడిలో రాత్రికి ఉంచి తలుపులు బిగించిపోయి మరునాటికి వచ్చి స్వామి ఏ ఆయుధాలు ధరిస్తాడో పరిశీలిస్తే "మూర్తి సంశయం" తీరిపోతుందని సూచిస్తారు. అందరికి ఆ సూచన నచ్చి అలా చేయగా, మరునాడు శ్రీ వేంకటేశ్వరస్వామి మూర్తి శంఖ చక్రాలతో దర్శనమిస్తుంది! ఇది శ్రీ వేంకటాచల మాహాత్మ్యంలోని-"కలౌకశ్చిన్మహాభాగశ్శంఖచక్రే కృత్రిమే । కారయిత్వా స్థాపయితావిమానాదీంశ్చమేపునః॥" అనే దానితో సమసిస్తోంది. ఇదిగాక భగవద్రామానుజులవారే స్వయంగా ఆ ప్రాంతాన్ని ఏలుతున్న ఆనాటి రాజుతో శ్రీ వేంకటేశ్వర స్వామిమూర్తి విగతా యుధునిగా ఉండడానికి కారణం. తన భక్తునకు వాటిని యుద్ధవిజయంకోసం తాను ప్రసాదించడమే అని చెప్పిన విషయం అందులోనే ప్రకరణాంతరంలో ఉంది:

"దర్శయన్ భక్తవాత్సల్యం యోదదౌ హస్తగే శుభే ।
శంఖచక్రే నృపేంద్రాయ "చక్రవర్తీ" తి యం విదుః ।
అత ఏవారి శంఖాభ్యాం సుదృశ్యేతే వినాకరౌ ॥"

ఇతర పురాణాదులలో భగవద్రామానుజుల ప్రస్తావన ఇలా ఉండగా, ఆయన జన్మించిన శ్రీ పెరుంబూదూరు మాహాత్మ్యాన్ని వర్ణించే (స్కాందపురాణాంతర్గత

భూతపురీ మాహాత్మ్యం) గ్రంథంలో విశేషంగా ఉండడంలో ఆశ్చర్యంలేదు. ఇదే విధంగా ఉపపురాణ మనదగిన భార్గవపురాణంలోను విశేషంగా ఆయన జీవిత చరిత్ర అంతావర్ణితమై ఉంది. ఆయన జన్మాదికాన్ని గురించి భార్గవపురాణంలో ఇలా ఉంది:

"ద్రావిడే విషయే దివ్యే సర్వభూతమనోహరే
పుణ్యే పృథుతలేరమ్యే కాంచ్యామనతి దూరగే
మహా సూర్యాన్వయే పుణ్యే కేశవస్య ద్విజన్మనః
వైష్ణవస్యా భవత్పుత్రో உనంతాంశో உ నంత తేజసా
చైత్రేమాసే శుభార్ద్రాయాం శుభలగ్నే శుభేదినే
తస్య రామానుజ ఇతి పితానామాஉకరోన్ముదా॥"

ఆళ్వారాచార్యుల చరిత్రను వివరించే సంస్కృత భార్గవపురాణం యొక్క ఉత్తరఖండాన్ని తెలుగు చేసిన సురపురరాజ్య పాలకుడైన రామవపామానాయకుని (1752-1773 పరిపాలన కాలం) ముద్రిత గ్రంథానికి 'పీఠిక' వ్రాస్తూ డా॥ తిరుమల రామచంద్రగారు ఇలా అన్నారు: "భార్గవపురాణం ఉత్తరఖండం ప్రసక్తి గరుడవాహన పండితుడుగాని, ప్రపన్నామృత కర్తగాని, పరమయోగి విలాసకర్త గాని ఎత్తలేదు. అలాటిది ఉంటే పరమప్రమాణంగా భావించేవారు. కనుక ఇది తర్వాత- అంటే ప్రపన్నామృతం తరువాత రచితమైందని శంకిస్తున్నాను. పిదప భార్గవపురాణానికి ఉత్తరఖండంగా చేరి వుంటుంది. సూతుడు అర్వాచీనులైన ఆళ్వారుల చరిత్ర చెప్పడం సంభవం కాదు కదా! శ్రీవైష్ణవులు భార్గవపురాణాన్ని ఉపపురాణంగా సమ్మానిస్తారు." (పుట-౩౪)... ....... దివ్యసూరిచరితంలోగాని, పరమ యోగివిలాసంలోగాని ధర్మపురి యోగానందుని శ్రీకాకుళాంధ్రనాయకుని ప్రసక్తిలేదు. పరమయోగివిలాసంలో అహోబల వేంకటాద్రుల ప్రసక్తిఉంది. దీనిలో ధర్మపురి, శ్రీకాకుళక్షేత్రాలు పేర్కొనడంవల్ల మూలం తెలుగుదేశం తెలిసినవారి రచన అయి వుంటుంది." (పుట-౨౦)

భగవద్రామానుజులవారు ఆదిశేషుని అంశంవారని సర్వే సర్వత్ర చెప్పబడి ఉంది. శ్రీ వైష్ణవాన్ని బహుళప్రచారానికి తెచ్చినవి 'తిరునామాలు' అని పిలువబడే సంకీర్తనలలో శ్రీ సంప్రదాయానికి చెందిన సమస్తవిషయాలు అందరికీ బోధ

వదే భాషలో చెప్పడం జరిగింది. భగవద్రామానుజులవారిని గూర్చి కొన్ని "నామాలు" ఇలా ప్రస్తుతించాయి:

"వైష్ణవసిద్ధాంత స్థాపనచేసిన ధీమతులు"

"పరమపదమున శేషుడైనవారు"

"పరవాసుదేవునితో పంతగించి
ధరణిలోపల వేంచేసినవారు"

"పతితరక్షణకు యీక్షితి నవతరించిన శ్రీ భాష్యకారులు"

"మొదటియుగమున అనంతుడై, ముద మొదవగా, పెంపొదవగా
సదయరెండో యుగమున లక్ష్మణస్వామిగా, బహుప్రేమగా
వదలకను ద్వాపరమున బలభద్రుడై పెంపారగా
తుదను కలియుగమందు శ్రీరామానుజాయని పేరుగా."

వివిధ తిరునామాలలోనుండి భగవద్రామానుజులవారి అవతార విశేషాన్ని గూర్చి చెప్పేవాటిలోనుండి గ్రహించిన కొన్ని పంక్తులు పైవి. (తిరునామములు-శ్రీవైష్ణవ తత్త్వము - రచన- సంప్రదాయ సాహిత్య కళానిధి డాక్టర్- కిడాంబి నరసింహాచార్యులు, ఎం.ఏ- పిహెచ్.డి; శ్రీరామానుజకీర్తికౌముది; 8వ భాగం. (1987; పుట-202)

ఈ సందర్భంలో "తిరునామ" శబ్దంలోని "నామ" శబ్దార్థాన్ని గ్రహించాలి. నామమంటే "సకలేతర విలక్షణుడు" అని అర్థం. సకలేతరవిలక్షణుడు శ్రీమన్నారాయణుడే; కాబట్టి, నామశబ్దం ఇక్కడ శ్రీమన్నారాయణునకు ఉపలక్షణంగా గ్రహించాలి. ఈ "తిరునామములు"అను వాటి విశిష్టతనుగూర్చి, వాటిలో అనువదింపబడినవాటిని గూర్చి డాక్టర్ కిడాంబి నరసింహాచార్యులుగారు పై "వ్యాసం"లో ఇలా వ్రాశారు:

"ఇట్టి తిరునామములను బహుళప్రచారము చేసినవారిలో- 'చాత్తాద శ్రీవైష్ణవులు' అనబడు సాతానులు, 'నిత్యులు' అనబడు మాలదాసరులు అనువారలు ముఖ్యులు. పంచసంస్కారములు సర్వవర్ణములకు సమానస్థాయిని కల్గించినవి.

శ్రీవైష్ణవులందరు ఒక్కటే, 'మన అందరిది ఒకేజాతి, ఒకే సంస్కృతి' అనునట్టి భావసమైక్యతను ఈ తిరునామములు అభివృద్ధిపరిచినవి" (పుట-199)

"యాదృచ్ఛికప్రది, నవవిధ సంబంధము, విలక్షణ మోక్షాధికార నిర్ణయము, వార్తామాల, తిరువాశిరియమ్, తిరుప్పల్లాణ్డు, స్తోత్రరత్నము, యతిరాజ సప్తతి మున్నగు సంప్రదాయగ్రంథములందలి విశేషములు - ఈ తిరునామములలో అనువదింపబడినవి" (పుట-210)

తిరునామ ప్రబంధాన్ని గూర్చి, వాటిలోని విషయాన్నిగూర్చి, వాటి ప్రయోజనాన్నిగూర్చి డాక్టర్ కిడాంబి నరసింహాచార్యులుగారు "పైవ్యాసం"లో ఇలా వ్రాశారు:

"శ్రీమద్రామానుజులు శ్రీవైష్ణవమత సుస్థిరతకై డెబ్బదినాల్గు సింహాసనముల నేర్పరచిరి. అట్టి సింహాసనముల నధిష్ఠించిన ఆచార్యపురుషులు ఆంధ్రదేశమునకు విచ్చేసి, ఆళ్వారాచార్య వైభవమును ద్రావిడ దివ్యప్రబంధ విశేషములను పండితులు మొదలు, పామరులవరకు అందరకును బోధింపసాగిరి. అట్టి యంశములే తెలుగులో తిరునామముల రచనకు మూలములయ్యెను. అమంగళనివృత్తి, పరనిర్వృతి, ఉపదేశము అనునవియే ఈ తిరునామముల పరమప్రయోజనము" (పుటలు-198, 199)

భగవద్రామానుజులవారు తమ ప్రజ్ఞాప్రాభవాలు, ధర్మనిష్ఠ, భక్తిప్రపత్తులు శిష్యులకు మార్గదర్శకాలుకాగా శ్రీయతిరాజులై శ్రీవరదరాజస్వామి సన్నిధిని మఠంలో శిష్య శిక్షణతో కాలంగడుపుతూ ఉండగా, ఆయనకు పూర్వాశ్రమంలో గురువులైన శ్రీ యాదవప్రకాశులు తమ తల్లి ప్రోత్సాహంవల్ల, తమ అంతరాత్మ ప్రబోధంవల్ల భగవద్రామానుజులను సమీపించి తాము చేసిన దుష్కార్యాలకు పశ్చాత్తాపపడి, విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని అంగీకరించి యతిపతికి శిష్యులయ్యారు. భగవద్రామానుజులు వారిని ప్రేమతో ఆదరించి "గోవిందదాసు" అని పేరుపెట్టి, శ్రీ వైష్ణవ సిద్ధాంతాలను వారికి వివరించిచెప్పారు. కాలాంతరంలో శ్రీ గోవిందదాసు, శ్రీ వైష్ణవులైన త్రిదండి సన్న్యాసులు ఆచరించవలసిన ధర్మాలను సమగ్రంగా తెలిపే "యతి ధర్మ సముచ్చయమ్" రచించారు. ఈ పనులన్నీ భగవద్రామానుజులు కంచిలో ఉండగానే జరిగాయి.

శ్రీ వర రంగాచార్యుల ప్రోత్సాహం వల్ల, భగవద్రామానుజులు కంచికి,

శ్రీ వరదరాజస్వామికి "బరువుగుండె"తో వీడ్కోలుచెప్పి శ్రీరంగం చేరి శ్రీరంగనాథస్వామి దర్శనం చేసి తమ్మాయనకు అర్పించుకొన్నారు. శ్రీమహాపూర్ణులు మొదలైనవారందరు ఎంతో ఆనందించారు. ఒకప్పుడు "ఒక మహానుభావుడు భవిష్యత్కాలంలో అవతరించి, కలికల్మషాదులను నాశనంచేసి, భాగవత ధర్మాన్ని సుప్రతిష్ఠితం చేస్తాడు" అని శ్రీ నమ్మాళ్వారులు భక్తివరవశులై పాడిన పాశురాన్ని, భగవద్రామానుజుల రాకతో ఆనందతుందిలమైన మనస్సుతో శ్రీమహాపూర్ణులు గానంచేశారు:

"పొలిక పొలిక పొలిక పోయిత్తు వల్లుయిర్ చాపం
నలియుం నరకముమ్నైంద నమ నుక్కింగి యావొన్నుమిల్లై
కలియుంకెడుం కండుకొణ్మిన్ కడల్వణ్ణన్ పూదంగళ్
మణిమేల్
మలియప్పుగుం దిశై పాడియాడి యుళిదరక్కండోమ్"

గానంచేసి, శ్రీ నమ్మాళ్వారులు భవిష్యద్వాణి ద్వారా వెలిబుచ్చిన లక్షణాలన్నీ ఉన్న మహాపురుషులు భగవద్రామానుజులే అనే నమ్మకాన్ని మహాపూర్ణులు వెలిబుచ్చారు. భగవద్రామానుజులతో కలసి శ్రీ దాశరథి, శ్రీ కూరేశులు శ్రీరంగం వచ్చివేశారు. తరువాత కొంతకాలానికి శ్రీ గోవిందుడు కూడా శ్రీరంగం వచ్చి భగవద్రామానుజుల సేవలో చేరిపోయాడు. భగవద్రామానుజుల చుట్టూ ప్రతిభావంతులైన, సమర్థులైన, పండిత శిష్యులుచేరి, ఆయన సిద్ధాంతాల ప్రచారానికి తోడ్పడ్డారు. శ్రీ కూరేశులు ఆయనకు లేఖకునిగా వ్యవహరించారు.

కాని, భగవద్రామానుజుల ప్రజ్ఞా ప్రాభవాలు, పలుకుబడి కొందరిలో ఈర్ష్యా ద్వేషాలను రేకెత్తించాయి. వీరిలో కొందరు శ్రీరంగనాథ దేవాలయార్చకులు ఉండడం ఆశ్చర్యజనకం; కాని, అర్థం చేసుకోవచ్చును. ఆ అర్చకుల ఏలుబడి సన్నగిల్లి, వారి పలుకుబడి తగ్గుముఖం పట్టింది. రెండుసార్లు ఆయనకు విష ప్రయోగం చేసి తొలగించాలని వారు ప్రయత్నించినా శ్రీరంగనాథుల కరుణా కటాక్షంవల్ల వారి ప్రయత్నాలు వమ్మయ్యాయి. కరుణాసముద్రులైన భగవద్రామానుజులు వారిని క్షమించి వారికి సద్బుద్ధిని ప్రసాదించవలసినదని శ్రీరంగనాథులను ప్రార్థించారు. భగవద్గీత ధ్యానయోగంలో చెప్పినట్లు, ఆ మహాపురుషులు యోగారూఢులు గనుక సమదృష్టితో చూడగలిగారు:

"సుహృన్మిత్రార్యుదాసీన మధ్యస్థద్వేష్య బంధుషు।
సాధుష్వపి చ పాపేషు సమబుద్ధిర్విశిష్యతే॥"

(అధ్యాయం-6, శ్లోకం-9)

(స్వభావంచేతనే హితంకోరే సుహృదుడు, మిత్రుడు, శత్రువు, ఉదాసీనుడు, మధ్యస్థుడు, విరోధి, బంధువు, సదాచారి, దురాచారి- అనే భేదం లేకుండా అందరినీ సమబుద్ధితో చూడగలిగినవాడే యోగారూఢుడు.)

ఈ సమయంలోనే మహావిద్వాంసుడు, అద్వైత సన్యాసి అయిన శ్రీయజ్ఞమూర్తి, భగవద్రామానుజులతో శాస్త్రార్థం చేయాలనివచ్చి, శ్రీ వరదరాజస్వామి కృపా పాత్రులయిన భగవద్రామానుజులచేత ప్రభావితులై తమ ఓటమిని అంగీకరించి, త్యజించిన యజ్ఞోపవీతాదులను తిరిగి ధరించి, ఏకదండాన్ని విసర్జించి త్రిదండాన్ని ధరించి శ్రీ వైష్ణవ సన్న్యాసులయ్యారు. మహా విద్వాంసుడైన శ్రీ యజ్ఞమూర్తి విశిష్టాద్వైతాన్ని అంగీకరించడం శ్రీమన్నారాయణుని కృపావిశేషమే అని అందరు అనుకొన్నారు. భగవద్రామానుజులు కూడా ఆయన్ని విశేషంగా గౌరవించి "దేవరాజముని" అని పేరిచ్చారు. ఈయన తమిళనామం "అరుళాళ ప్పెరుమాళెం బెరుమానార్" అని, ఈ మహావిద్వాంసుడు శ్రీవైష్ణవుల కుపాదేయాలైన 'జ్ఞానసారం', 'ప్రమేయసారం' అనే గ్రంథాలను రచించాడు.

భగవద్రామానుజులవారు సన్న్యాసం స్వీకరించిన తరువాత (సుమారు 32, 33 సంవత్సరాల వయస్సులో) కంచి నుండి శ్రీరంగం వచ్చి శ్రీయామునాచార్య పీఠాన్ని అధిష్ఠించి శ్రీ వైష్ణవ సమాజానికి నాయకులయ్యారు. భిన్న భిన్న సిద్ధాంతాలననుసరిస్తూ ఉన్న ఎందరో విద్వాంసులను వారు వాదంలో ఓడించి వారిని తమవైపు త్రిప్పుకొన్నారు. శ్రీయామునాచార్యులవారు తమ పాండిత్య ప్రజ్ఞాపాటవాలను పంచిఇచ్చి నట్లుగా-పంచశిష్యుల వరంచేశారు. ఆ ప్రధాన శిష్యులనుతాము పంచాచార్యులనుగా గ్రహించి భగవద్రామానుజులవారు తమలో శ్రీయామునాచార్యులవారి సంపూర్ణ వ్యక్తిత్వాన్ని వెలయించుకొన్నారు.

తాము తీర్థయాత్రలకు పోయినప్పుడు అవకాశం వచ్చినప్పుడల్లా శ్రీవైష్ణవ ధర్మసూక్ష్మాలను ఉపదేశిస్తూనే వచ్చారు. తాము శ్రీ శ్రీశైలపూర్ణుల దగ్గిర రామాయణ రహస్యాలను తెలుసుకొనడానికి తిరుపతిపోతూ మార్గమధ్యంలో ఉన్న అష్ట

సహస్ర గ్రామవాసి శ్రీ వరదార్యుల ఆతిథ్యం స్వీకరించడం, ఈ ఉపదేశ పరంపరలో ఒక సంఘటనగా గ్రహించవచ్చును. ఇక్కడ తదీయారాధన ప్రాధాన్యాన్ని ఉదాహరణ పూర్వకంగా ఉపదేశించారు.

అష్టసహస్ర గ్రామంలో ఆయన తమ శిష్యులతో నిజమైన భక్తిశ్రద్ధలతో పేదవారైనప్పటికీ తమ్మారాధించిన కార్పాసారామ వరదార్య దంపతుల ఆతిథ్యాన్ని స్వీకరించి, వారిని కృతార్థులను చేశారు. ఆ గృహిణి పేరు లక్ష్మి - పత్తితోటలో వారి ఇల్లు ఉండడంచేత—వరుత్తికొల్లై నాచ్చియార్ అయింది. దాన్ని సంస్కృతీకరించగా కార్పాసారామ లక్ష్మి అయింది. ఆమె అవినీతికార్యం చేయడానికి కూడా సిద్ధపడి - గురు కృపవల్ల ఆ అవశ్యకం కలుగలేదు శిష్యసమేతులైన భగవద్రామానుజులకు విందుచేసింది. తరువాత, భిక్షాటనంచేసి ఇంటికి తిరిగి వచ్చిన ఆమెభర్త ఆమె సమయోచిత కార్యనిర్వహణ ప్రజ్ఞకు ఆమెను అభినందించారు. ఆ గ్రామంలోనే ఉన్న ధనసంతుడయిన ఇంకో శిష్యుడు యజ్ఞేశుడు, గురువుగారికి, శిష్యులకు ఆతిథ్యమిస్తే ఖ్యాతివస్తుందనే భావంతో ఆతడు పెద్ద ఎత్తున ప్రయత్నాలు ప్రారంభించాడు. ఆ తొందరలో తనకు గురువుగారి రాకనుగూర్చి వచ్చి చెప్పిన శ్రీ వైష్ణవుల నుపేక్షించాడు ! ఆ సంగతిని గ్రహించియే యతిపతి, వరదార్యుల ఆతిద్యాన్ని స్వీకరించారు. విషయం తెలిసి, వరదార్యుని ఇంటికివచ్చి సాష్టాంగ నమస్కారంచేసిన యజ్ఞేశుని అహంకార రహితుణ్ణి చేయడానికి సంకల్పించిన శ్రీ యతిరాజు ఆతనికి వైష్ణవధర్మంలో తదీయారాధనకున్న వైశిష్ట్యాన్ని గురించి చెప్పనెంచి—శ్రీ వైష్ణవునకు పంచసంస్కార లాభం, అర్థపంచకవిజ్ఞానం, ఆచార్యా ధీనాచరణం మాత్రమే చాలవు, తదీయారాధన భక్తి శ్రద్ధలతో నిరహంకారి అయి చేయాలి అని ఉపదేశించారు. ఈ ఉపదేశం సర్వులకు అనుష్ఠేయమని అందరు గ్రహించారు. ఈ విధంగా అనేకవిషయాలను భగవద్రామానుజులు లక్ష్యలక్షణ సమన్వయంతో శిష్యులకు ఉపదేశించారు. మదరహితుడు, మహాభక్తుడు అయిన శ్రీ ధనుర్దాసు శీలసంపత్తిని శ్రీవైష్ణవ శిష్యులకు ఉదాహరణపూర్వకంగా శ్రీ యతిరాజు నిరూపించడం ఇలాంటిదే !

భగవద్రామానుజులు తమ ముఖ్య శిష్యులైన - శ్రీ దాశరథి, శ్రీ కూరేశ, శ్రీ సుందరబాహు, శ్రీ గొట్టనంబి, శ్రీ సౌమ్యనారాయణ, శ్రీ యజ్ఞమూర్తి, శ్రీగోవిందులతో - ఇతర శిష్యగణంతో శ్రీరంగంలోని తమ మఠంలో శ్రీరంగనాథుని

సేవచేస్తూ, శ్రీ వైష్ణవధర్మం బోధిస్తూ కాలంగడుపుతూ ఉండగా వారికి, శ్రీయామునాచార్యులవారి చరమశరీరం దగ్గిర తాము భాష్యం వ్రాస్తామని చేసిన ప్రతిజ్ఞ జ్ఞాపకం వచ్చింది. కాని, "భాష్యం" వ్రాయడానికి బోధాయన వృత్తి అత్యంతావశ్యకం. దాన్ని చూడకుండా బ్రహ్మసూత్రాలకు భాష్యం వ్రాయడం భగవద్రామానుజులకు సమంజసంగా కనబడలేదు. అది దక్షిణభారతంలో లేదని తెలిసిన శ్రీ యతిరాజులు, అది ఉన్న కాశ్మీరదేశం పోయి శారదాపీఠంలో దాన్ని పరిశీలించ నిర్ణయించుకొన్నారు తమతో మహాప్రతిభావంతులు, ప్రియ శిష్యులు అయిన శ్రీ కూరేశుని తీసుకొని ఉత్తరంగా ప్రయాణంచేసి మూడు నెలల తరువాత కాశ్మీరంలోని శారదాపీఠం చేరారు. అక్కడి పండితులతో శాస్త్రార్థం జరిపి తమ పాండితీ గరిమతో, వాక్పటుత్వంతో, ఆధ్యాత్మిక సంపత్తితో వారిని నిరుత్తరులను చేసి, బోధాయన వృత్తి విషయం ప్రస్తావించారు. ఆ పండితులు ఆ గ్రంథాన్ని ఇయ్యడానికిగాని, చూచి వ్రాసుకోవడానికి గాని అనుమతించలేదు. కాని ఆ గ్రంథాన్ని పరిశీలిస్తున్నప్పుడే, ఏక సంతగ్రాహి అయిన శ్రీ కూరేశులు ఆ గ్రంథాన్ని సంపూర్ణంగా ధారణచేశారు. ఆ గ్రంథం లభించలేదని చింతిస్తున్న భగవద్రామానుజులకు ఈ విషయం చెప్పి శ్రీకూరేశులు గురుచింతను దూరం చేశారు. శ్రీ శారదాదేవియే స్వయంగా వచ్చి శారదాపీఠ గ్రంథాలయం నుండి ఆ గ్రంథం తీసి ఇచ్చిందని, ఆ గ్రంథంతో తిరిగి వస్తున్న భగవద్రామానుజుల వారిని, వారి శిష్యులైన శ్రీ కూరేశులను తమ గ్రంథాలయంలో ఆ గ్రంథం లేదని గుర్తించిన కాశ్మీరీయులు వెంటనంటి వచ్చి ఆ గ్రంథాన్ని తిరిగి తీసుకొని వెళ్ళిపోయినారని, గ్రంథం లభించినా లాభంలేకపోయినదే అని చింతిస్తున్న గురుదేవులకు, తాము గ్రంథాన్ని తమదగ్గర ఉన్న స్వల్పకాలంలో కంఠస్థం చేశామని చెప్పి గురువుగారి వంతను శ్రీ కూరేశులు పోగొట్టినారని కూడా ఐతిహ్యం ఉంది. ఏది ఏమయినా, భగవద్రామానుజులవారు ఆ గ్రంథాన్ని పరిశీలించే అవకాశం శ్రీమన్నారాయణుల అనుగ్రహంవల్ల కలిగిందని గ్రహించాలి. ఆ గ్రంథం పరిశీలించిన వెంటనే భగవద్రామానుజులవారు- "తత్త్వమసి" (ఛాందోగ్యం) "అహం బ్రహ్మాస్మి" (బృహదారణ్యకం) అనే శ్రుతివాక్యాలకు విశిష్టాద్వైతపరంగా వ్యాఖ్యానించడానికి, జ్ఞానకర్మ సముచ్చయవాదుల వాదాన్ని పరాస్తం చేయడానికి తగిన ఆధార సంపత్తి లభించిందని ఆనందించారు.

తాము శ్రీ యామునాచార్యులవారి చరమ శరీరందగ్గిర చేసిన మొదటి ప్రతి

జ్ఞను నెరవేర్చడం కోసం ద్రావిడ దివ్యప్రబంధాల్ని కూలంకషంగా తాము తమ గురువుల దగ్గర అభ్యసించి వాటిని తమ శిష్యులచేత భక్తిశ్రద్ధలతో అధ్యయనం చేయించిన భగవద్రామానుజులవారు, తమ రెండో ప్రతిజ్ఞ నెరవేర్చడం కోసం శ్రీభాష్య రచనకు పూనుకొన్నారు. కాశ్మీరదేశంలో ఉన్న బోధాయన వృత్తి, శ్రీ కూరేశుల ధారణా పటిమవల్ల లభించడంతో భగవద్రామానులు ఏమాత్రం జాగుచేయక శ్రీభాష్యరచన - శ్రీ కూరేశులు వ్రాయసకానిగా కుదురుకొనగా ప్రారంభించి అనతికాలంలోనే దాన్ని పూర్తిచేశారు. దీనితో వారి రెండో ప్రతిజ్ఞ నెరవేరింది. సగుణ బ్రహ్మవాదులకు ప్రామాణికమైన భాష్యం లభించింది. తరువాతి కాలంలో భారతదేశంలో బయలుదేరిన ప్రతి వైష్ణవ సంప్రదాయానికి చెందినవారు. వారి తాత్త్విక రచనలకు, భాష్యరచనలకు శ్రీభాష్య సాహాయ్యాన్ని తీసుకొన్నారంటే అది అతిశయోక్తి అనిపించుకోదు.

శ్రీభాష్యరచన ముగించిన తరువాత భగవద్రామానుజులు తమ శిష్యులతో కలిసి దక్షిణదేశంలోని దివ్యదేశాలను దర్శిస్తూ ఆయా ప్రాంతాలలోని పండితులను వాదంలో ఓడించి వారినందరిని విశిష్టాద్వైత సిద్ధాంతానుయాయులుగా చేస్తూ వచ్చారు. చోళమండలంలోని పండితుల నందరిని ఆవిధంగానే మార్చారు. తరువాత పాండ్యమండలంలోని విష్ణుక్షేత్రాలను దర్శించి, శ్రీనమ్మాళ్వారుల జన్మస్థలమైన కురుకాపురి చేరి అక్కడ శ్రీ శఠకోపులను స్తుతించారు. తరువాత కురంగ నగరం లేదా తిరుక్కురుంగుడి చేరి అక్కడి విష్ణుమూర్తి మహోన్నతాకారాన్ని చూచి ఆనందించి ఆయన్ని స్తుతించారు. ఆ దేవాధిదేవుడు సంతోషించి - తాము రామకృష్ణాద్యవతారాలు ఎత్తి ప్రజలను సన్మార్గగాములనుగా చేయడంలో పూర్ణ విజయాన్ని సాధించలేకపోయామని, భగవద్రామానుజులు ఏ మంత్రమహిమచేత జన సందోహాన్ని వైష్ణవులనుగా చేయగలుగుతున్నారో ఆ మంత్రాన్ని తమకు కూడా ఉపదేశించవలసినదని - అడిగినట్లును, భగవద్రామానుజులు ఆ దేవాధిదేవుని దక్షిణకర్ణంలో శ్రీమన్నారాయణ మహామంత్రాన్ని ఉపదేశించి ఆయనకు వైష్ణవనంబి అని నామకరణం చేసినట్లును ఐతిహ్యం ఉంది.

తరువాత శిష్యసమేతంగా కేరళలోని తిరువనంతపురం పోయి అక్కడ శ్రీ పద్మనాభ దర్శనం చేశారు. అక్కడ నుండి సముద్రతీరం వెంట పయనిస్తూ- ద్వారక చేరారు. తరువాత ఉత్తరభారతంలోని- మథుర, బృందావనం, సాలి

గ్రామం, సాకేతం, బదరికాశ్రమం, నైమిశం, పుష్కరం మొదలైన పుణ్యక్షేత్రాలన్నింటిని దర్శించి రెండోసారి కాశ్మీరం చేరారు.

అక్కడ శారదాపీఠ పండితులు అభిచారిక క్రియవల్ల భగవద్రామానుజుల వారిని బాధించనెంచి ఆయన ప్రభావం వల్ల వారే బాధలకు లోనయ్యారు. తరువాత శ్రీ యతిరాజు వారిని కరుణతో క్షమించారు. అక్కడి శారదాదేవి దర్శనమిచ్చి ఆయన శ్రీభాష్యాన్ని మెచ్చి భాష్యకార బిరుదం ఆయనకిచ్చి, ఒక హయగ్రీవమూర్తిని కూడా ప్రసాదించి పంపించింది. ఆమె ఆజ్ఞానుసారం భగవద్రామానుజులు కాశీ చేరి అక్కడ కొంతకాలముండి పండితులతో వాదించి వారిని తన మార్గం వైపు మళ్ళించారు.

ఈ విధంగా దిగ్విజయ యాత్రలు చేస్తూ కాశీనుండి దక్షిణాభిముఖులై పయనిస్తూ శ్రీ పురుషోత్తమ క్షేత్రమైన జగన్నాథపురిని చేరారు. అక్కడ ఒక విశిష్టాద్వైత మఠాన్ని స్థాపించి దానికి "ఎంబర్ మఠం" అని తమ శిష్యులైన శ్రీగోవిందుని పేరు పెట్టారు. అక్కడి పండితులు అపజయభీతితో భగవద్రామానుజులను సమీపించలేదు. భగవద్రామానుజులు వాదంలో పండితుల నోడించి 'పురి'లో అర్చనాదికం, పాంచరాత్రాగమ విధానంలో జరిపించాలని సంకల్పించినా అది భగవన్నిర్ణయం కానందున కాబోలు కొనసాగలేదు ఆ రాత్రి ఆయన శయనించి ఉండగా తమ పూజారుల ప్రార్థనను మన్నించి శ్రీ జగన్నాథపురీశులు ఆయనను నిద్రలోనే శ్రీ కూర్మక్షేత్రానికి చేర్చారు. మరునాడు నిద్రలేచిన భగవద్రామానుజులకు అది "పురి" కాదని, శ్రీకూర్మమని తెలిసింది. దీన్ని శ్రీమన్నారాయణుని లీలావిలాసంగా భావించి, భగవద్రామానుజులు శ్రీ కూర్మమూర్తిని అర్చించి, ఆ క్షేత్రంలో తమ శిష్యులరాకను నిరీక్షిస్తూ కొన్నినాళ్ళున్నారు. తరువాత, శిష్యులతో శ్రీ సింహాచలక్షేత్రాన్ని దర్శించి అక్కడ అహంకారి అయిన- శ్రీనృసింహస్వామి భక్తుడు, అనంతర కాలంలో సింహగిరివచనములు అని ప్రఖ్యాతికెక్కిన "వచన" రచయిత అయిన శ్రీ కృష్ణమాచార్యులను వారి అహంకారాన్ని పోగొట్టి ఆయన్ని అనుగ్రహించారు. ఈ వచనాలు "స్వామీ" "సింహగిరి నరహరీ ! నమో నమో దయానిధీ" అనే మకుటంతో ఉంటాయి.

ఆధునిక పరిశోధకులు శ్రీ కృష్ణమాచార్యులు 14వ శతాబ్దికి చెందినవారని అంటున్నారు గనుక భగవద్రామానుజుల వారికి సమకాలికుడు కాదని తేలుతోంది.

21)

కనుక వీరిద్దరు సింహాచలంలో కలుసుకొన్నట్లు, సంభాషించుకొన్నట్లు ప్రచారంలో ఉన్న కథ సంభవం కాదనిపిస్తుంది.*

కాని, ఈ కథను చాలా రమణీయంగా, 18వ శతాబ్ది చివరిభాగానికి చెందిన మంగళగిరి వాస్తవ్యులయిన శ్రీమాన్ సంబూరి కేశవాచార్యులు అనే కవి తన 'ఆచార్యసూక్తి ముక్తావళి'లో తీర్చిదిద్దాడు. ఐతిహాసిక దృష్ట్యా ఈ కథ జరిగి ఉండకపోయినా - శ్రీకృష్ణమాచార్యులు పాడిన సింహగిరి వచనములు (60 మాత్రం లభించి ఉన్నాయి. చాతుర్లక్ష వచనాలని ప్రతీతి) ఉన్నాయి. భగవ

---

* శ్రీ కృష్ణమాచార్యులు జన్మనాంధుడు. సింహాచలక్షేత్రస్వామి అనుగ్రహం వల్ల "చూపు" వచ్చింది. తరువాత విష్ణుభక్తుడై "చూర్ణిక"లని లాక్షణికులు వ్యవహరించే కవితామయమైన "వచనము"లను "స్వామీ! సింహగిరి నరహరీ! నమో నమో దయానిధీ!" అనే మకుటంతో కూర్చి శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామికి వాక్పూజ చేస్తూ వచ్చాడు. కాని, ప్రారబ్ధవశం చేత మధ్యలో వేశ్యాలంపటుడై సర్వం విస్మరించి ఉండగా, పౌతకమూరు భాగవతులు నలుగురు సింహాచలయాత్రార్థం వచ్చి ఆ కవికి జ్ఞానోదయం కలిగించారు. తరువాత ఈ కవి కాకతీయరాజులలో కడపటివాడైన ప్రతాపరుద్రుని (రాజ్యకాలం : 1296_1328) ఆస్థానానికి చేరి ఆ రాజును మెప్పించి అగ్రహారాదులను గ్రామాధిపత్యాన్ని పొందాడు. తన వచనాలను రాగిరేకులమీద చెక్కించడం కోసం రాజధనం చాలా వెచ్చించి రాజాగ్రహానికి గురి అయ్యాడు. కాని, భక్తుని రక్షించడానికి శ్రీమహావిష్ణువు కనకవర్షం కురిపించగా, ఆ ధనంతో రాజును సంతృప్తిపరిచి తన వచనాలతో శ్రీరంగంచేరి అక్కడ జీవితాంతం ఉండిపోయాడు. "ప్రతాపచరిత్ర" వల్ల, ఇతని రచనలవల్ల కవి జీవితవిశేషాలు కొన్ని తెలుస్తున్నాయి. ఇతని తరువాత వచ్చిన తాళ్ళపాక తిరుమలాచార్యుడు మొదలైన వారు వ్రాసిన స్తుతివచన రచనలకు ఈయనయే మార్గదర్శకుడని పండిత పరిశోధకుల అభిప్రాయం.

(కృష్ణమాచార్యులు సింహగిరి- రచయిత: ఆచార్య ఎమ్. కులశేఖరరావు. తెలుగు సంస్కృతి (విజ్ఞాన సర్వస్వం-తెలుగు విశ్వవిద్యాలయం-1988) పుట-188)

రామానుజులవారు సింహాచల క్షేత్రాన్ని దర్శించి శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దర్శనం చేసినట్లు దేవాలయంలోనే ఆధారాలున్నాయి. శ్రీ కూర్మక్షేత్రం నుండి ఉదయవరులు ఇక్కడికి వచ్చారు. "పతితపావన క్షేత్ర"మయిన శ్రీజగన్నాథపురిలోని స్వామిని పాంచరాత్రాగమం ప్రకారం పూజాదికం జరిపించాలని నిశ్చయించుకొని, అక్కడి విద్వాంసులను తమ వాదం ద్వారా జయించి అంగీకరింపజేయాలనే దృష్టిఉన్న భగవద్రామానుజులను రాత్రికి రాత్రి నిద్రలో ఉండగానే- శ్రీ జగన్నాథస్వామి శ్రీ కూర్మం చేర్చాడని మనం తెలుసుకొని ఉన్నాము.

కథ ప్రకారం - శ్రీ కృష్ణమాచార్యులు శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామికి అనన్య భక్తులు; భగవత్కృపి. అయినా అహంకారి. "తాను పాటపాడుతూ ఉంటే స్వామి ఆడుతూ ఉన్నారు" అని అహంకరించి ఉండేవారు. సింహగిరికి వచ్చిన భగవద్రామానుజులవారికి ఈ అహంకారియందు కరుణకలిగి ఆతన్ని సంస్కరించాలని సంకల్పించారు. యతినైన తమకు సంప్రదాయానుసారం నమస్కారమైనా చేయని శ్రీకృష్ణమాచార్యులను సమీపించి "భక్త శిరోమణీ! ఈ రాత్రి మీరు పాట పాడుతున్నప్పుడు, స్వామి నాట్యం చేస్తున్నప్పుడు, మీరు "ఎంబెరుమానారునకు మోక్షమున్నదా? అని అడిగి, దయచేసి నాకు మరునాడు చెప్పండి" అని అడిగారు. "ఇది ఎంతపని" అని, ఆ రాత్రి శ్రీకృష్ణమాచార్యులు నరహరిని అడిగారు. అప్పుడు నరహరి:

"అతనికిఁ గలుగగా నాతఁడిచ్చిన వారి
కందఱికిని మోక్షమబ్బు ధ్రువము
అని హరి పలికిన, నా కృష్ణమార్యుండా
యతి పతి దొడ్డవాఁడనుచు దెలిసి"

(ఆచార్య సూక్తిముక్తావళి)

మరునాడు ఈ మాట శ్రీ కృష్ణమాచార్యులు ఉదయవరులకు తెలియజేశారు. అప్పుడు:

"భక్తిసంప ద్గర్వపరిపూర్ణుఁడై నట్టి
యా కృష్ణమాచార్యులన్న మాట
లాలకించి యతీంద్రుఁడతని కిట్లని పల్కె

గలుగునో లేదో మోక్షంబు నీకు
నడుగుమీ యాహరి ననిపల్కనాతఁడు
భాష్యకారులకిట్లు పలికె మరల
హరిని గన్నులఁబ్రోలనాడింపఁగల మాకు
సంశయమేమి మోక్షము లభింప

ననుచు బల్కిన నతనికి యతివరేణ్యుఁ
డడిగినను దప్పులేదన నతఁడు హరిని
తెలియనడిగెదనని సమ్మతించె ననుచు
వాదిభీకరగురుఁడనె మోదమలర"

(ఆచార్య సూక్తిముక్తావళి)

ఆ రాత్రి "తనకు మోక్షం లేకపోవడం ఏమిటి?" అనే గర్వాహంకారాలతో శ్రీ కృష్ణమాచార్యులు, నరహరిని "నాకు మోక్షం ఉందా? లేదా? చెప్పు" అని, నిలదీసి అడిగారు. నృసింహస్వామి మౌనం వహించారు. దానితో చికాకుపడి గర్వోపహతుడైన శ్రీకృష్ణమాచార్యులు రెట్టించి అడిగారు. అప్పుడు నరహరి ఈ విధంగా సమాధానం చెప్పాడు:

"ముక్తి నాసొమ్మని ముల్లోకములెఱుంగు
మూలస్మృతులు వేదజాలమెఱుఁగు
నా ముక్తియయ్యెఁ బరాయత్త మెట్లన్న
వినుము చెప్పెద నీకు విశదముగను
మాకు దక్షిణపిల్లు మహి రంగధామ మం
దహిరాట్ప్రయాను నన్నడిగినంత
నెంబెరుమానారు కిచ్చితి ముందు నే
నుభయ విభూతుల నూర్జితముగ

నిచ్చెదను గాని మరల నేనేమి గొనను
గనుక సంశయమయ్యె నీకాంక్షఁ దీర్ప

భక్తవశ్యుండ నేనని పలికె ననుచు
వాది భీకరగురుండనె మోదమలర."

(ఆచార్య సూక్తిముక్తావళి)

ఈ మాటలతో శ్రీకృష్ణమాచార్యులు రెచ్చిపోయి "మాయ సన్యాసి నిన్నే మొదలు కొల్చె "మొదలైన మాటలతో దుర్భాషలాడారు. అప్పుడు నరహరి ఆ భక్తునకు, ఆచార్యుని వైశిష్ట్యాన్ని గురించి ఇలా చెప్పారు:

"భువిఁ జరాచర రూపములు రెండు మాకగు
    వినుము నీకవి రెండు వివరపఱతుఁ
జరవిగ్రహము దొడ్డ సన్యాసి రూపము
    ట్లచర రూపము విగ్రహాదికంబు
అస్మత్స్వరూపు రామానుజాచార్యు ల్
    శాస్త్రోక్త యతి సదాచార నిరతుఁ
గనుగొనిలేచి మ్రొక్కక యూరకుంటివి
    పాడితినని గర్వపడితి వీవు
భక్తిభావన కతనఁగన్పడితి నీకుఁ
బాడితివి గాన నాడితిఁబరమపదము
జ్ఞాన నిష్పాద్యమని పల్కెఁ జక్రియనుచు
వాది భీకరగురుండనె మోదమలర." (ఆచార్య సూక్తిముక్తావళి)

ఈవిధంగా విడమర్చి శ్రీకృష్ణమాచార్యులకు చెప్పి అతని తప్పును తెలిపి భగవద్భాగవతాప చారం గనుక- దానికి శిక్షగా "నీ రచనలు పండితుల ఆమోదాన్ని పొందక పామరుల పాలవుతాయి" అని నరహరి అన్నారు. అహంకారి అయిన శ్రీకృష్ణమాచార్యులు "ఎదిరిని తన్ను ఎరుగక" మండిపడి "నీ గుడి శిఖరం నేలకూలుతుంది. విగ్రహాదులు చెక్కుచెదరక పోయినా, నీ గుడి కాలిపోతుంది" అని శాపం ఇచ్చారు. కాలాంతరంలో ఈ రెండూ జరిగాయి. నిన్న మొన్నటిదాకా "సింహగిరి వచనములు" పండిత జనాదరణ పొందలేదు. చాతుర్లక్ష సంఖ్యాక

మైనా, 60 మాత్రమే ఇప్పటికి లభించాయి ● శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం మత దురభిమానులచేతులలో, దోపిడులకు లోనై కాలిపోయింది కూడా! కాని విగ్రహాదికం చెక్కుచెదరలేదు!

నరహరికి శాపమిచ్చిన తరువాత పశ్చాత్తాపపడిన శ్రీకృష్ణమాచార్యులు, స్వామి హితోక్తి ననుసరించి అహంకారం విడిచి భగవద్రామానుజుల శరణుజొచ్చి గురుకటాక్షాన్ని పొందినట్లుగా "ఆచార్య సూక్తిముక్తావళి" ఇలా వర్ణించింది:

"పుట్టుదరిద్రుండు భూరిసేవధి గంగి
    జాత్యంధకుఁడు నిరీక్షణము మాడ్కి
ధన్వాధ్వసీనుఁడు ధారాసలిలమట్లు
    వికల పాదుండంఘ్రి విహృతికరణి
నా కృష్ణయార్యుండు యతిపతి సన్నిధి
    జెంది యానందించి సిరివహించి
దండప్రణామంబుఁదగఁజేసి యున్నంత
    నితనిఁ గటాక్షించి యతివరుండు

పంచ సంస్కారములు నర్థపంచకంబు
నాకృతిత్రయమాదిగా నఖిలహితము

---

● మచ్చునకు ఒక వచనం—

"విష్ణుభక్తి లేని విద్వాంసునికంటె హరికీర్తనము చేయు నతఁడే కులజుండు, శ్వపచుఁడైన నేమి? ఏ వర్ణంబైన నేమి? ద్విజునికంటె నతఁడే కులజుండు. దృష్టిం జూడగా విన్వజ్ఞన దివ్యభూషణము, సింహగిరి నరహరి దలంచిన యాతండె కులజుండు. సంధ్యాది నిత్య కర్మానుష్ఠానంబులు దప్పక నడిపిననేమి? చతుర్వేద షట్ఛాస్త్రములు సదివిన నేమి? శతక్రతువు లాచరించిన నేమి? సకల ధర్మంబులు సేసిననేమి? మా సింహగిరి నరహరి దాసులకు దాసులైనంగాని లేదు గతి! స్వామీ! సింహగిరి నరహరి, నమో, నమో, దయానిధీ!

లాచరించి వచించె సిట్లతని కనుచు
వాదిభీకరగురుఁడనె మోదమలర."

భగవద్రామానుజులవారు ఆ భక్తునకు చేయవలసిన హితాలన్నీ చేసి, "భక్తితో శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి సేవ చేసుకొంటూ అక్కడే ఉండవలసిన"దని చెప్పారు. తాము ముందుకు శిష్యులతో కలిసి యాత్రసాగించారు. ఇంతటి మహాభక్తునకు కూడా భగవద్రామానుజులవారిని ఆశ్రయించనిదే ముక్తి లభించలేదని శ్రీమాన్ సంబూరి శేశవాచార్య కవి ఇలా అన్నారు:

"ఏసూరి రజకునియింట మ్రాతానుజు
నడిపించెఁ బిత్రుకాననంబుదనుక
నాబ్రహ్మ రుద్రులకైనఁ గన్పదనట్టి
సృహరినాడించెను నిత్యమెవ్వఁ
డెపని శాపమున సర్వేశుని గుడియైన
నేదహములు కాలె నేకరీతి
నట్టి కృష్ణార్యునికైన లక్ష్మణముని
నాశ్రయింపక ముక్తియమరదయ్యె

నట్టి రామానుజార్యుల నాశ్రయింప
కున్న కుమతి మోక్షేచ్ఛ యుదధి వింధ్య
పర్వత ప్లవకాంక్షగాఁబరగు ననుచు
వాది భీకరగురుఁడనె మోదమలర" (ఆచార్య సూక్తిముక్తావళి)

ఐతిహాసిక దృష్టి ననుసరించి శ్రీకృష్ణహూదార్యులకు భగవ రామానుజుల వారి దర్శనసమావేశ భాగ్యాలు లభించలేదనుకొన్నా, ఈ కవి విప్లభక్తుడు కావడంలోగాని తమకు సమకాలికులైన వేరొక శ్రీ వైష్ణవస్వాముల దర్శనసమావేశాల ప్రభావం క్రింద "ప్రపన్నుడు" కావడంలోగాని అసహజ విషయం ఏమీలేదు. ఇది గాక, తాను మోహితులైన ఈ కవి హితకమూరి భాగవతుల హితోక్తులవల్ల తన ప్రవర్తన మార్చుకొన్నది, అనంతరకాలంలో తన వచనాలతో శ్రీరంగం చేరి శేషజీవితం అక్కడే గడిపిన విషయం ఐతిహాసిక సత్యాలేగదా!

భగవద్రామానుజులవారు తమ శిష్యులతో కలిసి దిగ్విజయయాత్రను కొనసాగిస్తూ అహోబిలం చేరి అక్కడ శ్రీ నరసింహుని సేవించి ఒక మఠాన్ని స్థాపించారు. తరువాత తిరుపతి-తిరుమల దివ్యక్షేత్రాలను చేరి, తిరుమలలోని స్వామి శ్రీమన్నారాయణుడే అని నిరూపించి కాంచీపురం చేరి శ్రీ వరదరాజస్వామిని దర్శించి, సేవించి తృప్తిచెందారు. అక్కడనుండి శ్రీనాథమునుల జన్మస్థానమైన వీరనారాయణపురం చేరి అక్కడ సేవలుచేశారు. అక్కడనుండి శ్రీరంగం చేరి శ్రీ రంగనాథస్వామి దర్శనంతో యాత్రా శ్రమ అంతాపోయి కృతార్థత లభించినట్లు అనుభవం పొందారు. శిష్యులందరు గురువుల పాదపద్మాలకు మొక్కి సంతృప్తి చెందారు.

భగవద్రామానుజులవారి శిష్యులైన తరువాత శ్రీ కూరేశులు తమ సంపదనంతటిని స్వగ్రామంలోనే విడిచివేసి భార్య ఆండాళమ్మతో వచ్చి శ్రీరంగంలోనే స్థిరపడ్డారు. కాలక్రమాన్ని శ్రీ రంగనాథస్వామి ప్రసాదంవల్ల ఆ దంపతులకు కవలలు జన్మించారు. భగవద్రామానుజులు ఆనందించి వారిలో పెద్దవానికి పరాశర భట్టారకుడని, చిన్నవానికి వ్యాస భట్టారకుడని నామకరణం చేశారు. వీరిలో జ్యేష్ఠుడు, సుందరుడు అయిన శ్రీ పరాశరభట్టునకు రామదేశికుడు అనే ముద్దుపేరు కూడా భగవద్రామానుజులు పెట్టారు. శ్రీ గోవిందుని తమ్ముడయిన బాలగోవిందునకు కూడా ఈ కాలంలోనే పుత్రుడు జన్మించగా ఆ శిశువునకు పరాంకుశ పూర్ణుడని వారే నామకరణం చేశారు ఈవిధంగా భగవద్రామానుజులవారు, శ్రీ యామునాచార్యుల చరమ శరీరం దగ్గర తాము చేసిన ప్రతిజ్ఞను నెరవేర్చుకొన్నారు. బాలురందరు భగవద్రామానుజులవారి కరుణా కటాక్ష వీక్షణం క్రింద పెరుగుతూ వచ్చారు. అందరికి యుక్తవయస్సులో అన్ని సంస్కారాలు జరిగాయి. వీరిలో బాల్యం నుండి తమ అసాధారణ ప్రతిభావిశేషాన్ని శ్రీ పరాశరభట్టు కనబరుస్తూ-భవిష్యంలో తాము అధిరోహించే ఉన్నత తాత్త్విక స్థానాలను సూచిస్తూ- శ్రీ రంగనాథస్వామి దేవేరి అయిన శ్రీ రంగనాయికకు ముద్దుబిడ్డ అయ్యారు. భవిష్యత్కాలంలో ఆ జగన్మాతను స్తుతిస్తూ 'గుణరత్నకోశం' వ్రాయవలసినవారు ఆయన! విష్ణు సహస్రనామ స్తోత్రానికి, విశిష్టాద్వైతపరమైన 'భగవద్గుణ దర్పణం' అనే వ్యాఖ్య వ్రాయవలసినవారు. శ్రీ రంగరాజస్తవం, అష్టశ్లోకి మొదలైనవి వ్రాయవలసినవారు గదా! ఆయన! "పువ్వుపుట్టగానే పరిమళం" అన్న నానుడిని సార్థకంచేస్తూ వచ్చారు.

మహానుభావుల జీవితాలు కూడా శాంతియుతంగా సాగిపోవనీ, ప్రారబ్ధానుభవం వారికీ తప్పదనీ రుజువుచేసేకాలం అప్పుడు వచ్చింది! కృమికంఠుడు అనే అప్పటి చోళరాజు దురభిమానియైన శివభక్తుడు; అంతేకాదు - మన సంప్రదాయానికి సహజంకాని- అన్య దేవతలయందు - ముఖ్యంగా విష్ణువునందు- ద్వేషబుద్ధి కలవాడు. తన దేశంలో శైవులు తప్ప ఇతరులుండరాదనీ, శైవులు కానివారందరు - ముఖ్యంగా శ్రీ వైష్ణవులు-శివుని పరతత్వాన్ని అంగీకరించాలనీ-అంగీకరించని వారిని బలవంతంగానైనా అంగీకరింపజేయాలనీ సంకల్పించాడు. రాజాశ్రయాన్ని కోరిన సన్నిహితులందరు ఈ సంకల్పాన్ని బలపరిచారు. దుర్మార్గులైన ఈర్ష్యాళువులు కొందరు- సాధారణ శ్రీవైష్ణవులచేత అంగీకరింపజేయడం లాభం లేదని, శ్రీ వైష్ణవుల గురువులైన భగవద్రామానుజులవారి చేత "శివాత్పరతరం నాస్తి" అని ఒప్పిస్తే. అంతా సానుకూలపడుతుందని ఒక దుష్టాలోచనను ఆ రాజునకు కల్పించారు. వెంటనే కృమికంఠుడు, తన రాజాస్థానానికి కంచికి రావలసినదని భగవద్రామానుజులవారికి వార్తతోబాటు, వారిని తీసుకొని రావలసినదని రాజ భటులనుకూడా పంపాడు. కంచికి పోతే వచ్చే పర్యవసానాన్ని ఊహించగలిగిన భగవద్రామానుజుల ప్రియ శిష్యులు శ్రీకూరేశులు భగవద్రామానుజుల కాషాయ వస్త్రాలను, దండ కమండలాలను ధరించి కంచికివెళ్ళి "నేను రామానుజులను" అని చెప్పారు. ఆయనతో మహాపూర్ణులుకూడా ఉన్నారు. ఇక్కడ శ్రీరంగ మఠంలో భగవద్రామానుజులు తమ వస్త్రాదులను కానక, దాశరథి వలన విషయం గ్రహించి గాంభీర్యం వహించి సామాన్య వస్త్రాలను ధరించి చోళరాజ్యం తాత్కాలికంగా విడిచిపోవాలని నిశ్చయించుకొని పరిమిత సంఖ్యలో శిష్యులు తమ్ము అనుసరించి రాగా శ్రీరంగం విడిచి వెళ్ళిపోయారు. చోళరాజునకు విష్ణుపారమ్యాన్ని గూర్చి శ్రీకూరేశులు ఎంతచెప్పినా ఆ రాజు వినక "శివాత్పరతరం నాస్తి" అనే విషయాన్ని అంగీకరించాలని బలవంత పెట్టాడు. "శివ" శబ్దానికి ఒక ప్రమాణం ఉన్న కొలపాత్ర అని అర్థం ఉంది. దానికంటె పెద్దకొలపాత్ర పేరు "ద్రోణం". ఇది తెలిసిన శ్రీకూరేశులు "ద్రోణమస్తి తతః పరం" అని వ్రాశారు. దీని అర్థాన్ని తన పండితులు చెప్పగావిని ఉగ్రుడై రాజు శ్రీకూరేశుని కనుగ్రుడ్లు క్రూరంగా పీకించాడు. శ్రీమహాపూర్ణులు కూడా అంగీకరించనందున ఆయనకు అశిక్షే జరిగింది. దుర్భర బాధలో ఉన్నా, శ్రీకూరేశులు ఎవరినీ నిందించక, తనకు శిక్షవిధించిన రాజును, శిక్షను అమలుచేసిన క్రూరులను క్షమించి అనుగ్రహించవలసినదని శ్రీ

వరదరాజస్వామిని ప్రార్థించారు. కంచినుంచి ఈ ఇద్దరు భక్తశిఖామణులు శ్రీరంగానికి బయలుదేరారు. అప్పటికే నూటఅయిదు సంవత్సరాల వయస్సున్న శ్రీమహాపూర్ణులు బాధ భరించలేక శ్రీమన్నారాయణుని స్మరిస్తూ మార్గమధ్యంలోనే పరమపదవాసులయ్యారు.

చోళరాజ్యం విడిచిపోయిన భగవద్రామానుజులు పడమటగా పయనించి ఒక అరణ్యాన్ని చేరి అక్కడి శబరులను అనుగ్రహించి అప్పటికి వచ్చి చేరిన ఇంకా కొందరి భక్తులతో ముందుకు సాగిపోయారు. మార్గమధ్యంలో ఒక గ్రామంలో వైష్ణవులైన చేలాంచ లాంబ (కొంగుపిరాట్టి) ఆమె భర్త శ్రీరంగదాసు ఇచ్చిన ఆతిథ్యం స్వీకరించి, సాలగ్రామం అనే గ్రామంలో అంధ్రపూర్ణుడు అనే బ్రహ్మచారిని అనుగ్రహించి తమ సేవకునిగా గ్రహించారు. సాలగ్రామం నుంచి నృసింహక్షేత్రానికి వచ్చి అక్కడ నృసింహుని అర్చించి, భక్తగ్రామం చేరారు. అక్కడ "పూర్ణ" అనే ఒక భక్తుని చూచి ఒకరోజు ఉండి, ఆ దేశపురాజయిన బిట్టిదేవుని ఆహ్వానంమీద అతని ఆస్థానానికి వెళ్ళారు. ఈ బిట్టిదేవుడు జైనుడు. అది హోయిసాల రాజ్యం. ఆయన కూతురు గ్రహబాధితురాలు. ఆమెను తమ చూపుతోనే గ్రహపీడనుండి విముక్తురాలిని చేసి రాజునకు సంతోషం కలిగించారు భగవద్రామానుజులు. ఆ రాజు జైనమతాన్ని విడిచి పంచసంస్కారాలు గ్రహించి శ్రీవైష్ణవుడయ్యాడు. రాజుతోబాటు చాలామంది జైనులు శ్రీవైష్ణవులయ్యారు. భగవద్రామానుజులు ఆ రాజునకు విష్ణువర్ధనుడు అని పేరుపెట్టారు. రాజ్యంలోని వేలకొలది జైనులు వైష్ణవులయ్యారు.

భక్తగ్రామంలో భగవద్రామానుజులు శయనించి ఉండగా రాత్రి కలలో శ్రీమన్నారాయణుడు సమీపంలోనే ఉన్న యాదివాద్రిలో పూజాదులులేక తానున్నట్లును, అక్కడ గుడి కట్టించి పూజాదికం ఏర్పాటు చేయవలసినదని పలికాడు. మరునాడు శిష్యులతో, రాజుతో రాజపరివారంతో పోయి ఆ ప్రాంతంలో వెదుకగా "బహుధాన్య సంవత్సర పుష్య శుద్ధ పునర్వసు నక్షత్రయుక్త చతుర్దశీ గురువారంనాడు తిరునారాయణస్వామి ఆవిర్భవించాడు, అక్కడ స్వామికి దేవాలయం కట్టించారు. "పాంచ రాత్రాగమమునందలి సాత్వత సంహితోక్త ప్రకారమున శ్రీరంగరాజ భట్టరుచే నా స్వామికి వారు యథావిధిగా సంప్రోక్షణాది కార్యములు చేయించిరి. నిత్యోత్సవాదులు వారి కృషితో నారంభమయ్యెను. ఆ స్వామికి

బ్రహ్మోత్సవము గూడ యతివతి చేయనెంచిరి. కాని స్వామి ఉత్సవవిగ్రహము లేనందున నది యెట్లు లభించునా యని విచారింపసాగిరి." (ద్వాదశ సూరిచరిత్ర రచయిత–విద్యావిశారద, 'ఉపనిషదుద్యాన కోకిల' శ్రీమాన్ కే.టి ఎల్. నరసింహాచార్యులు- ముద్రణ 1978; పుట–414)

ఈ విచారంతో శయనించిన భగవద్రామానుజుల వారికి తిరునారాయణ స్వామి స్వప్నంలో కనిపించి, తమ ఉత్సవమూర్తి రామప్రియుడు ఢిల్లీలోని పాదుషా అంతఃపురంలో రాజకుమారిక అంతికమందున్నట్లు వివరించారు. భగవద్రామానుజులు శిష్యసమేతులై ఢిల్లీపోయి ఆ పాదుషాను మెప్పించి రామప్రియుని తమ వెంట తెచ్చుకొన్నారు. ఆయనే- సంపత్కుమారుడు. పుత్రనిర్విశేషంగా ఆ మూర్తిని భగవద్రామానుజులు లాలించడం వల్ల ఆయన యతిరాజ సంపత్కుమారుడు అయ్యాడు. ఆ మూర్తిని విశేషంగా అభిమానించిన రాకుమారికయే బీబీ నాచ్చియార్ అయిందని ఐతిహ్యం. తిరునారాయణ స్వామికి ఉత్సవ విగ్రహం అమరింది. అక్కడ ఏర్పడిననగరమే తిరునారాయణపురం- మేల్కోటె. ఇది సుప్రసిద్ధ క్షేత్రం. ఢిల్లీప్రయాణంలో తమకు మార్గమందు సాయపడిన-ఆ నాటికి దేవాలయ ప్రవేశార్హతలేని పంచములకు-భగవద్రామానుజులు బ్రహ్మోత్సవ సమయంలో స్వామి దర్శనావకాశం కల్పించారు ! ఆధునిక పరిభాషలో చెప్పాలంటే అది ఆ నాటికి "విప్లవాత్మక చర్య !"

భగవద్రామానుజులు తిరునారాయణపురంలో చాలా సంవత్సరాలు ఉండిపోయి శ్రీ వైష్ణవ సంప్రదాయాన్ని ఆ ప్రాంతంలో వ్యాపింపజేశారు. నేత్రోత్పాటనం తరువాత శ్రీకూరేశులు ఎట్లో శ్రీరంగం చేరి, భగవద్రామానుజులు లేని ఆ ఊరు ఆయనకు నచ్చక అచ్చటినుండి "వానమామలై" అనే పేరున్న సుందరాచలం చేరి అక్కడ సుందరబాహుస్వామి సేవలో కాలం గడుపుతూ వచ్చారు. అక్కడే ఆయన - శ్రీస్తవం, శ్రీ సుందరబాహుస్తవం, అతిమానుషస్తవం, శ్రీ వైకుంఠస్తవం అనే భక్తిభావ భరితాలైన స్తోత్రాలను సంస్కృతంలో రచించారు. ఇంతలో-మత దురభిమానమున్న కృమికంఠుడు దుర్మరణాన్ని పొందాడు. భక్తులందరు భగవద్రామానుజులను తిరిగి శ్రీరంగం రావలసినదని నిర్బంధించడం మొదలు పెట్టారు. తిరునాయణపురంలో ఏర్పడ్డ శిష్య భక్తసందోహానికి భగవద్రామానుజులు తిరిగి వెళ్ళిపోవడం బాధగా అనిపించింది. ఆయనకూ కొంత బాధ లేకపోలేదు. చివరికి, యాదవాద్రిలోని భక్తుల కోరిక మేరకు సముచితమైన శిల్పాల-

చేత ఆయన విగ్రహం ఒకటి చెక్కించి అక్కడ ప్రతిష్ఠించారు. ఆ పని ముగిసిన తరువాత భగవద్రామానుజులు శిష్యసమేతులై శ్రీరంగానికి బయలుదేరి మార్గ మధ్యంలోని సుందరాచలం, శ్రీవిల్లి పుత్తూరు, శ్రీకురుకనగరం, కంచి మొదలైన దివ్యక్షేత్రాలను దర్శిస్తూ చాలా సంవత్సరాల తరువాత శ్రీరంగం ప్రవేశించి శ్రీరంగనాథుని ముందు సాగిలి పడ్డారు. శ్రీరంగంలోని భక్తులు, శిష్యులు, ప్రజలు ఆనందోన్మత్తులయ్యారంటే అది అతిశయోక్తి కాదు. శ్రీకూరేశులు శ్రీగురువునకు సాష్టాంగ నమస్కారం చేయగా, ఆయన అర్ద్రనయనాలతో శిష్యుని లేవనెత్తి కౌగిలించుకొన్నారు. శ్రీగురువు ఆజ్ఞమేరకు శ్రీ వరదరాజస్వామిని స్తుతించి నేత్రాలను పొందారు. శ్రీకూరేశులు రచించిన పంచస్తోత్రాలలో ఇది ఐదవది. స్వామిని, నీ దర్శనం నాకనుగ్రహించు అని:

> నీలమేఘనిభమంజన పుంజ
> శ్యామకుంతల మనంత శయం త్వాం।
> అబ్జపాణిపద మంబుజనేత్రం
> నేత్ర సాత్కురు కరీశ, సదా మే॥

వేడుకొన్న వెంటనే కన్నులు వచ్చి స్వామి దర్శనభాగ్యం కలిగింది!

యాదవాద్రిని తిరునారాయణస్వామిని పుత్ర నిర్విశేషుడయిన సంపత్కుమారస్వామిని విడిచి శ్రీరంగం వచ్చిన తరువాత పరమపదించువరకు - ఇంచుమించుగా ఆరు దశాబ్దులు - శ్రీరంగనాథస్వామి కైంకర్యంతో, శిష్య శిక్షణతో, విశిష్టాద్వైత సిద్ధాంతప్రచారంతో శ్రీరంగంలోనే భగవద్రామానుజులు వేంచేసి ఉన్నారు. తాము పరమపదం చేరి శ్రీమన్నారాయణ సాయుజ్యం పొందడానికి ముందు సర్వసమర్థులైన శ్రీపరాశర భట్టారకుల వారిని శ్రీరంగనాథస్వామి దాస్య సామ్రాజ్యానికి పట్టంగట్టి, విశిష్టాద్వైత సిద్ధాంత పరిరక్షణా ప్రచారాలకు ఆయన్ని నాయకునిగా చేశారు.

శిష్యుల, భక్తుల ప్రార్థనలను మన్నించి తిరునారాయణపురంలో తమ విగ్రహం ప్రతిష్ఠించడానికి అంగీకరించినట్లే- తమ జన్మస్థానమైన శ్రీ పెరుంబూదూరులో, తమ కార్యరంగమైన శ్రీరంగంలో తమ విగ్రహాలను ప్రతిష్ఠించడానికి- శిష్యుల, భక్తులపైది వాత్సల్యంతో-ఒప్పుకొన్నారు. సమర్థులైన శిల్పులచేత చేయిం

చిన ఈ విగ్రహాలు జీవకళ ఉట్టిపడేటట్లు రూపొందాయి. భూతపురిలోని విగ్రహాన్ని శ్రీదాశరథి ప్రతిష్ఠచేశారు. ఇది శ్రీ కేశవస్వామి సన్నిధిని ఉంది. భూతపురిలోని భగవద్రామానుజులవారి అర్చా విగ్రహం మిగిలిన వాటికంటే కూడా సంపూర్ణకళలతో విరాజిల్లుతోందని పెద్దల అభిప్రాయం. ఈ విగ్రహానికి ప్రాణప్రతిష్ఠచేసి నేత్రోన్మీలనం చేస్తున్నప్పుడు, ఎక్కడో శ్రీరంగంలో శిష్యుల మధ్య ఆసీనులై ఉన్న భగవద్రామానుజులవారి కంటి కొలకులనుండి రక్తబిందువులు జారినాయిట! ఇంక కొన్ని దినాలలో పరమపదిస్తారనగా శ్రీరంగంలోని విగ్రహప్రతిష్ఠ జరిగిందని తెలుస్తోంది.

కట్టుదిట్టమైన పద్ధతులలో విశిష్టాద్వైత పరిపోషణ ప్రచారాలు జరగాలనే భావంతో వారు 74 సింహాసనాలను (పీఠాలను) దేశంలో స్థాపించి- మహావిద్వాంసులు, భక్త శిఖామణులు, ఆచార్య పాదపద్మాశ్రితులు అయిన శిష్యులను వాటికి సింహాసనాధిపతులుగ (పీఠాధిపతులుగ) నియమించి బాధ్యతలు అప్పగించారు. వీటిలో ఎనిమిది సింహాసనాలు (పీఠాలు) ముఖ్యమైనవి. వాటిలో ఆరింటికి పీఠాధిపతులు సన్న్యాసులు. రెండింటికి అధిపతులు గృహస్థులు. ఆయా పీఠాధిపతులైన ఆచార్యులకు ప్రత్యేకంగా విశిష్టమైన పేర్లు ఉన్నాయి.

## భగవద్రామానుజులవారు స్థాపించిన 74 సింహాసన(పీఠా)లలో ముఖ్యమైన 8 సింహాసనాల వివరణ

| సింహాసన(పీఠ) స్థానం | దేవుని పేరు | పుష్కరిణి/నది | పీఠాధిపతుల పేర్లు |
|---|---|---|---|
| 1. తోతాద్రి (వానమామలై- కర్ణాటకరాష్ట్రం) | శ్రీ తోతాద్రినాథ స్వామి | క్షీరాబ్ధిపుష్కరిణి | శ్రీరామానుజాచార్యులవారు |
| 2. వేంకటాద్రి (తిరుమల) | శ్రీనివాస భగవానుడు | స్వామిపుష్కరిణి | శ్రీ వేంకటాచార్యులవారు |
| 3. అహోబిలం (కడపజిల్లా) | శ్రీ ప్రసన్న నారసింహస్వామి | రామతీర్థం | శ్రీ శఠకోపాచార్యులవారు |

| సింహాసన(పీఠ) స్థానం | దేవుని పేరు | పుష్కరిణి/నది | పీఠాధిపతుల పేర్లు |
|---|---|---|---|
| 4. బ్రహ్మతంత్రపర కాలం(మైసూరు) | శ్రీ చెన్నకేశవ స్వామి | సమీపంలో కావేరి, తుంగభద్రా నదుది | శ్రీ బ్రహ్మతంత్ర రామానుజా చార్యులవారు |
| 5. మునిత్రయం (బెంగుళూరుసమీపం) | | | శ్రీ మునిత్రయా చార్యులవారు |
| 6. శ్రీరంగం (తమిళనాడు) | శ్రీరంగనాథ స్వామి | కావేరీ మధ్య ప్రదేశం | శ్రీ రంగనాథా చార్యులవారు |

పైని పేర్కొన్న పీఠాల అధిపతులు సన్న్యాసులు

## క్రిందివి రెండు గృహస్థ పీఠాలు.

| | | | |
|---|---|---|---|
| 7. శ్రీరంగం (గృహస్థపీఠం) | శ్రీరంగనాథస్వామి | కావేరీ మధ్యప్రదేశం | శ్రీ అణ్ణన్‌స్వామివారు లేదా శ్రీ వరదాచార్యులవారు |
| 8. కాంచీపురం (విష్ణుకంచి) (గృహస్థపీఠం) | శ్రీవరదరాజస్వామి | కోటితీర్థం వేగవతీనది | శ్రీ ప్రతివాది భయంకర అణ్ణన్‌స్వామివారు |

(శ్రీ రామానుజ కీర్తికౌముది- 10వ భాగం- శ్రీ వైష్ణవధర్మ వ్యాప్తి - సంపాదకులైన విద్యాభూషణ, ఉపన్యాసకరత్న, కవితావిశారద శ్రీమాన్ ధనకుధరం వరదాచార్యుల వారి సంపాదకీయం (పుటలు-౧౪, ౧౫) ఆధారంగా.)

అనంతర కాలంలో "శ్రీరామానుజ దర్శనం" అని పేరుపొందిన శ్రీ సంప్రదాయాన్ని తమ విశిష్టరచనల ద్వారా సుస్థిరంచేసి, విశిష్టాద్వైత సిద్ధాంత రక్షణకు, ప్రచారానికి 74 సింహాసనాలు స్థాపించి, సమర్థులకు ఆ పీఠాల నప్పగించి శ్రీ వైష్ణవులందరు ఆచరించవలసిన విధులను శిష్యులకు బోధించారు. వాటిలో ముఖ్యమైనవి ఇలా శ్లోకబద్ధమయ్యాయి:

"శ్రీభాష్యం ద్రవిడాగమ ప్రవచనం
శ్రీశస్థలేషన్వహం
కైంకర్యం యదుశైల నిత్యవసతి
స్స్వార్థం ద్వయోచ్చారణం
యద్వా భాగవతాభిమాన వసతిః
శ్రేయస్సతామిత్యణం
శిష్యాన్ ప్రాహయతీశ్వరః పద
మగా ద్విష్ణోః పదం శాశ్వతమ్ ॥

శ్రీమాన్ నంబూరి కేశవాచార్యులు ఈ శ్లోకార్థాని తమ ఆచార్య సూక్తి ముక్తావళిలో ఇలా తెనుగుచేశారు:

"శ్రీభాష్య మాచార్యసేవచేఁ బఠియించి
శిష్యముఖంబుగాఁ జెప్పవలయు
నదియొనర్ప నశక్తుఁడాయెనా శఠవైరి
శ్రీసూక్తులే విశ్వసింపవలయు
నట్లు రంగాదులందమరి యాహరికిఁ బ్ర
సిద్ధ కైంకర్యమే చేయవలయు
మంత్రరత్నార్థమే మననంబు సేయుచుఁ
గలిగిన కాలంబు గడపవలయు

సతతవైష్ణవ పూజలేసలుపవలయు
నాదిగియదుగిరి చెంతల నుండవలయు
నేమమిది యని యతిపతి చెప్పెననుచు
వాదిభీకర గురుఁడనె మోదమలర॥"

సంసారసర్పదష్టులయి బాధపడుతున్న వారికందరికీ శరణాగతి మార్గాన్ని చూపి తరింపజేశారు. భగవద్రామానుజులవారు శ్రీరంగంలో ఉన్న కాలంలో సర్వులు శ్రీ వైష్ణవ చిహ్నముద్రితులై యతిరాజుల శిష్యులై బాసిల్లగా, ఆసేతు శీతనగ దిగ్విజయంతో ఆయన విరాజిల్లినారని వర్ణించిన శ్లోకాలివి:

"తే సుస్ఫుటం చ భుజయోర్ధృతశంఖచక్రాః
సమ్యగ్లలాట ఫలకే లసదూర్ధ్వపుండ్రాః ।
కంఠే విలగ్న తులసీ నళినాక్షమాలాః
భేజుర్ముకుంద పదవీం యతిరాజభక్తాః ॥
"ఏవం మహాత్మా యతి చక్రవర్తి
రంగే పురే లక్ష్మణ దేశికేంద్రః ।
ఆసేతు శీతాచల భూమిభాగే
జితారివర్గ స్సుతరాం విరాజే ॥"

భగవద్రామానుజులవారు ఈ విధంగా తమ సమకాలికులైన పండితులకు పామరులకు తమ దర్శన భాషణ లాభాన్ని కలిగిస్తూ వారిని ప్రభావితం చేశారు. తరువాతి శతాబ్దులలో- నేటికి- తమ శ్రీగ్రంథాలద్వారా- సర్వ ప్రపంచాన్ని- ప్రభావితం చేస్తూవస్తున్నారు.

భగవ ద్రామానుజులవారితో ఏ విధమైన సంబంధం లేనివారికి ముక్తి దుర్లభం అని తదనుయాయుల పూర్ణవిశ్వాసం. వారి శిరస్సంబంధులనుగూర్చి, తదంఘ్రి సంబంధులనుగూర్చి ఈ విధంగా సంప్రదాయంలో ఉంది;

"తచ్ఛీర్ష సంబంధ బలాచ్చదేశికాః
పూర్వం స్థితా ముక్తి మవాపురం జసా ।
తదంఘ్రి సంబంధ బలా దిహ స్థితాః
స్వరూపసిద్ధిం పరమాం గతా జనాః ॥"

భగవద్రామానుజులవారి శిరస్సంబంధ బలంచేత- వారి పూర్వులందరు ముక్తిని పొందారు. ఆయన అంఘ్రి సంబంధ బలంచేత- తరువాతివారు ముక్తిని పొందారు.

"వినాచ సంబంధ బలేన తస్య
జగద్గురోర్లక్ష్మణ దేశికస్య ।
తద్దుర్గమం విష్ణుపదం జనానాం
పూర్వం స్థితా నా మధునా స్థితానాం" ॥

జగద్గురువులైన లక్ష్మణదేశికేంద్రుల సంబంధబలం ఏదోవిధంగా లేనిదే వారికి పూర్వ స్థితులైన వారికి గాని వరులకు గాని విష్ణుపదం దుర్గమం (దుర్లభం).

"యథామణిర్మౌక్తికహారమధ్యే
విరాజయం స్తంపరితస్తథైవ
మహాత్మనాం దేశిక పుంగవానాం
మధ్యేవిరాజే యతిసార్వభౌమః॥"

ముత్యాలహారం మధ్య నాయకమణి (ఉభయ పార్శ్వాల లోని ముత్యాలను ప్రకాశింపజేసినట్లే) భగవద్రామానుజులవారు ఆచార్యోత్తముల మధ్య నుండి- పూర్వాపరాచార్యులనందరిని- ప్రకాశింపజేస్తున్నారు.

ఈ విధంగా ప్రకాశిస్తూ ఉన్న భగవద్రామానుజులవారు తమ అవతార ప్రయోజనం తీరినదని గ్రహించి శ్రీ రంగనాథ స్వామి అనుమతిని పొంది పార్థివ దేహం విసర్జించాలనే నిర్ణయానికివచ్చి శిష్యులకు, భక్తులకు ఈ విషయం చెప్ప గానే వారందరు నిర్వాక్కులయ్యారు. పెల్లుబికిన దుఃఖంతో తమ్ము పరివేష్టించి యున్న శిష్యులను, భక్తులను ఆయన ఊరడించి "శతాయుః పురుషః" అనే వేదోక్తి ఉండగా తాము 120 సంవత్సరాలు జీవించిన విషయం వారి దృష్టికి తెచ్చి అంతా ఆ శ్రీరంగనాథస్వామి ఇచ్ఛ అని చెప్పి పింగళనామ సంవత్సర మాఘ శుద్ధ దశమి శనివారం మధ్యాహ్నం దేహత్యాగానికి శ్రేష్ఠ సమయంగా నిర్ణయించుకొన్నారు. (జ్యోతిషశాస్త్ర రీత్యా నవగ్రహాల దశల మొత్తం సంవత్సరాలు 120, ఇన (6) శశి (10) కుజ (7) రాహు (18) జీవ (16) మంద (19) జ్ఞ (17) కేతు (7) భృగు (20) దశల కాలం) ఆ నిర్ణీత సమ యానికి- శ్రీగోవిందుని తొడమీద శిరస్సు ఉంచి, "శ్రీరామచంద్రునకు హను మంతునివలె" తమకు "నమ్మినబంటు" అయిన శ్రీ ఆంధ్రపూర్ణుని ఒడిలో పాదము లుంచి గురు పాదుకలయందు దృష్టినిలిపి బ్రహ్మరంధ్రం ద్వారా ప్రాణోత్క్ర మణం చేసి పరమపదాన్ని పొందారు:

"రామానుజో జగామాశు తద్విష్ణోః పరమం పదమ్ ।
మాఘశుద్ధ దశమ్యాం తు మధ్యాహ్నే మందవాసరే ॥"

శిష్యుల, భక్తుల, పురజనుల దుఃఖానికి అవధులేలేకపోయాయి. శ్రీదాశరథి, శ్రీగోవిందుడు, (శ్రీఎంబార్) శ్రీఆంధ్ర పూర్ణుడు, శ్రీ కురుకేశుడు పరస్పరం ఊరడించుకోవలసివచ్చింది. భగవద్రామానుజులవారి ప్రియశిష్యులయిన శ్రీ కూరనాథులు ముందే పరమపదించి శ్రీ గురుపాదులకే దుఃఖాన్ని కలిగించారు. భగవద్రామానుజులవారికి పూర్వాశ్రమంలో శ్రీదాశరథి మేనల్లుడు; శ్రీ గోవిందుడు పినతల్లి కొడుకు. శ్రీ ఆంధ్రపూర్ణుడు మధ్యవచ్చిచేరిన మహాభక్తుడు, శిష్యుడు, పరిచారకుడు. ఇంక కురుకేశునిగూర్చి కొంత చెప్పవలసిఉంది. భగవద్రామానుజులవారు యాదవాద్రిని విడిచి శ్రీరంగానికి తిరిగివచ్చేటప్పుడు మార్గమధ్యంలో శ్రీనమ్మాళ్వారుల జన్మస్థలమైన కురుకాపురిని చేరి శ్రీశఠకోపులను దర్శించారు. అప్పుడు ఆయన శ్రీనమ్మాళ్వారులు మానవకోటికి ఆధ్యాత్మికరంగంలో చేసిన సేవనుస్మరించి అప్పుడు "అయ్యో! నాకేకనుక ఒక కొడుకుఉంటే, శ్రీశఠకోపులకు కృతజ్ఞతలు తెలుపుకోవడంకోసం ప్రేమతో ఆయన పేరు వాడికి పెట్టుకొని ముద్దుగా పిల్చుకొనే వాడినిగదా!" అని అన్నారుట! అప్పుడు అక్కడఉన్న శ్రీ భూరి శ్రీశైలపూర్ణుడు అనే శిష్యుడు లేచి, "స్వామీ, మీరు నన్ను దత్తపుత్రునిగా స్వీకరించి అనుగ్రహించవలసినది" అనగానే భగవద్రామానుజులు సంతోషించి ఆశిష్యుని తమ జ్ఞానపుత్రునిగా స్వీకరించి, ఆతనికి శ్రీనమ్మాళ్వారు అనే అర్థస్ఫూర్తికలిగేవిధంగా "కురుకేశుడు" అని పేరుపెట్టారుట! (ద్వాదశసూరిచరిత్ర : విద్యావిశారద; ఉపనిషదు ద్యానకోకిల' శ్రీమాన్ కె.టి.ఎమ్. నరసింహాచార్యులు; 1978 పుట-430) ఇందువల్ల భగవద్రామానుజులవారి ఉత్తర క్రియలలో శ్రీ కురుకేశుడు పాల్గొనడం జరిగింది.

## భగవద్రామానుజులవారు రచించిన గ్రంథాలు

1. వేదార్థసంగ్రహం, 2. శ్రీభాష్యం, 3 గీతాభాష్యం, 4. వేదాంతదీపం, 5. వేదాంతసారం, 6. శరణాగతిగద్య, 7. శ్రీరంగగద్య, 8 శ్రీవైకుంఠగద్య, 9. నిత్యగ్రంథం అనేవి భగవద్రామానుజులవారు పరమపదించిన తరువాత శ్రీవైష్ణవంలో వచ్చిన-వడగలై, తెంగలై అనే రెండు సంప్రదాయాలవారు ఈతొమ్మిది సంస్కృత గ్రంథాలను భగవద్రామానుజులవారు వ్రాసినవాటిగా అంగీకరిస్తారు. వీటిలో సిద్ధాంతరీత్యా ముఖ్యమైనవి-శారీరక మీమాంసా భాష్యం అనే నామాంతరం ఉన్న శ్రీభాష్యం; వేదార్థసంగ్రహం, గీతాభాష్య అనేవని విద్వాంసుల అభిప్రాయం.

భగవద్రామానుజులవారు వ్రాసిన ఈ ఉద్గ్రంథాల విస్తృత వివరణ ఈ గ్రంథ (అవతారతత్త్వవివేచన) పరిధి కాదుగనుక-అవనికి ప్రయత్నించక విశిష్టాద్వైత సిద్ధాంత విషయాలు కుణ్ణంగా తెలిసిన విద్వాంసుల రచనలను ఆధారంగా చేసు కొని లఘువుగా దిఙ్మాత్రంగా వాటినిగూర్చి వ్రాస్తాను. ఈ సిద్ధాంతాన్ని ఖండించిన ఇతర సంప్రదాయాలవారి ప్రసక్తిఉండదు. ఈ పుస్తకాలలో ఏమిఉందో చెప్పడం ముఖ్యంగనుక-ఇతర సంప్రదాయాలఖండన వీటిలో ఉంటే వాటిని లఘువుగా సూచించడం ఉంటుంది. (ఈ నారచన శాస్త్రగ్రంథంకాదని గుర్తింపుడని మనవి.)

ఈ తొమ్మిది గ్రంథాలలో-వేదార్థసంగ్రహం భగవద్రామానుజులవారి మొదటి రచన అనీ, అది తిరుమల (తిరుపతి)లో రచితమై ఉంటుందని విద్వాంసులు భావిస్తున్నారు ఈ గ్రంథం శ్రీ వేంకటాచలపతి అయిన శ్రీనివాసునకు అంకితం!

భగవద్రామానుజులవారి* రచనలలో 'వేదార్థ సంగ్రహం' తొలిరచన అనీ. అది తిరుమలేశుని సన్నిధిని రచితమైనదనీ విశిష్టాద్వైత సిద్ధాంత వ్యాఖ్యాతలలో ప్రసిద్ధులైన శ్రీ సుదర్శనసూరి పేర్కొన్నా, అది ఎప్పుడు రచింపబడిందో స్పష్టంగా చెప్పడానికి ఆధారాలు లేవు అని విద్వాంసుల అభిప్రాయం. ఇది ఇలా ఉండగా భగవద్రామానుజులవారి తొలి రచన 'వేదాంతసారం' అని చెప్పే పండితులు కూడా ఉన్నారు.

'వేదార్థ సంగ్రహం' ఉపనిషత్సారమే. ఉపనిషత్తులను సక్రమపద్ధతిలో అర్థం చేసుకోవడానికి తోడ్పడే రచన ఇది. దీనిలో తమ ప్రత్యర్థుల వాదాలను, తమ ఆలోచనావిధానాలను స్పష్టంగా వివరిస్తారు. అనేకోపనిషత్తులలోని విషయా లను గ్రహించి వాటికి సమన్వయ దృష్టిని కల్పించి, తమ ప్రత్యర్థులు ఆయా వాక్యాల కిచ్చిన అర్థాలను ముందుగా వివరించి, వాటిని ఖండించి; తమకు సమ్మత మైన, తమ సిద్ధాంతాలను బలపరిచే అర్థాలనిచ్చి సమన్వయిస్తారు.

---

*భగవద్రామానుజులవారి గ్రంథాలను తెలిపే శ్లోకం ఒకటి:

"వేదాంతసారో-వేదాంతదీపో-వేదార్థ సంగ్రహః ।
గద్య-గీతాభాష్య-సూత్రభాష్య-నిత్యక్రమా ఇతి॥"

దీనిలోని "గద్య" ఆయన వ్రాసిన మూడు గద్యలకు ప్రతినిధి శబ్దం.

తమకు మొదటి వేదాంతగురువులైన శ్రీ యాదవ ప్రకాశులతో వివాదానికి కారణమైన ఛాందోగ్యంలోని "కప్యాసం" శబ్దం ఉన్న వాక్యాన్ని గ్రహించి (తస్య యథా కప్యాసం పుండరీకమేవ మక్షిణీ) దాన్ని ఈ వేదార్థ సంగ్రహంలో విపులంగా చర్చిస్తారు. ఆ సందర్భంలో ఆ పుండరీకాక్షుని సౌందర్యం కనబడేలా, దీర్ఘసమాస రచన ఇలా చేశారు: "గంభీరాంభస్సము ద్భూత సుమృష్టనాళ రవికర వికసిత పుండరీక దళామలాయతేక్షణః". అదే ఛాందోగ్యంలోని 'తత్త్వమసి' (తత్ సత్యం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో-IV -8-7) అనే మహావాక్యాన్ని (సద్విద్య ప్రకరణం) గ్రహించి (జీవాత్మ పరమాత్మల సంబంధం) ప్రత్యర్థుల వాదాలను ఖండించి స్వమత స్థాపన చేస్తారు.

వేదాలను సరిగా అర్థంచేసుకొంటే. శ్రీమన్నారాయణుడే - సర్వాధారుడు, సర్వాధికుడు, స్వతంత్రుడు, జగత్పతి అని అర్థం అవుతుందనీ - కొన్ని సంప్రదాయాలలో శ్రీమన్నారాయణుని స్థానం బ్రహ్మకుగాని శివునకుగాని ఇయ్యడం అనుచితమని, అది సమర్థనీయం కాదని- వారు సృష్టిక్రమంలో తొలిప్రాణులని- భగవద్రామానుజులు నిర్ణయించి వ్రాశారు. దీనిలో నారాయణ శబ్ద వ్యాఖ్యానం చాలా విపులంగా చేశారు. శ్రీభాష్యంలోకంటె దీనిలో ఈ చర్చ దీర్ఘంగా ఉంది.

"నేతి, నేతి" అనే "నిర్వచనం" గ్రహించి, ఈ ప్రయోగం "బ్రహ్మం"నకు సంబంధించిన విశిష్టమైన స్వభావ నిర్ణయమేగాని వేరేదీ కాదని, బ్రహ్మంయొక్క రూపాలన్నీ చెప్పబడలేదని ఆ ప్రయోగం అర్థమని సిద్ధాంతీకరించారు. ఉపనిషత్తులలో కనబడే. "సర్వవర్ణ" (ఛాందోగ్యం) "కప్యాసం పుండరీకమేవ మక్షిణీ" (ఛాందోగ్యం) "నీలతోయద మధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్వరా" (మహానారాయణోపనిషత్తు) "రూపం; కల్యాణ తమం" (ఈశావాస్యం) మొదలైనవి ఆ జగన్నాథుని సౌందర్య దర్శకాలే అని భగవద్రామానుజుల నిర్ణయం. సర్వసంపూర్ణమైన బ్రహ్మంను ప్రకటించడమే ఉపనిషత్సారమని ఆయన నిర్ణయం ప్రపంచ సృష్టికి హరియే కారణమని సిద్ధాంతీకరించి నిర్ద్వంద్వంగా ప్రకటించారు పరమాత్మ యొక్క అనంత విభూతులను ప్రకటించడమే ఉపనిషత్తులు చేసినపని అని ఉద్ఘోషించారు శ్వేతాశ్వతర ఉపనిషత్తులో వచ్చే "భోక్తా భోగ్యం ప్రేరితారంచ మత్వా, సర్వం ప్రోక్తం త్రివిధం బ్రహ్మమేతత్" అనే దానికి అంతర్యామి భావసంబంధమైన చక్కని వివరణ వేదార్థ సంగ్రహంలో ఇచ్చారు.

శ్రీ ప్రభాకరుని కర్మ - మీమాంస సిద్ధాంతాన్ని ఖండించారు. వేదార్థ సంగ్రహం చివరి భాగాలలో భగవంతుడు మనుష్యరూపాన్ని ధరించడం (అవత రించడం) తద్రూప నిర్మాణాదికానికి సంబంధించిన విషయాలు పరిశీలితాలు. భగ వంతుని పొందడానికి భక్తియే సాధనమని, భగవత్సేవయే భక్తి అని-అదే భగవ ద్దాస్యమని నిరూపించారు.

భగవద్రామానుజుల వారికి విశ్వవిఖ్యాతి తెచ్చినది, అనంతరకాలంలో భారతదేశంలో బయలుదేరిన సర్వవైష్ణవ సంప్రదాయాలకు- అవి అన్ని విషయా లలో శ్రీ సంప్రదాయంతో ఏకీభవించక పోయినా-సుస్థిరమైన తాత్త్విక భూమికను సమకూర్చి పెట్టినది శ్రీ బాదరాయణుల బ్రహ్మసూత్రాలకు భగవద్రామానుజుల వారు వ్రాసిన "శారీరక మీమాంసా భాష్యం" అనే పేరున్న "శ్రీభాష్యం". ఇతర వైష్ణవ సంప్రదాయాల భాష్యాలన్నీ - కొంతకు కొంత - శ్రీభాష్యానికి ఋణపడి ఉన్నాయి అంటే అది అతిశయోక్తి అనిపించుకోదు. కాశ్మీరంలోని శ్రీ శారదా పీఠాన్ని అధిష్ఠించిఉన్న శ్రీ శారదాదేవి ఆయన భాష్యాన్ని మెచ్చుకొని "భాష్య కార" బిరుదాన్ని, స్వర్ణమయ లక్ష్మీహయగ్రీవ మూర్తిని ప్రసాదించిందని తెలుసు కొనే ఉన్నాము.

భగవద్రామానుజుల అవతారానికి చాలా శతాబ్దుల పూర్వంనుండి శ్రీబాద రాయణుల "బ్రహ్మ సూత్రాలు", వాటికి భాష్యాలు ఉన్నాయి. సుప్రసిద్ధంగా అద్వైతపరమైన శ్రీ శంకరభగవత్పాదుల "భాష్యం" ఉండనేఉంది. భగవద్రామా నుజులు తమ "శ్రీభాష్యం"లో ఖండనకు గురిచేసిన వాటిలో అది ప్రముఖస్థానంలో ఉంది. సగుణ బ్రహ్మవాదులందరూ-అంతో ఇంతో - శ్రీ శంకర భగవత్పాదుల భాష్యాన్ని ఖండించినవారే! ఈ ఖండన తీవ్రత ఆయా భాష్యరచయితల అభినివే శాన్ని పట్టిఉంటుంది. శ్రీ శంకరభగవత్పాదులు కూడా తమకు పూర్వమున్న వ్యాఖ్యానాలను ఖండించినవారే! తాత్త్వికవిషయాలలో - శాస్త్ర విషయాలలో అందాం- ఖండన మండనాదులు భారతీయ సంప్రదాయంలో భాగాలే!

శ్రీబోధాయన మహర్షి రచించిన 'బ్రహ్మసూత్రవృత్తి'ని పరిశీలించి-కపర్ది, భారుచి, గుహదేవ, ద్రమిడ, టంక మొదలైన ఆచార్యులచేత ప్రతిపాదితాలైన సిద్ధాంతాలను తీర్చిదిద్ది - తమ శ్రీభాష్యాన్ని సర్వాంగసుందరంగా శాస్త్రీయంగా భగవద్రామానుజులు రచించారు. శ్రీభాష్యకారుల దృష్టిలో ఉపనిషత్సారమే

వేదాంత సూత్రాలు. మొదటి సూత్రానికి—తమ సిద్ధాంతాన్ని అంతటినీ వివరించే పద్ధతిలో అతి విపులమైన వ్యాఖ్య వ్రాశారు వీరు. వారి పూర్తి సిద్ధాంతాన్ని అంతటినీ ఇది తెలుపుతుంది అని విజ్ఞులైన విద్వాంసులందరు ఏకకంఠ్యంతో అన్నారు. ఈ అధ్యాయంలోనే బ్రహ్మవిషయమై ఇతరులు వెలిబుచ్చిన అభిప్రాయాల, వాదనల ఖండన; తమ వాదాన్ని స్థాపించడం ఉన్నాయి.

రెండో అధ్యాయం మొదటి రెండు పాదాలలో-ప్రథమాధ్యాయంలో స్థాపితమైన బ్రహ్మకారణతా వాదానికి - సాంఖ్య, యోగాదిమతాల వల్ల ఎలాంటి ఆపత్తి రాదని, వాటిని ఖండించి; తాము ఆదరిస్తూ ఉన్న పాంచరాత్ర సిద్ధాంతం బ్రహ్మ కారణతా వాదానికి అనుకూలం కావడంచేత దాని ప్రామాణ్యాన్ని స్వీకరించడం చేశారు. మిగిలిన మూడు నాలుగు పాదాలలో బ్రహ్మేతరమైనది అంతా బ్రహ్మ కార్యమే అని నిర్ణయించారు ఇందువల్ల జీవుడుకూడా బ్రహ్మకార్యమే అని, అనిత్యుడు కాదని తెలుస్తోంది. తృతీయాధ్యాయమందు-ధ్యాన సాధనాలను, భక్తి-ధ్యానమార్గాలను వివరించడం జరిగింది. నాలుగో అధ్యాయంలో-విముక్తి మార్గం, ఆత్మగత శక్తులు, ధ్యానమార్గం అనేవాటి విశదీకరణ చేశారు.

భగవద్రామానుజులవారి శ్రీభాష్యం మీద చాలా వ్యాఖ్యానాలున్నాయి. నాటినుండి నేటివరకు శ్రీభాష్యం మీద ప్రపంచ వ్యాప్తంగా విద్వాంసులు వ్రాస్తూనే ఉన్నారు. వీటిలో శ్రుత ప్రకాశిక చాలా ప్రసిద్ధిపొందింది. ఇది శ్రీ సుదర్శనాచార్యులవారు వ్రాసినది. కవితార్కిక సింహ శ్రీ వేదాంత దేశికులవారు వ్రాసిన "తత్త్వటీక" చాలా గొప్పది. ఆ మహాకవులు, మహాతార్కికులు శ్రీభాష్యాన్ని ముప్పైసారులు అధికరించినట్లు పెద్దలు అంటారు.

భగవద్రామానుజులవారి రచనలలో లఘుభాష్యాలు అనదగినవి - వేదాంత దీపం, వేదాంతసారం అనేవి. శ్రీ భాష్యరచనానంతరమే వేదాంత దీపాన్ని శ్రీభాష్యకారులు వ్రాసినట్లు విద్వాంసులు ఊహిస్తున్నారు. ఇది శ్రీభాష్యానికి లఘుటీక వంటిది కాకపోయినా గహనమైన గంభీరమైన అనేక విషయాలను భగవద్రామానుజులవారు దీనిలో చర్చించారు. కొన్ని ఉదాహరణల విషయంలో తప్ప, విషయ వివరణాదికంలో వేదాంతదీపానికి శ్రీభాష్యానికి పోలికలు ఎక్కువ. ఈ గ్రంథంలో ప్రథమ సూత్ర వ్యాఖ్యానానికి ముందు వ్రాసిన ఉపోద్ఘాతం విలువైనది. ఇది ప్రప్రథమంలోనే విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని సులభ సుందరంగా ప్రదర్శిస్తుంది.

వేదాంతసారం భగవద్రామానుజులవారి మొదటి కృతి అని కొందరు విద్వాంసులు భావిస్తున్నారు. బాదరాయణుని వేదాంత సూత్రాలలో రెండవది, ప్రాధాన్యం విషయంలో అద్వితీయమైనది అయిన "జన్మాద్యస్య యతః" అనే సూత్రానికి భగవద్రామానుజులు వ్రాసిన వ్యాఖ్యానంలో, శ్రీభాష్యంలో వ్రాసిన దానికంటె స్వాతంత్ర్యం కొంత కనబడుతుంది. ఈ సూత్రం జగత్సృష్టికి సంబంధించినది కావడం దీనికి కారణం అనుకోవచ్చును.

పరాత్పరుని పరిపూర్ణతను, మహోన్నతిని వివరించి చెప్పేచోట, ఉద్ఘాటించేటప్పుడు భగవద్రామానుజులు ఆ విషయాల విషయంలో సంశయం ఏమాత్రం లేని, కనబడని-పద్ధతిలో నొక్కి చెప్తారు.

శ్రీభాష్యం తరువాత పరిమాణ విస్తృతి విషయంలో వారు వ్రాసిన గీతాభాష్యాన్ని పేర్కొనాలి. అవశ్యకాలైనచోట్ల - శ్రీభాష్యంలో ఉన్న విషయాలు యథోచితంగా తమ గీతాభాష్యంలోను భాష్యకారులు పునరుద్ఘాటించారు. కొన్ని కొన్ని చోట్ల శ్రీభాష్యంలో వారు వ్రాసినవాటితో సమన్వయపరిచి శ్రీ భగవద్గీతా భాష్యంలో ప్రదర్శించారు. ఎరనెర, తమ భాష్యంలో పూర్వాచార్యుల వ్యాఖ్యానాల లోని విషయాలను కలుపుకొన్నారు. ఈ గీతా భాష్యంమీద వారి పరమగురువులైన శ్రీయామునాచార్యులవారి "గీతార్థ సంగ్రహం" ప్రభావం బాగా కనబడుతుందని ప్రాచ్య పాశ్చాత్య విద్వాంసులందరు అంటారు. ఈ మహానుభావులిద్దరూ-భగవంతుని చేరడానికి కర్మజ్ఞానమార్గాలకంటె భక్తిమార్గం సర్వోత్కృష్టమైనదని భావించి నిర్ద్వంద్వంగా ప్రకటించారు. మిగిలిన మార్గాలను గూర్చి భగవద్గీత చెప్పినా, గీతాసారం 'భక్తి'యే అనీ, దీనికి కర్మజ్ఞానాలు అంగాలని నొక్కి పకాణించారు. ఈ భాష్యాన్ని గూర్చి "సుధీమణి" శ్రీమాన్ చిలకపాటి విజయరాఘవాచార్యులు గారు ఎమ్ ఏ; బి ఇడి ఇలా వ్రాశారు:

"భగవద్గీతా భాష్యము శ్రీరామానుజులవారి పరిపూర్ణమైన పాండిత్య ప్రకర్షకు, వేదాంత విద్యావిశేషమునకు ఒక మచ్చుతునుకగా మనము భావింపవచ్చును."

"భగవత్తత్త్వవన్నులుగా, భగవత్పర తంత్రులుగా, ఉభయ వేదాంత ప్రవర్తకులుగా, జ్ఞానాధికులుగా, మహామనీషులుగా శ్రీ రామానుజయతి సార్వభౌములను గీతాభాష్యము ఆవిష్కరించి యున్నది."

(శ్రీమద్రామానుజులు- వారి కృతిరత్నములు-శ్రీరామానుజ కీర్తి కౌముది. 10వ భాగం, 1990; పుట-28)

భగవద్రామానుజుల వారు శరణాగతి గద్యము - రంగనాథ గద్యము-వైకుంఠ గద్యము అను మూడు గద్యస్తోత్రాలను రచించారు. వీటిలో భగవంతునకు ఆత్మార్పణం బోధించే "శరణాగతి గద్య"కు మిక్కిలి ప్రచారం వచ్చింది. శ్రీ సంప్రదాయం బోధించే "ప్రపత్తి" తత్త్వం దీనిలో చక్కగా నిరూపితమయింది. శరణాగతిసారం భగవంతునకు తన్ను తాను త్రికరణశుద్ధిగా అర్పించుకోవడం. ఈ స్తోత్ర ప్రారంభంలో తమ సంప్రదాయానుసారం పురుషకార స్వరూపిణి, నిత్యానపాయిని అయిన లక్ష్మీదేవిని శరణుపొంది ఆ మెద్వారా పరబ్రహ్మభూతుడు, పురుషోత్తముడు, శ్రీవైకుంఠనాథుడు అయిన శ్రీమన్నారాయణుని శరణుపొందారు భగవద్రామానుజులు.

శ్రీరంగనాథ గద్యంలో ఉడయవరులు శ్రీరంగనాథుని పాదపద్మాల మోల ప్రపత్తిని సమర్పించుకొని, నిఖిల వస్తు జాతశరణ్యుడైన శ్రీమన్నారాయణుని శరణుపొందారు. గద్యాంతంలో శ్రీరంగనాథ స్వామిని "కాకుత్స్థ" అని సంబోధించడం విశేషం.

మోక్షోపాయానికి ముఖ్యమైనది "ధ్యానం" అని భగవద్రామానుజులు నిర్ధయించారు. మోక్షార్థి అయిన ప్రపన్నుడైన భక్తుడు శ్రీ వైకుంఠనాథుడైన శ్రీమన్నారాయణుని నిత్యం ధ్యానంలో ఉంచుకోవడానికి శ్రీ వైకుంఠ గద్యను అనుసంధించాలి. ఈ గద్యలో కూడా శ్రీమన్నారాయణుడు శ్రీయుక్తుడై ఉంటాడు:

"శీలరూప గుణవిలాసాదిభి రాత్మానురూపయా శ్రియా సహాసీనం..........."

ఇంక స్వామివారి విషయం :

..........ప్రత్యగ్రోన్మీలిత సరసిజ సదృశ నయన యుగళం, స్వచ్ఛనీల జీమూత సంకాశమ్, అత్యుజ్జ్వలపీత వాససం....... అచింత్య దివ్యాద్భుత నిత్యయౌవన స్వభావ లావణ్యమయామృత సాగరమ్ .......శ్రీమత్యా వైజయంత్యా వనమాలయా విరాజితం, శంఖ చక్ర

గదా సిశార్ఙ్గాది దివ్యాయుధైః స్సేవ్యమానం........ భగవంతం నారాయణం ధ్యానయోగేన దృష్ట్వా, తతో భగవతో నిత్యస్వామ్యమాత్మనో నిత్య దాస్యం చ యథావస్థిత మనుసంధాయ-"

ఇంక భగవద్రామానుజులవారి కోరిక-

"........కదాహం భగవంతం నారాయణం, మమ కులనాథం, మమ కులదైవతం, మమ కులధనం, మమభోగ్యం, మమ మాతరం, మమ పితరం, మమ సర్వం సాక్షాత్కరవాణిచక్షుషా; కదాహం భగవత్పాదాంబుజ ద్వయం శిరసా సంగ్రహిష్యామి; కదాహం భగవత్పాదాంబుజద్వయ పరిచర్యాశయా నిరస్త సమస్తేతర భోగాశోఽపగత సమస్త సాంసారిక స్వభావః తత్పాదాంబుజద్వయ పరిచర్యాకరణ యోగ్యస్తదేక భోగస్తత్పాదౌ పరిచరిష్యామి........"

దీనిలోని పరమపద వర్ణనమనోహరం. ఇది కపితాత్మకంగా భాసించినా-శ్రుతి, స్మృతి, పురాణాదుల ప్రమాణాలు దీనికి ఉన్నాయి. ఆదిశేషువు అవరావతారులైనవారు దర్శించినదే అది!

శరణాగతులు ఏమిచేయాలో, ఏమి కోరుకోవాలో స్పష్టంగా, తామే ఆ స్థానంలో ఉండి భగవద్రామానుజులవారు ఇందు తెలియజేశారు. ఈ గద్యత్రయం-శరణాగతి, రంగనాథ, వైకుంఠ గద్యలు-తమ వైభవ వైశిష్ట్యాలతో రచించిన నాటినుండి నేటివరకు ప్రపన్నులకు "కొంగుబంగారమై" ప్రకాశిస్తూనే ఉన్నాయి. భగవద్రామానుజులవారు శాస్త్ర నిష్ఠాతులైన మహామేధావులేకాదు; కరుణాతరంగితాంతరంగులైన కవులని, తమ గురువులైన తిరుక్కోట్టియూర్ నంబి గారిచ్చిన ఎంబెరుమానారు పేరు పరమ పరమ సార్థకమవుతోందని ఈ గద్యత్రయం స్థాపిస్తోంది.

శ్రీ వైష్ణవులకు తిరువారాధన సమయంలో మిక్కిలి ఉపయోగపడే గ్రంథం-భగవద్రామానుజులవారు రచించిన "నిత్యగ్రంథం" దీనిలో - గద్యత్రయంలోని విశేషాలు, ఎడనెడ విశిష్టాద్వైత సిద్ధాంత విషయాలు, ఇష్టదేవతలను అర్చించే విధానాలు, ఉపాసనా మార్గాలు, సర్వులకు అనుష్ఠేయాలైన సద్విషయాలు

వివరణాత్మకంగా ఉంది ముముక్షువులైన ప్రపన్నులకు దారిచూపే కరదీపికా కార్యాన్ని నిర్వహిస్తూ భగవదారాధనా విధాన ప్రదర్శకమై శ్రీవైష్ణవులకందరకు ఉపాదేయమయింది.

భగవద్రామానుజులవారు మేధావులు విద్వాంసులు అయిన ప్రత్యర్థులను తమ భాష్యాదుల ద్వారా; హృదయమున్న సామాన్య ప్రజలను, భక్తులను తమ ప్రవచనాల ద్వారా ఆదర్శమైన తమ నిత్యజీవిత విధానంద్వారా మార్చి సర్వులను శ్రీ విశిష్టాద్వైత ప్రపణులనుగా, శ్రీమన్నారాయణ సేవాపరాయణులనుగా చేశారు. తమ శిష్యవర్గంతో యావద్భారతం-ఆసేతుశీతనగం-పర్యటించి చాలా వైష్ణవదేవాలయాలలో పాంచరాత్రాగమోక్త విధానంలో అర్చనాదులు జరిగేవిధంగా మార్పులు తెచ్చారు. వేదాధ్యయనంతోబాటు ద్రావిడ దివ్యప్రబంధాధ్యయనం కూడా ఆయా దేవాలయాలలో జరిగిగేవిధంగా ఏర్పాట్లు చేశారు. వర్ణవివక్ష లేకుండా సర్వులకు పంచసంస్కారాలను ప్రసాదించి శ్రీవైష్ణవ సంప్రదాయ ప్రచారం చేశారు.

ప్రపథమంగా ద్రావిడ దివ్యప్రబంధాలకు వేదతుల్యమైన స్థానం ఇచ్చిన శ్రీనాథమునుల, వారి పౌత్రులు తమ పరమగురువులు అయిన శ్రీయామునాచార్యుల మార్గాన్నే అనుసరిస్తూ భగవద్రామానుజులవారు కూడా ద్రావిడ దివ్యప్రబంధాలకు వేదతుల్య ప్రాధాన్యాన్ని ఇచ్చారనడంలో సంశయం లేదు. అప్పుడు సహజంగానే భగవద్రామానుజులవారు తమిళంలో ఏమీ వ్రాయలేదా? అనే ప్రశ్న పుట్టుతుంది. ఈ విషయమై "సుధీమణి" శ్రీమాన్ చింకపాటి విజయరాఘవాచార్యులు, ఎం.ఏ; బి ఇడి; గారు వారి వ్యాసమైన "శ్రీమద్రామానుజులు - వారి కృతులు" (శ్రీరామానుజ కీర్తికౌముది; పదియవ భాగము (1990. పుట: 17) శ్రీరామానుజ కీర్తికౌముదీ గ్రంథమాల; గుంటూరు)లో ఇలా వ్రాశారు: "మరి శ్రీరామానుజాచార్యులవారు తమిళభాషలో ఏమియు వ్రాయలేదా? అను ప్రశ్న ఇట సహజముగా నుదయించును, వడగళ, తెంగళ సంప్రదాయములకు చెందిన శ్రీవైష్ణవాచార్యుల జీవిత చరిత్రలనుబట్టి, శ్రీరామానుజులవారు - ఆళ్వారులచే రచింపబడిన నాలాయిర దివ్యప్రబంధములోని సంప్రదాయ విశేషములను గూర్చియు, అందును ముఖ్యంగా-నమ్మాళ్వారుల తిరువాయి మొళిపైనను తమిళ భాషలో ఉపన్యాసము లొసంగియున్నట్లు తెలియవచ్చుచున్నది. శ్రీరామానుజుల వారి కోరికపై వారి శిష్యులగు 'తిరుక్కురుగై పిరాన్ పిళ్లాన్' అనువారు-తిరువాయిమొళికి మొట్టమొదట మణిప్రవాళ భాషలో "ఆరాయిరప్పడి" అను పేర నొక

భాష్యము‌ను రచించిరి. ఈ భాష్యమునందలి పదములు, సమాసములు శ్రీరామానుజులవారి రీతిని పోలియున్నది. 'ఆరాయిరప్పడి' వ్యాఖ్యానము శ్రీరామానుజుల వారి సిద్ధాంతములకు దర్పణము బట్టును."

ఈ వ్యాఖ్యానం (ఆరాయిరప్పడి) "మణిప్రవాళభాష"లో ఉన్నది గనుక, "ఈ భాష్యమునందలి పదములు, సమాసములు శ్రీరామానుజులవారి రీతిని పోలియున్నవి" అనడంలో సామంజస్యం కనబడుతోంది.

ఇది బాగానే ఉంది! మరి భగవద్రామానుజులవారు వారి రచనలలో ద్రావిడ దివ్య ప్రబంధాలనుండి ఎందుకు ఉదాహరణలియ్యలేదు; అనే ప్రశ్న కొందరికి తట్టవచ్చును. దీన్ని గురించి-దర్శన సార్వభౌమ- తర్క భూషణ-న్యాయవేదాంత శిరోమణి - ఉభయ వేదాంతవిద్వాన్ శ్రీమాన్ టి కె వి యన్. సుదర్శనాచార్యులు గారు వ్రాసిన "శ్రీనమ్మాళ్వారుల వైభవము"అనే తమ వ్యాసంలో (శ్రీరామానుజ కీర్తికౌముది: నాలుగవ భాగము (1983, పుట-56) ఇలా అన్నారు:

"శ్రీమద్రామానుజులవారు లోకహితార్థమై ప్రసాదించిన శ్రీసూక్తి షట్కమున, ద్రావిడ వేదాధ్యయనమునకును ఎందుకు ప్రాధాన్యమొసగియుండలేదు? వారి దివ్య శ్రీభాష్యాది గ్రంథములయందు దెచ్చటను - శ్రీనమ్మాళ్వారులనుగాని, వారి దివ్యప్రబంధములనుగాని యుదాహరింపలేదే? అని కొందరు ప్రశ్నించుచు, శ్రీమద్రామానుజులవారికి ద్రావిడ దివ్యప్రబంధముల యందు ప్రావీణ్యములేదనియు, తరువాతి వారలు తమ యభిమానానుసారము వారికిని దీనిని అంటగట్టుచున్నారనియు విమర్శించుచున్నారు. అట్టి వారలకు సమాధానము. పూర్వప్రకరణమునవే బాగుగా నిరూపింపబడియున్నది. మఱియును.'భాష్యం తు పరరంజకమ్' అను ప్రమాణానుసారము, శ్రీభాష్యాది గ్రంథములకు స్వమత స్థాపనము-భగవత్కల్యాణగుణ గణానుభవాదులున్నను, పరమత నిరసనాదులయందే పరమ తాత్పర్యమై యున్నందున, ప్రతివాదులంగీకరించు ప్రమాణములే నిరూపింపబడవలసి యున్నందున, ద్రావిడ దివ్యప్రబంధములను గాని ఆళ్వారులనుగాని ఉదాహరింపలేదుగాని, వస్తు తత్త్వమున సూత్రవాక్య సమన్వయాదులెల్ల శ్రీమదాళ్వారుల శ్రీసూక్తులను గొనియే చేసిరని తత్ప్రబంధ ద్వయాను సంధాన నిరతులగు మహానుభావులకు తెలిసిన విషయమే."

శ్రీమాన్ తిరుమలకుమార వేంకట నరసింహ సుదర్శనాచార్యులవారు "సై"

వ్యాసములోనే భగవద్రామానుజులవారు భేదా భేద శ్రుతుల సమన్వయ విషయంలో శ్రీనమ్మాళ్వారుల 'తిరువాయిమొళి'ని ఆధారంగా తీసుకొన్నారని చెప్పే సందర్భంలో ఇలా వ్రాశారు:

"ఐతదాత్మ్య మిదం సర్వం స ఆత్మాతత్త్వమసి శ్వేతకేతో-అనే ఉపనిషద్వాక్యములలో ప్రతిపాదింపఁబడిన జగచ్ఛరీరకత్త్వమును బాగుగ "ఉలనదు" ఇత్యాది పాశురములచే నిరూపించి, "తిడవిశుమ్బు"అను పాశురమున, సకల చేతనా చేతన పదార్థాం తర్యామిత్వమును అత్యద్భుత ప్రక్రియతో- "ఉడన్మిశై ఉయిరెనక్కరన్ది" అను భావముచే దెలుపుట మాత్రమేగాక, నిత్య నిరవద్యమైన శ్రుతులకును ఇదియే పరమతాత్పర్యమని "శుడమిగుశురుదియుళ్"అను భాగముచే చిక్కుదీర్చి, నిస్సంశయము వ్యక్తీకరించిరి. దీనినాధారముగాఁ దీసికొనియే శ్రీమద్రామానుజులవారు-భేద శ్రుతులకును, అభేద శ్రుతులకును ఘటకముగ నుండు ఘటక శ్రుతులను గనుకొని, ఆ శ్రుతులను సమన్వయపఱచి, శ్రీమద్విశిష్టాద్వైత సిద్ధాంతమును ప్రతిమిత్ర సిద్ధాంత సిద్ధమైన జగద్బ్రహ్మలకుండు శరీర శరీరి భావము కనుకొనుటతో వ్యవస్థాపించిరి." (పుట-59)

భగవద్రామానుజులవారు వారికి పూర్వులైన ఆచార్యులమార్గాన్నే అనుసరించి ద్రావిడ దివ్యప్రబంధాలకు వేదోపనిషత్తులకున్న స్థానాన్ని ఇచ్చి గౌరవించి వాటికి విశేష ప్రచారాన్ని తెచ్చారు. వారికి పరమాచార్యులైన శ్రీ యామునాచార్యుల వారు, వారి పితామహులైన శ్రీనాథమునులు వీరికి మార్గదర్శకులు శ్రీ మన్నాథమునులు అష్టాంగ యోగానుష్ఠానపరులు, తపోధనులు. వారు శ్రీ నమ్మాళ్వారులను సాక్షాత్కరింపజేసుకొని వారి కరుణా విశేషంచేత ద్రావిడ దివ్య ప్రబంధాలను సంపాదించి వాటి ప్రచారానికి పూనుకొనిన ప్రథమాచార్యులు. ఈ మహానుభావులే 'న్యాయతత్త్వం'అనే గ్రంథాన్ని రచించి శ్రీ విశిష్టాద్వైతతత్త్వ స్వరూపస్వభావాలను సర్వులకు మొదట తెలియజేశారు.

వీరు 'యోగరహస్యం' అనే తమ గ్రంథంలో అష్టాంగయోగానికి సంబంధించిన విధి విధానాలను విస్తృతంగా వివరించారు. వీరి పౌత్రులైన శ్రీ యామునాచార్యుల రచనలనుగూర్చి తెలుసుకొనేఉన్నాము.

ఈ మహోన్నత సంప్రదాయానికిచెందిన మహా మేధావులు, మహోదారులు, కరుణాసముద్రులు భగవద్రామానుజులు. వీరు ఉభయవేదాంతాలకు సమప్రా

ముఖ్యాన్ని ఇచ్చిన విషయం జగద్విదితం. ఈ విషయాన్ని The Alvars of South India అనే తమ గ్రంథం Introduction లో డా॥ కె. సి. వరదాచార్యులుగారు ఇలా ప్రస్తావించారు:

"The spread of Ramanuja's teachings in religion and philosophy meant also the spread of the mystical literature of rhe Alvars on which his teachings were based The revelations of the Alvars had the same or equal sanctity for him as the authoritative texts of the Vedas and Upanishads. Tte truths of both were considered to be capable of being synthesized or hormonized Thus the basic background of the Visistadvaita philosophy of religion was the Composite and harmonized truths of Veda and Abvar—hymns. Thus arose what has been Known as Ubhaya-Vedanta (the two Vedantas) harmonized to form a unitary system of philosophy and religion " (Page- XIX)

భగవద్రామానుజులవారి తరువాత ఆచార్య పరంపరలో వారంతవారయిన కవితార్కికసింహ, సర్వతంత్ర స్వతంత్ర శ్రీ వేదాంత దేశికులవరకు ఏకముఖంగా సాగిన శ్రీవైష్ణవ వియద్గంగావాహిని ద్విముఖంగా చీలింది. వాటి పేర్లు-వడగలై, తెంగలై-అనేవి. వడగలై సంప్రదాయానికి మూలపురుషులు శ్రీ వేదాంత దేశికుల వారు. తెంగలై సంప్రదాయానికి మూలపురుషులు శ్రీ పిళ్లలోకాచార్యులవారు. వారి తరువాత ఈ శాఖలో ముఖ్యులు శ్రీ మణవాళ మహామునులు, శ్రీ వరవర మహామునులు.

భగవద్రామానుజులవారి తరువాత సంస్కృతభాషలో విశేషగ్రంథ సముదాయాన్ని సృష్టించి విశిష్టాద్వైత సిద్ధాంతరక్షణకు ప్రచారానికి విశేష సేవచేసినవారు కవితార్కికసింహ, సర్వతంత్రస్వతంత్ర శ్రీ వేదాంతదేశికులుగా ప్రసిద్ధిపొందిన శ్రీ వేంకటనాథులు. శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఘంటావతారం వీరని ప్రసిద్ధి. గాత్ర

సంబంధమైన వీరి సంస్కృత రచనలలో-"తత్త్వటీక, శతదూషణి, గీతాభాష్య వ్యాఖ్యానం, అధికరణసారావళి, తత్త్వముక్తాకలాపం, న్యాయసిద్ధాంజనం, న్యాయ పరిశుద్ధి" మొదలైనవిఉన్నాయి ఈ మహానుభావులు అసంఖ్యాకమైన సంస్కృత స్తోత్రాలు రచించారు. దీర్ఘస్తోత్రాలలో "దయాశతకమ్", "పాదుకాసహస్రమ్" ప్రఖ్యాతాలు. జగజ్జనని అయిన శ్రీనివాసుని దివ్యమహిషియొక్క అనుకంపావర్ణనయే "దయాశతకమ్" మొదటిశ్లోకంలో ఇలా అంటారు:

ప్రపద్యేతం గిరింప్రాయః శ్రీనివాసానుకంపయా ।
ఇక్షుసార స్రవన్త్యేవ యన్మూర్త్యాశర్కరాయితమ్॥

తరువాత జగజ్జననిని ఇలాస్మరిస్తారు:

సమస్త జననీం వందే చైతన్య స్తన్యదాయినీమ్ ।
శ్రేయసీం శ్రీనివాసస్య కరుణామివరూపిణీమ్॥ (శ్లో-6)
వందే వృషగిరీశస్య మహిషీం విశ్వధారిణీమ్ ।
తత్కృపా ప్రతిఘాతానాం క్షమయావారణం యయా॥ (శ్లో-7)

తరువాతి శ్లోకంలో ప్రత్యేకంగా నీలాదేవిని పేరుతో స్మరిస్తారు:

నిశామయతుమాం నీలాయద్భోగపటలై ర్ధ్రువమ్ ।
భావితం శ్రీనివాసస్య భక్తదోషేష్వదర్శనమ్॥ (శ్లో-8)

"పాదుకాసహస్రమ్"లో, పాదుకలకు వైశిష్ట్యాన్ని తన అర్చనాభక్తిద్వారా ప్రకటించిన శ్రీరామ సోదరుడైన భరతుని ఇలాస్మరిస్తారు:

భరతాయ పరంనమోస్తు తస్మై ప్రథమోదాహరణాయ భక్తి
భాజామ్ । యదుపజ్ఞమశేషతః పృథివ్యాం ప్రథితో రాఘవ
పాదుకా ప్రభావః॥ (శ్లో-2)

ఈ 'సహస్ర' రచనను 32 పద్ధతులుగా "ప్రస్తావపద్ధతిః"తో ప్రారంభించి "ఫలపద్ధతిః"అని 32వ పద్ధతితో ముగించారు. దీన్ని

సంతః శ్రీరంగపృథ్వీశ చరణత్రాణశేఖరాః ।
జయంతి భువనత్రాణ పదపంకజరేణవః॥ (శ్లో-1)

అని ప్రారంభించారు. సహస్ర శ్లోకాలు అయిన తరువాత సంప్రదాయానుసారం ఇంకో 8 శ్లోకాలుకూడా రచించి ముగించారు. చివరి శ్లోకం-

జయతి యతిరాజసూక్తి ర్జయతి ముకుందస్య పాదుకాయుగళీ ।
తదుభయధనాస్త్రి వేదీ మవంధ్యయంతో జయంతి భువిసంతః॥

ఈయన వ్రాసిన స్తోత్రాలలో దశావతార స్తోత్రం ఒకటి. స్తోత్రం చివర అన్ని అవతారాలు వచ్చేలాగ వ్రాసిన క్రింది శ్లోకం సుప్రసిద్ధం:

ఇచ్ఛామీన విహారకచ్ఛప మహాపోత్రిన్ యదృచ్ఛాహరే
రక్షా(మాయా)వామన రోషరామ కరుణాకాకు త్స్థహేలాహలిన్ ।
క్రీడావల్లవ కల్కివాహన దశాకల్పిన్నితి ప్రత్యహం
జల్పంతః పురుషాః పునంతిభువనం పుణ్యైమపణ్యాపణాః॥

ఇదేవిధంగా వీరు వ్రాసిన "న్యాసదశకమ్" ప్రసిద్ధం. దీనిలో వారి సిద్ధాంతాన్ని ఇమిడ్చివ్రాశారు. వీరివైరాగ్య పంచకమ్ ఈ మహాపురుషుని నిర్లిప్తతను తెలియజేస్తుంది. దీనిలోని చివరి శ్లోకం-

శ్లో॥ నాస్తి పిత్రార్జితం కించిన్నమయా కించిదార్జితమ్ ।
అస్తిమే హస్తిశైలాగ్రే వస్తు పైతామహంధనమ్॥

ఆ మహానుభావుని భక్తి తత్పరతకు, సంతృప్తికి ప్రత్యక్ష నిదర్శనం. రాజాశ్రయాన్ని సూచించిన ఒకరికి పంపిన సందేశమిది అని అంటారు!

ఆనాడు విద్వాంసుల, తత్త్వవేత్తల, ఆచార్య పురుషుల యావద్భారత సంపర్కభాష సంస్కృతం గనుక, ద్రావిడ దివ్యప్రబంధ వైశిష్ట్యం అందరికీ తెలియజేయడంకోసం ఈ మహానుభావుడు "ద్రమిడోపనిషత్తాత్పర్య రత్నావళిః" అని "ద్రమిడోపనిషత్సారః" అని సంస్కృతంలో వ్రాసి ఆ ప్రస్థానానికి ప్రచారంతెచ్చారు. శ్రీ శఠకోపుల తిరువాయి మొళిలోని మొదటి రెండింటి భావరీతికి భగవద్రామానుజులవారి శ్రీ భాష్య భావరీతికి ఏకవాక్యత ఉన్నదనే విషయం వ్యక్తం చేయడానికే తమ "ద్రమిడోపనిషత్తాత్పర్య రత్నావళిః"లో ఇలా వ్రాశారు:

"ఆదౌశారీరకార్థ క్రమమిహ విశదంవింశతి ర్వ్యక్తిసాగ్రా
సంక్షేపోఽసౌవిభాగం ప్రథయతి చ బుధాం చారుపాఠోపపన్నమ్।

సమ్యగ్గీతానుబద్ధం సకలమనుగతం సామశాఖా
సహస్రం సంలక్ష్యం సాభిదేయైర్యజురపి దశకై
ర్వ్యాత్యథర్వారసైశ్చ॥ 5

విశిష్టాద్వైత సిద్ధాంతానికి "ప్రాణ" మైన పాంచరాత్ర శాస్త్ర వైశిష్ట్యాన్ని తెలిపే "పాంచరాత్రరక్ష"అనే గ్రంథం వ్రాసి "శ్రుతిమూలమిదంతంత్రం, ప్రమాణం కల్ప సూత్రవత"అని ప్రకటించారు.

ఈ విధంగా ఈ మహానుభావులు సంస్కృతంలో వ్రాయడమేకాక ద్రావిడ భాషలో కూడా దేశిక ప్రబంధం అని ప్రచారానికివచ్చినది వ్రాశారని తెలుస్తోంది.

వడగలై సంప్రదాయానికి మూల పురుషులు శ్రీ వేదాంతదేశికులవారని, తెంగలై సంప్రదాయంలో ప్రముఖులు శ్రీ పిళ్లలోకాచార్యులవారు. శ్రీ మణవాళ మహామునులు(పెరియ జీయర్)అని అంటారుగదా! ఒక్కమాటలోచెప్పాలి అంటే-శరణాగతి విషయంలో ఈపెద్దలలోవచ్చిన అభిప్రాయభేదాలే దీనికి కారణాలుగా చెప్పవచ్చును. ఈ అభిప్రాయభేదాలను వెలిబుచ్చినవారు సామాన్యులుకారు; మహావిద్వాంసులు! మహాభక్తులు! పరమ భాగవతులు! అందుకే శాఖలుగా విడిపోవడం జరిగింది.

ఇరుతెగలవారికి భక్తి ప్రపత్తుల విషయంలో అభిప్రాయభేదాలువచ్చాయి. భగవంతుని నిర్హేతుక జాయమాన కటాక్షంమీద నమ్మకంఉంచి జీవించాలి. ఆయన అనుగ్రహానికి హేతువు అనావశ్యకం. హేతువుఉంటే దాని దివ్యత్వం దెబ్బతింటుంది. భగవత్కటాక్షం మాతృస్తన్యంలాంటిది-భక్తి ప్రపత్తులద్వారా ఆకటాక్షాన్ని సంపాదించే ప్రయత్నం కృత్రిమ మవుతుంది. బజారు పాలులాగ. ఇది స్వగత స్వీకారం అవుతుంది. భగవంతుడు తనంతతాను జీవుణ్ణి అనుగ్రహించడం పరగత స్వీకారం అవుతుంది. ఇది గొప్పది. భాగవత సేవ భగవత్సేవను మించినది. అన్నింటికంటె ముఖ్యభేదం 'శ్రీ' విషయంలోఉంది. ఆమెకు (శ్రీకి) శేషిత్వంలేదు. అనన్యార్హ శేషత్వమే ఆమెకున్నది. ఆమె దయాస్వరూపిణి. పురుషకార రూపిణి, ద్రావిడ దివ్యప్రబంధాలు ఈ విషయంలో మనకు ప్రధాన ప్రమాణాలు అంటారు తెంగలై శాఖవారు.

భక్తి ప్రపత్తులు వడగలై సంప్రదాయంవారికి "ప్రాణాలు"మోక్షసాధనాలు.

భగవత్కృప నిర్హేతుకం అందే శాస్త్ర పురాణాదులు చెప్పిన భక్త్యాదుల ప్రాముఖ్యం లేకుండాపోతుంది. అన్ని శాస్త్రాలు భక్తి ప్రాముఖ్యాన్ని వేనోళ్ల కొనియాడుతున్నాయి. ఇవి అనావశ్యకాలని భావిస్తే ప్రజలు భ్రష్టులవుతారు. భగవదనుగ్రహం ఆవశ్యకమే. అదే మోక్షానికి తీసుకొనిపోయేది. కాని, దాన్ని మనం అర్హులమై పొందాలి. ఆ అర్హత భక్త్యాదులవల్ల కలుగుతుంది. శ్రీ దేవి నారాయణునిలాగే విభువు; శేషి. శ్రీ విశిష్టుడైన నారాయణుడు శ్రీమన్నారాయణుడై ముక్తి ప్రదాత అవుతున్నాడు. వీరిద్దరి సంబంధం-పుష్పపరిమళ సంబంధంవంటిది. ఎప్పుడూ రెండూ కలిసే ఉంటాయి లక్ష్మీదేవి 'అ'(ఈశ్వరుడు)కారంగాని 'మ'కారం(జీవుడు) కాదు.

తెంగలై, వడగలై వాదాలు ఉత్పన్నం కావడానికి-శ్రీమన్నారాయణుడే ఉపాయోపేయ భూతుడనే దృష్టి, వడగలై సంప్రదాయంవారు ఉపాయానికే ప్రాధాన్యం ఇచ్చి అదే ముక్తి హేతువన్నారు. శ్రీమన్నారాయణునికృప నిర్హేతుకం కాదు. సహేతుకం, కనుక మనం దాన్ని సంపాదించుకోవాలి. ఇక్కడ మర్కట కిశోరన్యాయం వర్తిస్తుంది. కోతిపిల్ల తల్లిని తానే పట్టుకొని ఉండాలి; తల్లి తాను పట్టుకొని ఉండదు. ఇంక తెంగలైవారు భగవంతుని నిర్హేతుక జాయమాన కటాక్షాన్ని నమ్ముతారు గనుక వారు భగవంతునికీ భక్తునకుగల సంబంధాన్ని మార్జాల కిశోర న్యాయంతో పోలుస్తారు. తల్లి పిల్లి పిల్లికూనను తానే నోటకరచుకొని తీసుకొని పోతుంది. ఇక్కడ బాధ్యతఅంతా తల్లి పిల్లిదే! ఇదేవిధంగా భక్తుని బాధ్యత అంతా భగవంతునిదే! ఈ దృష్టిభేదంవల్ల ఉభయ సంప్రదాయాలలో ఆచార వ్యవహారాదులలో చిన్నచిన్న భేదాలు కనబడుతూ ఉంటాయి.

తెంగలై సంప్రదాయానికి మూల పురుషులనదగిన శ్రీ పిళ్లలోకాచార్యుల వారు వ్రాసిన "శ్రీవచనభూషణం" వీరికి ప్రమాణగ్రంథం. ఈయన వ్రాసిన రహస్యగ్రంథాలలో "అష్టాదశరహస్యాలు" అనేది సుప్రసిద్ధం. శ్రీ వేదాంత దేశికుల వారు వ్రాసిన అనేక రహస్యగ్రంథాలలో "రహస్యత్రయసారం" ప్రముఖమైనది. ఆచార్య పురుషులలో శ్రీనాథమునులు ప్రథములైనట్లే, ద్రావిడ సంప్రదాయ మనదగిన తెంగలై సంప్రదాయంలో ప్రథమాచార్యులు శ్రీ పిళ్లలోకాచార్యులు.

శ్రీనాథమునుల శ్రీయామునాచార్యుల అనుయాయులైన భగవద్రామానుజుల విశిష్టాద్వైత సిద్ధాంతాదికాన్ని తమ రచనలద్వారా విజృంభింప జేసినట్లే, శ్రీ పిళ్ల

లోకాచార్యుల తరువాత శ్రీ మణవాళ మహామునులు వచ్చి తెంగలై సంప్రదాయానికి గొప్ప ప్రచారం తెచ్చారు.

భగవద్రామానుజులవారి వ్యక్తిత్వాన్ని గురించి, ఆయన శ్రీవైష్ణవ సంప్రదాయంలో సిద్ధాంతపరంగా సాధించిన సమన్వయ వైశిష్ట్యాన్ని గురించి శ్రీరామకృష్ణ మఠానికి చెందిన స్వామి ఆదిదేవానందులు వ్రాసిన Visishtadvaita, the Philosophy of Sri Ramanuja అనే వ్యాసంలో (Life of Sri Ramanuja by Swami Ramakrishnananda (1863–1911) Second Edition 1965 Sri Ramakrishna Math, Madras) అనే గ్రంథంలో Appendix C-II Page–251 పై వ్యాసం ఉంది.) ఇలా అన్నారు:

"The system of philosophy associated with the name of Ramanujn is known as Visishtadvaita. The chief contribution of Ramanuja apart from his effort to systematize the philosophy of the Upanishads, is his attempt to develop a complete system which synthesizes the concept of God with the philosophy of the impersonal Absolute We should not think that Ramanuja developed any new philosophy, and he makes no claim of Originality. He was the culmination of the movement that started from tne Vedas and wss nourished by Alvars, Nathamuni and Yamunacharya. Ramanuja's genius and supreme efforts sesulted in the systematic presentation of Visishtadvaita which emphasizes the spiritual experience of God without ignoring the critical methods of philosophy. Visishtadvaita owes not a little of its influence on the subsequent development of the philosophy of religion to his clear and rational interpretation of it In his exposition of the Vedanta, he claims

merely to follow the doctrines of Bodhayana, Tanka, Dramida, Guhadeva Kapardin and Bharuci, many of whom preceded Sankara, and the prima facie views mentioned in Sankara's writings show that Ramanuja's assertion as following an ancient tradition is not unfounded. His works, nine in all, give an idea of masterly exposition and-consistency of philosophy. Prof. Berriedale Keith says that the "Sri Bhashya, his commentary on the Brahma Sutras, conveys an impression of no mean philosophical insight, and it is fair to assume that his work in substantial merit and, completeness far outdid any previous offort to find in the Brahma Sutras a basis for monotheism."

భగవద్రామానుజులవారి విశిష్టాద్వైత సిద్ధాంతంలోని విషయాలను క్రింది శ్లోకం చక్కగా వివరిస్తుంది :

"శ్రీమల్లక్ష్మణయోగిసిద్ధాన్తే భువనం సత్యం తదీశః శ్రియః
కాంతో బ్రహ్మైవ స ఏవ సోఽఖిల తనుః భిన్నాస్తతః చేతనాః।
సత్యాసంసృతిరీశ నిగ్రహకృతా ముక్తిస్తు భక్త్యాది నా
తత్ప్రాప్తిః పరమేపదే తదనుభూత్యాత్యేతి సంచక్షతే ॥"

స్థూలంగా దీని భావం ఇది- శ్రీమల్లక్ష్మణయోగులు (భగవద్రామానుజులు) విశిష్టాద్వైత సిద్ధాంతానికి ముఖ్యాచార్యులు. భువనం (జగత్తు)సత్యం; దీనికి ఈశుడు (అధిపతి) శ్రియః పతి. ఆయనే పరబ్రహ్మ; అఖిల జగత్తులు ఆయన శరీరమే. జీవులు ఆయన కంటె భిన్నులు. ఆయన నిగ్రహంవల్ల ఉద్భవించిన ఈ సంసృతి (సంసారం)సత్యం. భక్త్యాదుల వల్లనే ముక్తి. పరమపదంలో కలిగే ఆ బ్రహ్మానుభూతి అనేదే ఆ పరమపురుషుని ప్రాప్తి.

అణువో కాక కడు న్మహావిభుఁడో
యచ్ఛిన్నుఁడో భిన్నుఁడో

గుణియో నిర్గుణియో యటంచు
విబుధుల్ కుంతీ భవ తత్త్వమా
ర్గణులై యే విభూపాదపద్మ భజనో
త్కర్షంబులం దత్వ వీ
క్షణముం జేసెదరట్టి విష్ణుఁబరమున్
సర్వాత్ము సేవించెదన్.
(శ్రీమద్భాగవతం; II స్కంధం; అధ్యా-4పద్యం-66)

ఈ పద్యార్థం- అన్ని భారతీయ తాత్త్విక సిద్ధాంతాల తర్క-వితర్కాలను ఆలోచనా విధానాలను మన కట్టెదుట నిలుపుతుంది. వీటితో తనకేమి సంబంధం లేనట్లు సర్వ విభూతులతోసర్వాత్ముడైన విష్ణువు విరాజిల్లుతూ ఉంటాడు గనుక ఆయన్ని సేవించడం సముచితమే!

వైదిక సంప్రదాయంతో బాటు ఆళ్వారుల ద్రావిడప్రబంధ సంప్రదాయాన్ని కూడా అంగీకరించడంలోనే శ్రీవైష్ణవ సంప్రదాయ విశిష్టత ఉన్నది. ఇదే ఆ సంప్రదాయాభిజ్ఞులను ఉభయ వేదాంత ప్రవర్తకులను చేసింది.

భారత ప్రపంచంలో భక్తి సంప్రదాయాన్ని తమ రచనల ద్వారా తమ జీవితాలద్వారా సామూహికంగా ప్రచారం చేసినవారే ఈ ఆళ్వార్లు. వారి రచనల్ని శిరోధార్యంగా అంగీకరించి, సర్వవిద్వజ్జన సామాన్యమైన సంస్కృత భాషలో తమ తాత్త్వికరచనలు చేసి శ్రీ సంప్రదాయానికి యావద్భారత ప్రచారంతెచ్చారు ఆచార్యులు. ఈ విధంగానే శివభక్తిని ప్రచారంచేసిన "అరువత్తుమువ్వరు" నయనార్లూ ఉన్నారు. ఇతఃపూర్వం వివరించినట్లు, అవతార ప్రసక్తి విష్ణువున కున్నంతగా శివుని విషయంలో సంప్రదాయంలో కనబడదు గనుక వారి ప్రస్తావన చేయలేదు. ఆళ్వారుల ప్రభావం- దక్షిణం నుండి ఉత్తరందాకా ప్రసరించి, అర్వాచీన కాలంలో ఉత్తరభారత భాషా సాహిత్య సంస్కృతులమీద చెరగని ముద్ర వేయడంవల్ల, ఆళ్వారులను గురించి కొంత విపులంగా వివరించడం జరిగింది.

భక్తి సంప్రదాయ విజృంభణంలో దక్షిణభారతానికి యావద్భారతంలోను ఒక విశిష్ట స్థానం ఉంది. పద్మపురాణాంతర్గత భాగవత మాహాత్మ్యంలో "భక్తి" నారదుని ప్రశ్నకు - నారద ఉవాచ :

కానిత్వం కావిమౌ చేమానార్యః కాః పద్మలోచనాః ।
వదదేవి సవిస్తారం స్వస్య దుఃఖస్య కారణమ్॥

సమాధానంగా; ఆమె చెప్పిన వాక్యాలు గమనార్హం.

ఉత్పన్నాద్రవిడే సాహం వృద్ధింకర్ణాటకే గతా।
క్వచిత్క్వచిన్మహారాష్ట్రే గుర్జరేజీర్ణతాం గతా॥

భక్తి ఉదయాస్తమయాలను తెలిపే ఈ భావమే. భక్తి ద్రావిడ ప్రాంతంలో పుట్టిందని, దాన్ని రామానందులు తెచ్చారని - ఆయన శిష్యులని ప్రచారంలో ఉన్న శ్రీ కబీర్ ఒక సూక్తి ఇలా ఉంది:

భక్తి ద్రావిడ్ ఉపజీ, లాయే రామానంద్।
కబీర్ నే పర్‌గట్ కరీ, సాత్ దీప్ నవ్ ఖండ్॥
(పర్‌గట్ కియో కబీర్‌నే సప్తద్వీప్ నవ ఖండ్)

## "రామావత్" సంప్రదాయం

ఈ సంప్రదాయానికి ప్రవక్త-కబీర్, తులసీదాస్ మొదలైన మహాకవులకు గురుస్థానీయులయిన శ్రీరామానందులు, శ్రీ రామానుజానుయాయులని అందరూ అంగీకరించారు. వీరు సంస్కృతంలో రచించిన "వైష్ణవమతాబ్జ భాస్కరం", "రామార్చన పద్ధతి"అనే రెండు గ్రంథాలు వీరి తాత్త్వికదృష్టిని, గురుపరంపరను తెలుపుతున్నాయి. "రామార్చన పద్ధతి"లో ఇచ్చిన గురుపరంపర ఈ విధంగా ఉంది:

"శ్రీరామచంద్రుడు - శ్రీసీత- విష్వక్సేనుడు- శఠకోపుడు- నాథముని- పుండరీకాక్షుడు - రామమిశ్రుడు - యామునాచార్యుడు - మహాపూర్ణాచార్యుడు - రామానుజాచార్యుడు - కూరేశుడు - మాధవాచార్యుడు - బోపదేవాచార్యుడు - దేవాధిపుడు- పురుషోత్తముడు- గంగాధరుడు- రామేశ్వరుడు - ద్వారానందుడు - దేవానందుడు - శ్రియానందుడు - హరియానందుడు - రాఘవానందుడు - రామానందుడు".

శ్రీరామానందులు పదిహేనో శతాబ్ది ఉత్తరార్థం నుంచి పదహారో శతాబ్ది ప్రారంభ సంవత్సరాల వరకు గురుత్వాన్ని నెరపినారని విద్వాంసులు అంగీకరిస్తున్నారు. ఢిల్లీ పాదుషా సికందర్ లోడీకి సమకాలికులు వీరు. కులభేదాల,

మతభేదాలు భక్తి సంప్రదాయంలో అప్రదానాలు అనే విషయం రామానందుల శిష్యులను బట్టి స్వయం వ్యక్తమవుతుంది. ఒక విధంగా భక్తి సంప్రదాయానికి ప్రారంభకులు. మార్గదర్శకులు అని చెప్పదగిన ఆళ్వార్లలో, శైవ నాయన్మార్లలో అన్ని కులాలవారు ఉండడం మనకు తెలిసిందే!

శ్రీ రామానందుల శిష్యులు పన్నెండుగురు (ఆళ్వార్లవలెనే) అని చెప్పుతున్నారు. వీరిలో ముఖ్యులు-సేనానాయి, కబీర్, పీపా, రైదాస్, ధన్నా అనేవారు. పద్మావతి అనే మహిళకూడా ఒకరున్నారని (గోదాదేవివలె)కూడా అంటున్నారు. వీరందరిని జితేంద్రియులని వ్యవహరించడం ఉంది. ఆనందనామధారులని పిలవబడే శిష్యులు ఏడుగురున్నారని కూడా తెలుస్తోంది. వీరు - అనంతానంద్, సురసురానంద్, నరహరి యానంద్, యోగానంద్, సుఖానంద్, భవానంద్, గాలవానంద్- అనేవారు. రామానందుల గురువైన రాఘవానందులతో ప్రారంభించి పై పేర్లన్నీ క్రింది శ్లోకం పఠించింది:

"రాఘవానంద ఏతస్య రామానంద స్తతోఽభవత్
సార్ధ ద్వాదశశిష్యాః స్యుః రామానందస్య సద్గురోః।
ద్వాదశాదిత్య సంకాశాః సంసారతిమిరా పహాః
శ్రీమదనంతా నందస్తు సురసురానంద స్తథా॥

నరహరి యానందస్తు యోగానంద స్తథైవత్ర
సుఖా భావాగాలవంచ సప్తైతే నామనందనాః।
కబీరశ్చరమా(రై) దాసః సేనాపీపాధనా స్తథా
పద్మావతీ తదర్ధశ్చషడే తే చ జితేంద్రియాః"॥

(భక్తిసుధా బిందుస్వాద్)

ప్రాచీనకాలంలోని మహానుభావుల అందరి విషయంలోలాగే వీరందరి విషయంలోను- దేశకాలాదులకు సంబంధించిన అభిప్రాయ భేదాలున్నాయి. రామానందుల విషయంలోనే ఇది తప్పలేదు. ఆయన దాక్షిణాత్యుడు కాదనేవారూ ఉన్నారు. ఈ సందర్భంలో మనకు, వీరందరూ భక్తి సంప్రదాయ ప్రచారానికి చేసిన సేవే ముఖ్యం. మిగిలినవి అముఖ్యాలు. భక్తిమార్గానికి సంబంధించినంత

వరకు వీరిందరి విషయంలోను ఏకవాక్యత ఉంది. అందరూ మహాభక్తులు. సగుణ నిర్గుణ విషయంలో విశేషంగా చర్చలలోకి దిగినవారు కారు. భాగవత సంప్రదాయాన్ని అంగీకరించినవారు. అవతారాల్లో రామావతారానికి విశేష ప్రాముఖ్యం ఇచ్చారు. అనాటి సమాజంలో రామానందుల కీర్తి ప్రతిష్ఠల్ని తెలుసుకోవడానికి, ఆయనకు సమకాలికులైన మౌలానా రశీదుద్దీన్ అనే ముస్లిం సిద్ధపురుషులు, తాము ముస్లిం భక్తుల్ని గురించి వ్రాసిన "తజ్ కిరే తుక్ ఫుక్ రా" అనే గ్రంథంలో రామానందుల్ని గురించి క్రిందివిధంగా వ్రాయడమే తార్కాణం.

"ఈ కాశీనగరంలో 'పంచగంగా ఘాట్'లో ఒక మహాత్ముడు నివసిస్తున్నాడు. ఈయన తేజోవంతుడు. వైష్ణవుల్లో మానసీయుడైన ఆచార్యుడు. సదాచార సంపన్నుడు. సత్యమైన భగవద్భక్తుడు. బ్రహ్మవేళయందే తన మహానుండి గంగా స్నానానికి బయలుదేరిపోతాడు. ఈ పవిత్రాత్మ పేరు రామానందుడు. ఈయనకు అయిదువందల మంది శిష్యులున్నారు. వీరిలో పన్నెండుగురు-కబీర్, పీపా, రైదాస్ మొదలైనవారు ముఖ్యులు. వీరి భాషలో ఇలాంటి వారిని విరాగులంటారు. ఈ సంప్రదాయాన్ని ప్రవర్తింపజేసినవారు జగజ్జననీ సీత అంటారు. ఈమె వల్ల ఉపదేశంపొంది హనుమంతుడు ఈ సంప్రదాయాన్ని ప్రచారం చేశాడు. ఈ సంప్రదాయాన్ని - సీతను బట్టి-"శ్రీ" సంప్రదాయం అంటారు. దీని ముఖ్య మంత్రాన్ని "రామతారక" మంత్రం అంటారు. గురువు శిష్యుని చెవిలో ఈ మంత్రాన్ని ఉపదేశించి దీక్ష యిస్తాడు. ఈ సంప్రదాయంవారు పన్నెండు చోట్ల ఊర్ధ్వపుండ్రాలు ధరిస్తారు. ఇవి "లామ్", "మీమ్" (ఉర్దూ లిపిలో అక్షరాలు) లాగ ఉంటాయి. వీరి నాలుక భగవన్నామంతో, మనస్సు భగవద్ధ్యాన సుశూహలంతో ఉంటాయి. వీరందరూ భగవద్భక్తులు."

ఒక ముస్లిం సిద్ధపురుషులు ఇలా వ్రాశారంటే, ఇద్దరూ - రామానందులు, మౌలానా రశీదుద్దీన్‌లు ఎంత గొప్పవారో తెలుస్తోంది. అనాటి రామానందుల ఔన్నత్యం ఇతర మతస్థులుకూడా గౌరవించేటంత గొప్పది. దీన్ని చూచి కొందరు, రామానందుల సంప్రదాయం విశిష్టమైనదనీ దానికి ఇతర సంప్రదాయాలతో సంబంధం లేదనీ చెప్ప ప్రయత్నిస్తారు. ఇది ఆమోదయోగ్యం కాదు. సత్య దూరం. రామానందులు శ్రీరామానుజ సంప్రదాయాన్ని అనుసరించినవారే. వీరి సంప్రదాయంలో కనబడే భేదాలు - ఈ ఆచార్యులు నివసించిన దేశకాలాల్ని బట్టి వచ్చినవేగాని తత్త్వతః భేదాలుండి కాదని విద్వాంసుల అభిప్రాయం.

శ్రీ సంప్రదాయంలోని తత్త్వత్రయాలు - చిత్తు, అచిత్తు, ఈశ్వరుడు- శ్రీరామానందులూ అంగీకరించి గ్రహించినవే. వీటి పరస్పర సంబంధం మొద లైన తాత్త్వికాంశాల విషయంలో, ఈ రెండు సంప్రదాయాలకు ఏకవాక్యత ఉంది. తాత్త్వికంగా రెండు సంప్రదాయాలు (రెండు సంప్రదాయాలని సౌలభ్యం కోసం చెప్పినా, రామానందుల 'రామావత్' సంప్రదాయం, శ్రీరామానుజుల శ్రీ సంప్ర దాయం మీద చాలావరకు ఆధారపడి ఉన్నదే!) విశిష్టాద్వైత సిద్ధాంతంమీద నిలిచి ఉన్నవే. రహస్యత్రయాల విషయంలో కొన్ని మార్పులున్నా అర్చనా మూర్తుల విషయంలో భేదమున్నా రెండూ విష్ణుపారమ్యాన్ని అంగీకరించినవే. ఈ మార్పు లను గురించే ముందు శ్రీసంప్రదాయంలోని రహస్యత్రయాన్ని ఒకసారి స్మరి ద్దాము.

శ్రీ సంప్రదాయానుసారం భక్తుడు రహస్యత్రయం ద్వారా అర్థపంచక జ్ఞానాన్ని పొందడమే సర్వోత్కృష్టం. "తాపః పుండ్రస్తథా నామ మంత్రో యాగశ్చ పంచమః" అను విధంగా పంచ సంస్కారాలు అవశ్యకాలు. వీటివల్ల, సదాచార్య సమాశ్రయణం వల్ల భక్తునకు వైష్ణవత్వం సిద్ధిస్తుంది. శ్రీవైష్ణవరహస్య త్రయంలో శ్రీమదష్టాక్షరీ మహా (తిరు)మంత్రం ("ఓం నమో నారాయణాయ) మొదటి రహస్యం. ఈ మంత్రవివరణమే రెండో రహస్యమైన (మంత్ర రత్నం) ద్వయమంత్రం. ("శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే", "శ్రీమతేనారా యణాయనమః"). ఈ ద్వయ మంత్ర వివరణమే చరమశ్లోకమైన మూడో రహస్యం. ఇది భగవద్గీతలోని ప్రఖ్యాతమైన శ్లోకం:

"సర్వ ధర్మాన్ పరిత్యజ్యమామేకం శరణం వ్రజ।
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః ॥"

ఈ రహస్యత్రయం, వేద వేదాంతాది సర్వశాస్త్ర తాత్పర్య సంగ్రహాలైన సూత్ర సంపుటి అని వైష్ణవుల విశ్వాసం. శ్రీమద్రామాయణ భారత భాగవతాల పవిత్రత తెలియని భారతీయుడుండడు. ఈ రహస్యత్రయ వివరణయే, వీటిలోని "వస్తువు" అని సంప్రదాయజ్ఞుల విశ్వాసం. శ్రీమద్రామాయణ మహాత్మ్యంలో "రహస్యత్రయ" వివరణ మిట్లుంది:

"శ్రీమద్భాగవతం శాస్త్రం మూలమంత్రోప బృంహణమ్ ।
చరమశ్లోక తాత్పర్యగ్రాహకం భారతం మహత్ ॥"

"ఇదం రామాయణం శాస్త్రం ద్వయమంత్రోపబృంహణమ్ ।
పవిత్రమేతత్ త్రితయం నాతోఽన్యద్విద్మహే పరమ్ ॥"

శ్రీమద్భాగవత మంతా మూలమంత్రమైన శ్రీమదష్టాక్షరీ వివరణం, మహాభారతం చరమశ్లోక తాత్పర్యగ్రాహకం, ఇంక రామాయణమో- ద్వయమంత్ర వివరణం.

"వేదకల్పవృక్ష విగళితమై, శుకముఖసుధాద్రవమున మొనసియున్న భాగవత పురాణఫలరసాస్వాదన" చేసినవారికి "భాగవతాఖ్యమంత్రము" "సర్వమంత్రముల నేలినది" అనీ "మోక్షలక్ష్మీరూపు" "అనీ కర్మబంధముల నెల్లహరించు నది" అనీ తేలిపోతుంది. ఇదే మూల మంత్రమైన "శ్రీమదష్టాక్షరి" వివరణమని వ్యక్తమవుతుంది.

శ్రీమద్రామాయణం వేదసారమేగదా! మర్యాదాపురుషోత్తముడైన శ్రీరామచంద్రుడు వేదపురుషుడైన శ్రీమన్నారాయణుడే. మూర్తీభవించిన పరమాత్మ:

"వేదవేద్యేపరేపుంసి జాతే దశరథాత్మజే ।
వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా ॥"

వైష్ణవులకు ప్రాణప్రదమైన "శరణాగతి" మంత్రమైన 'ద్వయమంత్రం' శ్రీమద్రామాయణంలో శ్రీరామచంద్రునిద్వారా సఫలమైంది. నిష్కర్షగా నిశితంగా ప్రతిజ్ఞాపూర్వకంగా శ్రీరాముడు తన భక్తుల్ని రక్షిస్తాననీ వారికి తన ప్రాపు ఎప్పుడూ ఉంటుందని మాటలద్వారా, చేతలద్వారా శ్రీమద్రామాయణంలో ప్రకటిస్తాడు. చరమశ్లోకం- "నీవే తప్ప నితః పరం బెఱుగ" ననే సంపూర్ణాత్మార్పణభావాన్ని జీవునిలో ప్రేరేపించి ప్రోత్సహించి పరాత్పరుడు అనుగ్రహించడాన్ని తెలుపుతుంది.

భారతీయభాషలలో బయలుదేరిన అన్ని రామాయణాలూ-ఇంచుమించుగా-శ్రీరాముని పరబ్రహ్మత్వాన్ని-ఎక్కడో అక్కడ-వాచ్యంగా చెప్పినవే! వాల్మీకి రామాయణం తరువాత వేలకొలది సంవత్సరాలకు బయలుదేరిన ఈ భాషారామా

యణాలు శ్రీరాముని పురుషునిగాకంటె పురుషోత్తమునిగా విశేషంగావర్ణించడంలో ఆశ్చర్యంలేదు. వాల్మీకి చిత్రించిన ఆదర్శ పురుషుడు, దక్షిణదేశంలో ఆళ్వారుల కాలంనాటికి విష్ణ్వంశసంభూతునిగా పరమపురుషునిగా వర్ణితుడైనాడు. ఈ భక్తి ప్రవృత్తులు భారతదేశంలో ప్రాక్పశ్చిమోత్తరదిశలుగా పాకి వివిధ దేశభాషలలో "అవతారభక్తి" సాహిత్యాన్ని విశేషంగా సృష్టించాయి.

భాషారామాయణాలలో, అధ్యాత్మరామాయణాన్ని ఎక్కువగా అనుసరించిన తులసీదాసుని రామచరిత మానసంలో శ్రీరామచంద్రుడు అడుగడుగునా పరమేశ్వరునిగా వర్ణితుడు కావడంలో ఆశ్చర్యంలేదు. ఈ "మానస" రచనలో అనేక గ్రంథాల్ని-రామాయణాల్నికూడా-చూచినట్లు తులసీదాసే వ్రాసుకొన్నాడు:

"నానాపురాణ నిగమాగమ సమ్మతం యద్
రామాయణే నిగదితం క్వచిదన్యతోఽపి।
స్వాంతస్సుఖాయతులసీ రఘునాథగాథా
భాషానిబంధమతి మంజులమాతనోతి ॥"

అవతారమూర్తి అయిన శ్రీరాముని గుణకీర్తనం చేసిన తులసీరామాయణం భారతీయ సమాజంమీద- ముఖ్యంగా హింద్యార్య భాషాభాషీయులమీద-చెరగని ముద్రవేసి, సమాజాన్ని తీర్చిదిద్దింది. అవధీ భాషలో వ్రాసిన తన రామాయణంలో తులసీదాసు ఎడనెడ సంస్కృత శ్లోకాలుకూడా వ్రాసివాటి సంస్కృతపండితులకు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడా అనిపిస్తుంది. సీతారాముల విషయంలో తులసీదాసునకున్న భావాల్ని ఈ శ్లోకాలు విశదీకరిస్తాయి:

"ఉద్భవస్థితి సంహారకారిణీం, క్లేశహారిణీమ్।
సర్వశ్రేయస్కరీం సీతాం నతోఽహం రామవల్లభామ్॥"

"యన్మాయావశవర్తి విశ్వమఖిలం బ్రహ్మాదిదేవాసురాః
యత్సత్త్వాదమృషేవ భాతి సకలంరజ్జౌయథాఽహేర్భ్రమః॥
యత్పాదప్లవ ఏకఏవ హి భవాంభోధే స్తితీర్షావతాం
వందేఽహం తమశేషకారణపరం రామాఖ్యమీశం హరిమ్॥"

"నాన్యాస్పృహా రఘుపతే హృదయేఽస్మదీయే
సత్యం వదామి చ భవానఖిలాంతరాత్మా ।
భక్తిం ప్రయచ్ఛ రఘుపుంగవ నిర్భరాం మే
కామాదిదోషరహితం కురు మానసంచ ॥"

ఈ శ్లోకాలు చూస్తే, భక్తిజ్ఞాన వైరాగ్యాలు ముప్పేటలుగా ఎలా ముడివడిఉన్నాయో శ్రీ తులసీదాసుని మనస్సులో సీతారాములెలా భాసించారో తెలుస్తుంది! ఒకవైపు అద్వైతవేదాంతుల "రజ్జుసర్పభ్రాంతి"ని ప్రస్తావిస్తూనే, ఇంకోవైపు సగుణోపాసకుని మార్గంలో "భక్తిం ప్రయచ్ఛ" "కామాదిదోషరహితం కురుమానసం" అని శ్రీ తులసీదాసు "రఘుపుంగవు"ని వేడుకొంటాడు. ఆచార్యపురుషులేమన్నా, విద్వాంసులెలా వాదించినా, పరబ్రహ్మవిషయంలో భారతీయ జనబాహుళ్యం దృష్టి శ్రీతులసీదాసుని దృష్టినే పోలి ఉంటుందనడం సత్యదూరం కాదు. అవతార ప్రయోజనం కూడా అందరినీ ఉద్ధరించడమే గదా! మధ్యకాలీన హిందార్యభాషాభాషియులకు శ్రీ తులసీదాసు రచించిన "రామచరితమానస" మందే అంతరక్తికి కారణం ఆయన తాత్త్వికదృష్టి. దానికి వన్నెపెట్టే కవితాపుష్టి. శ్రీ నాభాదాసు తన భక్తమాలలో:

సంసార అపారకే పారకో సుగమరూపనవకా లయో ।
కలి కుటిల జీవనిస్తార హిత వాల్మీక 'తులసీ" భయో ॥"

అని శ్రీ తులసీదాసును కీర్తించాడు. అపరవాల్మీకి అయిన శ్రీ తులసీదాసు మధ్యయుగంలో భారతదేశంలో- ముఖ్యంగా హిందార్య భాషాభాషియులలో-భక్తిని తద్వారా ఆత్మ విశ్వాసాన్ని నైతిక పథగమనాన్ని పెంపొందించిన మహానుభావుడు. ఇందువల్లనే శ్రీ తులసీదాసునకు సమకాలికులు, బ్రహ్మవేత్తలు, సిద్ధాంతబిందు, అద్వైతసిద్ధి మొదలైన ఉద్గ్రంథ రచయితలునైన శ్రీ మధుసూదన సరస్వతీస్వాములు శ్రీ తులసీదాసు నిట్లు భూషించారు.

"ఆనంద కాననేకశ్చిజ్జంగమస్తుల సీతరుః ।
కవితామంజరీయస్య రామభ్రమరభూషితా ॥"

భక్తి జ్ఞాన కర్మలకు చక్కని సమన్వయం చూపింది అవతారపురుషులైన

శ్రీరామచంద్రుని పరాత్పరునిగా గుర్తించి తులసీదాసు శ్రీరామచరిత మానసాన్ని రచించాడు. సగుణ భక్తిమార్గాన్ని సుగమంచేశాడు. పరబ్రహ్మనిర్గుణత్వాన్ని గుర్తించినా, కలికాలంలో భక్తిలేకపోతే లాభంలేదని కంఠోక్తిగా చెప్పి సేవక సేవ్యభావమే సంసారతరణోపాయం అన్నాడు:

"సేవక సేవ్య భావ బిను భవ న తరియ ఉరగారి।
భజహు రామ పదపంకజ అససిద్ధాంత బిచారి॥"

ఈ విధంగా శ్రీ రామానందుల సంప్రదాయంలో భక్తికి ప్రాధాన్యమిచ్చిన సగుణమార్గానుయాయియై శ్రీ తులసీదాసు అవతార ప్రాముఖ్యాన్ని గుర్తించి కీర్తించాడు.

శ్రీరామానందుల శిష్యుడై నిర్గుణ భక్తి సంప్రదాయానికి తనకాలంలో ప్రముఖప్రతినిధి అయిన శ్రీకబీరుకూడ భక్తికిప్రాధాన్యమిచ్చాడు. ఆయన పరాత్పరునకు "రామ"నామాన్ని ఇచ్చాడు. తనకాలంలో సమాజంలో ఉన్న-అది హిందూ సమాజమైనా, ముస్లిం సమాజమైనా- దోషాల్ని నిర్దాక్షిణ్యంగా ఖండించాడు. సనాతన మతంలో వాసుదేవునకు వామదేవునకు "సుషు" భేదం తప్ప "పల" భేదం లేదని విజ్ఞులందరూ అంగీకరిస్తే, శ్రీ కబీరు ఇంకా కొంచెం దూరం వెళ్ళి "రామ్" "రహీమ్" లకు భేదం లేదన్నాడు. "సంత్" సంప్రదాయప్రవర్తకుడైనాడు. తన వ్యక్తిత్వంలో- సాధనాత్మక, భావనాత్మక, సామాజికాత్మక వ్యక్తిత్వాలను కలుపుకొని పురోగమించిన మహానుభావుడు. ఈయన సాధనాత్మక వ్యక్తిత్వం అభివృద్ధి పొందడానికి "నాథసంప్రదాయం"తోడ్పడింది. భావనాత్మక వ్యక్తిత్వం వికసించడానికి అనాటి "సూఫీ"తత్త్వజ్ఞుల మార్మికత, వైష్ణవభక్తుం భగవత్ప్రేమ సాయపడినవి. సామాజిక వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దినవి. ఆనాటి భారతీయ సమాజంలోని దోషాలు, లోపాలు. కబీరు మన వేమన మనస్సునకు వచ్చునట్లు చేస్తాడు. గుణభూషణం, దోషనిరాకరణం- అడుగడుగునా కనబడతాయి.

"జాతి న పూఛో సాదుకీ పూఛి లీజియే జ్ఞాన్।
మోల్ కరో తరవారకీ, పడారహనదో మ్యాన్॥"

(సాదువును జాతి (కులం) గురించి ప్రశ్నించకు. కత్తివదును పరిశీలించు. ఒరను ఉండనీ) మన వేమనకూడా" ఎఱుక గలవాడె ఎక్కైనకులజుండు" అనలేదా!

శ్రీరామానందుని శిష్యుడు కావడం చేత, సనాతన హిందూ సంప్రదాయాలను శ్రీ కబీరు బాగా ఎరుగును. అవతారాలను గురించి ప్రత్యేకంగా వ్రాయక పోయినా అవతారాల పేర్లను యథేచ్ఛగా పరాత్పరునకు పర్యాయపదాలుగా వాడు కొన్నాడు. విష్ణువునకు సంబంధించిన పేర్లుగా స్థిరపడిన- హరి, రామ్, గోవింద్ మొదలైన శబ్దాలను నిర్గుణ బ్రహ్మకు పర్యాయపదాలుగా వాడినాడు.

భగవద్రామానుజుల శ్రీ వైష్ణవ సంప్రదాయానికి ఆధారశిలలైన తత్త్వత్రయాల్ని శ్రీ రామానందులు తమ "రామావత్" సంప్రదాయంలో అంగీకరించినా రహస్యత్రయాల విషయంలో మాత్రం నవ్యమార్గాన్ని అనుసరించారు. దీనికి దేశకాల పాత్రలు కారణమని ఊహించవచ్చును.

శ్రీ రామానందుల "వైష్ణవమతాబ్జభాస్కర" మనే గ్రంథంలో "రహస్యత్రయాలు" శ్లోకరూపంలో క్రింది విధంగా ఉపదేశితాలు:

"జాప్యస్తత్ తారకాఖ్యో మనువరమథి లైర్వహ్నిబీజం యదాదౌ
రామోజ్జే ప్రత్యయాంతో రసమిత శుభదస్త్వక్షరః స్యాన్స మోఽన్త్ః॥
మంత్రో రామద్వయాఖ్యః సకృదితి చరమ ప్రాన్వితో గుహ్యగుహ్యో
భూతాత్మ్యత్సంఖ్యవర్ణః సుకృతిభిరనిశం మోక్షకామైర్నిషేవ్యః॥"

ఈ సంప్రదాయంలో మూలమంత్రం శ్రీరామ షడక్షరమంత్రం: రాం రామాయనమః. ఈ సంప్రదాయంలోని ద్వయమంత్రం: శ్రీమద్రామచంద్రచరణౌ శరణం ప్రపద్యే, శ్రీమతేరామచంద్రాయనమః. ఈ మంత్రం పంచవింశత్యక్షరాత్మకం. చరమమంత్రం శ్రీ మద్రామాయణంలోని సుప్రసిద్ధ శ్లోకమైన:

"సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే।
అభయం సర్వభూతేభ్యోదదామ్యేతద్ వ్రతం మమ॥"

అనే శ్రీరామచంద్రుని ప్రతిజ్ఞ.

భగవద్రామానుజుల "శ్రీవైష్ణవ సంప్రదాయంలో" శ్రీమన్నారాయణున కున్న స్థానం శ్రీరామానందుల "రామావత్" సంప్రదాయంలో శ్రీరామచంద్రుని అవతారమూర్తికి ఉంది. అక్కడ భగవద్గీతలోని శ్లోకం చరమమంత్రం. ఇక్కడ రామాయణంలోని శ్లోకం– చరమమంత్రం. అక్కడ వక్త వ్యాసుని ముఖంగా

శ్రీకృష్ణ రూపపరమాత్మ. ఇదే భేదం అందామా? అన వచ్చును. భేదం లేదు. అందామా? అనవచ్చు. అక్కడ లక్ష్మీనారాయణులు ఇక్కడ- సీతారాములు. శ్రీ వైష్ణవ సంప్రదాయంలోను ఆళ్వార్లలో ఎందరో రామభక్తులున్నారు. మచ్చునకు- నమ్మాళ్వార్, కులశేఖరాళ్వార్ మొదలైన ఆళ్వార్లు భగవద్రామానుజులు వంటి ఆచార్యపురుషులు రామభక్తిని తమ రచనల్లో ప్రదర్శించారు.

"రామావత్" సంప్రదాయంలో ధ్యానమూర్తుల విషయంలోనూ ఒక వైశిష్ట్యం ఉంది. సీతాలక్ష్మణులతో కూడిన శ్రీరామచంద్రుని ధ్యానించండని శ్రీరామానందులు నిర్ణయించినారు వీరు ముగ్గురూ తత్త్వత్రయమని ఆచార్యుల భావన. సీతాదేవి ప్రకృతి స్థానీయ లక్ష్మణుడు జీవస్థానీయుడు. భగవానుడైన శ్రీరామచంద్రుడు ఈశ్వరతత్త్వద్యోతకుడు. ఈ దృష్టి ననుసరించి రామావత్ సంప్రదాయంలో స్థాపితాలైన మందిరాల్లో ఈ మూర్తిత్రయం కనబడుతుంది. శ్రీ రామానందులు తమ "వైష్ణవమతాబ్జభాస్కర"మనే గ్రంథంలో ఈ విషయాన్ని ఇలా వివరించారు:

"ప్రసన్నలావణ్యసుభృన్ముఖాంబుజం
నరంశరణ్యం శరణం సరోత్తమమ్ ।
సహానుజం దాశరథిం మహోత్సవం
స్మరామి రామం సహసీతాయా సదా ॥"

ఈ ధ్యాన శ్లోకాన్ని బట్టి-సీతాలక్ష్మణులకు, ఈ సంప్రదాయంలో ఉన్న ప్రాముఖ్యం తెలుస్తుంది.

ఐతిహాసికంగా ప్రసిద్ధులైన శ్రీ రామానందులు ఈ సంప్రదాయానికి ప్రవర్తకులనే పేరుపొందినా, రామభక్తిని దక్షిణదేశనుండి ఉత్తరదేశానికి మొట్టమొదట తెచ్చినవారు, వీరి గురువులైన శ్రీ రాఘవానంద స్వాములని తెలుస్తోంది. ఈ స్వాములు దక్షిణదేశంనుండి వచ్చి కాశీలో స్థిరపడ్డారు. వీరి గురువులు హర్యాచార్యులు ఈ విషయాలన్నీ "భక్తమాల"లో శ్రీ నాభాదాసు ఇలా విపులంగా వివరించాడు:

"దేవాచారజ దుతియ మహామహిమా హరియానంద।
తస్య రాఘవానంద భయే భక్తన కో మానద ॥

పత్రావలంబ పృథివీ కరీ బస కాసీ స్థాఈ।
దారి బరన ఆశ్రమ సబహిం కో భక్తి దృఢా ఈ।
తిసకే రామానంద ప్రగట విశ్వమంగల జినవపుధర్యో।
రామానుజ-పద్ధతి ప్రతాప అవనీ అమృత హ్వై అనుసర్యో॥

"భక్తమాల" ద్వారానే కాకుండా "హరిభక్తిసింధువేలా" అనే సంస్కృత గ్రంథం ద్వారా కూడా శ్రీ రాఘవానందుల విషయం మనకు తెలుస్తోంది. ఈ విషయాన్ని తెలిపే శ్లోకం ఇది:

"వందే శ్రీ రాఘవాచార్యం రామానుజకులోద్భవమ్।
యామ్యా దుత్తరమాగత్య రామమంత్ర ప్రచారకమ్॥"

భక్తి ప్రధానమైన సంప్రదాయాలన్నింటిలోను అవతార ప్రసక్తి వాటి ప్రశస్తి కనబడుతూనే ఉంటాయి. ఒక్కొక్క భక్తుడు ఒక్కొక్క అవతారానికి విశేష ప్రాధాన్యం ఇచ్చి దాన్ని ఉపాసించడంకూడా ఉంది. నిర్గుణబ్రహ్మవాదులైన శ్రీ శంకరభగవత్పాదులు, శ్రీ మధుసూదన సరస్వతీ స్వాములు మొదలైన ఆచార్య పురుషులు తమ తమ ఇష్టదేవతలను విశేషంగా కీర్తించినట్లు తెలుసుకొని ఉన్నాము. సిద్ధాంతరీత్యా నిర్గుణ బ్రహ్మవాదులైనా సగుణమూర్తుల సంకీర్తించడంలో వైరుధ్యం వారికేమీ కనబడలేదు. శ్రీ శంకరభగవత్పాదుల శిష్యులైన పద్మపాదులు శ్రీ నృసింహోపాసకులు. కాపాలికుడొకడు తన భైరవారాధనకోసం ఆచార్యపాదుల శిరస్సు నర్థించి దేహాభిమానం లేని భగవత్పాదులవల్ల దాన్ని వరంగా పొంది వారి శిరస్సును ఖండించ నుద్యుక్తుడైనప్పుడు, నృసింహావేశంతో పద్మపాదులు కాపాలికుని చీల్చి చంపిన ఐతిహ్యం అందరికీ తెలిసినదే! శ్రీ సదాశివబ్రహ్మేంద్రులవంటి అద్వైతసన్యాసులు ఎందరో వివిధావతారాలను స్తుతించినవారున్నారు. శ్రీ అప్పయ్య దీక్షితులవంటి అద్వైత సంప్రదాయానుయాయులైన మహావిద్వాంసులెందరో సగుణమూర్తులను స్తుతించారు. శ్రీమద్భాగవత మహాపురాణానికి అద్వైతపరంగా "భావార్థదీపిక" అనే వ్యాఖ్యానం వ్రాసి శ్రీ చైతన్య మహాప్రభువుచేత కూడా ప్రశంసించబడిన శ్రీధర స్వామి శ్రీ నృసింహోపాసకులు. సిద్ధాంతరీత్యా తాత్త్విక దృష్టిలో అద్వైతాన్ని స్వీకరించినవారే స్తోత్రాలు వ్రాసి వివిధావతారాలను కీర్తిస్తే సగుణ బ్రహ్మవాదులు అవతారాలకు శరణాగతులు కావడంలో ఆశ్చర్యం లేదుగదా!

కేవలాద్వైతాన్ని, మాయావాదాన్ని అంగీకరించని అన్ని వైష్ణవ సంప్రదాయాలు అవతారాల్ని కీర్తిస్తూనే వచ్చాయి. వీటిలో వీటికి చాలా భేదాలున్నా సగుణోపాసన విషయంలో ఏకవాక్యత ఉందని అనవచ్చును. కొన్ని పారమార్థికంగా అద్వైతాన్ని అంగీకరించినట్లున్నా మాయావాదాన్ని మాత్రం నిరాకరించాయి. ఈ సంప్రదాయాలలో కొన్ని పాంచరాత్రసిద్ధాంతాల్ని సమర్థించలేదు. వీటిలో ఇంచుమించుగా అన్నింటికి శ్రీమద్భాగవతం పరమ ప్రమాణం. కొన్ని సంప్రదాయాలు శ్రీ మద్భగవద్గీతను కూడా పరమప్రమాణంగా గ్రహించాయి. కొన్ని సంప్రదాయాల సాధనలో యోగానికి విశేష ప్రాముఖ్యం వచ్చింది. ఈ భేదాలలో మార్పులలో-చాలావాటికి-దేశకాల పరిస్థితులు కారణంగా చెప్పవచ్చును ఇందువల్లనే కావచ్చు, కొన్ని కొన్ని సంప్రదాయ ప్రవర్తకులే పరమాత్మ అవతారాలుగా పరిగణించబడడం కూడా జరిగింది।

పరమాత్మ సగుణత్వాన్ని అంగీకరించే అన్ని వైష్ణవ సంప్రదాయాలు అవతార ప్రశస్తిని చేస్తూనే వచ్చాయని గ్రహించాము. వైష్ణవ సంప్రదాయాలకు పరమాచార్యులు శ్రీ కృష్ణభగవానులు. "పద్మపురాణాను"సారం ఆయన నలుగురు శిష్యులకు వైష్ణవ తత్త్వాన్ని ఉపదేశించారు. వారి ననుసరించే 1. శ్రీ 2. బ్రహ్మ 3. రుద్ర 4. సనక- సంప్రదాయాలు ప్రవర్తిల్లాయి.

"సంప్రదాయవిహీనా యేమంత్రాస్తే విఫలా మతాః।
అతఃకలౌ భవిష్యంతి చత్వారః సంప్రదాయినః ॥
శ్రీ-బ్రహ్మ-రుద్ర-సనకా వైష్ణవాః క్షితిపావనాః।
చత్వారస్తే కలౌ భావ్యాహ్యుత్కలే పురుషోత్తమాత్ ॥"

ఈ సంప్రదాయాల ప్రవర్తకులను "ప్రమేయరత్నావళి" ఈ విధంగా పేర్కొంది:

"రామానుజం శ్రీః స్వీచక్రే మధ్వాచార్యం చతుర్ముఖః।
శ్రీవిష్ణు స్వామినం రుద్రో నింబాదిత్యం చతుః సనః॥"

వీటిలో-భగవద్రామానుజుల శ్రీ సంప్రదాయాన్ని గురించి కొంత తెలుసుకొన్నాము. ఆ సంప్రదాయాన్నే చాలావరకు అనుసరించిన "రామావత్" సంప్రదాయాన్ని గూర్చి కూడా తెలుసుకొన్నాము. ఇప్పుడు మిగిలిన సంప్రదాయాలను గురించి కొంత గ్రహిద్దాము. ఆయా తాత్త్వికవిషయాలను గ్రహించడంవల్ల అవతారతత్త్వ విషయంలో వాటి అభిప్రాయాలు తెలుస్తాయి.

# (శ్రీమధ్వ (బ్రహ్మ) సంప్రదాయం

పూర్ణ ప్రజ్ఞులు, ఆనందతీర్థులు అయిన శ్రీ మధ్వాచార్యుల 1238–1317 వారిది బ్రహ్మసంప్రదాయం. ఆచార్యులు ద్వైతవాదులు శ్రీ వ్యాసరాయలు శ్లోక రూపంలో సంక్షేపంగా చెప్పిన వీరి సిద్ధాంతాలివి:

"శ్రీమధ్వమతే హరిః పరతరః, సత్యం జగత్, తత్త్వతో।
భేదో, జీవగణా హరేరనుచరా, నీచోచ్చభావం గతాః ॥
ముక్తిర్నైజ సుఖానుభూతి రమలాభక్తిశ్చతత్ సాధనం।
హ్యక్షాదిత్రియం ప్రమాణ మఖిలామ్నాయైక వేద్యోహరిః ॥

ఈ శ్లోకంలో తొమ్మిది సిద్ధాంతాలున్నాయి.

1. హరిః పరతః:– అనంత కళ్యాణగుణ పరిపూర్ణుడు విష్ణువు, సర్వోచ్చతత్త్వం ఉత్పత్తి, స్థితి, సంహార, నియమన, జ్ఞాన, ఆవరణ, బంధ, మోక్షములు ఆయన అధీనములు. ఆయన–జడ ప్రకృతికి, చేతనకు విలక్షణుడు. జీవేశ్వరులుగా చేతన రెండు విధాలు. జీవుడు బద్ధుడు, అజ్ఞత్వం అణుత్వం మొదలైనధర్మాలుకలవాడు. ఈశ్వరుడు సర్వజ్ఞత్వం, అనంతశక్తిమత్వం అపరిమితత్వం మొదలైన అప్రాకృతగుణాలకు నిధానం. పరమాత్మ విష్ణువు పరమతత్త్వం.

2. సత్యం జగత్ :– అద్వైత దృష్ట్యా "రజ్జుసర్ప" సమానంగా జగత్తుమిథ్య కాగా, ద్వైతంలో జగత్తు సత్యం. స్వతః ప్రమాణాలైన వేదాలు ఈశ్వరుని "సత్యసంకల్పుడు" అంటున్నపుడు ఆయన సంకల్పజన్య జగత్తు అసత్యం ఎలా అవుతుంది?

3. తత్త్వతో భేదః:– భేదం వాస్తవికం. ఇది అయిదు ప్రకారాలుగా ఉంటుంది: 1. జీవేశ్వర భేదం 2. జీవజడ భేదం 3. ఈశ్వర జడభేదం 4. జీవుల పరస్పర భేదం 5. జడముల పరస్పర భేదం.

4. జీవగణా హరేరను చరాః :– జీవులు అస్వతంత్రులు. వారి సకల పామర్థ్యాలు భగవదధీనాలు. అల్పజ్ఞ జీవుడు, సర్వజ్ఞ విష్ణువు అధీనంలో ఉన్నారు.

5. నీచోచ్చభావంగతాః :- జీవులలో తారతమ్యం ఉంది. ఇది జగత్తులోనే కాకుండా మోక్షదశయందు కూడా ఉండడం ఈ సంప్రదాయంలోని ఒక విశిష్ట లక్షణం. పరతంత్రమైన చేతనంలో 1. నిత్యముక్తం 2. సంసార యోగమున్నది-అని భేదాలు. మహాలక్ష్మి నిత్యముక్తురాలు. సంసార యోగులు తిరిగి 1. ముక్తులు 2. అముక్తులు అని. బ్రహ్మాదులు ముక్తులు. మొదట దుఃఖ సంబంధముండి అది తొలగినవారు. అముక్తులలో- ఉత్తమ, మధ్యమ, అధమ భేదాలున్నాయి. ఉత్తములు ముక్తియోగ్యులు. దేవతలు, ఋషులు మొదలైనవారు. మధ్యములు నిత్యసంసారులు. భగవద్భక్తితో, కర్మాచరణతో జీవించేవారు. అధములు-నిత్యనారకులు. భగవంతుని ద్వేషించేవారు వీరు. రాక్షసాదులు. ద్వైతవాదులు కొందరు-అద్వైతవాదులను ఈ తరగతిలో చేర్చినవారున్నారు. అచేతనం తిరిగి నిత్యానిత్యాలుగ విభక్తం. సూక్ష్మరూప జడప్రకృతి నిత్యం. కార్యజాత మంతా అనిత్యం. ఈ తారతమ్యాలనుబట్టి నీచోచ్చ భావాలు కలగడం సహజం.

6. ముక్తైర్భోగ సుఖానుభూతిః:- వాస్తవసుఖానుభూతి ముక్తి. మోక్షం నాలుగు ప్రకారాలుగా ఉంది. కర్మక్షయ, ఉత్క్రాంతి, అర్చిరాదిమార్గ, భోగములే అవి. భోగం తిరిగి- సాలోక్య, సామీప్య, సారూప్య సాయుజ్య ప్రకారాలుగా ఉంది. వీటిలో సాయుజ్యం సర్వశ్రేష్ఠం. "సాయుజ్యం నామ భగవంతం ప్రవిశ్య తచ్ఛరీరేణ భోగః" ఈ విధంగా ముక్తజీవులలోకూడా తారతమ్యం ఉంది.

7. అమలా భక్తిః :- మలరహిత నిర్దోషభక్తి ముక్తి హేతువు. "అహైతుకీ భక్తి"యే ముక్తికి ఉచ్చతమోపాయం. అనన్యభక్తివైశిష్ట్యాన్ని శ్రీకృష్ణుడు గీతలో ఉపదేశించాడు గదా!

"భక్త్యాత్వనన్యయా శక్య అహమేవం విధోర్జున ।
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప ॥"

ఈ భక్తికి సేవ్య సేవక భావం ప్రాణం. భృత్యసేవ్యుడైన రాజు భృత్యునికంటె భిన్నుడైనట్లు, సేవ్యుడైన ఈశ్వరుడు సేవకుడైన జీవుని కంటె భిన్నుడు. రాజు గుణోత్కర్షను చెప్పే భృత్యుడు రాజానుగ్రహపాత్రుడు. తానే రాజను కొనువాడు

శిక్షాపాత్రుడు. ఇక్కడ అద్వైత దృష్టిని విమర్శించడం ప్రత్యక్షం. భగవత్సేవ- అంకనం, నామకరణం, భజనం అని మూడు విధాలు. భగవదాయుధాలైన శంఖ చక్రాలను ముద్రారూపంగా ధరించడం-అంకనం. పుత్రాదులకు భగవత్స్మరణ నిమిత్తం భగవన్నామాలనుంచడం- నామకరణం. వాంఛితార్థ సిద్ధికోసం భక్తవను కూలారాధనం- భజనం.

8. అక్షాది ప్రమాణ త్రితయమ్:- మధ్వమతంలో ప్రమాణాలు మూడు. అవి- ప్రత్యక్షానుమాన శబ్దాలు. తార్కిక విషయాలలో కూడా మధ్వమతంలో చాలా విశేషాలున్నాయి. మహామేధావులెందరో ప్రమాణ గ్రంథాలను రచించారు.

9. ఆమ్నాయైక వేద్యోహరిః:- వేదాల సమస్త తాత్పర్యం హరియే. విష్ణువే, "ఆదావంతే చ మధ్యేచ హరిః సర్వత్ర గీయతే" వేదాలలో నా నాదేవతల స్తుతి ఉన్నట్లు స్థూలంగా గోచరించినా, ఈ నానా దేవతలు, పరబ్రహ్మ హరియొక్క అవస్థానుసారాలైన రూపాలు. వేదప్రతిపాదితాలైన ఇంద్ర వరుణాదులు ఆ పరబ్రహ్మ విలాసమాత్రాలు. ఈ విషయమై యాస్కుని వచనాలు. "మహాభాగ్యాత్ దేవతాయా ఏక ఏవ ఆత్మా బహుధాస్తూయతే! ఏకస్యాత్మనోఽ న్యే దేవాః ప్రత్యంగాని భవంతి॥"

కేవలా ద్వైతంతో పూర్ణంగా భేదించిన ద్వైతవిశిష్టాద్వైతాలకు కొన్ని పోలికలుండడం సహజం. భిన్న సిద్ధాంతాలు గనుక కొన్ని భేదాయుండడం కూడా అసహజం కాదు. వీటిని క్రమముగా పరిశీలిద్దాము.

ద్వైతవిశిష్టాద్వైతాలకు ముఖ్యమైన ఆరు విషయాలలో సామ్యముంది. వీటిని ఈ రెండు మతాలు అంగీకరిస్తాయి అన్నమాట 1. జీవుడు అణువు 2. మోక్షస్థితిలో కూడా పరమాత్మకు జీవుడు దాసుడు 3. వేదం అ పౌరుషేయం-స్వతః ప్రమాణం 4. ప్రత్యక్షానుమాన శబ్దాలు మూడు ప్రమాణాలు 5 పాంచ రాత్రానుసరణ 6. జగత్తు ఆత్మకంటె భిన్నం. సత్యం.

ఈ రెండింటికి ఉన్న ముఖ్యమైన భేదా- భేదాద్విత్రిక విషయమైనది. భగ వద్రామానుజుల మతంలో పరస్పరవిరుద్ధాలైన- భేదం, అభేదం, భేదాభేదం అనేవి అంగీకృతాలు. అవిఇవి 1. బ్రహ్మకు-జీవజడాలు శరీరం కావడం చేత విశేష

జాలు. విశేషణ విశిష్టమైన బ్రహ్మ ఒకటియై ఉండడంచేత- అభేదం అంగీకృతం. అభేదబోధక శ్రుతులు దీని కనుకూలాలు 2. జీవుడు చిద్రూపుడు. జడం అచిద్రూపం. కాబట్టి స్వరూపవైలక్షణ్యాన్ని బట్టి జీవజడాలకు పరస్పరం భేదం. జీవేశ్వరులు చిద్రూపులైనప్పటికి జీవుడు అణువు. ఈశ్వరుడు విభువు. ఈ వైలక్షణ్యాన్ని బట్టి జీవేశ్వరులకు పరస్పరం భేదం 3. ఈశ్వరుడు ఒక్కడైనా బహువిధాలైన శరీరభూతచిదచిద్రూపవిశేషణ భేదాలను బట్టి భేదాభేదం సిద్ధిస్తోంది.

ఈ విధంగా పరస్పరవిరుద్ధాలైన భేదాదిత్రికాన్ని అంగీకరించడం యుక్తం కాదని భావించి "ఆత్మాతత్త్వమసి" అని అభేదబోధక శ్రుతులకు అర్థాంతరమందు తాత్పర్యం చెప్పి బ్రహ్మసూత్రాలకు వివరణరూపంగా శ్రీమదానందతీర్థుల వారు భిన్న ప్రస్థానాన్ని ఆశ్రయించారు. ఇంక అద్వైతులు-సజాతీయ, విజాతీయ స్వగత, భేదశూన్యమైన నిర్గుణపరబ్రహ్మ ఒక్కటే సత్యం. శ్రుతులు దీన్నే బోధిస్తున్నాయి. అప్పుడు బ్రహ్మ సగుణమని, భేదం సత్యమని చెప్పడం యుక్తం కాదంటారు. దీనికి ఇతర సంప్రదాయాలవారి సమాధానాలు; వాటికి వీరి శంకలు, వారి సమాధానాలు- ఇలా వేదాంత వాఙ్మయం పెరిగింది. ఇవన్నీ ఇప్పటిక్కడ మనకు అనావశ్యకాలు. నిర్గుణ బ్రహ్మవాదులైనా, అద్వైతులు-వ్యావహారిక జగత్తు దృష్ట్యా సాధన దృష్ట్యా భక్తికి, ఉపాసనకు స్థానాన్ని అంగీకరించడమే కాకుండా తమతమ జీవితాలలో వాటిని ప్రదర్శించడం వల్ల, పారమార్థికంగా సగుణ బ్రహ్మ నంగీకరించే ఇతర సంప్రదాయాలకు చెందిన వారికీ వీరికీ నిత్య జీవితంలో- సిద్ధాంత తత్త్వాల జోలికి పోనంతవరకు- భేదాలు, కనబడనంత తక్కువ అయిపోయాయి. వివిధ సంప్రదాయాలకు చెందిన వారికందరకు వైదిక సంపత్తి ఒక్కటే కావడం కూడా దీనికి కారణం. అద్వైతుల పంచోపాసనతో-స్థూల దృష్టికి భేదాలే కనబడకుండా పోయాయి అంటే అతిశయోక్తి కాదు. సగుణ బ్రహ్మవాదులలో, రామానుజ మధ్వ సంప్రదాయాలకున్న విశేష ప్రాముఖ్యాన్ని బట్టి- భారతదేశమందంతటా ఇవి పొందిన ప్రచారం దృష్ట్యా, ఇతర వైష్ణవ సంప్రదాయాలమీద పడిన వీరి ప్రభావం దృష్ట్యా- వీటిని కొంత విపులంగా పరిశీలించడం జరిగింది. ఈ రెండు వైష్ణవ సంప్రదాయాలూ దక్షిణదేశంలో పుట్టి పెరిగి వ్యాపించడంవల్ల, పూజాది బాహ్యక్రియాకలాపాలలో కూడా వీరి నడుమ ఉన్నన్ని పోలికలు, ఇతరత్ర కనబడవు.

స్థూలంగా వైష్ణవ సంప్రదాయాలన్నీ విష్ణుపారమ్యాన్ని అంగీకరించినా, నారాయణతత్త్వాన్ని ప్రశంసించినా, రామకృష్ణాద్యవతారాలన్నింటినీ కీర్తించినా ఉత్తరదేశంలోని కొన్ని సంప్రదాయాలు, శ్రీకృష్ణుడే పరమాత్మ అనీ, ఆయన రూపాలే విష్ణు, నారాయణాది నామాలతో వ్యవహరింపబడుతున్నాయి అనీ విశ్వసిస్తాయి. రామకృష్ణాద్యవతారాలు విష్ణుమూర్తి వని దాక్షిణాత్య వైష్ణవ సంప్రదాయాలలో సామాన్యమైన నమ్మకంకాగా, అది సరికాదనీ శ్రీకృష్ణ పరమాత్మయే అన్నింటికీ మూలం అని ఔత్తరాహ సంప్రదాయాలలో సామాన్యమైన విశ్వాసం. ఇందుకు అపవాదంగా- రామావత్ సంప్రదాయం ఉంది. మిగిలిన- నింబార్క, వల్లభ, రాధావల్లభీయ, చైతన్యాది సంప్రదాయాలలో శ్రీకృష్ణుడే పరాత్పరుడు. శ్రీరాముని గౌరవించినా, శ్రీమద్రామాయణాన్ని వారు పఠించినా- శ్రీకృష్ణుని యందు వారికున్న తత్పరత శ్రీరామునియందు కనబడదని, శ్రీమద్భాగవతం మీద ఉన్న శ్రద్ధాభక్తులు శ్రీమద్రామాయణం విషయంలో కనబడవని అంటే సత్యదూరం కాదు. భగవద్రామానుజుల శ్రీ సంప్రదాయంలో శ్రీమద్రామాయణానికున్న వైశిష్ట్యాన్ని గురించి వేరే చెప్ప నక్కరలేదు గదా! ఉత్తర భారతీయమైన రామావత్ సంప్రదాయంలోనూ అంతే!

పద్మపురాణం చెప్పిన నాలుగు వైష్ణవ సంప్రదాయాలలో. భగవద్రామానుజుల శ్రీ సంప్రదాయాన్ని గురించి, శ్రీమదానందతీర్థుల బ్రహ్మ సంప్రదాయాన్ని గురించి కొంత తెలుసుకొన్నాము. ఇంక రుద్ర సనక సంప్రదాయాలను గురించి కొంత తెలుసుకొనవలసి ఉంది. ఈ సంప్రదాయాలలో శ్రీకృష్ణుడే పరమాత్మ. శ్రీమద్భాగవతమే పరమప్రమాణం. దాక్షిణాత్య సంప్రదాయాలలో- అద్వైతాన్ని కూడా కలుపుకొని- ఆచార్య పురుషులు ప్రస్థానత్రయానికి విశేష ప్రాముఖ్యం ఇచ్చారు. ఉపనిషత్తులమీద, భగవద్గీతమీద, బ్రహ్మసూత్రాలమీద వ్యాఖ్యానాలు వ్రాసి వాటిద్వారా తమ సిద్ధాంతాల్ని స్థాపించుకొనే ప్రయత్నం చేశారు. రుద్ర సనక సంప్రదాయాలకు చెందినవారు, వాటి ననుసరించిన ఇతర సంప్రదాయాల వారు ప్రస్థానత్రయాన్ని గౌరవించలేదనికాదు, భాష్యాలు వ్రాయలేదని కాదు- కొన్నింటికి భాష్యాలు చాలా కాలంవరకు రాలేదు కూడా- కాని, వారికి అంతా శ్రీమద్భాగవతమే! శ్రీకృష్ణుడు వారి జీవితాలను పాలించాడు. వారిలో కొందరు, బ్రహ్మసూత్రాలకు శ్రీమద్భాగవతమే భాష్యం అన్నారు! వీరి దృష్టిలో అవతారాలకు ఒక ప్రత్యేకత వచ్చింది. పుణ్యక్షేత్రాల విషయంలో కూడా ఒక విలక్షణత

కనబడుతుంది. దక్షిణదేశంలో శ్రీ సంప్రదాయం వారికి శ్రీరంగం, బ్రహ్మ సంప్రదాయం వారికి ఉడిపి అయినట్లే ఉత్తర దేశంలో- రామభక్తులకు కాశీ, కృష్ణ భక్తులకు మథుర- బృందావనాలు పుణ్యక్షేత్రాలు అయ్యాయి.

## శ్రీ చైతన్య (గౌడీయ వైష్ణవ) సంప్రదాయం

విషయక్రమాన్ని అనుసరించి ఇప్పుడు రుద్ర, సనక సంప్రదాయాలను గురించి చెప్పవలసిఉన్నా శ్రీచైతన్యమహాప్రభువు(1486-1534)అనుయాయులైన షడ్గోస్వాముల అచింత్యభేదాభేద సంప్రదాయాన్ని ఇక్కడ చెప్పవలసిఉంది. దీనికి ముఖ్యకారణం- శ్రీ చైతన్యుల శిష్యపరంపర, వేదాంతసూత్రాలకు ఈ సంప్రదాయానుసారం భాష్యంవ్రాసిన శ్రీబలదేవ విద్యాభూషణుడు తమ గురుపరంపరలో శ్రీమధ్వాచార్యులవారికి అగ్రస్థానమిచ్చి గౌరవించారు. విద్యాభూషణులు వ్రాసిన "ప్రమేయరత్నావళి"లో శ్రీమధ్వాచార్యులవారితో ప్రారంభమైన పరంపర పద్మనాభాచార్యులు, శ్రీ నరసింహాచార్యులు మొదలైన మధ్వగురువులద్వారా శ్రీచైతన్య మహాప్రభువులకు సన్యాసదీక్ష నిచ్చిన శ్రీ కేశవభారతీస్వాములవరకు తెచ్చి ఆయన శిష్యునిగా శ్రీమహాప్రభువును చూపడం జరిగింది. ద్వైతమతస్థాపనాచార్యులైన శ్రీమదానంద తీర్థులను పరమగురువులుగా అంగీకరించినా ఈ సంప్రదాయం "అచింత్యభేదాభేదం" అయింది. అనేక సిద్ధాంత విషయాలలో శ్రీమధ్వాచార్యుల వారి ద్వైతంతో ఇది భేదించింది. శ్రీచైతన్య మహాప్రభువుల, శ్రీ నిత్యానందుల, శ్రీ అద్వైతాచార్యుల తరువాత సంప్రదాయంలో ప్రముఖులైన వారు షడ్గోస్వాములు. అచింత్య భేదాభేద సంప్రదాయానికి ఆధారభూతాలైన ఉద్గ్రంథ రచయితలయిన షడ్గోస్వాములను నమస్కారపూర్వకంగా స్మరించే శ్లోకమిది:

"నానాశాస్త్ర విచారణైక నిపుణౌ సద్ధర్మసంస్థాపకౌ
లోకానాం హితకారిణౌ త్రిభువనే మాన్యౌశరణ్యాకరౌ।
రాధాకృష్ణ పదారవింద భజనానందేన మత్తాలికౌ
వన్దే రూపసనాతనౌ రఘుయుగౌ శ్రీ జీవగోపాలకౌ॥"

వీరు- నానాశాస్త్ర విచారణైక నిపుణులు, సద్ధర్మ సంస్థాపకులు, లోక హితకారిణులు, త్రిభువనమాన్యులు, రాధాకృష్ణ పదారవింద భజనానందమగ్నులు.

సంప్రదాయంలోని ప్రాముఖ్యాన్ని బట్టి ముందు వెనుకలను నిర్ణయించుకొని వీరిని ఈ క్రమంలో పేర్కొనవచ్చు. శ్రీ సనాతనగోస్వామి- శ్రీ రూపగోస్వామి (ఈయన శ్రీ సనాతన గోస్వామి తమ్ముడు. తన "భక్తి రసామృత సింధువు" ప్రారంభంలో అగ్రజునకు నమస్కరించారు. ఇందువలన శ్రీసనాతనుల పేరుముందు చెప్పాను). శ్రీ రఘునాథ భట్ట గోస్వామి, శ్రీ రఘునాథదాస గోస్వామి (తన దీక్షా గురువు శ్రీరూపగోస్వామి అని ఈయన వ్రాసుకొన్నారు )గోపాలభట్టగోస్వామి జీవగోస్వామి. వీరిలో శ్రీ రఘునాథ దాస గోస్వామి కాయస్థులని తెలుస్తోంది. సంప్రదాయ సిద్ధమైన వర్ణం విషయంలో ఈ సంప్రదాయం వారికి పట్టుదలలేదని గ్రహించాలి. శ్రీకృష్ణ భక్తుడైతే చాలును. శ్రీ రూప గోస్వాములు తమ "లఘు భాగవతామృత" గ్రంథంలో అచింత్య భేదా భేదాన్ని గురించి ఇలా వ్రాశారు:

"ఏకత్వం చ పృథక్త్వం చ తథాంశత్వముతాం శితా।
తస్మిన్నేకత్ర నాయుక్తం అచింత్యా సంతశక్తితః॥"

గౌడీయ వైష్ణవ సంప్రదాయంలో మహావిద్వాంసులుగా, తాత్త్విక శిరోమణులుగా శతాధిక గ్రంథకర్తలుగా షడ్గోస్వాములలో శ్రీరూప సనాతుల తరువాత, అంత వారుగ కీర్తి పొందిన వారు శ్రీ జీవ గోస్వాములు. (ఈయన శ్రీ రూపసనాతనుల సోదరులైన వల్లభుల (అనూపులని కొందరు) పుత్రులు.) వీరు తమ "భగవత్సం దర్భ" మనే గ్రంథంలో "అచింత్యభేదాభేదాన్ని గురించి ఇలా వ్రాశారు:

"స్వరూపాద్యభిన్నత్వేన చింతయితుమశక్య
త్వాద్ భేదః, భిన్నత్వేన చింతయితు మశక్యత్వాద్
అభేదశ్చ ప్రతీయతే ఇతి శక్తి శక్తిమతోర్భేదా భేదౌ
అంగీకృతౌ । తౌచ అచింత్యౌ । సమ్మతే తు అచింత్య
భేదాభేదా వేవ అచింత్య శక్తి త్వాత్ ॥"

దార్శనిక సిద్ధాంతాల జోలికి విశేషంగా పోక, శ్రీ చైతన్య మహాప్రభువు జీవితాన్ని ఆధారంగా తీసుకొని ఈ సంప్రదాయాన్ని ఇలా నిర్వచించారు:

"ఆరాధ్యో భగవాన్ వ్రజేశతనయ యస్తద్ధామ వృందావనం
రమ్యాకాచి దుపాసనా వ్రజవధూవర్గేణయా కల్పితా।

శాస్త్రం భాగవతం ప్రమాణమమలం ప్రేమాపుమర్థోమహాన్
శ్రీచైతన్య మహాప్రభోర్మతమిదం తత్రాదరో నః పరః॥"

శ్రీ చైతన్య మహాప్రభువు ఆదరించే నిర్వచనం ఇది. ఈ సంప్రదాయంలో ప్రేమకున్న స్థానం అత్యున్నతం. భక్తి ఐదవ పురుషార్థం. భక్తి-సాధనా రూపం లోను, సాధ్యరూపంలోను కూడా ఉంటుంది. భక్తిని "పంచమ పురుషార్థం"గా గ్రహించడానికి శ్రీ మద్భాగవతంలోనే శ్రీకృష్ణ వచనం ఇలా ఉంది:

"నకించిత్ సాధవో ధీరా భక్తా హ్యేకాంతినోమమ।
వాంఛంత్యపి మయాదత్తం కైవల్యమపునర్భవమ్॥"

ఏకాంత నిష్ఠ ఉన్న భక్తులు, సదాచార సంపన్నులు. చతుర్థ పురుషార్థమైన మోక్షాన్ని కూడా కాంక్షించరు. వారికి భక్తి చాలు నన్నమాట! అదేవారికి పురుషార్థం

గౌడీయ వైష్ణవ సంప్రదాయంలో అచింత్య శక్తిమంతుడు. పరమతత్త్వం శ్రీకృష్ణుడే. ఆయనకు మూడు విశిష్టరూపాలు. అవి 1. స్వయంరూపం 2. తదే కాత్మరూపం 3. ఆవేశ రూపం. ఈ రూపాలతో వివిధ లోకాలలో ప్రకాశితు డవుతూ ఉంటాడు. ఆయన స్వయంరూపానికి నిర్వచనం:

"లఘు భాగవతామృతం" లో "అనన్యాపేక్షియద్
రూపం స్వయం రూపః స ఉచ్యతే" అని ఉంది 1

"తదేకాత్మరూపం" అంటే.

"యద్రూపం తదభే దేన స్వరూపేణ విరాజతే।
ఆకృత్యాదిభిరన్యాదృక్ స తదేకాత్మరూపకః।" 2

ఇతరమైన వేటిమీద ఆధారపడి ఉండని స్వయమావిర్భూతమై రూపం "స్వయం రూపం". గౌడీయ వైష్ణవులకు పరమ పవిత్రమైన "బ్రహ్మసంహిత" ఈ రూపానికి విశేష ప్రాముఖ్యం ఇచ్చి, "అనాదిరాది ర్గోవిందః సర్వకారణ కారణమ్" అని నిర్వచించింది. ఇంక "తదేకాత్మరూపం" పరిశీలిస్తే, అది పారమార్థి కంగా "స్వయం రూపం" కంటె భిన్నంగా ఉండకపోయినా, ఆకృతి వైభవాదు

లలో భిన్నంగా ఉన్నట్లు కనబడుతుంది. ఇది 1) విలాస 2) స్వాంశ భేదాలుగా విభక్తమైంది. "స్వరూపతః" భిన్నాకారంగా కనబడినా, శక్తి విషయంలోమాత్రం స్వయం రూపతుల్యమైనది "విలాసరూపం". (1)

"స్వరూప మన్యాకారం యత్ తస్యభాతి విలాసతః।
ప్రాయేణాత్మసమం శక్త్యా స విలాసో నిగద్యతే॥"

అని "లఘుభాగవతామృతం" విలాస రూపాన్ని నిర్వచించింది. దీనికి ఉదాహరణగా — పరమవ్యోమానికి అధిపతి అయిన నారాయణుడు, గోవిందుని విలాస రూపం. ఇంక నారాయణుని విలాసం ఆది వాసుదేవుడు-అనేవి గ్రహించవచ్చును.

(2) అకృత్యాదులలో "స్వాంశ" రూపం, విలాసరూపాన్ని పోలినా, శక్తి విషయంలో మాత్రం కొంత న్యూనంగా ఉంటుంది.

"తాదృశో న్యూనశక్తిం యో వ్యనక్తి స్వాంశ ఈరితః"

అని దీని నిర్వచనం. దీనికి ఉదాహరణగా- సంకర్షణుడు మొదలైన పురుషావతారాల్నిగాని, మత్స్యాది లీలావతారాల్నిగాని గ్రహించవచ్చును.

ఇంక శ్రీకృష్ణుని స్వరూపానికున్న మూడో విశిష్టరూపం (3) ఆవేశరూపం. పై రెండింటి కంటె భిన్నమైంది ఈ రూపం. మహాభక్తులను, మహాప్రవక్తలను, మహాఋషులను భగవంతుని శక్తులు ఆవేశించినప్పుడు అయ్యే వ్యక్తరూపాలు :

"జ్ఞాన శక్త్యాదికలయా యత్రా విష్టో జనార్దనః।
త ఆవేశాని నిగద్యంతే జీవా ఏవ మహత్తమాః॥"

దీనికి ఉదాహరణలుగా-"శక్తి" ఆవేశానికి "శేషు"ని; 'జ్ఞాన'ఆవేశానికి"సనకు"ని; "భక్తి" ఆవేశానికి "నారదు"ని గ్రహించవచ్చును.

భగవంతుని "ప్రకాశావతారాలు" పైని వివరించిన రూపాలలో చేరవు. భగవంతుని ఒకే ఒక రూపం (శ్రీకృష్ణుని ఒకే ఒక రూపం) వివిధ ప్రదేశాలలో ఒకే సమయంలో వ్యక్తం కావడం ఈ ప్రకాశావతార లక్షణం. ఇది ఆయన అచింత్య శక్తి. ఇవన్నీ పారమార్థికంగా "తత్స్వరూపాలే". ద్వారకలో 16,000 మంది భార్యల గృహాలలో ఒకేసారి ఒకే రూపంలో శ్రీకృష్ణుడు నారదునకు దర్శన

మిచ్చినట్లు శ్రీమద్భాగవతంలో ఉంది. ఇవన్నీ ప్రకాశరూపాలే! (స్కంధం-10 అధ్యాయం-69, శ్లో-2)

"చిత్రం బతైతదేకేన వపుషా యుగపత్పృథక్।
గృహేషు ద్వ్యష్ట సాహస్రం స్త్రియ ఏక ఉదావహత్॥"

ఇదేవిధంగా, శ్రీకృష్ణుని ద్విభుజరూపాన్ని, చతుర్భుజరూపాన్ని ప్రకాశావతారాలుగా గ్రహించాలి. ఇవన్నీ మాయా కల్పితరూపాలు కావు. ఆయన నిత్యరూపాలే! ఇందువల్లనే అక్రూరుడు శ్రీకృష్ణుని స్తుతిస్తూ:

"అన్యేచ సంస్కృతాత్మానో విధినాభిహితేనతే।
యజంతిత్వన్మయా స్త్వాం వై బహుమూర్త్యేకమూర్తికమ్॥"

అన్నాడు (స్కంధం-10, అధ్యా-40, శ్లో-7)

గౌడీయ వైష్ణవ సంప్రదాయానుసారం అవతార తత్త్వాన్ని పరిశీలించి చూస్తే అది శ్రీవైష్ణవ సంప్రదాయం నుండి కొంత విభిన్నంగా గోచరిస్తుంది. సిద్ధాంతాలలో కనబడే భేదాలు దీనికి కారణం. శ్రీకృష్ణ భగవానుని ఆవేశ స్వాంశ రూపాలే అవతారాలుగా ఆవిర్భవిస్తాయి. గౌడీయ సంప్రదాయంలో ద్వాపర యుగంలో ఒక్కసారి మాత్రమే "స్వయంరూపం" శ్రీకృష్ణునిగా అవతరించిందని విశ్వాసం, మిగిలినవన్నీ ఆవేశ స్వాంశరూపాలే! "అపూర్వం" వలె ("అపూర్వ ఇవ") ఈ రూపాలు ఆవిర్భవించినా, భగవానుడు తన నిత్యరూపంలో ఉండనే ఉంటాడు. వీటి ఆవిర్భావం వల్ల ఆయనలో మార్పేమీ లేదు. "విశ్వకార్యం"కోసం అవతారావిర్భావం ఉంటుందని విశ్వాసం. ఈ "విశ్వకార్యా"న్ని శ్రీ బలదేవ విద్యాభూషణులు ఇలా వివరించారు:

1) ప్రకృతిక్షోభ మహదాద్యుత్పాదనమ్
2) దుష్ట విమర్దనేస దేవాదీనాం సుఖవివర్ధనమ్
3) సముత్కంఠితానాం, సాధకానాం ప్రేమానంద విస్తారణం విశుద్ధ భక్తి ప్రచారణమ్ చ.

ఈ "అవతార ప్రయోజనాలు" సర్వసాధారణంగా అన్ని సంప్రదాయాలూ అంగీకరించినవే గదా! అవతారోత్పత్తికి మూలభూతమైన తత్త్వం విషయంలో

అభిప్రాయ భేదాలు కనబడుతున్నాయి. సృష్ట్యాది నుండి నేటివరకు అవతరించిన అవతారాలు, అవతరించబోయే అవతారాలు మొదలైన సమస్త విషయాల్ని అభివర్ణించే గ్రంథాల నన్నింటిని అవలోకనం చేసి ఆయా అవతార్ని ఒకచోట చేర్చి రూప గుణాదుల్ని అనుసరించి విభజించి అన్నింటిని ముఖ్యమైన మూడుభాగాలుగా విభాగించారు. అవి: 1) పురుషావతారాలు, 2) గుణావతారాలు, 3) లీలావతారాలు. అనేవి.

మొట్టమొదటిది 1) పురుషావతారం: "ఆద్యోఽవతారః పురుషః" అని భాగవతం. ఆద్యావతారమైన పురుషుడు సృష్టి కార్యనిర్వహణ కోసం మూడు రూపాల్ని ధరిస్తాడు. "మహత్తు"ను "సంకర్షణ" రూపంలో సృష్టిస్తాడు. ఈయనయే "కారణోదకశాయి". బ్రహ్మాండ సంస్థితుడై "ప్రద్యుమ్నుడు" అని పిలువబడతాడు. ఈయనయే "గుణోదక శాయి". సర్వభూతస్థితుడై "అనిరుద్ధ" నామంతో ప్రకాశిస్తాడు. ఈయనయే "క్షీరోదకశాయి." భగవద్విషయకమైన ఈ కల్పన "నారాయణీయ" ప్రదర్శితమైన "వ్యూహ" సిద్ధాంతమే అనడం సత్యదూరం కాదు.

2) గుణావతారాలు మూడు. సత్త్వరజస్తమో గుణాలను బట్టి వ్యపదేశీకులైన బ్రహ్మ (రజస్సు), విష్ణు (సత్త్వ) శివ (తమస్సు) రూపులు- సృష్టి, స్థితి, లయ కారకులు.

3) లీలావతారాలు - శ్రీమద్భాగవతాన్ని అనుసరించి ఇరవై రెండు. వీటిని గురించి మనం ముందే తెలుసుకొన్నాము. వివిధ కల్పాలలో అవతరించే వీటికి కల్పావతారాలని కూడా పేరు ఉంది. శ్రీరూపగోస్వాములు ఈ అవతార సంఖ్యను హయశీర్ష, హంస, ధ్రువప్రియ (పృష్ణిగర్భ) అను వాటిని కూడా చేర్చి పెంచారు. తమ "సంక్షేప భాగవతామృతం"లో వీటి నన్నింటిని పేర్కొన్నారు. ఈయన అవతార సంఖ్యను పెంచడమేకాకుండా వాటి క్రమాన్ని కూడా మార్చారు:

ఈ అవతారాలే కాక, ఇంకా పద్నాలుగు మన్వంతరావతారాలు ఉన్నాయి. ప్రతి మన్వంతరంలోను ఇంద్ర శత్రువుల్ని నాశనంచేసి దేవతలకు నాయకుడే అవతారం ఒకటి ఉంటుంది. వాటి పేర్లు ఇవి: (1) యజ్ఞ (2) విభు (3) సత్యసేన (4) హరి (5) వైకుంఠ (6) అజిత (7) వామన (8) సార్వభౌమ (9) ఋషభ (10) విష్వక్సేన (11) ధర్మసేతు (12) సుధామ (13) యోగేశ్వర (14)

బృహద్భాను. ఈ అవతారాలలో- హరి, వైకుంఠ, అజిత, వామన అనేవి ప్రధ రావతారాలు ముఖ్యమైన వన్నమాట.

ఇవి గాక- నాలుగు యుగాలకు నాలుగు అవతారాలు "యుగావతారాలు" అనే పేరుతో ఉన్నాయి. ఒక్కొక్క యుగంలోని అవతారానికి ఒక్కొక్క "వర్ణం"(రంగు)ఉంటుంది. ఈ అవతారాలన్నీ శ్రీకృష్ణునివే! శ్రీమద్భాగవతంలోని శ్లోకంలో ఇవి వర్ణితాలు. గర్గమహర్షి నందమహారాజునకు బలరామకృష్ణులను గూర్చి చెప్పే సందర్భంలోని శ్లోకం ఇది:

"ఆసన్ వర్ణాస్త్రయోహ్యస్య, గృహ్ణతోఽను యుగం తనూః।
శుక్లో, రక్తస్తథా పీత, ఇదానీం కృష్ణతాం గతః॥"

సత్యయుగంలో శుక్లవర్ణం, త్రేతాయుగంలో రక్తవర్ణం, ద్వాపర యుగంలో పీతవర్ణం, ఇప్పుడు—కలియుగంలో కృష్ణవర్ణం—ఇవి ఆయన అవతార వర్ణాలు

ఇది ఇలా ఉండగా, భాగవతంలోనే ఇంకో శ్లోకంలో ద్వాపరంలో అవ తారం "శ్యామ" వర్ణంలో ఉంటుందని ఉంది. ("ద్వాపరే భగవాన్ శ్యామః"). దీన్ని బట్టి చూస్తే రెండు శ్లోకాలు పరస్పర విరుద్ధాలుగా ఉన్నట్లు కనబడతాయి. ఇది గాక, శ్రీచైతన్యమహాప్రభువు శ్రీకృష్ణపరమాత్మ అని నమ్మే, చెప్పే గౌడీయ వైష్ణవులకు, కలియుగంలోని శ్రీచైతన్యావతారం- గౌరవర్ణ శోభితం గనుక- ఈ శ్లోకాల్ని సమన్వయం చెయ్యవలసిన అవశ్యకం ఎంతైనా ఉంది.

వారి వ్యాఖ్యానం ప్రకారం, "ఇదానీం కృష్ణతాంగతః" అంటే ఇప్పుడు- గర్గమహర్షి నందునితో చెప్పుతున్న యుగంలో-ద్వాపరంలో అవతారానికి "కృష్ణ త్వం" ఉంది గదా! శ్యామవర్ణానికి కృష్ణవర్ణానికి ఏమంత పెద్దతేడా! అని వారి భావం. అప్పుడు, కలియుగంలో అవతారవర్ణం "పీతవర్ణం" అవుతుంది. ఈ వర్ణం, శ్రీ చైతన్య మహాప్రభువునకు సరిపోతుంది. ఈ సందర్భంలోనే శ్రీమద్భా గవతంలోని ఇంకో శ్లోకం గౌడీయ వైష్ణవస్వాములను విశేషంగా ఆకర్షించింది. అది ఇది:

"కృష్ణవర్ణం త్విషాఽకృష్ణం సాంగోపాంగాస్త్ర పార్షదం।
యజ్ఞైస్సంకీర్తనప్రాయైర్యజంతి హి సుమేధసః॥"

ఈ శ్లోకాన్ని శ్రీ రూపగోస్వామి "సంక్షేప భాగవతామృతం"లోను శ్రీ జీవగోస్వామి "తత్త్వ సందర్భం"లోను తమ గ్రంథాల ప్రారంభంలో నమస్క్రియారూపకంగా ఇచ్చారు. వారి దృష్టిలో– ఈ భాగవత శ్లోకం– శ్రీచైతన్యావతారాన్ని, ఆయన అనుయాయులను, ఆయన కృష్ణనామ స్మరణను, సంకీర్తనా పద్ధతిని భావిసూచకంగా తెలియజేస్తోంది. వారు దీనికి చెప్పే అర్థం ఇంచుమించుగా ఇలా ఉంటుంది:

"కృష్ణనామాన్ని (వర్ణాలు = అక్షరాలు) సదా ఉచ్చరించే వానిని, పచ్చని శరీరకాంతి కలవానిని (త్విషా = కాంతియందు. అకృష్ణం = కృష్ణత్వం లేని వానిని), నిత్యానంద-అద్వైతులను శరీరాంగాలుగా కలవానిని, శ్రీవాసాది భక్త బృందం ఉపాంగాలుగా కలవానిని, హరినామాదులను అస్త్రాదులుగా కల వానిని, గదాధర–దామోదర–స్వరూపాదులను పార్షదులుగా కలవానిని–మేధావులు సంకీర్తన ప్రాయమైన యజ్ఞాలతో– ఆ భగవంతుని-పూజిస్తున్నారు."

ఇందులో వారు చెప్పిన పేర్లన్నీ గౌడీయ వైష్ణవప్రపంచంలో ప్రసిద్ధమైనవి. ఇవన్నీ ఈ శ్లోకంలో లేకపోయినా- కృష్ణవర్ణం, త్విషాకృష్ణం, సంకీర్తన మొదలైన శబ్దాలు-భక్తులకు వారు వాంఛించిన అర్థస్ఫూర్తిని కలిగించడంలో ఆశ్చర్యం లేదు. బృందావన గోస్వాములు వారి తాత్త్విక గ్రంథాలలో చైతన్యతత్త్వాన్ని చర్చించకపోయినా, శ్రీ కృష్ణచైతన్యులు శ్రీకృష్ణావతారమనే విశ్వాసం వారికున్నదనే విషయంలో సంశయంలేదు. వారు వ్రాసిన గ్రంథాలలోని నమస్క్రియారూపకమైన స్తోత్ర శ్లోకాలలో ఈ విషయం స్పష్టమౌతుంది. శ్రీచైతన్య దేవునకు హరికి అభేదంగా "భక్తిరసామృత సింధు"లో రూపగోస్వామి వ్రాసిన ప్రార్థనా శ్లోకం ఇది:

"హృదియస్య ప్రేరణయా ప్రవర్తితోఽహం వరాకరూపోఽపి।
తస్య హరేః పదకమలమ్ వందే చైతన్యదేవస్య॥

బృందావన గోస్వాములు ఈ విధంగా వ్రాసినా, "కృష్ణవర్ణం త్విషాకృష్ణం" శ్లోకానికి, "చైతన్యావతరణం" సూచిస్తోంది అని అర్థం చెప్పినా, ఆ శ్లోకానికి శ్రీధరస్వామి వ్రాసిన వ్యాఖ్యలో కలియుగంలో కృష్ణావతార ప్రాశస్త్యాన్ని వర్ణించడమే కనబడుతుంది. ("అనేనకలౌ కృష్ణావతారస్య ప్రాధాన్యం దర్శయతి.)"

ప్రతికల్పంలోను అవతరించే లీలావతారాలను కల్పావతారాలనే పేరుకూడా

ఉందని తెలుసుకొన్నాముగదా! ప్రతి అవతారానికి—ఆవేశ, ప్రభవ, వైభవ, పరత్వావస్థలవల్ల అవతారసంఖ్య నాలుగురెట్లు పెరుగుతుంది. గౌడీయ వైష్ణవగోస్వాములు వీటినన్నింటిని విపులంగా వర్ణించారు. ఆవేశ అవతారాన్ని నిజంగా అవతారం అనడానికి వీలులేదు. అది ఔపచారికంగానే అవతారం. ఏ జీవియందైనా భగవంతుడు ప్రవేశిస్తే ఆ జీవికి అవతార గౌరవం వస్తుంది. విశిష్టకార్యాల్ని కొనసాగించడం కోసం భగవంతుడు విశిష్టజీవుల్ని ఇలా ఉన్నతుల్ని చేస్తాడు. సనకసనందనాదులు, నారదుడు, పృథువు ఇలాంటి పుణ్యాత్ములు. "విష్ణుధర్మం" అనే గ్రంథంలో కల్కి అవతారంకూడా ఇలాంటిదే అని ఉంది. ఇంక-ప్రభవ, విభవ అనేవి భగవంతుని శక్తి ప్రాకట్యంలో ఉన్న తారతమ్యాన్ని బట్టి వచ్చిన పేర్లు. ఇవి రెండూ భగవానుని "స్వరూప-రూప" సంబంధమైనవే । ఇవి రెండూ "పరావస్థావతారాలకంటె తక్కువ శక్తిమంతాలు. "పరావస్థైక్య ఊనకః". ప్రభవావతారాలను తిరిగి రెండుగా విభజించవచ్చును. 1) ఎక్కువకాలం ఉండనివి("నాతిచిరవ్యక్త"). మోహిని, హంస, శుక్ల-అవతారాలు దీనికి ఉదాహరణలు. అవతార ప్రయోజనం తీరిన్వెంటనే అవి సమాప్తి పొందడం జరిగింది. 2) ఎక్కువగా ప్రచారం పొందనివి. "నాతివిశ్రుతకీర్తి"). శాస్త్రకారులైన మహాపురుషులు - ధన్వంతరి, ఋషభ, వ్యాస, కపిలులు- దీనికి ఉదాహరణ ప్రాయులు. విభవావతారాలు సంఖ్యలో ఎక్కువ, ఇవి- కూర్మ, మత్స్య, నర- నారాయణ, వరాహ, హయశీర్ష, పృష్టిగర్భ, బలరాములును; యజ్ఞావతారంతో ప్రారంభించిన పద్నాలుగు మన్వంతరావతారాలును కలిసి ఏర్పడుతాయి.

ప్రతి ఆవేశ, ప్రభవ, వైభవ అవతారానికి ఒక ప్రత్యేక లోకంలో నివాసస్థానం నిర్ణీతమై ఉంది. కూర్మం మహాతలంలో ఒక సరస్సులో నివసించి ఉంటుంది అలాగే మత్స్యం రసాతలంలో ఉంటుంది. నర - నారాయణులు బదరికాశ్రమంలో ఉంటారు. ద్విపాద వరాహం మహర్లోకంలోను, చతుష్పాద వరాహం పాతాళ లోకంలోను నివసిస్తాయి. హయశీర్షుని లోకం తలాతలం. పృష్ణిగర్భునిలోకం, బ్రహ్మయొక్క జ్ఞానలోకంపైన. బలరాముడు, శ్రీకృష్ణుడు ఎక్కడ ఉంటే అక్కడ ఉంటాడు. కాని, ఆయన అంశావతారం అయిన సంకర్షణుడు పాతాళలోకంలో ఉంటాడు. వైకుంఠుడు స్వర్గలోకంలోను (వైకుంఠలోకంలో కూడా), అజితుడు ధ్రువలోకంలోను, త్రివిక్రముడు (వామనునకు భిన్నుడు) తపోలోకంలోను, వామనుడు భువర్లోకంలోను ఉంటాడు. కాని, అవతారాలన్నీ

పరవ్యోమం లేదా మహా వైకుంఠంకంటె కిందిలోకాలలో ఉంటాయి. ఈ విషయా లన్నింటిలోను "విష్ణు ధర్మోత్తర పురాణం" ప్రమాణంగా తీసుకోవడం జరిగింది. గౌడీయ వైష్ణవ సంప్రదాయంలో అవతార విషయాది విజ్ఞానానికి - భాగవత, పద్మ, విష్ణుధర్మోత్తరాది పురాణాల్ని అనుసరించడం కనబడుతుంది. కొన్ని సిద్ధాంత విషయాలలో అభిప్రాయభేదాలూ ఉన్నాయి.

పరావస్థలో షడైశ్వర్యములు ఉండి అవతారాలు ప్రకాశిస్తాయి. అది సంపూర్ణావస్థ. దీపాన్నుండి దీపాన్ని వెలిగించినట్లు ("దీపాద్ ఉత్పన్నదీపవత్") భగవత్తేజం నుండి అవి శక్తిని సంపాదిస్తాయి. నృసింహ, రామ, కృష్ణావతారాలలో వైశిష్ట్యం ఉంది. శ్రీ రూపగోస్వామి తన గ్రంథంలో (సంక్షేప భాగవతామృతం) నృసింహావతారం యొక్క ప్రత్యేకతను - భాగవతం, పద్మపురాణం, నృసింహతాపనీ ఉపనిషత్తుల సాయంతో స్థాపిస్తారు. శ్రీమద్భాగవతానికి వ్యాఖ్య వ్రాసిన శ్రీధరస్వామి నృసింహభక్తుడు. ఆ విషయాన్ని కూడా ఉటంకిస్తారు శ్రీ గోస్వామి. శ్రీ నృసింహుడు, జ్ఞానలోకంలోను విష్ణులోకంలోను కూడా ఉంటాడు. శ్రీరాముడు అయోధ్యలోను, మహా వైకుంఠంలోను ఉంటాడు విష్ణుధర్మోత్తరానుసారం, చతుర్వ్యూహాలు (వాసుదేవాదులు)రామ లక్ష్మణాదులలో అవతరించాయి. పద్మపురాణానుసారం నారాయణుడు రామునిగా, శేషుడు లక్ష్మణునిగా, సుదర్శన చక్రం భరతునిగా, పాంచజన్యం శత్రుఘ్నునిగా అవతరించడం జరిగింది. పురాణానుసారం శ్రీకృష్ణుడు- వ్రజ, మథుర, ద్వారక, గోలోకాలలో వసిస్తాడు.

ఈ సందర్భంలోనే శ్రీరూపగోస్వామి శ్రీరామ నృసింహావతారాలు శ్రీకృష్ణునితో తుల్య ప్రభావం ఉన్న "పరాస్థావతారాలా?" అనే విషయాన్ని చర్చిస్తాడు. చర్చిస్తూ, శ్రీరామ నృసింహావతారాలకు శ్రీకృష్ణుని "స్వభావం" ఉన్నా, తమ చేతులలో చనిపోయిన రావణ హిరణ్యకశిపులకు "సాయుజ్యం" ఇయ్యలేక పోయారు. తన చేతులలో చనిపోయిన శిశుపాలునకు శ్రీకృష్ణుడు "సాయుజ్యం" ఇయ్యగలిగినాడు ("హతారిగతిదాయక"). ఈ విశేషశక్తి శ్రీకృష్ణునకుండడానికి కారణం ఆయన స్వయం భగవానుడు కాబట్టి ("కృష్ణస్తు భగవాన్ స్వయం") అని వివరించారు. ఇవన్నీ పూర్ణావతారాలే అయినా, భగవానుని శక్తులన్నీ ప్రదర్శితాలు కావడంలో భేదం ఉంటుంది ఈ సందర్భంలో ఈ ఉపమానం ఇస్తాడు: దీపంలో ఉన్న శక్తి, మంటలో ఉన్న శక్తి ఒకటే. ఇంటిని కాల్చివెయ్యడానికి రెండింటికి శక్తి ఉంది. కాని చలిని తగ్గించడానికి దీపంలో ఉన్న శక్తి చాలదు!

పరస్పర విరుద్ధగుణాలైన- ఏకత్వ పృథక్త్వాలు. అంశిత్వ అంశత్వాలు- పరాత్పరుడైన శ్రీకృష్ణునిలో సాధ్యమనీ అందుచేతనే ఆయనశక్తి "అచింత్య"మనీ వ్రాశాడు. తన అభిప్రాయాలకు, సిద్ధాంతాలకు బలంగా ఆయన పురాణాలలో నుండి ఉదాహరణాలు విస్తృతంగా ఇస్తాడు. జగత్సృష్టికోసం భగవానుడు ("భువనానాం సి సృక్షయా") షోడశకళల్ని ధరిస్తాడు. ఇవి ఆయన పోడశ శక్తులని వైష్ణవ భక్తిశాస్త్రాలు చెప్పుతున్నాయి. అవి: శ్రీ, భూ, కీర్తి, ఇలా, లీలా, కాంతి, విద్యా, విమలా, ఉత్కర్షణీ, జ్ఞానా, క్రియా, యోగా, ప్రహ్వీ, సత్యా, ఈశానా, అనుగ్రహా- అనే పదహారు కళలు.

ప్రాచీనమైన వ్యూహ సిద్ధాంతంలో కొన్ని మార్పులు చేశాడు. ఈయన దృష్టిలో- సంకర్షణుడు అహంకారానికి, వాసుదేవుడు చిత్తానికి, ప్రద్యుమ్నుడు బుద్ధికి, అనిరుద్ధుడు మనస్సునకు అధిపతులు. "నారాయణీయం" దృష్టిలో-ప్రద్యుమ్నుడు మనస్సునకు, అనిరుద్ధుడు అహంకారానికి అధిపతులని ఉంది. కాని, పాంచరాత్ర సిద్ధాంత గ్రంథాలు తన దృష్టిని బలపరుస్తున్నాయని ఈయన వ్రాశాడు. హరియొక్క చతుర్భుజాలు చతుర్వ్యూహాలు. కొన్ని సాత్వత తంత్రాల్ని అనుసరించి వ్యూహాలు తొమ్మిది. శ్రీ జీవగోస్వామి రచించిన "శ్రీకృష్ణ సందర్భం"లో ఇలా ఉంది:

"సాత్వతాం వాసుదేవ-సంకర్షణ-ప్రద్యుమ్నానిరుద్ధ-నారాయణ-హయగ్రీవ- వరాహ- నృసింహా- బ్రహ్మ- ఇతి యా నవ మూర్తయః"

దీనిలో అధికంగా ప్రస్తుతించబడిన అయిదు వ్యూహాలు - నారాయణ, హయగ్రీవ, వరాహ, నృసింహ, బ్రహ్మ- అనేవి. కాని ఈ అయిదు వ్యూహాల్ని అందరూ అంగీకరించలేదు. ఈ వ్యూహాలు, పురుషావతారం యొక్క వివిధావస్థలని వీరి విశ్వాసం.

గౌడీయ వైష్ణవ సంప్రదాయంతో విశిష్టభావన-కొన్ని ఉత్తరభారత వైష్ణవ సంప్రదాయాలలో కూడ - శ్రీకృష్ణుడు స్వయంగా భగవంతుడని. ఇందువల్ల, కొన్ని సంప్రదాయాలలో ప్రాచుర్యాన్ని పొందిఉన్న "శ్రీకృష్ణుడే చతుర్వ్యూహంలోని వాసుదేవుడను సిద్ధాంతాన్ని" శ్రీరూపగోస్వామి ఖండించి, శ్రీకృష్ణుడు వాసుదేవునికంటె అధికుడని స్వయంగా భగవంతుడే అని ప్రవచిస్తాడు. మిగిలిన

అవతారాలన్నీ అంశావతారాలు గాని కళావతారాలు గాని అని అంగీకరించాలి అంటాడు. శ్రీకృష్ణుడు మాధుర్య గుణశోభితుడు గనుక- బ్రహ్మన్‌కంటె, నారాయణునికంటె, వ్యూహాలకంటె- అన్నింటికంటె శ్రేష్ఠుడంటాడు. పురాణాలనుండి ఆధారాలు చూపించడమే కాకుండా ఈ సందర్భంలో "గోపాలతాపని" ఉపనిషత్తును సర్వోత్తమ ఆధారంగా చూపిస్తాడు. గౌడీయ వైష్ణవ సంప్రదాయం-పురాణాలలో, శాస్త్రాలలో ప్రస్తావించబడిన సమస్త దేవతామూర్తుల్ని అంగీకరిస్తుంది, కాని- కృష్ణునికంటె ఏ అవతారం, ఏ దేవత, ఏ వ్యూహం ఉన్నతం అన్నా అంగీకరించదు. శ్రీకృష్ణుడు సర్వోన్నతుడు, మిగిలిన వారందరూ తమ శక్తి సామర్థ్యాల్ని ఆయన నుండే పొందుతారు అని వారి వాదం. షడ్గోస్వాములలో శతాధిక గ్రంథకర్త అయిన శ్రీ జీవగోస్వామి తన "శ్రీకృష్ణసందర్భం"లో- బ్రహ్మ, శ్రీకృష్ణుని ప్రథమభక్తుడు అని, ధార్మిక గ్రంథాలలో శివుడు ఆదర్శ వైష్ణవునిగా చిత్రించబడడంచేత బ్రహ్మకంటె శివుడు గొప్పవాడని, భక్తిప్రదాయకురాలైన లక్ష్మి శివునికంటె అధికురాలని వ్రాశాడు. ఈ ఆధిక్యంవల్లనే ఆమెకు "పరమసఖ్య" స్థానం లభించిందని వివరించాడు

భక్తిని ఒకరసంగా తాత్త్విక సిద్ధాంతస్థాయికి తీసుకొనిపోయి స్థాపించిన- రూపగోస్వామి, జీవగోస్వామి ప్రభృతులు శ్రీకృష్ణుని లీలా జీవితంలో మధుర బృందావనాలకు ఇచ్చిన స్థానం ద్వారక కీయలేదు. గోపికలకు, రాధకు ఇచ్చిన స్థానం రుక్మిణి, సత్యభామ మొదలైన మహిషుల కీయలేదు. మధురభక్తిని ప్రపంచంలో స్థాపించడానికే భగవానుడు స్వయంగా వచ్చాడు. ఆయనయే కృష్ణుడు. షడ్గోస్వాములు వారివారి రచనలలో- ముఖ్యంగా రూపగోస్వామి తన "భక్తిరసామృత సింధు", "ఉజ్జ్వలనీలమణి" అనే సిద్ధాంత గ్రంథాలలో, సనాతన గోస్వామి వ్రాసిన "బృహద్భాగవతామృతం", దానిని చూచి రూపగోస్వామి రచించిన "లఘుభాగవతామృతం" అనే వాటిలో, జీవగోస్వామి వ్రాసిన "సందర్భ గ్రంథాల"లో- ప్రత్యేకంగా "శ్రీకృష్ణ సందర్భం"లో- అచింత్య భేదాభేద సిద్ధాంతాన్ని స్థాపించడమేకాక, శ్రీకృష్ణుడే పరాత్పరుడని మిగిలినవన్నీ ఆయన ఇచ్ఛానుసారమే బయలువెడలినవని నిర్ణయించారు. "కృష్ణస్తుభగవాన్ స్వయం" అన్నది మహావాక్యం అన్నారు. జీవగోస్వామి తన సిద్ధాంతాలకన్నింటికీ మూల శ్లోకంగా శ్రీమద్భాగవతంలోని-

"వదంతి తత్తత్త్వవిదస్తత్త్వం యద్జ్ఞానమద్వయమ్ ।
బ్రహ్మేతి పరమాత్మేతి భగవానితి శబ్ద్యతే ॥"

అనేదాన్ని గ్రహించి శ్రీకృష్ణ పారమ్యాన్ని స్థాపించారు.

గౌడీయ వైష్ణవ సంప్రదాయంలో శ్రీ చైతన్య మహాప్రభువునకు శ్రీకృష్ణునితో అభేదమైన స్థానాన్ని ఇచ్చారు. "స్వరూప, నామ, రూప, గుణ లీలామయుడును, సంబంధాభిధేయ ప్రయోజనాధి దేవతయునగు శ్రీ గౌరచంద్రునకు ప్రణామ రూప శ్రీరూపవచనము"

"నమోమహావదాన్యాయ, కృష్ణప్రేమప్రదాయతే ।
కృష్ణాయ కృష్ణచైతన్య నామ్నే గౌరత్విషేనమః ॥

ఆయనయే యుగావతారమన్న వారున్నారు. ఆయన భక్త్యుద్రేకాన్ని రాధాభావాన్ని బట్టి ఆయనది రాధాకృష్ణుల యుగళావతారం అన్నారు. శ్రీకృష్ణుడు తన రూపానికి తానే ముగ్ధుడై, రాధవలె దాని నాస్వాదించయత్నించాడు అని రూపగోస్వామి తన రూపకం "లలితమాధవమ్"లో అంటాడు. "సరభసం ఉపభోక్తుం కామయేరాధికేవ" గౌరాంగుడైన చైతన్య మహాప్రభువు రాధనుకూడా తనలో అవతరింపజేసుకోవడంవల్లనే కృష్ణత్వం పోయి రాధాతనువర్ణం ఆయనకు-స్వయంగా కృష్ణుడైనా సంక్రమించిందని భక్తుల విశ్వాసం. రాగాత్మిక భక్తికి తాను స్థానమై భక్తులను ఆయన ప్రబోధించాడు. శ్రీ చైతన్య మహాప్రభువు గోదావరీ తీరంలో రామానంద రాయలను కలుసుకొన్న తరువాత రాధాభావం ఆయనలో అభివ్యక్తమయిందని ఆ యుగళావతార మూర్తిని ఆయన మహాభక్తుడైన రామానందరాయలకు ప్రదర్శించాడని మహాభక్తుడు, వంగభాషలో "చైతన్యచరితామృతం" అనే బహుళ ప్రచారాన్ని పొందిన గ్రంథాన్ని రచించిన కృష్ణదాస కవిరాజు అంటాడు:

"రాధికార భావకాంతి కరి అధికార ।
నిజరస ఆస్వాదితే కరి ఆ ఛ అవతార ॥"
"తవే హాసి ప్రభు నిజదేఖాల స్వరూప ।
రసరాజ మహాభావదుఇ ఏకరూప ॥"

ఈ భావాన్నే (యుగళావతారభావాన్ని) ప్రబోధానంద సరస్వతి తన

చైతన్యచంద్రామృతమ్"లో ఈ విధంగా సంస్కృతంలో శ్లోక రూపంలో వ్యక్తం చేశారు:

"బిభ్రత్ కాంతిమ్ వికచకనకాంభోజగర్భాభిరామమ్।
ఏకీభూతమ్ వపురవతు వో రాధయామాధవస్య॥"

భగవానుడైన శ్రీకృష్ణుడు తన భక్తుల యందున్న ప్రేమచేతనే అవతరిస్తాడు. వారితోకలిసి తానూ ఆ భక్తి మాధుర్యాన్ని అనందిస్తాడు. ఆయన లీలల్ని ప్రకటలీలలు, అప్రకటలీలలు అని వివరించారు. ఒకటి ప్రపంచ గోచరం. రెండవది అగోచరం. ప్రకటలీలలో శ్రీకృష్ణుడు బృందావనం, మథుర, ద్వారకలకు వెళ్ళినట్లు, వచ్చినట్లు ఉంటుంది. అప్రకటలీలలో ఆయన ఎప్పుడూ బృందావనం లోనే ఉంటాడు. ఇక్కడ ఒక్క గోపికతోనే (గోప్యైకయా) ద్విభుజునిగా ఉంటాడు. కొన్నిచోట్ల ఒక్కొక్కప్పుడు చతుర్భుజునిగా కూడా ఉంటాడు. ఆయన బృందావనంలో కృష్ణుడు, మథురలో వాసుదేవుడు, ద్వారకలో తన ప్రద్యుమ్నానిరుద్ధ రూపాలుధరిస్తాడు. ఒక విధంగా ఇది, సనాతన వ్యూహ సిద్ధాంతాన్ని సమన్వయించడానికి జీవగోస్వామి "కృష్ణ సందర్భం" అనే గ్రంథంలో ప్రదర్శించిన విధం. రాధాకృష్ణులకు వివాహమైనట్లుగా, గోపికలు భగవానునికి భార్యలుగా చిత్రించారు.

భగవంతుని లీలలకు ఆయన శక్తులు ఆధారాలు. ఆయన అచింత్యాకారుడైనా అనంత శక్తిమంతుడు. ఆయన శక్తులలో ముఖ్యమైనవి 1. అంతరంగశక్తి 2. తటస్థశక్తి 3. బహిరంగశక్తి. అంతరంగశక్తి భగవద్రూపిణి. సచ్చిదానంద రూపిణి. స్వరూపశక్తి ఏకాత్మిక అయినా కార్యానుసారం త్రివిధగాభాసిస్తుంది. దీనిలో మొదటిది సంధినీశక్తి, బలదేవ విద్యాభూషణుడు దీనిని "సదాత్మాపి యయా సత్తాం ధత్తే, దదాతి చ సర్వదేశకాల ద్రవ్యవ్యాప్తి హేతుః సంధినీశక్తిః అని నిర్వచించాడు. ఈ శక్తివల్ల భగవానుడు స్వయంగా సత్తాను ధరిస్తున్నాడు. ఇతరులకిస్తాడు. దేశకాల ద్రవ్యాదులలో వ్యాప్తిపొంది ఉన్నాడు. రెండవది-సంవిత్. భగవంతుడు స్వయంగా చిదాత్మ. ఈ శక్తివల్ల ఆయన తన్నుతాను తెలుసుకొంటున్నాడు. ఇతరులకు జ్ఞాన ప్రదానం చేస్తున్నాడు "సంవిదాత్మాపి యయా సంవేత్తి సంవేదయతి చ సా సంవిత్" అని "సిద్ధాంతరత్న"లో నిర్వచించాడు బలదేవ విద్యాభూషణుడు. ఇంక మూడవది హ్లాదినీ శక్తి. భగవానుడు

ఆనందస్వరూపుడు. ఇది ఆనందానుభవాన్ని ఇస్తోంది. బలదేవ విద్యాభూషణుడు దీనిని "హ్లాదాత్మాపి యయాహ్లాదతే హ్లాదయతి చ సా హ్లాదినీ శక్తిః । తత్తత్ ప్రాధాన్యేన స్ఫూర్తేః తత్తద్రూపం తస్యా ఏకస్యా వైదూర్యవదవసీయతే" అన్నాడు. ఒకే వైదూర్యం, మూడురంగులలో కనబడ్డట్లు, ఈ శక్తి త్రివిధ రూపాల్ని ధరిస్తుంది.

2. తటస్థ శక్తిః- అణుత్వ పరిమితులైన జీవుల ఆవిర్భావానికి కారణం.

౩ బహిరంగ శక్తి. మాయాశక్తికే ఈ పేరు జగదావిర్భావానికి కారణం అవుతోంది స్వరూపశక్తికి మాయాశక్తికి మధ్యఉండడం చేతనే జీవశక్తికి తటస్థ శక్తి అనే పేరు వచ్చింది.

ఈ మూడు శక్తుల సముచ్చయమే పరాశక్తి. భగవానుడు స్వరూపశక్తి వల్ల జగతుకు నిమిత్తకారణుడవుతున్నాడు జీవమాయాశక్తులవల్ల ఉపాదానకారణుడవుతున్నాడు. మధ్వమతంలో ఈశ్వరుడు కేవలం నిమిత్తకారణుడు. అచింత్యభేదాభేద సిద్ధాంతంలో- ఈశ్వరుడు నిమిత్తోపాదానకారణుడు. ఈ సిద్ధాంతంలో జగత్తు సత్యం. సత్యసంకల్పుడు, సర్వవిదుడు అయిన హరియొక్క బహిరంగ శక్తి విలాసం అది అసత్యం ఎలా అవుతుంది?

శ్రీ చైతన్య సంప్రదాయంలో నామ జపానికి విశేష ప్రాముఖ్యం ఉంది. నామికి నామానికి భేదం లేదు. ("నామ నామినోర భేదః") శబ్దం యొక్క శాశ్వతత్వం మీద ఇది ఆధారపడిఉన్నా జీవగోస్వామి "నామా"నికి ప్రత్యేక స్థానంఇచ్చి "భగవత్స్వరూపం ఏవ నామ" అన్నాడు. నామానికి అవతార స్థానం ఇచ్చి "వర్ణావతారం" అన్నాడు. "అవతారాంతరవత్ పరమేశ్వరస్య వర్ణరూపేణావతారోఽయమ్" మరి భగవంతుడు "నామరహితుడు" అంటారే అదేమిటి? అని ప్రశ్నించుకొని "నామరహితుడు" అంటే ఆయనపేరు అప్రాకృతం" అని అర్థం అంటాడు. "అరూపాకరాభవ" శబ్దాల్ని కూడా గ్రహించి ఇవన్నీ లేవంటే అవన్నీ "అప్రాకృత విషయాలు" గనుక లేవన్నారు. అంతే గాని, అవి లేవని కాదు అని వ్రాశాడు.

భగవన్నామానికి ఇంత శక్తి ఉన్నది గనుకనే దక్షిణదేశంలో కూడా "నామసిద్ధాంతం''ప్రచారంలోకి వచ్చింది. శ్రీమద్భాగవతంలోనే నామ ప్రాముఖ్యం విశేషంగా ప్రకటింపబడింది.

"అజ్ఞానాదథవా జ్ఞానాదుత్తమశ్లోక నామయత్ ।
సంకీర్తిత మఘంపుంసోదహత్యేధో యథానలః॥"

దక్షిణ దేశంలో శ్రీధర వేంకటేశ, బోధేంద్ర మొదలైన వారు నామానికి ఇచ్చిన ప్రాధాన్యం మనకు తెలిసిందే! "నామామృతరసాయనమ్" వ్రాసిన బోధేంద్రులు అద్వైత సన్యాసులు, శ్రీకంచికామకోటి పీఠానికి యాభై తొమ్మిదవ పీఠాధిపతులు. భగవన్నామ బోధేంద్రులు అని పేరుపొందారు. ఛాందోగ్యోపనిషత్తులో నామాన్ని గురించి "వాచారంభణం వికారో నామధేయమ్" అని ఉంది. ఈ విధంగా "నామానికి నామికి" భేదం లేదు గనుక పెద్దలు "వర్ణావతారం" అని వ్యవహరించారు.

గౌడీయ వైష్ణవ తత్త్వవేత్తలు ప్రమాణాలలో "శబ్దప్రమాణం" సర్వశ్రేష్ఠమని భావించారు. "ప్రదానత్వాత్ ప్రమాణేషు శబ్ద ఏవ ప్రమాణ్యతే" అన్నారు శ్రీ రూపగోస్వామి. "సంక్షేప భాగవతామృతం"లో వ్రాస్తూ ఈయన యుక్తులవల్ల లాభంలేదని వేదాంత సూత్రం "శాస్త్రయోనిత్వాత్" అనేది, "తర్కాప్రతిష్ఠానాదప్యన్యథానుమేయమితి చేదేవమప్యవిమోక్ష ప్రసంగః" అనే ఇంకోసూత్రం తన వాదానికి బలం చేకూరుస్తున్నాయని వ్రాశారు. "శబ్ద" ప్రమాణానికి ఇంత ప్రాధాన్యం వారి దృష్టిలో ఉంది గనుకనే "వర్ణావతారం" ప్రత్యేక స్థానాన్ని పొందింది

శ్రీ బ్రహ్మ సంప్రదాయాలలో, గౌడీయ వైష్ణవ సంప్రదాయంలో అవతార తత్త్వ విషయంలో ఉన్న సిద్ధాంతాలను విశ్వాసాలను కొంత గ్రహించాము. అవతారతత్త్వ వివేచన కావశ్యకమైనంతవరకు ఆయా సిద్ధాంతాల్ని కూడా పరిశీలించాము మిగిలిన రుద్ర, సనకాది సంప్రదాయాలలో అవతార విషయంలో గల విభిన్నాభిప్రాయాల్ని గుర్తించవలసి ఉంది. ఈ రెండు సంప్రదాయాలు శ్రీకృష్ణుని భగవానునిగా అంగీకరించినవే! శ్రీమద్భాగవతాన్ని పరమప్రమాణంగా స్వీకరించినవే! రెండింటికి వ్రజభూమి పరమపవిత్రమైన క్షేత్రం. కాని, సిద్ధాంతాలలో ఆచార వ్యవహారాదులలో, విశ్వాసాలలో కొన్ని భేదాలున్నాయి. అవతారతత్త్వ వివేచనానికి అవశ్యకమైనంతవరకు వాటిని పరిశీలిద్దాము.

ఈ ఆచార్య పురుషుల సిద్ధాంతాదికాలలలో ఎన్ని విభేదాలున్నా శాంకరాద్వైతాన్ని-మాయావాదాన్ని-ఖండించడంలో వీరిలో వీరికి ఏకవాక్యత ఉంది.

# శ్రీ వల్లభ (రుద్ర) సంప్రదాయం

రుద్ర సంప్రదాయానికి మూలపురుషులు శ్రీ విష్ణుస్వాములు. బాలకృష్ణోపాసకులు. ఈయనయే స్వయంగావచ్చి ఉపదేశంచేసి- తమకు సగుణనిర్గుణరూపాలు రెండూ సహజాలేననీ నిరాకారులైనా భక్తజనోద్ధరణకోసం, సాకార రూపాన్ని గ్రహించి అవతరిస్తామని చెప్పినట్లు ప్రతీతి! ఈ సంప్రదాయానికి విశేషఖ్యాతి ప్రచారం తెచ్చిన మహాపురుషులు శ్రీ వల్లభాచార్యులు (1478-1582) కాలక్రమాన్ని ఈయనపేరే సంప్రదాయానికి వచ్చింది. ఈయన తల్లిదండ్రులు- ఎల్లమ్మ- లక్ష్మణభట్టు అనే తెలుగుదంపతులు. రాయపూర్ జిల్లా చంపారన్ గ్రామంలో వీరి జననం. వీరి ధర్మప్రచార ప్రభావాలు- గుజరాత్, రాజస్థాన్ ప్రాంతాలలో విశేషంగా కనబడుతాయి. తెలుగుదేశంలో వీరిని గురించి ప్రజలకు విశేషంగా తెలియదు. వీరికి శ్రీకృష్ణదేవరాయల సభలో మధ్వగురువులైన శ్రీ వ్యాసరాములవారి అధ్యక్షతను "కనకాభిషేకం" జరిగిందని తెలుస్తోంది.

శ్రీ వల్లభుల భక్తి సంప్రదాయానికి "పుష్టిమార్గం" అనిపేరు. తాత్త్వికసిద్ధాంతరీత్యా "శుద్ధాద్వైతం" వీరి దర్శనానికి పేరు. తమ సిద్ధాంత ప్రచారంకోసం ఈయన బ్రహ్మసూత్రాలలో కొన్ని అధ్యాయాలకు "అణుభాష్యం" అను పేర భాష్యం వ్రాశారు. శ్రీమద్భాగవతంలో కొన్ని అధ్యాయాలకు "సుబోధినీ" అనే వ్యాఖ్య. "తత్త్వదీపం" మొదలైన గ్రంథాలు, ఎన్నో స్తోత్రాలు వ్రాశారు. కాశిలో చిరకాలం నివసించి అక్కడే సిద్ధిపొందారు. ఈయన తరువాత ఈయన పుత్రులు శ్రీ విఠలనాథులు సంప్రదాయవ్యవస్థను తీర్చిదిద్ది బహుళప్రచారం తెచ్చారు. అక్బరు పాదుషానుండి గోకులంలో, గోవర్ధనంలో భూదానాన్ని పొందారు. శ్రీ విఠలనాథ గోస్వామి గోవులు స్వేచ్ఛగా సంచరించడానికి పాదుషా ఫర్మానా కూడా ఇచ్చాడు. ఈయన తమ తండ్రిగారు వ్రాయగా మిగిలిన బ్రహ్మసూత్రాలకు వ్యాఖ్యానంవ్రాసి అణుభాష్యాన్ని పూర్తిచేశారు. ఇంకా ఎన్నోగ్రంథాలు వ్రాశారు. స్తోత్రాలువ్రాశారు. ఈ సంప్రదాయానికి చెందిన ఆచార్యులు వ్రజభాషను పోషించి "అష్టఛాప్" కవులని పేరు పొందిన ఎనమండుగురు కవులను ఆదరించారు. ఆ కవులు- సూరదాసు, పరమానందదాసు, కుంభదాసు, కృష్ణదాసు, ఛీతస్వామి, గోవిందస్వామి, చతుర్భుజదాసు, వీరికి వల్లభ సంప్రదాయంలో 'అష్టసఖులు'అని పేరు. శ్రీవల్లభాచార్యులకు- సూరదాసు ప్రభృతులైన "అష్టఛాప్"కవులు శిష్యులు ఈ కవులలో కొందరు గోస్వామి విఠలనాథుని శిష్యులు. ఈ కవులవల్ల వ్రజభాషలో భక్తి సాహిత్యం విశేషంగా అభివృద్ధి పొందింది. వీరందరు శ్రీనాథ్ జీ

భక్తులు. ఈ ఆచార్యులు సమస్త లలిత కళల్ని కూడా పోషించారు. పూజా పద్ధతిలో నవ్యమార్గాన్ని ప్రవేశపెట్టారు.

శ్రీమద్భాగవతం ఈ సంప్రదాయం వారికి పరమ ప్రామాణికం. "బైఠక్" అనే పేరుతో పదులకొలది స్థలాలలో ఆచార్యులు భాగవత పారాయణం చేశారు. ఇవన్నీ చరిత్ర ప్రసిద్ధాలయ్యాయి. వీరి సిద్ధాంతానికి "శుద్ధాద్వైతం" అని పేరు రావడానికి కారణం- అద్వైతుల "మాయ"ను వీరు నిరాకరించడం అద్వైతులు జగత్కారణం మాయాశబలిత బ్రహ్మం అని నమ్మితే, వీరు మాయారహితమైన "శుద్ధ" బ్రహ్మ జగత్కారణం అంటారు. ఈ విషయమే "శుద్ధాద్వైతమార్తాండం" అనే గ్రంథంలో ఇలా వుంది.

"మాయా సంబంధరహితం శుద్ధమిత్యుచ్యతే బుధైః ।
కార్యకారణరూపం హి శుద్ధం బ్రహ్మ న మాయికమ్ ॥"

శ్రీ వల్లభాచార్యులు సగుణ నిర్గుణ స్థితులు రెండూ బ్రహ్మకు సహజాలే, విరుద్ధ ధర్మాలకు పరబ్రహ్మ ఆశ్రయం కావడంలో దోషంగాని ఆశ్చర్యంగాని లేదు అంటారు. "అణోరణీయాన్ మహతోమహీయాన్" అన్నప్పుడు ఇది అంగీకరించి నట్లే గదా! పరబ్రహ్మ- "కర్తుమకర్తుమ్ అన్యథాకర్తుమ్" సమర్థుడు. పరబ్రహ్మ అవి కృతి అయినా భక్తులమీది కృపచేత పరిణామ శీలుడు అవుతున్నాడు అని వీరి వాదం. బ్రహ్మయొక్క ఈ రెండు రూపాలమీద ఆచార్యులవారి విశేషమైన అద రణ. "తత్త్వదీప నిబంధం తో ఇలా అంటారు:

"నిర్దోష పూర్ణ గుణ విగ్రహ ఆత్మతంత్రో
నిశ్చేతనాత్మక శరీర గుణైశ్చ హీనః ।
ఆనందమాత్రకరపాదముఖోదరాదిః
సర్వత్ర చ త్రివిధభేద వివర్జితాత్మా ॥"

వీరి దృష్టిలో శ్రీకృష్ణుడే పరబ్రహ్మ. ఆయన శరీరం సచ్చిదానందమయం. ఆయన తన అనంతశక్తులతో లోపల ఆత్మానందాన్ని పొందుతున్నప్పుడు "ఆత్మా రాముడు" అంటాము. బ్రాహ్మ క్రీడకోసం ఆయన తన శక్తుల్ని బహిర్గతంచేసి నప్పుడు "పురుషోత్తముడు" అంటాము. అప్పుడు ఆయన ఆనందమయుడు. అగణితానందుడు. పరమానంద స్వరూపుడు. భగవద్గీతలోని "పురుషోత్తమ"

శబ్దాన్ని శ్రీ వల్లభులు గ్రహించారు. క్షరపురుష నతిక్రమించి, అక్షర బ్రహ్మ కంటె ఉత్తముడైన పరాత్పరుడు గదా, పురుషోత్తముడు!

"యస్మాత్ క్షరమతీతోఽహమక్షరాదపి చోత్తమః ।
అతోఽస్మిలోకే వేదేచ ప్రథితః పురుషోత్తమః॥ XV-18

ఆ పురుషోత్తముడు శ్రీకృష్ణుడే!

శ్రీకృష్ణుడు తన అనంతశక్తుల చేత పరివేష్టింపబడి తన భక్తులతో "వ్యాపి వైకుంఠం"లో నిత్యలీలలో ఉంటాడు. విష్ణుపు వైకుంఠం పైన ఇది ఉంటుంది. గోలోకం కూడా వ్యాపి వైకుంఠంలో ఒక అంశమాత్రమే. భగవానునకున్న అనంతశక్తులలో- శ్రీ, పుష్టి, గిరా మొదలైన పన్నెండు ముఖ్యమైనవి. క్రీడ కోసం భగవానుని సమగ్రపరివారం, లీలాపరికరాలు భూతలంమీద అవతరిస్తాయి. అప్పుడు వ్యాపి వైకుంఠమే గోకులం రూపంలో ప్రకాశిస్తుంది. ద్వాదశ శక్తులు- శ్రీ స్వామిని, చంద్రావళి, రాధా. యమున మొదలైన అధిదైవిక రూపాలతో ప్రకటితాలవుతాయి. శ్రుతులన్నీ భగవానుని రసకల్లోలాన్ని ఆస్వాదించడానికి గోపీరూపంలో వ్రజమండలంలో ఆవిర్భవిస్తాయి. ఈ సమగ్రలీల నిత్యరూపంలో ఉంటుంది. దీన్ని నిర్దేశించేక్రియలన్నీ మంత్రాలలో వర్తమానకాలంలో ఉంటాయి. శ్రీ వల్లభాదార్యుల కృపవల్ల దీన్ని దర్శించిన అందుడైన సూరదాసు ఇలా వర్ణించాడు:

"జహాఁ వృందావన ఆది అజర జహాఁ కుంజలతావిస్తార।
తహాఁ బిహరత ప్రియ-ప్రియతమదోఉ నిగమభృంగగుంజార॥

రతన జటిత కాలిందీకే తట అతి పునీత జహాఁ నీర।
సరస-హంస-చకోర-మోర ఖగ కూజత కోకిల కీర॥

జహాఁ గోవర్ధన పర్వత మనిమయ సఘన కందరా సార।
గోపిన మండల మధ్య విరాజత నిసదిన కరత బిహార॥"

ఈ సంప్రదాయంలో భక్తికే ప్రాముఖ్యం. అవతారాలలో ప్రవేశ్వరుడైన శ్రీకృష్ణుడే భజనీయుడు:

"సర్వదా సర్వభావేన భజనీయో వ్రజాధిపః ।
స్వస్యాయ మేవ ధర్మోహి నాన్యః క్వాపి కదాచన ॥"

అంటారు ఆచార్యపాదులు "చతుశ్శ్లోకి"లో

ఈ సంప్రదాయంలో "బ్రహ్మ"ను మూడు ప్రకారాలుగా భావించారు 1. అధి భౌతికం-అదే జగత్తు. 2. ఆధ్యాత్మికం-అదే అక్షరబ్రహ్మ. 3. అధిదైవికం అదే పరబ్రహ్మ. పురుషోత్తముడు. అక్షరబ్రహ్మలో ఆనందాంశ స్వల్పం. కించి న్మాత్రంలో తిరోధానమవుతుంది పరబ్రహ్మలో పరిపూర్ణానందం. అక్షరబ్రహ్మకు పరబ్రహ్మకు ఉన్న అంతరం కేవలం స్వరూపంలోనే కాదు. ప్రాప్తిసాధనాలలో కూడా భేదం ఉంది. అక్షర బ్రహ్మ విశుద్ధ జ్ఞానం ద్వారా గమ్యుడు, ప్రాప్యుడు, పురుషోత్తముడైన పరబ్రహ్మ కేవలం అనన్యభక్తిచేతనే సాధ్యుడు. వల్లభాచార్యుల వారు గీత ననుసరించే తాను ఈ నిర్ణయానికి వచ్చినట్లు భగవద్గీతనుంచి శ్లోకాన్ని ఉదాహరించారు:

"బ్రహ్మభూతః ప్రసన్నాత్మన శోచతి న కాంక్షతి ।
సమః సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్॥" XVIII. 54

ఇంతటితో ఆగక-

"పురుషః సపరః పార్థ భక్త్యాలభ్యస్త్వ నన్యయా।
యస్యాంతః స్థానిభూతాని యేన సర్వమిదం తతమ్॥" VIII-22

అను శ్లోకానికి వ్యాఖ్య వ్రాసేచోట-

"ఇత్యనేన అక్షరాత్ పరస్య స్వస్య భక్త్యైక లభ్యత్వముక్తమ్।
తేన జ్ఞాన మార్గీయాణాం న పురుషోత్తమ ప్రాప్తిరితి సిద్ధమ్॥"

అని కూడా స్పష్టంగా వ్రాశారు.

జీవ, జగత్తుల విషయంలో కూడా వీరి ఆలోచనలు వేరు. భగవానునకు క్రీడించాలనే ఇచ్ఛ కలిగిన వెంటనే తన ఆనందాది అంశల్ని తిరోధానం చేసి జీవరూపాల్ని పొందుతాడు. దీనికి ముఖ్యకారణం ఆయన ఇచ్ఛ. మాయకాదు. ఐశ్వర్యం తిరోధానం కావడంతో జీవునిలో దైన్యభావం వస్తుంది. యశాన్ని తిరో

ధానం చెయ్యడంవల్ల సర్వహీనత కలుగుతుంది. 'శ్రీ' తిరోధానం కావడంతో విప త్తులు భరించవలసివస్తుంది 'జ్ఞానం'పోవడంతో జీవికి దేహాత్మబుద్ధి కలుగుతుంది. అగ్నినుండి విస్ఫులింగాలు బయలుదేరినట్లు బ్రహ్మనుండి జీవుని ఆవిర్భావం జరుగుతుంది. ఆవిర్భూతజీవుడు నిత్యుడు. ఈ ఆవిర్భావాన్ని "వ్యుచ్చరణం" అంటారు. ఇది ఉత్పత్తికంటె భిన్నం. జీవుడు జ్ఞాత, జ్ఞానరూపుడు, అణువు, సచ్చిదానందుడైన భగవానుని అవికృత సదంశచే జరుగు. అవికృత చిదంశచే జీవుడు ఆవిర్భవించడం జరుగుతుంది. జీవావిర్భావకాలమందు కేవలం ఆనం దాంశం మాత్రమే తిరోధానం కాగా, జడావిర్భావకాలంలో చిదానందాంశలు రెండూ తిరోధానం అవుతాయి.

జీవ, బ్రహ్మల విషయంలో వేదాంతసంప్రదాయాలలో మతభేదాలు చాలా ఉన్నాయి. బ్రహ్మసూత్రాలలో- "అంశో నానావ్యపదేశాదన్యథా చాపి దాశ కిత వాదిత్వ మధీయత ఏకే" అనే సూత్రం జీవుడు బ్రహ్మాంశమే అని అంటోంది, విస్ఫులింగం అగ్న్యంశమైనట్లు ఇక్కడ ఈ "అంశ" శబ్దం మీద చాలా వాదోప వాదాలు ఉన్నాయి. శంకరభగవత్పాదుల దృష్టిలో బ్రహ్మ నిష్కలము, నిరవయ వము గనుక" "అంశ ఇవ" అంటారు వారు. ఈ సూత్రాన్ని బట్టి వల్లభా చార్యులవారు జీవుడు బ్రహ్మయొక్క వాస్తవాంశ అంటారు. అణుభాష్యంలో ఇవన్నీ విపులంగా చర్చించడం జరిగింది.

జీవులు మూడు విధాలు. 1) శుద్ధ (2) ముక్త (3) సంసారి- అనేవే ఆ మూడు. ఆవిర్భావసమయంలో ఆనందాంశ తిరోధానంకాగా జీవునకు అవిద్యతో సంబంధం ఏర్పడుతుంది. ఈ సంబంధం కలగడానికి పూర్వమున్న జీవి శుద్ధజీవి. అవిద్యతో సంపర్కం కలగడంతో జీవి సంసారిగా మారిపోతాడు. ఈ సంసారి కూడా- దైవాసుర విభాగాలుగా ఉంటాడు. ముక్తజీవులలో కొందరు జీవన్ముక్తులు. కొందరు కేవల ముక్తులు. పుష్టిమార్గంద్వారా భగవంతుని దయను పొందిన జీవి, ఆవిర్భావ కాలంలో పోగొట్టుకొన్న ఆనందాంశాన్ని తిరిగిపొందుతాడు. ఈ ఆనం దాంశాన్ని పొందడంతో స్వయంగా సచ్చిదానందుడై భగవానునితో అభేదప్రాప్తి పొందుతాడు.

శ్రీ వల్లభాచార్యులవారు అవికృత పరిణామవాదాన్ని అంగీకరిస్తారు. నిర్గుణ సచ్చిదానంద బ్రహ్మ అవికృత భావంతో జగద్రూపంగా పరిణతి పొందుతుంది.

బంగారం కుండలాది ఆభరణాల రూపాన్ని పొందినా ఎలా వికారాన్ని పొందదో అదేవిధంగా, జగద్రూపంగా బ్రహ్మ పరిణతి పొందినా ఆయనలో వికారం లేదు. వల్లభాచార్యులవారు జగదుత్పత్తి వినాశాల్ని అంగీకరించరు. ఆవిర్భావ తిరోధానాల్ని ఒప్పుకొంటారు. జగత్తునకు సంసారానికి సూక్ష్మభేదం ఉందంటారు ఆచార్యులవారు. భగవానుని సదంశనుండి ఆవిర్భవించింది జగత్తు. అవిద్యాకారణంగా మమతారూపంతో జీవుడు కల్పించుకొన్నది సంసారం. జ్ఞానోదయం కావడంతో స్వయంగా నష్టమైపోతుంది. కాని జగత్తు, జీవేశ్వరులవలె నిత్యపదార్థం.

భగవానుని అనుగ్రహమే పుష్టి. భాగవతంలో "పోషణం తదనుగ్రహః" అని ఉంది. ప్రాణుల అనుసరణకోసం ఆచార్యులవారు మూడు మార్గాలు చూపించారు. 1) పుష్టిమార్గం 2) ప్రవాహమార్గం 3) మర్యాదా మార్గం. భక్తిమార్గమే సర్వోత్తమమైన పుష్టిమార్గం. కేవలం వేదప్రతిపాదితమైన కర్మజ్ఞానాల సంపాదన మర్యాదా మార్గం. సంసార ప్రవాహంలో పడి లౌకిక భోగాలకోసం ప్రయత్నిస్తూ కొట్టుకొని పోవడం ప్రవాహమార్గం. ఈ మార్గాన్ని ముక్తి కావాలనుకొనేవారు ఎలాగా త్యజించాలి. మర్యాదా మార్గం- వైదికం. అక్షరబ్రహ్మ వాణి నుండి ఉద్భవించింది. ఇంక, పుష్టిమార్గం—సాక్షాత్తు పురుషోత్తము తనూరూపం. మర్యాదా మార్గానుయాయి జ్ఞానం ద్వారా సాయుజ్యముక్తిని ధ్యేయంగా పెట్టుకొంటారు. అది పొందుతాడు. పుష్టిమార్గంలో పయనించేవాడు ఆత్మసమర్పణం చేసుకొని రసాత్మకమైన ప్రీతిని సాయం చేసుకొని ఆనంద ధాములైన భగవానుని అధరామృతాన్ని అపేక్షిస్తాడు. భగవానుని అనుగ్రహం లేకపోతే ఇది లభించదు. మనల్ని ఎన్నుకోవడం జరగదు. ఈ విషయాన్నే ముండకోపనిషత్తు ఇలా వ్యక్తంచేసింది;

"నాయమాత్మా ప్రవచనేనలభ్యో, న మేధయా న బహునా శ్రుతేన।
యమేవైష వృణుతే తేన లభ్యః, తస్యైష ఆత్మా వివృణుతే
తనూం స్వామ్॥

శ్రీవల్లభాచార్యులవారు ఈ కలికాలంలో పుష్టిమార్గమే ఉత్తమమార్గం అన్నారు. మిగిలిన కృష్ణభక్తి ప్రధానాలైన మార్గాలు లాగే ఈ సంప్రదాయంలోను శ్రీమద్భాగవతం పరమ ప్రామాణికమైనది. ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలు- ఎంత ప్రామాణికాలో ఇదికూడా అంత ప్రామాణికమని నమ్మి దీనిని కూడా వాటితో కలిపి మొత్తం "ప్రస్థాన (ప్రమాణ) చతుష్టయమ్" అని అన్నారు.

వారు వ్రాసిన సుబోధినీ వ్యాఖ్యలో అడుగడుగునా భాగవత ప్రాశస్త్య కథనం కన
బడుతూ ఉంటుంది. శుద్ధాద్వైత సిద్ధాంత గ్రంథమైన "శుద్ధాద్వైత మార్తండం"లో
క్రింది శ్లోకం ఉంది:

"వేదాః శ్రీకృష్ణవాక్యాని వ్యాస సూత్రాణి చైవ హి।
సమాధి భాషావ్యాసస్య ప్రమాణం తచ్చతుష్టయమ్॥"

శ్రీ వల్లభులు బాలకృష్ణోపాసకులు ఇందువల్ల వీరు ప్రథమంలో వాత్సల్య భక్తిని ప్రచారం చేశారు. ఆయన స్వయంగా స్థాపించిన గోవర్ధననాథ మందిరంలో పూజాదికాన్ని నియమబద్ధం చేశారు. ఈ సంప్రదాయానికి చెందిన మందిరాలలో బాలగోపాల మూర్తులుంటాయి. తరువాత, శ్రీ విఠ్ఠలనాథులు కిశోరకృష్ణుని ఉపాసనను, యుగళ స్వరూపార్చనను ప్రవేశపెట్టారు. శ్రీ చైతన్య సంప్రదాయ ప్రభావం దీనిమీదపడి ఉండవచ్చును. ఏది ఏమైనా మధురభక్తి పద్ధతిలో ఉపాసనను శ్రీ విఠ్ఠలనాథులు ప్రచారానికి తెచ్చి "శృంగారమండనం" అనే గ్రంథం కూడా వ్రాశారు. శ్రీరాధాదేవి ఉపాసనకూడా ఈ కాలంలోనే వచ్చింది. శ్రీవిఠ్ఠలనాథులు స్వయంగా "స్వామిన్యష్టకమ్", "స్వామినీ స్తోత్రమ్" వ్రాశారు. శ్రీవల్లభాచార్యులవారి గ్రంథాలలో శ్రీ రాధాదేవి స్మరణాదికం ఇంత స్పష్టంగా లేదు. బహుళ ప్రచారంలో ఉన్నవారి శ్రీమధురాష్టకంలో, "మధురాధిపతే రఖిలం మధురమ్" అని వర్ణించిన స్తోత్రంలో "గోపీమధురా" అని ఉందిగాని "రాధ" పేరు లేదు. గౌడీయవైష్ణవ సంప్రదాయంలో తరువాత తరువాత రాధను పరకీయగా చిత్రించడం కనబడుతుంది. ఈ సంప్రదాయంలో అది లేదు రాధ స్వీయ, సుబోధినీ వ్యాఖ్యలో శ్రీమద్భాగవతంలోని అనేక గూఢ విషయాలకు చక్కని వివరణ ఇచ్చి ఆచార్యులు కృష్ణభక్తిని ప్రచారం చేశారు.

నవవిధ భక్తులను వీరు అంగీకరించినా అవి మర్యాదామార్గ జీవులకు పనికి వచ్చే సాధనాలని వీరి నమ్మకం. పుష్టమార్గ జీవులు సమస్తాన్ని అర్పణచేసి భగవదనుగ్రహంవల్ల రాగానుగ భక్తిని పొంది ఆనందిస్తారు. భగవానునకు చేసే సేవల్ని 1) తనుజ, 2) విత్తజ, 3) మానసి - అని విభజించారు. శరీరంతో విత్తంతో మనస్సుతో శ్రీకృష్ణ సేవకర్తవ్యం. ఈ సేవలో మానసీసేవ ఉత్తమమైంది. ("కృష్ణసేవా సదా కార్యామానసీ సా పరామతా")తరువాత ప్రవృత్తి ముఖ్యమైనది. మర్యాదా మార్గీయప్రవృత్తి, పుష్టిమార్గీయ ప్రవృత్తి అని ప్రవృత్తిని విభజించి వీటిలో పుష్టిమార్గీయ ప్రవృత్తి ఉన్నతం అన్నారు.

సర్వాత్మనా సర్వథా సర్వదా సమర్పణ యే
పుష్టిమార్గీయ ప్రపత్తి.

ఈ సమర్పణ కృష్ణునకే.

ఈ సంప్రదాయంలో గురువునకు విశేష ప్రాముఖ్యం ఉంది. గురువు శిష్యునకు దీక్ష ఇచ్చే సంబంధాన్ని - భగవానునితో కలిగే సంబంధం ఇది - బ్రహ్మ సంబంధం అంటారు. ఈ అనుష్ఠాన విధానాన్ని స్వయంగా భగవానుడే శ్రీవల్లభాచార్యులకు ఉపదేశించినట్లు తెలుస్తోంది. గురువు శిష్యునకు "శరణమంత్రం" (శ్రీకృష్ణః శరణం మమ") ఉపదేశిస్తారు. దీనిని గురించి శ్రీవల్లభులే ఇలా వ్రాశారు:

"తస్మాత్ సర్వాత్మనా నిత్యం శ్రీకృష్ణః శరణం మమ।
వదద్భిరేవ సతతం స్థేయ మిత్యేవమే మతిః॥"

దీని తరువాత గురువు శిష్యుని భగవన్మూర్తి సన్నిధానానికి తీసుకొనిపోయి తులసి మాలనిచ్చి దీక్షామంత్రాన్ని చెప్పి చెప్పిస్తారు. ఇది గోపనీయం. ఈ మంత్రాన్ని "ఆత్మనివేదన మంత్రం" అంటారు భక్తుడు సమస్తాన్ని భగవంతునకు సమర్పిస్తాడు. ఆ సందర్భంలో- "సహస్ర పరివత్సర మితకాల జాతకృష్ణ వియోగజనిత తాపక్లేశానందతిరో భావోఽహం, భగవతే కృష్ణాయ దేహేంద్రియ ప్రాణాంతః కరణాని తద్ధర్మాంశ్చ దారాగార పుత్రాప్త విత్తేహాపరాణి ఆత్మనా సహ సమర్పయామి। దాసోఽహం కృష్ణతవాస్మి॥" అని గురువు శిష్యునిచేత చెప్పిస్తారు.

ఈ సంప్రదాయంలో భాగవతాది పురాణాలలో వచ్చే అన్ని అవతారాలకు ఆదరం ఉన్నా, శ్రీకృష్ణుడే సర్వం. పండిత లోకంలో, భక్త సమాజంలో ఈయన సిద్ధాంతానికి ఈయనకు, ఈయన 'సుబోధిని'కి ఉన్న గౌరవాదరాలు ఈ శ్లోకం తెలియజేస్తుంది:

"నాశ్రితో వల్లభాధీశో న చ దృష్టా సుబోధినీ।
నారాధి రాధికానాథో వృథా తజ్జన్మ భూతలే॥"

## శ్రీ నింబార్క-(సనకాది) సంప్రదాయం

వైష్ణవ సంప్రదాయాలలో ప్రముఖమైన ఇంకో సంప్రదాయం సనకాది

సంప్రదాయం. దీనికి హంస సంప్రదాయమనీ దేవర్షి సంప్రదాయమనీ కూడా పేర్లున్నాయి. ఈ సంప్రదాయ ప్రవర్తకులు విఖ్యాతులు శ్రీ నింబార్కాచార్యులు ఈయనకు నింబాదిత్యులని కూడా పేరుంది. శ్రీవల్లభాచార్య సంప్రదాయంకంటె వీరి సంప్రదాయం ప్రాచీనమని విజ్ఞుల భావం. వీరి తల్లిదండ్రులు కూడా తెలుగువారే అని సంప్రదాయజ్ఞుల కథనం. కాని, ఈ సంప్రదాయానికి కూడా తెలుగుదేశంలో - శ్రీవల్లభాచార్యుల పుష్టిమార్గంలాగే - ప్రచారం లేదు. ప్రచారమే కాదు. ఎవరికీ తెలియదన్నా అతిశయోక్తి అనడానికి వీలు లేదు. వీరి సంప్రదాయమూ కృష్ణభక్తి ప్రచారకమే. వీరికీ శ్రీమద్భాగవతం ప్రమాణ గ్రంథమే. వీరి మతానుయాయులూ వ్రజమండలంలో స్థావరం ఏర్పర్చుకొన్న వారే. వీరికి బృందావనం సంప్రదాయ కేంద్రం. గోవర్ధనానికి సమీపంగా "నింబ గ్రామం" నేటికీ ఉంది. శ్రీ నింబార్కులు గొప్ప తపస్వి, యోగి. భగవంతుని సుదర్శన చక్రంయొక్క అవతారం వీరని నమ్మకం. ఈయన కాలాన్ని గురించి చాలా అభిప్రాయభేదాలున్నా, 12వ శతాద్దికి గాని అంతకంటె పూర్వశతాబ్దులకు గాని ఈయన చెంది ఉండవచ్చునని నవీనులు నిర్ణయించారు.

నింబార్క సంప్రదాయం సిద్ధాంతరీత్యా ద్వైతాద్వైతాన్ని ఆదరిస్తుంది. బ్రహ్మసూత్రాలమీద వీరు వ్రాసిన భాష్యం "వేదాంత పారిజాత సౌరభం". ఇతర మతాల ఖండనం లేకపోవడం, సంక్షేపంగా ఉండడం మొదలైన వాటినిబట్టి ఇది చాలా ప్రాచీనమని విజ్ఞులు నిర్ణయించారు. "శ్రీకృష్ణస్తవ రాజం" అనే 25 శ్లోకాల స్తోత్ర రచనలో నింబార్కులు తమ ద్వైతాద్వైత సిద్ధాంతాల్ని ప్రపంచించారు. "మంత్రరహస్య షోడశి"లో 18 శ్లోకాలున్నాయి. వీటిలో మొదటి 16 శ్లోకాలలో - నింబార్క సంప్రదాయంలో పరమ పవిత్రమైన "గోపాల అష్టాదశాక్షర మంత్రం" ("క్లీం కృష్ణాయ గోవిందాయ గోపీజన వల్లభాయ స్వాహా") విస్తృతవ్యాఖ్య చేయ బడింది. "దశశ్లోకి" సిద్ధాంత ప్రతిపాదకమైన పది శ్లోకాల సంపుటి. "ప్రపన్న కల్పవల్లి" అనే గ్రంథంలో "ముకుంద శరణమంత్రం" యొక్క రహస్యం వ్యాఖ్యానం చేయబడింది. గోపాలమంత్రాన్ని, ముకుందశరణ మంత్రాన్ని నారద మహర్షులు స్వయంగా శ్రీనింబార్కులకు ఉపదేశం చేశారంటారు "గీతావాక్యార్థం", "ప్రపత్తిచింతామణి", "సదాచార ప్రకాశం" అనే గ్రంథాల్నికూడా వీరే వ్రాశారని అంటారు.

శ్రీ నింబార్కుల శిష్యులలో ప్రఖ్యాతులు - శ్రీనివాసాచార్యులు, శ్రీఔదుంబరా

చార్యులు, శ్రీగౌరముఖాచార్యులు, శ్రీలక్ష్మణ భట్టాచార్యులు అనేవారున్నారు. ప్రసిద్ధా చార్యులలో-శ్రీపురుషోత్తమాచార్యులు, శ్రీదేవాచార్యులు, శ్రీసుందర భట్టాచార్యులు, శ్రీకేశవకాశ్మీరి ఉన్నారు. వీరిలో శ్రీకేశవకాశ్మీరి మహావిద్వాంసులు. ఈయనను గురించి ప్రచారంలో ఉన్న ప్రసిద్ధ శ్లోకం ఇది:

"వాగీశా యస్య వదనే హృత్కంఠే హరిః స్వయమ్।
యస్యాదేశకరా దేవా మంత్ర రాజ ప్రసాదతః॥"

శ్రీ కేశవకాశ్మీరి శిష్యులలో ప్రఖ్యాతుడు, మధురభావోపాసకుడు శ్రీభట్ట పండితుడు. భగవానుని రాసలీలా సౌందర్యాన్ని అనుభవించినవాడు. నింబార్క సంప్రదాయంలోని ఆచార్యులలో వ్రజ భాషలో రచనలు చేసిన ప్రథమాచార్యుడు. ఈయన వ్రాసిన "జుగలసతక" (యుగళ శతక) ప్రసిద్ధం ("జుగల కిసోర హమారే ఠాకుర)ఈయన శిష్యుడు హరివ్యాసాచార్యులు. చాలా ప్రసిద్ధులు. ఈయన యుగళశతకం మీద "మహావాణీ" అనే పేరుతో గేయ పదరూపమైన విస్తృత వ్యాఖ్య వ్రాసిన భక్తశిరోమణి. ఈయన నింబార్క సంప్రదాయంలో "రసిక సంప్రదాయం"అనే పేరు వచ్చే లాటకు ప్రవర్తకులైన రసిక శిరోమణి. భగవాను డైన కృష్ణుని శృంగారరూపాన్ని ఉపాసన చేసిన ధన్యుడు. ఈయన సంప్ర దాయం కాలక్రమాన్ని "హరివ్యాసీ" సంప్రదాయంగా పేరుపొందింది మథురలో నారదటీలా అనేచోట వీరి సమాధి ఉంది. సంస్కృతంలో ఈయన "సిద్ధాంత రత్నాంజలి", "ప్రేమభక్తి వివర్ధిని" మొదలైన గ్రంథాలు వ్రాశారు. ఈయన వ్రాసిన "మహావాణి"లో - భగవంతుని విషయమైన - సేవా, ఉత్సవ, సురత, సహజ, సిద్ధాంత సుఖాల్ని వర్ణించారు శ్రీరాధాకృష్ణ యుగళమూర్తి పరంగా అన్నీ సమన్వయించారు. ఈయన సిద్ధాంత రీత్యా - అపారమాధుర్యమూర్తి, సౌందర్య రసామృత మూర్తి అయిన శ్రీకృష్ణ చంద్రుడే పరాత్పర తత్త్వం. నిరాకార,శుద్ధ చైతన్య, నిర్గుణ బ్రహ్మ ఈ నిత్యవిహారి అయిన శ్రీకృష్ణుని ఏక భాగమైన చిదంశ మాత్రమే! స్వయంగా శ్రీకృష్ణుని చేతనే ఆరాధింపబడేది గనుకనే ఆయన ఆహ్లా దినీ శక్తికి "రాధా" అనే పేరు వచ్చింది. శక్తికి శక్తిమంతునకు నిత్య సంబంధం వల్ల వీరిద్దరూ ఎప్పుడూ వియోగాన్ని పొందరు మధుర భావోపాసకులైన వీరు తమ కవితలలో "హరిప్రియా" నామాన్ని ముద్రగా చేసుకొన్నారు. వీరికి పండ్రెండుగురు ముఖ్య శిష్యులు. వారిలో ప్రఖ్యాతులు శ్రీపరశురామాచార్యులు. వీరు

ప్రజ భాషలో అనేక గ్రంథాలు, పదాలు వ్రాసి సంప్రదాయానికి గొప్ప ప్రచారం తెచ్చారు. కబీరులాగ హిందూ ముసల్మానులను సన్నిహితం చేసే రచనలు చాలా చేశారు. ఈయన రాజస్థాన్ నివాసి కావడంవల్ల భాషలో "రాజస్థానీ" పదాలుకూడా చాలా చేరిపోయాయి. హిందూ ముస్లిముల్ని గురించి వ్రాస్తూ ఒక పదంలో ఇలా అంటారు.

"భాఈ రే కా హిందూ కా ముసలమాన ।
జో రామ రహీమ న జాణారే ॥"

శ్రీ రాధాకృష్ణుల లలితలీలల్ని ఎంతో చక్కగా వర్ణించారు. ఇది గాక ఎందరో ఆటవికుల్ని కృష్ణభక్తుల్ని చేశారు. "నాభాదాసు" ఈ విషయాన్ని "భక్తమాల"లో ఈ విధంగా ఉల్లేఖించారు:

"జంగలీదేసకే లోగసబ శ్రీ పరసురామ కియేపారషద ॥"

మహావిద్వాంసులైన ఆచార్యులందరూ శ్రీకృష్ణభక్తులు. వారికి పరాత్పరుడు శ్రీకృష్ణుడు శ్రీమద్భాగవతం ప్రామాణిక గ్రంథం.

శ్రీ నింబార్క సంప్రదాయానికి చెందిన శ్రీహరిదాస స్వామి కాలక్రమాన మాధుర్యభావానికి అత్యంత ప్రాముఖ్యం ఇచ్చి గోపీభావం ద్వారా సాధనా మార్గాన్ని ఏర్పర్చి "సఖీ సంప్రదాయం" స్థాపించారు మహాభక్తులు. మహాగాయకులు అయినా శ్రీహరిదాసస్వామి శిష్యుడే తాన్‌సేన్. ఈ సంప్రదాయానికి చెందిన వైష్ణవులు ఏ వేదాంతమార్గాన్నీ ప్రచారం చెయ్యలేదు. అది వృధా అనీ కాలహరణమనీ వారి భావం.

శ్రీ నింబార్క సంప్రదాయం ప్రకారం సంసార దశలో నానాత్మకమైన జీవునకు ఏకాత్మకమైన బ్రహ్మకు భేదం. ముక్తదశలో చైతన్యాత్మకతవల్ల ఈ రెండింటికీ భేదం లేదు. బాదరాయణునకు పూర్వమే ఈ భేదాభేద సిద్ధాంతం ఔడులోమి, ఆశ్మరథ్య ఆచార్యులు ప్రవర్తింపజేశారని తెలుస్తోంది. ఆశ్మరథ్యాచార్యుల దృష్టిలో "కారణాత్మనా" జీవ బ్రహ్మలకు ఏకత్వమున్నదనీ "కార్యాత్మనా" రెండింటికీ అనేకత్వమున్నదనీ సిద్ధాంతం. దీనికి ఉదాహరణగా- కారణరూపంలో సువర్ణానికి ఆభరణాలకు ఏకత్వము కార్యరూపంలో అనేకత్వము

శిష్యులైన శ్రీనివాసాచార్యుల "వేదాంతకౌస్తుభం" గ్రంథాన్నిబట్టి "కాశకృత్స్నులు" కూడా భేదాభేదవాదులు. శ్రీశంకర భగవత్పాదులుమాత్రం వారు అద్వైతవాదు లన్నారు.

("తత్రకాశకృత్స్నీయం మతం శ్రుత్యను సారీతిగమ్యతే.")

భేదాభేదవాదులైన శ్రీ భాస్కరులు తమభాష్యంలో క్రింది విధంగా. సువర్ణాన్ని ఆభరణాదుల్ని ఉదాహరించి- వ్రాశారు

"కార్యరూపేణ నానాత్వం, అభేదః కారణాత్మనా।
హేమాత్మనాయథాఽభేదః, కుండలాద్యాత్మనాభిదా ॥"

శ్రీ నింబార్కాచార్యులవారు తమ "దశశ్లోకి"లో సిద్ధాంతాల్ని చక్కగా క్రోడీకరించి వ్రాశారు. చిత్, అచిత్, ఈశ్వర స్వరూపాలవిషయంలో వీరి సిద్ధాంతం భగవద్రామానుజుల సిద్ధాంతానికి అనురూపంగా ఉంటుంది. ద్వైతాద్వైత వివేకానికి శ్రీమదాచార్య శ్రీభగవన్నింబార్క మహామునులు వ్రాసిన "వేదాంత కామధేనుర్దశశ్లోకి" మూలసూత్రాల ("ద్వైతాద్వైత వివేకస్య మూలసూత్రాణి శ్రీ వేదాంత కామధేనుః- శ్రీమదాచార్య శ్రీభగవాన్నింబార్క మహాముని కృత వేదాంత కామధేనుర్దశ శ్లోకీ") మొదటి రెండు శ్లోకాలలో "చిత్"ను గురించి ఇలా వ్రాశారు:

జ్ఞానస్వరూపంచ హరేరధీనం శరీర సంయోగ వియోగయోగ్యమ్।
అణుం హి జీవం ప్రతిదేహభిన్నం, జ్ఞాతృత్వవంతం యదనంత మాహుః ॥

అనాదిమాయాపరియుక్తరూపం త్వేనం విదుర్వైభగవత్ప్రసాదాత్।
ముక్తంచ బద్ధంకిల బద్ధముక్తం ప్రభేదబాహుల్య మథాపిబోధ్యమ్॥

మూడో శ్లోకంలో "అచిత్"ను ఇలా వర్ణించారు:

అప్రాకృతంప్రాకృతరూపకంచ కాలస్వరూపం తదచేతనంమతమ్।
మాయా ప్రధానాదిపదప్రవాచ్యం శుక్లాదిభేదాశ్చసమేఽపితత్ర ॥

దీని తరువాత రెండు శ్లోకాలలో బ్రహ్మస్వరూపం చెప్పారు:

స్వభావతోఽపాస్తసమస్త దోషమశేష కల్యాణగుణైకరాశిమ్ ।
వ్యూహాంగినం బ్రహ్మపరంవరేణ్యం ధ్యాయేమకృష్ణం కమలేక్షణం
హరిమ్ ॥
అంగేతువామే వృషభానుజాం ముదావిరాజమానామనురూప సౌభ
గామ్ ।
సఖీసహస్రైః పరి సేవితాం సదా స్మరేమ దేవీంసకలేష్టకామదామ్ ॥

నింబార్క సంప్రదాయంలో బ్రహ్మసగుణరూపుడు. ప్రాకృతదోషరహితుడు, సమస్త కల్యాణ గుణసంపన్నుడు. ఆయనయే కమలేక్షణుడు, కృష్ణుడు, హరి, ఇక్కడ కూడా యుగళమూర్త్యుపాసనకు విశిష్ట స్థానం ఉంది కనుక "రాధారాణి" సర్వేశ్వరుడైన శ్రీకృష్ణుని "ఆహ్లాదినీశక్తి". పరకీయకాదు. ఆమె "అనురూప సుభగ."

ఆరో శ్లోకంలో "ఉపాసన"ను గూర్చి ఇలా అన్నారు:

ఉపాసనీయం నితరాంజనైః సదా ప్రహాణయేఽజ్ఞానతమోఽను
వృత్తే ।
సనందనాద్యైర్మునిభిస్తథోక్తం శ్రీనారదాయాఽఖిల తత్త్వసాక్షిణే॥

ఏడో శ్లోకంలో "బ్రహ్మాత్మకత"ను గూర్చి ఇలా వ్రాశారు :

సర్వం హి విజ్ఞాన మతో యథార్థకం శ్రుతిస్మృతిభ్యోనిఖిలస్య
వస్తునః ।
బ్రహ్మాత్మకత్వాదితి వేదవిన్మతం త్రిరూపతాపి శ్రుతిసూత్ర సాధితా॥

శ్రీ సంప్రదాయంలో లాగే దీనిలో కూడా "శరణాగతి" తత్త్వానికి విశేష ప్రాముఖ్యం ఉంది. నిజానికి, అన్ని వైష్ణవ సంప్రదాయాలలోను "శరణాగతి"కి -వైష్ణవ సంప్రదాయాలే ఎందుకు-వేదాలనుండి కూడా ఆత్మార్పణభావం ప్రచలితమై ఉందని (ఈ గ్రంథంలో భక్తిప్రపత్తులు: శరణాగతి అనే అధ్యాయంలో) తెలుసుకొనే ఉన్నాము దీని విశిష్టస్థానం అందరు అంగీకరించారు. పరబ్రహ్మ అయిన శ్రీకృష్ణుడే ఉపాస్యదేవత. వేరే గతిలేదని ఎనిమిదో శ్లోకం:

నాన్యాగతిః కృష్ణపదారవిందాత్సం దృశ్యతే బ్రహ్మశివాదివందితాత్।
భక్తేచ్ఛయోపాత్త సుచింత్య విగ్రహాదచింత్య శక్తేరవిచింత్యసాశ
యాత్॥

దశశ్లోకికి ప్రసిద్ధమైన టీక వ్రాసిన శ్రీహరివ్యాసాచార్యులు ఇంకా స్పష్టంగా కృష్ణభక్తినిగూర్చి ఇలా వ్రాశారు: "తస్మాత్ కృష్ణ ఏవపరో దేవః, తం ధ్యాయేత్, తం రసేత్, తంభజేత్, తంయజేత్, ఓం తత్స దితి"-

తొమ్మిదో శ్లోకం "భక్తిని గురించి వ్రాసినది:

కృపాఽస్య దైన్యాదియుజి ప్రజాయతే తదాభవేత్ప్రేమ విశేషలక్షణా।
భక్తిహ్యనన్యాధిప తేర్మహాత్మనః సాచేతసా సాధనరూపికాఽవరా॥

కృష్ణప్రాప్తికి భక్తియే అత్యుత్తమ సాధన. మానవులలో పంచభావాలుగా భక్తి స్ఫూర్తి కలుగుతుంది. అవి-శాంత, దాస్య, సఖ్య, వాత్సల్య, ఉజ్జ్వలభావాలు వల్లభ, చైతన్య సంప్రదాయాలలో లాగే ఇక్కడకూడా ఉజ్జ్వల-అంటే మధుర భావానికే విశేషాదరణ లభించింది. శ్రీమద్భాగవతంలోని "అనపాయినీ భగవతః శ్రీః సాక్షాదాత్మనో హరేః" అనే వచనం వీరికి పరమ ప్రమాణం.

పదో శ్లోకం "ముగింపు" శ్లోకం లాంటిది:

ఉపాస్య రూపంతదుపాసకస్యచ కృపాఫలం భక్తిరసన్తః పరం।
విరోధినోరూప మథైతదాప్తేర్జ్ఞేయా ఇమేఽర్థా అపిపంచసాధుభిః॥

ఈ "దశశ్లోకి"కి బృహద్వ్యాఖ్య వ్రాసిన శ్రీహరివ్యాసాచార్యులుతమ"సిద్ధాంత రత్నాంజలి"లో భక్తియొక్క నానా ప్రభేదాలను పేర్కొన్నారు. ఇవి యాగభాగా లుగా చెప్పారు శ్రీవైష్ణవుల పంచ సంస్కారాలలో యాగం ఒకటి:

"తాపః పుండ్రస్తథా నామమంత్రోయాగశ్చ పంచమః।
అమీ తే పంచసంస్కారాః పరమైకాంతి హేతవః॥"

హరివ్యాసాచార్యులు యాగాన్ని రతి, భక్తి అని విభజించారు. 'భక్తి' తిరిగి 'విహిత', 'అవిహిత' అని రెండు భేదాలు. "విహిత" భక్తి విస్తృతంగా వివరణ పొందింది. మొదట- 'సాధనరూప'అని 'ఫలరూప' అని విభజన. వీటిలో 'సాధన

రూప' తిరిగి 'జ్ఞానాంగరూప' అని 'స్వతంత్రము క్తిదాయిని' అని విభజన. 'జ్ఞానాంగరూప' నుండి 'సగుణ', 'నిర్గుణ' భేదాలు. ఈ 'సగుణభక్తి' తిరిగి 'జ్ఞానమిశ్ర', 'వైరాగ్యమిశ్ర', 'కర్మమిశ్ర' అని విభజన. ఈ మూడు విభజనలలోను ప్రతిఒక్కటి- ఉత్తమ, మధ్యమ, కనిష్ఠ అని భేదాలను పొందింది. 'భక్తి'లోని ప్రప్రథమ విభాగాలలో రెండవదైన 'అవిహిత' తిరిగి. కామజ, ద్వేషజ, భయజ, సహజ అనే విభజనను పొందింది ఈ విధంగా- పంచసంస్కారాలలోని యాగాంగంగా చూపబడిన భక్తి వివిధ ప్రభేదాలను పొంది సర్వత్ర వ్యాపించి ఉంది. వీరి దృష్టిలో సాధనా మార్గాలలో సర్వశ్రేష్ఠమైనది 'పరాభక్తి' దీని లక్షణంగా- "రూపాది విషయక- ఇంద్రియ-వృత్తి పదనవచ్ఛిన్న స్వాభావిక-భగవత్స్వరూప గుణాదివిషయక. యావదాత్మవృత్తి ర్మనోవృత్తిః".

నింబార్కమతానుయాయులైన విద్వాంసుల దృష్టిలో గౌడీయ వైష్ణవ సంప్రదాయానికి నింబార్క సంప్రదాయానికి చాలా పోలికలున్నాయి. మౌలికమైన శాస్త్రదృష్టితో చూచినప్పుడు శ్రీ నింబార్కుని ద్వైతాద్వైతానికి శ్రీ చైతన్యుని అచింత్య భేదాభేదానికి అనేక స్థలాలలో సన్నిహితత్వం కనబడుతుంది. సాధనా ప్రణాళిలో ఇంచుమించుగా భిన్నత్వమే కనబడదు. బ్రహ్మజీవులమధ్య సంబంధం భేదాభేద సంబంధం అనే భావన చాలా ప్రాచీనమైనదే! సంసారదశలో నానాత్మక జీవులకు ఏకాత్మక బ్రహ్మకు భేదం ఉంది. ముక్తిదశలో చైతన్యాత్మక జీవికి బ్రహ్మకు భేదం లేదు. చాలా ప్రాచీన కాలంలోని ఆచార్యులైన ఔడులోమి, అశ్మరథ్యులు భేదాభేదవాదులు అని ముందే తెలుసుకొన్నాము గదా! శాస్త్రీయమైన వైష్ణవ సంప్రదాయాలలో ఇది ప్రాచీనతమమని కొందరి మతం. శ్రీశంకరాచార్యులకంటె పూర్వులైన శ్రీభర్తృప్రపంచాచార్యుల దృష్టిలో పరమార్థం ఏకమూ, అనేకమూ కూడా! బ్రహ్మరూపంలో ఏకం జగద్రూపంలో అనేకం! భేదాభేద సిద్ధాంతాన్ని ప్రాచీనకాలంలో ప్రపచించిన వారిలో శ్రీభాస్కరాచార్యులు ఒకరు, ఈ విధంగా సిద్ధాంతానికి ప్రాచీనత ఉంది.

నింబార్క సంప్రదాయ ప్రభావం వల్ల హిందీ సాహిత్యాభివృద్ధి చాలా జరిగింది. (ఇక్కడ హిందీ శబ్దం అనేక మాండలికాలకు సమాహారశబ్దంగా ప్రయుక్తం) ఇక్కడ మనం శ్రీ నింబార్క, శ్రీ వల్లభాచార్య సంప్రదాయాలను పోల్చిచూస్తే విశేష విషయాలు తెలుస్తాయి. వల్లభాచార్య సంప్రదాయంలో అష్టఛాప్ కవులు ప్రసిద్ధులు. వారిలో సూరదాస్ ప్రభృతులున్నారు. దురదృష్టంవల్ల

నింబార్క సంప్రదాయానికి చెందిన కవుల రచనలు తెలుగులోనికి దాగారాక ప్రచారంలోకి రాలేదు. కాని, ఈ సంప్రదాయానికి చెందిన కవుల రచనలు- మాధుర్యంలోను, సరసతలోను ఇతర సంప్రదాయాలలోని వాటికి తీసిపోవు. రాధాకృష్ణుల లలిత లీలల వర్ణనలో అవిసాటిలేనివి వల్లభాచార్య సంప్రదాయం లోని కవులు శ్రీకృష్ణుని బాలలీలను విశేషంగా వర్ణించారు. శ్రీవల్లభాచార్యులు బాలకృష్ణోపాసకులు. వాత్సల్య భక్తికి విశేష ప్రాధాన్యం ఇచ్చారు. ఈ సంప్రదా యంలోని మందిరాలలో బాలగోపాల పూజనేటికీ జరుగుతూనే ఉంది, ఈయన పుత్రులైన గోస్వామి విఠలనాథులు కిశోరకృష్ణుని పూజా వ్యవస్థనుకూడా నెల కొల్పారు. యుగళమూర్తి పూజనుకూడా ప్రోత్సహించారు.

వేదంలో (పురుషసూక్తంలో) "శ్రీశ్చతే లక్ష్మీశ్చపత్న్యౌ" అని ఉంది గదా! ఇందులోని "శ్రీ" వృషభానుతనయ రాధగా అవతరించింది. లక్ష్మీదేవి "రుక్మిణి"గా అవతరించిందని వీరి విశ్వాసం. భగవానుని రూపానుసారం "శ్రీ" కూడా వివిధ రూపాలతో అవతరిస్తుందని వీరు భావిస్తారు:

"దేవత్వే దేవ దేహేయం మానుషత్వేతు మానుషీ।
విష్ణోర్దేహానురూపాంచ కరోత్యేవాత్మ సన్తనుమ్॥"

విష్ణుపురాణంలో ఉన్న "రాఘవత్వేఽభవేత్ సీతా, రుక్మిణీ కృష్ణజన్మని అన్యేషు చావతారేషు విష్ణోరేషా సహాయినీ॥" అనే శ్లోకాన్ని పోలిఉన్నదే ఇది. "ఋక్ పరిశిష్టమ్" రాధాకృష్ణులకు అభేదం చెప్పి, భేదత్వాన్ని చెప్పేవారికి ముక్తి లేదంటుంది:

"రాధయా సహితో దేవో మాధవేన చ రాధికా।
యోఽనయోర్భేదం పశ్యతి స సంసృతేర్ముక్తో న భవతి॥"

బ్రహ్మవైవర్త, బృహద్ గౌతమీయతంత్ర, బ్రహ్మసంహితా సంమోహనతంత్రాది బహుగ్రంథాలలో ఇదే నిర్ణయం కనబడుతుంది. రాధ శ్రీకృష్ణుని స్వీయ. ఆయ నతో అవతరించే "శ్రీ".

ఈ విధంగా నింబార్క సంప్రదాయంలోను శ్రీకృష్ణుడే పరాత్పరుడు. ఏడనెర సంప్రదాయ విద్వాంసుల రచనలలో మిగిలిన అవతారాల ప్రసక్తి, వర్ణ నలు- ప్రసంగవశాత్-వచ్చినా అవన్నీ శ్రీకృష్ణుని లీలా వినోదాలే అని

శ్రీకృష్ణుడే పరమపురుషుడని విశ్వసించే మిగిలిన ఔత్తరాహ వైష్ణవ సంప్రదాయా లలోలాగే- శ్రీనింబార్కుని "సనకాది సంప్రదాయం"లోను పరమవిశ్వాసం. అవతార ప్రయోజనాల విషయంలోను ఏమీ గుర్తింపదగినంత భేదం లేదు. భగవంతుని విభూతులన్నీ అవతారతుల్యాలే అని గ్రహింపు.

## శ్రీరాధా వల్లభీయ సంప్రదాయం

ప్రసిద్ధాలయిన, పద్మపురాణోక్త వైష్ణవ సంప్రదాయాల్నీ వాటి అవతార సిద్ధాంతాల్నీ కొంత పరిశీలించాము. అవిగాక ఇంకాకొన్ని వైష్ణవసంప్రదాయాలు, కృష్ణభక్తి పూరితాలు ఉన్నాయి. వాటిలో కొన్నింటినైనా ఈ సందర్భంలో ఒకసారి స్మరించడం సమంజసం. ఇలాంటి వాటిలో "రాధావల్లభీయ" సంప్రదాయం ఒకటి. ఈ సంప్రదాయానికి మూలపురుషులు శ్రీ హితహరివంశ గోస్వామి. ఈయన వ్రజమండలంలోని మథురకు సమీపంలో ఉన్న 'బాద్'అనే గ్రామంలో జన్మించారు. ఈయన అనన్య శిష్యులయిన శ్రీ సేవక్ జీ ఇలా వ్రాశారు:

> ధర్మరహిత్ జానీ సబ్ దునీ
> జహాఁ 'బాద్' ప్రగటే జగ్ ధనీ'

ఈ గోస్వామి గౌడబ్రాహ్మణులు. ఈ వంశజులు ఇప్పటికీ ఆ ప్రాంతాలలో ఉన్నారు. ఈయన తల్లిదండ్రులు—తారావతీ కేశవదాస్ మిశ్రలు. శ్రీ హితహరివంశ గోస్వాములు శ్రీకృష్ణుని మురళి అవతారం అని భక్తుల విశ్వాసం. శ్రీ రాధాదేవి ఈయనకు స్వప్నంలో సాక్షాత్కరించి గురు మంత్రదీక్ష ఇచ్చారు. ఈయన మొట్టమొదట దేవ బందులో నివసిస్తూ ఉండేవారు. ఇంటికి సమీపంలో ఉన్న నూతిలోనుండి 'శ్రీరంగ్‌లాల్ జీ' మూర్తిని పైకితీసి, ఆ విగ్రహాన్ని మందిరంలో స్థాపించి అర్చిస్తూ ఉండేవారు. భగవత్ ముదిత్ అనే పేరున్న భక్తుడు వ్రాసిన 'హితహరివంశ చరిత్ర' అను సారం ఈయన క్రీ॥ శ॥ 1503లో జన్మించి, 1553లో అంతరంగ లీలలో ప్రవేశించారు. గృహస్థాశ్రమాన్ని స్వీకరించి దేవ బంద్ గ్రామంలోనే నివసిస్తూ వచ్చారు. కొంతకాలం పోయినతరువాత, శ్రీరాధాదేవి ఆజ్ఞానుసారం ఇల్లు విడిచి బృందావనానికి బయలుదేరారు.

మార్గమధ్యంలో చిడ్‌థావల్ గ్రామవాసి ఆత్మదేవుడు అనే బ్రాహ్మణుడు, తన ఇద్దరు కన్యకలను, శ్రీ రాధావల్లభదేవుని సుందరమూర్తిని ఈయనకు అర్పిం

దారు. బృందావనం వచ్చి ఆ మూర్తిని ఒక సుందరమందిరంలో స్థాపించి అర్చ నాదికంచేస్తూ అక్కడ స్థిరపడ్డారు. అక్కడే మొదటి 'పటమహోత్సవం' (క్రీ॥శ॥ 1585) జరిపారు. శ్రీరాధాకృష్ణుల యుగళమూర్తి అర్చన వీరి సంప్రదాయంలో ప్రధానం, కాని, ఈ యుగళమూర్తులలో శ్రీరాధారాణికి ఆత్మార్పణం చేసుకొంటే అది శ్రేయప్రదమవుతుందని, మహత్వాలిని అవుతుందని ఆయన పరమవిశ్వాసం.

గృహస్థాశ్రమంలో ఉంటూనే పూజాదికం నిర్వర్తించుకొంటూ వచ్చారు. ఒక విధంగా చూస్తే, శ్రీ వైష్ణవాచార్యుల ప్రత్యేకత వారు గృహస్థాశ్రమంలో ఉండడం. శ్రీ చైతన్య మహాప్రభువు వివాహితులై (మొదటి భార్య చనిపోయిన తరువాత తిరిగి వివాహం చేసుకొన్నారు) సన్యసించారు. అంతకి పూర్వం భగవ ద్రామానుజులు కూడా వివాహితులై సన్యసించారు. శ్రీవల్లభులు వివాహితులు, సంతాన వంతులు. వీరిలో ఎవరికీ గృహస్థాశ్రమ స్వీకారంవల్ల మాన్యత సమా జంలో తగ్గలేదు. వారి ఘనతకది ప్రతిబంధకం కాలేదు. శ్రీహితహరి వంశులకు-నలుగురు పుత్రులు, ఒక పుత్రిక-కలిగారు. ఈ సంప్రదాయంలో బ్రహ్మచారులైన ఆచార్య పురుషులు లేరని కాదు. గృహస్థాశ్రమ స్వీకారం వీరి ఆచార్యత్వానికి ప్రతిబంధకం కాలేదని చెప్పడమే ఇక్కడ ముఖ్యతాత్పర్యం.

కొందరు రాధావల్లభీయ సంప్రదాయం నింబార్క సంప్రదాయానికి చెందిన ఒక శాఖగా పరిగణించగా, మరికొందరు దానిని శ్రీచైతన్య సంప్రదాయా నికి శాఖగా పరిగణించడం ఉంది. ఈ రెండభిప్రాయాలు తప్పనీ - ఇది ఒక విశిష్టమైన ప్రత్యేక వైష్ణవసంప్రదాయమని విజ్ఞుల భావం.

ఈయన తమ యాభయ్యో ఏట, ఒక శరత్పూర్ణిమ దినాన అంతరంగ లీలలో ప్రవేశం చేశారు. మహాభక్తులైన శ్రీనాభాదాస్ తమ 'భక్తమాల'లో ఇలా వ్రాశారు :

> శ్రీ హరివంశ్ గుసాఈ భజన్ కీ రీతి సుకృత్ కోఉ జానిహై।
> శ్రీరాధాచరణ్ ప్రధాన్ హృదై అతి సుదృఢ్ ఉపాసీ।
> కుంజకేలీ దంపతి తహాఁ కీ కరత ఖవాసీ॥
> సర్వసుమహాప్రసాద్ ప్రసిద్ధతా కే అధికారీ।
> విధి నిషేధ్ నహిం, దాస్ అనన్య ఉత్కట్ వ్రతధారీ।

శ్రీవ్యాస్ సువన్ పథ అనుసరై సోఈభలై పహిచానిహై।
శ్రీహరివంశ్ గుసాఈ భజన్ కీ రీతి సుకృత్ కోఉ జానిహై॥

శ్రీ హిత హరి వంశులదృష్టిలో శ్రీ రాధాకృష్ణుల కేళీ నికుంజంలో "దాకరీ కర్నా హీ భక్తకా ప్రధాన్ కార్యహై," ఆ సేవా మాధుర్యాన్ని అనుభవించడం దాస భక్తుల ముఖ్య కర్తవ్యం. కాని ఈ అనుభవం అంతా అలౌకికం. లౌకిక వాసన ఉన్న పురుషుడు.(భక్తుడు) దీనికి అనర్హుడు. సామాన్యులకు ఈ 'పరమరస మాధురి'ని అనుభవించడం అసంభవం. ఈ సంప్రదాయంలో వియోగ విరహాలకు తావులేదు. రాధావల్లభీయ సంప్రదాయంలో శ్రీ రాధాకృష్ణుల శృంగారంలో సంయోగ శృంగారానికి ఉన్న స్థానం వియోగ విరహాలకు లేదు. శ్రీరాధాకృష్ణుల నిత్య లీలా నికుంజంలో ఈ రెండింటికి తావులేదు.

శ్రీ హితహరి వంశ గోస్వాములు సంస్కృతంలో 'రాధాసుధానిధి' అనే ప్రశస్త ప్రశస్తి వ్రాశారు. దీనిలో శ్రీరాధారాణి సౌందర్య వర్ణనతో బాటు ఆయన తన సేవాభావాన్ని కూడా వివరించుకొన్నారు. ఇది గాక 'హిత చౌరాసీ" అనే దాన్ని వ్రజభాషలో వ్రాసి తమ మధురభక్తిని ప్రకటించారు. దీనిమీద అనేక ప్రాచీన టీకలున్నాయి. 16వ శతాబ్దిలో హిత ధరణీ ధర్ టీక; గోస్వామి సుఖ్ లాల్ జీ 17వ శతాబ్దిలో వ్రాసిన టీక: శ్రీ లోక్ నాథ్ జీ, శ్రీ జుగళదాస్ జీ, శ్రీ ప్రేమ్ దాస్ జీ, శ్రీ కేలిదాస్ జీ, శ్రీ రతన్ దాస్ జీ ప్రభృతులు వ్రాసిన టీకలు ఉన్నాయి. మిగిలిన ఆచార్యులలో వ్యాస్ జీ, ధ్రువదాస్ జీ మొదలైనవారు ముఖ్యులు. ఈ సంప్రదాయం నాటినుండి గురుశిష్య పరంపరగా అవిచ్ఛిన్నంగా వస్తూనే ఉంది. శ్రీనిత్య విహారి (రాధావల్లభయుగళం) తో ప్రారంభం అయి గోస్వామి రసికాచార్య శ్రీ హితహరి వంశ చంద్రుల తరువాత గోస్వామి శ్రీ వనమాలిదాస్ జీ, గోస్వామి శ్రీ సుందర వరజీ, గోస్వామి శ్రీ దామోదర్ వర్ జీ ప్రభృతులు వచ్చారు. ఈ శతాబ్దిలో శ్రీ సుకుమారీలాల్ జీ ఆచార్య పీఠాన్ని అలంకరించారు.

గోస్వామి హితహరివంశ చంద్రులు- స్వకీయ- పరకీయ; విరహసంయోగాలు ఏవీ లేని, స్వపరభేదం లేని నిత్య విహార రసస్వరూపాన్ని తమ ఇష్ట తత్త్వంగా ప్రకటించారు. నిత్యవిహారిణి అయిన శ్రీరాధారాణి ఆయన ఇష్టదేవత. శ్రీరాధ స్వతంత్రంగా పరాశక్తిరూపమని ఆయన విశ్వాసం. ఈ విషయాన్ని ఆయన ఇలా వివరించారు:

"ఈశానీ చ శచీమహా సుఖతనుః శక్తిః స్వతంత్రాపరా।
శ్రీవృందావననాథ పట్టమహిషీ రాధైవ సేవ్యామమ॥
రాధాసుధానిధి (శ్లో–78)

ఇంక ఈ మహారసిక భక్తుని కోరిక, శ్రీరాధాకృష్ణులు నికుంజంలో శయనించి ఉన్నప్పుడు వారి పాదసంవాహనం-

"సాంద్రానందోన్మద రసమస ప్రేమపీయుషమూర్తేః
శ్రీరాధాయా అథమధుపతేః సుప్తయోః కుంజతల్పే।
కుర్వాణాహం మృదుమృదుపదాంభోజ సంవాహనాని
శయ్యాంతే కిం కిమపి పతితా ప్రాప్తతంద్రా భవేయమ్॥"
-రాధాసుధానిధి (శ్లో-212)

ఈయన తన సిద్ధాంతంలో ప్రకృతి పురుషుల లీలా (శ్రీ రాధాకృష్ణుల) విలాసమే అత్యంతోజ్జ్వలమైనదిగా భావించారు. ఈ ప్రపంచాన్ని అంతటిని నడుపుతున్నది "ప్రేమ" (హితం)అని ఆయన భావించారు. ఆయన రససిద్ధాంత దృష్టితో భావించి ఇలా అన్నారు:

"యత్కించిత్ దృశ్యతే సృష్టౌ సర్వం హితమయం విదుః"

వారి దృష్టిలో హితమంటే ప్రేమయే! ఆయనకు సర్వేసర్వత్ర ఆయన ఆరాధనా మూర్తి దర్శనమే!

"సర్వాన్ వస్తుతయా నిరీక్ష్య పరమస్వారాధ్యబుద్ధిర్మమ॥"
(శ్రీరాధాసుధానిధి)

ఈయన దృష్టిలో- భగవాన్ శ్రీకృష్ణుడే- ఆదిపురుషునకు, నారాయణునకు కారణం, మిగిలిన కృష్ణభక్తులైన సంప్రదాయజ్ఞులవలెనే ఈయనకూడా - "ఏతే చాంశకలాః పుంసః కృష్ణస్తు భగవాన్ స్వయమ్"అని విశ్వసించినవారే! సౌందర్య మాధుర్య చరమ సీమ-యుగళ కిశోరుడని తాత్పర్యం. శ్రీకృష్ణుని భగవత్తత్వం ఒకటి అయినా-లీలా విలాసం కోసం అది మూడుభాగాలుగా విభక్తమయింది: ఒకటి- బృందావన విహారి శ్రీకృష్ణరూపం. రెండు- మధురవాసి శ్రీకృష్ణ రూపం; మూడు ద్వారకా వాసి శ్రీకృష్ణరూపం. అయినా- శ్రీ హితహరివంశ చంద్రులను ఆకర్షించినది, ఆయన హృదయంలో ఎప్పుడూ స్ఫురిస్తూ ఉండేది శ్రీ రాధ!

వైదగ్ధ్య-సింధురనురాగ రసైక సింధుః
వాత్సల్యసింధురతి సాంద్రకృపైక సింధుః ।
లావణ్య సింధురమృతచ్ఛవిరూప సింధుః
శ్రీరాధికా స్ఫురతు మేహృదికేలి సింధుః ॥

-శ్రీరాధాసుధానిధి (శ్లో-17)

చివరికి ఈయన బృందావన వేతస నికుంజంలో ఒక రహస్యం ఉంది. అది-బ్రహ్మ నారద, శంకర, శుకాదులకుకూడా అగమ్యమయినది- అంటూ ఇలా వ్రాశారు:

యన్నారదాజేశ శుకైరగమ్యం
బృందావనే వంజుల మంజుకుంజే ।
తత్కృష్ణచేతో హరణైక విజ్ఞ
మత్రాస్తి కించిత్ పరమం రహస్యమ్ ॥

ఈవిధంగా ఆ పరమరహస్యాన్ని గ్రహించి దాని మాధుర్యాన్ని ఆస్వాదించిన రసిక హృదయులు మూలపురుషులైన సంప్రదాయం - శ్రీరాధావల్లభీయ సంప్రదాయం.

ఈ సంప్రదాయానుసారం "ఆరాధనాశైలి" గోపీ (రాధా) భావనత్వం. ఇందువల్లనే ఈ తత్త్వాన్ని అర్థం చేసుకొన్న విద్వాంసులు-పరకీయాత్వం, ఔపపత్యం అనేవి -లౌకికార్థంలో కానేకాదు- వ్రజభూమిలో రాసేశ్వరుని (రాసేశ్వరి) "సొత్తు" అన్నారు ఈ రసానందం నిత్యం, అఖండం. ఇక్కడ అంతా "స్వ" గాని "పర" లేదు లౌకిక చక్షువులకు "పర"గా కనబడుతుంది. అంతే! ఇది మనకు జ్ఞాపకం రావడానికే ఈ సందర్భంలో శ్రీమద్భాగవతంలో పరీక్షిన్మహారాజు అడిగిన ప్రశ్నలు, శ్రీ శుకుని సమాధానాలు ఇస్తున్నాను.

సంస్థాపనాయ ధర్మస్య ప్రశమాయేతరస్య చ ।
అవ తీర్ణోహి భగవానంశేన జగదీశ్వరః ॥

నకథం ధర్మసేతూనాం వక్తాకర్తాభిరక్షితా ।
ప్రతీపమాచరద్బ్రహ్మన్ పరదారాభిమర్శనమ్ ॥

ఆప్తకామో యదుపతిః కృతవాన్ వై జుగుప్సితమ్ ।
కిమభిప్రాయఏతన్నః సంశయంఛింది సువ్రత ॥
(శ్రీమద్భాగవతమ్-X-33-శ్లోకాలు-28,29,30)

దీన్ని తెలుగులో పోతన్నగారు మధురంగా 'మత్తకోకిల'లో అనువదించారు.

ధర్మకర్తయు ధర్మభర్తయు ధర్మమూర్తియునైన స
త్కర్ముఁడీశుఁడు ధర్మశిక్షయు ధర్మరక్షయుఁజేయఁగా
నర్మిలిన్ ధరమీఁదఁ బుట్టి పరాంగనాజన సంగమే
ధర్మమంచుఁ దలంచిచేసె నుదాత్తమానస చెప్పుమా ।
(X-33-పద్యం-1102)

ఈ ప్రశ్నకు సమాధానంగా వ్యాసమహర్షి శ్రీశుకునిచే ఇలా చెప్పించారు:

యత్పాదపంకజ పరాగ నిషేవతృప్తా
యోగప్రభావ విధుతాఖిల కర్మబంధాః ।
స్వైరం చరంతి మునయోఽపి ననహ్యమానా
స్తస్యేచ్ఛయాత్తవపుషః కుత ఏవ బంధః ॥ (X-33; శ్లో-35)

దీనికి పోతన్నగారి చక్కని తెలుగుపద్యం:

ఘనులై యెవ్వని పాదపంకజపరాగ ధ్యాన సంప్రాప్తయో
గ నిగూఢత్వముచే మునీంద్రులు మహాకర్మంబులంటాని బం
ధ నిరోధంబులు లేక విచ్చలవిడిన్ దర్పింతురా దివ్యలో
తనుఁడెట్లుండిన నుండెఁగాక కలవే బంధంబులుర్వీశ్వరా!
(X-33-1106)

ఇంకా ఈ విషయాన్నే కొనసాగిస్తూ శ్రీ శుకుని సమాధానం ఇది:

గోపీనాంతత్పతీనాంచ సర్వేషాం చాపి దేహినామ్ ।
యోఽతశ్చరతి సోఽధ్యక్ష ఏష క్రీడన దేహభాక్ ॥

అనుగ్రహాయ భూతానాం మానుషం దేహమాశ్రితః ।
భజతే తాదృశీః క్రీడాయాశ్శ్రుత్వాతత్పరోభవేత్ ॥
(వ్యాస భాగవతం X-33; శ్లో-37, 38)

చిన్న తెలుగుపద్యంలో విషయాన్నంతటినీ పోతన్నగారు వివరించారు!

గోపజనములందు గోపికలందును
సకలజంతులందు సంచరించు
నా మహాత్మునకుఁ బరాంగనలెవ్వరు
సర్వమయుఁడు లీలసలిపెఁగాక! (X-33-పద్యం-1107)

"స్వ, పర" భేదంలేని ఆ నిత్యతత్త్వ కిశోరలీల బృందావనంలోనే అక్షి గోచరమవుతుంది. దాన్ని శ్రుతిశిరోమణులయిన ఉపనిషత్తులు వర్ణించలేవు. శ్రీ శివశుకాదులకుకూడా ధ్యానగమ్యం కాదది అది ప్రేమామృతపరిపూర్ణం. ఆ నిత్య కిశోరరూపాన్ని చూడ్డానికి నేను తహతహలాడుతున్నాను- అంటారు గోస్వామి హరివంశచంద్రులు:

యద్బృందావన మాత్ర గోచరమహో యన్న శ్రుతీనాంశిరో-
ప్యారోఢుంక్షమతే న యచ్ఛివ శుకాదీనాంతు యద్ధ్యానగమ్ ।
యత్ప్రేమామృతమాధురీ రసమయం యన్నిత్యకై శోరకం
తద్రూపం పరివేష్టుమేవ నయనం లోలాయమానం మమ ॥
(శ్రీ రాధాసుధానిధి-శ్లో-76)

శ్రీ రాధాకృష్ణులు ఒకే తత్త్వమని వీరి నిర్ణయం. మిగిలిన అవతారాలన్నీ అగ్నినుండి విస్ఫులింగాలు వెలువడినట్లు- ఈ తత్త్వ నుండే వెలువడుతాయి అని వీరి విశ్వాసం.

శ్రీ గోస్వామి సంస్కృతంలో రాధాసుధానిధి, వ్రజభాషలో హిత చౌరాసీ మాత్రమే కాక- ఆగాస్తవమ్, చతుశ్శ్లోకి. శ్రీయమునాష్టకమ్, రాధాతంత్రం కూడా వ్రాసినట్లు ప్రసిద్ధి ఉంది.

వ్రజభాషలోని ఈయన కవితకూడా హృదయదఘ్నమై, రసపూర్ణమై

ఉంటుంది. ఇదంతా అత్యాశ్రయ కవిత్వం. శ్రీ రాధారాణి సౌందర్యాన్ని చూడండి.

వ్రజ నవతరుని కదంబముకుట మని శ్యామా ఆజు బనీ।
నఖ శిఖ లౌం అంగ అంగమాధురీ మోహే శ్యామ్ ధనీ॥

యౌం రాజత కబరీ గూథిత కచ కనకకంజ బదనీ।
చికుర చంద్రకని బీచి అరధ బిధుమానౌం గ్రసతఫనీ॥

జై శ్రీ హితహరివంశ ప్రశంసిత శ్యామాకీరతి బిశదఘనీ॥
గావత శ్రవనని సునత సుఖాకర బిస్వదురిత దవనీ॥

శ్రీ గోస్వాములు ప్రేమభక్తి మూర్తీభవించిన మూర్తులు. లలితము, రస పేశలము అయిన కవిత్వం ఆయనది.

శ్రీ హితహరివంశ గోస్వాముల ముఖ్య శిష్యులలో - శ్రీ హరిరామ్ శుక్ల నామధేయులైన శ్రీ వ్యాస్‌జీని పేర్కొనాలి. శ్రీ హరిరామ్ శుక్ల కవిత్వానికి ముగ్ధులైన కాశీపండితులు ఆ కాలంలో ఆయనకు 'శ్రీ వ్యాస్' బిరుదం ఇచ్చారు. ఆయన జననీ జనకులు. పద్మావతీ సుమోఖన్‌లు. ఆయన క్రీ.శ. 1510లో మార్గశీర్ష శుక్ల పంచమినాడు జన్మించారు తండ్రి ఓర్ఛా సంస్థానంలో పేరు ప్రఖ్యాతులు పొంది ఉన్న వైష్ణవులు సనాఢ్య బ్రాహ్మణులు, ధనవంతులు. ఈయన శ్రీ చైతన్య మహాప్రభువుల 'గురుభాయి' అయిన శ్రీ మాధవదాస్‌జీ శిష్యులు.

శ్రీ హరిరామ్ శుక్ల తమ తండ్రిగారి వద్దనే దీక్షా గ్రహణం చేశారు. తమ 'వ్యాసవాణీ'లో ఈ విషయాన్ని ఇలా తెలియజేశారు:

వందౌ శ్రీ సుకల్ పద పంకజన్।
సత్త చిత్ ఆనంద్ కే నిధి, గయీ హియ్ కీ జరన్॥

ఇంకోచోట ఈ విషయాన్ని "జయజయ శ్రీగురు శుక్ల మోహి సర్‌బస దీహౌ" అని చెప్పారు. శ్రీ వ్యాస్‌జీ బృందావనం చేరేనాటికి అక్కడ- శ్రీ హరిదాస్ స్వామి, శ్రీ హితహరివంశస్వామి. శ్రీ రూపగోస్వామి, శ్రీ సనాతన గోస్వామి ప్రభృతుల భక్తిసాధనతో ఆ ప్రాంతం అంతా పునీతమైఉంది. శ్రీ

తత్త మీరాబాయిగానంతో ముఖరితమైఉంది. శ్రీ సూర్‌దాస్, శ్రీ పరమానంద దాస్ మొదలైన వారి పదావళి వాతావరణాన్ని కమనీయం చేశాయి.

శ్రీ హిత హరివంశగోస్వామి తరువాత శ్రీ వ్యాస్‌జీ సంప్రదాయజ్ఞులచేత ఆచార్యులుగా స్వీకరింపబడ్డారు. ఈ విషయాన్ని శ్రీ ధ్రువదాస్‌జీ ఇలా వ్యక్తం చేశారు:

వరకిశోర్ దో ఉలాడిలే, నవల్‌ప్రియా నవపీయ ।
ప్రగట్ దేఖియత జగత్ మేం రసికవ్యాస్ కీ హియ ॥

తండ్రిగారి వద్ద విద్యాగ్రహణం చేసిన ఈయన బృందావనం వచ్చి శ్రీ హితహరి వంశ గోస్వాముల ప్రభావం క్రింద శ్రీ రాధావల్లభుల ఉపాసకులయ్యారు.

సేవక్ కీ సరి కో కరై భజన్ సరోవర్ హంస్ ।
మన్ బచ్ కై ధరి ఏక్ వ్రతగాయే శ్రీహరివంశ్ ॥

అనే 'భక్తనామావళి, దోహా తెలియజేస్తోంది.

శ్రీ వ్యాస్ జీ సంస్కృతంలో 'నవరత్న' అనే గ్రంథాన్ని రచించి సంప్రదాయ సిద్ధాంతాల్ని వివరించారు. 'వ్యాస్‌వాణి' పేరుతో 700 పదాల కంటె అధికంగా వ్రజభాషలో వ్రాశారు. ఈ 'వ్యాస్‌వాణి'లో రెండు ఖండాలు ఉన్నాయి. ప్రథమ ఖండం (291 పదాలు)లో భక్తి సిద్ధాంతవర్ణన చేశారు. ద్వితీయఖండం (456 పదాలు)లో శ్రీ రాధాకృష్ణుల లీలావిలాసాల రుచిరవర్ణన చేశారు. ఇందువల్ల దీనికి 'రస్‌ఖండ్' అనే పేరు వచ్చింది. వీటిని- ఆయన వంశానికే చెందిన ఆచార్య రాధాకిశోర్ గోస్వామి బృందావనంలో క్రీ॥శ॥ 1938లో గ్రంథరూపంలో ప్రచురించారు.

శ్రీవ్యాస్‌జీకి తమ కాలంలో బృందావనంలో ఉన్న శ్రీ చైతన్య సంప్రదాయానికి చెందిన శ్రీరూపగోస్వామి, శ్రీ సనాతన గోస్వామి ప్రభృతులతో గాఢ మైత్రి ఉండేది ఈయన తండ్రిగారిని బట్టి, చైతన్య సంప్రదాయానికి చెందిన గోస్వాములతో ఉన్న మైత్రిని బట్టి శ్రీవ్యాస్‌జీ కూడా ఆ సంప్రదాయానికే చెందిన వారని భావించేవారున్నారు. కాని, ఈయన పదావళినిబట్టి చూస్తే ఈయన మీద

గోస్వామిహిత హరివంశచంద్రుల శ్రీరాధావల్లభ సంప్రదాయ ప్రభావం ఎంతగా పడిందో తెలుస్తుంది.

నిజమైన వైష్ణవునివలె, కులగోత్రాదుల ప్రస్తావన లేకుండా, వైష్ణవులందరూ ఒకే జాతికి చెందినవారని ఈయన వ్రాసిన క్రింది రచన చాలా ప్రసిద్ధం:

రసిక్ అనన్య హమారీ జాతి।
కులదేవీ రాధా, బర్సానో ఖేరో బ్రజవాసిన్ సోఁపాఁతి॥
గోత్ గోపాల్, జనేఊ మాలా, సిఖా సిఖండి హరిమందిర్ భాల్।
హరిగున్ నామ్ వేద్ ధుని సునియత్ మూంజ్ పఖావజ్
కుస్ కర్ తాల్॥

అక్షరక్షర ఈయన రచన (శబ్దప్రయోగంలో) జయదేవుని గీతగోవిందాన్ని స్ఫురింపచేస్తుంది అంటారు విమర్శకులు, చూడండి:

బృందావన్ కుంజ్‌కుంజ్ కేని బేలి ఫూలీ।
కుంద కుసుమ చంద నలిన విద్రుమ ఛవి ఝూలీ॥

ఈయన రసమయరచనలవల్ల ఆకర్షితులైనవారు ఈయన్ని కీర్తిస్తూ

జయ జయ విశదవ్యాస్‌కీ వాణీ।
మూలాధార్ ఇష్టరసమయ్, ఉత్కర్షక్ త్రిరస్ సానీ॥

అంటారు.

శ్రీవ్యాస్‌జీ తరువాత ఈ సంప్రదాయంలో పేరు ప్రఖ్యాతులు పొందినవారు, సంప్రదాయాన్ని విశేషంగా ప్రచారంచేసినవారు శ్రీధ్రువదాస్‌జీ. ఈయన 40 వరకు గ్రంథాలు వ్రాశారు. వాటిలో వృందావన్-సత్; సింగార్-సత్; రస్-రత్నావళీ; నేహమంజరీ; రహస్యమంజరీ; సుఖ్-మంజరీ మొదలైనవి ఉన్నాయి. కాని, అన్నింటికంటె విశేష ప్రచారం పొందిన వీరి రచన - భక్తనామావళీ. దీనిలో వీరు ప్రాచీనులు సమకాలికులు అయిన భక్తుల పరిచయం సహృదయతతో చేశారు. ఈయన తమ రచనల కాలం (విక్రమశకంలో) కూడా ఇయ్యడం వల్ల పరిశోధకులకు చాలా లాభం కలిగింది. వృందావన్-సత్ ను క్రీస్తుశకంలో

మార్చగా- 1680); రహస్యమంజరి (క్రీ॥శ॥ 1642) వ్రాసినట్లు తెలిసింది. 'భక్త నామావళి'లో క్రీ॥శ॥ 1679 వరకు ఉన్న భక్తుల పరిచయం ఉంది. వీటిని బట్టి శ్రీధ్రువదాస్‌జీ కాలం క్రీ॥శ॥ 1650 నుండి 1740 వరకు అని విద్వాంసులు గ్రహించారు.

ఈ సంప్రదాయ ప్రవర్తకులైన గోస్వామి హితహరివంశ చంద్రులకు జగత్తంతా రాధామయమే। ఆయన ఉపదేశసారాంశంగా క్రింది దోహాలను గ్రహిస్తారు:

తనహి రాఖుసత్‌సంగ్ మేఁ, మనహి ప్రేమ్ రస్ భేవ్।
సుఖ్ చాహత హరివంశ నిత్, కృష్ణ కల్పతరు సేవ్॥

సబ్ సోఁ హిత నిహకామ్ మన్, బృందావన్ విశ్రామ్।
రాధావల్లభలాల్ కో హృదయ ధ్యాన్, ముఖ్ నామ్॥

ఈయనదృష్టిలో జీవుడు, ఈశుడు అని రెండుతత్త్వాలులేవు. ఉన్నదిఒకటే- ప్రేమతత్త్వం, అదే అనేక రూపాలలో విద్యమానం అవుతుంది. ఆతత్త్వమే "హితం", అదే "బ్రహ్మం". "నిత్యవిహారకేళి"లో అదే యుగళమూర్తి అదే శ్రీవనం; అదే-సహచరీగణం, జలమేతరంగాలు; తరంగాలేజలం ఉన్నది ఒక్కటే! ఈ భావాన్ని శ్రీహిత హరివంశగోస్వామి ఇలా వివరించారు:

జోఈ జోఈ ప్యారౌ కరై సోఈ మోహి భావై,
భావై మోహి జోఈ, సోఈ సోఈ కరైఁ ప్యారే।
మోకో తో భావతో ఠౌర్ ప్యారే కే నైనన్ మేఁ,
ప్యారౌ భయౌ చాహై మేరే నైనని కే తారే।
మేరే తో తన్ మన్ ప్రాణ్ హూఁ మేఁ ప్రీతమ్ ప్రియ,
అపనే కోటిక్ ప్రాణ్ ప్రీతమ్ మోసోఁ హారే।
జై శ్రీ హిత హరివంశ హంస హంసనీ సాఁవర్ గౌర్,
కహౌ కౌన్ కరే జల్ తరంగని న్యారే॥

ఈ దృష్టిలో చూచినప్పుడు రాధావల్లభ సంప్రదాయం ఎంత విశిష్టమో తెలుస్తుంది.

## మహాపురుషీయ సంప్రదాయం

మధ్యయుగంలో బృందావనం నుండి ప్రవహించిన కృష్ణభక్తి ప్రవాహం, ఉత్తరభారత భూభాగాన్ని అంతా–భాషాభేదాల నిమిత్తంలేకుండా–ముంచివేసింది. ఈ ప్రవాహం వరదలావచ్చి, మనదేశానికి తూర్పుభాగంలో దూరంగా ఉన్న అస్సాంనుకూడా ముంచివేసింది. మొదటినుండి అస్సాం (అసమదేశం; కామరూప దేశం) ప్రాంతమంతా శక్తిపూజకు ప్రఖ్యాతి పొందిఉంది. శక్తిపీఠాలలో విశిష్టమైన కామాఖ్య(యోని) పీఠం ఇక్కడిదే. జంతుబలులకు, నరబలులకు కూడా స్థానమైన ఆప్రాంతంలో సాత్త్విక ధర్మమైన వైష్ణవం ప్రబలిందంటే అది సామాన్యవిషయం కాదు. పదులకొలది కొండజాతులవారు వారి వారి హింసాయుత, ప్రకృత్యారాధనాత్మకమైన ధర్మాలను అనుష్ఠిస్తూ ఇతర ప్రాంతాలవారికి భయం గొలుపుతూ వచ్చినవారు– శతాబ్దులనుండి ఆదరిస్తూఉన్న ఆచారవ్యవహారాలను మాని, వైష్ణవులయ్యారంటే అది సామాన్యవిషయం కాదు. ఈ ఘనకార్యాన్ని సాధించిన మహానుభావుడు, మహాపురుషుడు. శ్రీ శంకరదేవులు (1449-1569) ఈయన ఒక 'భూయాన్ (కాయస్థ)' కుటుంబంలో ఇప్పటి నౌగాంగ్ నగరానికి పదహారుమైళ్ళ దూరంలోఉన్న 'అలిపుఖూరి'లో జన్మించారు. ఆ రోజుల్లో భూయాన్‌లు బాగా భూవసతిఉండి మహారాజ సన్మానాన్ని పొందిఉన్నవారు. ఈయన ప్రముఖశాక్త సంప్రదాయానికి చెందిన కుటుంబంలో పుట్టినా, శ్రీమద్భాగవతం లభించడంతో కృష్ణభక్తులై, పూర్వాచారాల్ని పూర్తిగా విసర్జించారు. ఈయన తండ్రిపేరు కుసుంబర, ఈయన పుట్టిన మూడోరోజునే తల్లి మరణించగా ముత్తవ్వ సంరక్షణలో ఈయన పెరిగారు. ఈయన్ని పన్నెండోఏట మహేంద్ర కందళి అనే గొప్ప సంస్కృత విద్వాంసుడు నడుపుతూఉన్న గ్రామ పాఠశాలకు పంపారు.

ఈయనకు బాల్యంలోనే సంస్కృతంలో మంచిపాండిత్యం వచ్చింది. ఇంకా అక్షరాలు నేర్చుకొంటూఉన్నప్పుడే మొట్టమొదట ఒక అచ్చుఉంచి, మిగిలినవన్నీ అచ్చులులేని హల్లులు కూర్చి, ఒక పద్యంచేసి ఈయన అందరిమన్ననలను పొందారు. తరువాత 'హరిశ్చంద్రోపాఖ్యానం' సంస్కృతంలో వ్రాశారు. 22వ

ఏట చదువు ముగించి, భూవ్యవహారాలు చూసుకొంటూ సూర్యావతి అనే ఒకామెను వివాహంచేసుకొని గృహస్థుగా స్థిరపడ్డారు. కాని ఆమె ఒక కూతుర్నికని చనిపోయింది. ఇదే కాలంలో ఈయన తండ్రి మరణించారు తరువాత విరక్తితో తీర్థయాత్రలకు పోవాలని సంకల్పించి తన కూతురును 'హరి' అనే అతనికిచ్చి వివాహంచేసి 1481లో తాను, తన పూర్వపు గురువు మహేంద్రకందళి, ఇంకో పదహారుగురితో కలిసి దేశాటనం ప్రారంభించారు. భారతదేశంలోని ప్రముఖతీర్థస్థానాలనన్నింటిని దర్శించి, పన్నెండు ఏళ్ళతరువాత స్వస్థలానికి తిరిగివచ్చారు. వైష్ణవక్షేత్రాలనన్నింటిని చూచిరావడంవల్ల ఒక నిర్దిష్టమైన దృష్టితో వైష్ణవసమాజస్థాపన చేయగలిగారు యాత్రలనుండి తిరిగి వచ్చినతరువాత, తిరిగి వివాహం చేసుకొని తమ గ్రామంవిడిచి బర్డోవా అనేచోట స్థిరపడ్డారు.

ఇంక ఇప్పటినుండి వైష్ణవ మత ప్రచారంచేస్తూ అన్నిజాతులవారిని వైష్ణవులుగా మార్చుతూవచ్చారు. ప్రతి గ్రామంలోను ఒక "సత్రం", ఒక "నామ్ ఘర్" స్థాపిస్తూ వచ్చారు. "సత్రం" మఠంలాంటిది. "నామ్ఘర్" ప్రార్థనామందిరం వంటిది. దీనిలో పూజావస్తువు "శ్రీమద్భాగవతం" గ్రాంథప్రతి. విగ్రహాలు లేవు. శ్రీ శంకరదేవుల వైష్ణవానికి సంప్రదాయసిద్ధమైన పేరు "ఏకశరణ ధర్మం" దీని ముఖ్య సిద్ధాంతం విష్ణువు ఒక్కడే ఉపాసించదగినవాడు. ఆయన నారాయణ రూపంతో అవతారాలు ఎత్తుతాడు 'నీకు పుట్టుక లేకపోయినా నువ్వు అవతారాలెత్తి, జీవులకు జన్మరాహిత్యం కలిగిస్తావు' అంటారు ఈయన:

నాహి జన్మ తోమార్ తథాపి జన్మధరా।
సేహి జన్మే జీవర్ జన్మ దూర్ కరా॥

అవతారాలన్నింటిలో కృష్ణావతారం చాలా గొప్పది. ఇంక ఏ దేవుని అర్చించకపోదవమేకాదు, ఆయా దేవులకు పెట్టే నైవేద్యాన్ని కూడా ప్రసాదంగా ఏకశరణులు గ్రహించరాదు.

ఈ కాలంలోనే తిర్హుట్‌కి చెందిన జగదీశమిశ్ర అనే ఆయన, పురిజగన్నాథ్ యాత్రకుపోగా అక్కడ స్వప్నంలో శ్రీజగన్నాథుడు కనబడి, శ్రీమద్భాగవతాన్ని తీసుకొనివెళ్ళి శ్రీ శంకరదేవునకు ఇయ్యవలసినదని ఆజ్ఞాపించాడట! ఆవిధంగా, మిశ్ర శ్రీమద్భాగవతాన్ని తీసుకొని శ్రీశంకరదేవునకిచ్చి స్వర్గస్థు

దయ్యారు. వెంటనే శ్రీ శంకరదేవ్ శ్రీమద్భాగవతాన్ని చాలా సులభమైన అస్సామీయాభాషలోనికి అనువాదం చేశారు. ఆ ఇతివృత్తం మీదనే చాలా నాటకాలు, లఘుకావ్యాలు రచించారు. 1516లో ఆయన తన 67వ ఏట బర్దోవా విడిచి ధువహాటా అనేచోటికి పోవలసివచ్చింది.

ఇక్కడ ఆయన మహావిద్వాంసుడు, శాక్తేయుడు అయిన శ్రీమాధవదేవుని (1489-1596)వైష్ణవునిగా మార్చారు. ఈయన, తరువాత ఈ సంప్రదాయంలో అత్యంత ప్రముఖపాత్ర ధరించారు. కొంతకాలానికి అహోంరాజులతో వచ్చిన కలహకారణంగా, ఆ ప్రాంతాన్ని విడిచి కూచ్ బిహార్ హిందూరాజు పరిపాలిస్తూ ఉన్న కామరూపం వచ్చేశారు. 1546లో బర్‌పేట వచ్చి అక్కడికి సమీపంలోని పత్‌బౌసి అనేచోట తన "సత్రం", "నామ్‌ఘర్" శిష్యులకు పటకుటీరాలు నిర్మించారు. ఇక్కడనే శ్రీశంకరదేవులు ముగ్గురు బ్రాహ్మణ విద్వాంసులను-దామోదరదేవ్ (1488-1598)హరిదేవ్ (1493-1568), అనంతకందళి అనే వారిని తమ వైష్ణవంలోకి మార్చారు. వీరు తరువాత అస్సాంలో వైష్ణవ సంప్రదాయానికి గొప్ప సేవచేశారు. కొంతకాలం అక్కడ ఉన్నతరువాత, 120 మంది శిష్యులతో మళ్లీ తీర్థయాత్రలకు 1550లో బయలుదేరారు. ఈ సందర్భంలోనే, ఆయన పూరిలో శ్రీ చైతన్యమహాప్రభువును దూరంనుంచి చూచారని చెప్తారు.

తిరిగి వచ్చినతరువాత, రాజయిన నరనారాయణ్ ఆస్థాన విద్వాంసులు, శ్రీశంకరదేవుల వైష్ణవం అవైదికమని దాన్ని పరిహరించాలని ప్రచారం చేశారు. అప్పుడు రాజు ఏర్పాటుచేసిన సదస్సులో ఆస్థాన విద్వాంసులు ఓడిపోయారు. రాజు శ్రీశంకరదేవులను చాలా గౌరవించి, తనను శిష్యునిగా చేసుకోవలసినదని ప్రార్థించినా "రాజులు నియమనిష్ఠలు పాటించడం కష్టం" అని చెప్పి తప్పించుకొన్నారు. తరువాత బేలదంగా అనేసత్రంకి వచ్చి అక్కడేఉండిపోయి 1569లో పరమపదించారు తన తరువాత తన కుమారుడున్నా, అతన్ని కాదని తమ శిష్యుడైన మాధవదేవునకు తమ పీఠాధిపత్యం ఇచ్చారు.

ఈయన ధర్మానికి "మహాధర్మం" లేదా "మహాపురుషీయధర్మం" అని పేరువచ్చింది. ఇది ఆధ్యాత్మికంగా అద్వైతానికి దగ్గరగా కనబడుతుంది. కాని భగవద్రామానుజులవారి తత్త్వత్రయం - చిత్, అచిత్, ఈశ్వరతత్త్వాలు - ఉన్నాయి! కాని 'యుగళోపాసన" లేదు. వ్యావహారికంగా భక్తిమార్గానికి చేరు

తుంది. ఈ భక్తిలోకూడా "దాస్య" భక్తికి ఎక్కువ ప్రాధాన్యం. మానవుడు సాంసారికమైన మాయను జయించినప్పుడే తాదాత్మ్యం అని ఈయన ముఖ్యసిద్ధాంతం. జీవన్ముక్తిని ఒప్పుకొన్నారు ఈయన.

ఈయన భాగవతానువాదం అసామియా భాషకే అలంకారప్రాయమైనది. సామాన్య జనుల భాషలో అది ఉంది. ఆ భాషలోనేకాదు, ఆ నుడికారంలోకూడా ఉంది. ఈ సంప్రదాయంలో రాధకు విశేషప్రాముఖ్యం లేదు. ఈయన "బడగీత్" చాలా ప్రసిద్ధం. శరణాగతికి ప్రాముఖ్యం ఉంది ఇందువల్ల ఈ సంప్రదాయంలోని భక్తులను "శరణియా"లు అంటారు. నామస్మరణ ముఖ్యం.

కృష్ణ కింకరకహ, బిఛోడి విసయకామా।
రామచరణ్ లేహుశరణ్, జపగోవిందకు నామా॥ (బడ్‌గీత్)

ఈయన భాగవతానువాదంలో 'ఆది దశమ' అనగా దశమస్కంధం పూర్వార్ధం చాలా ప్రచారంలోఉంది. తరువాత ఈయన 'కీర్తన' చాలా ప్రసిద్ధిపొందింది. ఇదిలేని అసామియా ఇల్లు ఉండదుట! ఈయన నాటకాలు కూడా చాలా ప్రచారాన్ని పొందాయి. "నామ్‌ఘర్"లలో స్త్రీలకు కూడా స్థానం ఉంది. ఆయన శిష్యులలో అన్ని కులాలవారు ఉన్నారు. చాంద్‌సాయ్, జయంతహరి- ముస్లిములు, గోవిందుడు గేరో (ఆటవికజాతి) జయంతహరి - భూటియా, శ్రీరామ్- కైవర్త, మాధవ - కులాల. కులమత వివక్షలేకుండా భక్తికి ప్రాముఖ్యాన్ని ఇచ్చి అస్సాంను ఏకం చేసిన మహానుభావుడు ఈయన.

ఇంక మహారాష్ట్ర దేశంలో "మహానుభావ" పంథ ప్రాముఖ్యాన్ని పొందింది. దీనికి ప్రవర్తకులుగా శ్రీ చక్రధరులు పేరుపొందారు. ఈ సంప్రదాయం వారు శ్రీ మద్భగవద్గీతను, శ్రీమద్భాగవతాన్ని పరమ ప్రమాణాలుగా స్వీకరించారు. "సిద్ధాంత సూత్రపాఠం" అనే గ్రంథాన్ని ఆది గ్రంథం అంటారు. దాని ప్రకారం, ఒక్కొక్క యుగంలో ఒక్కొక్కరు అవతరించి ధర్మాన్ని స్థాపిస్తారనీ— కృతయుగంలో "హంసావతారం", త్రేతాయుగంలో "దత్తాత్రేయులు", ద్వాపరయుగంలో "శ్రీకృష్ణులు", కలియుగంలో "శ్రీచక్రధరులు"- అనీ ఉంది. శ్రీచక్రధరుల శిష్యులు వారిని శ్రీకృష్ణరూపులుగా గ్రహించారు. వీరి ప్రార్థనా శ్లోకం, ధ్యానరూపంగా అందరూ పఠించేది, శాండిల్యోపనిషత్తులోని "దత్తాత్రేయ" స్తోత్రరూపకమైనది:

"దత్తాత్రేయం, శివం, శాంతం ఇంద్రనీలనిభం ప్రభుమ్ ।
ఆత్మమాయారతం దేవం అవధూతం దిగంబరమ్ ॥
భస్మోద్ధూళిత సర్వాంగం జటా జూటధరం విభుమ్ ।
చతుర్బాహు ముదారాంగం ప్రఫుల్లకమలేక్షణమ్ ॥
జ్ఞానయోగనిధిం విశ్వగురుం యోగి జనప్రియమ్ ।
భక్తానుకంపినం సర్వ సాక్షిణం సిద్ధసేవితమ్ ॥
ఏవం యః సతతం ధ్యాయేత్ దేవదేవం సనాతనమ్ ।
సముక్తః సర్వ పాపేభ్యో నిశ్శ్రేయసమవాప్నుయాత్ ॥"

వారి దృష్టిలో దత్తాత్రేయులు ఏక ముఖులు చతుర్బాహుయుక్తులైన విష్ణువు.

మహానుభావ సంప్రదాయంలో స్త్రీలుకూడ సన్యసించవచ్చును. సన్యాసులు నల్లని బట్టలు ధరిస్తారు. ఈ సంప్రదాయానికి విశేష ప్రచారం లేదనవచ్చును.

పంఢరి విఠలుని అర్చించే "వారకరీ" సంప్రదాయం, (విఠలుడు బాల కృష్ణుడు), రామదాసీ సంప్రదాయం, హరిదాసీ సంప్రదాయం "పంథ" నామంతో వ్యవహరింపబడుతూ మహారాష్ట్రలో ఉన్నాయి. ఈ సంప్రదాయాలలో "జ్ఞానేశ్వరి" (భగవద్గీతకు శ్రీజ్ఞానేశ్వరులవ్యాఖ్య) ప్రభావం; నామ్‌దేవ్, తుకారామ్, సమర్థరామ దాస్ మొదలైన మహా పురుషుల ప్రభావం విశేషంగా కనబడుతుంది. వీటన్నిందిలో భక్తికి ప్రాధాన్యం ఉన్నా, జ్ఞానానికి కూడా సముచిత స్థానం ఉంది. భాగవతంతోబాటు భగవద్గీతకు కూడా ప్రాముఖ్యం ఉంది. వీరందరిమీద భాగవతానికి శ్రీధరస్వామి వ్రాసిన వ్యాఖ్యాన ప్రభావం కనబడుతుంది.

అవతార ప్రస్తావనలు జగన్మాతకు కూడా ఉన్నాయి. దుర్గాసప్తశతిలో ఆమె తన అవతారాలన్నీ చెప్పి (వింధ్యా చలవాసిని, రక్తదంతిక, శతాక్షి, శాకంభరి, దుర్గ, భీమ, భ్రామరి) అవశ్యకమైనప్పుడు తానవతరిస్తానన్నది:

"ఇత్థం యదా యదా బాధా దానవోత్థా భవిష్యతి ।
తదా తదావతీర్యాహం కరిష్యామ్యరి సంక్షయమ్" ॥

ఈ శ్లోకం "భగవద్గీత" లోని "యదా యదాహి ధర్మస్య" అనే శ్లోకానికి ఎంత దగ్గిరగా ఉన్నదో గ్రహించ వచ్చును దత్తాత్రేయ సంప్రదాయజ్ఞులు,

ఆయన కూడా పదహారు అవతారాలలో వ్యక్తమైనట్లు (యోగిరాజ, అత్రివరద, దత్తాత్రేయ, కాలాగ్ని శమన, యోగిజనవల్లభ, లీలా విశ్వంభర, సిద్ధరాజ, జ్ఞానసాగర, విశ్వంభరావధూత, మాయా ముక్తావధూత, మాయా యుక్తావ ధూత, ఆదిగురు, శ్రీశివరూప, శ్రీదేవదేవ, శ్రీదిగంబర, శ్రీకృష్ణ శ్యామ కమల నయన అనేవి షోడశావతారాలు) చెప్పుతారు.

అసలు విష్ణువు అవతారాలు ఎత్తడానికి కారణం దుర్వాస శాపమని కూడా ఉంది. దుర్వాసుడు అంబరీషుని దూషిస్తూ ఉన్నప్పుడు, ఆయన భగవదాయత్త చిత్తుడై ఉండడంచేత - నువ్వుచేప, పంది, తాబేలు మొదలైన నానా యోనులలో జన్మించు అన్న తిట్లన్నీ శాపరూపంగా విష్ణు భగవానుడు స్వీకరించవలసి వచ్చిందనే ఐతిహ్యం ఉంది; ఆయన సర్వాంతర్యామిగదా! దానిని గురించి పూర్వమే తెలుసుకొన్నాము (అవతారతత్త్వ వివేచన- పుట-82)

అవతారాలలో పరవ్యూహావతారాలు సామాన్యమానవులకు గోచరించవు. కొంత గోచరించేవి- విభవావతారాలు అవి వస్తూపోతూ ఉండేవి. అంతర్యామి రూపంలో సర్వత్ర భగవంతుడున్నాడు. కాని, ఆయన్ని పట్టుకోవడం, దర్శించడం కష్టం. ఇందువల్ల అర్చావతారాలు వచ్చాయి. మనదేవాలయాలకు విగ్రహారాధనకు, మూర్తిపూజకు మూలం ఇవి. ప్రసిద్ధ క్షేత్రాలలో ఉన్న అర్చావతారాలు లక్షలకొలది మనుష్యులను ఆకర్షిస్తున్నాయి. భగవంతుడు సర్వాంతర్యామి గనుక "మూర్తి" అనావశ్యకం! భగవంతుడు సర్వాంతర్యామి గనుక "మూర్తి" లోనూ ఉన్నాడు; ఇవి తేలే ప్రశ్నలు కావు!

భగవంతుడు మానవుల్ని ప్రేమిస్తాడు గనుక ("ప్రియోఽసిమే")భూలోకంలో అవతరిస్తాడని మనవారినమ్మకం, మహాసుభావులందరూ ఇట్టివారే అని కూడా నమ్మకం. శ్రీవివేకానందస్వామి తమ గురువులైన శ్రీరామకృష్ణ పరమహంసను – శ్రీరామ శ్రీకృష్ణుల అవతారమని- కీర్తిస్తూ ఈ విధంగా శ్లోకాల రూపంలో వర్ణించారు:

"ఆచండాలా ప్రతిహతరయో యస్య ప్రేమ ప్రవాహః
లోకాతీతోఽ ప్యహహ న జహౌ లోక కల్యాణమార్గమ్ ।
త్రైలోక్యేఽప్ర ప్రతిమమహిమా జానకీ ప్రాణబంధో
భక్త్యా జ్ఞానం వృతవరవపుః సీతయా యోహి రామః"॥

"సద్భీకృత్య ప్రళయకలితం వాహవోత్థం మహాంతమ్
హిత్వారాత్రిం ప్రకృతి సహజామంధ తామిస్రమిశ్రామ్ ।
గీతం శాంతం మధురమపి యః సింహనాదం జగర్జ
సోఽయం జాతః ప్రథితపురుషో రామకృష్ణస్త్విదానీమ్"॥

ఆధునిక తత్త్వవేత్తలలో శ్రీ అరవిందులు అవతారాన్ని గురించి చాలా వ్రాశారు. భగవంతుడు స్వయంగా దిగివచ్చి మానవుల మధ్య నివసించి పురుషులు పురుషోత్తములు కావడానికి, సృష్టి సక్రమమార్గంలో పరిణామం చెందడానికి సాయపడతాడని వ్రాశారు:

"The Divine descends from pure existence through the play of Consciousness - Force and Bliss and the creative medium of Supermind into Cosmic Being we ascend from Matter through a developing life, soul and mind and the illuminating medium of Supermind towards the Divine Being" (The Life Divine)

అవతార తత్త్వ వివేచన వల్ల- పురుషుడు పురుషోత్తమునిగా మారడానికి పురుషోత్తముడు దిగివస్తాడని తెలిసింది. డా॥ రాధాకృష్ణ పండితుడు ఈ విషయాన్నే ఇలా చెప్పారు:

"What has been achieved by one man, a Christ or a Buddha, may be repeated in the lives of other men". గ్రంథాంతరంలో: "Whether we say God limits Himself in the form of man or man rises to God working through his nature" అవతారంలో ఒకటే అవుతుంది అన్నారు.

అవతార ప్రయోజనాలను శ్రీకృష్ణుడు గీతలో కొన్నింటిని నిర్దేశించాడు. ఇవిగాక మరి రెండింటిని శ్రీమద్భాగవతం వచించింది:

"మర్త్యావతార స్త్విహ మర్త్య శిక్షణమ్"

"అనుగ్రహాయ భక్తానాం మానుషం దేహ మాశ్రితః ।
భజతే తాదృశీ క్రీడాయాః శ్రుత్వాతత్పరో భవేత్॥"

"యస్యావతారా జ్ఞాయంతే
శరీరిష్వ శరీరిణః ।
తైస్తై రతుల్యాతి శయైః
వీర్యైర్దేహిష్వ సంగతైః ॥"

ముగింపు పరిష్కారంగా మనం శ్రీకృష్ణద్వైపాయన వ్యాసమహర్షుల పై వాక్యాలను గ్రహించడం సముచితం, సమీచీనం.

## అనుబంధం I

# శ్రీమద్భాగవత పురాణం : అవతారాలు వివిధ సంప్రదాయాలు

"భాగవతముఁ దెలిసి పలుకుట చిత్రంబు
శూలికైనఁ దమ్మిచూలికైన
విబుధజనుల వలన విన్నంత కన్నంత
దెలియవచ్చినంత దేటపఱుతు".

అన్నారు మహాకవి, మహాభక్తుడు, సహజ పాండిత్యుడు బమ్మెరపోతనామాత్యుడు. తన పురాకృత శుభాధిక్యం చేతనే ఈ అవకాశభాగ్యం తనకు లభించిందనీ అందుచేతనే నన్నయ తిక్కనాది కవులు శ్రీమద్భాగవతాన్ని తెలుగు చేయలేదనీ దీన్ని తెలిగించి తన జననాన్ని సఫలం చేసుకొని పునర్జన్మ లేకుండా చూసుకొంటాననీ ఆయన ఆనందించారు. దీనికి తగినట్లుగానే, తాను మహేశ్వర ధ్యానంలో ఉండగా సాక్షాత్కరించి "మన్నామాంకితంబుగా శ్రీమహాభాగవతంబుఁ దెనుంగు సేయుము నీకు భవబంధంబులు దెగునని" రామభద్రుడు అనతి ఇవ్వడం జరిగింది.

అయితే, భాగవతం తెలిసి పలకడం సామాన్య విషయంకాదు. అది-హరునకు, బ్రహ్మకు కూడా అలవికాని పని! కనుకనే ఇక్కడ పోతన "చిత్రంబు" అని ప్రయోగించడం జరిగింది. కేవలం పాండిత్య విషయం అయితే "కష్టంబు" అనేవాడేమో! కాని ఇది పాండిత్య విషయంకాదు. తెలుసుకో వలసిన వస్తువు సర్వాంతర్యామియై, తెలుసుకొనేవాడు, పలికేవాడు దానిలో భాగాలే అయినప్పుడు-తెలియడం, పలకడం చిత్రమైన విషయాలేగదా! దైవానుగ్రహం వల్లనే జరిగేపని ఇది అని అంతరార్థం! దీన్ని సూచించడానికే "పలికెడిది భాగవతమట" అన్నారు! అంటే, భాగవతమే-పోతన ద్వారా పలుకుతోందిగాని ఆయన పలకడంలేదు! శ్రీరామనారాయణుడే భాగవతమందలి అంతర్యామి అని

తెలియజేయడానికే "పలికించెడివాడు రామభద్రుండట" అంటాడువెంటనే! తన నోటివెంట వెలువడుతోంది గనుక "నే(బలికిన భవహరమగునట!" అని చేర్చారు. ఈ పవిత్రకార్యంలో తన పురుష ప్రయత్నం నిమిత్తమాత్రం అని పోతన సూచించారు. ఈ విధంగా వ్యక్తం చేసి తన రచన "అపౌరుషేయం" అని ధ్వనింపజేసినంత దూరం పోయారు సహజకవి భక్తపోతన!

తనకు కొంత అయినా భాగవత సంబంధమైన జ్ఞానం కలగడానికి "విబుధజనుల" ప్రవచనాదులు వినడం ఒక కారణంగా పేర్కొన్నారు. శ్రీమద్భాగవతం-సంస్కృత భాగవతమే ఆనాటికి-చాలా కష్టమైన గ్రంథం. దీన్ని గురించి "భాగవతశాస్త్రం"అని వ్యాఖ్యాతృచక్రవర్తి। శీధరస్వామి అన్నారు. పండితలోకంలో "విద్యావతాం భాగవతే పరీక్షా" అని ప్రచారంలో ఉంది. కనుక, పోతన విబుధ జనుల ప్రస్తావన తెచ్చారు. విబుధజనులకు కూడా అంత సులభమైనది- కాదను కోవడానికి వీలుగా, "భాగవతాన్ని తెలుసుకొన్నవారెవరు?" అనే ప్రశ్నకు పండిత లోకంలో ప్రసిద్ధంగా ఈ శ్లోకం ఉంది:

"వ్యాసోవేత్తి శుకోవేత్తి రాజావేత్తి నవేత్తివా ।
శ్రీధరః సకలంవేత్తి శ్రీనృసింహ ప్రసాదతః ॥"

వ్యాసునకు తెలుసును; శుకునకు తెలుసును; రాజైనపరీక్షిత్తునకు తెలుసునో తెలియదో! శ్రీనృసింహ ప్రసాదంవల్ల శ్రీధరునకు సకలం తెలుసును. శ్రీమద్భాగవతానికి అద్వైత పరంగా వ్యాఖ్యానం వ్రాసిన శ్రీధర స్వామి నృసింహోపాసకుడు గనుక ఆయనకు అంతా తెలుసునన్నమాట! "విబుధజనులవల్ల విన్నంత" దాని నుండి తాను తెలుసుకొన్నంత వ్రాశాడు. ఇంక తాను "కన్నంత" దానినుండి తెలుసుకొన్నంత కూడా వ్రాశాడు. సచ్చిదానందరూపమైన నిర్గుణ పరబ్రహ్మం, సత్త్వరజస్తమోగుణాలనంది సగుణమై త్రిమూర్తులుగా సృష్టి స్థితి లయాలను నిర్వహిస్తుందని వేదాంత దర్శనం తెలుపుతుంది. భాగవతంలో సగుణ బ్రహ్మ అయిన శ్రీవిష్ణువి అవతారలీలలు తద్భక్తి మార్గాలు విపులంగా వర్ణితా లయ్యాయి. వీటి మూలంగా విశుద్ధ మనస్కులైన భక్తులకు, నిర్గుణ పరబ్రహ్మ జ్ఞానం అనుభూతమై కైవల్యం ప్రాప్తిస్తుంది. మూర్తిత్రయం వెనుకగాని, రామకృష్ణాద్యవతారాలవెనుకగాని నిలిచి ఉన్న అంతశ్చైతన్యయుతమైన పరతత్త్వం ఒక్కటే అనే జ్ఞానం వారికి కలుగుతుంది. నామరూపాదికం, ఉపాధ్యాశ్రయం అని అనుభూతమై తదతీతమైన పరతత్త్వం గోచరిస్తుంది. ఈ పరమసత్యాన్ని

విబుధజనులవల్ల "విన్న" పోతన, తనపురాకృతపుణ్యవిశేషం చేతసిద్ధించిన కవితా సమాధిలో "కన్న" పరమసత్యంతో జోడించి "తెలియవచ్చినంత" తేట పరిచారు. ఇది ఆయన వినయానికి ప్రతీక!

ఈ అంతర్దర్శనం-ఈ "కనడం"-ప్రతి మహాకవికి సహజం. శ్రీమద్రామాయణ రచనకుముందుగా మహర్షి వాల్మీకి ధర్మతత్త్వాన్ని "కన్నారు"-దర్శించారు :

"తతః పశ్యతి ధర్మాత్మా తత్సర్వం యోగమాస్థితః ।
పురాయత్తత్ర నిర్వృత్తం పాణావామలకం యథా ॥"

సర్వాన్ని కరతలామలకంగా దర్శించారు వాల్మీకి. ఇదే విధంగా మహాభారతరచనకు ముందు వ్యాసమహర్షి సర్వాన్ని దర్శించారు:

"శుచిఃనియమోవ్యాసః శాంతాత్మాతపసిస్థితః
భారతస్యేతిహాసస్యధర్మేణాన్వీక్షతాంగతిం
ప్రవిశ్యయోగం జ్ఞానేన సోపశ్యత్సర్వమంతతః ॥"

ఇందువల్లనే పెద్దలు "నానృషిః కురుతే కావ్యమ్" అన్నారు.

శ్రీమద్భాగవతం బయలుదేరిన తరువాతనే గదా దాని వైశిష్ట్యాన్ని గురించి చెప్పుకోవడం జరుగుతుంది! దాన్ని అనువదిస్తున్నప్పుడు గాని, అనుసరించి కథాకథనం చేస్తున్నప్పుడు గాని రచయిత ఎదుర్కొనే సమస్యలను కష్టాలను గూర్చి చెప్పడం కూడా అప్పుడే గదా! ఈ విధంగా చెప్పిన మొదటి తెలుగు మహాకవి పోతన. ఇందువల్లనే భాగవతం విషయంలో ఆయనకున్న అభిప్రాయాల వివరణతో ఇది ప్రారంభమయింది మహాకవి పోతనకే శ్రీమద్భాగవతం అలా కనబడితే ఇంక సామాన్యుల విషయంలో చెప్పేదేముంది? అయితే, సామాన్యులు, రసికభావవిదులు "వేదకల్ప వృక్ష విగళితమై, శుకముఖసుధా ద్రవమున మొనసియున్న భాగవతపురాణ ఫలరసాస్వాదన" చేయడం ఎలాగ? దానికి మార్గంలేదా? ఉంది! అది భక్తి మార్గం! దీన్ని అనుసరిస్తే "శ్రీమద్భాగవత పరమార్థం" కరతలామలకం అవుతుంది. పెద్దలు చెప్పనే చెప్పారు, "భక్త్యా భాగవతం జ్ఞేయం "అని. ఈ భక్తి పుష్కలంగా ఉండే-శ్రీమద్భాగవత పరమార్థాన్ని ఆకళింపునకు తెచ్చుకొనే విషయంలోగాని, తెచ్చుకొన్న విషయాన్ని పదిమందికి

తెలియజెప్పే విషయాలలో గాని అర్థంకులుండవు. ఈ శక్తి కలగడం-పూర్వ జన్మ సుకృతం మీద, జన్మించిన వంశాదికం మీద, ఈ జన్మలో చేసిన సత్కృషి మీద-చాలావరకు ఆధారపడి ఉంటుంది. అన్నింటికి పైని ఆ భగవంతుని అనుగ్రహం ఉండవలసి ఉండడం ఉండనే ఉంది!

శ్రీమద్భాగవతం సామాన్య పురాణం. కాదు. శ్రీవిష్ణుస్వరూపులైన శ్రీకృష్ణ ద్వైపాయనులు చిత్తశాంతి కోసం రచించినది. వేదాది విభాగం చేసినా, అనేక పురాణాలు కూర్చినా శ్రీవ్యాసమహర్షికి మనశ్శాంతి కలుగలేదట! శాంతరహృదయుడైన ఆమహర్షికి చిత్తశాంతిని పరితుష్టిని కలిగించింది భాగవత గ్రథనమని సంప్రదాయవిదుల వాక్కు.! ఆయన ద్వారా ఆయన పుత్రుడైన శ్రీశుకమహర్షికి ఈమహాపురాణం లభించింది. శాపోపహతుడై ఆసన్నమరణుడైన పరీక్షిన్నృపాలునకు శ్రీశుకయోగి దీన్ని వినిపించాడు. అక్కడ ఉండి దీన్ని విన్న శ్రీ సూతుడు శౌనకాది మహామునులకు దీన్ని ప్రవచించడం, ఆ మునులపరంపరగా ఇది లోకంలో ప్రసిద్ధికి రావడం జరిగిందని సంప్రదాయజ్ఞుల కథనం.నాటి నుండి నేటిదాకా శ్రీమద్భాగవతపురాణం భక్తజనహృత్తాపహారి. శ్రీమద్రామాయణ మహాభారతాలలోపాటు శ్రీమద్భాగవతానికి కూడా అసేతుశీతనగ వ్యాప్తి ఉంది. కొన్ని సంప్రదాయాలలో దీనికున్న ప్రశస్తి ఇంకదేనికిలేదు. వీటిలో శ్రీమధ్వాచార్యులవారి బ్రహ్మ సంప్రదాయాన్ని, శ్రీనింబార్కాచార్యులవారి హంస సంప్రదాయాన్ని శ్రీవల్లభాచార్యులవారి రుద్ర సంప్రదాయాన్ని, శ్రీహితహరివంశచంద్రాచార్యులవారి రాధావల్లభ సంప్రదాయాన్ని, శ్రీచైతన్యమహాప్రభువుల అచింత్య భేదాభేద సంప్రదాయాన్ని - ప్రధానంగా పేర్కొవచ్చును. శ్రీవల్లభాచార్యులు శ్రీమద్భాగవతాన్ని-ప్రస్థానత్రయంతోపాటు పేర్కొంటూ అది శ్రీవ్యాసులవారి "సమాధిభాషా" అన్నారు:

"వేదాః శ్రీకృష్ణవాక్యాని వ్యాస సూత్రాణి చైవ హి ।
సమాధిభాషావ్యాసస్య ప్రమాణం తత్ చతుష్టయమ్" ॥

శ్రీమద్భాగవతానికి "పారమహంసీ సంహితా" అనే వ్యవహారం ఉంది. అధ్యాయాల చివర "ఇతి పారమ హంస్యాంసంహితాయాం" అని ప్రామాణికమై ఉంది. అంటే పరమహంసలతో (కు) సంబంధించినది అన్నమాట (పరమహంసానాం ఇయం పారమహంసీ). శ్రీమద్భాగవత పురాణవక్త జీవన్ముక్తుడు పరమ

యోగి అయిన శ్రీశుకదేవుడు. శ్రోతలు-పరీక్షిన్మహారాజా, అసంఖ్యాక పరమ హంస శ్రేణులైన మునిపుంగవులు. ఇంక పరీక్షిత్తు కేవలం గృహస్థుడు కాదు. విప్ర శాపదగ్ధుడై ఏడువాళ్ళలో మృత్యువును ప్రతీక్షిస్తూ విరక్తుడై ఉన్నాడు. ఇంక శుకుడో పరమవిరాగి, ఈ విరక్తి చూచి తండ్రి వ్యాసుడంతటివాడు "పుత్రా! పుత్రా!" అని ఘోషిస్తూ అడవిని పడ్డాడు! శ్రీమద్భాగవత అవిర్భావనేపథ్యం ఇది!

ఇంక "భాగవత" శబ్దానికి పండితులు వివిధ రీతులలో అర్థవివరణ చేశారు. "భగవతః ఇదమ్-భాగవతమ్ః" భగవంతుని కథలను చెప్పేది భాగవతం. భగ వంతుని ఏకవింశత్యవతారాలు-ప్రథమ స్కంధంలో; శ్రీమన్నారాయణుని లీలా వతార వర్ణన-ద్వితీయ స్కంధంలో; శ్రీయజ్ఞవరాహావతారవర్ణన - తృతీయ స్కంధంలో; ఋషభావతారవర్ణన - పంచమస్కంధంలో; శ్రీ నృసింహావతార వర్ణన-సప్తమస్కంధంలో; శ్రీకూర్మావతారవర్ణన, వామనావతార వర్ణన, మత్స్యా వతారవర్ణన - అష్టమస్కంధంలో: శ్రీరామ, పరశురామావతారాల వర్ణన-నవమ స్కంధంలో; శ్రీకృష్ణావతార వైభవ వర్ణన-దశమ స్కంధంలో-ఇతర కథలతో ప్రసంగవశానకలిసి, కనబడతాయి. ఈ విధంగా ధర్మగ్లాని కలిగినప్పుడు తనకు తానుగా భగవానుడు అవతరించి ధర్మరక్షణ, దుష్టశిక్షణ చేస్తాడు. ధర్మరక్షణతో శిష్టరక్షణ కూడా జరుగుతుంది.

"భాగవతానామ్ ఇదమ్ భాగవతమ్" అని చెప్పినప్పుడు, భాగవతులైన భగవద్భక్తుల కథలు చెప్పేది భాగవతం. పరమ భాగవతోత్తములైన ప్రహ్లాద, నారదాదుల కథలు జగత్ప్రసిద్ధ కథలు-దీనిలో ఉన్నాయి. ఇవి తెలియనివారు భారతావనియందు లేరుగదా! భగవత్స్వరూపమే జగత్తంతా. భాగవతమైన జగ ద్విషయాలను ఈ గ్రంథం వివరిస్తుంది గనుక ఇది భాగవతం. సనాతన సంప్ర దాయానుసారం భారతీయ విజ్ఞానాన్ని భాగవతం ప్రదర్శిస్తుంది. శ్రీశుకయోగి పరీక్షిన్మహారాజునకు విరాట్ స్వరూపం వివరించడం, నారదునకు బ్రహ్మ ప్రపంచ ప్రకారం చెప్పడం-ద్వితీయస్కంధంలో కనబడుతుంది. పంచమ స్కం ధంలో శ్రీశుకులు చేసిన భూగోళవర్ణన ఉంది. నవమస్కంధంలో భవిష్యద్రాజ వంశాల, చంద్రవంశరాజుల వివరణ ఉంది. ద్వాదశస్కంధంలో శ్రీశుకయోగి చెప్పిన భావికాలగతులు, యుగధర్మాలు, ప్రాకృతాది ప్రళయ విషయాలు

ఉన్నాయి. ధ్రువచరిత్రలో ధ్రువక్షితిని వివరించేటప్పుడు శ్రీభగవానుడు పలికిన పలుకులు మన పూర్వుల జ్యోతిష విజ్ఞానాన్ని తెలిపేవిగా ఉన్నాయి. ఈ సందర్భంలో పోతన ఇలా వ్రాశారు: "అట్టి దురాపంబును, ననన్యాధిష్ఠితంబును, లోకత్రయప్రళయ కాలంబునందు నశ్వరంబుగాక ప్రకాశమానంబునునైన ధ్రువక్షితియను పదంబు ముందట నిరుపదియాఱువేలేండ్లు సంప్రాపింతువు." దీని వెనుక "విషువచలనం" (Precession of the Equinoxes) అనే ఖగోళసత్యం ఇమిడి ఉంది! ఈ విధంగా శ్రీమద్భాగవతం భారతీయ విజ్ఞాన సర్వస్వంగాను, భక్తి రసాయన సింధువుగాను తత్త్వజిజ్ఞాసాకోశంగాను దర్శనమిస్తుంది.

సంస్కృతంలో దేవీ భాగవతం కూడా ఉండడంవల్ల, "భాగవతం" అన్నప్పుడు, విష్ణుమూర్తి వారి అవతార విశేషాదులను వర్ణించిన భాగవతాన్ని గ్రహించాలా? లేదా దేవ్యవతార విశేషాలను అభివర్ణించిన దేవీభాగవతాన్ని గ్రహించాలా? అనే ప్రశ్న పండితలోకంలో ఉదయించింది. అష్టాదశపురాణాలను పేర్కొనేటప్పుడు- "మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వ చతుష్టయమ్। అ, నా, ప, లిం, గ, కూ, స్కా- ని పురాణాని పృథక్ పృథక్॥" అనే శ్లోకం దేవీభాగవతంలోనిదాన్ని గుర్తుగా గ్రహించడం ఉంది. దీన్నిబట్టి-మత్స్య, మార్కండేయ-భవిష్య- భాగవత-బ్రహ్మ,బ్రహ్మాండ, బ్రహ్మవైవర్త-వరాహ, వామన, వాయు, విష్ణు, అగ్ని, నారద, పద్మ, లింగ, గరుడ, కూర్మ, స్కాంద-పురాణాలు లెక్కకి వస్తాయి. అష్టాదశోపపురాణాలు కూడా ఉన్నాయి. ఇంకా వీటిలో వేటిలోను చేరని చాలా పురాణాలు కాలక్రమంగా బయలుదేరాయి. పంచలక్షణలక్షితమైనది "పురాణం" అన్నారు; కాని, అనిర్వచనంబాలక దశలక్షణాలను క్రమంగా పేర్కొన్నారు. "పురాణం పంచలక్షణమ్" అని, తాను పరిశీలించిన పురాణాల విషయాన్ని విశ్లేషించి చూచి అమరసింహుడు ఒక నిర్వచనం ఇలా ఇచ్చారు.

> "సర్గశ్చ ప్రతి సర్గశ్చవంశో మన్వన్తరాణి చ ।
> వంశాను చరితం చేతి లక్షణానాంతు పంచకమ్॥"

స్థూలంగా చెప్పాలంటే-సర్గంలో ఆది సృష్టి విషయం; ప్రతిసర్గంలో (దీనికి విసర్గం అని కూడా పేరుంది) కల్పాంతంలో జరిగే పునస్సృష్టి విష

యాలు; వంశంలో-దేవతల, దేవర్షి బ్రహ్మర్షుల గోత్రాను క్రమం; మన్వంతరంలో-ధర్మశాస్త్ర ప్రవర్తకులైన చతుర్దశమనువుల చరిత్రాదికం; వంశాను చరితంలో-సూర్యచంద్ర వంశాలలో ఆవిర్భవించిన మహారాజుల చరిత్రలు; ఉంటాయన్న మాట, సామాన్యంగా పురాణాలలో-జగదుత్పత్తి; వికాసక్రమం, వేదాదుల ననుసరించిన ధర్మానుష్ఠానాలు, వివిధ కాలాలలో వాటి ననుష్ఠించి, అనుష్ఠింపజేసిన మహాపురుషుల జీవిత చిత్రణలు; దుష్ట శిక్షణ, శిష్టరక్షణ కర్తవ్యంగా భువినవతరించిన భగవంతుని అవతార విశేషాలు-కనబడతాయి. ఈ పంచలక్షణాల నిర్వచనం అవ్యాప్తిదుష్టమైనట్లుగా భావించి కాబోలు శ్రీమద్భాగవతం, పురాణం దశలక్షణలక్షితమై ఉండాలనీ, పంచలక్షణాలు అల్పపురాణాల (ఉపపురాణాల) విషయమని చెప్పింది:

> "పురాణలక్షణం బ్రహ్మన్ బ్రహ్మర్షిభిర్నిరూపితమ్ ।
> శృణుష్వబుద్ధి మాశ్రిత్య వేదశాస్త్రానుసారతః ॥
>
> సర్గోఽస్యాథ విసర్గశ్చ వృత్తిరక్షాన్తరాణి చ ।
> వంశోవంశానుచరితం సంస్థా హేతురపాశ్రయః ॥
>
> దశభిర్లక్షణైర్యుక్తం పురాణం తద్విదో విదుః ।
> కేచిత్పంచవిధం బ్రహ్మన్ మహదల్ప వ్యవస్థయా ॥"
> (శ్రీమద్భాగవతమ్ XII-అధ్యా: 7; శ్లో-8, 9, 10)

పంచలక్షణాలకు-వృత్తి, రక్ష, సంస్థ, హేతువు, అపాశ్రయం అనే అయిదింటిని చేర్చింది శ్రీమద్భాగవతం- వివిధ జీవుల జీవకల్పన వర్ణన వృత్తి; శ్రీహరి ప్రతియుగంలోను వేదధర్మోద్ధరణకై ఎత్తే-దేవర్షినరతిర్యగవతారాల వర్ణన-రక్షణ; వివిధ ప్రళయాల-నిత్యనైమిత్తిక ప్రాకృతికాత్యంతిక ప్రళయాల-విరూపణ వర్ణన-సంస్థ; అవిద్యచేత కర్మకు కర్తయై సర్గాది విషయాలకు నిమిత్తుడైన జీవుని వర్ణన-హేతువు; సాక్షిరూపంగా అన్వితుడు, సమాధ్యాదులందు వ్యతిరిక్తుడు అయిన పరమాత్ముని వర్ణన-అపాశ్రయం. తాను స్వీకరించిన విషయాలకు అనుగుణంగా శ్రీమద్భాగవతం ఈ నిర్వచనం చేసినట్లు కనబడుతుంది. ఈ నిర్వచనం అన్వయించని పురాణాలు ఉన్నాయి. ఈ నిర్వచనం వ్యాప్తిగలిగినట్లులేక, బ్రహ్మవైవర్త పురాణం "దశాధిక లక్షణం" చెప్పింది.

"సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణి చ।
వంశాను చరితం విప్ర! పురాణం పంచలక్షణమ్ ॥

ఏతదుపపురాణానాం లక్షణం చవిదుర్బుధా
మహతాంచ పురాణానాం లక్షణం కథయామితే
సృష్టిశ్చాపివిసృష్టిశ్చ స్థితిస్తేషాంచ పాలనమ్
కర్మణాం వాసనా వార్తా మనూనాంచ క్రమేణచ
వర్ణనం ప్రలయానాంచ మోక్షస్యచ నిరూపణమ్
ఉత్కీర్తనం హరే రేవదేవానాంచ పృథక్ పృథక్
దశాధికలక్షణం చమహతాం పరికీర్తితమ్ ॥"

(బ్రహ్మ వైవర్త పురాణమ్-శ్రీకృష్ణ జన్మ ఖండం)

దీనిలో చెప్పిన-సృష్టి, విసృష్టి, మను ప్రకాశ క్రమాలు పంచలక్షణాలలోని సర్గ, ప్రతిసర్గ, మన్వంతరాల వంటివే! స్థితి, పాలనలు వంశవంశాను చరితాలను పోలినవే! భాగవతం చెప్పిన "సంస్థ"లో చేరిపోతుంది ప్రళయవర్ణన. హరికీర్తనం, ఇతర దేవతల గుణవర్ణన మొదలైనవి బ్రహ్మవైవర్త పురాణానికి సంబంధించిన విశిష్టవిషయాలేగాని పురాణసామాన్యానికి అన్వయించవు. మత్స్య పురాణంలో కూడా పురాణ నిర్వచనం కనబడుతోంది. ఇవన్నీ, తమలో విశిష్టంగా ఉన్న వాటిని పంచలక్షణోక్త విషయాలతో కలిపిచెప్పి పురాణసామాన్య లక్షణాలుగా చెప్పాలని ప్రయత్నించాయి.

పూర్వమీమాంసకుడు కుమారిలభట్టు కూడా పురాణ ప్రసక్తిని తన తంత్ర వార్తికంలో తెచ్చి— అవి చతుర్విధ పురుషార్థ సాధనకు సాధకాలనీ, స్మృతులకు పురాణాల వల్లనే ప్రామాణికత్వం సిద్ధిస్తుందనీ, వాటిలో వేదంలోని విషయాలే నోదాహరణంగా నిరూపితాలనీ, వాటిలో లౌకికమైనవి అనేకం ఉంటాయనీ— విపులంగా వివరించాడు. ఈ విపులవ్యాఖ్యానం చూస్తే, పురాణాలలో లేనిదేదీ ఉండదనిపిస్తోంది ("తేన సర్వస్మృతీనాం ప్రయోజనవతీ ప్రామాణ్యసిద్ధిః । తత్ర యావద్ధర్మమోక్షసంబంధితద్వేద ప్రభవం । యత్త్వర్థ సుఖ విషయం తల్లోక వ్యవహారపూర్వకమితివివేక్తవ్యం। ఏషైవేతిహాసపురాణ యోరప్యుపదేశవాక్యానాం గతిః॥ ఉపాఖ్యానానిత్వర్థవాదేషువ్యాఖ్యాతాని।యత్తు వృథివీవ్యాపారకథనం తద్ధర్మా

ధర్మ స్మరణ మూలం। దేశకాలపరిమాణమపిలోక జ్యోతిఃశాస్త్ర వ్యవహారసిద్ధ్యర్థం దర్శన గణిత సంప్రదాయానుమానపూర్వకమ్। ఖావి కథనమపి త్వనాదికాల ప్రవృత్తయుగ స్వభావధర్మాధర్మానుష్ఠాన ఫలవిపాకవైచిత్ర్య జ్ఞానద్వారేణ వేద మూలమ్ .. ॥")

ఇంత విస్తృత పరిధిలో విషయ వివరణ చేసే స్వభావమున్న పురాణాలను పరిమిత సూత్ర బద్ధంచేసి నిర్వచించడం అసూహ్యం అనవచ్చును. వాటివిషయం-కేవలం శ్రుతిస్మృతులకు మాత్రమే సంబంధించినదికాదు. వాటికి అవిరోధమైన సమస్త విషయాలు పురాణానికి ఉపాదేయాలే ! ఇది గుర్తించిన నారదీయ పురాణం-పురాణాన్ని గురించి ఇలా అంది :

"యన్నదృష్టం హి వేదేషు తత్సర్వం లక్ష్యతేస్మృతౌ ।
ఉభయోర్యన్నదృష్టం హితత్పురాణైః ప్రణీయతే ॥"

శ్రుతిస్మృతులలో దృష్టంకాని అనేక విషయాలు పురాణాలలో కనబడతాయి. దేశ కాలపాత్రానుసారంగా వివిధ విషయాల వివరణ పురాణాలలో ఉంటుంది. అన్నీ అన్ని పురాణాలలో ఉండాలి అనే నియమంలేదు. అన్ని లక్షణాలు అన్ని పురాణాలకు పట్టాలి అనిలేదు. ఇట్టి పరిస్థితులలో ఏ నిర్వచనం చేసినా దానికి అవ్యాప్తి దోషంగాని, అతివ్యాప్తి దోషంగాని పట్టవచ్చును. కాబట్టి నిర్వచనాలను కొంత గురుతులుగానేగ్రహించవలసి ఉంటుంది.

ఇంక పురాణాన్ని సరిగా అర్థం చేసుకొనే విషయంలో వాడిన భాషకు విశేష ప్రాముఖ్యంఉంది. ఈ భాషనుగూర్చి "పురాణసంహిత" ఇలా అంటోంది :

"సమాధి భాషా ప్రథమా. లౌకికేతితథాపరా ।
తృతీయా పరకీయేతి, శాస్త్ర భాషాత్రిధాస్మృతా ॥"

విషయగాంభీర్యాన్ని పురస్కరించుకొని ప్రయోగించిన భాషనిట్లు వింగడించారు పెద్దలు. సమాధిగమ్యాలైన గహనగంభీరతాత్త్విక విషయాల నిరూపణ జరిగిన భాష-సమాధిభాష. ఈ విషయాలనే సులభంగా గ్రహించడానికి వీలుగా లౌకిక విషయాల పోలికతో రూపకాద్యలంకారాలతో వివరించి చెప్పిన భాష-లౌకికలేదా లౌకిక భాష. కథేతిహాసాలతోబాటుతో ఉదాహరణలను జోడించి గంభీర విషయాలను, ధార్మికవిషయాలను పోవవర్తికంగా వివరణాత్మకంగా

చెప్పడం—వరకీయభాష. వేదోపనిషత్తులు మొదలుకొని పురాణాదుల వరకు గల సమస్త వాఙ్మయ ప్రపంచంలో ఈ త్రిభాషలు గోచరిస్తాయి. అధికారుల తార తమ్యాన్ని బట్టి ఈ భాషా ప్రయోగం ఉంటుంది. ఈ మూడింటి ప్రయోగ బాహుళ్యంలో తరతమభావం ఉండవచ్చును. ఒక విధంగా ఇవి సత్త్వరజస్తమోగుణాల హెచ్చుతగ్గులవలె భాసిస్తాయి. విషయానుకూలంగా ఒకే గ్రంథంలో ఈ మూడు చోటు చేసుకోవచ్చును. ధార్మికనైతిక తాత్త్విక విషయాల ప్రబోధం ఏ భాషలో లేదా ఏ భాషలలో చేస్తే బహుజనహితం జరుగుతుందో ఆ భాషను లేదా ఆభాష లనుమహర్షి కల్పులైన ప్రాచీనకవులు తమరచనలలో ప్రయోగించారు. శ్రీ మద్భాగవతాన్ని గురించి వ్రాస్తూ శ్రీవల్లభాచార్యులు, అది-"సమాధిభాషా వ్యాసస్య" అన్నప్పుడు దానివైశిష్ట్యం చెప్పడం ఆయనదృష్టి.

పురాణం దశలక్షణ లక్షితమై ఉండాలని చెప్పిన శ్రీమద్భాగవతమే "అష్టాదశ పురాణాల"ను పేర్కొందికూడా :

"బ్రాహ్మం పాద్మం వైష్ణవంచ శైవం లైంగం చగారుడమ్।
నారదీయం భాగవత మాగ్నేయం స్కాంద సంజ్ఞితమ్ ॥
భవిష్యద్బ్రహ్మ వైవర్తం మార్కండేయం సవామనమ్ ।
వారాహమాత్స్య కౌర్మాణి బ్రహ్మాండాఖ్యమితి త్రిషట్ "

(శ్రీమద్భాగవతమ్ xii అధ్యా : 7 ; శ్లో—23, 24)

చెప్పిన వరుసలో భేదం ఉన్నా పరంపరయా వ్యాప్తిలో ఉన్న అష్టాదశ పురాణాలే ఇందులోను ఉన్నాయి.

ప్రాచీన పురాణాలు—అష్టాదశ పురాణాల పేర్లను చెప్పడంతో తృప్తిపడక వాటిని—సత్త్వరజస్తమోగుణాత్మకంగా విభజించాయికూడాను. పద్మపురాణం లోని గుణత్రమ విభాగం ఈ విధంగా ఉంది : సాత్త్వికపురాణాలు-శ్రీమన్నారాయణ పారమ్యాన్ని వ్యక్తీకరిస్తాయి. ఇవిమోక్షప్రదాలు, వీటిలో-వైష్ణవ, నారదీయ, భాగవత, గారుడ, పాద్మ, వారాహ పురాణాలు గణనకు వస్తాయి. రాజసపురాణాలు-స్వర్గప్రదాలు. వీటిలో ప్రధానంగా-సరస్వతీ చతుర్ముఖుల, అగ్ని దేవతాస్తుతులుంటాయి. వీటిలో బ్రహ్మాండ, బ్రహ్మవైవర్త, మార్కండేయ, భవిష్య, వామన, బ్రాహ్మపురాణాలు చేరతాయి. తామసపురాణాలు పతన యోగ్యాలుకావనదంఉంది. వీటిలో-మాత్స్య, కౌర్మ, లైంగ శైవ, స్కాంద,

ఆగ్నేయ పురాణాలున్నాయి. ఈ పేర్లే చెప్పేటట్లు ఆయాపురాణాలలో ఆయా దేవతల ప్రాముఖ్యం అభివర్ణితమైనది.

ఈ విభజనను స్కాందపురాణం అంగీకరించక శివపారమ్యాన్ని తెలియ జేయాలాఅన్నట్లు-శివపారమ్యాన్ని తెలియ జేసేవి పదిఉన్నాయనీ : బ్రహ్మను గూర్చిచెప్పేవి నాలుగున్నాయనీ , హరిని గురించి, దేవిని గురించి చెప్పేవి చెరి రెండూ అని తన పక్షపాతబుద్ధిని ప్రదర్శించింది :

"అష్టాదశపురాణేషు దశ భిర్గీయతేశివః
చతుర్భిర్భగవాన్ బ్రహ్మ ద్వాభ్యాం దేవీతథాహరిః ॥"

స్కాందపురాణం వ్యక్తంచేసిన అభిప్రాయంతో ఏకీభవించేవారు అత్యం తాల్పసంఖ్యాకులు అనడంలో సంశయంలేదు. ఏవి సాత్త్వికపురాణాలు, ఏవి రాజసిక తామసికాలు అనేవాటి విషయంలోను అభిప్రాయ భేదాలున్నాయి. ఈ విషయమై ప్రాచీన పురాణమైన మత్స్యపురాణం ఇలా అంది :

"సాత్త్వికేషుపురాణేషు మాహాత్మ్య మధికం హరేః ।
రాజసేషు చ మాహాత్మ్య మధికం బ్రహ్మణో విదుః ॥

తద్వదగ్నేశ్చ మాహాత్మ్యం తామసేషు శివస్యచ ।
సంకీర్ణేషు సరస్వత్యాః పితౄణాంచ నిగద్యతే ॥"

ఈ పురాణం—సాత్త్విక, రాజసిక, తామసిక విభజనతో తృప్తి చెందక "సంకీర్ణ" అనే నాల్గవ విభాగాన్ని తెచ్చి దానిలో సరస్వతి, పితృదేవతల మహి మలనుచేర్చింది

ఆధునికులలో శ్రీ హరప్రసాదశాస్త్రి పురాణ వాఙ్మయాన్ని తలస్పర్శిగా పరిశీలించి, విషయాన్ని అనుసరించి ఆవాఙ్మయాన్ని ఆరు విభాగాలుగా వర్గీక రించారు. ఈనాడు విద్వాంసులందరు ఈ విభజనను అంగీకరిస్తున్నారు. దీని ప్రకారం విజ్ఞాన సర్వస్వాలవంటి పురాణాలు—గారుడ, ఆగ్నేయ, నారదీయ పురాణాలు; తీర్థవ్రత మాహాత్మ్య వర్ణనాత్మక పురాణాలు-పాద్మ, స్కాంద, భవి ష్యపురాణాలు ; విశేషంగా పూర్వోత్తర భాగాలలో ప్రక్షిప్తాలున్న పురాణాలు- బ్రాహ్మ, భాగవత, బ్రహ్మవైవర్త పురాణాలు; ఐతిహాసిక ప్రసంగ బాహుళ్యమున్న

పురాణాలు-బ్రహ్మాండ, వాయుపురాణాలు; మతశాఖా ప్రాధాన్యమున్న పురాణాలు శైవమత సంబంధిలైంగం, వామనం-శాక్తేయ విషయాత్మకమైన మార్కండేయ పురాణం ; విష్ణ్వవతారనామాత్మక పురాణాలు – మాత్స్య, కౌర్మ, వారాహ పురాణాలు.

ఏ అంశాన్ని మానదండంగా గ్రహించి విభజన చేసినా కొంత అవ్యాప్తి, కొంత అతివ్యాప్తి తప్పదనిపిస్తుంది. దీనికి ముఖ్య కారణంగా-వివిధ పురాణాల సంకీర్ణవిషయ సామగ్రి అని చెప్పాలి. అచ్చులేని ఆ దినాలలో-పాఠభేదాలు, ప్రక్షిప్తాలు, ప్రాంతీయ ఆలోచనా విధానాలు, వివిధ ధార్మిక శాఖల ప్రాదుర్భావం మొదలైనవి ఏ పురాణంలోను-అంగాంగి సామరస్యం, ఐక్యలక్షణం, ఉపాఖ్యానాల పూర్వాపరసంబంధం లేకుండా చేసి, పురాణాల కాయాలను బృహత్ప్రమాణాలలో పెంచివేశాయి. పాతకొత్తలు-మేలుకలయికగా కాకపోయినా-కలిసిపోయాయి. ఈ పరిస్థితులలో పురాణాలు "కలగూరగంప"లు కాకతప్పదుగదా ! అయినా, ఆధునిక విద్వాంసుల దృష్టిలో-వాయు, బ్రహ్మాండ, మత్స్య, విష్ణుపురాణాలు-మిగిలిన పురాణాలకంటె ప్రాచీనమైనవని. పంచలక్షణలక్షితాలై, ప్రక్షిప్తాలు తక్కువగా ఉన్న పురాణాలు, విభిన్న విషయ బాహుళ్యంతో ఉన్నపురాణాలకంటె ప్రాచీనాలని గ్రహించారన్నమాట !

ఈ సందర్భంలోనే, ఉపపురాణాలను గూర్చి కూడా కొంత పరిశీలించుకోవడం ఆవశ్యకం. ఉపపురాణాల ప్రస్తావన మత్స్య పురాణంలో కనబడుతోంది. నారసింహనంద్యాదిత్య సాంబపురాణాలను మత్స్యపురాణం ఉపపురాణాలుగా పేర్కొన్నది. ఈ ఉపపురాణాలుకూడా అష్టాదశ సంఖ్యలోనే ఉన్నాయి :

"అష్టాదశ్యుప పురాణాని మునిభిః కథితాని
ఆద్యం సనత్కుమారోక్తం నారసింహమతః పరం
తృతీయం వాయవీమంచ కుమారేణాను భాషితం
చతుర్థం శివధర్మాఖ్యం సాక్షాన్నం దీశ భాషితం
దుర్వాససోక్త మాశ్చర్యం నారదీయమతః పరం
నందికేశ్వరయుగ్మంచ తథైవోశనసేరితం
కాపిలం వారుణం సాంబం కాలికాహ్వయ మేవచ

మాహేశ్వరం తథాదేవి దైవం సర్వార్థ సాధకం
పరాశరోక్తమపరం మారీచం భాస్కరాహ్వయం ॥"

మహాపురాణాల పద్ధతిలోనే ఉపపురాణాలు కూడా అష్టాదశ సంఖ్యలో ఉన్నట్లు సంప్రదాయంలో ఉన్నప్పటికీ, అవి లెక్కలేనన్ని ఉన్నట్లు తెలుస్తోంది. స్కాందపురాణంలో, ఉపపురాణాలు లక్షదాకా ఉన్నట్లు చెప్పబడిఉంది. ఆధునిక పురాణ పరిశోధకులలో ఆచార్య ఆర్. సి. హజ్రా ఉపపురాణాలమీద చేసిన తన పరిశోధనా గ్రంథంలో వందవరకు వాటిని లెక్కించిచూపించారు. ఇవి చాలా వరకు అముద్రితాలే. మహాపురాణాలలోని వివిధ విషయాలను వేరువేరుగా తమ పరిమితోపయోగం కోసంపురోహితులు మొదలైన వారు వ్రాసి ఉంచుకొని ఉండవచ్చుననీ కాలక్రమంగా అవి వేరే గ్రంథాలుగా వ్యాప్తిలోకి వచ్చి ఉండవచ్చుననీ కొందరు పండితులంటున్నారు. కూర్మపురాణం ఈ అభిప్రాయాన్నే వ్యక్తం చేసింది. పండితలోకంలో వీటికి ప్రామాణ్యం కూడా తక్కువగానే ఉంది. కాలంతో బాటు వీటి సంఖ్యకూడా పెరుగుతూ వచ్చింది. ఇప్పటికీ కులాలప్రాతిపదికం మీద ఇవికొత్తవి బయలుదేరుతూనే ఉన్నాయిగదా !

ఈ శతాబ్దిలో, ఉత్తరభారతంలో ఆర్యసమాజ ప్రభావంవల్ల వీటి ప్రాధాన్యం కొంతతగ్గినా, ఆ సమాజం చేసిన ఆరోపణలను పరిశీలించడంకోసం వీటి అధ్యయనమూ ఆధునికకాలంలో పెరిగింది. ఇవి "పుక్కిటిపురాణాలు "అని కొట్టి పార వేస్తున్న ఈకాలంలోనే వీటి "స్వస్వరూపం" గ్రహించాలి అనే దృష్టికూడా అధిక మైంది. ఇంచుమించుగా ఇప్పుడు విద్యావంతులందరూ-భారతీయ సంస్కృతి వికాసంలో, ధార్మిక జీవిత ప్రగతిలో-వీటి పాత్రను అర్థంచేసుకొన్నారనే అనాలి. భారతేతిహాసాన్ని, భాగవతపురాణాదులను అధ్యయనం చేసిన, చేస్తున్న ప్రాచ్య పాశ్చాత్య విద్వాంసులందరూ-ఇతిహాస, పురాణాలకు మధ్య నున్న సంబంధం, వేదోపనిషత్తులకు వీటికి నడుమ నున్న సన్నిహితత్వం, ప్రజల జీవిత విధానాలను తీర్చిదిద్దడంలో ఇవినిర్వహించిన, నిర్వహిస్తున్న ప్రధాన పాత్రను అర్థంచేసు కొన్నారనాలి.

భారతీయ సంస్కృతికి, ప్రజల ధార్మిక నైతిక జీవితానికి పునాది వేద ధర్మం. వేలకొలది సంవత్సరాలు గడిచినా; విదేశీయుల దండయాత్రలు చాలా సార్లు జరిగి ఈ పునాదిని భగ్నం చేద్దామనే దృఢసంకల్పంతో ఆయా పరప్రభు

త్వాలు కట్టుదిట్టంగా ప్రయత్నాలు చేసినా ; ఇక్కడే పుట్టిపెరిగి ప్రజల హృదయాలను ఆకట్టుకొని ప్రచారాన్ని పొంది, ప్రాబల్యాన్ని సంపాదించి కతాబ్దాలకాలం ప్రభుకనెరపిన అవైదిక ధర్మాలు ఎంత విజృంభించినా ; వేదధర్మవాహిని నాటినుండి-అంటే నిష్కర్షగా నిర్ణయించడానికి వీలులేని కాలంనుండి అన్నమాట (ఒక మాటలో అనాదినుండి)-నేటిదాకా (దేశకాల పరిస్థితులననుసరించి అప్పుడప్పుడు కృశించినా) రూపుచెడకుండ ప్రవహిస్తూవస్తోందంటే-దానికి పురాణాలే ముఖ్యకారణం. ఈ పురాణాల వైవిధ్యం సంప్రదాయవైవిధ్యానికి దారితీసి-తమకు చెందని భారతీయ సంప్రదాయాలను కూడా గౌరవించడం, లేదా వాటి విషయంలో తాటస్థ్యం వహించడం (నచ్చనప్పుడు)-ప్రజాబాహుళ్యానికి నేర్పింది. "ఏకంసత్ విప్రా బహుధావదంతి" అనీ శ్రుతి తెలిసినా తెలియకపోయినా-అన్ని సంప్రదాయాలకు మూలం వేదధర్మమే అనే ప్రగాఢ విశ్వాసం ప్రజలలో నెలకొల్పినవి ఈ పురాణాలే. చదువు సంధ్యలులేని పామరులుకూడా-తెలిసినా, తెలియక పోయినా-వివిధ సంప్రదాయాలను తూలనాడకపోవడానికి, వాటిని ద్వేషించకపోవడానికి (అప్పుడప్పుడు అసహిష్ణుత-అజ్ఞానంచేత, అహంకారంచేత, తలఎత్తినా) కారణం, పురాణ సంప్రదాయవైవిధ్యం వారిలో-అజ్ఞాతంగానైనా-తెచ్చిన విశాలదృష్టి ! ఇది నేటికీ కనబడుతూ సర్వులకు విదితంగా ఉంది! మన పూజాగృహాలలో-సంతోషిమా, అయ్యప్ప మొదలైన చిత్రపటాలు, శ్రీ వేంకటేశ్వరస్వామి మొదలైన సంప్రదాయసిద్ధాలైన వాటి పక్కన కనబడుతూ ఉండడం అది ఏదో విశేషంగా ప్రజలు భావించకపోవడం-ఈ సహనదృష్టికి ప్రత్యక్ష నిదర్శనాలు. "సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి", అనే వాక్యం, "యేయథామాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహమ్ ! మమవర్త్మానువర్తంతే మనుష్యాః పార్థసర్వశః" అనే గీతాశ్లోకం తెలియకపోయినా-అతిసామాన్యులైనటువంటి సనాతన ధర్మావలంబులలో కూడా ఈ సంస్కారం నిహితమై ఉండడానికి పురాణాల సంప్రదాయవైవిధ్యమే ముఖ్యకారణం అనడం సత్యదూరంకాదు ! ఇతరదేశాలనుండి ఇక్కడికి వచ్చి, మన వారి నాకర్షించి, స్థిరపడి, ఇక్కడివే అయిపోయిన-క్రైస్తవ, ఇస్లాం మతాల విషయంలో కూడా జనబాహుళ్యంలో ఉదార సహన దృష్టి ఉండడానికి కూడా కారణం-విశ్వాసాలలో విశిష్టతలు, అర్చనా విషయంలో విభిన్నతలు, ఆచార వ్యవహారాదులలో కొత్తదనం-జనబాహుళ్యానికి కొత్తకాకపోవడమే ! ఇందువల్లనే-" మనవి ఇలా ఉన్నాయి, వాళ్లవి అలా

ఉన్నాయి" అని ఆదరాభిమానాలతో, గౌరవ మర్యాదలతో అనుకోగలుగుతున్నారు. దీనికి వ్యతిరేకత ఎక్కడేనా తలఎత్తుతే అది అపవాదం అనుకోవాలి! సూత్రం మాత్రంకాదు! స్మృతులవల్ల, ఆచార వ్యవహారాదులవల్ల, ప్రజల స్వార్థసంకుచిత దృష్టివల్ల సమాజంలో అసమానతలు వెల్లితలలు వేసినప్పుడు వాటిని సంపూర్ణంగా సంస్కరించడానికి ప్రయత్నాలు ఎప్పుడూ జరుగుతూనే వచ్చాయి ప్రభుత్వం శాసనాలు చేస్తూనేవచ్చింది. తాత్కాలికంగా అక్కడక్కడ కొంత వ్యతిరేకత తలఎత్తినా, అది ప్రజల సానుభూతినిగాని, ఆదరాన్నిగాని పొందక నశిస్తూనేఉంది. దీనికి ముఖ్యకారణం-ఈ స్మృతులకంటె, ఈ ఆచార వ్యవహారాదుల కంటే పైగా ఒక శ్రుతిసమ్మతమైన సత్యమున్నదనీ అదేపరమార్థమనీ ప్రజలలో అంతర్గర్భితంగా విశ్వాసం ఉండడమే! పురాణాల ద్వారా ప్రచారానికి వచ్చిన భాగవతధర్మం ఈ విశ్వాసాన్ని బలపరిచింది.

వేదధర్మాన్ని ప్రజలలో సుప్రతిష్ఠితం చేసిన సాధనం పురాణం. ఈ విషయాన్నే నారదీయ మహాపురాణం "వేదాః ప్రతిష్ఠితా స్సర్వేపురాణేష్వే వసర్వదా" అని చెప్పింది. ఈ విషయాన్నే ఇంకో విధంగా ఇలా చెప్పింది స్కాందం :

"వేదవన్నిశ్చలం మన్యేపురాణార్థం ద్విజోత్తమా ।
వేదాః ప్రతిష్ఠితా స్సర్వేపురాణే నాత్రసంశయః॥"

శ్రీ వ్యాసవిరచిత మహాభారతం కూడా ఈ విషయాన్ని "ఇతిహాస పురాణాభ్యాం వేదం సముపబృంహయేత్" అని చాటింది. వేదవేదాంగాలు ఉపనిషత్తులు తెలుసుకొన్నా, పురాణ విజ్ఞానంలేని ద్విజుడు విచక్షణుడు కాలేడని వాయుపురాణం ఇలా అన్నది :

"యోవిద్యాచ్చతురో వేదాస్సాంగోపనిషదో ద్విజః ।
నచేత్పురాణం సంవిద్యా న్నైవ నస్యాద్వి చక్షణః॥"

పురాణ వైశిష్ట్యాన్ని గురించి దేవీభాగవతం ఇలా అన్నది :

"శ్రుతిస్మృతీ ఉభేనేత్రే పురాణం హృదయమ్ స్మృతమ్।
ఏతత్త్రి యోక్తఏవస్యాద్ధర్మో నాన్యత్ర కుత్రచిత్ ॥"

పరమేశ్వరునకు శ్రుతిస్మృతులు నేత్రాలు. పురాణంహృదయం. నేత్రాలతో

దర్శించినదాని చింతనం హృదయంలో జరుగుతుంది. కనుక. పురాణం ధర్మాధర్మ నిర్ణయ దక్షమైనదని తాత్పర్యం. దీనికి నీలకంఠుని "తిలక" వ్యాఖ్యలో ఇలా వివరణ ఉంది :

> "ఉభేనేత్రే పరమేశ్వర స్యేత్యర్థః చక్షుర్వై సత్యమితి శ్రుతేః
> పరమేశ్వరేణ శ్రుతిస్మృతిరూప చక్షుర్భ్యాం దృష్టోధర్మః
> సత్యః । చక్షుషా దృష్టమేవ మనసి నోతీతి పురాణ రూప
> హృదయే నిశ్చితో ధర్మోఽపి సత్య ఇత్యర్థః"

దేవీభాగవతం ఈ విధంగా పురాణ ప్రాధాన్యాన్ని వివరించింది. వాజసనేయీ బ్రహ్మణోపనిషత్తు, వేదాలు, పురాణేతిహాసాలు పరమేశ్వరుని నిశ్వాస రూపాలని వర్ణించింది :

> "అస్యమహతో భూతస్య నిశ్వ్వసితమే తద్యదృగ్వేదో
> యజుర్వేద స్సామవేదోఽ ధర్వాంగిరస ఇతిహాసః పురాణమ్॥"

దీనినిబట్టి మన ప్రాచీనులు వేదంతో సమప్రాధాన్యాన్ని ఇతిహాస పురాణాలం కిచ్చారని వ్యక్త మవుతోంది !

ఛాందోగ్యోపనిషత్తులో. సర్వవిషయాలు తెలుసుకొన్న నారదమహర్షికి చిత్త శాంతిలేక, బ్రహ్మమానస పుత్రుడైన సనత్కుమారుని దగ్గిరికి పోయి తన బాధ చెప్పుకొన్నట్లుగా ఉంది. ఆ సందర్భంలో నారదుడు తన జ్ఞానాన్ని గూర్చి ప్రకటించుకొంటూ ఇలా అంటారు :

ఋగ్వేదం భగవోఽధ్యేమి యజుర్వేదం సామవేద మాథర్వణం చతుర్థం ఇతిహాసపురాణం పంచమం వేదానాంవేదం పిత్ర్యం రాశిం దైవం నిధిం వాకోవాక్య మేకాయనం వేదవిద్యాం బ్రహ్మవిద్యాం భూతవిద్యాం క్షత్రవిద్యాం నక్షత్రవిద్యాం సర్పదేవజనవిద్యా మేతదృగవోఽధ్యేమి, సోఽహం భగవోమంత్ర విదేవాస్మి నాత్మ విత్॥ (VII 1, 2, 3) "ఇన్ని తెలుసుకొన్నా-కేవలం మంత్రాలు తెలుసుకొన్నాను వాటిఆత్మను-అంతర్యాన్ని-గ్రహించలేక పోయాను" అంటాడు. ఇక్కడ వేదాలలో ఐదవదైన "ఇతిహాసపురాణ సంచయం" చెప్పబడింది. దీనిని బట్టి వేదోపనిషత్తుల కాలంలో ఇతిహాస పురాణాలకున్న ప్రాధాన్యం తెలుస్తోంది. ఇదేవిధంగా,

వ్యాసమహర్షి విషయంలోను-కొంత భేదంతో-జరిగింది. ఛాందోగ్యంలోని నారదుడు "పాండిత్యం ఎంత పెరిగినా వస్తుతత్త్వం అవగతం కాలేదే!" అని వాపోయినట్లే శ్రీమద్భాగవత రచనకు ముందు వ్యాసుడు, "అష్టా [illegible] ఇతిహాస పురాణాలన్నీ వ్రాశాను. కాని తృప్తి కలుగలేదు" అని సరస్వతీ నదీతీరంలో కూర్చుని ఆవేదన పొందాడు. తాను "ఏకంబైన వేదంబు ఋగ్యజుస్సామాథర్వణంబులను నాలుగు నామంబుల విభాగించి. యితిహాస పురాణంబులన్నియుఁ బంచమ వేదంబని" పలికినాడు. కాని, "ఆత్మ సంతసమందదాత్మలో [illegible], సం [illegible] హరికి యోగివరుల కభిలషితంబైన భాగవత విధంబు బలుకనైతి మోసమయ్యెఁ [illegible]" త్రిలోకసంచారి అయిన నారదుడు- "తన వల్లకీ తంత్రీ చయంబున సతత నారాయణ శబ్దము [illegible]" వ్యాసుని ఆశ్రమానికి వచ్చాడు. వ్యాసునిచేత [illegible] సత్కారాలను పొంది నారదుడు "[illegible] వేలమిటుచు" ఇలా అంటాడు.........బ్రహ్మతత్త్వ నిర్ణేతవు, యోగినేతవు, [illegible] పరాశరాత్మజా!" అప్పుడు వ్యాసుడు:

"నీకెఱుఁగ రానిధర్మము
లోకములను లేదు, బహువిలోకివి నీవీ
నాకొఱఁత యెట్టి దంతయు
నాకున్ వివరింపవయ్య నారద! నిపుణా!"

అంటాడు. అప్పుడు నారదుడు :

"అంచితమైన ధర్మచయమంతయుఁ జెప్పితివందులోన నిం
చుక గాని విష్ణుకథలేర్పడఁ జెప్పవు, ధర్మముల్ ప్రపం
చించిన మెచ్చునే గుణవిశేషము లెన్నినఁ గాక నీకు నీ
కొంచెమువచ్చు టెల్ల హరిఁ గోరినుతింపమి నార్యపూజితా"

అని చెప్పి వ్యాసునకు ఇలాగ కర్తవ్యాన్ని ఉపదేశించాడు.

" ..... భక్తిహీనంబులయిన జ్ఞాన వాచా కర్మ కౌశలంబులు నిరర్థకంబులు గావున... ......నీవు నిఖిల బంధమోచనంబుకొఱకు వాసుదేవుని లీలా

విశేషంబులు భక్తితోడ వర్ణింపుము............ "ఇందలి గద్య పద్య భాగాలు పోతన భాగవతం I స్కంధం- 4, 5 అధ్యాయాంలోనివి) వీటి నన్నింటిని బట్టి భక్తికి మన సంస్కృతిలో ఇచ్చిన స్థానం- ముఖ్యంగా శ్రీమద్భాగవతంలో- తెలుస్తుంది. దీనితోబాటే, ఇతిహాస పురాణాలకున్న మహోన్నతస్థానం స్వయం వ్యక్తమవుతుంది.

శ్రుతి స్మృతి పురాణాలకున్న సంబంధాన్ని నారదీయ మహాపురాణం స్పష్టంగా ఇలా చెప్పింది (II-24-15,16,17 శ్లోకాలు)

"శృణు మోహిని మద్వాక్యం వేదోఽయం బహుధా స్థితః।
యజ్ఞ కర్మ క్రియా వేదః స్మృతిర్వేదో గృహాశ్రమే॥
స్మృతి ర్వేదః క్రియావేదః పురాణేషు ప్రతిష్ఠితః।
పురాణపురుషా జ్జాతం యథేదం జగదద్భుతమ్॥
తథేదం వాఙ్మయం జాతం పురాణేభ్యో న సంశయః।
వేదార్థా దధికం మన్యే పురాణార్థం వరాననే."

పురాణ పురుషుడైన పరమేశ్వరు నుండి ఈ అద్భుత జగత్తు జనించినట్లు సమస్త వాఙ్మయ ప్రపంచం పురాణం నుండి ప్రభవించింది. పురాణార్థం వేదార్థం కంటె అధికం- అనే విధంగా నారదీయ మహాపురాణం అంటే. వాయుపురాణం ఇంకా ముందుకువెళ్ళి- బ్రహ్మదేవుని ముఖం నుండి- పురాణస్మరణం తరువాతనే వేదం వెలువడింది- అంటోంది :

"పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణా స్మృతమ్।
అనంతరం చవక్త్రేభ్యో వేదా స్తస్య వినిర్గతాః॥" (I-60)

కల్పాంతంలో సృష్టిప్రారంభించే సమయంలో బ్రహ్మదేవునకు ముందుగా స్ఫురించేది, పురాకల్పంలో నుండిన పురాణపురుషునియందు గుప్తంగా ఉన్న- సృష్టి విధానమే ఇది పురాణమే!

"పురాణ" శబ్దం వేదకాలం నాటికే "ప్రాచీనం" అనే అర్థాన్ని సంతరించు కొని ఉంది ఈ అర్థంలోనే ఋగ్వేదంలో ప్రయోగాలున్నాయి. కాలక్రమంలో, ప్రాచీనమైన "కథను" గాని "గాథను" గాని పురాణశబ్దంతో వ్యవహరించడం

వచ్చింది. దీనికి ప్రయోగాలు అథర్వవేదంలో- "ఋచః సామాని ఛందాంసి పురాణం యజుషాసహ ఉచ్ఛిష్టా జ్జజ్ఞిరే సర్వే దివి దేవా దివిశ్రితః" (XI 7. 24) అని. "సబృహతీం దిశ మనువ్యచలత్తమితి హాసశ్చ పురాణంచ గాథాశ్చ నారాశగంసీశ్చాను వ్యచలన్ ఇతిహాస స్యచవై పురాణస్యచ గాథానాం చ నారాశగంసీనాంచ ప్రియంధామ భవతి, య ఏవం వేద॥" (XV . 6. 10, 11) అని ప్రయోగాలున్నాయి. గోపథ బ్రాహ్మణంలోని ఒక మంత్రంలో- బ్రాహ్మణ, ఉపనిషత్, నిరుక్త, కల్ప, ఇతిహాస, పురాణాది శబ్దాల ప్రయోగం ఇలా ఉంది: "ఏవమిమే సర్వేవేదా నిర్మితాస్సకల్పా స్సరహస్యా స్స బ్రాహ్మణా స్సోపనిషత్కా స్సేతిహాసా స్సాన్వాఖ్యాతా స్స పురాణా స్స స్వరా స్స సంస్కారా స్స నిరుక్తా స్సానుశాసనా స్సానుమార్జనా స్స వాకో వాక్యా స్తేషాం యజ్ఞ మభి పద్యమానానాం ఛిద్యతే నామధేయం యజ్ఞమిత్యేవా చక్షతే"॥

ఇదేవిధంగా శతపథ బ్రాహ్మణంలో పురాణ శబ్ద ప్రయోగం కనిపిస్తోంది "మధ్వాహుతయో హవా ఏతా దేవానాం య దనుశాసనాని విద్యా వాకో వాక్య మితిహాస పురాణం గాథా నారాశంసీత్య హరహః స్వాధ్యాయ మధీతే".

మనుస్మృతిలో శ్రాద్ధమందు వినిపింప వలసిన వాటిలో పురాణం కూడా ఉంది: స్వాధ్యాయం శ్రావయే త్పిత్ర్యే, ధర్మశాస్త్రాణి చైవహి ఆఖ్యానానీతి హాసాంశ్చ పురాణాన్యఖిలానిచ"॥

ఈ విధంగా పురాణ ప్రసక్తి వేదకాలం నుండి ఉంది. వివిధ కాలాలలో దాని ప్రాధాన్యాన్ని వివక్షిస్తూనే ఉన్నారు. పురాణాలు కేవలం చదువు సంధ్యలు లేని పామరుల నుద్దేశించి మాత్రమే బయలుదేరిన గ్రంథ సంచయం అని భావించడం చరిత్ర సత్యాన్ని గ్రహించకపోవడమే అవుతుంది. భారతీయ సంస్కృతి సౌధానికి అవి పునాదులు. మధ్యయుగంలో బయలుదేరిన వైదికాలైన వివిధ ధార్మికశాఖలకు అవి ఆలంబనాలు.

ఇంత ప్రాచీనమైన ఈ "పురాణ" శబ్దానికున్న అర్థాన్ని వివిధ ప్రమాణాల ననుసరించి గ్రహించవలసి ఉన్నది. "పురా భవమితి పురాణమ్". పురాపూర్వస్మిన్ భూతమితి పురాణమ్ (అమరకోశం- గురుబాల ప్రబోధిక)

యాస్కుని నిరుక్తంలో "పురా నవం భవతి పురాణమ్" అని ఉంది.

ప్రసిద్ధ నిఘంటువులైన శబ్ద కల్ప ద్రుమంలో "పురా భవతి పురాణమ్" అనీ, వాచ స్పత్యంలో "పురానీయతే ఇతి పురాణమ్" అనీ వివరణలు.

ఈ అర్థ వివరణల కన్నింటికి పురాణాలలోనే ఆధారాలు కనబడుతున్నాయి. వాయు పురాణంలో- "యస్మాత్పురా హ్యనక్తీదంపురాణం తేనహి స్మృతమ్ నిరుక్తమస్యయోవేద సర్వపాపైః ప్రముచ్యతే॥" (I - 1. 200) పద్మ పురాణంలో- "పురా పరంపరాం వష్టిపురాణం తేనవై స్మృతమ్" (V - 2.53) బ్రహ్మాండ పురాణంలో- "యస్మాత్పురా హ్యభూచ్చైవ తత్పురాణం తేన తత్స్మృతమ్" (I - 1. 173) మత్స్యపురాణంలో- "పురాతనస్య కల్పస్య పురాణాని విదుర్బుధాః"- అని కనబడుతున్నాయి.

వీటి నన్నింటిని పరిశీలించగా- చిరకాలం క్రిందట జరిగినవనీ, పూర్వకాలం సమీపంగా ఉన్నవనీ, పురాతన విషయాలను చెప్పేవనీ- అనేక విధాలుగా అర్థాలు కనబడుతున్నాయి. ఏది ఏమయినా- వీటి పురాతనత్వ విషయంలో ఏకవాక్యత ఉందనాలి!

ఇవన్నీ ఇలా ఉండగా- "పురాఽపినవమ్ పురాణమ్" అనే నిర్వచనం ఒకటి ప్రచారంలో ఉంది. వస్తువు పురాతనమైనదైనా నిత్యనూతనంగా భాసించేది అని దీని స్థూలార్థం. ఈ నవ్యత్వం- రచనా పాటవం మీదగాని, భావ గాంభీర్యం మీదగాని, పాత్ర చిత్రణం మీదగాని, సర్వకాలాలకు పనికివచ్చే ధర్మప్రబోధం మీదగాని, మూడు కాలాలకు పనికివచ్చే ఇతర విషయాలమీదగాని- ఆధారపడి ఉంటుంది. వీటిలో అన్నిగాని, కొన్నిగాని పురాణాలలో ఉండడం వల్లనే అవి నేటికీ ఉపాదేయాలుగా ఉండి ఈ నిర్వచనాన్ని సార్థకం చేస్తున్నాయి. అయితే, పురాతనకాలానికి సంబంధించిన విషయాన్ని చెప్పేటప్పుడేగాక, భవిష్యత్కాల విషయాలు చెప్పేచోట కూడా "పురాణ" శబ్దం- "భవిష్యపురాణం" మొదలైన చోట్ల- ప్రయుక్తమై కనబడుతోంది. అంటే కాలక్రమాన్ని- "పురా" శబ్దార్థం మారుతూవచ్చి ఆసన్న భవిష్యానికి కూడా ప్రయుక్తమవుతూవచ్చిందనాలి. నిఘంటువు చెప్పే అనేకార్థాలలో- పోయినకాలానికి, రాగల కాలానికి, నిరంతర పాతానికి, సమీపానికి మొదలైనవి ఉన్నాయి. ఇందువల్లనే అమరసింహుడు దీని అర్థాన్ని వివరిస్తూ "స్యాత్ప్రబంధే చిరాతీతే నికటా గామికే పురా" అన్నాడు, కాల గమనంలో- ప్రాచీనార్వాచీన విషయ సముదాయమేగాక, భవిష్య విషయ

సంఘాతం కూడా చేర్చి రచన సాగించడంతో- అన్ని కాలాలకు పనికివచ్చే రచన ఇది అన్నట్లుగా "పురాణ" శబ్దాన్నే ప్రయోగిస్తూ వచ్చారనాలి. కాళిదాసాది మహాకవులు "పురా" శబ్దాన్ని భవిష్య దర్థంలో ప్రయోగించారు- "అలోకతే నిపతతి పురా సా బలివ్యాకులా వా" (మేఘదూతం- 85) "పురా సప్త ద్వీపాంజయతి వసుధామ ప్రతిరథః" అభిజ్ఞానశాకుంతలమ్- VII . 33. ఇది పురా శబ్దార్థ సూచకంగా విపర్యాస క్రియనే వైపరీత్యం జరిగింది!

పురాణేతిహాసాల పుట్టుక గురించి అధర్వవేదం స్పష్టంగా చెప్పింది. వీటితోపాటు గాథలు, నారాశంసలు, వాకో వాక్యాలు కూడా ప్రసక్తాలయ్యాయి. వేదభాష్యంలో- "దేవాసురాః సంయత్తా ఆసన్" దేవదానవయుద్ధాలు జరిగాయట అన్నట్లు చెప్పేవి ఇతిహాసాలని, "ఇదం వా అగ్రే నైవ కించిత్ ఆసీత్" అన్నట్లుగా జగత్ప్రారంభదశను గురించి వర్ణించేవి పురాణాలనీ, "మహా హి మిత్ర వరుణాత్" మొదలైన మంత్రాత్మకమైనవి గాథలని, "యేనా మనుష్యాః తత్ప్రశంసాపరకాః శ్లోకాః నారాశంస్యః గాథాః సమాసాన్సద ముక్తంతి- ఇత్యాదికాః మనుష్య ప్రశంసాపరాః నారాశంసాః"- నిర్వచనం పూర్వోక్త శ్లోకాలను నారాశంసలనీ, "సవై గౌతమస్య పుత్రవృతోజనం దాపయేత్- ఇతి ఉక్తి ప్రత్యుక్తిరూపమ్ బ్రాహ్మణం వాకోవాక్యమ్"- ఉక్తి ప్రత్యుక్తిరూపంలో ఉన్నవి వాకోవాక్యాలనీ- వివరించడం జరిగింది. ఈ విషయాలన్నింటిని సమన్వయించుకొని పరిశీలిస్తే, వేదమందే పురాణేతిహాసాల రూపకల్పన ప్రయత్నం ఉందని తేలింది. చాలా బ్రాహ్మణారణ్యకోపనిషత్తులలో- ఇతిహాస పురాణాల ప్రసక్తి ఉంది. భారతంలాగ ప్రసిద్ధ రాజవంశాల చరిత్రను వివరించేవి ఇతిహాసాలు అనడంలోను, పరంపరాగతంగా వచ్చిన సర్గాది పంచలక్షణ లక్షితమైన శ్రీమద్భాగవతం వంటి వాటిని పురాణాలు అనడంలోను విప్రతిపత్తి ఉండదు. అమరకోశం మాటలలో- చిరభూతార్థం పురాణం, అతీతభూతార్థం ఇతిహాసం. సంస్కృతంలో భూతకాలాన్ని- లుఙ్, లఙ్, లిట్ (భూతే లుఙ్, లఙ్, లిట స్తథా) అని మూడు విధాలుగా విభజించారు. సామాన్య భూతం- లుఙ్, అనద్యతన భూతం- లఙ్, పరోక్షభూతం- లిట్- అని వివరించారు. ఇతిహాస పురాణాలను గూర్చి మాట్లాడేటప్పుడు ఈ లకారాల విశిష్టత తెలుస్తుంది. పురా శబ్దానికి- చిరాతీత నికటా గామికార్థా లున్నాయని అమరసింహుని నిర్ణయం. ఈ నిర్ణయంలోని సామంజస్యాన్ని గుర్తించిన భోజుడు తన సరస్వతీ కంఠా

శరణంలో "అతీతార్థ ప్రాధాన్యా దితిహాసః" అని నిర్వచించాడు. వేద ధర్మాలను చతుర్విధ పురుషార్థసాధనా మార్గాలను వివరించడం విషయంలో స్థూలంగా ఇతిహాస పురాణాలకు పోలికలున్నా, చెప్పే పద్ధతులలో చాలా భేదం ఉంది. త్రివిధ భాషలలో [సమాధి లౌకిక పరకీయ] పురాణాలు వాటిని దేశకాల పాత్రానుసారంగా చెప్పుతాయి. ఈ విషయాలనే ప్రత్యక్ష దృశ్యమాన పద్ధతిలో ప్రసిద్ధులైన ఐతిహాసిక పురుషుల జీవిత కథల నాధారంగా చేసుకొని ఇతిహాసాలు ప్రవచిస్తాయి. మనకు అత్యంత సన్నిహితంగా తెలిసిన- భారత, భాగవతాలను ఉదాహరణలుగా గ్రహిస్తే నిస్సంశయంగా విషయం అర్థమౌతుంది. శ్రీమద్రామాయణాన్ని కూడా గ్రహిస్తే- పురాణేతిహాసాలైన శ్రీమద్భాగవత మహాభారతాలకు, కావ్యగౌరవాన్ని- అదీ, ఆదికావ్య గౌరవాన్ని- పొందిన శ్రీమద్రామాయణానికి ఉన్న పోలికలు, తేడాలు స్పష్టమవుతాయి.

ఇంతటితో ఆగక, క్రీ॥ పూ॥ 4వ శతాబ్దికి చెందిన కౌటిల్యుని అర్థశాస్త్రంలో, ఇతిహాస నిర్వచనం కనబడుతోంది: "పురాణ మితివృత్త మాఖ్యాయికోదాహరణం ధర్మశాస్త్ర మర్థశాస్త్రం చేతిహాసః" అని ఉంది. దీనిని బట్టి చూస్తే, ఇతిహాసంలో- కొంతపురాణ సామగ్రి, కొన్ని ఆఖ్యాయికలు, కొన్ని గాథలు, ధర్మశాస్త్రార్థశాస్త్రాది విషయాలు- ఉంటాయి అని తేలుతోంది. వీటి నన్నిటిని బట్టిచూస్తే, కౌటిల్యుని దృష్టిలో మహాభారతం నచ్చి తన నిర్వచనానికి ఆధారంగా గ్రహించినట్లు తోస్తోంది! సుప్రసిద్ధాలంకారికుడైన రాజశేఖరుడు తన "కావ్యమీమాంస"లో "పురాణ ప్రవిభేద ఏ వేతిహాసః ఇత్యేకే సచద్విధా-పరక్రియా పురాకల్పాభ్యామ్ యదాహః పరక్రియా పురాకల్ప ఇతిహాస గతిర్ద్విధా స్యాదేక నాయకా పూర్వా, ద్వితీయా బహునాయకా తత్ర రామాయణం భారతం చోదా హరణే"॥ అన్నాడు. ఇతిహాసం కూడా పురాణాలలో ఒక భేదం. పరక్రియ, పురాకల్పం- అని అది రెండు విధాలు. ఏక నాయకాశ్రయమైనది- పరక్రియ, బహునాయకులున్నది- పురాకల్పం. వీటికి వరుసగా- రామాయణ భారతాలను ఉదాహరణగా ఇచ్చాడు. కనుక, పురాణేతిహాసాల నిర్వచనాలు ఎంత నిష్కర్షగా, నిశితంగా చేసినా పరస్పర ప్రవేశాలులేని నిర్వచనాలుకావు. వాటికున్న పోలికలు- వాటి విషయానికి దాని వివరణకు సంబంధించినవి. వాటికున్న తేడాలు కూడా- వాటి విషయానికి దాని వివరణకు సంబంధించినవే. ఈ రెండూ కూడా అర్థప్రధానాలు, మిత్రసమ్మితాలు. ఇతిహాసం, సరస్వతీకంఠా

కరణంలో భోజుడు చెప్పినట్లు "అతిశార్థ ప్రాధాన్యా దితిహాసః" సత్యవస్తు కథనం దీనికి శాస్త్ర రూపకావ్యద్వాయలు కూడా సమకూడినచో, దానికి ఉపదేశ రంజకత్వం కూడా సిద్ధించి- సత్య, శివ, సుందర స్వరూప అవుతుంది. శ్రీమద్భాగవతం— ఈ మూడు సిద్ధించినదై ప్రస్థాన తుల్యమైనది.

అష్టాదశ పురాణాల పట్టికం నిచ్చిన అన్ని పురాణ పట్టికలలోను- శ్రీమద్భాగవతం ఇచ్చిన పట్టికలో కూడా ''భాగవతం" అనే ఉంది గాని, దాని విషయాన్ని తెలియజేసే విధంగా ఏ విశేషణం కనబడదు, ఇలాంటి అనిశ్చిత స్థితిలో ఆ పట్టికలలోని ''భాగవతం", విష్ణుపారమ్యాన్ని బోధించే "శ్రీమద్భాగవతమా లేదా "శ్రీదేవీ భాగవతమా"? అనే సంశయం కొందరిని బాధించినా, శతాబ్దులుగా శ్రీమద్భాగవతానికి వచ్చిన ప్రచారం, ఔత్తరాహవైష్ణవ సంప్రదాయాలన్నీ ఏకకంఠంతో తమ పరమ పవిత్ర గ్రంథం, విష్ణుపారమ్యాన్ని ప్రవచించే శ్రీమద్భాగవతమే అష్టాదశ మహాపురాణాలలో పేర్కొనబడిన "భాగవతం" అని విశ్వసించడంతో ఈ ప్రశ్నకు శాశ్వతమైన సమాధానం లభించింది అనాలి. శ్రీమత్ అనే దానితో కలిపి భాగవతాన్ని వ్యవదేశించడం ఆదారమయింది.

''కృష్ణస్తు భగవాన్ స్వయమ్'' అని విశ్వసించే భాగవత సంప్రదాయానుయాయులకు- హరి, విష్ణువు, నారాయణుడు- అనే పేర్లకంటె "కృష్ణ" నామమే మధురం. (కలికాలే నామరూపే కృష్ణఅవతార్, నామహైతేహ ఉంం సర్వజగత విస్తార్- శ్రీచైతన్య మహాప్రభువు) శ్రీ, లక్ష్మి, రుక్మిణీ, సత్యభామాది నామాలకంటె రాధా నామమే ఎక్కువ ప్రీతికరం రోచకం. శ్రీకృష్ణుని దృష్టి అదే! (త్రైలోక్యే పృథివీధన్యా యత్ర బృందావనం వనమ్ యత్రరాధా సఖీవర్గః తత్రరాధాప్రియామమ-భగవద్వాక్యం) బ్రహ్మ సూత్రాలకు వేరే భాష్యం అక్కరలేదనీ, శ్రీమద్భాగవతమే భాష్యమని వీరి దృఢ విశ్వాసం. అవతారాలన్నీ శ్రీకృష్ణుడే ఎత్తాడని వారి నమ్మకం. శ్రీమద్భాగవతమే వ్యాససూత్రాలకు భాష్యంగా గ్రహించడం వలనే "అచింత్య భేదాభేదం," అనే శ్రీచైతన్య సంప్రదాయం వారికి 18వ శతాబ్దిలో బలదేవవిద్యా భూషణుడు "గోవిందభాష్యం" వ్రాసేవరకు దాని ఆవశ్యకం కనబడలేదు. గౌడీయ వైష్ణవులకు సంప్రదాయ భాష్యం ఇదే అయింది. అంతకుపూర్వం షడ్గోస్వాములు ఆ సంప్రదాయంలో ఉన్నవారే! భాష్యం వ్రాయ గలిగినవారే! అనావశ్యకమని మానుకొన్నారు! రాజ

పుత్ర స్థానంలోని జయపూరు రాజ సభలో అక్కడి గోవింద విగ్రహానికి సేవాధికారం ఎవరికి ఉంది అనే వివాదం వచ్చినప్పుడు, గౌడీయులకు సంప్రదాయ భాష్యంలేదు గనుక అర్హతలేదనే నిర్ణయం తీసుకోబడుతూ ఉన్న క్లిష్ట సమయంలో, శ్రీ గోవిందుని అనుగ్రహం వల్ల ఒక నెలరోజులలోనే "గోవింద భాష్యం" వ్రాసి ఆ సంప్రదాయ ప్రతిష్ఠను ఈయన కాపాడారు! ఆయనే గోవిందానుగ్రహాన్ని గురించి ఇలా అన్నారు:" విద్యారూపం భూషణం మే ప్రదాయ, ఖ్యాతిం నిన్యే తేనయో మాముదారః, శ్రీ గోవింద స్వప్న నిర్దిష్ట భాష్యో రాధాబంధుర్బంధురాంగః స జీయాత్" శ్రీకృష్ణుడే అవతారాలన్నీ ఎత్తినాడనే విషయాన్ని శ్రీజయదేవుడు గీత గోవిందంలో "దశాకృతికృతే కృష్ణాయ తుభ్యం నమః" అని దశావతార స్తోత్ర శ్లోకాన్ని ముగించడం తెలియజేస్తోంది.

ఏ విషయాలు విశిష్టంగా వర్ణితాలయితే "భాగవతం" అనే పేరు సముచితం అనే ప్రశ్న ఉదయించినప్పుడు సమాధానంగా మత్స్యపురాణం "పురాణ దాన ప్రస్తావన"లో ఇలా చెప్పింది:

> "యత్రాధి కృత్యగాయత్రీం వర్ణ్యతే ధర్మవిస్తరః।
> వృత్రాసురవధో పేతం తద్భాగవత మిష్యతే॥"

గాయత్రీ వర్ణన, ధర్మవివరణ, వృత్రాసురవధ దీనిలోని ముఖ్య విషయాలు, వృత్రాసురుడు గొప్పభక్తుడు, భాగవతుడు శ్రీపార్వతీ శాపం వల్ల రాక్షసుడై ఇంద్రునిచేతిలో మరణించి తిరిగి పూర్వమున్న స్థితిని పొందినవాడు, స్కాందపురాణంలో ఇంకా కొంత వివరణ కూడా ఉంది: ''గ్రంథోఽష్టాదశ సాహస్రో ద్వాదశ స్కంధ సంయుతః, హయగ్రీవ బ్రహ్మవిద్యా యత్ర వృత్ర వధస్తథా గాయత్ర్యాచ సమారంభః తద్వై భాగవతం విదుః"- పద్దెనిమిదివేల శ్లోకాలు, పన్నెండు స్కంధాలు, హయగ్రీవ బ్రహ్మవిద్య, వృత్రాసురవధ, గాయత్రీ సమారంభం- అనేవి భాగవత ప్రధానలక్షణాలు. ఇవన్నీ శ్రీమద్భాగవతంలో చోటుచేసుకొన్నాయి: సంస్కృత భాగవతంలోని ప్రథమశ్లోకం ఇది:

> "జన్మాద్యస్యయతోఽన్వయాదితరశ్చార్థేష్వభిజ్ఞ స్స్వరాట్
> తేనే బ్రహ్మహృదాయ ఆదికవయే ముహ్యంతియత్సూరయః॥
> తేజో వారిమృదాం యథా వినిమయోయత్రత్రిసర్గోమృషా
> ధామ్నా స్వేనసదానిరస్త కుహకం సత్యం పరం ధీమహి॥

దీనికి, దీనిననుసరించిన ఇతర శ్లోకాలకు పోతన తెలుగులో ఇలా అనువాదం

ప్రాగాడు. ఇష్టదేవతా ప్రార్థనాదికం, స్వవంశ వర్ణనాదికం, శ్రీరామచంద్ర సాక్షాత్కారం మొదలైనవి తెలుగు భాగవతంలో ఉన్నా, కథా ప్రారంభం ఈ శ్లోకానువాదంతో మత్స్యపురాణం చెప్పిన లక్షణ నిర్దేశంతో అవుతుంది. ఇదిగాక, ఈ పురాణమే భాగవతమని పోతన కంఠోక్తిగా చెప్పారు:

సీ॥ విశ్వజన్మస్థితి విలయంబు లెవ్వని
వలన నేర్పడు ననువర్తనమున
వ్యాపిస్తనమునఁ, గార్యములందభిజ్ఞుఁడై
తానరాజగుచుఁ జిత్తమునఁ జేసి
వేదంబులజునకు విదితములు గావించె
నెవ్వఁడు, బుధులు మోహింతు రెవ్వ
నికి, నెండమావుల నీళ్ళఁగా దాదులు
నన్యోన్య బుద్ధి దానడరునట్లు
త్రిగుణసృష్టియెందు దీపించి సత్యము
భంగిఁ దోఁచు, స్వప్రభానిరస్త
కుహకు నెవ్వఁడతనిఁ గోరి చింతించెద
ననఘు సత్యుఁబరుని ననుదినంబు.

వచనము- ఇట్లు "సత్యం పరం ధీమహి" యను గాయత్రీ ప్రారంభం బున గాయత్రీ నామ బ్రహ్మ స్వరూపంబై మత్స్యపురాణంబులోన గాయత్రి నధికరించి ధర్మవిస్తరంబును వృత్రాసుర వధంబును నెందుఁ జెప్పంబడునదియ భాగవతంబని పలుకుటంజేసి యీ పురాణంబు శ్రీ మహా భాగవతంబన నొప్పు చుండు."

సంస్కృత శ్లోకంలోని "సత్యం" అనే మాట, గాయత్రీ మంత్రంలోని "తత్" శబ్దానికి, "జన్మాద్యస్య యతః" అనేది "సవితుః" శబ్దానికి, "స్వరాట్" అనేదానికి "దేవస్య" అని, "వరేణ్యం భర్గః" అనే దానికి "పరం, ధామ్నా స్వేన నిరస్త కుహకం "అనేదనీ, "ధియోయోనః" అనే దానికి "తేనే బ్రహ్మహృదా" అనేదనీ, "ధీమహి" అనేదానికి "ధీమహి" అని అన్వయం చూపిస్తారు. కొందరు కొంచెం మార్పుతో- సవితుర్దేవస్య=జన్మాద్యస్యయతః, అభిజ్ఞః స్వరాట్=భర్గః,

తేనే[బ్రహ్మహృదాయ ఆదికవయే = ధియోయోనః ప్రచోదయాత్, వరేణ్యం = పరం, సత్యం = తత్, ధీమహి = ధీమహి- అని అర్థం చెప్పుతారు. పిండితార్థం అంతా పరబ్రహ్మలో పర్యవసించవలసినదే ! శ్రీధరస్వామి తన వ్యాఖ్యలో "గాయత్ర్యాఖ్య శ్రీపరబ్రహ్మరూపమే తత్పురాణమితి సిద్ధం అత ఏవ భాగవతం నామ అన్యదితి వశంకనీయమ్". గాయత్రి ద్వారా స్తుతింపబడిన దేవుడు- సవితృ మండలవర్తి శ్రీమన్నారాయణుడే అని శిష్ట సంప్రదాయం:

"ధ్యేయః సదా సవితృమండల మధ్యవర్తీ
నారాయణః సరసిజాసన సన్నివిష్టః
కేయూరవాన్ మకరకుండలవాన్ కిరీటి
హారీ హిరణ్మయ వపుః ధృతశంఖచక్రః॥"

అష్టాదశ పురాణాలలోని భాగవతం, శ్రీమద్భాగవతమే అని నిర్ద్వంద్వంగా, గారుడపురాణం ప్రకటించింది:

"అర్థోఽయం బ్రహ్మసూత్రాణాం భారతార్థ వినిర్ణయః
గాయత్రీ భాష్యరూపోఽ సౌవేదార్థ పరిబృంహితః
పురాణానాం సామరూపః సాక్షాద్భాగవతో దితః
ద్వాదశ స్కంధయుక్తోఽయం శతవిచ్ఛేద సంయుతః
గ్రంథోఽష్టాదశ సాహస్రః శ్రీమద్భాగవతాభిధః"॥

ఈ శ్లోకాలు శ్రీమద్భాగవత వైశిష్ట్యాన్ని సంపూర్ణంగాచెప్పాయి.

ఇక్కడ చెప్పబడిన హయగ్రీవ బ్రహ్మవిద్య దధీచిచేత ప్రవర్తితమైన "నారాయణకవచం". వృత్రాసురవధ సాహచర్యంతో హయగ్రీవ బ్రహ్మవిద్య అన్నప్పుడు అది శ్రీనారాయణ కవచమే. దధీచి హయగ్రీవత్వం షష్ఠస్కంధంలో "యద్వాఅశ్వశిరోనామ" అని సూచింపబడింది.

శ్రీమద్భాగవత ప్రారంభంలో "సత్యంపరంధీమహి" శ్లోకాంతంలో వచ్చినట్లే, ద్వాదశస్కంధం చివరకూడా (XII 13 అధ్యాయం; 18 శ్లోకం) "సత్యం పరంధీమహి" వచ్చేశ్లోకం ఉంది:

"కస్మైయేన విభాసితోఽయ మతులో జ్ఞాన ప్రదీపః పురా
తద్రూపేణచ నారదాయమునయే కృష్ణాయ తద్రూపిణా
యోగీంద్రాయ తదాత్మనాచ భగవద్రాతాయ కారుణ్యతః
తచ్ఛుద్ధం విమలం విశోక మమృతం సత్యంపరంధీమహి"॥

ఈ విధంగా శ్రీమద్భాగవతం గాయత్రీమంత్ర సంపుటితమైన దానినిగా గ్రహించాలి.

అనంతరకాలంలో వైష్ణవసంప్రదాయాలలో దీనికున్న ప్రాముఖ్యాన్నిబట్టి దీని కనేక వ్యాఖ్యలు బయలుదేరినా మొట్టమొదలువచ్చిన అద్వైత పరమైన శ్రీధరస్వామి వ్యాఖ్య చాలా పేరు పొందింది. శ్రీ చైతన్య మహాప్రభువు సంప్రదాయం దీనికి భిన్నమైనదైనా, ఆయన ఇతరులొకరు వ్రాసిన వ్యాఖ్యనుగూర్చి "ఏ వ్యాఖ్య స్వామిగామినికాదు; కనుక వ్యభిచారిణి" (శ్రీధరస్వామిని అనుసరించ లేదు అని స్వామి శబ్దంమీద చమత్కారంగా) అని అన్నట్లుగా నానుడిఉన్నది. ఈ వ్యాఖ్యకింతకంటె "బిరుదు" ఏమికావాలి. శ్రీ మద్భాగవతార్థం, ఆయనకే తెలుసునన్న విశ్వాసాన్ని గురించి పూర్వమే చెప్పుకొన్నాము.

శ్రీమద్భాగవతానికి వందకంటె ఎక్కువగానే వ్యాఖ్యలున్నట్లు చెప్పుతారు. మొదటి శ్లోకానికి "నూరు" అర్థాలు చెప్పారు వంశీధరుడు. ఆయన శ్రీధరస్వామి వ్యాఖ్యానానికి వ్యాఖ్య వ్రాసినవాడు. ఇది చాలక ఆయన "లీలాకల్పద్రుమం" అనే గ్రంథంలో ఇంకా ఇరవైఅయిదు అర్థాలు చేర్చారంటారు. భక్తిరసామృత నిండు వైన భాగవతానికి, ద్వైతమతానుయాయులు చాలా వ్యాఖ్యానాలు వ్రాశారు. శ్రీమధ్వాచార్యులు వారే భాగవత తాత్పర్య నిర్ణయం అనే ఉద్గ్రంథాని వ్రాశారు. సత్య ధర్మ తీర్థులు టీక వ్రాశారు. వీరు ఉత్తరాది మఠస్వాములు శ్రీయాదవార్యులు 1,3,7 స్కంధాలకు టిప్పణి వ్రాశారు. శ్రీనివాసతీర్థులు భాగవతంలోని ఏకాదశ స్కంధానికి వ్యాఖ్యవ్రాశారు. విజయ ధ్వజతీర్థులు పూర్ణంగా వ్యాఖ్య వ్రాశారు. సత్యాభి నవతీర్థులు విరోధోద్ధారమనే పేరుతో 367 శ్లోకాలకు-పూర్వా పర సంబంధం కల్పించుకొని వ్యాఖ్య వ్రాశారు. శ్రీ విశిష్టాద్వైత సంప్రదాయానికి చెందిన సుదర్శనసూరి అనువారు శుకపక్షీయము. వీరరాఘవాచార్యులు భాగవత చంద్ర చంద్రిక వ్రాశారు. నింబార్క సంప్రదాయానికి చెందిన శుకదేవాచార్యులు

సిద్ధాంత ప్రదీపము వ్రావారు. శ్రీ వల్లభాచార్య సంప్రదాయానికి చెందిన గిరిధరాచార్యులు ఆధ్యాత్మిక టీక వ్రాశారు. శ్రీ వల్లభులే సుబోధినీ టీక రచించారు. శ్రీ చైతన్య సంప్రదాయానికి చెందిన సనాతన గోస్వామి బృహద్వైష్ణవతోషిణి (దశమస్కంధం) జీవ గోస్వామి క్రమసందర్భం రచించారు. విశ్వనాథచక్రవర్తి సారార్థదర్శిని వ్రాశారు. ఇన్ని వ్యాఖ్యలున్నా భాగవత సారాన్ని శ్రీ రామకృష్ణ పరమహంస చెప్పినట్లుగా "The Bhagavata is fried in the butter Jnana and soked in the syrup of Bhakti" (వారి వంగ మూలానికి మతంవారి ఆంగ్ల గ్రంథములోని అనువాదం) ఎవరూ చెప్పలేదనాలి!

ప్రముఖులైన త్రిమతాచార్యులు ప్రస్థాన త్రయానికి వారి వారి సంప్రదాయాలకు అనుకూలంగా మూల సూత్రాలు, వాక్యాలు మొదలైనవాటికి అన్వయాదులు చెప్పి-అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత సిద్ధాంతాలను ప్రతిపాదించినట్లే, శ్రీమద్భాగవతానికి వ్యాఖ్యలు వ్రాసిన వారందరు తమ తమ సిద్ధాంతాలకు అనుకూలంగా శ్రీమద్భాగవతంఉందని స్థాపించడానికి ప్రయత్నంచేశారు. అన్ని సంప్రదాయాలకు అనుకూలంగాఉన్నవి, లేనివికూడా (ప్రస్థానత్రయంలో ఉన్నట్లే) శ్రీమద్భాగవతంలోను ఉన్నాయి. శ్రీమద్భాగవతాన్ని చతుర్థ ప్రస్థానం అన్నారు. ఈకోవకు చెందినవారే భక్తిని పంచమ పురుషార్థంగా వ్యపదేశించారు! దీనివల్లనే అన్ని పురుషార్థాల లబ్ధిని పొందవచ్చునని వారి భావం. అయితే, పరమేశ్వరుని ఏ సగుణ రూపం తమభక్తికి ఆలంబనం చేసుకోవాలి అనే విషయంలో చాలా అభిప్రాయ భేదాలు-సహజంగానే-వచ్చాయి.

పరమపురుషుడు ప్రకృతి గుణాలైన సత్త్వరజస్తమస్సులను తనపై "వేసుకొని" త్రిమూర్తుల రూపాలలో వివిధ కార్యాలు నిర్వహిస్తాడు. ఉపాసకుడు తన భక్తికి ఆలంబనంగా తీసుకొనే ఉపాధి వైశిష్ట్యాన్నిబట్టి ఫలవైశిష్ట్యంఉంటుంది. ఆశించిన ఫలాన్నిబట్టి, భక్తుడు వివిధో పాధులను స్వీకరిస్తాడుకూడా! శ్రీమద్భాగవతంలో ఇలా ఉంది:

"సత్త్వం రజస్తమ ఇతి ప్రకృతేర్గుణాస్తై
ర్యుక్తః పరః పురుష ఏక ఇహాస్యధత్తే ।
స్థిత్యాదయే హరి విరించిహరేతి సంజ్ఞాః
శ్రేయాంసి తత్ర ఖలుసత్త్వతనోర్నృణాంస్యుః॥"

దీన్ని తెలుగులోనికి పోతన్నగారు చాలా చక్కగా ఇలా అనువదించారు.
తరలం.

పరమ పూరుషుఁ డొక్కఁ డాఢ్యుఁడు పాలనోద్భవనాశముల్
సొరిదిఁ జేయు ముకుందపద్మజ శూలి సంజ్ఞలఁ బ్రాకృత
స్ఫురిత సత్త్వరజస్తమంబులఁ బొందునందు శుభస్థితుల్
హరి చరాచరకోటి కిచ్చు ననంత సత్త్వనిరూఢుఁడై

దీని తరువాత వ్రాసిన వచనంలో ఈ పద్యభావాన్ని విపులీకరించి త్రిమూర్తుల, ఇతర దేవభూత గణాదుల ఉపాసనాదికంవల్ల లభించే విషయాలను వివరించారు పోతనామాత్యుడు:

వచనం- "మరియు నొక్క విశేషంబు గలదు. కాష్ఠంబుకంటె ధూమంబు, ధూమంబుకంటెఁ ద్రయీమయంబయిన వహ్ని యెట్లు విశేషంబగునట్లు తమోగుణంబుకంటె రజోగుణంబు, రజోగుణంబుకంటె బ్రహ్మప్రకాశంబగు సత్త్వగుణంబు విశిష్టంబగు. తొల్లి మునులు సత్త్వమయుండని భగవంతు హరి నధోక్షజుం గొలిచిరి. కొందరు సంసారమందలి మేలుకొఱకు నన్యుల సేవింతురు.......కొందరు రాజస తామసులయి సిరియు నైశ్వర్యంబును బ్రజలనుం గోరి పితృభూత ప్రజేశాదుల నారాధింతురు. మోక్షమిచ్చుటం జేసి నారాయణుండు సేవ్యుండు..."

బ్రహ్మ విష్ణు మహేశ్వరులలో-రజోగుణ ప్రధానుడైన బ్రహ్మసేవకంటె, తమోగుణ ప్రధానుడైన శివుని సేవకంటె-సత్త్వగుణ ప్రధానుడైన హరిసేవ పురుషార్థాలను శుభస్థితిలో కలిగిస్తుంది. బ్రహ్మ శివుడు ధర్మార్థాదులను ఇచ్చినా ఉపాధి దృష్టితో అవి అంత సుఖప్రదాలు కావు-ఇచ్చినవారిలో రజోగుణతమోగుణాలుండడంవల్ల. సత్త్వగుణ సంపన్నుడైన విష్ణువువల్ల లభించేవి సుఖసంపాదకాలు, విష్ణువును నిష్కామంగా సేవిస్తే "సత్త్వాత్ సంజాయతే జ్ఞానం" అన్నారు గనుక జ్ఞానం కలిగి తత్ఫలంగా మోక్షం లభించడం తథ్యం. స్కాందం కూడా "బంధకో భవపాశేన భవపాశాచ్చ మోచకః । కైవల్యదః పరం బ్రహ్మ విష్ణురేవ సనాతనః॥" అంది. ఉపాధిదృష్టితో చూచినా సత్త్వ సంపన్నుడైన హరిసేవ - సత్త్వం పరమ శాంతరూపమైనందున-సుఖాస్పదం.

అయితే, ఇక్కడ కనబడే భేదాలు స్థూలదృష్టికే! పరమాత్మ ఒక్కడే.

సోపాధికమైనటువంటి గుణత్రయంతో కూడినప్పుడు కర్మభేదాన్ని పురస్కరించుకొనినామభేదం! దీన్ని గ్రహించి సర్వభూతాంతర్యామి అయిన పరమ పురుషుని దర్శించినవానికి శాంతి అనగా మోక్షం లభిస్తుంది. శ్రీమద్భాగవతం చతుర్థ స్కంధంలో ఈ శ్లోకం ఉంది:

"త్రయాణామేప భావానాం యోనపశ్యతి వై భిదామ్ ।
సర్వభూతాత్మనో బ్రహ్మన్! సశాంతి మధిగచ్ఛతి॥"

ఇది గుర్తించినప్పుడు వ్యావహారిక భేదం అంగీకరించడంలో దోషంలేదు. పరమార్థం తెలిసినవ్యక్తిని నామరూప వైవిధ్యం బాధించదు. శ్రీమద్భాగవత దశమ స్కంధంలో "బహుమూర్త్యేక మూర్తికం" అని చెప్పబడింది. లోకోద్ధరణకోసం భగవంతుడు వివిధావతారాలను ఎత్తుతాడు. శ్రీమద్భాగవత ప్రథమస్కంధ ద్వితీయాధ్యాయంలో ఈ విషయం ఇలాఉంది:

"భావయత్యేష సత్త్వేనలోకాన్వై లోకభావనః ।
లీలావతారాను రతోదేవతిర్య జ్నరాదిషు॥"

దీనిని పోతన్నగారు ఇలా వివరించారు: "లోకకర్తయైన యతండు దేవతిర్యఙ్మనుష్యాది జాతులందు లీల నవతరించి లోకంబుల రక్షించు...."

భగవంతుడు లీలావతారానురతుడు గనుక-దేవతలయందు, వివిధ జంతువులయందు, నరులయందు-చిట్టచివరికి జడపదార్థాలయిన స్తంభాదులందుకూడ-వ్యక్తుడై అవతరిస్తాడు. ఆయా అవతారాలెత్తినపుడు ఆయా జాతుల గుణానుసారం కర్మలనుచేసి లోక సంగ్రహం చేస్తాడు. పరమపురుషుని అవతారాలు రెండు విధాలుగా ఉన్నాయి. అవి.ఆయన చిచ్ఛక్తితో వెలువడినవి; మాయాశక్తితో వెలువడినవి. మత్స్యకూర్మాద్యవతారాలు చిచ్ఛక్తి కృతాలు, విష్ణుబ్రహ్మరుద్రులు మాయాకృతాలు. వాసుదేవుడు గుణయుక్తునిగా గోచరించినా, ఆయన ఆగుణాలకు బహిర్భూతుడు. ఆయనలోనిసత్త్వం ఆయన ప్రకాశం; లేదా దీనియందాయన ఉదాసీనుడు సచ్చిదానంద వస్తువైన పరమాత్మకు సత్త్వగుణంవల్ల ఉపరాగం కలుగదు. ఆయన యందాగుణం సంయోగసమవాయ సంబంధాలతోలేదు. ఆయనలో తోచేగుణాలు చిన్మయాలు. ప్రకృతి పరిణామభూతాలుకావు ఈ విషయం ఆయనే ఇలా చెప్పారు:

"మాం భజంతి గుణాస్సర్వే నిర్గుణం నిరపేక్షకమ్।
సుహృదం ప్రియమాత్మానం సామ్యాసంగాదయోగుణాః॥"

ఆయనలో గుణాలుగా కనిపించేవి ప్రకృతి పరిణామరూపాలు కావుగనుక ఆయన నిర్గుణుడే! అవి భాసించేవిమాత్రమే! అవి ఆయన్ని భజించేవే! ఆయనకు లోబడినవే!

త్రిమూర్తులకు మూలరూపం పరబ్రహ్మ అయిన హరి! ఈ విషయాన్నే శ్రీమద్భాగవతంలోని "పరః పురుష ఏక ఇహాస్యధత్తే, స్థిత్యాదయే హరి విరించి హరేతి సంజ్ఞాః" అన్న శ్లోక భాగంలోని "ఏకవచన ప్రయోగం" (హరి విరించి హరః ఇతి) వ్యక్తంచేస్తోంది. వామన పురాణంలో ఈ విషయమే. త్రిమూర్తుల సంబంధాన్ని. ఇలా చెప్పడం జరిగింది:

"బ్రహ్మ విష్ణ్వీశరూపాణి త్రీణి విష్ణోర్మహాత్మనః।
బ్రహ్మణి బ్రహ్మరూపస్థః శివరూపీ శివేస్థితః
పృథగేవస్థితోవిష్ణుః విష్ణురూపీ జనార్ధనః॥"

(బ్రహ్మ-విష్ణువు-శివుడు అనే మూడు రూపాలు విష్ణువునకు. బ్రహ్మరూపి అయిన విష్ణువు బ్రహ్మయందు; శివరూపి అయిన విష్ణువు శివునియందు. విష్ణురూపి తనకుతానై వేరుగాలేక విష్ణువునందు ఉండడం జరుగుతుంది. ఈ విధంగా త్రిమూర్తులు విష్ణువునే ఆశ్రయించారు. దీనినిబట్టి శ్రీ మహావిష్ణువు (శ్రీహరి, శ్రీమన్నారాయణుడు) అప్రాకృత శరీరుడనీ, త్రిగుణాతీతుడని తెలుస్తోంది. త్రిగుణాలైన సత్త్వరజస్తమస్సులకు వరుసగా - సంప్రదాయాన్ని అనుసరించి - శ్రీదేవి, భూదేవి, దుర్గాదేవి రూపధారిణి అయిన శ్రీ మహాలక్ష్మియే అభిమానదేవత అని తెలుతోంది. ఈ మూడు రూపాలతో ఆమెయే ఆయన్ని ఆశ్రయించుకొనిఉండి సేవచేస్తూఉంటుంది అని ఆదిత్యపురాణం వర్ణించింది. ఇక్కడ ఏడుకొండలవాడైన శ్రీ వేంకటేశ్వరుడే ఆ శ్రీమహావిష్ణువు. ఆయన సౌందర్యాన్ని చూడడానికి తన రెండుకళ్లు చాలవని రమాదేవి తానే భూదేవిగా, దుర్గాదేవిగా రూపు దాల్చింది! ఆయనకు వామభాగంలో శ్రీరూపంలో, దక్షిణభాగంలో భూ రూపంలో ఎట్ట ఎదుట దుర్గారూపంలోఉండి ఆ సౌందర్యాన్ని అనుభవిస్తోంది!

"విస్మితాద్రష్టుకామాద్ధి స్వన్యవేత్రద్వయేనవై।
అశక్యం దర్శనంమత్వా త్రిరూపాభా భవత్తదా॥

హర్షాత్ శ్రీరూపిణీ వామే భూరూపా దక్షిణేస్థితా ।
దుర్గారూపాఽగ్రభాగస్థా త్రిరూపా నేత్ర షట్కృతః॥
పశ్యన్త్య నన్యమనసా సౌందర్యాఖ్య రసాయనమ్ ।
పిబంత్యప్య న్వహంనాపి నివృత్తాతృష్ణయాఽధునా॥"

(ఆదిత్యపురాణం - ద్వితీయాధ్యాయ - శ్లో-3,4,5.) ఇంతటితో తృప్తి చెందని లక్ష్మీదేవి-భూరూపంలో ఆ పరమ పురుషునకు శయ్యగాను, శ్రీరూపంలో తలగడగను, దుర్గారూపంలో పాద సేవకురాలిగాను వ్యవహరిస్తోందని అక్కడే ఉంది:

"భూరూపాఽభూత్ స్వయంశయ్యా, శ్రీరూపా సోపబర్హణమ్ ।
దుర్గాభూత్ పాదసేవార్థం, తాంబూలం భోగసాధనమ్॥" (శ్లో-64)

తరువాత సకలభోగాలకు పనికివచ్చే వస్తుసంపద అంతా తానేఅయినట్లు వర్ణనఉంది. సర్వమాంగళిక వస్తువుల మాంగళ్యమునకు హేతు భూత ఆమెయే! కనుకనే, నారాయణి అయిన ఆమె శివ! సర్వమంగళమాంగళ్య!

జగజ్జనని అయిన ఆది పరాశక్తియే, త్రిమూర్తులకు జననిగా, తానే రూపాంతరంపొంది శ్రీవాణీగిరిజలుగా (ఈ విశ్వంలో ఆమెకానిది ఏముంది?)

"భూతానిదుర్గా, భువనానిదుర్గా, స్త్రియోనరాశ్చాపి పశుశ్చదుర్గా ।
యద్యద్ధిదృశ్యంఖలు సైవదుర్గా, దుర్గాస్వరూపాదపరం నకించిత్॥"

అయినట్లు మన పురాణాలలో ఉండనేఉంది! "యా విద్యా శివకేశవాది జననీ యావై జగన్మోహినీ" అనే ప్రసిద్ధ శ్లోకం మనకు తెలియనిదికాదు. మహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతీ ఆమె రూపాలే. "ముగురమ్మల మూలపుటమ్మ" అయిన ఆమె "తురీయ". ఈ విషయాన్నే శ్రీశంకర భగవత్పాదులు "సౌందర్యలహరి"లో ఇలా వర్ణించారు:

"గిరా మాహుర్దేవీం ద్రుహిణ గృహిణీమాగమవిదో
హరేః పత్నీం పద్మాం హరసహచరీ మద్రితనయామ్ ।
తురీయాకాఽపిత్వం దురధిగమనిస్సీమ మహిమా
మహామాయా విశ్వంభ్రమయసి పరబ్రహ్మ మహిషి॥"

ఈ మహామాయకు, తురీయకు, పరబ్రహ్మ మహిషికి సంప్రదాయవిదులు "మహాలక్ష్మి" అని పేరుపెట్టారు. ఈమె "ముగురమ్మల మూలపుటమ్మ" గాని, త్రిమూర్తులలో ఒకరైన విష్ణువునకు భార్యగా పేర్కొనబడిన లక్ష్మి కాదు. ఆమెకు కూడా మూలమైనది. లక్ష్మీతంత్రం లక్ష్మీశబ్దాన్ని ఇలా నిర్వచించింది:

"అంతరాస్థాయి సర్వస్యలక్షయిత్ర్యఖిలాం క్రియామ్ ।
అపరిచ్ఛిన్న శక్తిశ్చ మహాలక్ష్మీ రితి స్మృతా ॥"

సమష్టిరూప అయిన ఈమె సర్వమందును ఉండి సర్వక్రియలను లక్షిస్తుంది గనుక మహాలక్ష్మి. సృష్టిస్థితి లయంకే కాదు, ఆమె "పంచకృత్య పరాయణ" (ఆ మిగిలిన రెండూ - తిరోధానం, అనుగ్రహం- అనేవి.) గనుక సర్వశ్రేష్ఠ ఆమెను ఏ పేరుతో పిలిచినా ఈ దృశ్యమాన జగత్తే కాదు- దీనివెనుక, లోపల ఉన్నదంతా- ఆమె లీలావిలాసమే!

"అయితే, ఈ "శ్రీ" యొక్క (శక్తి యొక్క) స్థానాన్ని బట్టి (పరమ పురుషుని సంబంధాన్ని పురస్కరించుకొని) వివిధ తాత్త్విక సిద్ధాంతాలు వచ్చాయి. అవన్నీ- శక్తికి శక్తునకు గల పరస్పర సంబంధాన్ని దృష్టిలో ఉంచుకొని బయలుదేరినవే! కొన్ని సంప్రదాయాలలో- చిదచిదీశ్వర తత్త్వాలున్న సంప్రదాయాలలో- శక్తి (లక్ష్మి)స్థానం అద్వితీయం. పరమేశ్వరుని తరువాత ఆమెయే! మిగిలినవన్నీ- మిగిలినదంతా - ఆమె తరువాతివే! (తరువాతిదే!) ఆమె కనుసన్నల మెలగవలసినవే! (మెలగవలసినదే!)

ఈ సంబంధాన్ని పురస్కరించుకొనే-

"జగత్త్రితయ వైచిత్ర్య చిత్రకర్మ విధాయినమ్ ।
శివం శక్తి పరిస్పంద మాత్రోపకరణం నుమః ॥"

శక్తి పరిస్పందన మాత్రోపకరణంగా వైచిత్ర్య శోభితమైన ఈ జగత్త్రయాన్ని "చిత్రించే" శివునకు నమస్కారం అని ఒకరంటారు.

"శివశ్శక్త్యాయుక్తోయది భవతి శక్తః ప్రభవితుం ।
నచే దేవం దేవోనఖలు కుశలః స్పందితుమపి ॥

అని ఇంకొకరంటున్నారు. ఆమెతో ఆయన కూడకపోతే ఆయన "స్పందితు మపి నకుశలః" అంటున్నారు ! "శివ" శబ్దం "శవ" సదృశం. "ప్రేత"మన్నమాట !

శ్రీలలితా సహస్రనామ స్తోత్రంలో ఆదిపరాశక్తి - పంచప్రేతాసనాసీనా ! పంచప్రేతమంచాధిశాయినీ - అని స్తుతిరూపంగా సంబోధించడం కనబడుతుంది ఈ పంచప్రేతలు, పంచబ్రహ్మలు. వారు- బ్రహ్మ, విష్ణు, రుద్ర, ఈశ్వర, సదాశివులు. మొదటి నలుగురు పాదాలుగాను (మంచంకోళ్ళు) సదాశివుడు పర్యంకంగాను ఏర్పడిన ఆసనంమీద ఆమె ఆసీనురాలు ("పంచబ్రహ్మాసన స్థితా !") ఈ పంచ బ్రహ్మలు వారివారి శక్తులతో (వామా, జ్యేష్ఠా, రౌద్రి మొదలైనవారు) సహకారం లేనప్పుడు ప్రేతలనబడతారు ! శ్రీశాక్త సంప్రదాయం ప్రకారం, అచేతనాలయిన పంచభూతాలు ప్రేతలు. వీటివల్ల ఉత్పన్నమయిన ప్రపంచాన్ని అసనంగా చేసుకొని ప్రకృతిగా విరాజిల్లుతుంది గనుక జగజ్జననికి ఈపేరు తగిఉన్నది ! పంచప్రేతాసనాధి నివేశనాధికారం పరమేశ్వరికి మాత్రమే ఉన్నదని సంప్రదాయం. శ్రీశంకర భగవత్పాదులుకూడా ఆమె ఆసనాన్ని గురించి సౌందర్యలహరిలో ''శివాకారే మంచే పరమశివ పర్యంకనిలయాం" అని వర్ణించారు।

భగవద్రామానుజులవారి విశిష్టాద్వైత సంప్రదాయానికి చెందినవారు, పరతత్త్వమైన "నారాయణుడు" చేతనులకు శరణ్యుడైనప్పుడు "శ్రీమన్నారాయణుడు" (శ్రీవిశిష్టుడు) అవుతున్నాడంటారు ! అంటే, లక్ష్మి (శ్రీమత్) విశిష్టుడవుతున్నాడన్నమాట !

పైని పేర్కొన్నవాటిలో సిద్ధాంతభేదాలు చాలాఉన్నాయి. వాటిలోలికిపోక (ఒకవిధంగా చూస్తే, అన్నీ శక్తి వైశిష్ట్యాన్ని అంగీకరించినవే అనవచ్చును !) పరతత్త్వమైన నారాయణుడు శరణ్యుడైనప్పుడు శ్రీవిశిష్టుడై శ్రీమన్నారాయణుడు ఎందుకు కావాలో తెలుసుకొందాము. ఆకారభూతురాలైన లక్ష్మిద్వారా భగవంతుడైన హరిని తెలుసుకోవచ్చునని ఆచార్యవర్యుల అభిభాషణ :

"అకారిణస్తు విజ్ఞాన మాకార జ్ఞానపూర్వకమ్ ।
తేనాకారశ్రియం జ్ఞాత్వా జ్ఞాతవ్యో భగవాన్‌హరిః ॥"

ఇందువల్ల, విశిష్టాద్వైత వైష్ణవంలో ఆ "హరి"ని తెలుసుకోవడానికి, చేరుకోవడానికి సాయపడే జగన్మాత లక్ష్మి "పురుషకారంగా" అభివర్ణిత అయింది.

ఈమెదే ఈ మధ్యవర్తిత్వం. పురషకారానికి విగ్రహం ఇలా చెప్తారు. "పుర సనోతీతి పురుషః । పురుషం కరోతీతి పురుషకారః ॥" [పుర = అధికంగా, సనోతి = ఇచ్చేవాడు, తం = అవిరమైన పురుషునిగా. కరోతి (ఇతి) = చేయు చున్నది] "పురుషకార" శబ్దానికిది స్థూలార్థం. తండ్రికి సంతానంమీద కోపం వచ్చి శిక్షించడానికి ఉద్యుక్తుడైనప్పుడు, తల్లి మధ్యవర్తిత్వం నెరపి, అసంతానం మీద తండ్రికోపం తగ్గడానికి (తగ్గించడానికి) సాయపడుతుంది. తండ్రి అనుగ్ర హించ వలసిన కోరికలుండే, వాటివిషయమైకూడా మధ్యవర్తిత్వం నెరపి అపి ఆయన తొందరగా అనుగ్రహించేలా చేస్తుంది.

ఇందువల్ల అపరాధమే దేహంగాగల చేతనుడు నారాయణుని ఆశ్రయించే సమయంలో ఆయన అనుగ్రహం పొందడానికి 'లక్ష్మి' పురుషకారం కావాలి. భగవద్రామానుజుల వారి వైష్ణవంలో లక్ష్మికింతటి స్థానం ఉన్నది గనుకనే అది శ్రీవైష్ణవం అయింది. పరమాత్మను పొందనెంచేవానికి, ఉపేయంగా లక్ష్మి పురుష కారం అత్యంతావశ్యకం.

పాంచరాత్ర శాస్త్రంలో ఈ విషయం ఇలా వివరించబడింది :

"అహం మత్ప్రాప్త్యుపాయోవై సాక్షాత్ లక్ష్మీపతి స్వయమ్ ।
లక్ష్మీపురుషకారేణ వల్లభాప్రాప్తియోగినీ
ఏతస్యాశ్చవిశేషోఽయం నిగమాంతేషు శబ్దితే" ॥

ఇది ఇంతటితో ఆగలేదు. ఇతర దేవులకుగాని, నిత్యసూరులకుగాని, గురువుకుగాని సొంతంగా పురుషకారంలేదు. అందరికి లక్ష్మీదేవి ద్వారానే. ఈ విషయం "తత్త్వదీప సంగ్రహం"లో ఇలాఉంది :

"ఏతత్పావేశ సంబంధాదన్యేషా మమలాత్మనామ్ ।
దేవీ సూరి గురూణాంచ ఘటకత్వం నతుస్వతః ॥

శ్రీ యమునాచార్యులవారుకూడా తమ "లక్ష్మీస్తవం" (శాస్త్రచతుశ్లోకి)లో ఇలా అంటారు :

"ఈషత్త్వత్కరుణా నిరీక్షణ సుధానందుక్షణా ద్రక్ష్యతే
నష్టం ప్రాక్తదలాభతస్త్రి భువనం సంప్రత్యనస్తోదయమ్ ।

శ్రేయోనహ్యరవింద లోచన మనఃకాన్తా ప్రసాదాదృతే
సంస్కృత్యక్షర వైష్ణవాధ్వసు నృణాం సంభావ్యతే కర్హి చిత్"॥

ఈ సందర్భంలో ఈ శ్లోకంలోని ఉత్తరార్ధపాదాలు రెండూ మనకు ఉపాదేయాలు. మనుష్యులకు– సంసారంలోగాని, పరమపదంలోగాని అరవిందలోచనుని ప్రేయసియొక్క ప్రసాదం తప్ప వేరే శ్రేష్ఠమైనది ఏదీ సంభావితం కాలేదు దీనికి భాష్యం వ్రాస్తూ శ్రీవేదాంత దేశికులవారు. "మోక్షప్రదే భగవతి ముముక్షూణాం ఘటకతయా ఏషాలిష్టలీతి సర్వసమ్మతమ్"- అన్నారు.

భగవద్రామానుజులవారు తమ "శరణాగతి" గద్యప్రారంభంలో లక్ష్మీదేవి సంబంధమైన ప్రపత్తినిలా ప్రకటించారు:

"భగవన్నారాయణాభిమతాను రూప స్వరూప రూప గుణవిభ వైశ్వర్యశీలాద్య నవధికాతిశయా సంఖ్యేయ కల్యాణ గుణగణాం పద్మ వనాలయాం భగవతీం శ్రియం దేవీం నిత్యానపాయినీం నిరవద్యాం దేవ దేవ దివ్యమహిషీం అఖిల జగన్మాతరం అస్మన్మాతరం అశరణ్య శరణ్యాం అనన్యశరణ శ్శరణమహం ప్రపద్యే" ॥

ఇది పురుషకార ప్రపత్తి అనడంలో సంశయం లేదుగదా! శ్రీవేదాంత దేశికులవారు- స్పష్టంగా లక్ష్మీదేవియొక్క పురుషకారాన్ని ఇలా తెలియజేశారు:

"అస్తి కర్మార్హ ఫలదేవత్యో కృత్య ద్వయం శ్రియః
నిగ్రహోద్వారణం కాలే సందుక్షణ మనుగ్రహే ॥"

శ్రియఃపతి జీవులకు కర్మార్హఫలం ఇస్తాడు. ఆ సందర్భంలో వీలు చూసుకొని భగవంతుని నిగ్రహాన్ని తప్పించడం ఒకటి. ఆయన అనుగ్రహాన్ని అధికం చెయ్యడం రెండోది- ఇవి ఆ అశరణ్య శరణ్యపనులు.

శ్రీ వేదాంత దేశికులవారే, వారి "నిక్షేపరక్ష"లో, పురుషకార భావాన్ని ఇలా వివరించారు:

"అర్థ స్వభావాను ష్ఠానలోక దృష్టి గురూక్తిభిః
శ్రుత్యా స్మృత్యాచ సంసిద్ధం మఠనార్థావలంబనమ్" ॥

పురుషకారం. అర్థ స్వభావానుష్ఠానాలనుబట్టి, లోకదృష్టి. గురూపదేశాలను బట్టి; శ్రుతి స్మృతులను బట్టి ఉంటుంది.

పీటి నన్నింటినిబట్టి పరమపురుషుని కారుణ్యంలోకి జగన్మాత లక్ష్మీదేవి ప్రసాదం అత్యంతావశ్యకమని తెలుస్తోంది. శ్రీపరాశర భట్టరువారు తమ "అష్ట శ్లోకి"లో శ్రీలక్ష్మీనారాయణులిద్దరు ఆశ్రయణీయులని నిర్ద్వంద్వంగా ప్రకటిస్తున్నా లక్ష్మీదేవి వైశిష్ట్యాన్ని ధ్వని ప్రధానంగా వ్యక్తంచేశారు :

"ఈశానాం జగతామ ధీశదయితాం నిత్యానపాయాం శ్రియం
సంశ్రిత్యాశ్రయణోచితాఖిల గుణస్యాం ఘ్రిహరే రాశ్రయే ।
ఇష్టోపాయతయా శ్రియాచ సహితా యాత్మేశ్వరా యార్థయే
కర్తుం దాస్యమ శేషమ ప్రతిహతం నిత్యం త్వహం నిర్మమః॥"

ఒక్కముక్కలో చెప్పాలంటే పురుషకారత్వమే లక్ష్మీతత్త్వం. శ్రీ వైష్ణవుల ద్వయ మంత్రంలో ఇది స్పష్టంగా కనబడుతుంది. "శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే।" "శ్రీమతే నారాయణాయ నమః"॥ ఈ పూర్వోత్తరార్థాలు రెండూ కలిసి ద్వయమంత్రం. ఈ రెండింటిలోను "శ్రీమత్" శబ్దం ఉంది, లక్ష్మీనారాయణుల సంబంధాన్ని తెలుపుతోంది. పూర్వఖండంలో "శ్రీమత్" లక్ష్మిని ముందుంచుకొని, అంటే లక్ష్మిని పురుషకారంగా చేసుకొని, పరతత్త్వమైన సర్వేశ్వరుని పాదపద్మాలను ఉపాయంగా ఆశ్రయించడం. ఉత్తరఖండంలో లక్ష్మీనారాయణులకు కైంకర్యం చేయడానికి వేడికోలు. పరమేశ్వరుడు పురుషకారం చేయడు. లక్ష్మియే చేతనులయందున్న మాతృవాత్సల్యం వల్ల- పురుషకారం చేస్తుంది. మోక్షమిచ్చేది సర్వేశ్వరుడే.

కరుణామయి అయిన లక్ష్మితో కూడినది గనుకనే కాబోలు. "ద్వయమంత్రమును ఏ స్థితిలో ఉన్నా, ఎప్పుడైనా అనుసంధించుకోవచ్చును. ఇతరుల చెవిన పడరాదంతే నియమము" అన్నారు. సంప్రదాయం తెలిసిన పెద్దలు (శ్రీపరిస్తుతి మాల, సంకలనము: జీయరు ఎడ్యుకేషనల్ ట్రస్ట్, వేదవిశ్వవిద్యాలయం, సీతానగరం పుట-18) దీనికి "మంత్ర రత్నం" అని కూడా ఖ్యాతిఉంది.

లక్ష్మియందు పురుకారం, శ్రియః పతియందు ఉపాయత్వం వ్యవస్థితాలై ఉన్నాయి. పరమపురుషుని కృపకు పాత్రులు కావడానికి, భక్తులలో అపరాధంగా

ఉన్న పాపాదుల్ని ఆమె తొలగించి, వారిని ఆయనకు చేరుస్తుంది. ("భగవత్కారుణా విషయీకార కారకత్వం పురుషకారత్వం") పురుషకారం అంటే "ఇప్పించడం" (దాపయితృత్వం) ఉపాయత్వం అంటే "తనకు తాను ఇయ్యడం" (దాతృత్వం) ఇవి రెండూ ఒకచోటనే కుదరవు గనుక, మోక్షమిచ్చేవాడు సర్వేశ్వరుడే! ఆయన దయకు చేతనుని లక్ష్యంగా చెయ్యడం పురుషకారత్వం, ఈ పని లక్ష్మిది. భగవద్రామానుజులవారు తమ శరణాగతి గద్యలో ఆమె స్వరూప రూపగుణ విభవాది కల్యాణగుణాలతో ఏ విధంగా శ్రియః పతికి సన్నిహితమైనదో నిత్య సంశ్లేషం కలదో వర్ణించి, ఆ జగన్మాత వైశిష్ట్యాన్ని ఉగ్గడించారు. ఆమె "తద్వక్షస్థల నిత్యవాసరసిక!" "తత్క్షాంతి సంవర్ధిని"! ఆమె పరమపురుషుని "పరాం ప్రేయసి!"

పాంచరాత్రశాస్త్ర సిద్ధాంతాలమీద సుప్రతిష్ఠిత మైన శ్రీ వైష్ణవ భాగవత ధర్మంలో లక్ష్మీమాతకున్న స్థానం అనన్యసామాన్యం. అద్వితీయం. ఇందువల్లనే ఆమె ఆయనతో బాటే-అంటే, ఆయన అవతారాలతో బాటే-అవతరిస్తూ ఉంటుంది. ఈ విషయమే విష్ణుపురాణంలో

"దేవత్వే దేవదేహేయం మనుష్యత్వే చ మానుషీ।
విష్ణోర్దేహాను రూపంవై కరోత్యేషాత్మని స్తనుమ్॥"

అని చెప్పబడింది. ఆయన దేవశరీరుడైతే, ఆమెదీ దేవశరీరమే! ఆయన మానవ శరీరుడైతే ఆమెదీ మానవశరీరమే! ఈ విషయాన్నే ఉదాహరణ పూర్వకంగా ఆ పురాణమే ఇలా చెప్పింది. "రాఘవత్వే భవేత్సీతా రుక్మిణీ కృష్ణ జన్మని" దీని తాత్పర్యం. ఆయన అవతరించినప్పుడెల్లా ఈమె కూడా యథోచితంగా అవతరిస్తూనే ఉంటుందని.

ఇంచుమించుగా మన పురాణేతిహాస లన్నింటిలోను శ్రీమన్నారాయణుని అవతార ప్రసక్తి ఏదో రూపంలో వస్తూనేఉంటుంది. ఇంక ప్రత్యేకంగా అవతారాల పేర్లతోనే ఉదాహరణకు- మత్స్య, కూర్మ, వరాహాది పురాణాలు ఉండనే ఉన్నాయిగదా! మనకు! కనుక యావద్భారతంలోను వివిధ సంప్రదాయాలకు చెందిన భాగవతులచేత శిరోధార్యంగా పరిగణింపబడే శ్రీమద్భాగవతంలోని అవతారాదిక వర్ణనను అనుసరించి అవతారాలను స్థూలంగా పరిశీలిద్దాము. తెలుగువారికి

శ్రీమద్భాగవతం అంటే భక్తకవి పోతన భాగవతమే గనుక, దానిననుసరించి అవతారాలను దర్శించుకొందాము. మనకు వ్యాసభాగవతం దూరస్థం. పండిత జనైకవేద్యం. పోతన భాగవతం సమీపస్థం, సుపరిచితం. మనతో మన భాషలో మాట్లాడుతుంది. ఇంతమాత్రంచేత వ్యాసభాగవతాన్ని పరిహరిస్తామని కాదు. అవశ్యకమైన చోట్ల దాన్ని దర్శించుకొంటాము. సంస్కృతంలోని శ్రీమద్భాగవతానికి, వివిధ సంప్రదాయాలకు చెందిన మహాపురుషులైన మహావిద్వాంసులు వారివారి సంప్రదాయాలకు అనుకూలంగా వ్యాఖ్యానాలు వ్రాశారని తెలుసుకొన్నాము. మనం వాటి జోలికి పోకుండా చర్చలలోనికి దిగకుండా సంస్కృతంలోని శ్రీమద్భాగవతం ప్రథమస్కంధం ప్రథమాధ్యాయంలో అవతారాలకు సంబంధించి శౌనకాదులడిగిన ప్రశ్నలకు సూతుడు సమాధానం తృతీయాధ్యాయంలో అవతార వర్ణనా రూపంగా ఇచ్చాడు. శౌనకాదులడిగిన కొన్ని ప్రశ్న శ్లోకాలు అవతారాలను గురించి- ఇవి :

"తన్నః శుశ్రూషమాణానామర్హస్యంగానువర్ణితుమ్।
యస్యావతారో భూతానాం క్షేమాయచ భవాయచ॥"
(స్కంధం-1, శ్లోకం-13)

"అథాఖ్యాహి హరేర్ధీమన్ అవతారకథాశ్శుభాః।
లీలా విదధతస్స్వైరమీశ్వరస్యాత్మ మాయయా॥ "(శ్లో-18)

"కృతవాన్ కిల వీర్యాణి రామేణ సహకేశవః।
అతిమర్త్యాని భగవాన్ గూఢః కపటమానుషః॥" (శ్లో-20)

ఈ శ్లోకార్థాలన్నింటిని క్రోడీకరించి పోతనామాత్యుడు ఒక సీసపద్యం వ్రాశాడు.

"ఎవ్వని యవతారమెల్ల భూతములకు సుఖమును వృద్ధియు
సొరిది(జేయు
నెవ్వని శుభనామమే ప్రొద్దునుడువంగ సంసారబంధంబు
సమసిపోవు

నెవ్వని చరితంబు హృదయంబుఁజేర్చిన భయమంది మృత్యువు
పరువు పెట్టు
నెవ్వని పదనదినే పారు జలములు సేవింపనైర్మల్యసిద్ధిగలుగుఁ

దపసులెవ్వని పాదంబుఁ దగిలి శాంతి
తెఱగు గాంచిరి; వసుదేవ దేవకులకు
నెవ్వఁడుదయించెఁ దత్కథలెల్ల వినఁగఁ
నిచ్ఛపుట్టెడు నెఱిఁగింపు మిద్ధచరిత।"

దీని తర్వాత ద్వితీయాధ్యాంలో సూతుడు నారాయణకథా ప్రశంసచేస్తాడు. అధ్యాయాంతంలో, అవతారాల కన్నింటికి మూలమైన పరమపురుషుని గూర్చి ఇలా అంటాడు:

"విశ్వాత్మకుండైన పురుషుఁడొక్కఁడు, తనవలనం గలిగిన నిఖిలభూతం బులందు నంతర్యామి రూపంబున దీపించు. మనోభూత సూక్ష్మేంద్రియంబుల తోడం గూడి, గుణమయంబులైన భావంబులం దనచేత నిర్మితంబులైన భూతంబు లందుఁ దగులువడక తద్గుణంబులను భవంబు సేయుచు లోకకర్తయైన యతండు దేవతిర్య ఙ్మనుష్యాది జాతులందు లీల నవతరించి లోకంబుల రక్షించు."

తరువాత తృతీయాధ్యాయ ప్రారంభంలో ఆ "పరమపురుషుని" వర్ణన చేస్తాడు.

"మహదహంకార తన్మాత్ర సంయుక్తుఁడై చారుషోడశ
కళాసహితుఁడగుచుఁ
బంచమహాభూత భాసితుఁడై శుద్ధసత్త్వుఁడై సర్వాతిశాయి
యగుచుఁ
జరణోరు భుజముఖ శ్రవణాక్షి నానాశిరములు నానా
సహస్రములు వెలుఁగ
నంబర కేయూరహారకుండల కిరీటాదులు పెక్కువేలమరుచుండఁ

బురుషరూపంబు దరియించి పరుఁడనంతుఁ
డఖిల భువనైక వర్తనయత్నమమర

మానిలోదారజలరాశి మధ్యమునను
యోగనిద్రా విలాసియై యొప్పుచుండు."

"అది సకలావతారంబులకు మొదలిగని యైన శ్రీమన్నారాయణదేవుని విరాజమానంబైన దివ్యరూపంబు. దానిం బరవ యోగీంద్రులు దర్శింతురు. ఆప్పరమేశ్వరు నాభి కమలంబువలన సృష్టికర్తలలోన శ్రేష్ఠుండైన బ్రహ్మయుద యించె. అతని యవయవ స్థానంబుల యందు లోకవిస్తారంబులు గల్పింపం బడియె." (పోతన)

ఈ సందర్భంలో సంస్కృత భాగవతంలోని ప్రథమస్కంధ తృతీయాధ్యా యంలోని ప్రథమ శ్లోకం పరిశీలించదగినది-

"జగృహే పౌరుషం రూపం భగవాన్మహదాదిభిః ।
సంభూతం షోడశకలమాదౌ లోక సిసృక్షయా॥" (1-3-1)

లోకాల్ని సృష్టించాలనే ఇచ్ఛతో పరమపురుషుడు మహత్తత్త్వం, అహం కారతత్త్వం, పంచతన్మాత్రలు- వీటితోచేరి ఉన్న కర్మేంద్రియ జ్ఞానేంద్రియాలు పది (రెండైదులు) మనస్సు, అయిదు మహాభూతాలు - మొత్తం పదహారు అంశ లతో ఒప్పుచున్న పురుషరూపాన్ని స్వీకరించారు. [కలాశ్చ పంచభూతాని జ్ఞాన కర్మేంద్రియాణి చ। పంచ పంచ మనశ్చేతి షోడశోక్తా మహర్షిభిః॥]

భగవంతుడు శ్రీకృష్ణుడే అని పూర్వనిర్దిష్టం. ప్రశ్న అడిగిన శౌనకాదుల మనోగతాభిప్రాయం కూడా అదే! భగవంతుడు పరమవ్యోమాధిపుడు. ఈయన గ్రహించిన షోడశకలాత్మకరూపం మహావిష్ణు రూపం. 'జగృహే' అని ప్రయో గించడం వల్ల లేని దానిని స్వీకరించారని కాదు. ఉన్నదాన్ని వ్యక్తం చేశాడని. పరమాత్మ శరీరం నాశనంలేనిది. ఏక దేశంగాకూడా దానికి నాశనం లేదు. రామకృష్ణాద్యవతారాల రూపంలో భగవంతుడు అభివ్యక్తుడైనాడని అర్థం. ఆ దేహాలకు త్యాగం. సామాన్యార్థంలో లేదు. పరమపురుషుని దేహాలన్నీ నిత్యాలే! వాటికి త్యాగ స్వీకారాలు లేవు. అవి ప్రకృతి జన్యాలుకావు. అవి సర్వగుణ పరి పూర్ణాలయిన జ్ఞానాత్మకాలు.

పరమాత్మ యోగనిద్రలో ఉన్నారంటే తన సామర్థ్యాన్ని ప్రకటించక పోవడ మన్నమాట!

"యస్యాంభసి శయానస్య యోగనిద్రాంవితన్వతః।
నాభిహ్రదాంబుజా దాసీద్బ్రహ్మావిశ్వ సృజాం పతిః॥ (శ్లో-2)

ప్రళయకాలంలో సమస్త ప్రపంచం ఏకార్ణవమైనప్పుడు, సమాధిరూప యోగనిద్రలో ఉన్న భగవంతుని నాభికమలం నుండి, లోకాన్ని సృష్టించే మరీచ్యాది ప్రజాపతుల కధినాథుడైన బ్రహ్మ ఉదయించాడు.

పోతన భాగవతం ఇలా నడిచింది. "మొదల నద్దేవుండు కౌమారాఖ్య స్వర్గంబు నాశ్రయించి బ్రహ్మణ్యుండై దుశ్చరంబైన బ్రహ్మచర్యంబు చరియించె"

ఎవ్వరికిని అనుష్ఠించడం సాధ్యంకాని బ్రహ్మచర్యాన్ని నిర్వహిస్తూ బ్రహ్మణ్యుడై సనత్కుమారావతారాన్ని అయన ఎత్తాడు. ఇది ప్రథమావతారం.

"రెండవమారు జగజ్జననంబు కొఱకు రసాతలగతయైన భూమి నెత్తుచు యజ్ఞేశుండయి వరాహదేహంబు దాల్చె."

జగదుద్భవం కోసం, పాతాళాన్ని పొందిన భూమిని యజ్ఞేశుడై వరాహ దేహాన్ని ధరించి ఉద్ధరించాడు. "యజ్ఞేశస్సౌకరం వపుః" అని మూలంలో ఉంది. అంటే ఇది యాజ్ఞాధిష్ఠాతృ ధర్మరూపమైన అవతారమన్నమాట, ఈ సూకర దేహం అప్రాకృతమని గ్రహించాలి. ''యజ్ఞోవై విష్ణుః" మధ్వ సంప్రదాయనికి చెందిన విజయధ్వజ వ్యాఖ్య-యజ్ఞప్రవర్తకుడైన పురుషనామక నారాయణుని ఈ దేహమునుండి యజ్ఞానికి కావలసిన సామగ్రి పుట్టడంచేత యజ్ఞేశనామకు డయ్యాడు-అంటుంది.

"మూడవ లోయంబున నారదుండను దేవర్షియై, కర్మనిర్మోచకంబైన వైష్ణవ తంత్రంబు సెప్పె."

మూడో సర్గం ఋషిసర్గం, నారద పాంచరాత్రం అని ప్రసిద్ధిపొందిన వైష్ణవ తంత్రాన్ని నారదర్షియై వెలువరించిన అవతారమిది. కర్మలవల్ల ఏర్పడే సుఖదుఃఖాలకు కారణంగాని వైష్ణవతంత్రం ఇది. అంటే, కర్మలను భగవదర్పితంగాచేస్తే వాటివల్లవచ్చే సుఖదుఃఖాదులు జీవున కేర్పడవని తెలి పేదన్నమాట. మూలంలో "నైష్కర్మ్యం కర్మణాం యతః" అని ఉంది. కొందరు, "ఓం నమో

భగవతే వాసుదేవాయ" అనే ద్వాదశాక్షరియే స్వరూపంగా ఉన్న" భాగవతమే'' ఈ విష్ణుతంత్రమని, దాన్ని నారదుడు వ్యాసున కుపదేశించినాడని అంటారు!

"నాల్గవవరి ధర్మ భార్యా సర్గంబునందు నరనారాయణాభిధానుండై దుష్కరంబైన తపంబు సేసె."

ధర్ముని (యముని) పత్నియైన మూర్తిదేవి యందు భగవంతుడు నరనారాయణులుగా అవతరించి దుష్కరమైన తపస్సు చేశారు. నరనారాయణు లిద్దరు ఒకే అవతారంగా ప్రసిద్ధమైన విషయం. మూలంలో ఇక్కడ "ధర్మకలాసర్గే"అని ఉంది. ఈ "ధర్మకలా" శబ్దాన్ని వివిధ వ్యాఖ్యాతలు వివిధరీతులలో అర్థంచేసుకొని తదనుగుణంగా వ్యాఖ్యానించారు. శ్రీధరస్వామి "కలా" శబ్దాన్ని. అంశ అని గ్రహించి. భార్యగా (అర్ధాంగి) వ్యాఖ్యానించారు. ("అర్ధోవా ఏష ఆత్మనో యత్పత్నీ''- శ్రుతి) పోతన స్వామినే అనుసరించారు. ఈ అవతారంలో చేసిన తపస్సు లోకహితంకోసం ధారపోయడం జరిగింది. ఇక్కడ నరావతారం ఆవేశావతారం అని, నారాయణావతారం స్వరూపావతారం అని విశేషార్థం చెప్పడం ఉంది. ఈ నరుడు శేషుడే!

"పంచమావతారంబునం గపిలుండను సిద్ధేశుండయి యాసురియను బ్రాహ్మణునకుఁ దత్త్వగ్రామ నిర్ణయంబుగల సాంఖ్యంబు నుపదేశించె."

ఈ అవతారానికి వాసుదేవుడనే పేరుకూడా ఉంది. సిద్ధపురుషులైన బ్రహ్మాదులకు కూడా నియామకుడు కావడంచేత "సిద్ధేశః'' శబ్దం సార్థకం. ఆసురి అను సచ్ఛిష్యునకు (బ్రహ్మాది దేవతలకు, భృగువు మొదలైన ఋషులకు) వేదార్థపూర్ణమైన సాంఖ్యశాస్త్రాన్ని ఉపదేశించారు. దీనిలో ''ప్రధానం" మొదలైన ఇరవైనాల్గు తత్త్వాల నిరూపణ జరిగింది. కాలతిరోహితమైన ఈ శాస్త్రాన్ని ఉద్ధరించారు. ఇది బయలుదేరిన తరువాత దీని మందనమో, ఖండనమో చేయని శాస్త్రంగాని శాస్త్రవేత్తగాని లేకపోవడం లేదు. వేద విరుద్ధమైన సాంఖ్యదర్శనాన్ని ధర్శించి, "ఆసురి అనే పేరే ఉన్న ఒక శిష్యునకు" దాన్ని ఉపదేశించిన "ఇంకో కపిలుడున్నా"డని నామసామ్యాన్ని బట్టి మోసపోరాదని హెచ్చరించిన వారున్నారు.

"ఆఱవశరీరంబున ననసూయాదేవి యందు నత్రిమహామునికిఁ గుమారుఁడై యలర్కునకుఁ బ్రహ్లాదముఖ్యులకు నాత్మవిద్యఁ దెలిపె.

అనసూయాదేవి అభ్యర్థన మేరకు పరమేశ్వరుడు దత్తాత్రేయుడై అనసూయా త్రిదంపతులకు జన్మించాడు. ఈ అవతారంలో అలర్క ప్రహ్లాదాదులకు ఆత్మవిద్యను (అన్వీక్షికి)లోధించెను. భారతీయజగత్తులో యోగవిద్యావిర్భావానికి ఈయనయే మూలపురుషుడనవచ్చును.

"ఏడవ విగ్రహంబున నాకూతి యందు రుచికి జన్మించి యజ్ఞుండనఁ బ్రకాశమానుండై యామాదిదేవతలతోడంగూడి స్వాయంభువ మన్వంతరంబును రక్షించె".

యజ్ఞావతారం ఏడవది. రుచియాకూతులను దంపతులకు జన్మించాడు. యామాది దేవతలతోగూడి తానే ఇంద్రపదవి నధిష్ఠించి స్వాయంభువ మన్వంతరాన్ని (మూలంలో "అపాత్" అని ఉంది.) రక్షించి పాలించాడు. ఆకూతి స్వాయంభువుని కూతురు, రుచిప్రజాపతి.

"అష్టమమూర్తిని మేరుదేవియందు నాభికి జన్మించి యురుక్రముండనం బ్రసిద్ధుఁడై విద్వజ్జనులకుఁ బరమహంస మార్గంబుం బ్రకటించె."

అగ్నీధ్రపుత్రుడైన నాభికిని మేరు దేవికిని పుత్రుడై భగవంతుడవతరించెను ఇది ఋషభ (వృషభ) భావతారం. పోతనమూలంలో ఉన్నట్లే "ఉరుక్రమః" (ఉరుక్రముడు) అన్నాడు. ఋషభావతారమని చెప్పలేదు. అన్ని ఆశ్రమాలలో ఉన్నవారు నమస్కరించడానికి వీలయిన మార్గాన్ని ధీరులకు ప్రకటించాడు. అది పరమహంస మార్గం. ("దర్శయన్ వర్త్మ ధీరాణాం సర్వాశ్రమ నమస్కృతమ్". మూలం )

"ఋషులచేతఁ గోరంబడి తొమ్మిదవ జన్మంబునఁ బృథుచక్రవర్తియై భూమిని ధేనువుంజేసి సమస్త వస్తువులం బిదికె."

ఋషులు ప్రార్థించగా వచ్చిన అవతారం ధర్మభ్రష్టుడైన వేనరాజు దక్షిణబాహువును మథించగా నారాయణాంశజాతైన పురుషుడు, లక్ష్మీకళాశోభితయైన స్త్రీ ఉదయించారు. పురుషుడు పృథుచక్రవర్తి, స్త్రీ అతని భార్య అయిన అర్చి. ఇది సాక్షాదవతారం కాదని విశిష్టాద్వైత పరమైన వీరరాఘవ వ్యాఖ్య అన్నది. శరీరావిష్టావతారమన్నారు. ("అవివేశ పృథుందేవః శంఖీ చక్రీ చతుర్భుజః".

పద్మపురాణం) పృథుచక్రవర్తి భూమినే ధేనువుగాచేసి సమస్త పదార్థాలను పిదికాడు. సమస్త వస్తుజాతంతో జగత్తు సారభూతమైంది

"చాక్షుష మన్వంతర సంప్లవంబున దశమంబయిన మీనావతారంబునొంది మహీరూపంబగు నావనెక్కించి వైవస్వత మనువు నుద్ధరించె."

వాసుదేవరూపియైన శ్రీమన్నారాయణుడు చాక్షుష మన్వంతర ప్రళయ కాలంలో భూరూపమైన నావనెక్కించి సూర్యపుత్రుడైన వైవస్వతుని (సత్యవ్రతుడు) రక్షించాడు. భావిమన్వంతరాధిపతి సత్యవ్రతుడు. ఇందువల్ల భగవంతుడు ఈయనను రక్షించాడు. వైవస్వత మన్వంతరానికి ముందు మన్వంతరం చాక్షుష మన్వంతరం.

"సముద్ర మథనకాలంబునం బదునొకండవమాఱు కమఠాకృతిని మందరాచలంబు దన పృష్ఠ కర్పరంబున నేర్పరియై నిలిపె."

దేవదానవులు అమృతంకోసం సముద్రాన్ని మందరపర్వతాన్ని కవ్వంగా, వాసుకిని తాడుగా చేసి మథిస్తున్నప్పుడు, ఆ పర్వతం సముద్రంలో మునిగి పోకుండా భగవంతుడు కమఠరూపాన్ని ధరించి దాన్ని తన వీపుమీద మోశాడు. (భగవంతుని అవతారాలు సృష్టి పరిణామాన్ని వ్యక్తంచేసే సాంకేతికాలుగా గ్రహించిన ఆధునికులు కొందరు. మీనావతారం జలచరావిర్భావానికి, కమఠావతారం ఉభయచర (భూ, జల) ఆవిర్భావానికి సూచనలంటారు.)

"ధన్వంతరి యనఁబండ్రెండవ తనువున సురాసుర మథ్యమాన క్షీర పాథోధి మధ్యభాగంబున నమృత కలశహస్తుండై వెడలె."

పరమేశ్వరుడు సముద్రగర్భం నుండి అమృతపాత్రతో ఆవిర్భవించాడు. ఇది ధన్వంతరి అవతారం. రాక్షసులు అమృత కలశాన్ని లాగికొన్నారు.

"పదుమూడవది యయిన మోహినీ వేషంబున నసురుల మోహితులంజేసి సురల నమృతాహారుల గావించె."

భగవంతుడు స్త్రీరూపం దాల్చి మోహినియై రాక్షసులను మోహితులనుచేసి అమృతాన్ని దేవతలకు ద్రావనిచ్చాడు. మోహినీరూపం పరమాత్ముని నిజమైన

అవతారమేగాని మాయకాదు. ఈ రెండవతారాలను కలిపి మూలంలో ఒకశ్లోకం ఇలా ఉంది :

"ధాన్వంతరం ద్వాదశమం, త్రయోదశమమేవచ ।
అపాయ యత్సురా నన్యాన్మోహిన్యా మోహయన్ స్త్రియా॥"

(ఈ శ్లోకంలోని "ద్వాదశమం", "త్రయోదశమం". ఆర్ష ప్రయోగాలు)

మోహిని అవతరంలో తనవారుకాని (అన్యాన్) రాక్షసులను మోహింప జేశాడు. ధన్వంతరి రూపంతో అమృతం తెచ్చి, మోహినీరూపంతో దాన్ని దేవత లకు పంచాడు.

"పదునాలుగవదియైన నరసింహరూపంబునం గనక కశిపుని సంహరించె".

మూలశ్లోకంలో 'చాపలల్లేవాడు జంబుగడ్డిని రెండుగా చీల్చేటట్లు హిరణ్య (కనక) కశిపుని వక్షాన్ని చీల్చాడు". (దదార కరజైర్వక్ష స్యేరకాన్ కట కృద్యథా- మూలం) ఈ ఉపమానం అంతబాగాలేదని కాని, అనావశ్యకమనిగాని భావించి పోతన దీన్ని విడిచి "సంహరించె" అని వ్రాశాడు అసురప్రవృత్తి ప్రబలి ఉన్న సమాజంలో నుండేదాన్ని ఎదిరించే ప్రవృత్తి చిన్నగానైనా- ప్రహ్లాదుడు బాలుడు- దైవానుగ్రహంగా మొలకఎత్తి' దాన్ని నాశనం చేస్తుంది అనడానికి ఈ అవతారం తార్కాణం అనవచ్చును. స్తబ్ధంగా ఉన్న- అసుర ప్రవృత్తిని ఎది రించే శక్తి లేనట్లున్న-ఆ జడ సమాజంలోనుండే- స్తంభంనుండి- దైవశక్తి ప్రక టితమైంది.

"పదునేనవది అయిన కపట వామనావతారంబున బలిని బదత్రయంబు యాచించి మూఁడు లోకంబుల నాక్రమించె."

దేవతలనుండి బలిచక్రవర్తి లాగుకొన్న త్రివిష్టపాన్ని తిరిగి దేవతల కియ్యడంకోసం ఎత్తిన అవతారం ఇది. సత్పురుషులైన భక్తుల కోర్కెలను తీర్చ డానికి భగవంతుడు యాచించడానికికూడా వెనుదీయడని గ్రహించవచ్చును. అహంకారం పతనహేతువని ఈ బలి వామనుల చరిత్ర మనకు తెలుపుతోంది.

ఈ మూడడుగుల ఆక్రమణ- మానవునిలోని అన్నమయ, ప్రాణమయ, మనోమయ కోశాల స్వాధీనతకు ప్రతీకగా గ్రహించి- వీటిని స్వాధీనం చేసుకొన్న

వామనుడైన మానవుడు త్రివిక్రమునిగా విజృంభించగలడని సాంకేతికార్థం చెప్పే వారున్నారు.

"పదునాఱవదియైన భార్గవ రామాకృతిని గుపితచాపంబుదాల్చి బ్రాహ్మణ ద్రోహులయిన రాజుల నిరువదియొక్కమాఱు వధియించి భూమినిః క్షత్రంబుఁ గావించె".

భృగువంశంలో పుట్టినవాడు గనుక భార్గవరాముడయ్యాడు. జమదగ్ని కుమారుడు. వేదధర్మ విరుద్ధంగా ప్రవర్తిస్తున్న పాలకులను పరశువుతో ఖండించి పరశురాముడయ్యాడు. పరమేశ్వరునకు తమోగుణమైన కోపంలేదు. ఉన్నట్లుగా వ్యవహరించాడు. అని సూచించడానికి "కుపితచాపంబుదాల్చి" అని పోతన వ్రాశాడు మూలంలో "కుపితః" అని ఉంది. వ్యాఖ్యాతలు "కుపితస్సన్"అన్నారు. "ధర్మద్రుహో నృపాన్" అని మూలంలో ఉంది.

ధర్మరక్షణయందు శ్రద్ధతగ్గి, పాలకులు స్వలాభాపేక్షతో నిరంకుశులై హింసా ప్రవృత్తి కలిగి పాలిస్తున్నప్పుడు, ఆ ప్రవృత్తిని నాశనం చెయ్యడానికి శస్త్రంపట్టి, ధర్మాత్మకమైన బ్రహ్మశక్తి, రక్షణాత్మకమైన క్షత్రియశక్తి పరస్పర పోషకాలుగా కృషిచేస్తాయని నిరూపించడం ఈ అవతార కర్తవ్యం. ధర్మాత్మకమైన బ్రహ్మశక్తికి ప్రతీకగా జమదగ్ని, నిరంకుశ హింసాశక్తికి ప్రతినిధిగా కార్తవీర్యార్జునుడు ఇక్కడ నిలిచారు. నిరంకుశమైన హింసా ప్రవృత్తి ఉన్న క్షత్రియశక్తి (పాలకుంశక్తి) సాత్త్విక బ్రహ్మశక్తిని (మేధావుల శక్తిని) బాధిస్తున్నప్పుడు బ్రహ్మక్షత్రియ శక్తుల "పుంజీభూతశక్తి" అవతరించి ధర్మరక్ష చేస్తుంది ("ఇదం బ్రాహ్మమిదం క్షాత్రం, శాపాదపి శరాదపి")

"పదునేడవదియైన వ్యాసగాత్రంబున నల్పమతులయిన పురుషులం గరుణించి, వేదవృక్షంబునకు శాఖ లేర్పఱచె."

పరాశరమహర్షి వలది సత్యవతియందు జన్మించిన అవతారం వ్యాసావతారం. మానవులు మందబుద్ధులై వేదాలను తెలుసుకొనలేకపోతున్నారని గ్రహించి వేదవృక్షానికి శాఖలను ఏర్పరచి వాటిని నేర్చుకోవడం సుగమంచేసి వేదరక్షణ చేశాడు.

"పదునెనిమిదవదైన రామాభిధానంబున దేవకార్యార్థంబు రాజత్వంబునొంది సముద్ర నిగ్రహాది పరాక్రమంబులాచరించె."

పరమేశ్వరుడు దశరథుని ఇంటరామునిగా అవతరించి, దుష్టరాక్షసుల నాశనం, సముద్రబంధనం మొదలైన పరాక్రమ కార్యాలను చేశాడు. దేవకార్యార్థమే రాజత్వాన్ని స్వీకరించాడు. ఆదర్శ ప్రభువు రాజధర్మాన్ని ఎలా నిర్వహించాలో చేసిచూపించాడు. పుత్రునిగా, సోదరునిగా, భర్తగా ఆదర్శ జీవితాన్ని నిర్వహించి లోకానికి మార్గదర్శకుడయ్యాడు.

ఇక్కడ సాధారణంగా సామాన్యుల పురాణ జ్ఞానాన్ని అనుసరించి, రామావతారానికి ముందే వ్యాసావతారం- వ్యాసుడు మహాభారత కాలంనాటి వాడు గదా అని- ఎలావచ్చింది? అనే సంశయం కలుగుతుంది. ఈ సందర్భంలో శ్రీమధ్వస్వాములైన విజయధ్వజ తీర్థులవారి వ్యాఖ్యతోడ్పడుతుంది. "వ్యాసావతారం కేవలం ద్వాపరయుగంలోనే వచ్చిందనరాదు. రామునకు ముందుకూడా వ్యాసావతారం ఉంది. వైవస్వత మన్వంతరంలో 3, 7, 16, 25, 28 మహా యుగాలలో వ్యాసావతారం ఉంది. ("తృతీయే సప్తమే చైవ షోడశే పంచవింశకే అష్టావింశే యుగే కృష్ణః సత్యవత్యాం పరాశరాత్"- కూర్మపురాణం) ఇందువల్ల, త్రేతాయుగంలోని రామావతారానికి ముందే వ్యాసావతారమున్నదని తెలుస్తోంది. ఇరవై ఎనిమిదో మహాయుగానికి చెందిన త్రేతాయుగంలో రామావతారం ఉంది కనుక, ఇంతకిముందే వ్యాసావతారం వచ్చింది."

"ఏకోనవింశతి, వింశతి తముంబులైన రామకృష్ణావతారంబులచే యదు వంశంబునందు సంభవించి విశ్వంభరాభారంబు నివారించె."

పంధొమ్మిదో అవతారం బలరామావతారం. ఇరవయ్యో అవతారం కృష్ణావతారం. సమకాలికావతారాలు. వృష్ణివంశంలో జన్మించారు. ఈ రెండవతారాలూ ఒక్క భగవంతునివే! భూభారాన్ని తగ్గించడానికి వచ్చాయి.

ఈ రెండవతారాల విషయంలోను వ్యాఖ్యాతలలో అభిప్రాయ భేదాలున్నాయి. ముఖ్యమైన అభిప్రాయభేదం చెప్పింది విజయధ్వజ వ్యాఖ్య. బలరాముడు సాక్షాదవతారం కాదనీ, రోహిణీ కుమారుడు గనుక విష్ణువుయొక్క శ్వేతకేశరూపంతో శేషావతారమై బలరాము నావేశించిందనీ ఈ వ్యాఖ్యలో ఉంది. దీనికి మహావరాహ పురాణంనుండి ఈ శ్లోకం ఆధారంగా చెప్పబడింది:

"శంఖచక్ర భృదీశేతు శ్వేతవర్ణో మహాభుజః ।
అవిష్టః శ్వేత కేశాత్మా శేషాంశం రోహిణీ సుతమ్ ॥"

వాసుదేవరూపి అయిన శ్రీహరియే అన్ని అవతారాలకు మూలం అని వీరి భావన. కనుక, బలరామునిలో వాసుదేవుని ఆవేశం ద్యోతకం కాగా, కృష్ణుడు సాక్షాత్తుగా వాసుదేవుడే !

ఈ అవతారాలన్నీ ఆదినారాయణునివే. పద్మనాభరూపమే అవతారకారణ మని విజయధ్వజతీర్థులు. ఈ సందర్భంలో వ్యాఖ్యాతలు వారివారి- ద్వైత, విశిష్టాద్వైత, అచింత్య భేదాభేద, అద్వైతాది సిద్ధాంతాల ననుసరించి వ్యాఖ్యానించారు అనాలి. వివిధ అవతార విషయంలో వారిలో ఉన్న అభిప్రాయ భేదాలను కొన్నింటిని గ్రహించాము. వీటన్నిటికంటే ముఖ్యమైనది కృష్ణావతారానికి సంబంధించినది. దీనికి మూలమైన శ్లోకం, చైతన్యాది సంప్రదాయాలకు ప్రాణప్రదమైన శ్లోకం :

"ఏతే చాంశకలాః పుంసః కృష్ణస్తు భగవాన్ స్వయం ।
ఇంద్రారి వ్యాకులం లోకం మృడయంతి యుగేయుగే ॥"

(శ్రీమద్భాగవతమ్-I స్కంధం-3 అధ్యాయం-28 శ్లోకం)

ఈ శ్లోకానికి వ్యాఖ్య వ్రాసిన వారందరు స్వమతానుసారం వ్యాఖ్యవ్రాశారు. ఈ అవతారాలన్నీ శ్రీకృష్ణుడే లోకసంగ్రహంకోసం ఎత్తాడని- ఆయన దశావతారాలలో ఒకరుగా పేర్కొబడినా- ఆయనస్థానం- వాసుదేవ, నారాయణాదులకంటె ఉన్నతమైనదని- విశ్వసించే సంప్రదాయంవారున్నారు. వీరి దృష్టిలో- పురుషకారిణి అయిన శ్రీలక్ష్మీదేవికంటె ప్రేమస్వరూపిణి అయిన శ్రీరాధాదేవి మిన్న ! పరావస్తువైన శ్రీమన్నారాయణునికన్న శ్రీలక్ష్మీదేవిస్థానం ఒక మెట్టు దిగువకాగా, రాధాకృష్ణులే పరమార్థవస్తువు. అని భావించారు. జీవ గోస్వామి. శ్రీచైతన్య మహాప్రభువు అనుయాయి :

"యస్మిన్ సర్వం విలీయేత వస్తుతత్పర మార్థకమ్ ।
ఏతాదృశం పరం బ్రహ్మ రాధాకృష్ణోన సంశయః ॥

ఈ సంప్రదాయం వారిదృష్టిలో- శ్రీమద్భాగవతమ్ లోని శ్రీ రాధను

4)

తెలియజేస్తుంది. శ్రీమత్ అంటే రాధాదేవీ సహితమైన అని అర్థం. ఆమె స్వామి యొక్క పరమానందశక్తి రూపిణి. బృందావనంలో శ్రీరాధాదేవిదే పరమ లక్ష్మీత్వం. ఆమె బృందావనాధీశ్వరి. "పాద్మం"లో ఈ విషయం ఇలా చెప్ప బడింది :

"బృందావనాధిపత్యం చ దత్తం తస్మై ప్రతుష్యతా ।
కృష్ణేనాన్యత్ర దేవితు రాధా బృందావనే వనే ॥"

అక్కడ లక్ష్మీదేవికి స్థానం లేదంటారు "పదేపదే" శ్రీచైతన్య మహాప్రభువు.

శ్రీమద్భాగవతంలోనే- రాసలీలా మహోత్సవంలో శ్రీకృష్ణుని ఆలింగ నాదులతో గోపస్త్రీలకు కలిగిన అనుగ్రహ విశేషం- విష్ణువక్షస్థల నిత్యస్థితికల లక్ష్మీదేవికే కలుగలేదని ఉంది :

"నాఽయం శ్రియోఽంగ ఉ నితాంతరతే ప్రసాద
స్స్వర్యోషితాం నళినగంధరుచాంకుతోఽన్యాః ।
రాసోత్సవేఽస్య భుజదండ గృహీతకంఠ
లబ్ధాశిషాం య ఉదగాద్వ్రజ సుందరీణామ్ ॥"

(దశమస్కంధం-అధ్యాయం-47; శ్లోకం-60)

ఉత్తర భారతంలోని వైష్ణవ సంప్రదాయాలన్నీ- ఇంచుమించుగా- ఈ భావమార్గంలోనే పయనించాయి. వారికి సర్వకారణ కారణుడు కృష్ణుడే !

శ్రీచైతన్య మహాప్రభువు సంప్రదాయానికి చెందినవారు పరమ ప్రామాణిక గ్రంథంగా సంభావించే "బ్రహ్మసంహిత"లో ఇలా ఉంది :

"ఈశ్వరః పరమః కృష్ణః సచ్చిదానంద విగ్రహః ।
అనాదిరాది గోవిందః సర్వకారణ కారణమ్ ॥"

శ్రీచైతన్య మహాప్రభువు తమ దక్షిణదేశ యాత్రలనుండి సంపాదించి తెచ్చిన ఈ గ్రంథాన్ని ఆయన, ఆయన అనుయాయులైన షడ్గోస్వాములు శ్రీమద్భాగవతం తరువాత "బ్రహ్మసంహిత"నే ప్రమాణగ్రంథంగా స్వీకరించారు. భక్తికావ్యంగా "శ్రీకృష్ణకర్ణామృతమ్" అందరూ స్వీకరించారు. ఈ రెండు పుస్త

కాలు లభించడం దక్షిణదేశయాత్రలో జరిగిందని, ప్రేమసిద్ధాంతం వీటిలో వ్యక్తమవుతోందని శ్రీచైతన్య మహాప్రభువు అన్నట్లు శ్రీకృష్ణదాస కవిరాజ తన "చైతన్య చరితామృతమ్" (వంగభాషలో) లో ఇలా చెప్పారు :

తీర్థయాత్రా కథాప్రభు సకల కహిలా ।
కర్ణామృత బ్రహ్మసంహితా దుఇ పుంథి దిలా ॥"
"ప్రభుకహే తుమి జే ప్రేమసిద్ధాంత కహిలే ।
ఏఇ దుఇ పుస్తకే నేఇ సాక్షీ దిలే ॥"

ఈ రెండు గ్రంథములు శ్రీకృష్ణుడే పరమ పురుషుడని, స్వయం భగవానుడనీ నిర్ద్వంద్వంగా ప్రకటించడంవల్లనే ఈ సంప్రదాయంవారికి ఇవిరెండూ పరమ పవిత్ర గ్రంథాలు అయ్యాయి.

శ్రీకృష్ణుడే సమస్తావతారాలకు మూలకారణమని, ఆయన అవతారాలలో ఒక అవతారం కాదని వీరు ఘోషిస్తారు. ఆయన స్వయంగా భగవంతుడే అని వీరి విశ్వాసం. ఇంక, విశిష్టాద్వైతపరంగా వ్యాఖ్య వ్రాసిన వీరరాఘవీయకారుని దృష్టిలో శ్రీహరి కళలు. శ్రీకృష్ణుడు షడ్గుణముల పరిపూర్ణ విలాసమున్నవాడు. మిగిలినవారు అంశకళలు, అంశాంశకళలు. పరమపురుషుడు శ్రీహరి, శ్రీమన్నారాయణుడు. ఇంక మధ్వసంప్రదాయానుసారం నడిచిన విజయధ్వజటీకలో అంశాంశలు కొందరు, ప్రతిబింబాంశలు కొందరు. బలరామునియందు వాసుదేవుని ఆవేశం, శ్రీకృష్ణావతారం స్వయంగా వాసుదేవుడే! ఈ సందర్భంలో ఆయన- "స ఏవ ప్రథమం దేవః కౌమారం... "మొదలుకొని" అథాఽసౌయుగ సంధ్యాయాం" అనే శ్లోకం వరకు (6 నుండి 24 దివరకి) చెప్పబడిన సమస్తావతారాలు శేషశాయి అయిన శ్రీహరియొక్క స్వరూపావతారాలే అంటాడు పోతనామాత్యుడు "హరికృష్ణుండు బలానుజన్ము(డెరశేదా విష్ణు(డౌ నేర్పడన్" అని రచించారు. శేషశాయి, మేఘశ్యాముడు అయిన కృష్ణుడు మూలరూపియైన పద్మనాభుడు. స్వయంగా భగవంతుడు. కృష్ణుడంటే మూలరూపుడైన వాసుదేవుడే అనీ, ఆయనకూ కృష్ణుడనే పేరు ఉన్నదనీ, "కృష్ణస్తు భగవాన్ స్వయమ్" అన్నప్పుడు ఈ మూలరూపుడైన వాసుదేవునే గ్రహించాలని ఈయన వ్యాఖ్యానం. అంటే, ఈ భగవానుడు అవతార పురుషుడైన కృష్ణుడు కాదన్నమాట! స్వమతానుసారం వ్రాసిన ఈ వ్యాఖ్యాతలు పరస్పరం ఇంత భేదిస్తున్నారు!

"ఏకవింశతితమంబైన బుద్ధనామధేయంబునం గలియుగాద్యవసరంబున రాక్షస సమ్మోహనంబు కొఱకు మధ్యగయా ప్రదేశంబున జినసుతుండయి తేజరిల్లు." (మూలం- "బుద్ధోనామ్నా జినసుతః కీకటేషు భవిష్యతి") కలియుగం బాగా వ్యాపించినప్పుడు దేవతల శత్రువులయిన రాక్షసులను సమ్మోహనం చేయడంకోసం "జినసుతుడై" బుద్ధుడనే పేరుతో అవతరిస్తాడు. ఇది అనాటికి భవిష్యదవతారం గనుక "భవిష్యతి" అని సంస్కృతంలో ఉంది. తెలుగులోకూడా "తేజరిల్లు" అని ఉంది.

అయితే ఈ బుద్ధుడు, శుద్ధోదనుని కుమారుడైన బుద్ధుడు కాడనీ జినసుతుడని చెప్పేవారున్నారు. జినసుతుడన్నంతమాత్రంచేత, జినుని పుత్రునిగా స్వీకరించరాదనీ- అసురాంశగల జినునకు హరిపుత్రుడగుట పొసగదనీ- మార్గమధ్యంలో లభించిన బాలుని పుత్రునిగా జినుడు స్వీకరించాడనీ బ్రహ్మాండ పురాణాన్ని అనుసరించి కొందరు వ్యాఖ్యాతలు వ్రాశారు.

"మోహనార్థం దానవానాం బాలరూపీ పథిస్థితః ।
పుత్రంతం కల్పయామాస మూఢబుద్ధిః జినస్స్వయమ్ ॥

తతస్సం మోహయామాస జినాద్యానసురంశకాన్ ।
భగవాన్ వాగ్భిరుగ్రాభిః అహింసావాదిభిర్హరిః ॥"

అహింస పరమధర్మమని ప్రచారం చేస్తూ యజ్ఞయాగాది (పశుహింస ఉన్నవాటిని) నిరసనవల్ల వేదవిరుద్ధంగా మాట్లాడుతూ అసురులను మోహితుల్ని చేశాడని వ్యాఖ్యానం

సంప్రదాయసిద్ధంగా ప్రవర్తిస్తూ, దశావతారాలను స్తోత్రం చేసేవారి స్తోత్రాదికంలో బుద్ధావతారం కనబడదు "శ్రీవేంకటేశ సుప్రభాతం"లో. దశావతార స్వరూపుడైన శ్రీ శేషాచలపతి వర్ణనలో "బుద్ధావతారం" కనబడదు :

"మీనాకృతే కమఠకోల నృసింహవర్ణిన్
స్వామిన్ పరశ్వథ తపోధన రామచంద్ర
శేషాంశరామ యదునందన కల్కిరూప
శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥"

కవితార్కికసింహ, సర్వతంత్ర స్వతంత్ర బిరుదాంకితులైన శ్రీమద్వేంకట నాథ విరచితమైన శ్రీదశావతార స్తోత్రంలో దశావతారాల ప్రత్యేక శ్లోకాలు అయిన తరువాత సమాహారంగా క్రింది శ్లోకం ఉంది :

"ఇచ్ఛామీన విహారకచ్ఛప మహాపోత్రి న్యదృచ్ఛాహరే
రక్షావామన రోషరామ కరుణా కాకుత్స్థ హేలాహలిన్
క్రీడావల్లవ కల్కివాహన దశా కల్కిన్నితి ప్రత్యహం
జల్పంతః పురుషాః పునంతు భువనం పుణ్యౌఘపణ్యాపణాః॥"

లోకంలో మాత్రం మాయాదేవి శుద్ధోదన పుత్రుడైన గౌతమ సిద్ధార్థుడే-బుద్ధుడైన తరువాత- బుద్ధావతారంగా స్వీకృతుడయ్యాడనే విశ్వాసం ప్రబలంగా ఉంది ! గీతగోవిందంలో "కారుణ్యమాతన్వతే" అని ఉంది !

"యుగసంధియందు వసుంధరాధీశులు చోరప్రాయులై సంచరింప విష్ణు యశుండను విప్రునికి గల్కియను పేర నుదృవింపంగలండు." (అథాసౌ యుగ సంధ్యాయాం దస్యు ప్రాయేషు రాజసు । జనితా విష్ణు యశసో నామ్నా కల్కిః జగద్గురుః ॥")

"కల్కి" అవతారంకూడా భవిష్యదవతారమే. చోరులకు పరిపాలకులకు భేదం లేకుండా సమాజం భ్రష్టమైనప్పుడు, విష్ణుయశుడనే విప్రునకు భగవానుడు "కల్కి" అనే పేరుతో అవతరించి, శిష్టరక్షణ దుష్టశిక్షణ చేస్తాడు.

శ్రీహరి అవతారాలు అసంఖ్యాకాలని శ్రీమద్భాగవతం పేర్కొన్నది ("అవ తారాహ్య సంఖ్యేయా హరేస్సత్త్వ నిధేర్ద్విజాః । యథాఽవిదాసినః కుల్యాః సర సస్స్యుః సహస్రశః ॥) ఈ విషయాన్నే పోతనామాత్యుడు ఇలా చెప్పాడు :

"సరసింబాసినఁ బాయు కాలువల యోజన్ విష్ణునందైన శ్రీ
కరనానా ప్రకటావతారములసంఖ్యాకంబులు....".

అవతారాలన్నీ ఇంద్ర శత్రువులైన రాక్షసులచేత బాధపొందుతూ ఉన్న లోకాల్ని రక్షించడానికి వచ్చినవే. ("ఇంద్రారి వ్యాకులం లోకం మృడయంతి యుగేయుగే") భగవద్గీతలో శ్రీకృష్ణభగవానుడు చెప్పినట్లు : (IV; 7, 8)

"యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్॥"
పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥

శ్రీమద్భాగవతంలో అవతార ప్రయోజనం పోతనామాత్యుడు కూడా ఇలా వర్ణించాడు :

"భగవంతుండగు విష్ణుఁడు
జగములకెవ్వేళ రాక్షస వ్యధగలుగున్
దగ నవ్వేళల దడయక
యుగయుగమునఁ బుట్టి కాచునుద్యల్లీలన్".

వివిధ భాగవత సంప్రదాయాలలో అవతారాల సంఖ్య విషయంలో, క్రమం విషయంలో "జన్మాదికం" విషయంలో అభిప్రాయ భేదాలున్నట్లు తెలిసినదే! కాని, వాటియందలి భక్తి విషయంలో, వాటి ప్రయోజనాల విషయంలో, ఏ సంప్రదాయం వారికి సంశయం లేదు. ఆచార్య పురుషుల తాత్త్విక సిద్ధాంతాల అలజడి లేని సామాన్య భక్తులకందరికీ అవతారార్చన కొంగుబంగారం. పురుషార్థసాధనకు ఆలంబనం. అవతారాలనుగూర్చి సంస్కృత భాగవతంలో శ్రీవేదవ్యాసుడు :

"జన్మగుహ్యం భగవతోయ ఏతత్ప్రయతో నరః ।
సాయంప్రాతః గృణన్ భక్త్యాదుఃఖ గ్రామాద్విముచ్యతే ॥"

అని అంటే, భక్తకవి పోతన ఇలా అన్నాడు :

"అతిరహస్యమైన హరిజన్మ కథనంబు
మనుజుఁడెవ్వఁడేని మాపు రేపుఁ
జాలభక్తితోడఁ జదివిన సంసార
దుఃఖరాశిఁ బాసి తొలఁగిపోవు."

# అనుబంధం - 2

# శ్రీమద్భాగవతాంతర్గత "రాసపంచాధ్యాయి" వైశిష్ట్యం

పరాకృత నమద్బృందం పరం బ్రహ్మ నరాకృతి ।
సౌందర్యసార సర్వస్వం వందేనందాత్మజం మహః॥

—మధుసూదన సరస్వతి

సౌందర్యసార సర్వస్వమయిన నందనందనుడి లీలావిలాస ప్రసంగమే శ్రీమద్భాగవత విషయం. వేదాదివిభాగం చేసినా అనేకపురాణాలు కూర్చినా శ్రీ వ్యాసమహర్షికి మనశ్శాంతి కలగలేదు. కాతరహృదయుడైన ఆ మహర్షికి చిత్తశాంతిని పరితుష్టిని కలిగించింది భాగవతగ్రథనమని సంప్రదాయ వాక్కు. ఆయన ద్వారా ఆయన పుత్రుడైన శ్రీ శుకమహర్షికి ఈ మహాపురాణం లభించింది. ప్రాయోపవిష్టుడయిన పరీక్షిన్నృపాలుడికి శ్రీ శుకయోగి దీన్ని వినిపించారు. అక్కడ ఉండి దీన్ని విన్న శ్రీ సూతుడు శౌనకాది మహామునులకి శ్రీమద్భాగవతాన్ని చెప్పడం జరిగింది. ఆ మునుల పరంపరగా ఇది లోకంలో ప్రసిద్ధికి వచ్చింది. ఇది సంప్రదాయజ్ఞుల కథనం. నాటినుండి నేటిదాకా భక్తజనుల హృత్తాపహారి శ్రీమద్భాగవతం. భక్తలోకంలో దీనికున్నంత ప్రచారం ఇంక ఏ పురాణానికీ లేదంటే సత్యదూరం కాదు. శ్రీమద్రామాయణ మహాభారతాలలోపాటు దీనికి అనేతుశితనగ వ్యాప్తి ఉంది. అయితే, కొన్ని సంప్రదాయాంలో శ్రీమద్రామాయణానికి, కొన్ని సంప్రదాయాలలో శ్రీమద్భాగవతానికి ప్రముఖ స్థానం ఉంది.

శ్రీమద్భాగవత మహాపురాణంలో దశమస్కంధంలో 29 నుండి 33వరకు ఉన్న 5 అధ్యాయాలు శ్రీ రాసపంచాధ్యాయి అనే పేరుతో విఖ్యాతాలు. వైష్ణవ పరంపర శ్రీమద్భాగవతాన్ని నందనందనుడైన శ్రీకృష్ణుడి వాఙ్మయీ మూర్తిగా

స్వీకరించింది ద్వాదశస్కంధాలికి అంగప్రత్యంగ కల్పనచేసి శ్రీ రామచంద్రాధ్యాయి భగవానుడి పంచప్రాణాలు అంది.

రాస శబ్దానికి మూలం రసశబ్దం. రసం స్వయంగా భగవంతుడైన శ్రీకృష్ణ స్వరూపం. రసోవైసః. ఒకేరసం అనేక రసాలుగా అభివ్యక్తం కావడం, సర్వ రసస్వరూపంగా మూర్తిభవించడం, స్వయంగా ఆస్వాద - ఆస్వాదకభావం పొందడం, విభిన్న ఆలంబనాలుగా భాసించడం రాసక్రీడ.

మొట్టమొదటిసారిగా హరివంశంలో రాసశబ్దానికి హల్లీసకశబ్దం ప్రయుక్తమైనట్లు నీలకంఠ విరచిత వ్యాఖ్యలో కనబడుతుంది.

"హల్లీసక క్రీడనం ఏకస్యైవపుంసః
బహుభిః స్త్రీభిః క్రీడనం సైవ రాసక్రీడా"

(హరివంశం, విష్ణుపర్వం-20, 35. నీలకంఠ టీక)

హర్షచరితంలో బాణభట్టు మండలీనృత్తమయిన రాసం వివరించాడు.

"రైణవావర్త మండలీరేచక రాసరస రభసారబ్ధ నర్తనారంభా రభటీ నటాః" (పుట 22)

మండలీనృత్తమే హల్లీసక రూపంగా అభిజ్ఞాతమయింది. ఇది ఒక పురుషుడు అనేక స్త్రీలతో నృత్యం చెయ్యడం. సరస్వతీకంఠాభరణంలో శ్రీకృష్ణ గోపికల నృత్యం హల్లీసకానికి దృష్టాంతంగా ఉంది.

మండలేన తు యత్ స్త్రీణాం నృత్తం హల్లీసకం తు తత్ ।
తత్రనేతా భవేదేకో గోపస్త్రీణాం యథా హరిః॥

(సరస్వతీ కంఠాభరణం-2, 156)

డా॥ వాసుదేవశరణ్ అగ్రవాల్ దృష్టి ననుసరించి హల్లీసకం యవనుల 'ఇలీషియన్' (ఇలీషియన్ మిస్ట్రీ డాన్స్) నృత్యం నుంచి క్రీస్తు శకారంభంలో వచ్చింది. (హర్షచరిత్ ఏక్ సాంస్కృతిక్ అధ్యయన్. పుట 33)

రాసంలో 8, 16, 32 మంది స్త్రీపురుషులు మండలంగా ఏర్పడి చేతులు కలిపి నృత్యం చేస్తారు దీన్ని పిండిబంధం అనడం ఉంది.

అష్టౌ షోడశ ద్వాత్రింశద్యత్ర నృత్యంతి నాయికాః।
పిండీబంధానుసారేణ తన్నృత్తం రాసకం స్మృతమ్॥

(రాస్ ఔర్ రాసాన్వయీ కావ్య కీ ప్రస్తావనా- పుట 11)

రాసలీలా హల్లీసకాల మూలభద్ధమాలికి సంబంధించిన శ్రుతి సంకేతాన్ని నీలకంఠుడు, హరివంశానికి తాను వ్రాసిన టీకలో ఇలా పేర్కొన్నాడు.

పద్మావస్తే పురురూపా వపూంషి మధ్యే త్రీణి రేరిహాణా।
ఋతస్య సద్మ విచరామి విద్వాన్మహదేవానా మసురత్వ మేకమ్॥

హరివంశం, విష్ణుపర్వం-20, 25. నీలకంఠుడు ఉదాహరించింది)

దీనిలో గోపీజనుల మధ్య నృత్యంచేస్తూఉన్న శ్రీకృష్ణుడి అద్భుత సుషమ అనుపమంగా చిత్రితమయింది. శ్రీకృష్ణుడికి-పద్మా, పురురూపా అనే రెండు విశేషణాలు ప్రయోగించడం జరిగింది.

మొదటి విశేషణానికి గోపికలద్వారా అభిసరించడానికి తగిన విగ్రహం కలవాడని అర్థం.

"పత్తు మభిసారిణీభి ర్గోపీభిరభిసర్తుం యోగ్యః" (నీలకంఠుడు)

ప్రతిగోపిక తనతో నృత్యంచెయ్యడానికి అనువుగా శ్రీకృష్ణుడు అనేక రూపాల్ని ధారణచేసినట్లు వ్యక్తంచేసేది రెండో విశేషణం. "వపూంషిఅస్తే"ద్వారా ఇది స్పష్టం అవుతోంది. ఇదిగాక, గోపీసంపర్కం లేకుండాదా ఉంటాడు.

"ఊర్ధ్వా గోపీ సంపర్కం వినా తస్థౌ" (నీలకంఠుడు)

ఎడమవైపు, కుడివైపు, ముందు ఉన్న గోపికల దృష్టులు శ్రీకృష్ణుడి మీద పడుతున్నాయి.

"త్ర్యవిమ్ త్రీన్ దేశాన్ పార్శ్వద్వయం పురస్తాచ్చరేరిహాణా గిలంతి" (నీలకంఠుడు)

శ్రుతిలో ఉన్న ఈ వర్ణనాత్మక చిత్రం, భాగవతమహాపురాణంలో వర్ల వితమై పూర్ణరూపంలో దృష్టిగోచరమవుతోంది.

హరివంశపురాణంలోని విష్ణుపర్వంలో రాసలీలావర్ణన 21 శ్లోకాలలో ఉంది. ఇక్కడ హల్లీసక శబ్దప్రయోగం కూడ జరిగింది. ఇది రాసలీల ప్రథమ వర్ణనం కాబట్టి కాబోలు, సంక్షిప్తంగా ఉంది. దీనికి రెండు కారణాలు ఉన్నాయి. (1) రాధ లేకపోవడం (2) శ్రీకృష్ణయోగంలో గోపికలు ముక్తలయ్యారని చెప్పడం లేకపోవడం.

శరద్రాత్రిని చూచి శ్రీకృష్ణుడు క్రీడించాలని ఇచ్ఛ చూపించడం హరివంశంలో ఉంది. వనమాలధరించిన శ్రీకృష్ణుడు గోపికలమధ్య ఉంటాడు. అప్పుడప్పుడు గోపికలు నయనకటాక్షసరణిద్వారా శ్రీకృష్ణుని సౌందర్యాన్ని ఆస్వాదిస్తారు. అప్పుడప్పుడు- పతి, మాత, సోదరులవల్ల అడ్డగించబడి కూడా కృష్ణుణ్ణి వెదకుతారు. ఒక్కొక్కప్పుడు మండలంగా ఏర్పడి కృష్ణగుణ కీర్తనం చేస్తూ మధ్యకనిపించే శ్రీకృష్ణుణ్ణి ప్రసన్నుణ్ణి చేసుకొంటారు. నీలకంఠ మతానుసారం ప్రతి గోపికకి రెండువైపుల శ్రీకృష్ణుడుంటాడు.

"గాయంత్యః కృష్ణచరితం ద్వంద్వశో గోపకన్యకాః"

(హరివంశం, విష్ణుపర్వం- 20, 25)

"ద్వాభ్యాం ప్రదేశాభ్యాం వర్తతే గోపః కృష్ణో
యాసాం తాః ద్వంద్వశో గోపాస్తాశ్చ్రతాః కన్యకాశ్చేత్యర్థః"

(నీలకంఠుడు)

శ్రీకృష్ణుని లీలానుకరణం చేస్తూ, శ్రీకృష్ణునిగతి ననుసరించి తమగతిని చూపిస్తూ, శ్రీకృష్ణునితో సమానంగా నృత్యగీతాల్ని చేస్తూ సస్మితనిరీక్షణతో వ్రజాంగన లుంటారు,

తాస్తస్య నృత్యం గీతంచ విలాసస్మిత వీక్షితమ్।
ముదితాశ్చానుకుర్వంత్యః క్రీడంతి వ్రజయోషితః॥

(హరివంశం, విష్ణుపర్వం- 20, 29)

"శారదీషు నచంద్రాసు నిశాసు ముముదే సుఖీ"

(హరివంశం, విష్ణుపర్వం- 20, 35)

బ్రహ్మపురాణంలో హరివంశంకంటె రాసలీలావర్ణన కొంత ఎక్కువగా

ఉంది (32 శ్లోకాలు). ఇక్కడ శ్రీకృష్ణుడు బలరాముడితో కలిసి తన మురళిని మ్రోయిస్తూ ఉంటాడు.

"సహ రామేణ మధురమతీవ వనితా ప్రియమ్"

(బ్రహ్మపురాణం- 189, 16)

ఇక్కడ శ్రీకృష్ణుణ్ణి చేరలేక కళ్ళుమూసుకొని ఆయన్నే ధ్యానిస్తూఉన్న గోపిక కూడా ఉంటుంది.

కాచిదావసథస్యాంతఃస్థిత్వా దృష్ట్వా బహిర్గురుమ్ ।
తన్మయత్వేన గోవిందం దధ్యౌమీలితలోచనా॥

(బ్రహ్మపురాణం - 189, 20)

ఈ గోపిక హరివంశంలో కనబడదు. కాని విష్ణుపురాణంలో (5; 13,20) భాగవతంలో (10; 29, 9-11) కనబడుతుంది.

బ్రహ్మపురాణంలో గోపికలమధ్యనుంచి శ్రీకృష్ణుడు మాయంకావడం ఉంది. ఇది భాగవతంలోనూ ఉంది. రాసలీల క్రమపరిణామాన్ని ఇది తెలుపుతుంది. మాయమైన శ్రీకృష్ణుడి చరణచిహ్నం గోపికలకి కనబడుతుంది.

బహిర్వినిస్సృతా గోప్యః కృష్ణదర్శనలాలసాః ।
కృష్ణస్య చరణం రాత్రౌ దృష్ట్వా బృందావనే ద్విజాః॥

(బ్రహ్మపురాణం - 189, 28)

ఇక్కడ శ్రీకృష్ణుడి అన్వేషణ, అంతర్ధానం, చరణచిహ్నం - ఉన్నాయి. నిరాశతో గోపికలు కాళిందీతటంమీద కూర్చుండి కృష్ణగాథ గానం చేస్తారు. శ్రీకృష్ణుడు కనబడి గోపికలతో కలిసి రాసక్రీడ చేస్తాడు.

ఏ విధంగా ఈశ్వరుడు - స్త్రీలలో, వారి భర్తల్లో, సమస్తజీవగణంలో వ్యాపకుడై నివసిస్తాడో అదేవిధంగా ఆత్మస్వరూపుడైన శ్రీకృష్ణుడు సర్వత్ర విద్యమానుడు. ఏవిధంగా పృథివి, జలం, తేజం, వాయువు, ఆకాశం, ఆత్మ సమస్త ప్రాణిగతమో శ్రీకృష్ణుడూ అంతే.

"యథా సమస్తభూతేషు నభోఽగ్నిః పృథివీజలమ్ ।
వాయుశ్చాత్మా తథైవాసౌ వ్యాప్య సర్వమవస్థితః॥"

(బ్రహ్మపురాణం-189, 45)

ఈవిధంగా బ్రహ్మపురాణంలో రాసలీల-శ్రీకృష్ణుడి వ్యాపకతని నిరూపించడానికి, గోపికలతో చేసిన రాసక్రీడలో లోకులనుకొనే దోషాన్ని నిరాకరించడానికి - పనికి వచ్చింది.

బలరాముడు లేకుండా శ్రీకృష్ణుడు తానే స్వయంగా రాసక్రీడలో-శరత్కాల జ్యోత్స్న, వికసిత కుముదినులు, వనఖండం, ఝం అనే తుమ్మెదలు ఆకర్షించగా పాల్గొన్నట్లు విష్ణుపురాణంలో ఉంది. శ్రీకృష్ణుడి వంశీధ్వని విని గోపికలు ఆకర్షితలై గుమిగూడుతారు.

శ్రీకృష్ణుణ్ణి మనస్సులో ధ్యానిస్తూ ప్రాణాపానాలను బంధించి ముక్తురాలైన గోపిక ప్రస్తావన ఇక్కడ స్పష్టంగా ఉంది.

శ్రీకృష్ణుడు అంతర్ధానమైన తరవాత కృష్ణలీలల్ని గోపికలు అనుకరించడం, ఒక విశిష్ట గోపికయొక్క చరణచిహ్నాలతో శ్రీకృష్ణుడి చరణచిహ్నాలు కలిసి ఉండడం, కృష్ణుడు తిరిగి ప్రకటీకృతుడు కావడం, రాసక్రీడ ఇందులో (విష్ణుపురాణం) ఉన్నాయి.

ఇక్కడ రాసమండల శబ్దానికి అర్థం ఒక విశిష్టపద్ధతిలో ఉంది శ్రీకృష్ణుడు స్వయంగా గోపికల చేతులు పట్టుకొని రాసమండల స్థితిలో వాళ్ళని నిలబెడతాడు.

హస్తేన గృహ్య చైకైకాం గోపీనాం రాసమండలమ్ ।
చకార తత్కరస్పర్శనిమీలిత దృశం హరిః॥

(విష్ణుపురాణం- 5; 13, 50)

విష్ణుపురాణాన్ని అనుసరించి, గోపికలు రాత్రిసమయం సర్వదా శ్రీకృష్ణుడితో కలిసి రాసక్రీడ చేసేవారని తెలుస్తుంది.

"కృష్ణం గోపాంగనా రాత్రౌ రమయంతి రతిప్రియాః"

(విష్ణుపురాణం- 5: 13, 59)

ఇక్కడ కూడా బ్రహ్మపురాణంలో లాగే శ్రీకృష్ణుడు సర్వవ్యాపకుడని చెప్పి దోషాన్ని నివారించడం జరిగింది (విష్ణుపురాణం-5, 13, 61-62)

పద్మపురాణంలో గోపికలతో శ్రీకృష్ణుడు నృత్యాత్మకమైన రాసలీల చేసినట్లు లేదు. బృందావనంలో కృష్ణుడు కాళిందీనదీతటంమీద వేలకొలది గోపికలచే పరివేష్టితుడై నానాప్రకారాలైన పుష్పాల దివ్యతిదివ్య ఆమోదంతో సుగంధితమైన సమీరంలో కల్పవృక్షచ్ఛాయలో ఉంటాడు. (పద్మపురాణం, పాతాళఖండ-77, 3-6). ఇక్కడ శ్రీకృష్ణుడు-జగన్నాథుడు, త్రిగుణాతీతుడు, అవ్యయుడు, పరమాత్మ.

శ్రుతి స్వరూపిణులైన వేలకొలది గోపికలు శ్రీకృష్ణుణ్ణి ఆలింగన చుంబనాదులు చేస్తున్నట్లు వర్ణితమై ఉంది.

చుంబంతీభిర్హసంతీభిః శ్లిష్యంతీభి ర్ముహుర్ముహుః ।
అవాప్త గోపీదేహాభిః శ్రుతిభిః కోటికోటిభిః ॥

(పద్మపురాణం, పాతాళఖండం-77, 12)

ఇక్కడ భగవతి రాధ శ్రీకృష్ణుడి చిన్మయీ మాయ యొక్క రూపంలో అతని చిన్మయీ స్వరూపశక్తిగా వర్ణితమైంది.

"స్వరూపా శక్తిరూపా చ మాయా రూపాచ చిన్మయీ"

(పద్మపురాణం, పాతాళఖండం-77, 15)

రాధని ప్రకృతిగా శ్రీకృష్ణుణ్ణి అవ్యయపురుషుణ్ణిగా గోపికల్ని శ్రుతి స్వరూపిణుల్నిగా వర్ణించి, ప్రకృతి పురుషుల సంయోగమే రాసమన్నారు.

పద్మపురాణంలో ఇంకోచోట రాసక్రీడకి ఆధ్యాత్మికావరణ కల్పించి వర్ణించారు. గోపికలు యోగినులు. కాళిందీనది అమృతవాహిని అయిన సుషుమ్న. శ్రీకృష్ణుడు సర్వవ్యాపకుడైన పరమాత్మ, బృందావనం చర్మచక్షు గోచరంకాని తేజోమయస్థానం- అని ఆ వర్ణన.

యోగిన్యస్తాస్తు ఏవహి మమదేవాః పరాయణాః ।
కాలిందీయం సుషుమ్నాఖ్యా పరమామృత వాహినీ ॥

సర్వతో వ్యాపకశ్చాహం న త్యక్ష్యామి వనం క్వచిత్ ।
తేజోమయమిదం స్థానమదృశ్యం చర్మచక్షుషామ్ ॥

(పద్మపురాణం, పాతాళఖండం.75, 10–13)

రాసమండల రచనాదుల్ని గురించి బ్రహ్మవైవర్త పురాణంలో పూర్ణంగా వర్ణితమైంది. ఇక్కడ 'శ్రీరాధాదేవి' పూర్ణరూపం కనబడుతుంది.

"రాసమండలం మణిమయ ప్రాకారంచేత చుట్టబడి ఉంది. నాలుగువైపుల పుష్పాలతోకూడిన రమణీయ ఉద్యానాలు ఉన్నాయి కృత్రిమసరోవరాలలో పువ్వులు వికసించి ఉన్నాయి. అనేక పుష్పాల సుగంధంతో భరితమైనవాయువు వీస్తూ ఉంది. రత్నజడిత దీపాలు, సువర్ణకలశాలు ప్రకాశిస్తూ ఉన్నాయి. ఈ రాసమండలాన్ని రాసస్థలం అనికూడా అంటారు."

(బ్రహ్మవైవర్తం, శ్రీకృష్ణ జన్మఖండం–17; 163, 167)

ఇక్కడే మనకి రాసస్థలంమధ్యలో రాధామాధవుల క్రీడకోసం ఒక రత్నమండలం రచితమైనట్టు వర్ణన కనబడుతుంది. దీనికి నాలుగువైపుల నాలుగు సుందర వేదికలున్నాయి. మనోహరమైన తొమ్మిది ద్వారాలున్నాయి. మూడుకోట్ల రత్నజడిత కృత్రిమ కలశాలు స్థాపితాలై ఉన్నాయి. రత్నమండల శిఖరం పతాకాలతోను తోరణాలతోను అలంకృతమై ఉంది.

(బ్రహ్మవైవర్తం, శ్రీకృష్ణ జన్మఖండం–17; 170–176)

వైష్ణవపురాణాల తులనాత్మక అధ్యయనంవల్ల రాసలీలకోసం రాసస్థలి నిర్మాణం ఒక్క బ్రహ్మవైవర్త పురాణంలో మాత్రమే ఉన్నట్లు తెలుస్తుంది. మిగిలిన పురాణాల్లో కాళింది సైకత పులినాల్లోనే రాసలీల జరిగినట్లుంది. ఈ పురాణంలో ఉన్న రాసమండల రత్నమండలాల అద్భుతవర్ణనలవల్ల, క్రమక్రమంగా రాసలీలావర్ణన తన నిసర్గసౌందర్యాన్ని విడిచిపెట్టి కృత్రిమంగా ఎలా పరిణామంచెందిందో తెలుస్తుంది. బ్రహ్మవైవర్త పురాణం నాటికి రాసలీలావర్ణన పూర్ణస్థితికి వచ్చివేసింది.

పద్మపురాణాన్ని అనుసరించి ఇలా ఉంది. శ్రీకృష్ణుడు మురళిని మ్రోయిస్తూ రాసలీల ప్రారంభిస్తాడు. దీనివల్ల రాధ (పద్మపురాణంలో 'రాధ' పేరు వస్తుంది)

ఆమె ప్రధానసఖులు (33 మంది) ఆకర్షింపబడతారు. సఖుల పేర్లుకూడా ఉన్నాయి. ప్రతిసఖి తన వేలకొలది సఖులతో ప్రకటితమౌతుంది.

(పద్మపురాణం–పాతాళఖండం, 27)

భాగవత విష్ణుపురాణాల్లో ఒక గోపస్త్రీకి తన లోకోత్తర సౌభాగ్యంవల్ల అహంకారం కలుగుతుంది. అప్పుడు శ్రీకృష్ణుడు అంతర్హితుడవుతాడు. ఈ పురాణాల్లో 'రాధ' పేరు లేదు. పద్మపురాణంలో రాధ గర్వంగా మాట్లాడుతుంది.

రాధికా వచనం శ్రుత్వా ప్రహస్య మధుసూదనః ।
మామారుహేత్యేవముక్త్వా సోంతర్ధానం చకార హ ॥

(పద్మపురాణం. పాతాళఖండం-52, 4)

విలపిస్తూ రాధ, ఆమె సఖులు ప్రాణత్యాగం చేయడానికి ఉద్యుక్తులయినప్పుడు శ్రీకృష్ణుడు ప్రకటితుడవుతాడు.)

"స్వాత్మానం దర్శయామాస రాధికాం గోపికాగణమ్"

(పద్మపురాణం, పాతాళఖండం-52, 10.11)

ఇక్కడ తప్ప మిగిలిన ఏ పురాణంలోను గోపికలు ప్రాణత్యాగానికి సిద్ధమయినట్లు లేదు. దీని తరవాత కృష్ణుడు ప్రకటితుడై రాసక్రీడ ప్రారంభిస్తాడు. అనేక రూపాలను ధరిస్తాడు.

నానామూర్తి ర్ద్విధాయాత్ర సహతాభిర్జనార్దనః।
చకార చ పునః క్రీడాం కాముకీనాం మనోహరామ్ ॥

(బ్రహ్మవైవర్తం, శ్రీకృష్ణ జన్మఖండం-52, 27)

బ్రహ్మవైవర్తాన్ని అనుసరించి; రాసక్రీడమధ్యలో దాన్ని విడిచి శ్రీకృష్ణుడు రాసేశ్వరితో ఇతర గోపసుందరులతో కలిసి యమునా తీరంవారిలో జలక్రీడ, తరవాత వనక్రీడ చేసినట్లుంది.

(బ్రహ్మవైవర్తం, శ్రీకృష్ణ జన్మఖండం-53, 2-10)

దేవీభాగవతంలో మనకి రాసలీలయొక్క ఆధిదైవిక స్వరూపం కనబడుతుంది. ఇక్కడఉన్న సంక్షిప్త ప్రసంగంలో శ్రీకృష్ణుడు నందనందనుడిగా కాక సాక్షాత్తు ఆత్మ, పరబ్రహ్మనామాలతో చిత్రితుడయ్యాడు.

"స చాత్మా స పరంబ్రహ్మ కృష్ణ ఇత్యభిధీయతే"
(దేవీభాగవతం_9; 2, 16)

ఈ పురాణంలో శ్రీకృష్ణుణ్ణి, కేవలం అవతారరూపంలో కాకుండా సాక్షాత్తు పరమాత్మరూపంలో వర్ణించారు.

పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీకృష్ణుడు తన చిచ్ఛక్తి స్వరూపిణి అయిన ప్రకృతితో విహరిస్తాడు. ఇదే రాసలీల. మహాప్రళయం తరవాత పునఃసృష్టి చేయడానికి కాలమాసన్నమైనప్పుడు ఏకాకి అయిన శ్రీకృష్ణుడు తన చిచ్ఛక్తిని ప్రకటించి సృష్టిచేస్తాడు.

"స కృష్ణః సర్వసృష్ట్యాదౌ సిసృక్షన్నేక ఏవ చ"
(దేవీభాగవతం-9; 2, 26)

ఈ విధంగా, ప్రకృతి పురుషుల (చిచ్ఛక్తి పరమాత్మల) అనగా రాధా కృష్ణుల, విలాసమే రాసం అని ఉంది. సృష్టికోసం రాసక్రీడా భావం కలిగిన వెంటనే శ్రీకృష్ణుడిలో రెండురూపాలు గోచరిస్తాయి. వామభాగం స్త్రీరూపం, దక్షిణ భాగం పురుషరూపం. ఇదే రూపంతో రాసేశుడు రాసమండలంలో రాసక్రీడ చేస్తాడు.

దృష్ట్వా తాం తు తయా సార్ధంరాసేశో రాసమండలే ।
రాసోల్లాసే సురసికో రాసక్రీడాం చకార హ ॥
(దేవీభాగవతం_9; 2, 36)

ఈ ప్రకారం అధిదైవికార్థంలో-సృష్టికోసం- ప్రకృతి పురుషుల సంబంధ మాత్రమైనదే రాసలీల ఈ రాససంయోగంవల్ల శ్రీకృష్ణుడి చిచ్ఛక్తి నూరు మన్వంతరాలు గర్భధారణచేసి సువర్ణాభమున్న ఒక దివ్య ఖండాన్ని (సంపూర్ణ విశ్వానికి ఆధారమైనదాన్ని) ఉత్పన్నం చేస్తుంది.

అథ సా కృష్ణచిచ్ఛక్తిః కృష్ణగర్భం దధార హ ।
శతం మన్వంతరాంతే చ కాలేఽతీతేఽపి సుందరీ ।
సుషావ డింబం స్వర్ణాభం విశ్వాధారాలయం పరమ్ ॥
(దేవీభాగవతం-9, 2, 45-47)

ప్రకృతి స్వయంగా జడం స్వతః సృష్టిచేయడంలో అసమర్థం శ్రీకృష్ణుని ద్వారా చేతనాబీజం లభించినంతనే ప్రకృతి సృష్టిచేయడానికి అర్హురాలైంది.

ఆధ్యాత్మికాకాశంలో రాసలీల యోగుల అంతఃకరణలో నిత్యం జరుగుతూనే ఉంటుంది. ఈ అర్థంలో బృందావనం సహస్రదళపద్మం. సహస్రదళ పద్మంలో ఒకవేయి రేకులు క్రిందికి వంగి ఉంటాయి. ఇదే విధంగా బృందావనంలో అన్ని వృక్షాలు అధోముఖంగా ఉంటాయి.

"బృందావనస్థా స్తరవః సర్వే దారోముఖాః స్మృతాః"
(స్వామీ దయానంద్ శ్రీ సత్యార్థవివేకంలో ఉద్ధృతం- పుట. 888)

సమష్టికి వ్యష్టికి పారస్పరికంగా అభేదం అనే సిద్ధాంతాన్ని అనుసరించి లయయోగపరంపరలో జీవశరీరంలో సహస్రదళపద్మంలో పురుషతత్త్వనీ మూలాధారచక్రంలో ప్రకృతితత్త్వనీ అంగీకరించారు. ఈ ప్రకృతి శక్తి వలయాలుగా చుట్టుకొని అధోముఖియై సర్పిణి ఆకారంలో ఉంటుంది ఇదే కులకుండలినీ శక్తి. ఈ శక్తి అధోముఖంగా ఉన్నంతకాలం జీవి విషయవాసనాలిప్తుడై ఉంటాడు. యోగాభ్యాసంవల్లగాని, జపయోగంవల్లగాని కుండలిని ఊర్ధ్వముఖంగా పయనించి సహస్రదళపద్మంలో ఉన్న పురుషుణ్ణి చేరుతుంది. ఇదే- ఈ సంయోగమే-రాసం.

భగవతి శ్రీప్రియ రాధయే ప్రకృతి. కులకుండలినీశక్తి. శ్రీకృష్ణుడు పరమాత్మ. పురుషుడు. బృందావనం సహస్రారం (సహస్రదళపద్మం). గోపసుందరులు అంతఃకరణ వృత్తులు. శ్రీకృష్ణుని మురళీనాదం యోగులు వినే ప్రణవం. ఈ నాదం విన్నంతనే గోపసుందరులు విషయవాసనావాసితమైన సంసారాన్ని త్యజించి పరమాత్మరూపుడైన శ్రీకృష్ణుణ్ణి చేరవస్తారు.

వాస్తవంలో కుండలిని జాగృతి పొందినంత మాత్రాన లాభంలేదు. పైకి పోయేటప్పుడు అనేక బాధలు వస్తాయి. వాటిని అధిగమించాలి. నాభిచక్రభేదనంతో కొన్ని అల్పసిద్ధులు లభిస్తాయి. అహంకారం పెరుగుతుంది. గోపికలకిది వచ్చింది. శ్రీకృష్ణుడు అంతర్హితుడవుతాడు. హృదయంలో ఉన్న అనాహతచక్రభేదనంతో తన్మయావస్థ వస్తుంది. ఇది గోపస్త్రీలకి వచ్చింది. భ్రూమధ్యంలో విద్యమానమైన ఆజ్ఞాచక్రాన్ని కుండలిని భేదనప్పుడు సాధకునికి వైరస్య త్రికాలజ్ఞతలు

5)

కలుగుతాయి. గోపికల కివి లభించి శ్రీకృష్ణుడియందు పరమాత్మ భావం కలిగి ఇలా అంటారు:

"న ఖలు గోపికానందనో భవానఖిలదేహినా మంతరాత్మ దృక్"
(శ్రీమద్భాగవతం - 10: 31, 4)

శక్తిశక్తుల సంయోగం సహస్రదళపద్మంలో జరిగిన వెంటనే ఆనంద లహరిలో యోగి విహరిస్తాడు ఈ విధంగా యోగుల అంతఃకరణలో నిత్యం రాసలీల జరుగుతూనే ఉంటుంది.

రాసలీలంకి లాక్షణిక వ్యాఖ్యచేస్తూ స్వామి హరిహరానంద సరస్వతి (కరపాత్రీజీ) శ్రీకృష్ణుణ్ణి తత్ పదార్థం అని గోపాంగనల్ని త్వం పదార్థం అని స్వీకరించి వీరి పారస్పరిక క్రీడయే రాసక్రీడ అన్నారు.
(భగవత్తత్త్వం - పుట 218)

ఈయన దృష్టిలో భగవంతుడు, గోపికలు కూడా సచ్చిదానంద స్వరూపులే. కనుక ఈ లీల అప్రాకృతం. మర్యాదోల్లంఘనం అనే ప్రశ్నే దీనివిషయంలో ఉత్పన్నం కాదు.

వేదవీధిపథికులైన శ్రీ మోతీలాల్ శర్మ రాసపంచాధ్యాయికి వైదిక పరిభాషలో సమన్వయం చేశారు. "గచ్ఛతీతి గౌః" అనే వ్యుత్పత్తి ననుసరించి గతి భావమున్న సౌమ్యప్రాణినే పారమేష్ఠ్య గోతత్త్వరూపంలో గ్రహించారు. గతి ప్రధానమైన గోతత్త్వ సంచారంవల్ల ఈ లోకం గోష్ఠానం అయింది. ఈ గోష్ఠానానికి సామవేదాన్ని ఆనుసరించి గోసవం అనే సంజ్ఞ ఉంది. ఇదే పౌరాణిక పరంపరలో గోలోకం. గత్యర్థక వ్రజ్ ధాతువు ననుసరించి వ్రజధామం అయింది ఇది వ్రజధామంలో అంగిర, భృగుధార ప్రవహిస్తున్నాయి. వీటివల్ల క్రమంగా శబ్దార్థాల సృష్టి జరిగింది. ఈ ధారల్ని క్రమశః సరస్వతి, అంభృణి అన్నారు. పౌరాణిక పరంపరలో అంభృణినే రాధ అన్నారు.
(శ్రీ మోతీలాల్ శర్మ 'సాంస్కృతిక్ వ్యాఖ్యాన్ పంచక్' పుట. 207-210)

ఈ ప్రకారంగా వివిన్న పురాణాలలో రాసలీలా విషయకాలైన భావాల తులనాత్మక అధ్యయనంవల్ల తెలిసేది ఏమిటంటే రాసలీలయొక్క సూక్ష్మ

తత్త్వం, హరివంశ, బ్రహ్మపురాణ, విష్ణుపురాణాల్లో క్రమవికాసాన్ని పొంది శ్రీమద్భాగవతమహాపురాణంలో పూర్ణరూపంలో వికసితమయింది అని పద్మపురాణ బ్రహ్మవైవర్తపురాణాల్లో ఉత్తర కాలీనమైన ప్రభావం స్పష్టంగా కనబడుతుంది.

ఆధిలౌకిక దృష్టితో పరిశీలించి చూచినప్పుడు శ్రీమద్భాగవతపురాణంలో అభివర్ణితమైన రాసలీలావర్ణనవల్ల కృష్ణసంబంధమైన రెండు విషయాలు వ్యక్తమవుతున్నాయి. మొదటిది-పరమహంసలకి, సాధకులకి, భక్తులకి సాధనాపద్ధతిని ఉపదేశించడం. రెండోది-కామదేవుడి దర్పదళనంవల్ల అతనిపైని విజయప్రాప్తిని పొంది తన పూర్ణావతారాన్ని ప్రమాణితం చెయ్యడం ఈ రెండు ముఖ్య లక్ష్యాలు శ్రీకృష్ణుడు సాధించాడు.

శ్రీమద్భాగవతమహాపురాణవక్త జీవన్ముక్తుడు పరమయోగి అయిన శ్రీశుకదేవుడు. శ్రోతలు-పరీక్షిన్మహారాజా, అసంఖ్యాక పరమహంస శ్రేణులైన మునిజనులు. ఇంక పరీక్షిత్తో కేవలగృహస్థుడు కాడు. విప్రశాపదగ్ధుడై తన మృత్యువునినాడి కేరపనాడు ప్రతీక్షిస్తూ విరక్తుడై ఉన్నాడు. ఇంక శుకుడో విరాగి. ఈ విరక్తనిచూసి తండ్రి వ్యాసుడంతటివాడు, పుత్రా! అని పోషిస్తూ వనంలో తిరుగుతూ ఉండే ప్రతి వృక్షమూ ఆ శబ్దాన్ని ప్రతిధ్వనిస్తూ అయిన జ్ఞానాన్ని అవహాస్యం చేసిందట! అందే శ్రీశుకుడెంత విరక్తుడో తెలుస్తుంది.

> యం ప్రవ్రజంత మనుపేత మపేత కృత్యం ద్వైపాయనో విరహకాతర ఆజుహావ।
> పుత్రేతి తన్మయతయాతరవోఽభినేదు స్తం సర్వభూత హృదయం మునిమానతోఽస్మి॥ (శ్రీమద్భాగవతం-1; 2, 2)

ఇంక శుకుడు గోదోహన కాలం కంటె ఏ గృహస్థు ఇంట ఉండడు. స్త్రీ పురుష భేదదృష్టి లేదాయనకి.

> "స గోదోహన మాత్రం హి గృహేషు గృహమేధినామ్"
> తదీక్షణ్య ప్రభృతి మునౌ జగదుప్త వాప్తి। స్త్రీ పుంభి
> దా నతు సుతస్య వివిక్త దృష్టేః॥
>
> (శ్రీమద్భాగవతం- 1: 4: 85, )

ఈ పరిస్థితుల్లో కామభావన చెయ్యడమే హాస్యాస్పదం.

శ్రీమద్భాగవతానికి ఇంకో పేరు "పారమహంసీసంహితా." ప్రతి అధ్యాయం చివర "ఇతి పారమహంస్యాం సంహితాయాం" అని ప్రమాణికమై ఉంది. అంటే పరమహంసలతో (కు) సంబంధించింది అన్నమాట (పరమహంసానాం ఇయం పారమహంసీ) ఈ విధంగా రాసపంచాధ్యాయి అంతా పరమహంసల కుద్దేశించ బడింది అన్నమాట.

శ్రీధరస్వామి రాసపంచాధ్యాయికి టీక వ్రాసేసందర్భంలో మంగళాచరణ శ్లోకంలో ఇలా వ్రాశారు. "బ్రహ్మాదిదేవతల్ని జయించడంతో కామదేవుడు దర్పితుడు అయ్యాడు. దాన్ని దళనంచేసిన రాసమండలం భూషణమయిన శ్రీపతికి జయం" అన్నాడు. ప్రథమశ్లోకవ్యాఖ్యలో రాసపంచాధ్యాయి సర్వథా నివృత్తి పరమనీ కామదేవుడిపై విజయం సాధించడం రాసక్రీడ ప్రధానోద్దేశమనీ వ్రాశాడు.

బ్రహ్మాదిజయ సంరూఢ దర్పకందర్ప దర్పహా ।
జయతి శ్రీపతి ర్గోపీరాసమండల మండనః ॥ (శ్రీధరస్వామి)

"తస్మాత్ రాసక్రీడా విడంబనం కామవిజయ స్థాపనాయేత్యేవ తత్త్వమ్ । కించ శృంగారకథాపదేశేన విశేషతో నివృత్తి పరేయం పంచాధ్యాయీ ॥

(శ్రీమద్భాగవతం - 10; 29, 1. టీక)

సామాన్య బుద్ధిననుసరించి కొందరు వ్యక్తులు రాసలీలకి కామవికారానికి సంబంధం కలుపుతున్నారు. ఇది పొరపాటు. శ్రీమతి బెసెంట్ ఇలా వ్రాసింది.

"What but an unclean mind can see aught that is impure in the child dancing as lover and beloved ? Let us turn from this, remembering that till the nineteenth century this story provoked only devotion and not ribaldry and it is only with the coming of the grosser type of Western thought that you have these ideas put into the Bhagvat Puran "

—Annie Besant

మొట్టమొదటి విషయం 7 సంవత్సరాలవయస్సులో గోవర్ధనధారణ లీలని ప్రదర్శించాడు శ్రీకృష్ణుడు.

క్వ సప్తహాయనో బాలః క్వ మహాద్రి విధారణమ్ ।
తతో నో జాయతే శంకా వ్రజనాథ తవాత్మజే ॥

(శ్రీమద్భాగవతం - 10; 26, 14)

రాసక్రీడార్థం శ్రీకృష్ణుడు అనేకదేహాల్ని ధరించినాడనడానికి నిదర్శనాలు చాలా ఉన్నాయి:

అంగనా మంగనా మంతరే మాధవో
మాధవం మాధవం చాంతరేణాంగనా ।
ఇత్థమాకల్పితే మండలే మధ్యగః
సంజగౌ వేణునా దేవకీనందనః ॥

(హరివంశ విష్ణుపర్వంలో (20, 25) నీలకంఠుడు ఉద్ధరించిన శ్లోకం)

రాసలీలలో శ్రీకృష్ణుడు తన యోగశక్తిద్వారా ప్రతి ఇద్దరి (గోపికల) మధ్యా ఉంటాడు; గోపికల పతుల దగ్గర, గోపికల పాపంలోనూ ఉంటాడు.

"మన్యమానాః స్వపార్శ్వస్థాన్ స్వాన్ స్వాన్ దారాన్ వ్రజౌకసః" (శ్రీమద్భాగవతం-10; 33, 38)

పౌరాణిక పరంపరలో శ్రీకృష్ణుడు స్వయంగా భగవానుడే.

"ఏతే చాంశకలాః పుంసః కృష్ణస్తుభగవాన్ స్వయం."

(శ్రీమద్భాగవతం- 1; 3, 28)

శ్రీకృష్ణుని పూర్ణావతారం మీద మొట్టమొదట బ్రహ్మకి ఇంద్రుడికి కూడా సందేహం కలుగుతుంది. బ్రహ్మ గోవుల్ని గోపబాలుల్ని దాచివేస్తాడు. శ్రీకృష్ణుడు ఒక సంవత్సరకాలం అన్ని రూపాలు తానే ధరించి ఉంటాడు.

అంభోజన్మజని స్తదంతరగతో మాయార్భ కస్యేశితు ।
ర్ద్రష్టుం మంజు మహిత్వ మన్యదపి తద్వత్సానితో వత్సపాన్॥

ఈ పరిస్థితుల్లో కాముకభావన చెయ్యడమే హాస్యాస్పదం.

శ్రీమద్భాగవతానికి ఇంకో పేరు "పారమహంసీసంహితా." ప్రతి అధ్యాయ చివర "ఇతి పారమహంస్యాం సంహితాయాం" అని ప్రమాణితమై ఉంది. అం పరమహంసలతో (కు) సంబంధించింది అన్నమాట (పరమహంసానాం ఇయ పారమహంసీ) ఈ విధంగా రాసపంచాధ్యాయి అంతా పరమహంసల కుద్దేశిం బడింది అన్నమాట.

శ్రీధరస్వామి రాసపంచాధ్యాయికి టీక వ్రాసేసందర్భంలో మంగళాచ శ్లోకంలో ఇలా వ్రాశారు. "బ్రహ్మాదిదేవతల్ని జయించడంతో కామదేవుడు దర్పితుడు అయ్యాడు. దాన్ని దళనంచేసిన రాసమండలం భూషణమయిన శ్రీపతికి జయం" అన్నారు. ప్రథమశ్లోకవ్యాఖ్యలో రాసపంచాధ్యాయి సర్వథా నివృత్తి పరమనీ కామదేవుడిపై విజయం సాధించడం రాసక్రీడ ప్రధానోద్దేశమనీ వ్రాశారు.

బ్రహ్మాదిజయ సంరూఢ దర్పకందర్ప దర్పహా ।
జయతి శ్రీపతి ర్గోపీరాసమండల మండనః ॥ (శ్రీధరస్వామి)
"తస్మాత్ రాసక్రీడా విడంబనం కామవిజయ స్థాపనామేత్యేవ తత్త్వమ్ । కించ శృంగారకథాపదేశేన విశేషతో నివృత్తి పరేయం పంచాధ్యాయీ ॥

(శ్రీమద్భాగవతం - 10; 29, 1. టీక)

సామాన్య బుద్ధిననుసరించి కొందరు వ్యక్తులు రాసలీలకి కామవికారానికి సంబంధం కలుపుతున్నారు. ఇది పొరపాటు. శ్రీమతి బెసెంట్ ఇలా వ్రాసింది.

**"What but an unclean mind can see aught that is impure in the child dancing as lover and beloved ? Let us turn from this, remembering that till the nineteenth century this story provoked only devotion and not ribaldry and it is only with the coming of the grosser type of Western thought that you have these ideas put into the Bhagvat Puran "**

**—Annie Besant**

## అనుబంధం.2

మొట్టమొదటి విషయం 7 సంవత్సరాలవయస్సులో గోవర్ధనధారణ లీలని ప్రదర్శించాడు శ్రీకృష్ణుడు.

క్వ సప్తహాయనో బాలః క్వ మహాద్రి విధారణమ్ ।
తతో నో జాయతే శంకా వ్రజనాథ తవాత్మజే ॥

(శ్రీమద్భాగవతం - 10; 26, 14)

రాసక్రీడార్థం శ్రీకృష్ణుడు అనేకదేహాల్ని ధరించినాడనడానికి నిదర్శనాలు చాలా ఉన్నాయి:

అంగనా మంగనా మంతరే మాధవో
మాధవం మాధవం చాంతరేణాంగనా ।
ఇత్థమాకల్పితే మండలే మధ్యగః
సంజగౌ వేణునా దేవకీనందనః ॥

(హరివంశ విష్ణుపర్వంలో (20, 25) నీలకంఠుడు ఉద్ధరించిన శ్లోకం)

రాసలీలలో శ్రీకృష్ణుడు తన యోగశక్తిద్వారా ప్రతి ఇద్దరి (గోపికల) మధ్యా ఉంటాడు; గోపికల పతుల దగ్గర, గోపికల రూపంలోనూ ఉంటాడు.

"మన్యమానాః స్వపార్శ్వస్థాన్ స్వాన్ స్వాన్ దారాన్
వ్రజౌకసః" (శ్రీమద్భాగవతం-10; 33, 38)

పౌరాణిక పరంపరలో శ్రీకృష్ణుడు స్వయంగా భగవానుడే.

"ఏతే చాంశకలాః పుంసః కృష్ణస్తు భగవాన్ స్వయం."

(శ్రీమద్భాగవతం- 1; 3, 28)

శ్రీకృష్ణుడి పూర్ణావతారం మీద మొట్టమొదట బ్రహ్మకి ఇంద్రుడికి కూడా సందేహం కలుగుతుంది. బ్రహ్మ గోవుల్ని గోపబాలుర్ని దాచివేస్తాడు. శ్రీకృష్ణుడు ఒక సంవత్సరకాలం అన్ని రూపాలు తానే ధరించి ఉంటాడు.

అంభోజన్మజని స్తదంతరగతో మాయార్భ కస్యేశితు ।
ర్ద్రష్టుం మంజు మహిత్వ మన్యదపి తద్వత్సానితో వత్సపాన్ ॥

సీత్వాన్యత్ర కురూద్వహాంతరదదాత్తే౽వస్థితోయః పురా।
దృష్ట్వేమాసురమోక్షణం భగవతః ప్రాప్తః పరంవిస్మయమ్॥
తతః కృష్ణో ముదంకర్తుం తన్మాతౄణాంచ కస్యచ।
ఉభయాయిత మాత్మానం చక్రే విశ్వకృదీశ్వరః॥
(శ్రీమద్భాగవతం- 10; 13; 15, 18)

బ్రహ్మకి సందేహంతీరి శ్రీకృష్ణుణ్ణి పరబ్రహ్మ అని గ్రహిస్తాడు. ఇంద్రుడికి కూడా సందేహంకలిగి పరీక్షగా కుంభవృష్టి కురిపిస్తాడు

స్థూణా స్థూలా వర్షధారా ముంచత్స్వభ్రేషు భీక్ష్ణశః।
జలౌఘైఃప్లావ్యమానా భూర్నాదృశ్యత నతోన్నతమ్॥
(శ్రీమద్భాగవతం. 10; 25, 10)

అప్పుడు శ్రీకృష్ణుడు గోవర్ధనధారణచేసి తన పూర్ణావతారాన్ని స్పష్టం చేస్తాడు.

"దధార లీలయా కృష్ణశ్ఛత్రాకమివ బాలకః"
(శ్రీమద్భాగవతం- 10; 25, 19)

మన్మథుడికీ ఈ సందేహం కలుగుతుంది. శతకోటి గోపికల యూథంతో ఒక దుర్గరచన జరుగుతుంది. కామదేవుడు దీనితో ప్రవిష్టుడవుతాడు. శరత్కాల జ్యోత్స్న, కాలిందీపులినం, సుగంధసమీరం మొదలైన ఉద్దీపనాలన్నీ కామదేవుడికి అనుకూలంగా ఉంటాయి. ఆ పరిస్థితుల్లో శ్రీకృష్ణుడు రాసలీల జరిపి కామదేవుణ్ణి జయిస్తాడు.

రాసపంచాధ్యాయిలో ప్రథమశ్లోకం 'భగవాన్' లో ప్రారంభం అవుతుంది. ఇందులో ప్రయోగింపబడిన ఉపమానాలన్నీ - ఆత్మారామ, మన్మథ మన్మథ, యోగేశ్వర మొదలయినవి పరమాత్మకి చెల్లేవే.

చిన్న పిల్లవాడు నీటిలోనో అద్దంలోనో తన ప్రతిబింబాన్ని చూసుకొని ఆడుకొన్నట్లే శ్రీకృష్ణుడు రాసలీల చేశాడు అంటుంది పురాణం.

"రేమే రమేశో వ్రజసుందరీభిర్యథార్భకః స్వప్రతిబింబ విభ్రమః"
(శ్రీమద్భాగవతం- 10; 33, 17)

రాసపంచాధ్యాయికి ఫలశ్రుతిగా పురాణంలో ఈ శ్లోకముంది.

విక్రీడితం వ్రజవధూభి రిదం చ విష్ణోః
శ్రద్ధాన్వితోఽనుశృణుయాదథ వర్ణయేద్యః ।
భక్తిం పరాం భగవతి ప్రతిలభ్య కామం
హృద్రోగ మాశ్వపహినోత్యచిరేణ ధీరః ॥

(శ్రీమద్భాగవతం- 10; 33, 40)

రాసలీలా శ్రవణ మననాదులవల్ల శ్రీకృష్ణ భక్తిలభించి భక్తుడు హృద్రోగమై పీడించే కామాన్ని శీఘ్రంగా పరిత్యజించ గలుగుతున్నారు అని పిండితార్థం. దీన్ని బట్టి రాసలీలా పరమార్థం స్వయంవ్యక్త మవుతోంది గదా!

శ్రీమద్భాగవతంలో- విశేషించి "రాసపంచాధ్యాయి"లో ప్రకటీకృతమయ్యే గోపీకృష్ణ భక్తి అప్రాకృతం అని గ్రహించాలి. లౌకికజగత్తులోని స్త్రీ పురుష సంబంధానికి "పాపమహంని సంహిత"గా పేర్కొనబడిన శ్రీమద్భాగవతంలోని గోపీజనుల "రాగానుగ భక్తి"కి పోల్చలేము. పోల్చినచో అదే పాపహేతువని సిద్ధభక్తులందరూ విశ్వసించేదే! వీరందరు ఆయన అంతరంగిక భక్తులు. వీరిలో నాలావర్గాలు ఏర్పడినవారున్నారు. కొందరు సేవకులు, కొందరు సఖులు, కొందరు పితృతుల్యులు, కొందరు ప్రియురాండ్రు. ఈ వర్గాల ఆయా భక్తులను సరించినమార్గాలను బట్టి మనం వర్గీకరించుకొన్నాం. ఈ భక్తులనుగూర్చి శ్రీకృష్ణుడే ఇలా అన్నాడు.

"నకర్హిచిన్మత్పరాః శాంతరూపే నంక్ష్యంతినో మేఽనిమిషో
లేఢి హేతిః ।
యేషా మహం ప్రియ ఆత్మాసుతశ్చ సఖాగురుః సుహృదో
దైవమిష్టమ్ ॥ (3.25- శ్లో.38)

దీనిలోని "మత్పరాః" అనే శబ్దం ఆ అనురక్తులనే సూచిస్తుంది అన్నాడు భగవంతుడు. "వారు నన్ను తమ ఆత్మ అని, మిత్రుడని, పుత్రుడని, స్వామి అని సుహృదుడని, భగవానుడని, పరమలక్ష్యమని భావిస్తారు" అన్నాడు.

వీరిలో తనను హృదయేశ్వరుడని భావించి ఆత్మార్పణం చేసుకొన్న గోపికలను గూర్చి ఇలా అంటాడు.

"న పారయేఽహం నిరవద్య సంయుజాం
స్వసాధుకృత్యం విబుధాయుషాపివః ।
యా మాఽభజన్ దుర్జయగేహ శృంఖలాః
సంవృశ్చ్య తద్వః ప్రతియాతు సాధునా ॥" (10-32, 22 శ్లో)

ఎవరికి సులభసాధ్యం కాని సంసార శృంఖలాలను తెంచి పారవేసివచ్చి నన్ను సేవించారు. నేను మీకు చాలా ఋణపడిఉన్నాను. దేవతల ఆయుష్కాల పరిమితిఉన్న కాలంచేత కూడా నేను మీ విషయమై నా కర్తవ్యాన్ని నెరవేర్చ లేను అంటాడు ఆయన

గోపికల భక్తి సర్వోత్కృష్టమైనదని ఆయనే ఇలా అంటాడు:

"మయి భక్తిర్హి భూతానామమృతత్వాయ కల్పతే ।
దిష్ట్యా యదా సీన్మత్స్నేహో భవతీనాం మదాపనః ॥"

(10-82, 44-శ్లోకం)

గోపికలకు తన సాక్షాత్కారం వారికి తన యందున్న స్నేహసంపద చేతనే కలుగుతోందని ఆయన కంఠోక్తిగా చెప్పుతాడు.

లౌకిక కామవాసనలేని మధురభక్తికి కాణాచి కావడమే శ్రీమద్భాగవతం లోని దశమస్కంధంలోని రాస పంచాధ్యాయి వైశిష్ట్యం

"కృష్ణాత్పరం కిమపి తత్త్వ మహం న జానే"